THE BOOK WAS DRENCHED

శ్రీ శంకర విజయము

(ఆంధ్ర పద్యకావ్యము)

గ్రంథకర్త:

కవితాభూషణ, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి

—: ప్రకాశకులు :—

వేంకట్రామ అండ్ కో.,

విజయవాడ - కర్నూలు

UNIVERSAL
LIBRARY
OU_204177
UNIVERSAL
LIBRARY

OUP—21—4-4-69—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 S96S   Accession No. P. G. T1102

Author సూర్యనారాయణ శాస్త్రి, వెంపరాల

Title శ్రీ శంకరవిజయము. 1952.

This book should be returned on or before the date last marked below

శ్రీ శంకరవిజయము.

(ఆంధ్ర పద్య కావ్యము)

❀

గ్రంథకర్త:

'కవితాభూషణ, విద్వత్కవిశేఖర'

వెంపరాల సూర్యనారాయణశాస్త్రి

పబ్లిషర్సు:

వేంకట్రామ అండ్ కో.,

బెజవాడ - మద్రాసు.

కాపీరైటు రిజిస్టర్డు] [వెల 5-00

Sree Sarada Printing works, Bhatnavilli.
Copies 1000---Date 19-3-52.

విభవనామ్ని శుభే ముహూర్తే రాధే సితే శివగురోః గృహిణీ దశమ్యాం” అను శ్లోకమునందలి కలియుగాబ్దములు 3889 (క్రీ.శ. 788) సరియగు విభవవైశాఖ శు ౧౦ తిథియందు శంకరులు జన్మించి రను సిద్ధాంతము నూని క్రీ. శ. 788 శంకరజనన మని యంగీకరించెను. టి. ఆర్. చింతామణి ప్రభృతుల మతమున క్రీ. శ. 655_687 లోపల శంకరు లుందు రని నిర్ణయము. మాక్సుముల్లరు మొదలగుపాశ్చాత్య పండితుల సిద్ధాంతములను విమర్శించి రాజేంద్రనాథఘోషుగారు క్రీస్తుశకము 608 లోగాని 686 లోగాని శంకరులు జన్మించి యుందు రని నిర్ణయించిరి. ఆంగ్లేయభాషావిశారదు లగు భారతీయ విమర్శకులు దీనిని ప్రమాణముగాఁ గొనుచున్నారు. Sankara, The sublime అను గ్రంథమున ధీరేంద్రనాథ పాలుగారు.

“In our opinion this date (i. e 686 A- D) is the most probable one, as Pandit, Srijut Rajendranath shows that a portion of Sankaracharya's Bruhadaranyaka Bhashya Vartika was quoted by a Jaina philosopher Vidyananda, whose date of accession to the pointifical throne of Digambara Ja:na gurus was A. D. and the date of his death 783 A. D. Sureswaracharya being the direct disciple of Sankaracharya, this cannot be possible of Sankara was born in 806 A. D. according to the calculation of the Cochin Government astrologr mentioned before” అనినారు.

మఱియు సీతానాథదత్తుగారు Sankaracharya (His life and teachings) అను గ్రంథమున “Sankaracharya died in A. D. 830 the early age of 32 at Kedar on the Himalayas. According to the account, which to us appears most reliable, Sankaracharya was born in the year 3889 of Kali Era, corresponding to 799 A. D.” అని వ్రాసినారు. ధీరేంద్రులు 6౬6 అనఁగా 799 అని సీతానాథదత్తుగారు నిర్ణయించినారు.

బొంబాయి హైకోర్టు జడ్జి శ్రీ కాశీనాథ త్ర్యంబక తెలాంగు గారు “బ్రహ్మసూత్రము ౨. ౧. ౧౭ భాష్యమందు స్రుఘ్న, పాటలీపుత్ర నగరనామములను శంకరులు స్మరించుటచేతను, ఆసూత్రమందే

పూర్ణవర్మ యనురాజుయొక్క నామమును స్మరించుటచేతను, పూర్ణవర్మ యనురాజు క్రీ. శ. 630 లో ఉన్నటుల కన్నింగుహాము నిర్ణయించి యుంటచేతను శంకరు లాఱవ శతాబ్దాంత్యభాగమువారనియు, సాంఖ్య కారికలయొక్క గౌడపాదభాష్యము క్రీ. శ. 557-583 సమీపకాలమున చైనాభాషలోనికి పరివర్తింపఁబడినటుల తెలియుటచే తత్ప్రశిష్యుఁ డగు శంకరు లాకాలమున నుండును" అనిరి.

దీని ననుసరించి ఆఱవశతాబ్దిలో శంకరు లున్నట్లు తేలినది. శంకరుల కాలమును గూర్చి యుపలబ్ధము లగు ప్రాచ్యపాశ్చాత్యనిర్ణయములను జదువరుల కందిచ్చితిని. విమర్శించినకొలఁది సత్యము తేల వచ్చును. చరిత్రతత్త్వవేత్తలు పరిశోధించి నిర్ణయింపక మాన రను నాసతో నీప్రస్తావము విడిచి శంకరుల జన్మదేశముగూర్చి యొకమాఱు స్మరించి శ్రీశంకరులగొప్పతనమునుగూర్చి విపులముగఁ జెప్పికొందము.

ఒక్క యనంతానందగిరి శంకరులు చిదంబరమునఁ బుట్టి రనెనే గాని యితరసంస్కృతకావ్యము లెల్లఁ 'గాలటి' గ్రామమునఁ జన్మించి రనియే వాకొనుచున్నవి. 'కాలటియందు శంకరులు పుట్టినఁ బుట్ట వచ్చునుగాని శంకరులపూర్వులాంధ్రదేశమండలి గోదావరీమండలాంతర్గత సర్పపురక్షేత్రమునుండి మయూరవర్మచేఁ గేరళమునకుఁ గొనిపోఁబడి యుండుటచే, త్యాగరాజకుటుంబము తమిళదేశము నందెన్నితరములనుండియో యున్నను దెలుఁగు మాటాడుకొనుచు నాంధ్రులని వ్యవహరింపఁబడినట్లే శంకరునివంశమువారందఱు నాంధ్రము మాటాడుకొనుచు నాంధ్రులయియే యుందు' రని శర్లపాలెము వెంకట నారాయణగారు సిద్ధాంతముచేసి యున్నారు. కావచ్చును. గోదావరీ మండలాంతర్గతమై కోనసీమకు సీమంతమణియగు మునిఖండాగ్రహారమున (ముంగండ) వెలసిన వేఁగినాఁటి బ్రాహ్మణశాఖవాఁడైనను జననీ జనకులు కాశిలోస్థిరనివాస మేర్పఱుచుకొనిన పిదప నచటనే జన్మించిన వాఁడగుటచే శ్రీజగన్నాథపండితరాజు నౌత్తరాహు లుత్తరదేశమువాఁ డని యనుకొన్నను, దాను దనత్రైలింగాన్వయమును మఱువక స్మరించుటచే నాంధ్రుఁ డని యెన్నబడుట లేదా? ఇంటిలో నాంధ్రము, వీధిలో దేశభాష మాటాడునాంధ్రులు వివిధదేశము-

శ్రీ గురుమూర్తయే నమః

విన్నపము

ఉ. ఆర్యజనస్తవార్హ విమలాత్మ బుధేంద్ర కవీంద్ర చంద్రమో
వార్య కృపాకటాక్ష ఝురపాత్రుఁడ నౌటనె కాక శంకరా
చార్యజయప్రబంధ మొకచాయ రచించి త్వదంఘ్రిపీఠికా
జర్యవిభూషణంబుగ నొసఁగ వలంతినొకో రఘుద్వహా!

చ. మతగురుపుణ్యకీర్తి పలుమాఱు స్మరించుటఁజేసి ఘోరసం
స్మృతివెత భావిజన్మములనేనియు రూపఱు నంచుఁగా,క హం
కృతిఁ గృతిసెప్పఁబూనినటు లెంచఁగఁబోల, దెఱుంగ నొక్కఁడము
న్నతిరసయుక్తిఁ బల్వురు మహాకవులిద్ది తెలుంగునేయుటల్.

శా. వారే కాదు, కలంబు చేకొని కవిత్వం బంచు నిర్మించు నె
వ్వారున్ నాకతిపూజ్యులౌ గురులు, సంబంధుల్ సఖుల్, గావునన్
వారిన్ బండితదిగ్గజంబులను సంప్రార్థింతు నాలోపముల్
కారుణ్యంబునఁ ద్రోచి, యెందును గుణగ్రాహిత్వమున్ జేకొనన్.

విజ్ఞలోకమునకు నమఃపూర్వకమగు విన్నపము. "శ్రీశంకర భగవత్పాదులు పరమశివావతార మఁట. అమ్మహనీయుని పుణ్యయశము గానమొనర్చు భాగ్యము సామాన్యుల కబ్బదఁట" యని చిరకాలమునుండి వినుచు మహాత్ములు చేయఁదగు యత్నమునకుఁ గడంగితిని. "మూకం కరోతి వాచాల"మ్మనిన ట్లయ్యనఘునికృప

నాయెడఁ బ్రసరింపఁ గృతార్థుఁడ నగుదు ననుధైర్యముతో నిరువది యేండ్లక్రిందట శంకరవిజయవిలాసము ననుసరించి రెం డాశ్వాసములు రచించితిని. సంసారక్లేశముల కగ్గమైతిని. గురువుల కరుణకుఁ బాత్రుఁడను గాలేదేమో యనుకొని యూరకుంటిని. తరువాత నాసంకల్పము సఫలమగునట్లు ప్రేరణ మొనర్చినవారు భాషాపోషణైక వ్రతులును, శంకర ప్రతిష్ఠాపనాది పుణ్యకార్య నిరతులును, మహోదారులునగు శ్రీమదీదర వేంకటరావుపంతులుగారు. వారిసంకల్పబలముననో, కృతిపతి యగు శ్రీరామచంద్రుని కటాక్షవీక్షణముననో, నాయదృష్టముననో యిరువదేండ్లుగా నెఱవేఱని శంకరవిజయరచన మత్యల్పకాలమున నెఱవేఱినది హృదయభారము తొలఁగినది.

చిద్విలాసకృత శంకరవిజయవిలాస మంతయుఁ జదివి తెనుఁగున రచింప యత్నించితి నని తెలిపియుంటిని. ఆనాఁటినుండియు యత్నము మానలేదు. సాగలేదు. సంస్కృతమున శంకరవిజయములు పదింటికిఁ బైనున్నవని తెలిసి యత్నింపగా మాధవాచార్య కృతమును, ఆనందగిరికృతమును నగు శంకరవిజయములు రెండుమాత్రమే దొరకినవి. అంతకు మున్ను చిద్విలాస గ్రంథానుసారము వ్రాసినపద్యములు పరిహరించి మాధవ శంకరవిజయము ననుసరించి వ్రాయమొదలిడితిని. చిద్విలాసానందగిరుల గ్రంథములతో సంప్రదించుట కుపక్రమింప శంకరుని తలిదండ్రులు, నివాసము, సంన్యాసక్రమము మున్నగు ప్రతిఘట్టమునను విప్రతిపత్తులే కనఁబడఁగాఁ బెక్కురు పెద్దల నడిగితిని. (విద్యారణ్య) మాధవకృతమే ప్రమాణ మనినారు. అందును గొన్ని యనుపపత్తులు కనఁబడుచు వచ్చినవి. ఇతరగ్రంథముల రెండిటి యాధారమున నాయాతావుల రచన నడుపవలసివచ్చినది. అనువాదమని మక్కికి మక్కిగాఁ జేయఁబడలేదు. కొన్నియెడలఁ జేయఁబడకపోను లేదు. ఆనందగిరి శంకరవిజయము మాధవ, చిద్విలాసుల గ్రంథ

ముల కన్నివిధముల భిన్నముగా నుండుటచేతను జరిత్రకంటె నితర మతఖండన మాత్రమాగ్రంథమున ముఖ్యముగాఁ గానవచ్చుటచేతను దానినెచ్చట ననుసరింపలేదు. ఆంగ్లభాషయందుఁ గల కొన్ని శంకర చరిత్రములఁ గాంచితిని. ఆగ్రంథకర్తలు తమ బుద్ధి వినియోగించి శంకరుని గొప్పతనము పలువిధములగు హేతువాదములతో విమ ర్శించి, దేశము, కాలము మున్నగు వివిధవిషయములను నిర్ణయించిరి. తొలుత సంస్కృతమునందలి మూఁడు గ్రంథములు భేదించిన విషయ ములు చూచి తరువాత నాంగ్లేయ విద్యావేత్తల యభిప్రాయములను బొందుపఱతును.

మాధవ శంకరవిజయమందుఁ గల కొన్నిగాథలు చిద్విలాసుని గ్రంథమునఁ గానరావు ఆనందగిరి గ్రంథమున మిక్కిలి కానఁబడవు. చిద్విలాసుఁడును, నానందగిరియు శ్రీశంకరులకు సాక్షాచ్ఛిష్యు లని గ్రంథములఁ గనఁబడుచున్నది. ఎవరికథ వారిదే. యిందేది గ్రాహ్యము? ఏది త్యాజ్యము ? యిటీవలివాఁడు విద్యారణ్యస్వామి. ఆయన వచన మెట్లు ప్రమాణము ? ప్రాచీన శంకరవిజయ మాధారముగాఁ దాను రచించితి ననెను గావునఁ గానఁబడని ప్రాచీనశంకర విజయమును గూర్చి యేమియు ననఁజాలము గదా ? అది యెవరు రచించిరో తెలి యదు అని యెంచియు, వీనియందుఁ బ్రామాణ్యము మాధవ శంకర విజయమునకే యాధునిక పండితలోకమున నుంటచే దానినే ఎక్కువగా ననుసరించితిని. ఆగ్రంథము మాధవాచార్య కృతము కాదని కొందఱు విమర్శించి యున్నారు. ఆచర్చ నా కిచటఁ బ్రధానముకాదని దానిని విడిచిపుచ్చి గ్రంథరచనమున నన్నుఁ గలవరపెట్టిన యంశమును గప్పి పుచ్చుట న్యాయముకాదని, నాకు దొరికిన యీ మూఁడుగ్రంథము లందలి విరోధముల సంక్రింపఁ జూపుచున్నాను.

మాధవాచార్యుని గ్రంథమున	చిద్విలాసుని గ్రంథమున.	అనంతానందగిరి గ్రంథమున
1. శంకరుని తలిదండ్రులు ఆర్యాంబా శివగురులు.	శంకరుని తలిదండ్రులు ఆర్యాంబా శివగురులు.	శంకరుని తల్లి విశిష్ట. తండ్రి విశ్వజిత్తు.
2. జన్మభూమి కాలటి. పూర్ణానదీతీరము.	కాలటి చూర్ణీనదీతీరము.	చిదంబరము. నది చెప్పఁబడలేదు.
3. సంతతికై శివగురుఁడు వృషగిరిపైఁ దపమొనర్చెను. ద్విజవేషమున శివుఁడు వచ్చి వరమీయ శంకరుఁడు పుట్టెను.	శివగురుఁడు సంతతికై వృషగిరిమీఁదనే తపస్సుచేసెను. స్వప్నమున శివుఁడు తోఁచి వరమిచ్చెను. శంకరుఁడు పుట్టెను.	విశ్వజిత్తు తపస్సుకై అడవికిఁ బోయెను. విశిష్ట చిదంబరేశ్వరుని సేవించు చుండ నా దేవుఁడే యామె గర్భమున శంకరుఁడై పుట్టెను.
4. శంకరున కుపనయనముచేయ యత్నించుచు శివగురుఁడు మరణించెను.	శంకరున కుపనయనము చేసి వివాహమునకు యత్నించుచు శివగురుఁడు మరణించెను.	చిదంబరేశ్వరుని యజమానునిగాఁ జేసి జాతకర్మాదు లొనర్చినట్లే ఉపనయనము విప్రులే చేసిరి.
5. కనకామలక కథ.	లేదు.	లేదు.
6. శంకరుఁడు మకరాకృష్టుఁడై సన్యసింప మకరము శంకరుని విడిచిపెట్టెను.	బ్రహ్మచే శప్తుఁడగు నొక గంధర్వుఁడు మొసలియై శంకరుని బట్టికొన శంకరుఁడు సన్యసించెను. మొసలికి శాపవిమోచనమైనది.	లేదు.
7. నర్మద పొంగఁగా శంకరుఁడు కమండలువుచే నా పొంగిననీరు త్రావించెను.	లేదు.	లేదు.
8. చోళదేశవాసి, సనందనుఁడు శంకరునకు శిష్యుఁడగును.	అహోబలవాసి, లక్ష్మీవిష్ణుశర్మలకు కొడుకు, మాధవాచార్యుఁ డనువాఁడు శంకరశిష్యుఁడై సనందనుఁ డనుపేరొందెను.	లేదు.

9. సనందనుఁడు పద్మపాదుఁ డగును.	కలదు.	లేదు.
10. వ్యాసుఁడు తృతీయాధ్యాయాది సూత్రముపై విపులమగు వాదము చేయును.	వ్యాసుఁడా సూత్రముమీఁదనే శాస్త్రవాదము చేసినట్లే కాని యావాద మేమియు లేదు.	తాండిశ్రుతిపై వ్యాసుడు శాస్త్రవాదము చేసినట్లు విపులముగాఁ గలదు.
11. కుమారిలుని కథయం దోడినవారు యంత్రశిలలందుఁ జచ్చుట పందెముగా బౌద్ధులు చచ్చిరి.	వాదమున నోడిన సౌగతుల తలలను రాజుచే కుమారిలుఁడు నఱకించిన ట్లాతనిచే శంకరునకుఁ జెప్పఁబడెను.	సూక్ష్మముగాఁ గలదు.
12. శంకరుఁడు యోగవిద్యచే మండనునింటఁ జొచ్చునప్పటికి వ్యాసజైమినులను మండనుఁడు శ్రాద్ధమున కర్చించుచుండును.	పితృస్థానమున వ్యాసుని నెలకొల్పి యర్చించుచుండ విశ్వదేవస్థానమున నాకాశమునుండి దిగివచ్చి శంకరుఁడు గూర్చుండెను.	మండనుఁడు తనమంత్రిబలమున వ్యాసుని రప్పించి, పితృస్థానమున నుంచి, విశ్వదేవస్థానమున సాలగ్రామముంచి అర్చించుచుండ శంకరుఁడా చోటి కాకసమునుండి దిగును.
13 హస్తామలకుఁడు బలినామాగ్రహారవాసి, ప్రభాకరుని కొడుకు.	ప్రయాగవాసి, దివాకరాధ్వరి కొడుకు.	లేదు.
14. గిరియను శంకరశిష్యుఁడు తోటకాచార్యుఁ డయ్యెను.	విశ్వనాథాధ్వరి కొడుకు కళానిధి యనువాఁడు తోటకుఁ డయ్యెను.	లేదు.
15. శంకరుఁడు కలదని జ్ఞాతులు చెప్పినను వినక తల్లి కుత్తరక్రియలు చేసెను.	తల్లి చనిపోవుచున్నదని తెలిసి విప్రులఁ బిలిచి చెప్పఁగా వారు రాకపోవుటచే శంకరుఁడు తానే యుత్తరక్రియలు చేసెను.	లేదు.
16. తుదిని దేవతాప్రార్థితుఁడై కేదారమందుండి శంకరుఁడు వృషభారూఢుఁడై కైలాసమున కరుగును.	బదరీక్షేత్రమున దత్తాత్రేయుఁడు ప్రత్యక్షమై యొక గుహలోనుండి కైలాసమునకుఁ గొనిపోవును.	కాంచీనగరమున సమాధినిష్ఠుఁడై శంకరుఁడు భౌతికదేహము విడిచి కైలాసమునకేఁగెను.

ఇన్నివిధములుగా నున్న కథలయందలి సత్యాసత్యనిర్ణయము చేసికొనఁజాలకయాంగ్లభాషాకోవిదుల విమర్శన గ్రంథములను గొన్ని చదివి యందలి చరిత్రవిషయములు కొంతవఱకుఁ దెలియఁజాలితిని. ఈ పరస్పరభేదములనుగూర్చి వా రంతగాఁ దీవ్రదృష్టి యుంచినవారు కారు. కాని మాధవగ్రంథమునే యాధారముగాఁ జేసికొని, శంకరుని మహిమము బహుముఖముల విమర్శించి సాధ్యమైనంతలో హేతువు లూహించి చెప్పుచు దేశము, కాలము నిర్ణయింప నెక్కువ శ్రమ పడిరి. అందు శంకరుని కాలమును గూర్చి ముందు పరిశీలింతము. శృఁగేరి మున్నగు పీఠములందలి గురుపరంపరఁ గూర్చి తెలిసికొని ఉపదేశ సాహస్రిపీఠికయందు శ్రీ వావిలాల వేంకటశివావధానులుగా రిట్లు వ్రాసియున్నారు.

1. "క్రీ. పూ. 36 సం॥రములనాఁడు శంకరజనన మని శృంగేరిపీఠ జగద్గురు పరంపరవలనఁ దెలియుచున్నది.
2. క్రీ. పూ. 508 సం॥రములు అని శ్రీ కాంచీకామకోటి పీఠమందలి గురుపరంపర వలన
3. జగన్నాథమఠమందలి గురుపరంపర వలన క్రీ. పూ. 516,
4. ద్వారకామఠగురు పరంపరవలన క్రీ. పూ. 541 శంకరజననకాల మని తెలియుచున్నది.

శ్రీకర్లపాలెము వెంకటనారాయణగారు శంకరు లైదుమఠములు స్థాపించి రనియు, నయ్యవి ద్వారకా బదరికాది పుణ్యస్థలములందలి వనియు, నందలి గురుపరంపర ననుసరించి కాలము లిచ్చి యున్నారు. వానికిని బైని జూపినవానికిని గొంతవిభేద మగపడుచున్నది. పంచాంగ కర్తల నిర్ణయముప్రకారము క్రీ. పూ. 72 సంవత్సరములనాఁడు శంకరావతార మగుచున్నది. పైని జూపిన మఠములందలి గురుపరంపరయు నొకదానికి నొకటి లగింపకున్నది.

ఇంకఁ బాశ్చాత్యవిమర్శకాగ్రగణ్యుఁ డగు మాక్సుముల్లరు.— శంకరమందార సౌరభమునందలి శ్లో॥ ప్రానూత తిష్యశరదా మతి యాతవత్యా। మేకాదశాధిక శతోన చతుస్సహస్ర్యాం। సంవత్సరే

దెండఱు లేరు? అట్లే శంకరులకుటుంబమువారును వీథిలో మళయాళము మాటాడుచు నింట నాంధ్రము మాటాడుకొనువా రయినను గావచ్చును. కాని సంస్కృతకావ్యకర్త లందఱు నేకకంఠముగఁ గాలటి యని శంకరజన్మదేశమును గీర్తించి యుండుటచే వారిపూర్వుల వృత్తాంతము విని యుండని నేను నట్లే చెప్పి యుంటిని. ఆంధ్రుల చరిత్రము ననుసరించి కుమారిలభట్టాంధ్రుఁ డనియు, ఉత్కలాంధ్రదేశ సంధియందలి జయమంగళగ్రామమువాఁడనియుఁ జెప్పితిని. కాని నాఁడీ శంకరునిగూర్చి సిద్ధాంత మెఱుఁగక విడిచివైచితిని. శ్రీశంకరులెచట జన్మించినను, నేభాష మాటాడువారైనను, సంస్కృతభాష జగత్తున నున్నంతకాలము యావజ్జగతీమండలమునందును, నజరామరమూర్తులై వెలుఁగుచుండువారే. ఎవరికి వారే "శంకరుఁడు మావాఁడు, నావాఁడు" అనుకొనుట తప్పదు. మణిమంజరి వంటి యద్వైతమత గ్రంథమో మతరోధమునఁ గటువుగా నిందించెనే కాని, విదేశజులు గాని, విమతస్థులు గాని లవమేని నిందించిరా? ఎఱిఁగినంతలో స్తుతింపక విడువఁగలిగిరా? ఆంగ్లనారీమణియగు సోదరి నివేదిత పలుకులుగా ధీరేంద్రనాథపాలుగారు వ్రాసినయంశము నరయుఁడు.

"The gifted English lady who has become a devoted Hindu in the name of Sister Nivedita thus writes:---- Western people can hardly imagine a personality like Sankara. In the course of a few years to have nominated the founders of no less than ten great religious orders, of which four have fully retained their pristine state to the present day; to have apuired such a mastery of Sanskrit learning as to create a distinct philosophy and impress himself on the scholarly imagination of India is a pre-eminence that twelve hundred years have not sufficed to shake; to have written poems, whose grandeur makes them unmistakable even to foreign and unlearned ears and at the same time to have lived with his disciples in all the radiant love and simplicity of the saint - thus is the greatness that we must appreciate, but cannot understand. We contemplate with

wonder and delight the devotion of Francis and Assisi the intellect of Ablard, the virile force and freedom of Martin Luther and political efficiency of Ignotoes- Loyala, but who could imagine all these united in one person?"

(హిందూమత భక్తురాలును, ప్రతిభావంతురాలు నగు సోదరి నివేదిత యనునాంగ్లవనిత యిట్లు వ్రాయుచున్నది. శంకరునివంటి యద్వితీయవ్యక్తిని నిట్టిదని పాశ్చాత్యు లూహింప నశక్తులు. కొన్ని సంవత్సరములనడుమనే పదిమందికి తక్కువ కాకుండ మతోద్ధారకులు వెలసిరి. వారిలో నలుగురుమాత్రమే నేటిదాక సత్యస్థితి యందు నిలిచియుండిరి. ఆనలుగురిలో నొక్కడు (శంకరుడు) హిందూ దేశములోని విజ్ఞుల భావవీథిని ముద్రిత మొనర్పజాలినట్టియు, 1200 యేండ్ల పరిమితిగల కాలమైనను గదలింపలేనట్టి వేదాంత తత్త్వమును సృజింపజాలిన వశ్యముగు సంస్కృతపాండితికి బరమావధి యగుటయే కాదు. అతనిపద్యములు పరదేశజులకును, నిరక్షర కుక్షులకును గూడ కర్ణ రసాయనమై మనస్సునకు నిష్కళంకదీప్తి నొసగుచున్నవి. ఇంత వాడయ్యును పరమహంసయొక్క నిరాడంబరత్వమున నచంచలప్రేమ గలిగి శిష్యులతోc గలసిమెలసి యుండుట యాతని యున్నతికి వన్నె పెట్టుచున్నది. ఆ యనఘుని గొప్పతనము మెచ్చుకోదగినదే కాని యూహింప సాధ్యము కానిది. ఫ్రాన్సిసు, అసిసులయొక్క భక్తినిగాని, అబ్లార్డుయొక్క మేధాశక్తినిగాని, మార్టెనులూథరుయొక్క అప్రతిహతశౌర్యముతోడి వాగ్ధాటిని గాని, ఇగ్నేషియస్ లయోలాయొక్క రాజకీయ దక్షతను గాని వేఱు వేఱుగా నానందాశ్చర్యములతో నూహింపగలము గాని యిన్నియు నొక వ్యక్తియందే పోగుపడి యున్నచో నూహింప నెవనికి సాధ్యమగును?)

శ్రీమతి అనిబిసెంటమ్మగారు శ్రీ శంకరులనుగూర్చియు వారి భాష్యమునుగూర్చియుc జేసిన ప్రశంసకూడ నిట బొందుపఱుచుట యనవసరము కా దనుకొందును.

"There is a mighty name in Indian literature, the name of Sri Sankaracharya, that no man can name without reverence for the subtlety of his intellect, for the vast range of his intelligence. What was his work ? He came in the Kaliyuga, he came when the world was losing or had lost most of its spiritual light, he came to build up round the Science the Brahman the bultress of the intellect, the walls of subtle argumentation, the defences that should be strong and mighty, on which the intellect of world might break its teeth in vain. And he did it in order that behind that wall of intellectual subtlety, behind that fortress keen intellectual argument, the Supreme truth might remain unoutraged by assault, might remain for those who were worthy, might be protected for the spiritual mind. If you take as an example the Brahma Sutras, with the commentary upon them of Sankaracharya, you will see exactly what I mean. In his commentary there is the most refined hair - splitting ; in his commentary the most subtle distinctions ; in his commentary the most careful grading of language and the shading of every possible delicacy of thought ; and behind all that commentary the Sutras themselves."

(భరతఖండ వాఙ్మయములో మహామహిమ గల నామధేయ మొకటి గలదు. అది శ్రీశంకర భగవత్పాదుల నామము. ఆనామ ముచ్చరించునపుడామహాపురుషుని కుశాగ్రబుద్ధికిని, విస్తృతవిజ్ఞానమునకును వందనము చేయని మనుజమాత్రుఁ డుండనేరఁడు. ఇట్టి గౌరవ మొందుట కామహితుఁడేమి పను లొనరించెనో విచారింతము. కలియుగమున పరమార్థతత్త్వప్రకాశంబు మిక్కిలి క్షీణదశ నున్నతఱి బ్రహ్మశాస్త్రదుర్గమునకుఁ దర్కజటిలములగు వాదకుడ్యము లమర్చి, యాగోడలకు బలముగా యుక్తివిశేషము లనెడు నండగోడలను సంధించి, విశ్వజనులందఱు తమ ప్రతిభతో వ్యర్థముగ ఢీకొనునటులఁ జేయుదార్ఢ్యమును, బలమును గల రక్షకావరణములను సృష్టింప నమ్మహాపురుషుఁ డవతరించెను. ఏలయన బుద్ధిసూక్ష్మతచేతను, యుక్తియుక్త వాదముచేతను సురక్షితమగు పరమార్థతత్త్వము ప్రత్యర్థుల వాఙ్నిర్ఘాతపుల తాఁకులకు లొంగకుండ ఆపరమార్థ మొండె సర్వులగు

ముముక్షువులకు సులభసాధ్యంబై, విపక్షులకు దుస్సాధమై యుండ వలయుననియే వారి యభిమతంబు. ఇందులకుఁ దార్కాణముగా శ్రీశంకరాచార్యరచిత బ్రహ్మసూత్రభాష్యము తాము చదివినచోఁ బూర్వోక్తమగు నాయభిప్రాయము విశద మగును. వారి భాష్యములో బహువిధ సిద్ధాంతముల లేశ లేశముగాఁ బరిశోధించునేర్పును, సుదురూహపదార్థముల తారతమ్య విశేషమును, నిరవద్యమగు భాషా ప్రయోగనిపుణతయు గంభీరార్థ విన్యాసకౌశలమును, నిండియుండి, వానిమఱుఁగున నివురుగప్పిననిప్పువలెబ్రహ్మసూత్రములోప్పుచుండును)

ఈరీతిగా వైదేశికులు గావించిన ప్రశంసనములు పెక్కుగలవు. నవీనసిద్ధాంతముల ననుసరించి విమర్శించి శంకరులచరిత్ర యంతయు నాంగ్లమున రచించిన ధీరేంద్రనాథపాలుగారు తమకు శంకరునెడఁ గలభక్తి యంతయు స్ఫుటమగునట్లు గ్రంథాంతమున భరతవాక్య మిట్లు చెప్పుచున్నారు.

What have we to do with the miner incidents of Sankaracharya's life----a life only thirty two years length? We have his philosophy, ---- we have his religion ---- we have his personality, ---- we have his Ethics ---- we all Hindus from the north to south, from the east to west breathe in Sankara's spirit. ***May his spirit again revive our great 'Sanathana Dharma' with its pristine purity and sublimity.***

(ముప్పది రెండేండ్లు మాత్రము జీవించిన శ్రీశంకరుని జీవితము నందలి చిన్నచిన్న సంఘటనములవలన మనము నేర్వఁదగిన దే మున్నది? ఆమహానీయుని వేదాంతవిజ్ఞానము, ఆయనయేర్పఱచిన మతము ఆమహాత్ముని వ్యక్తిత్వము ఆయననైతికవృత్తము మనకు పెన్నిధానములట్లు దొరికినవి. ఇటు ఉత్తరమునుండి దక్షిణమువఱక నటు తూర్పునుండి పడమటిదాఁక భరతభూమి నున్నహిందువుల మగు మన మందఱమును శ్రీశంకరుని విజ్ఞానవాయువులను పీల్చుకొని జీవుంచు

చున్నాము. ఆయన దివ్యశక్తి నిత్యపూతమై సమున్నతమైన సనాతన ధర్మములను బునరుద్ధరించుగాక !)

మనదేశమందలి ప్రాచీనపండితులును, మహాకవులును "శంకర శ్శంకర స్సాక్షాత్" ని యాయనను బరమశివునిగా భావించిరి, నుతించిరి, కావ్యములు నిర్మించిరి దేవతార్చనయం దాయన ప్రతిమ నుంచి భగవంతుఁ డని నిత్యము పూజించిరి, పూజించుచున్నారు, పూజించుచున్నారు. పూజింప కేమి చేయుదురు ? మూర్ఖులమాట య టుండనిచ్చి విజ్ఞుఁడగు నెవఁడేని శంకరులవాఙ్మయగంధము నాఘ్రా ణించి యానందపరవశుఁడు కాకుండఁగలఁడా? మహాపండితుఁడు, మహా కవి, మహావ్యాఖ్యాత, మహావక్త, మహావాది, మహామేధావి యగు శంకరునివంటివ్యక్తి త్రికాలములందును త్రిభువనములందును లేఁ డనిన నతిశయోక్తి యెన్నఁటికిని గానేరదు. ఆయన జీవిత మామూల మాశ్చర్యజనకముగదా ! ఆహా ! ఎనిమిదేండ్లకు నాల్గువేదములు, నాఱుశాస్త్రములు, పురాణములు, కళలు నేర్చెనఁట, ఇట్టియనుభవము మనజీవితమునం దెఱుఁగము. కావున సంశయము గాని యాశ్చర్యము గాని కలుగవచ్చును. కాని యీనాఁడుకూడ నట్టిలోకోత్తరమేధావులు లేకపోలే దని శంకరవిజయ కృతిసమర్పణసభయందు 4-7-48 తేదీని న్యాయవాదిశేఖరులును, సంస్కృతాంధ్రహూణభాషావిజ్ఞాననిధులు ను, నాకుఁ జిరకాలమిత్రులు నగుశ్రీసోమంచి లింగయ్య బి. ఏ. బి. ఎల్, గారు శంకరుని నిరుపమానసూక్ష్మగ్రాహిత్వమునకు దృష్టాంత ముగాఁ జూపిన 16-4-48 ఆదివారమునాఁటిహిందూపత్రికయందలి వ్యాసభాగము నీక్రిందఁ బొందుపఱుచుట యనావశ్యకము కాదను కొందును.

CALCULATING BOYS, AMAZING PRODIGIES.

"Another faileure in life was the late william Sidis, who died in 1944 aged only 46. A genaration ago he was hailed as

the "World's greatest boy genius" but he died in a Boston hospital, penniles, for in spite of his great learning he had been incapable of erning a living. At six months he could recite the alphabet; at two he could read and write; at six he spoke and wrote several foreign languages; at 11 his thearies of fourth dimension startled the scientific world; and at 16 he graduated brilliantly from Harvard University, distinguishing himself especially in mathematics, yet he was never able to hold down a worth-while job even as an adding-machine clerk with a wall street firm, and he drifted aimlessly from one meanial occupation to another". HIDU. 16-4-48.

(గణితశాస్త్రనిపుణు లగుబాలురు_అద్భుతమేధావులు.

రాణింపని జీవితము గలవారిలో కీర్తిశేషుఁడైన 'విల్లియన్ సిడిస' ఒకఁడు ఈతఁడు 1944 లో తన 46వ యేఁటఁ జనిపోయెను. క్రిందటి తరములో నీతఁడు ప్రపంచములోని 'సుప్రసిద్ధబాలమేధావి' యని నుతి కెక్కెను. కాని యెంతపాండిత్య మున్నను సంపాదనశక్తి లేమిచే చేతిలో నొక పైసయైనలేక 'బోస్టన్ ఆస్పత్రి'లో మరణించెను.

అతఁ డాఱునెలలవాఁడై యున్నప్పుడే అక్షరమాల నంతయు నప్పగించెను. రెండవయేఁటఁ జదువను వ్రాయను నేర్చెను. ఆఱేండ్ల వయసునాఁటికి పెక్కు పరభాషలు చదువుటయు వ్రాయుటయు నేర్వఁ గల్గెను. పదునొకొండవ వత్సరమున 'అవకాశమున పదార్థముల వ్యాప్తిని' గూర్చిన నూతనశాస్త్రవిషయములు కనిపెట్టి ప్రకృతిశాస్త్రజ్ఞుల ముగ్ధుల నొనర్చెను. గణితశాస్త్రమున గణుతి గాంచుచు పదియాఱవయేఁట హార్వర్డు విశ్వవిద్యాలయమున పట్టభద్రుఁ డయ్యెను.

అయినను తగినయుద్యోగ మేదియు సంపాదింపలేక చివరకు అంకెలుకూడుయంత్రపువీథి కంపెనీలో గుమాస్తాగా కూడ పనిచేయ

లేక ఒక నౌకరీనుండి మఱియొకదానికి ఆదర్శశూన్యముగ మారుచుండువాఁడు ")

మఱియు ధీరేంద్రనాథపాలుగారు Sankara, The sublime అను గ్రంథమున శంకరుని బుద్ధిసూక్ష్మతను గూర్చి సంశయింప నక్కఱలేదని యీనాఁటి వంగదేశమందు జరిగిన యొక యద్భుతసంఘటనము నిట్లు తెలిపి యున్నారు.

The following fact as narrated by an eyewitness only the other day can convince all that it was not at all ludicurous if Sankara's biographers have said that he became a vastly learned man when he was but mere boy. The following is a translation from the "Hitabadi" newspaper. It was published 11th Visaka in the Bengal year 1315 under the heading "Extraordinary memory"

"The Brahmins of India have degenerated with the degeneration of whole India. They have lost their old world renowend intelligence and genius, ---- their superhuman power of memory ---- their piety and holiness but even in these days of degenaration - we some times come across such extraordinary and wonderful power of memory and intelligenec that they cannot be found in any other country of the world. Since a year two Brahmin boys have come to the holy city Benares. Both these boys posses extraordinary memory and intelligence. We publish in this issue the photos of these two boys.

The boy who is in ascetic dress mastered the Hindi, Bengalee and English languages, and studied many Sanskrit works and got by heart the whole of panini's great grammar when he was only five years of age. Last year he was invested with the holy thread and is now living the life of a strict ascetic. He is now only eight years of age and studying the Sama-Veda.

The other boy is his younger brother. He is now only five years of age; but even now he is proficient in four or five languages and is studying the grammar of Panini. Both brothers are vastly learned in Mathematics.

(ఈ క్రింది వృత్తాంతము ప్రత్యక్షముగాఁ జూచిన యొకరివలనఁ దెలియుచున్నది. శంకరు లతిబాల్యముననే సకలవిద్యాపాటవము గల వాఁ డయ్యె నని చరిత్రకారులు వ్రాసినవ్రాఁతలు పరిహసింపఁ దగినవి మాత్రము కావు. ఈ క్రింది హితవాది పత్రికయందలి "లోకోత్తర మగు మేధాశక్తి" అను శీర్షికగల వ్యాసము ననువాదము చూడఁ దగును. హిందూదేశముతోపాటు బ్రాహ్మణులుకూడ మిగుల హీన స్థితికి వచ్చిరి. జగద్విఖ్యాతమగు వారి మనుష్యాతీతమైన మేధాశక్తియు పవిత్రతయు నశించినవి. ఇట్టి హీనస్థితియందును నొక్కొక్కప్పు డసాధారణము, నాశ్చర్యకరమును నగు మఱి యేదేశమునందును గానరాని మేధాశక్తియు జ్ఞానమును గోచరించుచున్నది. ఒకసంవత్సరముక్రింద నిద్దఱు బ్రాహ్మణబాలురు కాశికి వచ్చిరి. వీ రిద్దఱకు లోకోత్తర మగు ధారణాశక్తి, బుద్ధియుఁ గలవు. వీరిఛాయాపటము లీపత్రికలోఁ బ్రకటించితిమి. అందు సంన్యాసివేషమున నున్నబాలుఁడు 5 ఏండ్లవయస్సు నాఁడు పాణినివ్యాకరణ మెల్ల కంఠపాఠముచేసి హిందీ, బెంగాలీ, ఇంగ్లీషు భాషలను స్వాధీనముచేసికొని, పెక్కు సంస్కృత గ్రంథములను చదివెను. నిరుడే యతని కుపనయన మైనది. ఇప్పు డతి తీవ్రమగు సంన్యాసనియమముతో నున్నాఁడు. వయస్సు 8 ఏండ్లు. ప్రస్తుతము సామవేదము చదువుచున్నాఁడు. రెండవవాఁ డతని తమ్ముఁడు. ఇతఁ డయిదేండ్లవాఁడు. నాలు గైదు భాషలు నేర్చినవాఁడు. పాణినీయ వ్యాకరణము ప్రస్తుతము చదువుచున్నాఁడు. వీరిద్దఱు గణిత శాస్త్రములో గొప్పపండితులు.")

మఱియు నాగ్రంథకర్త శంకరుని యమానుషశక్తుల వర్ణించుచుఁ బరకాయప్రవేశవిద్యను గూర్చి యిట్లు చెప్పుచున్నారు:

This story might appear to many as the acme of improbability. But as for ourselves, we believe that it was not impossible. By the yoga power, it is perfectly possible, to have one's soul transferred to other bodies or to take it any where at will. This incident has been mentioned by all the writers on the great master. Why for no earthly reason they should speak such an unnecessary lie? Ofcourse this is not the place to enter into such controvercial matter. Our readers are not at perfect liberty to believe or not to believe the story. But they must know that Sankara was not only a great philosopher and a prophet, but he was also a great 'yogee'. He studied and practised 'yoga' under his Guru for many years together. And it is admitted in every Hindu sastra that a man who attains success in 'yoga', becomes almost almighty,--- nothing remains impossible to him. The day is not far off when is will be universally admitted and demonstrated dy the modern sciences as they will be advanced to perfection---Page 59.

(పెక్కుర "కీగాథ జరిగియుండుట కేమియు నవకాశములే"దని నట్లు కనిపింపవచ్చును. కాని మాకుమాత్ర మది యసాధ్య మని పించుటలేదు. యోగశక్తిచే ఒకయాత్మ యితరుల శరీరమున ప్రవేశించుటకుఁగాని యిచ్చవచ్చినచోటి కేగుటకుఁగాని మిక్కిలి యవకాశము కలుగును. శంకరులు పరకాయప్రవేశ మొనర్చినటుల పెక్కురు వ్రాసియున్నారు. వారందఱు వృథాగా నేల యసత్యము పలుకవలెను? ఇందులకై వివాదపడుట కిది సమయముగాదు. మా చదువరులు దీనిని నమ్మిన నమ్మవచ్చును. లేదా మానవచ్చును. కాని వారొక సంగతి మాత్రము తెలిసికొనవలెను. శంకరులు గొప్పవేదాంతి, గొప్పప్రవక్త యనిమాత్రమేగాక గొప్పయోగికూడ నని యెఱుఁగఁదగును. పెక్కేండ్లొకగురువువద్ద యోగశాస్త్ర మెల్ల నాయన చదివి సాధన మొనర్చెను. "యోగమును సాధించిన మనుజుడు భగవంతుఁడేయనియు, వాని కసాధ్యమేదియు నుండ దనియు" హిందూశాస్త్రము లన్నియు నేకగ్రీవముగాఁ బలుకుచున్నవి. నేఁటి ప్రకృతిశాస్త్రములింకను నభివృద్ధి

యయినకొలఁది నీ సంగతిని (పరకాయప్రవేశవిద్య) గ్రహించి రుజువు చేయఁగలట్టి శుభదినము సమీపించుచున్నది.)

ఈ వ్రాఁతలనుబట్టి శ్రీశంకరులు యోగవిద్య కరతలామలక మొనర్చుకొనెనని ధ్రువపడుచున్నది. కమండలువుచే నర్మదానదీ పూరము త్రావించిన వశిత్వమును, పద్మపాదునిచేఁ దామర పూల పంక్తిమీఁద నడపింపనిచ్చిన లఘిమమును, ముమూర్షువగు తల్లికడకు నాకాశమార్గమున రానేర్చిన పాదుకాసిద్ధియు నీయోగశాస్త్రపాటవము చేతనే కల్గినవనియు; నావిద్యచే నవి సులభసాధ్యము లనియుఁ దెలియఁదగును.

కావున మనము చూచి యుండలేదని దేనిని లేదనికాని, కాదనికాని త్రోసిపుచ్చుట తగదు. నిన్న నమ్మనివాని, నీదినమున నమ్ముచున్నాము. ఈదినమున నమ్మనివాని నెన్నిటినో రేపు నమ్మదుము. ఈరీతి సిద్ధాంతముల ననుమతించియు "వ్యాసాదులు చిరంజీవు" లను పురాణసిద్ధాంతమును నమ్మనియట్లు "వ్యాస" యనునది బిరుదము కావచ్చునని వ్యాసునిగూర్చి ధీరేంద్రనాథు లిట్లు నిర్ణయించుచున్నారు.

We need not say that Kristna Dwaipayana Vyasa, the arranger of holy Vedas and the writer of Vedanta Sutras and various Puranas, was born many hundreds of years before the birth of Sankara. He was a contemporary of Kuru-Pandavas who fought the great battle of Kuru - Kshetra in about 1900 B. C. Therefore this story is rather an allegory,---meaning thereby that he had fought with many learned men to sustain his new explanation of Vedanta. He must have fought with the profound scholar of Vedanta philosophy of that time who was naturally discribed as an incarnation of the ancient Rishi Vyasa. We might mention that the title of "Vysa" is always borne even up to this day, by one of learned men of Benares. Perhaps the Vyasa contemporay to Sankara was a great learned Vedantist and he had to light with this old Brahmin.

(వేదవిభాగకర్తయు, వేదాంతసూత్రరచయితయు, బహుపురాణ నిర్మాతయు, నగుకృష్ణద్వైపాయనుఁడు శంకరునకుఁ బూర్వము కొన్ని శతాబ్దముల నాఁడు పుట్టెను. ఇంచుమించు క్రీ. పూ. 1900 సంవత్సరములనాఁడు కురుక్షేత్రమున యుద్ధముచేసిన కురుపాండవులనాఁటి వాఁడు కావున నీకథ కల్పితము. కాని యీకథవలన శ్రీశంకరుఁడు తన నూతనసిద్ధాంతములతోడి వేదాంతమార్గప్రతిష్ఠకై పెక్కురు మహా పండితులతో వివదించె ననవచ్చును. వ్యాసునియవతారమే యనఁ దగు నొకమహావేదాంతవిజ్ఞానితో ఆసమయమున శంకరుఁడు వాదించి యుండవచ్చును. నేఁటికిని గాశియందు గొప్పపండితులకు "వ్యాస" అనునది బిరుదముగాఁ గానవచ్చుచున్నది. బహుశః శంకరునినాఁటి వ్యాసుఁ డనఁగా వేదాంతశాస్త్రమున మహావిజ్ఞాని యగునొకానొక పండితుఁడు ఆతనితో శంకరులకు వాదముజరిగి యుండును") అనిరి. ఈ విషయము నారచనముననే చర్చింపఁబడినది. ప్రాజ్ఞులు నేను జూపిన హేతువుల కామోదించి దీవింతు రనుకొనుచున్నాను.

దేశకాలవివేచనము మనమున నిడుకొనియే సాధ్యమైనంత వఱకు రచన సాగించుచు మూలమునకుఁ జేరువగాఁ గథాంశము నడప యత్నించితిని యెంతవఱకందుఁ గృతార్థుఁడ నైతినో నిర్ణయింప సహృదయులే ప్రమాణము. వ్యాసజైమినులు శ్రాద్ధభోక్తలుగా మండను నింటికి వచ్చిరనుఘట్టమున వైయాసకవిద్య (ఉత్తరమీమాంస) జైమినీయవిద్య (పూర్వమీమాంస) నేర్చినపండితు లని మార్చఁబడెను. మఱియు బాణమయూరదండిశ్రీహర్షప్రముఖమహాకవులతో శంకరుఁడు వాదించి, శిష్యులనుజేసికొనెనని మూలమునఁగలదు. దీనింగూర్చి ధీరేంద్ర నాథపాలుగారు తమగ్రంథమున "Besides this authenticity of Madhavachary's account of the great man in some points, is every much doubted when we find him mentioning Bana, Mayura, Dindi; Sri Haraha, Bhaskara and Udayana to be contemporary of Sri Sankaracharya ----- a thing which is practically impossible and needs no proof any student of Archelogy."

(ఇంతియె కాక మహాపురుషుఁడగు శ్రీ శంకరునిగూర్చి మాధవాచార్యుఁడు చెప్పిన కొన్ని యంశములందతని ప్రామాణికత్వము సంశయపాత్రమగుచున్నది. బాణ, మయూర, దండి, శ్రీహర్ష, భాస్కరోద యనులకు సమకాలికుఁడుగ శంకరు నుదాహరించుట యసంగతము కాదా !) అని విమర్శించియున్నారు. ఈ సందర్భమున:

చ. శౌరిఁబోరి బాణదండి భవభూతి మయూర ముఖాద్య సత్కవీ
శ్వర బిరుదాంకితుల్ కవులు వాదునఁ బల్కు రెదిర్చి యోడి, శం
కరగురు నాశ్రయించి కడఁకన్ గడకొత్తి స్వదుర్మతంబులన్
వరుసఁ బరిత్యజించిరి భాష్యము లవంత్య పవర్తన వర్తనంబునన్. 933.

ఉ. ఖండనకారునంతటి యఖండమనీషుఁ బటిష్ఠయుక్తి వా
క్ఖండిత సర్వశాస్త్రి గురుకల్పుని భట్టవికల్పు నొక్కనిన్
బండితమాళిఁ బట్టి యభిమానము తద్యతి దుంచి నొంచి యు
చ్చండ వివాదకేళిని వశంవదు, జేసికొనెన్. క్షణంబునన్. 957.

అని బాణాది పూర్వకవుల నామములను బిరుదములుగా దాల్చిన మహాకవులను, శ్రీహర్షు నంతటి మహాపండితుని శంరుఁడు జయించె నని మార్చితిని.

శంకరుఁడు తల్లికుత్తరక్రియలు చేయుసందర్భమున మాధవ గ్రంథమందలి శాస్త్రనిషిద్ధాచారము లేకుండఁ జిద్విలాసుని గ్రంథము నందలి "తల్లి మరణింప నున్నదని యెఱిఁగి శంకరుఁడు జ్ఞాతులను బిలువ వారు రారైరి" అను వాక్యమును గొని జ్ఞాతు లుత్తరక్రియలు చేయ రాకుంటకుఁ గినిసి వారిని శపించి యాపద్ధర్మముగాఁ దానే చేసె నని మూలకథ విడువక శ్రీభగవత్పాదులకుఁ గళంకము సోఁకకుండ మార్పు గావింప సాహసించితిని. ఇట్టి సాహసమును కుమారిలభట్ట చరిత్రమునను జేయక తప్పినది కాదు. "జైనగురువును జంపినపాపము పోఁగొట్టుకొన భట్టపాదుఁడు తుషాగ్నిప్రవేశ మొనర్చె ననుతావునఁ దుషాగ్నిప్రవేశము వ్రతమని నిరూపించితిని. కుమారిలుని చరిత్రమున కెట్టి కళంకము లేకుండఁ జేయుతలంపుతోడనే యట్టిమార్పు కావింపఁ బడె నని ప్రాజ్ఞు లవధరింతురుగాక !

చరిత్రమార్గమున 'అట్టు ఇట్టు' అని శ్రీశంకరులంగూర్చి తోఁచినరీతి విమర్శింపఁగలమే కాని యాలోకోత్తర వర్తనుని శాస్త్ర రచనాపటిష్ఠతఁ గూర్చియేని, కవితానైపుణ్యముఁ గూర్చియేని 'యట్టిట్టన సహస్రాస్యునకైనను శక్యమా? అమ్మహనీయునివాక్కు శాస్త్ర రచనయం దెంత గంభీరార్థనిబద్ధమై ప్రతివాదిదుర్భేదమై దీపించునో కవితారచనయం దంత సుకుమారమై, ప్రసన్నమై, మధురమై సకలజన హృదయంగమమై యొప్పుట యద్భుతావహము గాదా? అట్టి యలోకమహిమల కాటపట్టయి ముప్పదిరెండేండ్ల యల్ప జీవితమునందే యాసేతుహిమాచలము కాలినడకను బలుమఱు పర్యటించి, వివిధమతములందు మహావిజ్ఞానులగు పండితులను జయించి శిష్యులుగాఁ జేసికొని, దుష్టులొనర్చు క్రూరకృత్యములనుండి తప్పించుకొనుచు, శిష్టులఁ గాచుచు, నన్నిదిక్కుల నద్వైతమతరక్షణము శాశ్వతముగా నెఱవేఱ, నాఁటిమహీపాలుర వశ మొనర్చుకొని, మఠముల నిర్మించి, దిగ్దంతులవంటి శిష్యులను నామఠముల కధిపతులుగ నెలకొల్పి, ధర్మము నాల్గుపాదముల నడపిన శ్రీశంకర భగవత్పూజ్యపాదులు భగవదవతార మనుటకు సంశయ మెందులకు? మనుజుల బుద్ధులకు గోచరింపని విషయముల నెఱింగి తన్ననుసరించువారికా విశేషములఁ దెలిపి తరింపజేసినవానినే కదా భగవదవతార మందురు! అట్టియెడ శంకరునిగూర్చి పెక్కుమాటలతోఁ బ్రయోజనమేమి? అట్టి పరమశివావతార మగు శ్రీశంకరుల దివ్యచరిత్రము కవులును, చారిత్రకులును వర్ణించి విమర్శించి గ్రంథము లెన్నివ్రాసినను వ్రాయవచ్చును. ఒక్కొక్కరి సూక్తియం దొక్కొక్క వింతయో విశేషమో యుండితీరును. అదిగాక ఎందఱెంతవర్ణించినను నా వర్ణన మఱియు నా జగదేకగురుని యశస్సుధాబ్ధియందలి తరంగములోని యొక బిందుమాత్రమేనియుఁ గానేరదు. విద్యారణ్యు లని ప్రసిద్ధివడసిన మాధవాచార్యుఁడు శంకరవిజయగ్రంథనిర్మాతలలోఁ దలమానికమై యొప్పెను. పండితు లాగ్రంథ మాయనయే రచించినాఁ డని చెప్పుట

బహుళము. కాని యాగ్రంథము రచించిన దాతఁడుగాఁడు. 'వ్యాసాచలకవి' ననుకొనుటచే నీతఁ డన్యుఁడని విమర్శకులు చెప్పుచున్నారు. ఆయంశమునకు దిగిన శాఖాచంక్రమము కావచ్చునని యా నిర్ణయ మొనర్చుభారము ప్రాజ్ఞలోకము వహింప విడిచిపుచ్చెదను.

'నేతాయత్రోల్లసతి భగవత్పాద సంజ్ఞో మహేశ' అనిన సూక్తి చొప్పున శంకరభగవత్పాదులు నాకావ్యమునకు నాయకుఁడు. కృతిపతి శ్రీరామచంద్రమూర్తి. ప్రేరకులు మహోదారులును నిరంతర రామభక్తి నిధులగు శ్రీ వేంకటరావు పంతులుగారు. ఇట్టి సంఘటనమునకు నాలో నేనే యచ్చెరువడుచు నఘటనా ఘటనాఘటిష్ఠుఁడగు గురుమూర్తికి జోహారు లర్పించుచు- దమశిష్యునివలె నన్ను నారయుచు, శంకరవిజయమునందలి శాస్త్రవాదఘట్టములం దెన్నియో తెలియఁజెప్పి, నాగ్రంథ మంతయు శ్రద్ధతో నరసి, తమ శారదాముద్రాలయమున ముద్రింపఁజేయుటయే గాక,తమపుత్రులతో సమానముగా న న్నాదరించి, నాశ్రమ మంతయుఁ గార్యరూప మొందఁ బీఠిక వ్రాసి దయచేసిన "తర్క-వేదాన్తరత్న" బ్రహ్మశ్రీ బులుసు అప్పన్నశాస్త్రిులుగారికి నాసార్వకాలిక కృతజ్ఞత మెఱయ వందనము లర్పించుచున్నాను.

పరమేశ్వరుఁడు శంకరుఁడు శ్రీ వేంకటరావు పంతులుగారికిని వారి పుత్రపౌత్రులకును నిత్యాభ్యుదయము లొసంగి రక్షించుఁగాక!

ద్వితీయముద్రణము.

ప్రథమముద్రణము 1948 జూలై మాసమునఁ బూర్తియైన పిదప 4-7-48 తేదీని కృతిసమర్పణసభ జరిగినది. నాఁటి సభా వృత్తాంత మంతయు "ప్రారంభవిద్యా" పత్రిక జూలై సంచికయం దీక్రిందివిధముగాఁ బ్రకటింపఁబడినది.

విద్వత్కవి సన్మానము.

కవితాభూషణ బ్ర॥ శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారిచే రచింపబడిన 'శంకరవిజయ' ప్రబంధమును మ॥ రా॥ శ్రీ

ఈదర వేంకటరావుపంతులుగారు (వేంకట్రామ అండ్ కో ప్రొప్రై టరు) తమ యిలవేలుపగు శ్రీరామచంద్రమూర్తికి కృతిసమర్పణ చేయించిన సందర్భమున తర్క–వేదాంత సార్వభౌమ బ్ర॥శ్రీ మండలీక వేంకటశాస్త్రిగారి అధ్యక్షతను శ్రీ పంతులుగారింట ది 4–7–48 న గొప్ప సభజరిగినది. ఈసభకు మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిసార్వభౌమ బ్ర॥ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారున్నూ, బాల వ్యాస వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి, బులుసు అప్పన్నశాస్త్రి, దర్భా సర్వేశ్వరశాస్త్రి, చావలి నృసింహశాస్త్రి, కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ M. A., శ్రీ జటావల్లభుల పురుషోత్తము M. A., శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ M. A. B. L. గార్లున్నూ ఇంకా కొందరు మహాకవులు, పండితులు, పురప్రముఖులు చాలమంది విచ్చేసిరి. ఆంధ్రదేశమందలి విఖ్యాత ప్రతిభావంతు లనేకులు శ్రీ ఈదర వెంకట్రావుపంతులుగారికి పంపిన ఆశీస్సులు శ్రీ పాలంకయ్య గారిచే సభలో చదువబడిన పిమ్మట శ్రీ బులుసు అప్పన్నశాస్త్రిగారు సభను ప్రారంభించి గంభీరోపన్యాసము గావించిరి. తమపరి శ్రీ పురు షోత్తముగారున్నూ జొన్నలగడ్డ విశ్వనాథ సత్యనారాయణగారున్నూ కవిసార్వభౌములున్నూ యింకా కొందరువిద్వాంసులున్ను శంకరవిజయ మహాప్రబంధ కథానాయకులగు శ్రీశంకరభగవత్పాదులను గురిం చియు, కృతికర్తయగు శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారి ఆకర్షణీయమగు కవిత్వమును, వారి అద్వితీయ ధారణాశక్తి, పాండిత్య ప్రకర్ష మున్నగు వానిని గూర్చియు, కృతిప్రేరకులును, సహజౌదార్య సంపన్నులునునగు, విద్యోద్ధారక, ఆశ్రితపారిజాత బిరుదాంకితులు శ్రీ ఈదర వెంకట్రావుపంతులుగారి దివ్యప్రతిభను అసామాన్య వితరణ మును, వారి సౌజన్యమును, భగవద్భక్తి మున్నగువానిని గూర్చియు, విపులముగా వారి సహజ మృదుమధుర వాగ్ధోరణిని అతిమనోహర ముగా గంభీరోపన్యాసములు చేసి సభ్యుల నమందానంద పరవశుల జేసిరి. శ్రీ దర్భా సర్వేశ్వరశాస్త్రి, పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి, కొల్లి

పద్మనాభశాస్త్రిగార్లు సంస్కృత శంకరవిజయకర్తయగు విద్యారణ్యుల వారినిగూర్చియు, కావ్యమందలి గుణగణములగూర్చియు చక్కగా నుపన్యసించి ఆంధ్ర శంకరవియమునందును మూలములోవలె ఆకర్ష ణీయమగు ఘట్టములు గలవని నిరూపించిరి.

కవిసార్వభౌములు సభ్యుల అనుమతితో కృతికర్తలకు 'విద్వత్కవిశేఖర' యను బిరుదము నొసంగి సన్మానించిరి. కవిగారికి శ్రీ ఈదర వెంకటాప్రుపంతులుగారు సువర్ణ ఘంటాకంకణమును, రు 2116 లున్నూ, దుశ్శాలువలు నొసగి బహూకరించిరి. అట్లే ఈ సభకు విచ్చేసిన పండిత కవులకు, దుశ్శాలువలు, శంకరవిజయ కావ్యములు, భూరి సంభావనలు ఇచ్చి సత్కరించిరి.

అధ్యక్షుల ఆశీస్సులతోను శ్రీ పాలుట్ల పాలంకయ్యగారి అభివందనములతోను సభ జయప్రదముగా ముగిసినది".

నాడు 500ప్రతులు మాత్రము ముద్రితములైనవి. అందు చాల భాగము నాటి సభయందును, దరువాతను, సరసులు, నుదారులు నగు శ్రీ వేంకటరావుపంతులుగారిచే బండితులకును మిత్రులకును బహూకరింపబడెను. కొలదికాలములో మిగిలినవిగూడ నైపోయినవి. మరల నిన్నాళ్ళకుఁ గాని రెండవముద్రణమునకు నవకాశము లభింపలేదు. శ్రీరామచంద్ర కరుణాకటాక్షమున నేటికి ద్వితీయముద్రణము పూర్తియైనది. ఈసారి దొరతనమువారి నిర్బంధము లేకుండుటచే 1000 ప్రతులు ముద్రింపబడినవి. ప్రథమముద్రణమునందలి ప్రమాదములు సవరింపఁబడినవి కాని యిందును గొన్ని ప్రమాదములు రాకమానలేదు కావునఁ జదువరులు తప్పొప్పులపట్టిక ననుసరించి సవరించుకొని పఠించి యానందించి నన్నుఁ జరితార్థు నొనర్తురుగాక యని ప్రార్థించుచున్నాను ఈ ముద్రణముగూడ శ్రీ శారదాముద్రాలయముననే జరుగుటచేత గురుసమానులగు శ్రీ అప్పన్నశాస్త్రులవారు నాయెడఁ జూపిన యాదరాతిశయమునకు సర్వదా కృతజ్ఞుఁడను.

ఖరఫాల్గున శు ౧3
భానువాసరము.

ఇట్లు,
గ్రంథకర్త.



పీఠిక.

శ్లో. గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణాం,
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః.

శ్లో. నారాయణ సమారంభాం శంకరాచార్య మధ్యగామ్,
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్.

శ్లో. శ్రుతిస్మృతిపురాణానా మాలయం కరుణాలయం,
నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్.

పరమశివావతార ప్రఖ్యాతులగు శ్రీ శంకరభగవత్పాదులవారి ప్రస్థానత్రయముతోఁ బఠనపాఠనక్రమమున నెంత పరిచయముగలవాఁడ నైనను, గీతాభాష్యమునకు నాంధ్రభాషయందు విపుల ప్రచారము గలుగుటకై నిరంతరము తద్వివరణ రచనా నిమగ్నుఁడ నైనను, శ్రీ యాచార్యులవారి నిరుపమ పుణ్యచరిత్ర మచ్చటచ్చట నరయుటయే కాని యామూల మాచూడముగఁ జూచుభాగ్యము నొందిన వాఁడను గాను. అట్టికొఱఁత నేఁటి కీయాంధ్రీకృత శంకరవిజయము మూలమునఁ దీఱిన దని సంతసించుచుంటిని. ఈగ్రంథమునకుఁ గృతిపతి శ్రీరామచంద్రమూర్తి యైనను, ప్రేరణకర్తలై యేతద్గ్రంథ రచనకుఁ బ్రత్యక్షనాయకులును, సరసులును వదాన్యులును శ్రీమంతులు నైన శ్రీ యాదర వేంకటరావు పంతులుగారీగ్రంథమును దమ ముద్రణాలయమున నచ్చొత్తింప నవకాశము చిక్కక, మా శారదా ముద్రణాలయమున ముద్రింపఁ బంపుటచే, గ్రంథకర్తతోపాటు నాకును బ్రత్యక్షపరిశీలన మావశ్యకమై యమితానందము కలిగించెను. ఆ యానందము లోకులకుఁ దెలుపుకొన వీలుగా నీ గ్రంథమునకుఁ బీఠిక నేనే రచించు సదవకాశముకూడఁ గలిగినది. ప్రకృత మనుసరింతును.

శంకరుల జన్మదేశము.

శ్రీశంకర భగవత్పాదుల జన్మదేశము, కాలము, మనుజావతార కారణము మున్నగు విషయముల నించుక పరిశీలించి పిదప నాంధ్రీకరణము గూర్చి చర్చింతము.

కేరళదేశమందలి కాలటి యను నగ్రహారము జన్మస్థాన మని సంస్కృత శంకరవిజయములందుఁ బెక్కింట నున్నది. కాని యానంద గిరికృతగ్రంథమున మాత్రము చిదంబర మని కలదు ఇటీవల వెలువడిన పరిశోధనములందు శ్రీశంకరుల పూర్వులు తజ్జననకాలమునాఁటికిఁ గేరళ దేశమున నెలకొనినను నాంధ్రదేశమునుండి మయూరవర్మయను తద్దేశ భూపాలుని యాహ్వానమున నచట స్థిరపడినట్లు కావచ్చుచున్నది. ఆంధ్రపత్రిక రుధిరోద్గారి ఉగాదిసంచికయందు శ్రీకర్ల పాలెము వెంకట నారాయణగారు 'శ్రీమదాదిశంకరు లాంధ్రులే' యని నిర్ణయించుచు నొకవ్యాసము వ్రాసి యున్నారు. అందలి ముఖ్యవిషయము లిం దుదాహరింతును.

"పరశురాముడు రాముని కోడిపోయి పశ్చిమసముద్రతీరమునకు వెళ్ళి గండ్రగొడ్డలి యా సముద్రమున విసరివేయఁగా నేఁటి కేరళదేశ మందుండి పైకిఁ దేలినది. అహిక్షేత్రమునుండి కొందఱు బ్రాహ్మణులు పరశురామునితో వచ్చిరి. ఆ బ్రాహ్మణులు పరశురామునితోఁ బోట్లాడి తిరిగి తమ దేశమునకుఁ బోయిరి. అందుచే మళయాళమున బ్రాహ్మణులు లేకపోయిరి. పరశురాముఁ డచటి బెస్తలకు జందెములు వేసి బ్రాహ్మణులను జేసి పరశురామస్మృతి వ్రాసి యార్యబ్రాహ్మణు లకు భిన్నాచారముల ననఁగా మగవారికి ముందుజుట్టు, నాడువారికి రైకలు లేకుండుట మొదలగు నాచారముల నేర్పఱచి యచటనే తపస్సు చేసికొను చుండెను. కొన్నాళ్ల కీబెస్తబ్రాహ్మణు లాయన కపరాధము చేయ మరల బెస్త లగునట్లు శపించెను. నాఁటినుండి యచట బ్రాహ్మణులు లేరు. తరువాతఁ గొంతకాలమునకుఁ గదంబ వంశజుఁడగు మయూరవర్మ గోదావరీ మండలమందలి యహిక్షేత్రము నుండి యార్యబ్రాహ్మణులను గేరళమునకుఁ దీసికొని పోయెను వీరే యిప్పటి మళయాళబ్రాహ్మణులు. వీరిలో నుండియే శంకరాచార్య స్వాములవారు పుట్టిరి. అహిక్షేత్రమునుండి వెళ్ళిన బ్రాహ్మణులు భట్టాచార్యునకు శిష్యులైరి. కదంబవంశము చారిత్రిక రాజవంశము" అనునొకకథవలన మళయాళమున బ్రాహ్మణులు లేనట్లును గోదావరీ మండలమునుండి బ్రాహ్మణులు తీసికొని పోఁబడిరనియుఁ గేరళము సముద్రమునుండి యుద్ధృత మగుటయు స్పష్టము. ఇఁక మయూరవర్మ

చారిత్రిక పురుషుఁడు. అహిక్షేత్ర మాంధ్రదేశమందలి పిఠాపురమునకు మీపమున నున్న సర్పవరము. సర్పపురమాహాత్మ్యము బ్రహ్మా కైవర్త పురాణమునఁ గలదు. కూచిమంచి తిమ్మకవి దీని నాంధ్రీకరించెను.

'అహిక్షేత్రము తూర్పుతీరమండలి యొక రాజ్యము' అని ఆప్టే గారి సంస్కృతాంధ్ర నిఘంటువునఁ గలదు. భట్టాచార్యులవారే భట్టపాదులు, భాట్టుఁడు, కుమారిలభట్టు అనుపేరులు గలవారు. మయూరవర్మచేఁ దేఁబడిన బ్రాహ్మణులు భట్టాచార్యులశిష్యు లగుటంజేసి యాంధ్రులే; కుమారిలుఁ డాంధ్రుఁడే యని యాంధ్రుల చరిత్రము మున్నగు గ్రంథములందుఁ గలదు. భట్టపాదులశిష్యు లాంధ్రులు నాంధ్రేతరులును గూడ నుండవచ్చును. భట్టపాదుల కాలముననే శంకరు లద్వైతము స్థాపించిరి ......భట్టపాదుల కాలముననే మయూరవర్మ బ్రాహ్మణులను దీసికొనిపోయెను. అట్లు కానిచో భట్టాచార్యుని మరణసమయమున దర్శించిన శంకరులు భట్టాచార్యులవారి శిష్యులలో నుండి యుద్భవిల్లుట సంభవింపదు. భట్టపాదశంకరు లేకకాలమున నున్నట్లు చెప్పుచున్నారు.

పైని వ్రాసిన యంశములను బట్టి మళయాళమందలి బ్రాహ్మణులును వారిలోనుండి యవతరించిన శంకరులును 'ఆంధ్రులు' అనుట స్పష్టము. ఇందువిషయమై యితర పండితుల వ్రాఁతల నిచ్చుచున్నాను.

'దక్షిణయిండియా వర్ణములు—తెగలు' అను గ్రంథము 7 సంపుటములుగా మద్రాసు దొరతనమువారిచేఁ బ్రచురింపఁబడెను. అందు మళయాళ (కేరళ) దేశబ్రాహ్మణులను గుఱించి యిట్లు వ్రాయఁబడెను.

1. 'బ్రాహ్మణులయొక్క లిఖితము లైనకొన్ని గ్రంథములలో కదంబ వంశజుఁ డైన మయూరవర్మ కాలమున నాంధ్ర బ్రాహ్మణులు కొందఱు దక్షిణ కన్నడమునకుఁ దీసుకొని పోఁబడి రని చెప్పఁబడి యున్నది.

2. బ్రాహ్మణుల కాలగణన ప్రకారము మయూరవర్మ క్రీ. పూ. 455 మొదలు 445 వరకు రాజ్యము చేసెను.

3. పరశురాముని శాపానంతరము కదంబవంశములోని మయూర వర్మ అహిక్షేత్రమునుండి తూలుబ్రాహ్మణులను తీసికొని వచ్చు వఱకును నాదేశమునందు బ్రాహ్మణులు లేరు.

4. ప్రస్తుతమందున్న తూలుబ్రాహ్మణులను మయూరవర్మ తీసుకొని వచ్చె ననిచెప్పుటలో సాంప్రదాయిక కథ లన్నియు నేకీభావము వహించుచున్నవి.

5. ఉత్తరకన్నడములోని బనవాసి రాజధానిగా రాజ్యము చేసిన కదంబవంశమునకు మూలపురుషుడు మయూరవర్మ యని శాసన ములు చెప్పుచున్నవి.

6. గోదావరీతీరమందున్న యహిక్షేత్రమునుండి బ్రాహ్మణులు తీసి కొనిరాబడి రని చెప్పబడుచున్నది.

7. నంబూతిరీలును వీరి సంప్రదాయకథలును మయూరవర్మ వఱకును బోవును.

8. మయూరవర్మచే బ్రాహ్మణులు కొనిరాబడినప్పుడు వారు భట్టా చార్యులవారి శిష్యులగా నెంచబడిరి. కాని పడమటితీరమునకు వీరు వచ్చినవెంటనే మళయాళదేశపు వేదాంతగురువగు శంకరా చార్యులవారి సిద్ధాంతముల నంగీకరించిరి.

పైగ్రంథముననే యయిదవ సంఘటమున సుబ్రహ్మణ్యఅయ్యరుగా రిట్లు వ్రాయుచున్నారు.

9. కేరళమాహాత్మ్యములో వ్రాయబడిన దంతకథాపరంపర నంబూ తిరీ లహిక్షేత్రమునుండి వచ్చినట్లుగా జెప్పును. ఈపై పేర్కొన బడిన 9 స్థానములలోని యుదాహృతవాక్యములు కేరళమాహా త్మ్యము, కేరళోత్పత్తియను సంస్కృత గ్రంథములనుండి గ్రహింప బడినవి.'

మయూరవర్మ, భట్టాచార్యులవారు, శంకరాచార్యులవారును ఆంధ్రులని నేనొక్కడనే వ్రాయుటలేదు. ఆంధ్రమహాసభ వారిచే

ప్రచురింపఁబడిన 'ఆంధ్రప్రచలనము' అను చిన్నగ్రంథమున ప్రథమాంధ్ర సభానంతరము కాఁబోలును ప్రచురింపఁబడెను. మఱికొన్ని దంతకథలును పై విధముననే చెప్పుచున్నవి".

ఈవిమర్శనమునుబట్టి శ్రీశంకరభగవత్పాదు లాంధ్రు లనియు నందు గోదావరీమండలమువా రనియు తేలినది. సంస్కృతశంకరవిజయములం దన్నింటిలోను కేరళదేశీయుఁ డని యున్నది. శంకరులు జన్మించునాఁటికి వారికుటుంబ మచ్చట స్థిరపడియుండవచ్చును. ఆ హేతువున స్థూలముగాఁ గేరళుఁ డని కావ్యకర్తలు వ్రాసియుందురని తోఁచుచున్నది.

శ్రీ శంకరులకాలమును గూర్చి ప్రాచ్యపాశ్చాత్యసిద్ధాంతములు బహుముఖములుగా నున్నవి అందలిసత్యాసత్యములు చరిత్రవేత్తలకు వదలి యుపలబ్ధ మగునొకటి రెండు నిర్ణయములనుమాత్రము చూపింప యత్నింతును. జ్యోతిశ్శాస్త్రవేత్తల పారంపరికసిద్ధాంతము- శ్రీ శంకరుల యవతారకాలము 2019 సంవత్సరములనాఁ డని పంచాంగములందుఁ గనఁబడుచున్నది. దీని ననుసరించి క్రీ. పూ. 72 సంవత్సరములనాఁడు శంకరజనన మని తేలుచున్నది. శ్రీకర్లపాలెము వెంకట నారాయణగారి నిర్ణయము ప్రకారము శ్రీశంకరుల జననము క్రీ. పూ. 509. బ్రహ్మలోకప్రాప్తి క్రీ. పూ. 477 సంవత్సరములనాఁడును జరిగిన వని తెలియవచ్చుచున్నది. ఇట్లు బహువిధములఁ దెలుపఁబడుచున్నకాలమును గూర్చినవిమర్శనభారము చరిత్రజ్ఞులకుఁ దొలుతనే సమర్పించియుంటిని. శ్రీశంకరులదేశమును గూర్చి మాత్రము పైని జూపఁబడిన సిద్ధాంతముల ననుసరించి గోదావరీమండలమునుండి మళయాళమునకు భూపాలకులచే నాహూతులైన యాంధ్రబ్రాహ్మణ కుటుంబమువారు కావునఁ దాత్కాలికముగాఁ శ్రీశంకరులు కేరళదేశమువారు కావచ్చును.

శ్రీశంకరుల దేశకాలనిర్ణయప్రసంగము నింక వదలి యాచార్యులవార యవినశ్వర యశఃకర్పూరసుగంధుల మగు నాంధ్రశంకరవిజయమును గూర్చి కొంచెము ప్రసంగింతును.

2. బ్రాహ్మణుల కాలగణన ప్రకారము మయూరవర్మ క్రీ. పూ. 455 మొదలు 445 వరకు రాజ్యము చేసెను.

3. పరశురాముని శాపానంతరము కదంబవంశములోని మయూర వర్మ అహిక్షేత్రమునుండి తూలుబ్రాహ్మణులను తీసికొని వచ్చు వఱకును నాదేశమునందు బ్రాహ్మణులు లేరు.

4. ప్రస్తుతమందున్న తూలుబ్రాహ్మణులను మయూరవర్మ తీసుకొని వచ్చె ననిచెప్పుటలో సాంప్రదాయిక కథ లన్నియు నేకీభావము వహించుచున్నవి.

5. ఉత్తరకన్నడములోని బనవాసి రాజధానిగా రాజ్యము చేసిన కదంబవంశమునకు మూలపురుషుఁడు మయూరవర్మ యని శాసన ములు చెప్పుచున్నవి.

6. గోదావరీతీరమందున్న యహిక్షేత్రమునుండి బ్రాహ్మణులు తీసి కొనిరాఁబడి రని చెప్పఁబడుచున్నది.

7. నంబూతిరీలును వీరి సంప్రదాయకథలును మయూరవర్మ వఱకును బోవును.

8. మయూరవర్మచే బ్రాహ్మణులు కొనిరాఁబడినప్పుడు వారు భట్టా చార్యులవారి శిష్యులుగా నెంచఁబడిరి. కాని పడమటితీరమునకు వీరు వచ్చినవెంటనే మళయాళదేశపు వేదాంతగురువగు శంకరా చార్యులవారి సిద్ధాంతముల నంగీకరించిరి.

పైగ్రంథముననే యయిదవ సంఘటమున సుబ్రహ్మణ్యఅయ్యరుగా రిట్లు వ్రాయుచున్నారు.

9. కేరళమాహాత్మ్యములో వ్రాయఁబడిన దంతకథాపరంపర నంబూ తిరీ లహిక్షేత్రమునుండి వచ్చినట్లుగాఁ జెప్పును. ఈపై పేర్కొన బడిన 9 స్థానములలోని యుదాహృతవాక్యములు కేరళమాహా త్మ్యము, కేరళోత్పత్తియను సంస్కృత గ్రంథములనుండి గ్రహింపఁ బడినవి.'

మయూరవర్మ, భట్టాచార్యులవారు, శంకరాచార్యులవారును ఆంధ్రులని నేనొక్కఁడనే వ్రాయుటలేదు. ఆంధ్రమహాసభ వారిచే

ప్రచురింపఁబడిన 'ఆంధ్రప్రచలనము' అను చిన్నగ్రంథమున ప్రథమాంధ్ర సభానంతరము కాఁబోలును ప్రచురింపఁబడెను. మఱికొన్ని దంతకథలును పై విధముననే చెప్పుచున్నవి".

ఈవిమర్శనమునుబట్టి శ్రీశంకరభగవత్పాదు లాంధ్రు లనియు నందు గోదావరీమండలమువా రనియు తేలినది. సంస్కృతశంకరవిజయములం దన్నింటిలోను కేరళదేశీయుఁ డని యున్నది. శంకరులు జన్మించునాఁటికి వారికుటుంబ మచ్చట స్థిరపడియుండవచ్చును. ఆ హేతువున స్థూలముగాఁ గేరళుఁ డని కావ్యకర్తలు వ్రాసియుందురని తోఁచుచున్నది.

శ్రీశంకరులకాలమును గూర్చి ప్రాచ్యపాశ్చాత్యసిద్ధాంతములు బహుముఖములుగా నున్నవి. అందలిసత్యాసత్యములు చరిత్రవేత్తలకు వదలి యుపలబ్ధ మగునొకటి రెండు నిర్ణయములనుమాత్రము చూపింప యత్నింతును. జ్యోతిశ్శాస్త్రవేత్తల పారంపరికసిద్ధాంతము- శ్రీ శంకరుల యవతారకాలము 2019 సంవత్సరములనాఁ డని పంచాంగములందుఁ గనఁబడుచున్నది. దీని ననుసరించి క్రీ. పూ. 72 సంవత్సరములనాఁడు శంకరజనన మని తెలుచున్నది. శ్రీకర్లపాలెము వెంకట నారాయణగారి నిర్ణయము ప్రకారము శ్రీశంకరుల జననము క్రీ. పూ. 509. బ్రహ్మలోకప్రాప్తి క్రీ. పూ. 477 సంవత్సరములనాఁడును జరిగిన వని తెలియవచ్చుచున్నది. ఇట్లు బహువిధములఁ దెలుపఁబడుచున్న కాలమును గూర్చినవిమర్శనభారము చరిత్రజ్ఞులకుఁ దోలుతనే సమర్పించియుంటిని. శ్రీశంకరుల దేశమును గూర్చి మాత్రము పైని జూపఁబడిన సిద్ధాంతముల ననుసరించి గోదావరీమండలమునుండి మళయాళమునకు భూపాలకులచే నాహూతులైన యాంధ్రబ్రాహ్మణకుటుంబమువారు కావునఁ దాత్కాలికముగాఁ శ్రీశంకరులు కేరళదేశమువారు కావచ్చును.

శ్రీశంకరుల దేశకాలనిర్ణయప్రసంగము నింక వదలి యాచార్యులవారి యవినశ్వర యశఃకర్పూరసుగంధిల మగు నాంధ్రశంకరవిజయమును గూర్చి కొంచెము ప్రసంగింతును.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం" అనిన కృష్ణపరమాత్మసూక్తి చొప్పున సనాతన మగు వేదధర్మమునకుఁ గంటకమై బౌద్ధ, జైనాది మతకదంబము విజృంభింప దానియౌద్ధత్యము పోఁగొట్టి మరల వేద ధర్మము ప్రతిష్ఠింప భగవంతుఁడు శంకరాచార్య రూపమునఁ బొడమె ననువిషయమున విప్రతిపన్నులగు మనుజమాత్రులు లేరనవచ్చును. ప్రాచీనులందఱు 'ధర్మరక్షణార్థము శివుని దేవతలెల్లరు ప్రార్థింప నాపర మేశ్వరుఁడు భూలోకమున శంకరాచార్యుఁడై పుట్టె' ననిరి. అర్వాచీనులు విజ్ఞానము ననుసరించియు, నయ్యనఘుఁడు చేసిన 'యలౌకిక కార్య కలాపము ననుసరించియు భగవదవతార' మనిరి.

ముప్పదిరెండేండ్ల జీవితములో సకలవేదములు, సర్వశాస్త్ర ములు, పురాణములు పఠించి ప్రయాణసౌకర్యములు లేనియానాఁడు పాద చారియై యాసేతు హిమాచలము పర్యటించి సర్వమతములను ఖండించి, యద్వైతమతము నెలకొల్పి నాఁటి రాజేంద్రుల నందఱను శిష్యులుగాఁ జేకొని స్వమతవ్యాప్తికిని, తదీయ సంరక్షణమునకును శృంగగిర్యాదిక్షేత్రములందు మఠములను నెలకొల్పిన శ్రీశంకరభగవ త్పాదుని బరమేశ్వరావతార మనక మనుష్యసామాన్యుఁడని యెవ రనఁగలరు? అట్టి మహనీయుని పరమపవిత్ర చరిత్రమే శంకరవిజయ కావ్యమునంగలి వస్తువు. సంస్కృతభాషయం దీచరిత్రము పెక్కురు కవులచే బహువిధములుగా రచింపఁబడి శంకరవిజయ మనియు శంకర విజయవిలాసమనియు, శంకరవిజయ డిండిమ మనియు,శంకరమందార సౌరభమనియు, శంకరాభ్యుదయమనియు నింక నేవేవియో వివిధనామ ములతో విరాజిల్లుచున్నది. ఆమహానుభావునియెడఁ గల భక్త్యతి శయమునఁ బరవశులై యాకవిచంద్రులు నోరార నన్నివిధములఁ గీర్తించిరి. కావుననే శంకరుల యుదంతము లోకమున స్థిరరూపమున వెలసెను. ఆ కావ్యముల ననుసరించియే సంస్కృతభాష రాని భార తీయులకందఱకు జగద్గురుచరిత్రము తెలియఁజెప్పు కుతూహలముతోఁ దమతమ కవితానైపుణి మెఱయ దేశభాషాకవులు స్వభాషలలోనికిఁ బరివర్తనము కావించి శ్రీశంకరుల యలౌకమహిమము వెల్లడించుచు వచ్చిరి.

అం దాంధ్రభాషయం దింతకు మున్ను పెక్కురు కవీశ్వరులు శ్రీ శంకరులచరిత్రము గద్యరూపమునను బద్యరూపమునను బరివర్తించియు స్వాతంత్ర్యము మెఱయ రచించియుఁ జరితార్థులైనారు. అట్టిరచన లనేకము లున్నను నేఁ డీశంకరవిజయమును మరలఁ దెలుఁగున నీగ్రంథకర్త రచించుట చర్వితచర్వణ మగు నని మాత్ర మనుకొనఁ దగదు. "దా నద్వైతమతస్థుఁ డగుటయుఁ దన్మతోద్ధారకు లగు జగద్గురుల పుణ్యయశము కీర్తించి తనకవితాశక్తి నన్వర్థము నొనర్చుకొనఁ దలంపు గలుగుటయుఁ గారణములుగా నీగ్రంథ రచనకుఁ బూనుకొంటి"నను గ్రంథకర్త విన్నపమున దెలిపికొని యుండెను. దానికిఁ దోడు మహోదారులును, శ్రీశంకరమఠ ప్రతిష్ఠాపనాది పుణ్యకార్య నిరతులును, బరమ శాంతులును, నిరంతర రామభక్తినిశాంతులును, నిర్గర్వచూడామణులును, భాషాపోషకులును, సంపన్నులు నగు శ్రీ మదీదర వేంకటరావు పంతులుగారు సహజౌదార్యము మెఱయ నేతత్కవికి గృహనిర్మాణమునకై వలయుధనమునుఁ బారితోషికముగా నొసంగి తమయిష్టదైవత మగు శ్రీరామచంద్రున కంకితముగా నీగ్రంథము నొసంగఁ గోరుట శీఘ్రరచన కుద్బోధక మైనది. కావ్యముగా నిట్టిమహాపురుషచరిత్రము రచియింప నమేయముగా ధనము వెచ్చించియుఁ దమపేర నంకిత మైనను గోరక రామార్పణము సేయఁ బ్రేరించిన శ్రీ పంతులుగారి యనితరసాధారణ సుగుణము వర్ణనాతీతము గదా! అహంకార మమకారములకు మనస్సునఁ డావీయని మహాత్ము లీకాలమందును గల రనుటకు శ్రీ పంతులుగారు గొప్ప దృష్టాంతము. శ్రీ పంతులుగారి సుగుణగణములు గ్రంథకర్త చే మనోహరముగ వర్ణింపఁ బడినవి. అది యంతయు స్తుతిమాత్రము కాదని ప్రాజ్ఞులు గ్రహింపదగును. ఇట్టి గ్రంథకర్త లెందఱెన్నివిధముల వర్ణించినను శ్రీ పంతులుగారి గుణగణములు మిగిలిపోవక యుండ వని నా నమ్మకము. పరిశుద్ధాంతఃకరణమున నిట్టిమహోత్కృష్ట కావ్యము వెలయించిన శ్రీపంతులుగారును వారి పుత్రపౌత్రులును నిటువంటి యాంధ్రభాషకు, నటువంటి హైందవ మతమునకును సువర్ణభూషాయమానము లగు బహు గ్రంథము లు వెలయ నింకను బ్రోత్సాహమిచ్చి శాశ్వత యశస్సును జన్మసాఫల్యమును బడయుదురు గాక!

ఆంధ్ర శంకరవిజయము.

శంకరవిజయ మనుపేర నాంధ్రమునఁ బెక్కు కావ్యములింతకు ముందే కల వని తెలిపి యుంటిని. ఏతత్కావ్యము మరలఁ దలనూపుటకు నూత్నత యిం దేయించుకైనను గలదా యని పరిశీలింప వచ్చుటచ్చుటఁ గథాసంవిధానమున నవీనత లేకపోలేదు. ఆ నవీనత యెంత వఱకు సమంజసమో యించుక పరిశీలింతము. పరమేశ్వరావతారమే యని ప్రాచీనులును లోకోత్తరపురుషుఁడని వైదేశికులును దత్సిద్ధాంతానుయాయులగు నాధునికులును స్తుతియింపఁ, బ్రఖ్యాతు లగు శ్రీశంకరాచార్యులయెడ ననూయువులై మతాంతరు లారోపించిన కళంకములు పోఁకనియ ట్లీగ్రంథకర్త పెక్కుతావుల రచన సాగించెను. మాధవ విద్యారణ్యకృత మని విఖ్యాతి గాంచిన శంకరవిజయమునే యాధారముగాఁ జేసికొని యీగ్రంథకర్త రచన సాగించినను నౌచిత్యము దృష్టియం దిడుకొని కథాసంవిధానమున నక్కడక్కడ మార్పులు చేసెను. ఆమార్పులు కొన్ని విద్వజ్జనులకుఁ దెలుపుభారము నామీఁద నున్నది కాన మున్ముం దయ్యది నెఱవేర్తును.

భూమండలమున నాస్తికమత విజృంభణముచే వేదధర్మము లుప్తప్రాయమ్మై, యధర్మ మభ్యున్నతి చెందఁగా దేవత లెల్లఁ గైలాసమున కేఁగి పరమశివుని ధర్మరక్షణకై వేఁడుకొనఁగా, నక్కార్యమునకై తానే కాలటియందు శంకరాభిఖ్యతోఁ బొడమి జగము నుద్ధరింతు నని యభయ మొసంగిన ఘట్టము నీకవి తీసికొనక కాలటి యను నగ్రహారము గల దనుకథతో నారంభించి శంకరు లీశ్వరావతార మని వాచ్యముగాఁ బలుకక, తన్మహిమములు చెప్పఁబడు ఘట్టంబులం దెల్ల సూచించుచుఁ దుట్టతుదిఘట్టమునఁ బరమశివ స్వరూపముగాఁ బరిణమించిన ట్లద్వైతమతానుసారముగా నిరూపించెను. పతితల కీసంవిధానమున శంకరుఁడు మొదట మనుజమాత్రుఁడుగా గన్పట్టి, యలోకమహిమలచే భగవంతుఁడేమో యని సందేహముకలిగించి, క్రమక్రమముగా నీశ్వరుఁ డనువిశ్వాసము నెలకొల్పి తుద కద్భుతముగా మహాదేవుఁడై శరీరము పులకింపఁ బ్రత్యక్షమైన ట్లు తోఁపకమానఁడు. ఈ మార్పునఁ గల యౌచిత్యము నుత్యము. శంకరునిది యనూచానులగు పండితులకు

జనకమగు విప్రవంశ మనియుఁ దలిదండ్రులు తపశ్శీలు లనియు వారి యీశ్వరారాధన మహిమవలన శంకరుఁడు జనించె ననియు మొదట సామాన్య మనుజ బాలకునిగా వర్ణించి క్రమముగాఁ దపము స్వాధ్యాయముఁ బడసి యలౌకికమహిమ లొందె నని మొదటి యాశ్వాసము నందలి కథ. మూలమున శంకరుని జనకుఁ డగు శివగురునకుఁ బరమ శివుఁడు ప్రత్యక్షమై యాయుష్మంతులును గుణహీను లగు పెక్కురు పుత్రులు గావలయునా? అల్పాయుష్కుఁడును సుగుణరాశియు నగు నొక్కపుత్రుఁడుగావలయునా? యని యడిగినట్లును, స్వల్పాయువైనను, గుణవంతుఁ డగునొక్కపుత్రుఁడే కావలయునని యాయన కోరినట్లును గలదు. ఆకథను శివగురువకు స్వప్నమున-నిరంతరధ్యాన మొనర్చు శివుఁడే కానవచ్చి మామిడిపం డిచ్చినట్లును దానిని జేతఁ బుచ్చుకొని పై కెత్తుచుండఁ గ్రిందఁబడి రసము నలువంకలఁ బ్రవహింప భిన్నమై నట్లును మార్పఁబడినది. ఈమార్పు మనుజ జీవితములందు సామాన్యము గావున రమణీయముగా నున్నది. పైమూలమునందలికథవంటివి యనేకములు పురాణేతిహాసములందుఁ గలవు. అయ్యవి యనుకరించి నట్లాకథ చదువునపుడు స్ఫురింపకమానదు. మూలస్థ మగుకథ యథార్థమే కావచ్చును అయినను మనుష్యసామాన్యముగా స్వప్నమునఁదద్విషయ మంతయు ధ్వనింపఁజేయుట సరస మని రసజ్ఞులు మెచ్చక పోవరు. తండ్రి మరణించినపుడు శంకరుఁడు తల్లిని జేరి శివునయ్యాను బోధునివలె వైరాగ్య ముపదేశించుట యారయ, సహజవైరాగ్య సంపన్నుఁ డగు ప్రహ్లాదునిచరిత్రము స్మృత మగును. ఈభాగము మూలమున లేని దయ్యు భావికథకు సూచకమై సముచితముగా నున్నది వేదాభ్యాస కాలమున దరిద్రబ్రాహ్మణికి లక్ష్మి నొసంగుకథ కొన్ని శంకర విజయములందుఁ గానరాదు. మాధవ శంకరవిజయమునఁ గలదు. అందలి కథాంశము మాత్రమే యీగ్రథకర్త గైకొని యయ్యది వేదాధ్యయనకాలము కావున శ్రీసూక్తస్తవ మహిమవలన లక్ష్మి ప్రసన్నురా లగునట్లు రచించుట యెంతయు నౌచిత్యాధాయకమును, శాస్త్రసమ్మతమునై విలసిల్లుచున్నది. వేద మంత్రమే దేవతాస్వరూప మను పూర్వమీమాంసామతము వ్యజ్యమానమగుచున్నది గాదా!

రెండవయాశ్వాసమునఁ బూర్ణానదిని జననికొరకై శంకరుఁడు తనమహిమచే గృహసమీపమునకుఁ దెచ్చె ననుకథ. ముందు తన్ను గురుపదంబుగాఁ బూజించు కేరళదేశరాజునకు శ్రోత్రియుఁడగు తన యెడలఁగల గౌరవమును బురస్కరించుకొని యానదీశాఖ యొకటి తన గృహముచెంత కారాజు రప్పించె నని మార్పఁబడెను. ఈగాథ యం దానాఁటిప్రభువులెట్టి యసాధ్యమగు వాంఛితార్థముల నైన నొసంగి పండితలోకమును రక్షించు చుండువారనియు, పండితులు గూడ నిస్పృహులై యుండువా రనియుఁ బ్రస్ఫుట మగుచున్నది. ఇంతదాఁక బ్రహ్మచర్యవ్రతస్వరూపమును, వేదమహిమయుఁ బ్రత్యక్ష రమునను వ్యక్తమగుచుండును.

శంకరుఁ డల్పాయుష్కుఁ డని యగస్త్యాది దేవర్షులు వచ్చి యార్యాంబతోఁ జెప్పినట్లును, నామె దుఃఖించుచుండ శంకరుఁడు వైరాగ్య ముపదేశించినట్లును మూలమున నున్నకథ నీగ్రంథకర్త మిగుల రసవంతముగను, నౌచితీభరితముగను శంకర విరక్తికిని, సంన్యాసజిఘృక్షకు నుపోద్ఘాతముగను, సామాన్యమనుజజీవితమునందలి సంఘటనలకుఁ బోలికగను రచించెను.

వృద్ధ యగునార్యాంబ శంకరుని బెండ్లాడు మనఁగా, నాయన మృదు ఫణితి నిరాకరించును. ఏమియు ననలేక తల్లి యూర కుండును. కన్యల నిచ్చెదమని పెక్కురు సజాతీయులు వచ్చిపోవుచుండిరి. ఒకనాఁ డొకవిప్రుఁడు శంకరునకుఁ దనపుత్రిక నీయఁదలఁచి బంధువుల వెంటనిడుకొని యార్యాంబ కాసంగతి తెలిపి యామె యనుమతిపై బ్రహ్మచారులకు విద్యలఁ గఱపుచున్న శంకరుని గాంచ వచ్చి యాతఁ డప్పటికిఁ జెప్పుచున్న ప్రబోధసుధాకరమందలి కాంతా గర్హణము విని విముఖుఁడై యార్యాంబను గాంచి జరిగినసంగతి చెప్పి శంకరుని జాతక మామెవలనఁ గొని యరచుచుండఁ దోడివారిలోని యొకదైవజ్ఞుఁడు శంకరునకు నాయు వల్పమని చెప్పెను. తోడనే వా రందఱు నిరాశులై వెడలిరి. ఆమాటవిని ఆర్యాంబ విలపించుచుండ శంకరుఁడు వచ్చి దుఃఖకారణ మెఱిఁగి "యమ్మా! మరణము దేహికి సహజ" మని విరాగవచనముల నుద్బోధించి యమృతత్వము సంన్యా

సమునఁ గాని లభింపదని కైవల్యోపనిషదర్థ మెఱిఁగించి "సంన్యసింప ననుజ్ఞ" నిమ్మని వేఁడుకొన నామె మఱింత దుఃఖింప సాంత్వనవాక్యముల నూరార్చెను. ఇందలి యౌచిత్యమును బూర్వోత్తరవిరోధాభావమును మెచ్చఁదగియున్నది.

ఇఁక సంన్యాస స్వీకారఘట్టమునఁ దల్లి యనుమతి పొందక సంన్యసింపరా దనుశాస్త్రాచారసిద్ధాంతము దొలఁగించుటకును బ్రవాహ రూప మగుకథ మఱుఁగుపడకుండునట్లును నార్యాంబకు స్వప్నము గల్పింపఁబడెను. అందు శంకరుఁడు మకరాకృష్టుఁడై యేటిలో మునిఁగి పోవుచు నెట్టకేలకుఁ దల్లియనుమతి పొందినట్లు చిత్రింపఁబడిన భాగము 'యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్తను' శ్రుతికవిరుద్ధముగాను, లోకమర్యాదానుసారముగాను జక్కగ ఘటింపఁబడినది. సంన్యాస ఘట్టమున మూలము ననుసరించుచు నందులేని మహావాక్యచతుష్ట యము పంచదశి ననుసరించి పద్యములందు వివరింపఁబడినది. ఆమహా వాక్యములు సూత్రభాష్యరచనకు నెట్లు బీజము లయ్యెనో వివరింపఁ బడినవి.

మూఁడవ యాశ్వాసమున నర్మదానది పొంగినపుడు శంకరుఁడు తన కమండలువున నింపె ననుకథ యణిమాదులలోని వశిత్వవిభూతి సిద్ధికి స్ఫోరకము. ఈయుపపత్తి మూలమున లేనిది.

శివుఁడు మాలనిరూపమునఁ గనఁబడినకథయం దద్వైతభావ పరీక్షకై శివుఁ డట్లు శంకరునియాంతర దృష్టియందే కన్పట్టె ననుట యెంతయు నుచితముగా నున్నది. సనందనుఁడు పద్మపాదుఁడైనకథ యందు లఘిమసిద్ధి బలమునఁ బద్మపంక్తిపై నడచి వచ్చెనని మూల మున లేకున్నను లఘిమసిద్ధి హేతువుగాఁ జెప్పుట యుక్తముగా నున్నది. దీనివలన యోగశాస్త్రసత్యత్వము ధ్రువపడుచున్నది. 'మన కనుభవము లేని' వని యిట్టివానిని ద్రోసిపుచ్చినచో యోగశాస్త్రము నకు వైయర్థ్యము తప్పదు. ఉపరి శాస్త్రమును ధిక్కరించిన యప రాధము పైఁబడక మానదు.

తరువాత వ్యాసశంకర వాదఘట్టము. 'వ్యాసుఁడు కలిద్వాపర సంధి యందలివాఁడు. శంకరుఁడు కలియుగము కొంతగడచినతరువాతి

కాలమువాఁడు. ఈ యిద్దఱకు వాద మెట్లని కొందఱు శంకించు చున్నారు. వారిమతమునఁ బురాణములు ప్రమాణములే యగుచో శంక కవకాశములేదు. ఆంగ్లభాషాకోవిదులు వ్యాసుఁడను నామము బిరుదమనినారు; కావచ్చును. కృష్ణద్వైపాయనుఁడనునది బిరుదము కాదు గదా! అతఁడు చిరంజీవులలో నొక్కఁడని మఱువరానిది. చిరంజీవియే యగుచో నేలకానరాఁడని గ్రంథకర్త పద్మపాదునిముఖమున శంకించి, జ్ఞానతారతమ్యమువలనఁ గనఁబడుటయుఁ గనఁబడకుండుటయుఁ గలుగునని, దృష్టాంతపూర్వకముగా స్థిరపఱచుట రమ్యమును యుక్తిసహమునై యొప్పుచున్నది. వ్యాసశంకర సంవాదమున మూలమును వ్యాఖ్యయు జోడించి శాస్త్రానుసారముగ వాదమంతయు గద్యమున రచించుటచే భావ మంతయుఁ దేటతెల్ల మగుచున్నది.

చతుర్థాశ్వాసమందలి కుమారిలభట్టు చరిత్రమున మూలమునకు భిన్నముగఁ బెక్కుమార్పులు చేయఁబడినవి. చరిత్రల నాధారముగాఁ గొని కాబోలు మూలమున లేకున్నను భట్టపాదుఁ డుత్కలాంధ్ర దేశముల సంధియందలి జయమంగళ మను గ్రామమున జన్మించె ననియు, నాంధ్రుఁ డనియు, గ్రంథకర్త తనయాంధ్రాభిమానము ప్రకటించెను. అందుఁ గుమారిలునికీర్తి కేపాటికళంకము సోఁకకుండ మూలమందలి పరస్పరవిరోధములను బరిహరించి వన్నె పెట్టెను. గురుఁడు మేడనుండి నిద్రితుఁ డగు తన్నుఁ ద్రోయింప భూమిపైఁ బడునప్పుడు "వేదము ప్రమాణమే యగు నెడల నేను జావకుందును గాక" యని భూమిపైఁ బడి వేదమహిమచే బ్రతికియు "ప్రమాణ మగు నెడల" యను సంభావనార్థక ప్రయోగమువలన నొకకన్ను పోఁగొట్టుకొన్న కుమారిలుడు రాజుకోరికపై గొండనుండి భూమి కుఱుకుచు "వేదమే ప్రమాణ మగు నెడల" యని మరల సంభావనార్థక ప్రయోగము గావించియు నేహానిని బొందలే దనుట విరుద్ధము కాదా ? ఆ భాగమున 'వేదము ప్రమాణము కావున నాకేహానియుఁ గలుగ' దనుదృఢనిశ్చయముతోఁ గొండనుండి క్రిందఁబడి యక్షతదేహుఁడై వేదమహిమను బ్రకటించె ననుమార్పు సమంజసముగా నున్నది. మఱియు "జైన మత రహస్యముఁను జెప్పిన గురువు మరణమునకుఁ దానే కారకుఁడ" నని గురువధపాపము తొలఁగఁ దుషాగ్నిప్రవేశరూప ప్రాయశ్చిత్తము

చేసికొన్నట్లు మూలమునఁ గల కథయందు— గురువధ కాతఁడు కర్త కాఁడనియు నాతఁడొనర్చు తుషాగ్ని ప్రవేశము వ్రతము కాని ప్రాయశ్చిత్తము కాదనియు స్మృతిసమ్మతముగ నిర్ధరించిన మార్పు మిగుల నుచితముగా నున్నది.

అనంతరకథ మండనమిశ్రునిది. ఈ ఘట్టమున మండనశంకరుల 'కుతో ముండ్యాగళా న్ముండీ' యని యారంభింపఁబడిన ప్రశ్నోత్తర పరంపర యీ యిరువురకు ననుచితముగా నుండు నని కాంబోలును మండనశంకరుల శిష్యులనుకొన్నట్లు మార్పఁబడినది. మండనునంతటి మహాపండితుఁడు శంకరునంతటి మహనీయుఁడు తనయింటికి రాఁగా నిష్టమున్నను లేకున్నను నట్లు నీచాతి నీచముగా 'నీతల్లిముండ' మున్నగు రీతిని దూషించె ననుట యీ రెండు పాత్రములకుఁ గళంకమే కదా! ఇఁక మండనుఁడు సంన్యాసి మొగమును జూడఁడఁట. శ్రాద్ధభోక్తలుగ వ్యాసజైమినులను వర్ణించు చున్నాఁడఁట. వీరు సంన్యాసులు కారా? జైమిని తనకు సమ్మతుఁడైనను శంకరునివలెనే వేదాంతి యగు వ్యాసుఁడు ప్రతికూలుఁడు గదా! అట్టివాని నెట్లు మండనుఁడు నిమంత్రణము చేయును? వ్యాసజైమినులు మండనశంకరుల వివాదమును వినుచు నూరక యుండినారా? సూత్రభాష్య పరీక్షకై శంకరునొద్దకు వృద్ధబ్రాహ్మణ రూపమున వచ్చిన వ్యాసుఁడు 'స్వస్వరూపమున గాన్పింపు' మని శంకరునంతవాఁడు వేఁడుకొనఁగా నిజరూపమునఁ దోఁచిన వ్యాసుఁడు, నేఁడు మండనునింటికి శ్రాద్ధభోక్తగా వచ్చినాఁడనుట యసంగతము. మీఁద మండనుఁడు వాదమునం దోడిపోయి తన పూర్వమీమాంసా మతమునకుఁ దీర్థకరుఁడైన జైమిని యాశయమును గూర్చి సందేహించుచుండ జ్యోతీరూపమున గోచరించి 'శంకరమతమే నామత' మని యంగీకరించిన జైమిని పెదవి మెత్తక వారిద్దఱికలహము వినుచు నూరకుండె ననుట మిగుల నసంగతముగా నున్నది. ఇచట 'కుతో ముం' డీత్యాది మండనశంకర నిందాపరంపర నీ గ్రంథకర్త పరిహసించినఁ లెస్సగా నుండెడిది. కాని సంస్కృత శంకరవిజయము లన్నిటియందు నుండుటయుఁ బండితలోకమున బహుప్రచలితమై యుండుటయు హేతువులు గావచ్చును. కాని మహాపురుషులగు మండనశంకరులనోట నీయశ్లీలములు పలికింపక

పారలశిష్యులచేఁ బలికించుట కొంత నయమనవచ్చును. ఇదటిమూల గ్రంథములవిరోధము పరిశీలింప నీకథ హేయమో యుపాదేయమో తెలియఁగలదు. మాధవశంకరవిజయమున జైమినివ్యాసులు భోక్తలనియున్నది. చిద్విలాసుని శంకరవిజయవిలాసమునఁ బితృస్థానమున వ్యాసుని నిలపి యర్చించుచుండఁ బాదుకాసిద్ధివిద్యాశక్తిచే నంతరిక్షమునుండి దిగి శంకరుఁడు తనంత దానె విశ్వేదేవస్థానమునందు నిలిచె ననికలదు. ఆనందగిరికృతశంకరవిజయమున వ్యాసుని మంత్రబలమున రావించి పితృస్థానమున నెలకొల్పి రెండవభోక్త లభింపక, విశ్వేదేవస్థానమున సాలగ్రామము నుంచి యర్చించుచుండఁగా, నాకాశవీథి నుండి శంకరుఁడు దిగె నని కలదు. మూఁడిఁటియందును మండనశంకరుల యశ్లీలసంభాషణము స్థూలముగనో సూక్ష్మముగనో యున్నది గాని లేకపోలేదు. ఏతదనురోధముచేఁ గాఁబోలు నీగ్రంథకర్తయు నాక్షేపసమన్వితనిందాభాగము విడువఁ జాలకపోయెను. కాని వ్యాస జైమినులను బరిహరించుట మాత్రము సత్యము.

పంచమాశ్వాసమున మండనపరాజయానంతర ముభయభారతితోడి శాస్త్రవాదఘట్టమునందు, శంకరుఁడు కామశాస్త్రమునఁ బ్రజ్ఞలేక యుభయభారతివలన గడువొంది యమరుకనృపాలుని మృతకళేబరమందుఁ బరకాయప్రవేశవిద్యాశక్తిచేఁ జొచ్చి శతాధికసంఖ్యాకలగు నాతని భార్యలతో నిష్టభోగములఁ బొంది కామశాస్త్ర మనుభవపూర్వకముగ నేర్చి వచ్చి యామెను జయించె నని యుపలబ్ధములగు నన్నిసంస్కృత విజయములందుఁ గనఁబడుచున్నది. ఈ కథ శంకరునకుఁ బరకాయప్రవేశవిద్య 'తెలియు' నని తదీయ యోగశక్తి ప్రకటింపఁ బుట్టియుండును పరిశీలింపఁగాఁ బూర్వోత్తరమీమాంసాశాస్త్రములందు వాదింపఁ బూనిన మండన శంకరుల వాదమునందుభయభారతి ప్రవేశించి కామకళలోఁ బూర్వపక్ష మొనర్చుట యనుచితము, నసంగతమును గాదా? శంకరుఁ డంత దోడిపోయిన మాత్రమునఁ గించిద్‌జ్ఞత కలుగు ననుట మఱియు నసంగతము. మండనశంకరుల ప్రతిజ్ఞలేమి? ఉభయభారతి పూర్వపక్షమేమి? ఒకవేళ శంకరుఁ డాకామకళ ము న్నెఱుఁగకున్నను సర్వజ్ఞుఁడు కావున నాశాస్త్రమందలి రహస్యములను బఠించి గ్రహింపఁ జాలఁడా? అనుభ

వము లేనిదే యాశాస్త్రము తెలియదా? ఈ రసాభాసము నంతయుఁ దొలఁగించుటకై యీ గ్రంథమునఁ జేయఁబడిన మార్పెంతయు నౌచిత్యాధాయకము. మీమాంస విడిచి కామకళయందు భారతి ప్రశ్నింప నవకాశము కల్పించుకొనుటకై యంతఃకరణ చతుష్టయ విమర్శమున మనస్తత్త్వ ప్రసంగముదెచ్చి, దానినుండి కామమును గూర్చినచర్చ, యందుఁడి స్త్రీపురుష జాతివిశేష ప్రసంగమును నేర్పుగాఁజేసినట్లు చూపి, యీ శాఖాచంక్రమము దోషమని శంకరునిచేఁ బలికించెను.

కాని సభానియమానుసారముగాఁ బ్రతివాదిని గాక యధ్యక్షురాలగు భారతిని గా దనుటకు వీలులేక పోయెనని శంకరుఁడు గడువు వేఁడి మండనుని గ్రంథాలయమునుండి కామకళా గ్రంథములు గొని దూరముననున్న కొండగుహఁజొచ్చి యా శాస్త్రమంతయు నధ్యయనించి పరకాయప్రవేశ విద్యచే నొకచిలుక మృతదేహమునఁ జొచ్చి శబరున కొకనికి దొరకిపోయి యుభయభారతి సన్నిధిని జేరుకొనెనని మార్పఁబడినది.

పూర్వమీమాంసామతము ననుసరించి వాదింతు ననియుఁ బ్రమాణము వేదము లనియు నోడినచో సంన్యాస స్వీకారము పణమనియు మండనుని ప్రతిజ్ఞ. "ఉత్తర మీమాంసామతము ననుసరించి వాదింతు ననియు, నుపనిషత్తులు ప్రమాణమనియు, నోడినచో సంన్యాసము విడిచిపెట్టుట పణ మనియు శంకరుని ప్రతిజ్ఞ. ఆ ప్రకారము వాదము జరుగఁగ మండనుఁ డోడిపోయెను. మండనుని పక్షము చేకొని భారతి వాదింపఁ బూనెను. ఆమెభర్త ప్రతిజ్ఞాప్రకారము పూర్వ మీమాంసానుసారము వాదింపవలసి యుండెను. ప్రసక్తానుప్రసక్తముగాఁ గామశాస్త్రమునకుఁ దోవఁ దీయుటచే సభానియమానుసారము భారతి పరాజిత యైనట్లేకదా! అయినను సభాధ్యక్షురాలగుటచే వాదియగు శంకరుఁ డామెను ధిక్కరింప నవకాశము లేమిఁ గా దనక యాశాస్త్ర మభ్యసింప గడువు కోరెను తనతప్పెరిగినది కావున భారతియు నంగీకరించెను. అటుపైని కామకళ నేర్చి చిలుక దేహమునఁ బరకాయ ప్రవేశవిద్యచేఁ జొచ్చుట యేల కల్పింపబడె

ననఁగాఁ:- పరకాయప్రవేశ మొనర్చునది కేవల శుద్ధాత్మమే యగునేని కర్తృత్వభోక్తృత్వములు లేక కర్మబంధముకలుగకుండును. లింగదేహముతోఁ జొచ్చినపుడచటికర్మములు కెట్లు జీవుఁడు బద్ధుఁడు కాకుండును? శ్రీ శంకరుఁడు పరకాయ ప్రవేశమున లింగశరీరముతోఁ జొచ్చిన ట్లానందగిరి శంకరవిజయమున "అమృతపుర మితి ప్రసిద్ధం కంచి త్పట్టణ విశేషం ప్రాప్య తత్రతౌ మృతే, తదీయదేహం చితిగతం జ్ఞాత్వా, తత్పురాంతిక కోటరే నిజదేహం సంస్థాప్య, పరకాయ విద్యాప్రపంచేన లింగశరీరమాత్రేణ చ సాభిమానో జీవ శ్చితిగతనృపతికళేబరనిష్ఠ బ్రహ్మరంధ్రం ప్రావిశత్ (౬౭అధ్యాయము.)అని కలదు. చిద్విలాసకృత విజయ విలాసమున కేవల మాత్మరూపమునఁ జొచ్చెనో లింగశరీరముతోఁ జొచ్చెనో మొదట జెప్పఁబడలేదు గాని మరల స్వశరీరమునఁ జొచ్చునపుడు మాత్రము. శ్లో। కలవింకాకృతి ర్భూత్వా తేజఃపుంజ దురీక్షణః। బ్రహ్మరంధ్రపథా దేవనిస్ససార తదాద్భుతం॰ ఇతస్తతః పరిచరన్ తనుం దృష్ట్వా చితోపరి" యనిలింగదేహముతో అమరకుని దేహమువిడిచి స్వశరీరమునఁ జొచ్చినట్లు కలదు మాధవశంకరవిజయమున 'మహిపస్య వర్ష్మగురు యోగబలో2 విశదాతివాహిక శరీరయుతః, (ఆతివాహికేన జ్ఞానేంద్రియ కర్మేంద్రియ ప్రాణమనోబుద్ధిరూపేణలింగశరీరేణ యుతః, వ్యాఖ్య.) అని లింగశరీరముతోఁ జొచ్చినట్లు కలదు లింగశరీరయుతుఁ డగుజీవుఁడు కర్మబద్ధుఁడు కావలసి వచ్చును కేవల శుద్ధాత్మమే యగునెడల నచటి కామకళారహస్యములను గ్రహించుటకు బుద్ధి యుండక పోవుటచే వ్యర్థప్రయాస మగును. లింగదేహముతో నేగి కామశాస్త్రము నేర్చివచ్చినపిదపఁ బరకాంతతో యత్యాశ్రమి యగు నాచార్యుఁడు సభయందుఁ గూర్చుండి యాశాస్త్రమున వాదించుట యెట్లు? ఇంతకంటె దుష్కృత్యము వేఱుండునా? దానిచే నవకీర్ణి కాకుండునా? ఈవిధమగు సర్వవిధ విరోధములు తొలఁగునట్లుగా మండనమిశ్రునింట సకలవిద్యలు నేర్చినశుకము లుండుట ప్రసిద్ధము గాన దాని కనువుగాఁ గీరదేహమునఁజొచ్చి శంకరు డుభయభారతి సన్నిధిచేరి, ప్రసంగవశమున నాపె చెప్పినతమవాదము విని కామకళయందు వాదించి ఇచట మధ్యవర్తి లేడని సపరివారముగా మండనుని నాయమను దనశరీరమున్న గుహయొద్దకుఁదెచ్చి నృసింహాస్తవ మొనర్చుచు శుకదేహము విడిచి

స్వదేహమునఁ జొచ్చెను. అని యీగ్రంథమునఁ జేసినమార్పంతయు సముచితముగాను ధర్మ్యముగాను నొప్పారుచున్నది.

అంతియే కాదు. ఉభయభారతి పాతివ్రత్యకథ వలనఁ బాతివ్రత్యమహిమ ముద్ఘాటింపఁబడినది. ఇచటి కథాసంవిధానము మెచ్చఁదగి యున్నది. స్త్రీలకుఁ బాతివ్రత్యమే తప మనియు 'తపసా దుష్కరం నాస్తి' యను సూక్తి చొప్పున భీష్మునకుఁబోలె స్వచ్ఛందమరణము కలిగె ననియు, నామె శరీరము విడిచి తేజోరూపమున శ్రౌతాగ్నులందు లీన యగునప్పుడు వాణీరూపముతో శంకరునకుఁ గోచరించె ననియు నాఁటినుండి యాయనఘుఁ డాశారదకు దాసుఁడై నట్లును ఘటించిన భాగము గాంచి రసజ్ఞులును, ధర్మజ్ఞులును శిరఃకంప మొనర్పకపోవరు. ఈ సందర్భమున శంకరుని గొప్పతనమే కాక మండనుని పాండిత్యమును, వైభవమును, గర్మశ్రద్ధయు దానిని మించి యుభయభారతియొక్క పాండిత్యము వాదనైపుణియుఁ బాతివ్రత్యమును బ్రస్ఫుటము లగుచున్నవి.

షష్ఠాశ్వాసమందలి కాపాలిక కథలో శంకరుని శిరము తెగఁగొట్టుకొనిపోవ శూలహస్తుఁడై వచ్చిన కాపాలికుని నృసింహరూపముతోఁ బద్మపాదుఁడు పైఁబడి గోళ్ళతోఁ జీల్చి చంపె ననుఘట్టమున నృసింహరూపుఁ డగుపద్మపాదుని జూచి కాపాలికుఁడు దేహస్మృతి లేక పడిపోయె ననియు, శంకరుఁడు కనువిచ్చి యెదుట నున్న యుగ్రనృసింహుని స్తుతించి శాంతుఁ గావించి, తేఱుకొని భయమున వడఁకి పోవుచు 'రక్షింపు' మని పాదములపైఁ బడిన కాపాలికుని కభయ మిచ్చి 'యద్వైతవిద్యోపదేశమున శిష్యునిగాఁ జేకొనె' నని మూలమునకు భిన్నముగాఁ గలదు. పద్మపాదుని సంతతగురుభక్తి, మంత్రశక్తి వెల్లడి యగుటయే గాక పరహింసా రూపసాహసకృత్యమునఁ గలుగు కళంకము తొలఁగి పోయినది. ఆచార్యుని దేహాభిమాన శూన్యతయుఁ బరోపకారదీక్షయుఁ బతితపావనత్వమును దయాళుత్వమును విశదమైనవి. మూలమునకు దూరముగాని యీమార్పంతయు హృద్యముగా నున్నది.

సప్తమాశ్వాసమున శంకరుఁడు తల్లికి నుత్తరక్రియలఁ జేయు సందర్భమునందు మార్పు గావింపఁబడెను. స్వగృహమునందుఁ దల్లి మరణింపఁగా వెనుకటి వాగ్దానము ప్రకారము శంకరుఁడు సంన్యాస ధర్మములను పాటింపక యామె కుత్తరక్రియలు చేయఁబూన, నిజ దేశవాసులు దాని నంగీకరింపక, యటనుండి వెడలిపోయి, యగ్నియైన నీయక బాధింపఁగాఁ దల్లిశరీరము నింటిపెరటి గుమ్మమువద్ద దహన మొనర్చి యందలి విప్రుల శపించెనని మూలము. సంన్యాసిగృహస్థోచిత స్మార్తకర్మము లొనర్చుట యశాస్త్రీయమై యుండ, సంప్రదాయ విరుద్ధముగ ధర్మవ్యవస్థాపకుఁడగు శంకరుఁడు తల్లి కుత్తరక్రియలు తానే చేయఁబూనెననుట హాస్యాస్పదము గాకపోదనియు, "గృహోప కంఠేషు చ వః స్మశాన మద్యప్రభృ త్యస్త్వితి తాంశ్శశాప। తదా ప్రభృత్యేవ గృహోపకంఠే ప్యాసీత్ స్మశానం కిల హంత తేషాం" (ఇప్పటికిని కేరళవాసులకు గృహోపకంఠమే స్మశానము)అను మాధవ గ్రంథవచన ముండుటంబట్టియు రెండిటికి నవిరోధముగా నుండునట్లు శంకరుఁడు సంన్యాసము స్వీకరించునప్పుడే 'క. రేయైన బగలేనియు నేయెడఁ గానిమ్ము నీకు స్మృతి యొదవినచో, నాయెడ నను మదిఁ దలఁపుము, పాయక యరుదెంచి పరమపద మొందింతున్. గీ. కొడుకు యతియైనచో జనకులకు నంత్య। సంస్క్రియలు లేకయున్న మోక్షంబు కలుగు. (2-189,190)నని యుత్తరక్రియలు చేయుదునని కాని చేయనని కాని తెలియకుండఁ బలికి నట్లును, వాగ్దానము ప్రకారము తల్లిమరణ కాలమునవచ్చి యామెకోర్కెపై శివదూతలనుబంపి వేసి, విష్ణుదూతలను రావించి వారివెంబడి వైకుంఠమున కంపి యుత్తరక్రియలను జేయుఁడని జ్ఞాతులను బిలిచి చెప్పెననియు, నపుడు జ్ఞాతులు పుత్రుఁడవు నీవు చేసికొనవలసినదే. నీవు దూరమున నున్నయెడ మేము చేయకతప్పదు కాన మాకేమియు సంబంధములేదని నిరసింపఁ గోపించి, వారిని శపించె ననియు, ననాథప్రేతసంస్కారరూప మగు నాపద్ధర్మముగాఁ బరిగణించి తానే పారలౌకికక్రియలు నిర్వర్తించె ననియు నీగ్రంథకర్త చేసినమార్పు మిగుల సమంజసము సయుక్తికముగను నున్నది. ఈ మార్పునకు నొకకొంత యనుకూలముగా "తదా సస్మార జననీ పుత్రం శంకరదేశికం। ఆసన్నమరణా సాధ్వీ బుధ్వా తత్పత్యభాషితం......

ముమూర్షుం మాతరం వీక్ష్య విహాయ సర్వా నథాహ్వయత్, అనాగ తేషు తే ష్వేవ శశాప యతిదూషకాన్” అని చిద్విలాస కృతశంకర విజయవిలాసగ్రంథము కనఁబడుచున్నది. మరణకాలమునఁ దల్లి స్మరింప వాగ్దానము ప్రకారము శంకరుఁడు వచ్చి మరణింప నున్న తల్లిని జూచి, జ్ఞాతులను బిలువఁగా, వా రెవ్వరును రారైరి అందుఁ గలిగి శంకరుఁడు వారిని శపించెను. అనువాక్యములఁ బరిశీలింపఁ బిలిచినను జ్ఞాతులు రాకుండుటకుఁ గారణ మార్ధ్వదైహికక్రియలు తమ్ముని జేయ నాజ్ఞాపించు నని యూహింప నవకాశము కనఁబడు చున్నది. ఆగ్రంథమున శంకరుఁడు తానే యుత్తరక్రియలు చేయుదు నని కాని గృహాంగణమున స్మశాన మగుఁగాక యని శపించినట్లు కాని లేదు జ్ఞాతులు రాలేదు అనువాక్యముమాత్రము ప్రకృతమందలి మార్పున కాధారముఁ గాకపోదు.

శంకరుఁ డాపద్ధర్మముగా మాతకుఁ బారలౌకికక్రియలు చేసి నట్లును, నయ్యది యధర్మమందు లేని “తేషాం తేజోవిశేషేణ ప్రత్య వాయో న విద్యతే। తదన్వీక్ష్య ప్రయుంజానో రౌరవం నరకం వ్రజేత్” యను స్మృతిచొప్పునఁ దేజశ్శాలికిఁ బ్రత్యవాయము కలుగదు. కలిగినను దపశ్శక్తిచే దానిని శమింపఁజేసికొనును. అట్టిమహాత్ము లెవ్వరైన సాహస మొనర్ప, నితరులు గూడఁజేయఁ బూనుచో మర్త్యలు లగుటచేఁ బ్రత్యవాయము దాటఁజాలరని “సాహసంచ మహ తాం, అవరదౌర్బల్యా” దిత్యాదిగ తమ ధర్మసూత్రముల ననుసరించి ధర్మనిర్ణయము సొగసుగఁ జేయఁబడెను. ఇయ్యది సామాన్యవిష యముఁ గాదు. ఇట్టి ప్రసంగమే కుమారిలభట్టచరిత్రమునను గలదు. కావ్యము లీరీతిగాఁ జతుర్వర్గసాధనములుగా నుండవలయునే కాని రస మని పలుకుచు ధర్మాధర్మ వివేకము లేక యిచ్చవచ్చినట్లు రచింపఁబడినవి సత్కావ్యము లగునా ?

అష్టమాశ్వాసమున యమమతనిరాస సందర్భమున నాచికేతో పాఖ్యానము మూలమున సూక్ష్మముగా నుండఁగా నాగాథ కాధార మగుకఠోపనిషత్తును బట్టి విపులముగ నీగ్రంథమున సంఘటింపఁబడుట ముదావహము. ఇంచుమించుగా నేఁబది మతములను శంకరుఁడు ఖం

డించినట్లు మాధవ శంకరవిజయ వ్యాఖ్యాత యెచటనుండి సంగ్రహించెనో కాని "ఇదమత్రావధేయ"మ్మనియు "అత్రేద మవధేయ"మ్మనియు నుపక్రమించి 353 శ్లోకము లొకచోటను, 351 శ్లోకము లొకచోటను మొత్తము 704 శ్లోకములు తన వ్యాఖ్యయందు ననుసంధించెను ఆగ్రంథ మంతయు శ్రమపడి పద్యరూపమున నాంధ్రీకరించి గ్రంథకర్త యాంధ్రజనుల కృతజ్ఞతకుఁ బాత్రమయ్యెను.

నవమాశ్వాసకథయంతయు నించుమించుగా మూలానుసరణమే. అయినను దుది నుపసంహార ఘట్టమున నొకచిత్రమగుమార్పు గలదు. మాధవశంకరవిజయమున దేవతాప్రార్థితుఁడై శంకరుఁడు కైలాసమున కేఁగి నట్లున్నవృత్తమును దత్తాత్రేయప్రేరణమున స్వస్వరూపజ్ఞానము నొంది శంకరాచార్యుఁడు శివునియవతార మగు దక్షిణామూర్తిగాఁ బరిణతుఁడైనట్లు రచించి ముగించుట యీగ్రంథమునకు మకుటాయమానమై విరాజిల్లుచున్నది.

చ. వికృతమహాజ్ఞతాగహనవీథులఁ జిక్కి భవాఖ్యదావపా
వకపరిపచ్యమాను లగువారల కందఱ కాత్మవిద్య లె
స్స కఱపి ప్రోవ మాన మెడసల్పి వటద్రుమమూలమున్ ద్యజిం
చి కదలె శంభుమూర్తి శమశీలమునం గొని శంకరాకృతిన్. 2-14

శా. మౌనవ్యాఖ్యను బ్రహ్మతత్త్వ మెఱిఁగింపన్ వామదేవాది స
న్మౌనుల్ శంకలు వాసి శిష్యు లయి సంభావింతు రేదేవు, నా
జ్ఞానానందమయుండె శిష్యజనరక్షాదీక్ష మర్త్యాకృతిన్
బూనన్ శిష్యతఁ గాంచి క్రొల్చెదరు ధన్యుల్ దేవు రుత్సాహులై. 3-82.

అనునేకత్వము ననుసరించి శంకరుఁడు దక్షిణామూర్త్యవతార మగుటం జేసి తుట్టతుదకు దక్షిణామూర్తిగా నిరూపించి మంగళాంతముగాఁ గావ్యమును ముగించిన యీ గ్రంథకర్త నైపుణ్యము మెచ్చఁదగియున్నది. గ్రంథ మాద్యంతము తలస్పర్శముగాఁ జూచి యితివృత్తమందలి మార్పును గూర్చి యథామతిని తెలియఁ జెప్పితిని. రచనామార్మికు లింకను నూత్నాంశముల గ్రహించి యానందింపక పోవరని నమ్మకము గలదు.

శాస్త్ర విషయములు

శంకరవిజయము కావ్యమని ఛందోబంధము కాంచి యనుకొనుటయే కాని యాలోచింప శాస్త్రసముచ్చయ మనుకొనఁదగియున్నది పూర్వోత్తర మీమాంసలందును, తర్కశాస్త్రమునను, వివిధమత సిద్ధాంతములందును, వాదప్రతివాదములు లేనితావొకటియు లేదు. మూలగ్రంథమునఁ గల యీ శాస్త్రములేకాక, కామశాస్త్ర, వైద్యశాస్త్రములనుగూడ నీకవి ప్రసంగవశమున నిందుఁ జొప్పించి యించుమించుగా సర్వశాస్త్రసముచ్చయమనిపించెను. అందుఁగామకళా విషయముగా నీ గ్రంథమునందుఁ జూపఁబడిన శాస్త్రయుక్తులఁగాంచ, నెంతయు నాశ్చర్యము కలిగినది. కామశాస్త్రమున స్త్రీపురుషజాతులు, కళాస్థానములు, వశ్యక్రియలు మున్నగువిషయములు మాత్రమే యుండుననియు, నాశాస్త్రము నధ్యయనింప జారులొక్కరే యధికారులనియు నింతకు మును పనుకొనువాఁడను. కాని యీ గ్రంథమందలి యాశాస్త్రమర్యాద లరసినదాది యిదియేమో? యనుకొనుచున్నాను. వాత్స్యాయన సూత్రములపై శాస్త్రీయముగా నడచిన వాదప్రతివాదమందలి యుక్తులును, బాతివ్రత్యధర్మరక్షణోపాయములు నెవనికాశ్చర్యము కలిగింపవు?

మండనుని ధర్మపత్నియుఁ గీరదేహప్రవిష్టుఁడగుశంకరుఁడునునీ కామకళయం దెంతగ శాస్త్రవాదము జరిపినను, బతితలకు జిగీషాతన్మయత గలిగించి, సంస్కృత కవులుకూర్చిన కామకళా వాదమునకుఁ బవిత్రత నాపాదించి గ్రంథకర్త పండితాదరపాత్ర మయ్యెను. ఈ కావ్యమున నాఘట్టము చదువుచుండఁ దుచ్ఛశ్శృంగారభావములకు మనసు చొరక శాస్త్రయుక్తి రచనాలీలయందు మనస్సు విలీన మగుచుండును. శాస్త్రజ్ఞులై పఠించుచో నాపూర్వపక్షసిద్ధాంతక్రమమునకు మఱియు నుప్పొంగక మానరు. ఆ శాస్త్రరచనా పాటవ మట్టిది.

తరువాత నవమాశ్వాసమున భగందరవ్యాధిపీడితుఁ డగు శంకరార్యునకుఁ జికిత్సకై యొడఁబడు మని పద్మపాదుఁడు చూపిన యుపపత్తు లన్నియు నాయుర్వేదోదితములే. ఆవిషయము మూలమున లేకున్నను గ్రంథకర్త చరకసంహితాద్యార్షగ్రంథ సిద్ధాంతముల

వెల్లడింపఁ దలఁచి "అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ" మ్మను వేదాంతసిద్ధాంత మూని శంకరుఁడు చికిత్స వల దని వారించి నట్లును, నట్లు లైనచో నాయుర్వేదమునకు వైయర్థ్యము కలుగు నని కర్మవాదమును బ్రతిఘటించిన చరకాచార్యుని సిద్ధాంతమువలన నాయుర్వేదమునకుఁ బ్రవృత్తి సంభవించినట్లును,జరకసంహితయందలి దైవవ్యపాశ్రయప్రకరణ మాధారముగాఁ గొని సముచితముగా రచించెను.

ఆసిద్ధాంతము నంతయును గ్రంథకర్త రచించుట నధికమైనట్లు స్థూలముగాఁ గనిపింప వచ్చును. కాని శంకరాచార్యు నంతటి దేహాభిమానశూన్యుఁ డగుమహావేదాంతిని జికిత్సకై సమ్మతింపఁ జేయుట సామాన్యవిషయము కాదు. ఆ యనఘుని క్షేమమే తనుక్షేమముగా భావించి యాయనకంటె హెచ్చుగా బాధపడుచున్నశిష్యులు ప్రార్థించినను, స్వకపోలకల్పితము లగుయుక్తుల నెన్ని చెప్పినను నిశ్చలవిరాగి యగునాయన చికిత్స కంగీకరింపకపోవుట సత్యము. కాని సకలశాస్త్రముల మథించినమేధావి యగుటచే శాస్త్రప్రమాణమునకుఁ దప్పక సులభముగా బద్ధుఁ డగు నని తెలుపుఘట్ట మగుటచే నంతసుదీర్ఘ మగువాదము పద్మపాదునిచేఁ జేయించుట యసంగతము మాత్రము కాదు. వేదశాస్త్రములందుఁ బ్రమాణబుద్ధిగలప్రాజ్ఞు లెల్లరు నిట్టి శాస్త్రవిషయవిమర్శనములందు విసువ రని యనుకొందును. ఇట్టిక్లిష్ట విషయములను గ్రంథకర్త శక్య మైనంతవఱకు విశదీకరించెను. శాస్త్రములందలి సంప్రదాయములు గురుముఖమునఁ గాని సుబోధములు కావు. అయిన నిట్టిగ్రంథములఁ జదువఁ బాఠకలోకమునకు జిజ్ఞాస పొడమి యేకొంతయైన నభ్యసింపఁ బ్రవృత్తిగలుగునేమో యని నాయాశ.

వ్యాకరణశాస్త్రరహస్యములు మూలమం దున్నవి సాధ్య మైనంతవఱకు నాంధ్రీకరణమున గ్రంథకర్త విడువక చూపుట ముదావహము. వ్యాకరణశాస్త్రము వశము కానిదే యట్టి ప్రయోగవైచిత్రి కనిపెట్టుటగాని, ప్రయోగించుటగాని యశక్యమను సంగతిమాత్రము విజ్ఞులు మఱువకుందురు గాక!

మూలమునందుఁ గల శాస్త్రవిషయములను గూర్చి యించుక పరీక్షింతము. మండన శంకరవాదఘట్టమునఁ బూర్వోత్తరమీమాంసా శాస్త్రసమ్మతముగాఁ దత్త్వమసి మహావాక్యముపై వాదప్రతివాదములు, ఆవాదమందే తమతమ మతము నిలుపుకొనుటకై న్యాయశాస్త్రము, నుపనిషత్తులును, భగవద్గీతయు స్వీకరింపఁబడినవి. తుదకు వ్యాకరణ శాస్త్రముగూడ వాదమందుఁ గానవచ్చును.

ఇటువంటి ఘట్టములలో నీలకంఠపండితుని తోడి వాదమును, భట్టభాస్కరునితోడి వాదమును బ్రౌఢములు. ఆరెండును గేవల తర్క శాస్త్రసమ్మత మగు సిద్ధాంతముల ననుసరించియే నడచెను. మూలానుసార మీ కావ్యమం దంతయుఁ గలదు. కాని భట్టభాస్కర వాదమునఁ దుది నున్న హేత్వాభాసములచర్చ మాత్రము విడువఁ బడినది. ఇట్టి శాస్త్రవాదస్థలములు గద్యమయముగ రచియించుటయే న్యాయము. మఱియు శారదా పీఠాధిరోహణసమయమున శంకరునకు సర్వమతములవారితోను సర్వశాస్త్రములలోను సూక్ష్మరూపమున వాదప్రతివాదములు గలవు. అర్హన్మతస్వరూపము వివరింపఁబడెను. ఇవి యన్నియు మాధవగ్రంథములోనివే.

ఔచితి ననుసరించి కథాసంవిధానమునందు మార్పులుగావించి నట్లే యిక్కడియుచితస్థలములఁ బ్రసంగము వచ్చిన శాస్త్రవిషయములు కొంతయేని స్పృశించి విడిచెను. శంకరుఁడు కామశాస్త్ర మభ్యసించు సందర్భమున నలంకార నాట్యాభినయశాస్త్రములతో నాశాస్త్రమునకుఁ గలసంబంధము సూక్ష్మముగాఁ దెలియఁబఱచుచు, నం దలంకార శాస్త్రమును శంకరునివంటి సకలశాస్త్రజ్ఞుఁడు, మహా వేదాంత విజ్ఞాని యేదృష్టితోఁ బఠించునో చక్కగా నిరూపించెను. శంకరుఁడాశాస్త్రము లన్నియుఁ జదివి-

మ. అగునే యిట్టు లలంక్రియాభినయనాట్యంబుల్ 'రసో వై స'య
న్నిగమాంతోక్తి ప్రమాణమై తెలియ వర్ణించున్ రసోత్పన్నహృ
ద్యగుణానందము నెల్లతావులను బ్రహ్మానంద సబ్రహ్మచా
రిగ; సత్యంబొకొ? స్తావకంబొ యని తర్కించున్ గ్రహించున్ దుదిన్.

పరమాత్మను బోధించు 'రసోవైస' యను శ్రుతివాక్యమునే ప్రమాణముగాఁ గొని రసోత్పన్నానందమే బ్రహ్మానందసబ్రహ్మచారి' యనిన యాలంకారిక సిద్ధాంతము గాంచి సర్వవేద వేదాంత సారజ్ఞుఁ డగుటచే నాశ్చర్యమునొంద కుండునా? ఆలంకారిక మతమున రసమే పరబ్రహ్మమని సిద్ధాంతము గదా! ఆ విషయము రసగంగాధరమున స్పష్టము.

అట్టిసిద్ధాంతముల నరసి యరసి పరమార్థ మవగతముచేసికొని తుదకు 'గీ|| అతుల శోధక్షమముగ నయ్యతి సుమాస్త్ర, శాస్త్ర పాథోధి మథియించి సారమధిగ, మించెఁ దలయూఁచె మెచ్చె హసించెఁ బెద్ద, నిశ్వసించె జుగుప్సించె నెమ్మనమున' నని పరమార్థము ప్రకటించెను. వేదసమ్మతము లగుశాస్త్రము లను సందర్భశుద్ధిగాఁ బ్రదర్శించుట యీ గ్రంథకర్త వాంఛితము కావచ్చును.

శంకరుఁడు పరకాయప్రవేశ మొనర్చినచిలుక మండను నింటి చిలుకలతో వేడుకగా వాదించినటుల కల్పించి యప్పుడును 'సీ. అష్టవిధంబైన యవధానముల వేదములు తలక్రిందుగాఁ జదువునేర్చు' అనియు, శంకరుని వేదాధ్యయనకాలమున సీ|| సబ్రహ్మచారు లాశ్చర్య మొందఁగ వేదవికృతుల నవధానవిధుల నెఱపి, యనియుఁ "బదక్రమ జటాదిక వికృతులచే నవధాన మొనర్చుసంప్రదాయము వేదవేత్తల కుండెడి" దని సూచింపబడెను. ఆ యష్టావధానము మాతృకగా గవిత్వమం దష్టావధానము వచ్చియుండును. ఇట్టి ప్రాచీన సంప్రదాయములు రేఖామాత్రముగ నైన నచ్చటచ్చటఁ బొందుపఱచి గ్రంథకర్త చేసినమేలు మఱువఁదగనిది.

భాషాంతరీకరణము, కవిత్వము.

ఈ గ్రంథము భాషాంతరీకరణము కాదు అట్లని కాకపోదు. అనువాదమైనను ధారాశుద్ధి గలిగి స్వతంత్రరచనవలె నస్మదాదులకుఁ గూడ గోచరించుట విస్మయజనకము కాక మానదు. సంస్కృతాంధ్ర వాఙ్మయములందు స్వాతంత్ర్యము గలయీరచయితయొక్క సంస్కృత భాషావిశేషము లెట్టివో తరువాతఁ దెలిపెదను. ముందుగా నాంధ్ర

భాషాభిజ్ఞతను గూర్చి యీకవి మున్ను రచించిన మునిత్రయచరిత్రమున కుపోద్ఘాతము వ్రాసిన యాంధ్రవిశ్వకళాపరిషత్కళాశాలాంధ్రపండితులు విద్వాన్ దువ్వూరి వేంకటరమణశాస్త్రిలుగారి వాక్యములిట నుదాహరింతును.

“వీరికవితాస్రవంతి యతినిర్మలమై మనోజ్ఞముగ జాలు వాఱుచుండును. గ్రామ్యపద్య మొక్కటియుఁ గానరాదు. రచన మంతయుఁ బ్రసాదగుణభరితము. ఆవాసము కోనసీమ. ఆమీఁద వ్యాకరణపాండిత్యము. అయినను వీరికవిత నారికేళపాకమునకు దూర మైనది. మధురాతిమధుర మగు కోమలపాకము నాశ్రయించినది... నాయెఱుక కందినంతలో ననితర సాధారణ మనఁ దగినవిశేష మొక్కటి యీ విద్వత్కవికిఁ గలదు. శాబ్దికముగఁ గాని యార్థికముగఁ గాని యేదే నొకజిజ్ఞాసాప్రసంగము కలిగినపుడు ప్రస్తుతసందేహ నివారకముగాఁ బ్రాచీనకవితల్లజులమత మెట్టిదో యను ప్రశ్న ముదయించుటయేతడవుగా నెన్నిటినో ప్రామాణికప్రయోగములను గుప్పతిప్పలుగా వీరు ప్రదర్శించుచుందురు. ఈశక్తి యద్భుతావహము. ప్రాచీనకృతులను సూక్ష్మమార్గమునఁ బరిశీలించుటయు నం దెట్టివిశేష మగపడినను నద్దానిని సరసముగా గ్రహించుటయు, గ్రహించినదానిని విడువకుండ ధారణ సేయుటయు, నట్టిది సమయమునకు స్ఫురించుటయు నొకేబుద్ధి కలవడుట యరుదు. కవితావిషయములం దెట్టి చర్చ యేర్పడినను నద్దానికి సాధకముగనో బాధకముగనో బ్రాచీనమతనిరూపక మగు ప్రయోగపరంపర వీరిబుద్ధికి స్ఫురించి తీఱవలసినదే. ఒక్కొక్క మేధ యొక్కొక్క విషయమున నిశితమై యుండుట ప్రకృతిలక్షణము”

దీనినిబట్టిఁ యీకవి యాంధ్రభాషారహస్యవేత్త యనియు, సరసకవితారచనానిపుణుఁ డనియు ధ్రువపడుచున్నది. ఈ విషయమున నింతకంటెఁ బ్రమాణమేమి కావలయును ?

ఈయనకు సంస్కృతవాఙ్మయ విశేషముల యెడఁగూడ దెలుగుఁ భాషయందుఁ గలపటిమ కల దని యొక్క మాట చెప్పినఁ జాలును. అయినను ఆవిశేషములు గూడ దిఙ్మాత్ర ముదాహరింతును. కావ్యమునకు శబ్దార్థములు శరీర మని యాలంకారిక సమయము. దోష

రహితత్వము, గుణసహితత్వము నర్థమునకు వలెనే శబ్దమునకుఁ గూడఁ గలిగిననే కావ్యలక్ష్మి సర్వాంగసుందరి యగును. శబ్దసౌష్ఠవము వ్యాకరణశాస్త్రముచే సిద్ధింపవలసినదే. అట్టి శబ్దసౌష్ఠవము నర్థసౌష్ఠవమును నీకావ్యమునందు సర్వత్ర నిండియున్నది. ఆంధ్రభాషారహస్యములు మాదృశుల కపరిచితములు గావచ్చును గాని సంస్కృతభాషావైచిత్ర్యము చూచి యానందింపఁ గల్గుదుము. కాన నావైచిత్ర్యము కొంత తెలిపెదను.

శ్లో॥ ధన్యంమన్యవివేకశూన్యసుజనంమన్యాబ్ధికన్యానటీ,
నృత్తోన్మత్తనరాధమాధమకథాసంమర్దదుష్కర్దమే।

అను మూలమందలి ఖశ్ప్రత్యయాంతము లెట్లాంధ్రీకరింపఁబడెనో యని చూడఁగా, నట్టి యర్థము గలశబ్దము లాంధ్రమున లేకుండుటచేతను గ్రంథకర్త యాశబ్దముల సొగసెఱిగినవాఁ డగుటచేతను వానిని విడువఁజాలక యాసొగ సాంధ్రులకుఁ దెలుపు కుతుకమున— "ధన్యంమన్యులు బుద్ధిశూన్యులు నుదాత్తంమన్యులంభోధరా। ట్కన్యానర్తనమత్తులౌ నరవరాకశ్రేణి దుష్కీర్తి మాలిన్యంబొందిన' యని యాంధ్రీకరించెను ఈయాంధ్రీకరణము చూడఁగనే శ్రీనాథకవిరాజుయొక్క 'గమికర్మీకృతనైకనీవృతుఁడు' జ్ఞప్తికివచ్చినది. అభూతతద్భావమున వచ్చుచ్విప్రత్యయమువంటి ప్రత్యయము తెలుఁగునందు లేకపోవుటచేతను, దానిసౌకర్య మాంధ్రులకుఁ జూపించు కుతూహలముచేతను, దత్కవిరా జట్లు ప్రయోగించెను. ఆ వ్యాకరణపరిశ్రమ మెఱుఁగనివారికి సులభముగా నట్టివి పరిహసింపఁ బాత్రము లైనను దానిసొగసు చెడకుండ శయ్య భేదింపకుండ నాంధ్రమం దదుకుట సామాన్యవిషయము మాత్రముకాదు. కావ్యమున సర్వత్రయట్లుండు ననుకొనరాదు. కొన్ని స్థలములందు మాత్రము చమత్కారజనకముగా మూలమందలి వ్యాకరణరహస్యములు ఘటింపబడుచు వచ్చెను. ఆశక్తినే యిక్కవియు సహృదయమోదావహముగా నచ్చటచ్చట మూలమందలివిచిత్రప్రయోగములను విడువక చూపెనని నాయాశయము. నైషధమువలెనే సర్వశాస్త్రసముచ్చయ మనఁదగు నిట్టికావ్యము నచ్చ తెలుఁగు పదములతోఁ జెప్పుటయుఁ గష్టమే. చెప్పినను సరసముగా దాని భావము గ్రహించుటయుఁ గష్టమే.

కాని కనకాముంక వర్షకథలోని దరిద్రబ్రాహ్మణి పలుకులు పాత్రోచితముగా నెంత లలితముగానున్నవో యరసినఁ దెలియును.

క. కనుమూపు చినుఁగుపయ్యెద, కొన కుతికంబునఘటించుకొని యాగృహమేఁ
ధని దలుపోరఁగ దీనా, ననమాత్రమ కానఁబడఁగ నలఁకువ ననియెన్.

గీ. తొలుత నాతండ్రి? యీపొద్దు నిలయమునకు
నేలవచ్చితి వీదినం బెచటకుఁ జనినఁ
నచట నిట్టు లగునేమొకో యనుచు వగతుఁ
నెట్టి దుశ్శకునంబున నిలువెడలితో.

ఉ. కటకట! యిట్టియెండ నడిగాళులు పొక్కఁ, జెమర్పమోము, పై
పటిమ మడంగ మాధుకరభైక్షముకై యరుగంతు బిడ్డ! ని
న్నెట్టు ఏను మందు! పాపురపక యే మొనరింపఁ గలన్ దరిద్రితా
స్ఫుటి నడపీనుఁగ మను నభాగ్యము నీకింగ మెట్లు చూచెదన్.

ఉ. గ్రామము వాడవాడల నిరంతరమున్ దిరిపంబు నెత్తి నా
స్వామి ననున్ దనూజులను సాకుచునుండును, దెచ్చుదానిలో
సామ మగండు సామ నిజసంతతియున్ భుజింపఁ బెట్టియా
సామె మెతుకుల్ భుజించి కొంపప్రాణముతో మనుచుందు నందనా!

అని యిట్లు జాతీయములతో మధురాతిమధురముగ రచింప నేర్చియు నీకవి శంకరాద్యుదాత్తపాత్రముల వర్ణనలందును సంభాషణములందును గంభీరమగురీతి నాశ్రయించుట పాత్రానుగుణరచనచే రసికజనామోదము గాంచుటకే యని యెంతును. ఇందు నాలుగైదు స్థలములందు సంస్కృతశబ్దవైచిత్రి మెఱయ శంకరవర్ణనము గలదు. మూలమున నున్నదియే సొగసు చెడకుండ నాథ్రమున మిలితమై యీసంస్కృత పదజాలము రత్నకళికలవలె గావ్యలక్ష్మిశరీరము నలంకరించుచున్నవి. మచ్చున కొకటిరెండు మాత్రము చూపెదను.

"శ్లో". తత్త్వజ్ఞానఫలేగ్రహీ, ఘనతరవ్యామోహముష్టింధయో
నిశ్శేషవ్యసనోదరంభరి, రఘుప్రాగ్జ్యౌరకూలంకషః ।
లుంటాకో మదమత్సరాదివితతేస్త్రాపత్రయా రుంతుదః
పాదః స్యా దమితంపచః కరుణయా భద్రంకరః శాంకరః ।

అని శంకరపాదవర్ణనము మూలమునఁ గలదు. ఇందలి ఫలేగ్రహి, ముష్టింధ, యోదరంభరి, కూలంకష, లుంటాక, రుంతుద,

దామితంపచ, భద్రంకర శబ్దము లెంతయేని హృద్యములు. అర్థచమత్కృతి లేకపోలేదు. కాని దానిని శబ్దవైచిత్రి కబళించి వేసినది. ఆశబ్దచమత్కృతి కొంతయైన ననువాదమునం జూపలేకున్న నా పద్యమువలనఁ గావ్యమునకు గలుగుశోభ చాలతక్కువ. కావుననే

మ. అమలజ్ఞానకళాఫలేగ్రహి, ఘనవ్యామోహ ముష్టింధయం
బమితర్థివ్యసనోదరంభరి, యఘప్రాగ్భార కూలంకష
బు మదాద్యద్మర మిద్ధతాపహరణంబున్ శాంకరం బౌ పదా
బ్జము కారుణ్యరసామితంపచముగా భద్రంకరం బయ్యెడున్.

అని యాంధ్రీకరింపఁ బడెను.

ఫలేగ్రహి, ఫలశబ్దమున కేదంతత్వమును, గ్రహి ధాతువునకు ఇన్ ప్రత్యయమును 'ఫలేగ్రహి రాత్మంభరిశ్చ' యను సూత్రముచే నిపతింపఁబడఁగా సిద్ధించినరూపము. 'నాడీ ముష్ట్యోశ్చ' యనుసూత్రముచే 'ముష్టింధయ' రూపసిద్ధి. ఈరీతిగా ససామాన్యసూత్రముచే సిద్ధించిన ఉదరంభర్యాదిశబ్దముల కన్నిటికిఁ బ్రక్రియ చూపినగ్రంథవిస్తరమగు నని విరమించి యట్టి ప్రయోగవిశేషములను దిఙ్మాత్రము దాహరింతును. అమర్త్య దోహల విహారము. (విహారము) 1-13 జరీవిజృంభద్వచోనిర్ఝరము 2-39. కఁడూలరసన 2-31. కచాకచి, గదాగది, భుజాభుజి 2-50, సర్వాంగీణము 2-52 సాంకాశినము, సాంహాసినము 2-54 నదీష్ణులు 2-98 సిష్ణాసువు 2-168. సముజ్జిహీర్షుఁడు 2-198, త్రైయంబకాపరరూపుఁడు 2-201. అటాట్యమానుఁడు 3-70 సౌవస్తికము, పచేళిమము, అలంకర్మీణము 3-77. దిదత్సు 3-104. కూలముద్రుజము 3-111, పాపచ్యమానము 6-68. వాతంధయము 6-66 గూఢోత్ముఁడు 7-141. అనిదంపూర్వము 7-201. స్వకభక్తులు 7-261. దేవానాంప్రియ 8-141. ఉగ్రంపశ్యులు 8-183. మానషట్త్రయము 8-389. హస్తగ్రాహము 9-69. ద్వ్యాయుషత్ర్యాయుషములు 9-131. మున్నగునవి యీగ్రంథమున నెన్నియో కలవు.

కొన్ని మూలమునం దున్నవియును, గ్రంథకర్త వ్యాకరణవేత్త యగుటఁ గొన్ని స్వకీయములును. ఈరీతిగా మూలమునందలి శబ్దచమత్కారము శక్యమైనంతవరకు నాంధ్రీకరణమున నిముడ్ప నీగ్రంథ

కర్త చూపిననైపుణి నుతిపాత్రము. స్వతంత్రరచనముకంటె నాంధ్రీకరణము శ్రమకరము మూలమందలి యర్థసౌందర్యము, శబ్దాలంకారములు, మార్మిక ప్రయోగములు సరిగాఁ దూఁచిన ట్లనువాదమున వచ్చుట దుర్లభమైనను గష్టపడి యేయొకకొంతయో యనువాదమునఁ జూపఁబడినచో మూలమునందలి సొగసు తేఁజాలక పోయెనని పెదవి విఱుతురు ఒకవేళ నశ్వవాక్కగు నేమహాకవి యైనను దేఁగలిగినచో నిసౌందర్య యంతయు మూలములోనిదే. అనువాదకునియుపజ్ఞ యిందేమికలదని తేలికగాఁ బలుకుదురు. ఏభాషస్వభావ మాభాషది. ఒకభాషయందుఁ గలసౌలభ్య మింకొకభాషకు గుదరకపోవుట నైసర్గికము. మూలమందలి సౌందర్యము న నేకదేశ మైనను ననువాదభాషాస్వభావముతో మేళవించి యతుకులు గనరాకుండ రచయిత యనువదింపఁ గల్గెనా? లేదా? యనునంశము గుఱువఁదగినది ఈగ్రంథకర్త యనువదించినచోట్ల నెల్ల నాంధ్రకవితకుఁ గల నైసర్గికమార్గము స్ఫురింప రచించి కృతార్థుఁడయ్యె ననియే చెప్పవచ్చును. పంచమాశ్వాసమున లక్ష్మీనృసింహాస్తవ మాంధ్రీకరింపఁబడెను 'లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్', అనుమకుటము 'లక్ష్మీనరసింహ నాకొసఁగు మీ భవదీయకరావలంబముఁ'. అని తెనిఁగించి యా మకుటముతో నడిపిన యాస్తవ మంతయు స్వతంత్రరచనవలె నున్నది.

కఠినతర మగు శ్లేషస్థలము లందును దెలుగు పదములచేతనే యర్థద్వయము నీగ్రంథకర్త చూపఁగలిగె ననుట కొక యుదాహరణము మాత్రమే తెలిపెదను. శ్లేషకవితచే హరిహరుల కభేదము చెప్పిన శంకరకృతస్తవము మూలమునఁ గలదు. అర్థశ్లేష మున్నచోట్లనా శబ్దముల నెట్లని యాంధ్రీకరణమున బిగింపవచ్చును. కాని శబ్దశ్లేష మం దాశబ్దము లాంధ్రమునఁ గుదురవుగదా? అచట నీకవి యెట్లు సంతరింపఁ గల్గెనో చూతము.

'శ్లో॥ సమావహాన్ కేసరితాం వరాం య స్స్ఫురద్విషత్కాం జర మాజఘాన, అని నృసింహునకు శివునకు నభేద వర్ణనము. వరాం=శ్రేష్ఠమగు' కేసరితాం=సింహత్వమును, సమావహాన్=వహించుచున్నవాఁడు, అని నృసింహపక్షమున నర్థము. సరితాం=

పదములలో, వరాల=శ్రేష్ఠయగు గంగను, కే=శిరస్సునందు, సమావహన్—వహించు చున్నవాఁడు అని శివపక్షమున నర్థము. ఇందు 'కే' యనునది సప్తమ్యంత మొకపక్షమునను, 'కేసరితా' మని ప్రత్యేకదేశ మొకపక్షము నను నగుచున్నది. దీనిని గ్రంథకర్త సులభముగాఁ దెలుఁగుగా మార్చె ననుట యద్భుతావహము కాకమానదు.

గీ. 'సటలపెంజాలు మెఱయు' అని యాంధ్రీకరణము. (సటల=జూలుయొక్క, పెంజాలు=పెద్దగుంపు అని నృసింహ పక్షమున నర్థము. సటల=జడలయందున్న, పెంజాలు=పెద్దప్రవాహము అని శివపక్షమున నర్థము) ఇచట స్వతంత్రరచనవలె ధారాళమగుశయ్యతో నచ్చ తెలుఁగు పదములతో శ్లేషకవితనుండఁ గృతార్థుఁడైన యీగ్రంథకర్తనేర్పు సామాన్యమా? భాషాంతరీకరణ మనిన నేరీతి కారీతిగా సరిపుచ్చఁగలిగి యిట్లుండవలెనుగదా!

మఱియుఁ బ్రభుసమ్మిత మగు వేదమున నేధర్మము చెప్పఁబడునో సుహృత్సమ్మిత మగుపురాణముచే నేధర్మము చెప్పఁబడునో ఆధర్మమే రసయుతముగాఁ గాంతాసమ్మిత మగు కావ్యముచే బోధింపఁ బడునను నభియుక్తోక్తి స్ఫురింపఁజేయు తలంపుతోఁగాఁబోలును శ్రీవేంకటరావు పంతులుగారి వంశవర్ణనమున గోత్రపురుషుండగు భరద్వాజుని బురాణ గాథలననుసరించి గాక వేదమునను సరించి యీకవివర్ణించెను అయ్యది ప్రసంగాంతర మైనను ఈగ్రంథకర్తకు వేదమార్గమునందుఁ గలభక్తి నూచింపఁ దెలుపవలసి వచ్చినది.

'భరద్వాజో హత్రిభి రాయుర్భి ర్బ్రహ్మచర్య మువాస| తగ్ంహ జీర్ణిగ్ం స్థవిరగ్ం శయాన మింద్ర ఉపవ్రజ్యోవాచ| భరద్వాజ యత్తే చతుర్థ మాయుర్దద్యాం కి మేనేన కుర్యా ఇతి| బ్రహ్మచర్య మే వైనేన చరేయ మితి హో వాచ| తగ్ంహ త్రీన్గిరిరూపా నవిజ్ఞాతానివ దర్శయాంచకార| తేషాగ్ం హైకైకస్మాన్ముష్టి నాదదే| స హో వాచ భరద్వాజే త్యామంత్ర్య| వేదావా ఏతే| అనంతావై వేదాః| ఏతద్వా ఏతైః స్త్రిభి రాయుర్భి రన్వవోచథాః| అథ త ఇతర దననూక్త మేవ| ఏహీమం విద్ధి' అను వేదవచనములు గొని హృద్యముగా

"సీ. తార్క్ష్యయుషం బొంది జరార్తుఁడై యిల వాఁరి
యును బ్రహ్మచర్యంబు నుడుగలేక
యూర్చుచు నిందుఁ డాయువు చతుష్కం బిచ్చి
చూపింప వేఁరాసులను జూచి
పర్వతత్రితయంబు భాతి భాసిల్లు వే
దత్రయంబునకు వందనముసేసి
యిందుఁ నాఁతిని దక్షయాగిరులం దుండి
పిడికెఁడు పిడికెఁ డయ్యెడ గ్రహించి
గీ. భూమికిం దెచ్చినట్టి యభూత పూర్వ
చరితుఁ డని వేదవినుత యశస్కుఁడై "య
నంతములు వేదము" లటంచు నవనిఁజాటి
నట్టి మహితు భరద్వాజు నగుదు పొగడ".

అని రచించెను. మఱియుఁ గనకామలక వర్షగాథయందును మూలమున లేని శ్రీసూక్తముచే లక్ష్మిని నుతించుటయుఁ గూడ వేద మహిమ వెల్లడించుతలంపుననే కదా! ఆవేదమంత్రముల యర్థము సరసముగాఁ దెలుఁగునఁ జూపి యీ కావ్యమునకుఁ బవిత్రతయు నౌచితీ సంపత్తియు ఘటించి గ్రంథకర్త ధన్యతఁ గాంచె

ఆద్యంత మొక్క రీతిగా రచింపఁబడిన గ్రంథము లరుదుగా నుండును. ఇన్నివిధము లగు శాస్త్రములను, మతములను నిమిడ్చి యాద్యంతము సకలగుణపరిపూర్ణముగా రచింపఁబడిన యీ శంకర విజయ మత్త్యుత్తమకావ్య మని నిస్సంశయముగాఁ బలుకవచ్చును ఒక వంక సంస్కృతకవిపండిత లోకమునకును, నొకవంక నాంధ్రకవిపండిత లోకమునకును, నానందజనకముగా నీప్రబంధము రచించినకవి విద్వ త్కవి యనిపించుకొనుటలో నాశ్చర్యమేమున్నది?

కా వ్య ల క్ష ణ ము లు.

నాదృష్టికి గోచరించినంతలోఁ గొన్నికొన్ని విషయములు మాత్ర ముద్ఘాటించితిని. రసజ్ఞులగు ప్రాజ్ఞు లింకను నిందుఁ గల వివిధ గుణముల గ్రహించి యానందింపక మానరు. ఆంధ్రవాఙ్మయమున శృంగారప్రబంధములు బహుళములు. అట్టి వాఙ్మయమున మునిఁగి

తెలియు నీకవి మునిత్రయచరిత్రము శంకరవిజయమువంటి శాంతరస ప్రధానప్రబంధముల రచింప నాస్థ గలిగి, యందుఁ బరకోటినొంద రచనసాగించుట యాశ్చర్యము. ఇందు శాంతము ప్రధానరస మని మూలమున-

శ్లో॥ నేతా యత్రోల్లసతి భగవత్పాదసంజ్ఞో మహేశః
శాంతి ర్యత్ర ప్రకచతి రసః శేషవా నుజ్జ్వలాద్యైః.

అని నిర్ణయింపఁబడినది. శివగురుని తపస్సు మొదలుకొని శంకరుని యవతారపూర్తిదాఁక శాంతరసమే. నడుమ నంగములుగా రసాంతరము లున్నవి. జిగీషను బురస్కరించుకొని కామకళాప్రసంగమున వీరరసమే కాని శృంగారరస మచట లేదు, అమరుకకథ యున్నచో శృంగారరససంబంధ ముండెడిది. రసముకొరకు నౌచిత్యము పాడొనర్చుటకంటె శృంగారరసము విడిచినను గావ్యమునకు లోపమురాదు. నగరార్ణవశైలర్తుచంద్రార్కోదయాద్యష్టాదశవర్ణములతోఁడి కావ్యముగ నియ్యది రచింపఁబడలేదు. సందర్భోచితముగా నందుఁ గొన్ని ప్రసక్తములైనపుడు విడువఁబడలేదు ఇట్టి చారిత్రిక కావ్యములందయ్యవి మాడిపెట్టుట యనుచితము. ఏవర్ణనములు లోపించినను శంకరుని యాకార గుణ కీర్తి పాండిత్యాదివర్ణనము మూలానుసారముగా గ్రంథకర్త రచించి శ్రీ భగవత్పాదులయెడఁ దనకుఁగల యసమాన భక్తి వెల్లడించుకొనెను ఆభక్తి గ్రంథరూపమున వెల్లడియగుటచే దానే కాక పతితలుగూడఁ దరింప సాధన మయినది ఇట్టి యుత్తమ కావ్యములేకదా స్వమత, స్వదేశ, స్వభాషా గౌరవములకు సార్వకాలిక రక్షకములు. కావున సంతతోఁ దృప్తిపడక యీగ్రంథకర్త శ్రీవేంకటరాయ సమర్పితమందిరమున సుఖముగా నివసించుచు నిట్టి కావ్యము లింకను రచించుఁగాక! పరమేశ్వరుఁడు శ్రీవేంకటరావు పంతులుకారికి నీ గ్రంథకర్తకు నభీష్టఫలదాత యగుఁగాక!

స్వస్త్యస్తు.

అమలాపురం తాలూకా.
భట్నవిల్లి.
2౭-11-1947

'తర్క-రత్న, న్యాయవేదాన్త, విద్యాపారీణ'
బులుసు అప్పన్నశాస్త్రి

శ్రీ గురుమూర్తయేనమః

శ్రీ శంకర విజయము.

అవతారిక.

శా. శ్రీమద్వేంకటరామమంత్రివరసంసేవ్యాంఘ్రి. సుబ్బాంబికా
ధామాలంకృతి భానువంశమణి, సీతాస్వాంతకంజాతజా
తామోదస్పృహయాళుభృంగము, యతీంద్రారాధ్య, మధ్యాత్మవి
ద్యామాంగల్యము రామనామపరమాత్మంబు బోచు లోకంబులన్.

సీ. రాఘవాకారపరబ్రహ్మ చిత్కళ
యగణిత నలినజాండైకజనని
వేదవాదన సముత్పాదితోదయ, భక్త
కల్యాణసంధానకల్పవల్లి
యాదిలక్ష్మి మనుష్యావతారము, విదే
హక్షమావిభుతపోనంతఫలము
క్షితిసతీగర్భశుక్తిసమిద్ధమౌక్తిక
మసురవిస్తారసంహారరాత్రి

గీ. రాజితేదర వేంకటరాయమంత్రి
సంతతార్చితపాదాంబుజాత సీత
సర్వసంపత్కరత్కటాక్షములు జాలు
కొనఁగఁ గనుఁగొంచు జగముల మనుచుఁగాత. 2.

సీ. మందస్మితాంచిత సుందరవదనమ్ము
విస్ఫుమరాసిత కాంతి మసృణమూర్తి
మాణిక్యవల్లకీ క్వాణనోత్సుకము చం
ద్రావతంసోత్తమాంగాభిరామ
ముచ్చావచాభరణోజ్జ్వలాఖిలమూర్తి
యాదృతజ్ఞానముద్రాతిరమ్య
మవిరతతారుణ్య మనవధికారుణ్య
మాత్మవిద్యాప్రదానాదిమగురు

గీ. వగుచు శ్రీ దక్షిణామూర్తి యనఁగ శ్యామ
లాంబ యనఁగ సద్వైత భావంబు గాంచి
పూరుషుండును స్త్రీయు నపుంసకమ్ము
గాని స్త్రీపుంస మగుజ్యోతిఁ గాంతు మదిని. 3.

ఉ. ఆదిమదంపతుల్ సలిపినట్టి తపంబున వేదభూజ శీ
ర్షోదితమౌ ఫలంబు, జగదుద్గతిబీజము, భక్తసంసదా
మోదకరుండు, మోదక విముగ్ధకరుండు, దయాకరుండు, లం
బోదరుఁ డంతరాయులవ మొందని వైఖరిఁ బ్రోచు మత్కృతిన్. 4.

సీ. నలువ నెమ్మొగములు నాట్య మందిరములు
ధవళాంబురుహము ముత్యాలగద్దె
శ్రుతి తచ్ఛిఖలు సన్నిహిత పరిచారికల్
చేదోడు వాదోడు చిలుకదంట
పదునాల్గు జగములు పాలించురాజ్య, మా
జానేయవాహమ్ము మానసౌక
మాత్మస్తనంధయు లలకవుల్ గాయకు
లమృతాక్షర శ్రేణి యక్షమాల
గీ. యగుచు వెలయుఁగ నేదేవి యలరు నట్టి
విశ్వజనయిత్రి వాఙ్మయ విశ్వరూప
శారదాదేవి శంకరాచార్య విజయ
సరసకృతిసృష్టి మద్రసజ్ఞను వసించు. 5.

మ. జగముల్ ప్రోవఁగ సంకులశ్రుతుల వ్యాసంబున్ బచారించి య
చ్చుగ; ముక్తాకృతి బ్రహ్మ మద్వయముగా సూత్రించి, వేదార్థగు
ప్తిగ శ్రీభారతమున్ రచించి చిరజీవిత్వమ్మునన్ నేడునున్
భగవంతుం డయి వెల్గు వ్యాసముని సంప్రార్థింతు విద్యార్థినై. 6.

సీ. బ్రహ్మాండగోళముల్ పట్టని విజ్ఞాన
మైదేండ్ల యీడున నవధరించి
వ్యాసతాత్పర్యసర్వస్వమ్మునకు నద్ద
ములుగ భాష్యత్రయమ్మును రచించి

యాసేతుశీతాద్రి నద్వైత గుప్తి యా
పాదిల్లఁ బీఠముల్ పాదుకొలిపి
ద్వైతసిద్ధాంతజల్పాకపాషండవై
తండికషండమ్ము గండడంచి

గీ. మహితపారమహంస్య సామ్రాజ్య పట్ట
భద్రుఁడై జగమ్మున ధర్మపాలనమ్ము
చేసిన శివావతారప్రసిద్ధు నాది
శంకరాచార్యుఁ గొలుతు సాష్టాంగనతుల. 7.

మ. కలముల్ జేతను బూని పద్య మని యేకాసంతయున్ వ్రాయఁగాఁ
దలఁపుం జెందినముందు మ్రొక్కవలెఁగాదా సంస్కృతాంధ్రమ్ములన్
గలమర్మంబులు నాకుఁ దెల్పి కవితానైపుణ్యముం గూర్చు చా
వలి లక్ష్మీనరసింహశాస్త్రి గురుదేవస్వామికిన్ భక్తితోన్. 8.

శా. తర్కవ్యాకృతిపారదృశ్వ నిఖిలాంధ్రజ్యోతిషాంగ్లోక్తి సం
పర్కున్ సూర్యబుధేంద్రశిష్యమణి దర్భావంశ్యు సర్వేశవి
ద్యార్కున్ వ్యాకరణోపదేశకు ద్వితీయానంతు నెంతున్ శుభో
దర్కత్వంబు కృతజ్ఞతన్ బడసి మత్కావ్యంబు రంజిల్లఁగన్. 9.

గీ. కవియశఃపాత్రులై పేరు గనిన ఘనులఁ,
దలఁచెదఁ బురాతనాధునాతనవిభేద
రహితముగఁ, దద్వితీర్ణసారస్వతామృ
తము భవామయదివ్యౌషధమ్ము గాన. 10.

మ. చదు వన్యంబున, సంస్కృతాంధ్రములసంస్కారంబు దూరంబు నె
మ్మది గర్వాస్పద, మాస్యగహ్వరము దంభధ్వాంతసాంద్రంబు, దు
ర్మద మత్సర్ధము, సర్వ మాత్మ మనుధైర్యం బొప్ప గద్దించు క
ద్వద మూర్ధన్యుల; కట్టె వారికృప మత్కావ్యం బపేక్షించుతన్.

శా. నా కేలూరికి నిత్యమైత్రియును గృష్ణారాయసామంతమి
త్రాకాంక్షాపరిపూర్తియున్ గలుగ, దివ్యల్లాంఛనంబై చనన్
నా కేలన్ గవిసింహకంకణము సంధానించి యానందుఁడౌ
మా కొండ్రేగుల రామచంద్రసఖు సమ్మానించెదన్ నెమ్మదిన్. 12.

శా. భావింతున్ మదిలోఁ గృతజ్ఞతమెయిన్ బౌలుట్ల ఫాలాంకు స
ద్భావున్ వేంకటరాయచిత్తగృహశుంభద్రామనామాంకితం
బై వెల్గొందఁగ శంకరార్యజయకావ్యం బేను నిర్మించు న
ట్లావిష్ప్రీతిని సంఘటించిన కవిత్వాంతర్యవిత్సత్కవిన్. 13.

క. ఈరీతిఁ బ్రాక్కవీంద్రా
చారము నెఱవేర్చి విబుధసదయకటాక్షా
ధారమున జగద్గురువరు
చారిత్రము గూర్చ నెంచుసమయమునందున్. 14.

సీ. ఎవనితాత సృజించె భువిని వైకుంఠపు
రమ్ము నెల్లూర్మండలమ్మునందు
నెవనితండ్రి యొనర్చె నేలికల్ మెచ్చ గ్రా
మాధికారముతోడియున్నదాన
మెవని భ్రాతృద్వయ మెలమిఁ దపంబున
వాణిజ్యమున వన్నె వాసిఁ గాంచె
నెవని దత్తకుమారుఁ డింగ్లీషు విజ్ఞాన
శాస్త్రపట్టపరీక్ష జయము వడసె
గీ. నెవఁడు వేంకటరామాఖ్యుఁ బవరుప్రెస్సు
కంపెనీ ల్వెట్టి విఖ్యాతిఁ గన్నవాఁడొ
యతఁడు వేంకటరాయసమాహ్వయుండు
వెలయుఁ గులదీపకుం డను విమలకీర్తి. 15.

ఉ. శ్రీదరమావిలాసమున్ హసింపఁగఁ జాలెడుస్వార్జితార్థవ
చ్ఛ్రీదరమాభిసృష్టుఁ డతి శిష్టుఁ డమేయ యశోవిశిష్టుఁ డ
య్యాదగవంశదుగ్ధజలధీందుఁడు వేంకటరాయమంత్రి న
న్నాదర మొప్పఁ దోడ్కొని యొకప్డు స్వహర్మ్యముఁ జేరి యందులన్.

శా. ఆతిథ్యంబు నొసంగి భక్తియుతుఁడై యయ్యాతిథేయుండు శ్రీ
సీతారామపదద్వయిన్ మనమునన్ జిత్రించి, ఫాలాంక వి
ఖ్యాతున్ బావమఱఁదిఁ గాంచుడును, వక్కాణించె నావిజ్ఞుఁ డే
భాతిన్ వేంకటరాయుడెందమునకున్ వ్యాఖ్యానమై తోఁపఁగన్.17.

ఉ. రాయఁడుశాస్త్రియంత బుధరాజశిఖామణి మెచ్చ నాతనిన్
నాయకుఁ జేసి తత్త్రిమునినాథచరిత్రము పద్యకావ్యమా
చ్ఛాయ రచించి నేఁ డది ప్రసన్నగతిన్ సభలోఁ బఠింప నా
హ్వాయన మొప్పు వింటిమి సభాసదసాధువచఃప్రశస్తితోన్. 18.

క. శంకరగురువిజయము నక
లంకముగ రచింపఁ దడవులం బట్టి మదిన్
సంకల్పము గల దంటిరి
వేంకటరాయునికి నదె యభీప్సితము సుమీ ! 19.

చ. తనయులు వేలుపై తనరు దాశరథిన్ గృతినాథుఁ జేసి చ
క్కన రచియించి శంకర జగద్గురుదిగ్విజయప్రబంధ మ
ప్పన మొనరింప నిన్నటుగ భావనమున్ దలపోయుచుండు రా
ముని యభిలాషసైత మదె పో సమకూర్చెను మిమ్ము నిర్వురన్.

వ. అనుటయు రచనాసందిహానమానసుఁడనై. 21.

క. గ్రాసం బన్యుల దైనను
వాసము దన దంచు నుండవలె నంట్రు గదా
వాసము లేమిని గవితా
వ్యాసంగము క్షీణదశకు వచ్చిన దంటిన్. 22.

క. అది విని యవ్వేంకటరా
విది యెంతటి పని ? ప్రబంధ మీరు రచింపన్
సదనము రచింపఁబడదో
యెద నాచింతను ద్యజింపుఁడీ యిఁక ననుచున్. 23.

మ. సహజౌదార్యమొ, ప్రాజ్ఞలోక దురవస్థా పీడనా కర్ణనా
సహనత్వంబొ రచింపఁగాఁ దరమె ? తత్సౌజన్యజన్యోక్తి మ
ద్గృహమున్ తత్క్షణమే రచించి యిడు రీతిన్ దోఁప హృత్తాపమున్
బహుకాలాతిదురాపమున్ దొలఁగి యానందమ్మునన్ మున్గియున్.

గీ. మును పు బ్రాహ్మణచాపలమున రచింప
నెంతునే కాని యర్హుఁడనే తలంప?
శ్రుతుల శాస్త్రములను నదీష్ణు లగుకవులె
శంకరోదంత మనినంత జంకుచుండ. 25.

ఉ. "ఎక్కడ శంకరార్యగురుహృద్యచరిత్ర? వరాకి నైన నే
నెక్కడఁ? బట్టుకొల్పెద రిదేల? చిరార్జితకీర్తి వార్ధిలోఁ
గ్రిక్కునఁ గూల" నంచుఁ గలఁకన్ బరువెత్తు సరస్వతిన్ గవుల్
సు్రక్కక తద్గుణస్తుతికిఁ జొన్పుదు రెట్టివొ తత్ప్రభావముల్. 36.

వ. అనుటయు నవ్వేంకటరాయ మంత్రిచంద్రుం డిట్లను. 27.

సీ. శబ్దశాస్త్రముతోడి సంస్కృతాంధ్రోభయ
భాషారహస్యవిజ్ఞాన మెనసి
పదియు మూఁడేఁడులపాటు శ్రీ సూర్యరా
యాంధ్రనిఘంటుకృత్యమున మెలఁగి
శబరశంకరవిలాసము వేంకటేశ్వర
శతకాదులగు కృతితతి రచించి
ప్రథిత తాతాసుబ్బరాయశాస్త్రికి ముని
త్రయచరిత్ర మ్మంకిత మ్మొనర్చి

గీ. 'కవి' పరీక్షను సింహాకంకణము బిరుదు
గాఁ గొని 'కవిత్వభూష' నాఁకమ్ము నడసి
యున్న నీ వెన్న శంకరాభ్యుదయకావ్య
సృష్టి దక్షుండవే యంచు నెంతు మేము. 28.

క. మా యిలువేలుపు రాముఁడు
నీ యొసఁగెడు కృతికిఁ దుష్టినిఁ గనుచో శ్వ
శ్రేయసములు లభియించును
బ్రాయికమై మనకు నిరువురకు నని యనుచున్. 29.

గీ. ప్రేరకుఁడు రామభక్తుఁ డుదారహృదయుఁ
డల్లరాముఁడు కృతికి నాయకుఁ డగునటె
కావ్య మనిన జగద్గురు భవ్యచరిత,
చక్క సమకూడె నని సాధ్వసముఁ గుదించి. 30.

మ. సమయోన్మీలిత మాలతీ పరిమళా సారౌఘ ముష్టింధయ
క్రమమై దిక్తతికూలముద్రజమునై రాజిల్లు శ్రీశంకరా
ర్యమహాసద్గుణపుంజ మేడ? నస దా నస్మాదృశం డేడ? నై
న మదాచార్యకృపాకటాక్షమె నన్ గావింపదో ధన్యుఁగన్. 31.

శా. ధన్యంమన్యులు బుద్ధిశూన్యులు పవిత్రంమన్యు లంభోధిరా
ట్కన్యానర్త్తనమత్తు లౌనరవరాక శ్రేణిదుష్కీర్త్తి మా
లిన్యం బొందిన నాసరస్వతిని క్షాళింతు ర్యతివ్రాత మూ
ర్ధన్య శ్రీగురుశంకరార్యచరితోద్యత్కీర్త్తి దుగ్ధాంబుధిన్. 32.

మ. అధివాసింతుఁ ద్రిలోకరంగనటదుద్యచ్ఛంకరాచార్యయ
త్యధిరాట్కీర్త్తినటీపటీరపటుచూర్ణాకీర్ణధాత్రిన్ గుహా
యధరాధీశ ఖరీవిషాణనిభ వంధ్యాసూనుతుల్య క్షమా
ప్రథిమౌదార్యపరాక్రమాదినుతిదుర్గంధాక్త మద్భారతిన్. 33.

వ. అని యించుక సాహసంబూని ప్రయోజ్యప్రయోజకకర్తృతా
ధాముఁడు రాముఁడె యయినను, నేతదీయహృదయపుండరీక
దహరస్థుఁడై పలుకుచున్నవాఁడని యెఱింగియును, బ్రత్యక్షముగాఁ
బ్రేరకుండైన నాయకుం డగు వేంకటరాయసచివువంశంబు
నానృణ్యంబు వడయ వర్ణించువాఁడ. 34.

—: కృతిసంధాతృవంశవర్ణనము :—

సీ. త్ర్యాయుషం బొంది జరార్త్తుఁడై యిల వ్రాలి
యును బ్రహ్మచర్యంబు నుడుగ లేక
యూర్చుచు నింద్రుఁ డాయువు చతుర్థం బిచ్చి,
చూపింప వేదరాసులను జూచి
పర్వతత్రితయంబుపగిది భాసిల్లు, వే
దత్రయంబునకు వందనముసేసి
యింద్రు నానతిని ద్రయీగిరులం దుండి
పిడికెఁడు పిడికెఁడు వడి గ్రహించి

గీ. భూమికిం దెచ్చినట్టి యభూతపూర్వ
చరితుఁ డని వేదవినుతయశస్కుఁడైఁ 'య
నంతములు వేదము' లటంచు నవనిఁజాటి
నట్టి మహితు భరద్వాజు నగునె పొగడ. 35.

గీ. అతఁడె యౌను భారద్వాజుఁ డనఁగఁ సకల
శాస్త్రవిజ్ఞాత, కతిపయశాస్త్రకర్త

వేదమున శాతఁ డిడినదే భిక్ష యనఁగ,
జగము కాచిన యవ్వేత్త సాటి యెవరు. 36.

ఉ. ఆతఁడు గోత్రకర్తగ ద్విజాన్వయశాఖలు పెక్కు పుట్టి ధా
త్రీతలమెల్ల నల్లుకొని తేజరిలున్ స్మృతిశాస్త్రపారగ
ఖ్యాతిని; నం దొకండు దన రారు నృపాశ్రయ మొంది లౌకిక
ఖ్యాతిఁ ద్రియాపథానుచరమై వెలనాఁటినియోగిశాఖ నాన్. 37.

గీ. ఆయువేలనియోగిశాఖాఖ్యఁ గూడ
నొంది యవ్వెలనాఁటి నియోగిశాఖ
బ్రథితమూ నందు నీదరగ్రామమందు
వెలసె నొకవంశ మదె యింటిపేరు గాఁగ. 38.

క. ఆయీదరవంశమున ర
మాయుక్తుఁడు ధీయుతుండు మల్లమరా జ
గ్రియతను మూలపురుషుం,
డై యమరెడుశాఖ యొకటి ఖ్యాతం బయ్యెన్. 39

గీ. అల్లమల్లమరాజున కాత్మజుండు
లక్ష్మరాజు, తత్పుత్రుఁడు లక్షణాన్వి
తుఁడగు వెంకమరాజు, తత్పుత్రుఁడు రామ
రాజు తత్పౌత్రి పోలమరాజు నయ్యె. 40.

ఉ. పోలమరాజు వ్రాఁతఁ జమవున్ జినవాఁటనె నేర్చి తా నతం
డ్రాఘుమనీషచేతఁ గరణంబయి పై యధికారివర్గమున్
బాలితులన్ సమంబుగ మనంబు నొసంగి వశీకరించుకొం
చేలెను గ్రామ మాత్మయశ మెల్లలు దాఁటి భ్రమింప నెల్లెడన్.41

క. పోలమరా జాతఁడు సుగు
ణాలంబం బయిన మంగమాంబికయందున్
శీలుఁడు పితృభక్తుండు ద
యాళుఁడు నగు తనయు రామయాహ్వయుఁ గనియెన్. 42.

గీ. ప్రబలతరరాజకార్యనిర్వాహణశక్తి
మీఱ వెంకటగిరి జమీందారువలనఁ

గొనె మొఖాసాగ భూఖండమును రచించె
నటనె వైకుంఠపురము రామయప్రధాని. 43.

ఉ. కోటయుఁ గందకమ్ము నలుగోపురముల్ బురుజుల్ హజారముల్
కూటము లంపసాలలు వకుంఠితరీతి సృజించి యచ్చటన్
హాటకరత్నసృష్టరుచిరాలయవాసిగఁ జేసి రామునిన్
గాటపుభక్తిఁ గొల్చెఁ గలకాలము రామయ రామదాసు నాన్. 44.

గీ. నారికేళ గువాకు ధాన్యప్రభృతి ప
దార్థములు గూర్చి వాణిజ్య మాచరించి
యర్థములు రాసులుగను రామయ గడించె
గరమునం దున్న దేమొకో పరసవేది. 45.

సీ. ఆర్జించినాఁ డగణ్యం బైనవిత్తముల్
చేతి కెముక లేని రీతి నొసఁగెఁ
గొలిచె నిష్ఠను రఘుకులదీపకుని నెద
నెలకొల్పి తత్పాదనీరజములు
క్షేత్రబీజాంకప్రసిద్ధముల్ గణితముల్
పద్యమయమ్ముగాఁ బరిఢవించె
సన్నుతించెను రామచంద్రుఁ జాటు ప్రబం
ధాంకమాలికలఁ దానె రచించి

గీ. కట్టె వైకుంఠపతి వచ్చి కాఁపురమ్ము
సలుపఁ బురమును రాజోపచారయుక్తి
యాదరకులాంబురాశిపూర్ణేందుఁ డతఁడు
రామయామాత్యుఁ డుద్దామధామసీమ. 46.

మ. తనశ్రీశైలముయాత్రి యాత్రికజనుల్ దాహ మ్మటం జార్వఁగా
కని సామ్మొఁతో వ్యయించి నిర్జల తదుర్విన్ బావిఁ ద్రవ్వించి త
జ్జనులన్ నీరము గోల్చి కాని చనఁ;డాదాక్షిణ్యమున్ గార్యదీ
క్ష నెటన్ రామయమంత్రి నేర్చెనొ యశక్యం బేరికిన్ జేర్పొనన్.

శా. కాంతారమ్మున నర్ధరాత్రిముతఱిన్ కారొన్నచీఁకట్ల నే
కాంతం మ్మొఁగుచునుండఁ జోరకులు రామామాత్యు రోధింపగాఁ

జెంతఁ గల్గిన దేవతార్చనము నిచ్చెఁ దాన భీతిల్లి వా
రంతఁ బ్రొక్కి తొలఁగె నాశము ధైర్యం బెందునుం గందుమే.

ఉ. గాదెలు నిండ ధాన్యములు గాబులు నిండఁగఁ బాలె కాక యా
జ్యాదిపయస్యముల్, గృహమునం దతిథిప్రజ గోష్ఠపాళి ధే
న్వాదిపశూత్కరంబును నిరంతరమై యెసలార దానల
క్ష్మీదయితుం డతండు వెలసెన్ సితకీర్తుల భోగపూర్తులన్. 49.

చ. తగవరి వక్త భోగి నెఱదాత కవీంద్రుఁ డతండధీయుతుం
డగణితనీతిసీమ గణితాగమపూర్ణుఁ డుదీర్ణ రామభ
క్తిగఱుసు రామమంత్రి జగతిన్ బురుషార్థనిదానుఁడై మెలం
గఁ గలియుగంబునన్ గృతయుగం బయి రాజిలె నంద్రు తద్విదుల్.

క. కాసులవారింట నదిర!
కాసులబంగారు పొడమెఁ గద యనుఖ్యాతిన్
భాసిలు రంగమఁ బెండిలి,
సేసికొనియె రామయార్యశేఖరుఁ డెలమిన్. 51.

ఆ. 'అష్టపుత్ర బహుధనావాప్తి ర' స్త్వంచు,
సలుపు బుధుల దీవనలు ఫలింప
రామసుకవి గనియె రంగాంబయందు నె
న్మండ్రుబిడ్డలను, ననంతధనము. 52.

సీ. త్రవ్వించె నిర్జలస్థలి బావి శ్రీశైల
యాత్రికజనులు సౌఖ్యమ్ము గాంచఁ
'జెఱువు వేయించె నచ్చెరువు'గా వైకుంఠ
పురి పొలమ్ముల సస్యములు ఫలింపఁ
గట్టించె నిక్షేపకల్పమౌ భక్తి ది
వ్యంబుగా రామదేవాలయంబు
విప్రులకిచ్చె నివేశముల్ కట్టించి
యెనమండ్రు బిడ్డలఁ గనియెఁ బ్రీతి

గీ. నిలిపెఁ దోఁటలు కృతులు తానే రచించె
సప్తసంతతు లిటు శాస్త్రసమ్మతముగ
నొందఁ గల్గెను రామయార్యోత్తముండు
ధన్యజీవనుఁ డెల్లవిధంబులందు. 53.

సీ. మందారకుందారవిందసుందరకీర్తి
యగుచుఁ బట్టాభిరామయ్య యనఁగ
రసవత్కవిత్వనిర్భరకావ్యరచనావి
హారుఁడు రామకృష్ణయ్య యనఁగ
ధైర్యశౌర్యాసమౌదార్యగాంభీర్య గే
హము లక్ష్మినారాయణప్ప యనఁగ
త్యాగభోగవిరాగయోగానురాగుఁడై
యలరి పట్టాభిరామయ్య యనఁగ

గీ. నాత్మజులు నల్వు; రాల శేషమ్మ రామ
లక్ష్మి యాదిలక్ష్మమ మహాలక్ష్మమ యన
నలువు రాత్మజ లొప్ప నందనవనంబు
డంబు గని రామమంత్రి కుటుంబ మొప్పె. 54.

క. ఆరామయ సచివమణికు
రులలో నవరజుఁడు రమారమణపదాం
భోరుహఘటితమనస్కుఁ డు
దారుఁడు పట్టాభిరామయార్యుఁడు మెఱయున్. 55.

క. పట్టాభిరామయార్యుఁడు
పుట్టిన దాదిగను రామపూజాపరుఁడై
చుట్టాలకు సురమణి దయ
పుట్టి ల్లనఁ బొలిచె మహి నభూతోపముఁడై. 56.

గీ. ఆమహాత్ముఁడు పట్టాభిరామమంత్రి
సాధుశీల లక్ష్మీనరసమ్మ యనెడు
రామచంద్రుని రామయనామమహితు
తనయఁ బెండ్లాడెఁ బిత్రుదేవతలు చెలంగ. 57.

ఉ. మానితశాంతశీల, పతి మన్నన కెక్కిన ముద్దరాలు, స
న్మానితబాంధవాతిథివితాన, పురాణకథాశ్రుతీందిరా
ధ్యానవిలోలమానస, క్షమాభినవక్షమ యాచుఁ దోఁచు ల
క్ష్మినరసాంబ యంబయొ శచీసతియో యనసూయయో యనఁగ.

సీ. అత్తాఁడుబిడ్డ లేలా దాసియేనిఁ ద
న్నాడిన విని యెదురాడ నోడుఁ
బతియాజ్ఞమీ రేల? పసిపాప కోర భీ
తిల్లుచుఁ జెప్పిన దెల్లఁ జేయు
బంధులవలె కేల పరదేశు లేని రా
నాదృతిఁ బెట్టు నున్నంతలోన
నర్థుల కడిగినయంత యిచ్చుట యేల
పాత్రున కడుగకే బహుత నిచ్చు
గీ. యకుటిలామృతహృదయ దయామయాత్మ
యగుచు నీదర నరసాంబ; యామెదృష్టిఁ
బెద్ద లన దేవతల్, సుతుల్ పిన్న లనఁగ
నల్లనివి నీళ్లు తెల్లని వెల్లఁ బాలు. 59.

గీ. ఆనరసమాంబ యందుఁ బట్టాభిరామ
సచివమణి గాంచె సుతచతుష్టయముఁ వరుస
రామయామాత్యుయు వెంకటరావును వెలి
గొండరాయని వెంకయామాత్యునిఁ గుమారు. 60.

క. వెలిగొండ్రాయఁడు నాల్గేఁ
డులయీడున జనకులకుఁ గడుపుశోకముఁ సం
ధిలఁజేసె; నట్టిశోకము
గలుగని పుణ్యాత్ము లెందుఁ గలరో లేరో! 61.

వ. పట్టాభిరామమంత్రిపరోక్షమున నా నరసాంబ బిడ్డలతో దండ్రి
యగు రామచంద్రునిరామయకడ నుండె. 62.

సీ. గతభర్తృకను గూఁతుఁ బితలేని మనుమలఁ
గాచి పెంచినదయాకరహృదయుఁడు
తల దెగిపోవుచిక్కులయందునే నన్ను
తము పల్కులేని సత్యవ్రతుండు
ప్రాణహాని తటస్థపడినను గర్మలో
పము లేని ధర్మప్రవర్తనుండు
అర్ధరాత్రము నూర్గు రతిథులు వచ్చిన
నేని మృష్టాన్నమ్ము నిడెడు దాత
గీ. కంకణముపాడు మున్నగు గ్రామములకుఁ
గరణ మయి యేలుధర్మాధికారి రామ
చంద్రరామయ నరసాంబజనకుఁ డనఘుఁ
డలరు సిరిసంపదలుగల్గి లలితకీర్తి. 63.

క. నరసాంబాతనయులు ము
వ్వురును ద్విమూర్తులను ద్విగుణములఁ ద్విజగములన్
దొరయుచు మాతామహుమం
దిరమునఁ బెరిఁగిరి తదీయనిరుపమరక్షన్. 64.

వ. అందు.

ఉ. రామయ పెద్దవాఁ డయి కరం బలరారుచు రామయాఖ్యమా
తామహసంస్కృతుం డయి యథావిధిఁ జేయుచు బ్రహ్మచర్యము
ద్దామము విద్దియన్ గఱచి తా నధికారము దానఁ గాంచి పై
పై మెఱయందొడంగె మెఱుపా యనుచాయను నిత్యుపేతుఁడై. 65.

క. కడగొట్టువాఁడు వెంకయ,
కడుభక్తిని దల్లి నన్నగార్లఁ గొలుచు దా
విడిముడియుఁ బుడుకుఁ జదువులుఁ
గొడుకును గూఁతురును మనుమగుఱ్ఱలు వెలయన్. 66.

గీ. వారిలోన ద్వితీయుండు భాగ్యమహిను
నద్వితీయుఁ; డమ్మాతృపురియందుమాత్ర
మధ్యముఁడు, సర్వజనులందు మహిమను బ్రథ
ముఁడయి వేంకటరాయఁ డభ్యుదయ మొందు. 67.

ఉ. రామయమంత్రి కట్టినపురంబును గోటయుఁ బేటలుఁ సుధా
ధామములుఁ బసుల్ ధనము ధాన్యము సర్వముఁ గాలకర్మ పా
కామితధాటి నెక్కడివి యక్కడనే మటుమాయమయ్యె నౌ
రా మహి నేరికిన్ దరతరంబులుగా వశమయ్యెనే సిరుల్. 68.

గీ. బొగ్గ భువి స్రగ్గి వజ్రమై పొదలునట్లు,
చెఱకు నలఁగిఁ గాఁగియును జక్కెరయగునటు
మన్ను బలుకాఁకఁ గాచ మామాడ్కిఁ గష్ట
జీవి నఘువృత్తిచే సుఖజీవి కాఁడె. 66.

సీ. దారిద్ర్యఘోరాంధకారమం దుదయించె
నమృతాంశుబింబము ట్లాదియందు
నజ్ఞానకాంతార మంతయుఁ బరశు వ
ట్లడఁచి విద్యామార్గమందు నడచె
సంసారసాగరసంతరణార్థమై
వాణిజ్యతరిపోతవాహుఁ డయ్యె
ధరణీరమాకీర్తితరుణుల సాపత్న్య
కలహకేళులఁ గాంచి కులుకనేర్చె

గీ. దీనజనులకు భూమ్యవతీర్ణకల్ప
తరువు, సారస్వతామృతదానఘనుఁడు
ఘనతరేదరవంశముక్తాఫలోత్త
మాయితుం డగు వేంకటరాయమంత్రి. 70.

శా. సారాచారుఁ డుదారమానసుఁడు శశ్వద్విద్వదాశీర్వచో
వారాభీష్టుఁడు, సంస్కృతాంధ్రకవితావల్లీ ప్రసూనాయితో
దారస్వచ్ఛయశోభిరాముఁడు రమాపాణీశభక్తప్రభుం
డౌరా వెంకటరాయమంత్రి యనఁగా నార్జించె సత్కీర్తులన్. 71.

సీ. తనయిలువేలుపై తనరు శ్రీరఘురాము
నామకీర్తనము సంతతము జరుగు
రామభక్తుండు పితామహుఁ డతని నా
మము రాముఁ డగుటఁ దత్స్మరణ గలుగు

మాతామహుండు రామయ, రామమూర్తి మి
త్రియు వారిపేళ్లు నం దిమిడియుండుఁ
బట్టాభిరామయాహ్వయుఁ డగుతండ్రినా
మైకదేశముగూడ నదుకుట యగు

గీ. ననియు నంతయు రామమయం బొనర్ప
నగు ననియుఁ గంపెనీకి రామాఖ్యఁ బెట్టి
తమ్మున కొసంగి యది; యాదిఁ దనసమాఖ్యఁ
గలిపె వేంకటరా మొండు కంపెని నిడి. 72.

క. వేంకటపదపూర్వకరా
మాంకన మగుకంపెనీకి నధ్యక్షుఁడుగా
వేంకటరామయ కాఁగలఁ
డింక ననెడియర్థ మొదవదే యం దరయన్. 73.

క. వేంకటరామాకంపెని,
వేంకటనాయకుఁడుబోలె వెలయుచుఁ గలిలో
సంకల్పితార్థసిద్ధి న
శంకముగ సరజిరాస్యసమితికి నొసఁగున్. 74.

సీ. వేంకటరామకంపెని కద్యతనభర్త
'రామా' కు భూతపూర్వప్రభుండు
ప్రథితవేంకటరామ పవరు ముద్రాలయ
త్రాత 'ప్రారంభవిద్యా' ప్రణేత
బహుబాలబాలికాపాఠశాలానేత
నైకవిద్యార్థిసంఘాన్నదాత
గ్రంథకర్తృచకోరరాజికళానిధి
లలితకళాత్యభిలాషుకుండు

గీ. మందగోద్ధర్త భారతామందభావ
సుందరత్వప్రదర్శనానందపూరి
తాంతరంగుఁడు మాతృభాషావనవ్రి
తుండు వేంకటరాట్సువిప్రుండు వెలయు. 75.

చ. బడులను విద్యలన్ బడయుబాలురనిర్మలినాంతరంగముల్
పొడ వగు సుబ్బమాహ్వయ విభూషితపాండురసౌధరాజమున్
గడుకొని యిచ్చు విప్రభవనంబులు సత్కవికావ్యసూక్తులన్
విడుదులుగాఁ జెలంగు నల వేంకటరాయుని కీర్తికాంతకున్. 76.

సీ. కటిదఘ్నపంకసంకలిత మార్గాంతలు
శ్రమపడి ఘంటాపథములు సేసె
నంధకారమున నల్లాడుబాధలు తీర్చెఁ
బ్రతిచతుష్పథము దీపములు నిలిపి
త్రావ నీరము లేనితావుల మధురోద
కూపాంబునాళసంకుల మొనర్చె
నిల్లిల్లు కాల్నడ నేఁగి జనేష్టముల్
తెలిసి తీర్పించెఁ దాఁ దీర్చెఁ గొన్ని
గీ. పౌరలోకకృతజ్ఞతాస్ఫోరకముగఁ
బేఁట యేలూరుపురిఁ దనపేర వెలయ
వరలుఁ బురపాలసంఘసభ్యతను బెక్కు
హాయనములుగ వేంకటరాయమంత్రి. 77.

ఉ. ఆడినమాట తప్పఁ డెదురాడఁడు పెద్దల మాట, కెవ్వ రే
మాడిన మాన మూనుఁ, దగవాడెడుశత్రువుచిత్తమేని నో
నాడఁడు, దైవభక్తి విడనాడఁడు, రచ్చకు రాఁడు సత్యమున్
వీడఁడు, గూడఁ డల్పులను వేంకటరావు జనించు టాదిగన్. 78.

సీ. మాతామహుని యాలమందఁ గాచిన వాని
కాలమందలు నేఁ డనంత మయ్యె
ననుగృహా మ్మరిగి వారాన్నముల్ దినువాఁడు
సతతాన్నదానసువ్రతము నడపు
నిలువ నీడయు లేక కలఁగువానికి నేఁడు
హర్మ్యముల్ గృహము లిన్నన్ని కావు
దన కండ యైనమిత్రము రామమూర్తిని
నేఁడు వ్యాపారాన నెంపుకొలిపె

గీ నిట్టి పరిణతి గర్వింప కెవఁడు మనును ?
గనఁడుగాక నాఁడును నేఁడు గర్వలవము
మచ్చునకునైనఁ గలనైన మాటకైనఁ
గాని వేంకటరాయప్రధాని యౌర. 79.

శా. పుత్రుర్ వెంకటరత్నముఖుర్ గురుపదంబుం జేసి యాంగ్లేయవా
క్పాతుర్ దన్ను నొనర్చినట్టి కరుణావారాంనిధిర్ సత్త్రా
డ్గోత్రాలంకృతి బాపనాఁబను సుతుండో యన్నటుల్ భక్తియు
జైస్మృతిర్ వేంకటరావు నేఁటికిని సంమానించు మేలెంచుచుర్.80.

ఉ ఏయెడ నెవ్వరుర్ దృణమునేని యొసంగనిదుర్దశర్ సహా
ధ్యాయుఁడు రామమూర్తియగదా ననుఁదేల్చెనటంచు ద్రవ్యపుర్
సాయమొనర్చి వర్తకమునర్ నెలకొల్పె విపన్ను నాసఖుర్
బాయక తాఁ గృతజ్ఞతకుఁ బాల్పడి వేంకటరావుదారతర్. 81.

ఉ. పన్నగభర్తకేని యలబ్రహ్మకునే నివి యిన్ని విన్ని యం
చెన్ని వచింప నౌనె? ధన మెన్నక వేంకటరాయమంత్రి పై
కొన్నతమిర్ ఘటించువడుగుల్ గృహదానములుర్ వివాహముల్
జన్నములుర్ బడుల్ గుడులు సావడులుర్ సలిలాన్నసత్రముల్.

ఉ ఆర్యనుత ప్రశాంత సుగుణాంబుధి వేంకటరాయమంత్రి యౌ
దార్యము రామభక్తి విబుధాదరణం బటు లుండ; శంకరా
చార్యులపేరు సెప్ప వివశం బగుభక్తి విరక్తి వేరియా
చార్యకమందు నేర్చెనొ యసాధ్యములై కనిపించు బేర్కొనర్.83

ఉ. అద్యతనార్యలోకతరణార్థము నిత్యము ధూపదీప నై
వేద్య పురస్సరార్చనలు వేళకు సల్పు నిబంధనమ్ములర్
హృద్యముగా మఠంబు రచియించి జగద్గురు విగ్రహప్రతి
ష్ఠాద్యనవద్యకార్యములకై పనిఁబూనెను ధర్మకర్తయై. 84.

క. అంకితముగ రామునకుర్
శంకరవిజయమ్ము నప్పనము సలుపుచుఁ ద
చ్ఛంకరమఠ మనువుపఱచు
వేంకటరాయని తలంపు వినుతింపఁ దగుర్. 85.

శా. అద్వైతప్రతిపాదకార్థనిబిడవ్యాహార మా శాంకరీ
యద్వైపాయనసూత్రభాష్యమును నిత్యం బందు బోధింపఁగా
విద్వన్మాన్యము పాఠశాలయును భావిన్ సంప్రతిష్ఠింపఁ దా
హృద్వీథిన్ గలపోయునాఘును తలం పీడేఱు లక్ష్మీకృపన్. 86.

శా. భారద్వాజసగోత్రసత్కృతిసుతా పాణిన్ గ్రహింపన్ బుధా
చారం బొప్పమినో, రఘూద్వహుని దా జామాతఁగా బావఁగా
నారాధింపఁ దలంచియో, గతమమత్వాహంకృతిత్వమ్ము, కా
నీ రామార్పణ మంచు శంకరకథన్ జేయించెఁ గావ్యంబుగన్. 87.

ఉ. భీష్మసమానసువ్రతుఁడు వేంకటరాయఁ డజస్ర మైహికా
ముష్మికవిద్యలన్ బ్రచురముల్ పచరించుటమాత్రకాక యా
ముష్మిక మాఫలంబె తలపోసి మహౌషధశాల సర్వరో
గోష్మనితాంతశాంతికయి యుంచెను "మోడలుఫార్మసీ" యనన్.

సీ. ఉదయించినాఁడు నెల్లూరుమండలిని వై
కుంఠపురం బను కొటికయందుఁ
జేరినాఁ డెటులో యేలూరుపురం బాంగ్ల
విద్యాభ్యసనకాంక్ష విడువ కలఁప
జదువుకొన్నాఁడు వైశ్యశ్రేష్ఠుఁడగు గ్రంధి
రామమూర్తి నిజమిత్రంబు గాఁగ
వర్ధిల్లినాఁడు శ్రీవరుడగు రాముసా
యమున వాణిజ్యమ్ము నాచరించి

గీ. దేవభూదేవభక్తి మహావిరక్తి
గర్వరహిత స్వతంత్రతల్ గన్నవాఁడు
ఉన్నవాఁడు పరోపకారోత్సుకతను
మన్నవాఁడు వేంకటరాయమంత్రిమౌళి. 89.

వా. వాణిజ్యమ్మున నేర్పు, రామునెడలన్ భక్తిప్రపత్తుల్, విని
ద్రాణత్యాగకళాప్రవీణత, కవిత్వాసక్తి, దేవాలయ
క్షోణీదేవనిశాంతనిర్మితియుఁ గైకొన్నాఁడు పైతామహ
త్రాణద్రవ్యము గాన నీదరకులోత్పన్నుండు దాయాదుఁడై. 90.

చ. పరమవిరక్తుఁడై వనుల పాలయి పోయినయన్న రామయన్
భర మని చూడ కేఁగి పలు పాట్లకు లోనయి తెచ్చి, యెట్టులో
పరిణయమున్ బొనర్చి, సహభార్యుని దండిగృహాన నిల్పె,నా
భరతున కొక్కవాసిఁ బయివాఁడయి వేంకటరావు ధీరతన్. 91.

సీ. తనబంతిఁ బదిమంది దిన కున్న దిన మొక్కఁ
డుండదే గార్హస్థ్య మూనుటాదిఁ
దనపేర నెన్నిసంస్థలు పుట్టెనో తల
యెత్తి వ్యాపారమం దెసఁగుటాదిఁ
దన్నాశ్రయించి యెందఱు మనుచుండిరో
గ్రంథముద్రాపణక్రియము లాదిఁ
దనదానదీక్ష నెంతఱకు విద్యలు వచ్చె
నో పాఠశాలల నుంచుటాది
గీ. సుబ్బమాంబిక చేపట్టుశుభముహూర్త
మెంతప్రబలమ్మొ కాని యదృష్టరేఖఁ
బట్టి పాతాళముననుండి బయలుసేయ
నగడె వేంకటరా వంట నిక్కువంబు. 92.

సీ. ఎవ్వాఁడు మౌద్గల్యఋషిగోత్రమైన గో
పాలునివారింటఁ బ్రభవమొందెఁ
గృషి సేసి పండించి యెవ్వాఁ డతిథికోటి
కన్నంబు వెట్టె నిత్యవ్రతముగ
నెవ్వాఁడు భూతదయావాలమై దైవ
భక్తి భూదేవానురక్తి మించె
స్ఫురదీదరాన్వయాకరహీరకళిక సీ
తమసాధ్వి యెవ్వానిధర్మపత్ని
గీ. యట్టి వేంకట నరసయాఖ్యప్రధాని
తనయ సౌశీల్యసౌభాగ్యధన యనంగ
నలరు సుబ్బమాదేవి నర్ధాంగిఁగా గ్ర
హించె వేంకటరాయమంత్రీంద్రుఁ డెలమి. 93.

క. ఈదర సుబ్బమ దేవికి
సాదరమృష్టాన్నతర్పితాతిథితతికిన్
లేదురా యీధర సాటి త
లోదరి సోదరలయందు నున్నది యేమో ! 94.

సీ. తన యనావిలసతీత్వము సత్కుటుంబినీ
జనముపాలిటి యొజ్జసాని గాఁగ
దన యన్నదానవ్రతం బన్నపూర్ణాభ
వానికిఁ దోఁబుట్టువావి నెఱపఁ
దన చక్కఁదన మమర్త్యనితంబినీకదం
బంబున కాచార్యకంబు నడుపఁ
దన యనితరసుసాధ్వప్రతిభార్జిత
విద్య వాగ్దేవితో వియ్య మొందఁ
గీ. దనదయారసపూరితాంతఃకరణము
నాత్మనవనీతమునకు ననుంగు గాఁగ
నెగడె వేంకటరాయమంత్రిగృహలక్ష్మి
సుజనవినుతగుణాలంబ సుబ్బమాంబ. 95.

శా. ఆసౌశీల్యము నావివేకయుతవిద్యాపాటవం బాశమం
బాసౌరూప్యము నావచోమధురిమం బాయన్నదానాదరం
బాసౌభాగ్యనిదానదీనజనతాత్యంతానుకంపాప్తి యూ
హా సిద్ధించునె సుబ్బమాంబికకుఁ గా కన్యాంగనాపాళికిన్.

గీ. పరమసాధ్వి సుబ్బాంబతోడ్పాటు కతనఁ
గాదె వేంకటరాయ విఖ్యాతి ప్రబలె,
నైకకంత్యమ్ము లేకున్న నాలుమగలొ
నర్చు నొకధర్మమును శుభాంతముగ నగునె. 97.

సీ. పది యిత్తు నన్న నేఁబది యీఁ దగవులాడు
గుడ్డ యీ బోఁ గూడు కూడఁ బెట్టుఁ
జదువు చెప్పింపఁ బో సాదమ్ముకై పోరు
వడు గొనర్పఁగఁ బెండ్లి వలదొ యనును

ఎలమిఁ బెండిలిసేయు నిల్లు లే కట్లను
నిలుకట్టి యీ నెంచ స్థలమొ యనును
గుడి కట్టఁ గలహించు గోపురాదుల కవ్వి
కట్టింప స్థిరవృత్తి కై పెనఁగు

గీ. ధర్మకార్యమ్ము లొనరించుతఱిని బ్రాణ
విభున కొక్కకు పైఁ జదివినది యదిర!
యనఁగఁ బతితోడ భూతదయాబ్ధి సుబ్బ
మాంబ వాదాడ ముచ్చట యగును జూడ. 98.

గీ. కుందనపుఁ బైడి మణితోడికూర్పుపోలెఁ
బూవునకుఁ గమ్మ తావులపొత్తుపగిది
నమరె వేంకటరాయసుబ్బాంబి కాను
కూలదాంపత్య మున్నతకోటి కెక్క. 99.

గీ తనయ నొంటిగ నత్తింటి కనుప లేక
తనయు జానకీరాముఁ డో ననిపె నఁట
తండ్రి వెంకటనరసప్రధాని కెంత
ప్రేమయో సుబ్బమాంబిక పేరు సెప్ప. 100.

ఉ. రామపదాబ్జ చింతన ధురంధరుఁడై విలసిల్లి జానకీ
రామయ, సుబ్బమాంబిక కరం బనుర క్తిని జూప, విద్యలన్
క్షేమ మొంర్ప నేర్చి కుడికేలయి వేంకటరాయమంత్రి క
తూమ యశంబు గూర్చి, చనెఁ గాని జనించున యంతవాఁ డిలన్.

గీ, అక్క సెలియండ్రలో సుబ్బమాంబ యొక్క
తియ తనదుచెల్లె లనుచు మతిం దలంచు
జానకీరామయార్యుఁ, డా సరణి సుబ్బ
మాంబయుఁ దలంచునన్న యా నతని గుఱిచి. 102.

గీ. కొడుకు వెంకట నరసయాఖ్యుండు సీత
మాఖ్య పుత్రిక తనపేరి నవని నిలుప
నవని నిలిపి సిలింప పురాధివాసి
యయ్యె జానకీరామయ్య యావనమున. 103.

క. పరమేశ్వరకృప వేంకట
నరసయ్యయు, సీతమయు ననామయ దీర్ఘా
యురుపేతు లగుచు విభవా
కరులయి విద్యావివేకఘనతన్ మనుతన్. 104

క. సోదరమృతి శోకాంబుధి,
నీదఁగలే కందు మునిఁగి యెటో తేర్కొనెఁ ద
త్సోదరి సుబ్బాంబిక చిన
సోదరుఁ డగు శేషయార్యుఁ జూచుకొని మదిన్. 105.

క. శేషయ వేంకటరాయు న
శేషవ్యాపారభరణశేషుఁడై సం
తోషం బక్కకుఁ గూర్చుచు
భూషణమై కులమునకు; సపుత్రిక మలరున్. 106.

చ. 'పడఁతులమేలుబంతి యయి భాసిలుసాధ్వికి సుబ్బమాంబకున్
గడుపు ఫలింపదాయె' నను గాటపులోపము సోదరీకుమా
రుఁడు పటుబుద్ధిరూపరుచిరుండగు వేంకటరాముఁ డర్మిఁ బెం
పుడుకొడుకై తొలంచి, కులమున్ నిలిపెన్ బితరుల్ తరింపఁగన్.

క. వేంకటరామయ ప్రతిభా
సంకలితాంగ్లేయసారసారస్వతబీ
జాంకురిత వాఙ్ముఖముల న
లంకారించును సభాస్థలంబుల రక్తిన్. 108.

సీ. ముక్తాఫలప్రాయముగ వ్రాయఁగా నేర్చు
నమృతమ్ము గురియ మాటాడనేర్చు
వ్యవహరింపఁగ నేర్చుఁ బాదుషాతోనైనఁ
బరిహరింపఁగ నేర్చుఁ దురితపథము
తళుకు దిద్దగనేర్చుఁ దండ్రి వాణిజ్యానఁ
దల్లియాజ్ఞను దలఁ దాల్పనేర్చు
నేకపత్నివ్రతం బెలమిఁ బ్రోవఁగనేర్చుఁ
బాలింపనేర్చు సేవకులఁ బ్రేమ

గీ. దీనజనబాంధవుం డాంధ్రదేశమాతృ
నర్ఘమకుటాగ్రఖచిత హీరాంకురంబు
శ్రీయుతేదరవేంకటరాయసుంతి
సుతుఁడు వేంకటరామార్యుఁ డతులయశుఁడు. 109.

ఉ. శ్రీవనితన్ ముకుందుఁడు, శచిన్ సురనేత, రతిన్ మరుం, డుమా
దేవి శివుండు, గైకొనినతీరున వేంకటరాముఁ డర్మిలిన్
దేవిగఁ గృష్ణవేణి రమణీమణిఁ గైకొనె ఖ్యాతితోఁ; జిరం
జీవులు పుత్రవంతు లయి చెన్నెసలారుత వారు దంపతుల్. 110.

గీ. ఆకొడుకుఁ గోడలును నిజార్ధాంగలక్ష్మి
తన్ను సేవింప నిత్యాన్నదానసువ్ర
తుండు వేంకటరాట్సచివుండు వెలయు
రామపూజల శంకరారాధనముల. 111.

ష ష్ఠ్యం త ము లు.

క. ఏవంవిధసుగుణశ్రీ
భావుకహృదయేదరాన్వవాయాభరణ
శ్రీవేంకటరాయహృదయ
భావితసుకుమారపాదపంకేజునకున్. 112.

క. షడ్వికృతిదూరునకు నరి
షడ్వర్గవిదారునకు నిసర్గమునతమో
దుర్విద్యమలాకారునకు సు
రేడ్వినుతస్థామదళదహితసారునకున్. 113.

క. వీర్యవదర్యమతన యా
జర్యస్నేహప్రదీప్త శౌర్యునకు, మహా
క్రౌర్యకుటిలహార్యాత్మజ
నిర్యాతన దధదకారుణికకార్యునకున్. 114.

క. హార్దమృదువిభీషణ సౌ
హార్దవశాభయవచో నిరాఘాటునకున్.

నిర్దయమర్దిత దుర్దమ
దుర్దశ దుర్దశముఖాదిదోషాటునకున్. 115.

క. కల్యాయితశరనిధికి న
హల్యాకల్యీకరణమహౌషధికి జగ
త్కల్యాణకరణగుణసా
కల్యోదధి శార్ఙ్గజీవికాసేవధికిన్. 116.

క. సౌభ్రాత్రరతికిఁ బరసు
భూభ్రాతవదాకృతికి విరోధివరూధి
న్యభ్రతతిసదాగతికి న
దభ్రాంపతి గభీరతాయుతమతికిన్. 117.

క. శుద్ధునకుఁ దపస్వీమనో
బద్ధున, కాజన్మసిద్ధ పటుశౌర్యకళా,
సిద్ధున, కధర్మహృతిస
న్నద్ధునకు నిశాటపాటనక్రుద్ధునకున్. 118.

క. శాంతునకుఁ గాంతిజితరతి
కాంతునకు నితాంతకీర్తికాంతాలలితా
క్రాంతున కింద్రియజయ వి
క్రాంతునకు దయారసాపగాకాంతునకున్. 119.

క. సీతారామునకు సరి
న్నేతృవినుతధామునకుఁ బణతముక్తిలతా
స్ఫీతారామునకు నప
ర్ణాతన్వీజప్యనామునకు రామునకున్. 120.

వ. సద్భక్తిసమర్పణంబుగా నా రచియింపం బూనిన శ్రీశంకర
విజయంబునకుఁ గథాక్రమం బెట్టి దనిన. 121.

విషయసూచిక.

ప్రథమాశ్వాసము.

కథాప్రారంభము, కేరళదేశవర్ణనము 1
కాలట్యగ్రహారవర్ణనము 3
శివగురు చరిత్ర 5
శివగురుని తపస్సు 10
శివగురునకు శివుఁడు ప్రత్యక్షమగుట 13
ఆర్యాంబ గర్భముదాల్చుట 16
శంకరుని జననము 19
శివగురుని నిర్యాణము 26
శంకరుఁడు తల్లినూరార్చుట 27
శంకరుని వేదాది విద్యాభ్యాసము 29
దరిద్రబ్రాహ్మణి కథ 31

ద్వితీయాశ్వాసము.

శంకరుని యాకారవర్ణనము 41
శంకరవాగ్వర్ణనము 47
శంకరు కీర్తివర్ణనము 52
శంకరుఁడు తల్లికడకు వచ్చుట 55
ఆర్యాంబకొఱకు నదీపూరమింటిదరికి శంకరుఁడు తెచ్చుట 63
శంకరుని పెండ్లాడుమని తల్లికోరుట 65
శంకరునకు కన్యనీయ నొకవిప్రుఁడు వచ్చుట 66
శంకరుఁ డల్పాయువని తల్లి విలపించుట 70
శంకరుఁడు సంన్యసింప తల్లినిగోరి నిరాకృతుండగుట 73
శంకరుఁడు సంన్యసించుట 78
శంకరుఁడు బ్రహ్మోపదేశముగోరి యేఁగుట 81
శంకరుఁడు, గోవిందయతికడ కరుగుట 83
గోవిందయతి శంకరునకు బ్రహ్మోపదేశ మొనర్చుట 85

తృతీయాశ్వాసము.

యత్యాశ్రమము స్వీకరించిన శంకరుని వర్ణనము 89
వర్షాకాలవర్ణనము 91
శంకరుని యష్టవిభూతిసిద్ధి 93
శరదృతు వర్ణనము 94
గోవిందయతి యనుమతిని శంకరుఁడు కాశికేఁగుట 97
శంకరుఁడు కాశిచేరుట 99
సనందనుఁడు శిష్యుఁడగుట 101
శివుఁడు మాలనిరూపమున శంకరుని పరీక్షించుట 105
శంకరుఁడు బదరికాశ్రమమున కేఁగుట 113
శంకరుఁడు ప్రస్థానత్రయాది గ్రంథములను రచించుట 114
సనందనుఁడు పద్మపాదుఁడగుట 115
పాశుపత మతనిరాసము 118
కాశీవాసులు శంకరు నుతించుట 120
వృద్ధబ్రాహ్మణుఁడై వ్యాసుడు శంకరుని పరీక్షించుట 126
శంకరకృతవ్యాస స్తుతి 137
వ్యాసుఁడా భాష్యమును శోధించి వరము లిచ్చుట 139
వ్యాసునిగూర్చి పద్మపాదునకుఁ గలిగిన శంకను శంకరుఁడు వారించుట 143

చతుర్థాశ్వాసము

కుమారిలభట్టు పూర్వచరిత్ర 145
కుమారిలుని బౌద్ధాగమాభ్యాసము 152
కుమారిలుని దిగ్విజయము 153
కుమారిలుని పశ్చాత్తాపము 161
శంకరుఁడు ప్రయాగకేఁగి కుమారిలుని చూచుట 162
తుషాగ్ని ప్రవిష్టుఁడగు కుమారిలుని శంకరుఁడు చూచుట 164
శంకరుఁడు మండను దర్శింపనరుగుట 172
మండనుఁడు శంకరునకు భిక్షావందన మొనర్చుట 180
శంకరుఁ డుభయభారతిని దీర్పరిగ నిర్ణయించుట 184
శంకరమండనుల వాదసభ 185
శంకరశిష్యులకును, మండనశిష్యులకునుజరిగిన వాదము 189
ఉభయభారతిసాక్షికముగ శంకరమండనులు వాదించుట 193

పంచమాశ్వాసము.

మండనుని పరాజయము 209
మండనుని సంశయములు తొలఁగ జైమిని ప్రత్యక్షమై చెప్పుట 213
మండనుఁడు శంకరుని స్తుతించుట 214
భారతి తనపూర్వవృత్తాంతమును జెప్పుట 219
భారతిశంకరునితో వాదింపగోరుట 220
ఉభయభారతి శంకరుని కామశాస్త్రమున ప్రశ్నించుట 222
శంకరుఁడుభయభారతిని గడువు వేడుట 227
శంకరుని కామకలాధ్యయనము 228
ఉభయభారతికి పరాజయభీతి 229
శబరుఁ డుభయభారతికిఁ జిలుకను దెచ్చియిచ్చుట 230
ఉభయభారతికిని చిలుకకును జరిగిన కామశాస్త్రవాదములు 233
[illegible]యనుల మత భేదముపైనడచిన వాదము 235
చిలుకతగవుదీర్పవలెననిగోరుట 240
చిలుక చెప్పినప్రకారముభయభారతి భర్తయు శంకరసన్నిధి కేఁగుట 241
శుక మొనర్చిననృసింహస్తవము 244
గుహ వెడలివచ్చిన శంకరుఁడు మండనోభయభారతుల సంభావించుట 247
శంకరుఁడు గెలుపొందినట్లు భారతి యంగీకరించుట 248
శంకరుఁడుభయభారతిపాండిత్యమును నుతించుట 251
సన్యసింపనున్న మండనుదేహమున నుభయభారతి రోగశక్తిచేఁ జొచ్చుట 253
ఉభయభారతి భారత్యవతారమని శంకరుఁ డెఱింగి స్తుతించుట 255
మండనుని సన్యాసస్వీకారము 258

షష్ఠాశ్వాసము.

కాపాలికుని చరిత్ర 267
గోకర్ణేశస్తుతి 283
హరిహరస్తుతి 285
శంకరుఁడు మృతుఁడగు బాలుని బ్రదికించుట 289
మూకాంబాస్తవము 290
హస్తామలకచరిత్ర 293
శృంగగిరియందు భారతిని ప్రతిష్ఠించుట 299
సురేశ్వరుని గ్రంథరచన 306
సురేశ్వరునిపై సతీర్థ్యుల యీర్ష్య 308
హస్తామలకుని పూర్వజన్మ వృత్తాంతము 311

సప్తమాశ్వాసము.

శంకరుఁడు తల్లిసమీపమునకు యోగశక్తిచే నరుగుట 324
శంకరుఁడు తల్లికి తత్త్వోపదేశము చేయుట 325
శంకరుఁడు స్వయముగా తల్లికి నుత్తరక్రియలు చేయుట 327
పద్మపాదుఁడు దక్షిణదిగ్యాత్ర కొనర్చుట 332
పద్మపాదుఁడు మేనమామ యిల్లు చేరుట 335
పద్మపాదుఁడు తన భాష్యటీకను మేనమామయింట నిడి తీర్థయాత్ర కరుగుట 340
పద్మపాదుఁడు దర్భశయనాది పుణ్యస్థలముల కరుగుట 342
పద్మపాదాది శంకరశిష్యులొక్కట కూడుకొని యాచార్యులంజేరుట 346
కాలిపోయిన పంచపాదిగ్రంథమును శంకరుఁలు ధారణాబలమున జెప్పుట 350
శంకరుఁడు కేరళరాజునకు నాటకత్రయమును చెప్పుట 351
శంకరుఁడు జైత్రయాత్రకు వెడలుట 352
శంకరునకు శాక్తులతో వాదము 353
లక్ష్మీభక్తులతో వాదము 356
శారదోపాసకులతో వాదము 357
వామాచారశాక్తులతో వాదము 359
శంకరుఁడు రామేశ్వరమున కరుగుట 362
శంకరుఁడు శైవమతమును ఖండించుట 369
విపక్షశూలాది లింగధారులతో వాదించి శంకరుఁడోడించుట 373

అష్టమాశ్వాసము.

భక్తమత నిరాసము 383
భాగవతమత నిరాసము 387
విష్ణుమత నిరాసము 389
పాంచరాత్రమత నిరాసము 392
వైఖానసమతనిరాసము 394
కర్మహీన మతనిరాసము 397
హిరణ్యగర్భ మతనిరాసము 399
వహ్నిమతనిరాసము 402
సౌరమతనిరాసము 403
హరిద్రాగణపతి మతనిరాసము 412
ఉచ్ఛిష్ట గణపతిమత నిరాసము 414
నవనీత గణపతిమత నిరాసము 416
తామ్రపర్ణీతీర విప్రులకు జ్ఞానోపదేశము చేయుట 418
క్రకచుడను కాపాలికునిచరిత్రము 420
ఉన్మత్తభైరవునితో వాదము 425

చార్వాక మతనిరాసము 427
సౌగతునితో వాదము 430
క్షపణకమత నిరాసము 432
జైనమత నిరాసము 433
బౌద్ధునితో వాదము 434
మల్లారిభక్తుల నద్వైతులఁజేయుట 436
విష్వక్సేనమతనిరాసము 438
మన్మథమతనిరాసము 440
ఇంద్రమత నిరాసము 443
యమమత నిరాసము 445
నాచికేతోపాఖ్యానము 446
వరుణ, వాయు, భూమి, తీర్థ మతముల ఖండన 451
వరాహమత నిరాసము 454
లోకసేవక మతనిరాసము 454
గుణోపాసక మతనిరాసము 455
సాంఖ్యమతఖండనము 455
కాపిలమతనిరాసము 457
పరమాణువాద మతనిరాసము 460
కర్మవాది మతనిరాసము 462
చంద్రమత నిరాసము 463
అంగారకాది గ్రహోపాసకు లద్వైతు లగుట 463
పితృమతఖండనము 465
గరుడభక్తుని, ననంతభక్తుని అద్వైతులఁజేయుట 466
సిద్ధోపాసకాదు లద్వైతులగుట 466
గంధర్వోపాసకులుపరాజితులగుట 467
బేతాళోపాసకులను వశపఱచుకొనుట 468
నీలకంఠమతమును జయించుట 470

నవమాశ్వాసము.

ఉజ్జయినియందు భాస్కరభట్టు నోడించుట 480
బాహ్లికదేశమున నార్హతమతస్థులను గెలుచుట 489
నానాదేశవిజయము 494
శంకరునకు భగందరవ్రణము పుట్టి మానుట 498
శంకరుని సర్వజ్ఞపీఠాధిరోహణము 514
శంకరుఁడు సశిష్యుఁడై కేదారమున కేఁగుట 526
ఉపసంహారము 527

శ్రీశంకరవిజయకథాసంగ్రహము.

ప్రథమాశ్వాసము.

భరతఖండమునఁ బ్రసిద్ధమగు కేరళదేశమందుఁ గాలటి యను నగ్రహార మొకటి యుండును. అందు శివగురుఁ డను బ్రాహ్మణుఁ డార్యాంబ యను భార్యతోఁ గాఁపురము చేయుచుండును. వేదవేదాంగవేత్త, యజ్వ తపస్వియు నైయాద్విజుఁడు దేవమనుజఋణముల మాత్రము దీర్చుకోఁ గల్గెనే కాని సంతతి లేకుండుటచేఁ బితౄణము నుండి విముక్తుఁడు కాఁజాలక, పరిపరిగతులఁ జింతించి తుదకు భార్యాయుతుఁడై సమీపమం దున్న వృషగిరీంద్రముఁ జేరి యందు స్వయంవ్యక్తలింగాకృతిఁ దనరారు పార్వతీపతిని బెద్దకాలము సేవించెను. అట్లు కొన్ని వత్సరము లరుగ నొకనాఁటి శివరాత్రి మహాపుణ్యకాలమున నాదంపతు లుపవసించి పగలెల్ల శంభుసేవానిమగ్నులై రేయి జాగరణం బొనర్చు దీక్ష నుండిరి. అత్తఱి శివగురునకు జాగ్రన్నిద్రామధ్యస్థితి కలిగి చూచుచుండఁగనే యాకాశమందుఁ గైలాసమువలె నొక తెల్లని పెద్ద మేఘము మెఱుపుఁ దీఁగెలతళతళలొలయఁ గాన వచ్చి క్రమముగా భూమికి డిగి యెట్టయెదుట నిలిచి నట్లగుటయుఁ దదేకదృష్టిఁ జూచుచుండ నామేఘమధ్యమం దొకవ్యక్తి కదలుచున్నట్లును, దేహార్ధమున స్త్రీత్వ మమర నచ్చెరువు గొల్పుచుఁ గ్రమముగా నయ్యది పురుషుఁడై నట్లును దోఁచెను. పరిశీలింపఁ దలను జందమామ, కనులయందు దయారసము, హస్తములందు నభయవరదముద్రలు గలిగి యాపురుషుఁ డర్ధనారీశ్వరుఁడై యెదుట నిలచుటయు శివగురుఁడు సాష్టాంగనతిపూర్వకముగ వివిధము లగు స్తుతు లొనర్చుచు జిరకాలముగఁ గఠిననియమములఁ గృశించినవాఁ డగుటచేతను నానందాతిరేకముచేతను వివశుఁడై భూమిపయి సొమ్మసిల్లి వ్రాలుచుండఁ బరమశివుండు కరుణాళుం డగుటఁ దనకుడిచేయి చాచి

తటుక్కునఁ బట్టి యెత్తి 'నీవును నాలును దపంబుల నుపవాసంబుల డస్సితివి. కావున నాఁకలిదీఱఁ దినుం 'డని యొక మామిడిపండ్ల గుట్ట చూపింప' నందొక్కటి సుందరమును సురభిళమును నై మనంబు నాకర్షింపఁగఁ జిన్నదగు పండును గరద్వయంబునం బూని యెత్తుచుండఁ గనే చే జాఱి క్రిందఁబడి యాపండు శీర్ణమగుటయు నందలి రసము నల్దెసల వెల్లువగట్టుటయుఁ గాంచి తుళ్ళిపడి కన్ను దెఱచునంత—నెదుట శివలింగము, దీపమును, రవంత కనుమూసికొనియున్న గృహిణియుఁ గానఁబడఁగ నయ్యది స్వప్న మని నిశ్చయించుకొని దానిఫలమును గూర్చి తనలోఁదాన 'అయ్యో! మావిపండ్లగుట్టను భగవంతుఁడు సూప నాచిన్నపం డొకటియే యేల కైకొంటిని? కైకొంటినిబో నది సగము పై కెత్తుచుండనే భూమిపయి నేల పడెను?' అని కొండొకవిచారించి 'కొడు కొకఁడు పుట్టును వాఁడు సకలగుణపూర్ణుఁడును జగద్విఖ్యాతుఁడు నగును గాని పూర్ణాయుష్మంతుఁడు కానేరఁ' డని స్వప్నఫలంబు నిర్ణయించుకొని, పరమేశ్వరున కట్టి యనుగ్రహము మాయెడఁ గలిగె, నేమొనర్పఁగల మనుకొనుచు నీవృత్త మాద్యంతము వినినచో బిడ్డలు లేమికిఁ బొందు వంతకంటె నెక్కువవంత నొందగల దని తలంచి యెట్టకేలకు భార్యతో మాకందఫలవృత్తాంతమంతయు భూమిపైఁ బడుట మాత్రము చెప్పక చెప్పెను. ఆర్యాంబయు నొడలెఱుంగని సంతోష మొంది శివునకుఁ బార్వతికి సాష్టాంగ నమస్కారము లొనర్చి నుతించెను.

తెల్లవాఱుటయు నాదంపతులు సమీపగత యగు పూర్ణానదిని స్నాన మొనర్చి వృషగిరీశ్వరుని బరివారదేవతలతో యథావిధిగ నారాధించి యావ్రతమ్మున కుద్యాపనమ్ము నడపి యింటికి వచ్చి పెక్కురు బ్రాహ్మణుల కన్నదానము సేసిరి. బ్రాహ్మణభుక్తాన్న శేషము శివప్రసాదబుద్ధి శివగురుం డారగించె, నార్యాంబయుఁ దదనుజ్ఞ మెసవెను.

ఆనాఁడు పరమేశ్వర తేజ మాయన్నము నందుండి యార్యాంబ గర్భమునఁ జొచ్చి క్రమముగా నెదిగి నవమాసములు పూర్తియైన పిదప మనుజబాలకాకృతిం బుడమి నవతరించెను. శివగురుం డానంద మొంది జాతకర్మాది సంస్కారములు యథావిధిగ నడపెను. పురుటిదినములు సుఖముగఁ జనుటయు నేకాదశవాసరమున సకల బంధుమిత్రయుతుండై యా శివగురుండు తనయునకు 'శంకరప్రసాదమునఁ బుట్టె ననియో, లేక లోకముల కెల్ల శుభమును గలిగించువాఁడగు ననియో కాని 'శంకరుఁడు' అని నామకరణ మొనర్చెను ఆర్యాంబయు వత్సలత దీపింప బిడ్డని సకలోపచారములఁ బెంచుచుండెను. బాలచంద్రుని రీతి నాబాలుఁడు పెరుగుచుండెను. ఆతని చేష్టలందును మాటలందు నపూర్వమహిమము కానవచ్చుటంజేసి శివగురుం డమితామోద మొందుచుండెను. ఇట్లు నాలుగేండ్లు గడచునప్పటికె యాబాలుఁడు మాటలు నేర్చులేకాక, స్వభాషతో నితరభాషలు లిపులు నేర్చుకొనుటఁ గాంచి తండ్రి శివగురుఁ డాతని కుపనయనసంస్కార మొనరించి వేదాధ్యయన మారంభింపవలె నని యన్నివిధముల యత్నించుచు, నా సంస్కారము జరుగకుండఁగనే శరీరము వాసెను. ఆర్యాంబ భర్తృవియోగమునఁ బరితపించుచుండ శంకరుఁడు విరాగసంపన్నములగు సూక్తులఁ నందఱు నచ్చెరువొందఁ దేర్చెను. ఆబాలుం డనుపనీతుఁడగుటచే శివగురునకు నార్యాంబాప్రార్థనమున జ్ఞాతులు పారలౌకికక్రియల నెఱవేర్చిరి. మరుసటి వత్సరమున నాయమ గోరఁగా శంకరున కుపనయనసంస్కారమును జ్ఞాతులు సలిపిరి. శంకరుఁ డట్లు సంస్కృతుఁడై వేదాధ్యయనార్థమై గురుని వెంటఁ దన్మందిరమున కరిగెను. గురుకులవాసపూర్వకముగా బ్రహ్మచర్యవ్రతము నిష్కళంకముగ నడుపుకొనుచు నేకైకసంధిగా వేదప్రపంచ మంతయుఁ గబళించి సకలశాస్త్రములు సర్వకళలు నభ్యసించెను.

ప్రాతఃకాలమున స్నానము చేసి, సంధ్యావందన మొనర్చి గాయత్రీజపము, పంచాక్షరీమంత్రోపాసనము, సలిపి యగ్నికార్యము సేసికొని సబ్రహ్మచారులతో వేద మధ్యయనించి మధ్యాహ్నకాలమైనంత మాధుకరవృత్తి నన్నము భిక్షించి తెచ్చికొని భుజించుచు బ్రహ్మచర్యవ్రతదీక్ష నుండు నత్తఱి నొకనాఁ డాగ్రామమున మాధుకరార్థమై వెడలి గర్భదరిద్రురాలగు నొక బ్రాహ్మణి యింటికిఁ బోయి 'భవతి! భిక్షాం దేహి' యనుటయు నాయమ ఖిన్నురాలై యాయవారమునకై తన భర్త గ్రామములోని కేఁగి నాఁడనియుఁదాను నిరుపేద ననియుఁ దుదకుఁ గట్ట గుడ్డలేనిదాన ననియు విలపించి యైన నీవంటి యుత్తముఁ డింటికిరా నూరక పంపరాదని యిలు నలుఁగడ వెదకి యొక యుసిరికకాయ మాత్రమ యున్న దని కన్నీరు వెట్టుకొనుచుఁ శంకరుని చేతియం దిడెను. ఆతఁడాయమ దారిద్ర్యబాధకు మిగులఁ దపించుచు నచటనె నూరుచుండి యాచమించి మహాలక్ష్మిని శ్రీసూక్తమున స్తవము సేసి యాత్మీయానర్గళకవితం బొగడుటయు నంతరిక్షమునుండి యాదరిద్రగృహచత్వరమునఁ గనకామలకములు వర్షముగాఁ గురిసెను. అంతట బ్రాహ్మణి కృతజ్ఞతను బరిపరిగతులఁ దెలుపచుండ నాయమభర్త వచ్చి శంకరు ననేకగతుల నుతింపఁ దనయనహంకృతి బయలుపడ 'నిదియంతయు మీయదృష్టవిశేషమే కాని నావలన నేమియుఁ గాలే'దని చెప్పి గురుకులమునకుఁ జనెను. దానితో నాతనిమహిమ మాయగ్రహారమున మెఱపు మెఱసి నట్లొక్కపటి వ్యాపించెను.

ద్వితీయాశ్వాసము.

తరువాతగురుగృహమునుండి శుశ్రూష సేయుచు నేడేండ్లయీడు వచ్చుసరికి సాంగోపాంగముగ వేదశాస్త్రము లన్నియు నభ్యసించి సమావర్తనవ్రతము సేసికొని గురుల యనుమతి నొంది

యింటికి వచ్చి తల్లిని దర్శించి, మ్రొక్కి, యామె దీవెనలంది విద్య లన్నియు నావృత్తి చేసికొనుచు, వటువులకు గోరిన విద్యల నధ్యాపించుచుండెను. తల్లి యాతని విద్యావివేకాదులు చూచు భాగ్యము తండ్రికి లేకపోయెఁ గదా యని వగవ, విరాగోక్తులఁ జెప్పి యామెకుఁ జిత్తశాంతి గల్గించుచుండును. ఒకనాఁ డాయమ యూరి నంటి ప్రవహించుచుండు పూర్ణానదికి మధ్యాహ్నసమయమున స్నాన మాడఁ జని వచ్చునప్పుడు దారియందెండచేఁ గాలుచున్న యిసుక యందు నడుగులు పుటపుట పొక్కు లెక్క నడువఁజాలక సొమ్మసిల్లి కూలుటయు నావృత్తాంతము శంకరుఁడు విని పరుగెత్తి వచ్చి యాయమకు శైత్యోపచారములు చేసి తేర్చి యింటికిఁ దెచ్చి సేద తేర్చుచుండెను. ఆసమయమ్మునఁ గేరళదేశాధీశ్వని మంత్రి శంకరుని గౌరవపూర్వకముగ రాజాజ్ఞ చొప్పునఁ గొనిపోవ వచ్చి చూడఁగా శంకరుఁడు మనసు వికలమై జననీశుశ్రూషాపరుఁడై యితర మెఱుంగకుంట యరసి రాజునకు నావృత్తాంతము దెలుప దిగ్గన నశ్వము నెక్కి శంకరుని కడకు వచ్చి 'ఆర్యా! మీజనని నిత్యము స్నానముచేయ నది కరుగ నక్కరలేకుండ నదీశాఖ యొకటి మీగృహం బొరసికొని ప్రవహింప నేర్పాటు చేసితిని. రేపకడఁ జూతువుగాక' యని పలికి 'బాలుఁడయ్యు సకలవిద్యాపారంగతుఁ డయ్యె శంకరుం' డని ప్రజ లెల్ల నద్భుతముగాఁ జెప్పుకొనుచుండ విని యొక్కపతి నిన్ను సందర్శింపఁ దోడ్కొని రమ్మని మామంత్రి నంపితిని. ఆతండు మీమాతృశుశ్రూషాపరాయణత్వమ్ము దెలుప నచ్చెరువడి నేనుస్వయముగా దర్శించి పోనెంచి వత్తును. ఇవె కానుకలు. వీనిఁ గైకొని యీమదగజ మెక్కి యొక్కమారు మాగృహమునకు వచ్చి నన్నుఁ బవిత్రుఁ జేయు మనుటయు, శంకరుఁ డాకానుకలు ముట్టక "రాజేంద్రా! బ్రహ్మచారి యిభాదివాహనారోహణము సేయ నర్హమా? వర్ణాశ్రమధర్మరక్షాతత్పరుఁడవు. నీవే యిట్లుపలుక న్యాయమా?" అన నాభూపతి తన ప్రమాదమునకు

లోలోన నొచ్చుకొనుచు 'నార్యా! నేను రచించిన నాటకత్రయము మీకు వినిపించి యెందేని నెఱసు లున్న సవరించుకొం దలంతు' న నుటయు నప్పుడు చదువు మని విని 'రసవంతముగా నున్న' వని మెచ్చుకొని నావలన నింకేమేని పనిగలదా? యనఁ బుత్రలాభార్థినై మిమ్ము వేడుచుంటి ననుటయు నీ కవశ్యము పుత్రులు గలుగు నుపాయము సెప్పెదను ముందీకాన్కలుగాఁ దెచ్చిన బంగారంతయు నీగృహస్థులకుఁ బంచిపెట్టు మని యట్లు చేయించి రాజు నంపుచు సంతతిగలుగ వేదోక్తమగుయాగముసేయ నేకతముగా నుపదేశించుటయు నాతని సుగుణగణముల వర్ణింపుచు సపరివారముగ రా జరిగి మఱునాఁడు వేకువనె పూర్ణానదీప్రవాహమును శంకరునిగృహమునొద్దకుఁ దెచ్చెను. అతఁడుపదేశించిన ప్రకారము యాగమును జేసెను. దానితో నాతని ఖ్యాతి నల్గడల వ్యాపించి కాలటియం దడుగిడఁ జోటు లేనట్లు జను లాతని జూడ మూఁకలు గట్టి రాఁదొడంగిరి. పూర్ణానదీసారణీజలాస్వాదనమున నయ్యగ్రహారవాసు లంద ఱతరిమితానందము నొందిరి. శంకరుండును జననియు స్వస్థచిత్తులైరి. నడుమ నడుమ శంకరునకుఁ దమపుత్రికల నిచ్చి పెండ్లిసేయఁ బెక్కురు భూసురులు రాఁగా వారికిఁ దన యసమ్మతిని దెల్పి పంపివేయుచుండును అది యరసి యొకనాఁడు తల్లి శంకరుని జేరి పెండ్లి యాడుమని ప్రేమపూర్వకముగా నెంతయో దూరము బోధించెను కాని యాతఁడు బాలుఁడ నగు నాకిప్పుడు పెండ్లి యేమని యాయమమాట త్రోసిపుచ్చెను. యార్యాంబయు లోలోన వగపు దిగమ్రింగి యూరకుండెను. అమఱునాఁ డొకసంపన్నగృహస్థు బంధుసమేతముగా వచ్చి తనకూఁతు నాతని కీయ నెంచినట్లు ముందుగా నార్యాంబకుఁ దెలియఁ జెప్పి వటువునకు విద్య గఱపుచున్న శంకరుని జేరి సన్మానితుఁడై యాతఁడు చెప్పుచున్న పాఠమును సబాంధవుఁడై వినుచుండెను. శంకరుండును దరువాతిపాఠమును వటువులకుబోధించెను. నాఁటిపాఠము ప్రబోధసుధాకరమందలి కాం

తాఁగర్వాణపత్రికరణము. అది యంతయు. విపులముగ నుపన్యసింప విని పెండ్లిమాట తలపెట్టనేరక యాతని యనుమతి నొంది యార్యాంబ కావృత్తాంత మంతయుఁ జెప్పి శంకరుని జన్మపత్త్రింబును జూడఁ గోరిరి. ఆర్యాంబ తెచ్చి యీయ వారిలో నొక దైవజ్ఞుఁ డది చూచి తల యూఁచి మెచ్చుకొని తుదకుఁ బెదవి విఱువ నేమి యట్లంటిరి? నాతండ్రులారా! యని యార్యాంబ యడుగ నాతఁడు 'సర్వవిధములనీతఁడు మహోత్కృష్టుఁడు కాని యాయువు మాత్రము మధ్యమమైననుగా కున్నది' అని చెప్పెను ఆ గృహస్థు మాఱాడక సబాంధవముగా నేఁగఁ బుత్త్రుని యల్పాయుష్యముఁ గూర్చి యార్యాంబ గొల్లుమని యేడ్వసాగెను. తోడన శంకరుండు వచ్చి యాసంగతి నంతయుఁ దెలిసికొని తల్లికి విరాగము నుపదేశించుచు శరీరము లశాశ్వత మని ధ్రువపఱచి మృత్యువు లేనివాఁడొకమృత్యుంజయుఁడు కావున నాతని సేవించి యమృతత్వ మొందువాఁడఁ గాన ననుజ్ఞ నొసంగుమని యమృతత్వ మనఁగా ముక్తి యనియు దానికై సన్యసింప ననుమతింపు మనుటయు నాయమ మఱింత వగుచుచు 'వృద్ధను దిక్కులేదానను. నన్ను డిగవిడిచి సంన్యసించి పోదువే' యని దీనముగఁ బలికి యనుమతింపకుంట యరసి శంకరుఁడు తల్లి కుపశాంతివచనము లేవేవో చెప్పి యొంటరిగఁ గూరుచుండి తనలోఁ దర్కించుకొని తుదకు సన్యసింప నిశ్చయించుకొని తల్లికి శుశ్రూషలు సేయుచుండెను. ఒకనాఁటిరేయి యాయమ కోరఁగా భాగవతమున ధ్రువప్రహ్లాదాదిభక్తులచరిత్రములు చదివి యందలి రహస్యముల నన్నింటిని విప్పి చెప్పెను. దాన నయ్యిరువురకు మనస్సున నాందోళనము హెచ్చి యొట్టకేలకు నిద్రపట్టెను. అరుణోదయవేళ మేల్కొని శంకరుఁడు సశిష్యుఁడై నదికి స్నానార్థం బరిగె. ఇంట నిద్రించుచున్న తల్లి ముక్తకంఠముతో నేడ్చుచు మేల్కొనెను. ఆయమ దుఃఖధ్వని విని శంకరుండు స్నానము చేయువాఁడు పరుగుపరుగున వచ్చి 'యేమి తల్లీ!' యని సంభ్రమ

మ్మన నడుగ, నామెసుతుని కంఠము కౌఁగలించుకొని 'తండ్రీ! య
ది కల యనినిన్నుఁ జూచి యనుకొంటిని. కాని యది నిజమనుకొని

పూర్ణాయువుతో యతివయిరేని బ్రతుకుము.

యెంతదుఃఖించితినిరా' యనుటయు నాస్వప్నము చెప్పుమని శంకరుఁ డ
డుగ నామె యిట్లనియె. ఈపూర్ణానది పొంగిపొరలి వచ్చుచుండెను.
నేనును నీవును స్నానార్థమై యరిగితిమి నీచేయూఁది నేను గటిదఘ్న
మగు నీట స్నానముచేయుచుంటిని. నీవు లోని కీఁదుచుఁ బోవుచుండ
నొక మొసలి కాలుపట్టుకొన నీవుమునిఁగిపోవుచు 'నమ్మా! యిప్పుడైనసం
న్యసింప ననుజ్ఞయి'మ్మంటివి. ఏమనుటకు నోరాడక విలపించుచుండ
మరలఁ గొట్టుకొనుచు నీటిపైకి లేచి అమ్మా యేమంటి వనుచు మర
ల మునిఁగి పోయి యిఁకఁ గానరావైతివి. దానితో నొడ్డునఁ గూలిమూ
ర్ఛిల్లి యేడ్చుచుండఁగా మెలఁకువ వచ్చెను. ఇల్లు నలుఁగడ నరసితిని.
నీవు కానరాలేదు. దానితో మఱింత దుఃఖము కల్గినది. అన విని శంక
రుఁడు వెఱఁగొందుచుఁ దల్లి నూరార్చి యాభుజబంధమున నుండియే
భవబంధము తొలఁగ 'సంన్యస్తం మయా' యని మానసికముగ
సంన్యసించుటయు తెల్లఁ బోయి తల్లి 'యిదేమిరా! తండ్రీ! నాకు ది
క్కెవ్వరు?' అని కుంద వగవవల దని చెప్పి జ్ఞాతులు వీరందఱు నిన్నుఁ
గాపాడుదురు. నీదేహము మృత్యువశమగునెడ సంస్కారము నొనర్చిధ
నమంతయు స్వీకరింపఁ గలారు. నీస్మృతి రేయియైనను బగలైనను నను
స్మరింప వచ్చి పరమపదము నొందింతును, అని చెప్పి జ్ఞాతులఁబిలిచి
పితృధనమంతయు వారి కొసఁగి తల్లిని బోషింప వేఁడుకొని యందఱి
యనుమతినిఁ జొంది సమీపమున నున్న విష్ణ్వాలయమున కేఁగి యాదేవునకు
మ్రొక్కి 'నీతల్లి క్షేమమునకై రాజును బ్రోత్సహించి తెచ్చిన నదీ
సారణి తరంగముల తాఁకున నీదేవళము కూలనున్న' దను నశరీరవా
ణి వినవచ్చుటయుఁ దత్క్షణమె కేరళాధీశ్వరు రావించి యీదేవుఁడు

నీవాంఛితము దీర్చును. క్షేమకర మగువేఱొక తావున దేవళము ని
ర్మింపు మనుటయుఁ దదాదేశమున మునుపు క్రతు వొనరించి యిష్టసిద్ధి
బడసిన హేతువున నారాజన్యుడు శ్రీహరికి నబాధమైనచోటఁ బెద్దగుడి
తోడన కట్టించుటయు, శంకరుఁడు తద్దేవతావిగ్రహముల నుద్ధరించి
మూపునఁ బెట్టుకొని తెచ్చి యందుఁ బ్రతిష్ఠసేసి యచట గదలి చని
యె అట్లువెడలి నర్మదానదీతీరమున నున్న గోవిందయతిచంద్రు నా
శ్రమంబున కరిగి గుహాముఖంబున నాతనిపాదము దర్శించి ప్రదక్షిణించి
ప్రసన్నుఁ జేసికొని బ్రహ్మోపదేశమును గోరఁ గ రు ణ వా డ మి
యామహాత్ముఁడు మహావాక్యచతుష్టయముచే బ్రహ్మస్వరూపము నె
ఱుఁగఁ జెప్పి సంన్యాసనియమమ్ము లన్నియు వివరింప యోగాభ్యాస
ము సలుపుకొనుచుఁ గొంతకాల మచ్చట నుండెను.

తృతీయాశ్వాసము

అట్లుగోవిందభగవత్పాదుల పాదసేవ సేయుచు యోగాభ్యాస మొన
ర్చు నత్తఱి వర్షాకాలము వచ్చుటయు నకాఱువానలకు నర్మద పొం
గి మునుల యాశ్రమంబుల నెల్ల ముంచివైచుచుండ గురువుల తపంబు
న కెచట విఘ్నము ఘటిల్లునోయని శంకరుఁడు తనచేతికమండలువు
నర్మదానదీపూరంబున నొడ్డి తదుల్బణమంతయు హరించెను. ఆసంగతి
తెలిసి గోవిందయతి శంకరుం గాంచి యష్టవిభూతులు నీకు సిద్ధించినవి.
నదీజలము కమండలువున నిముడ్చుట వశిత్వమనెడి యష్టమసిద్ధి.
ధన్యుఁడవు. నీవు కాశికరిగి, విశ్వేశు సేవించుకొనుము. తొల్లి గురుదేవుఁ
డగు గౌడపాదమహర్షి యొక కథచెప్పె వినుము "మున్నొకప్పుడు హి
మవన్నగంబున నత్రిమహర్షి యొకయజ్ఞముచేయుచుండ వ్యాసుఁడచటికి
వచ్చెను. మును లెల్లరు పూజించి కోరఁగా వేదాంతార్థ ముపన్యసించె
ను. పిదప నీరసించిన బ్రహ్మసూత్రములకు నేఁటిపండితు లిచ్చవచ్చిన
యర్థములను గల్పించి చెప్పుచున్నారు. వానిని వారించు భాష్యం

బత్యావశ్యక మనుటయు, మునులారా! యిట్టి ప్రసంగమే కైలాసమున
నీశ్వరుని సభయందు వచ్చెను. అప్పుడు నే నిట్లంటిని. నాతో సముఁ
డొకఁడు పుట్టును. ఆతఁ డుద్రేకమునొందిన నదీజలమును గమండలువు
నఁ బట్టిత్రావించువశిత్వసిద్ధి గాంచి మెఱయుచు, గోవిందయతికి శి
ష్యుఁడై యుండు నని చెప్పితిననియు, నాతఁడు దుర్మతముల ఖండించి
యద్వైతము జగతిని స్థాపించు ననియుఁ జెప్పి చనె' ననెను. వత్సా!
యది నేఁడు నిజమయ్యెను. కావున నుత్తమనిబంధనరచనలచే జగత్తును
ద్ధరింపు మనెను. తోడనె గురుని కరుణారసభరితమగు నాశీస్సు లంది
శంకరుఁడు కాశికేఁగి గంగానదిని నవగాహ మొనర్చి విశ్వనాథు సేవిం
చుచు నుండెను.

అయ్యెడ నొకనాఁడు బ్రహ్మచారియు, వేదవేత్తయునగు నొక
బ్రాహ్మణబాలుఁడు శంకరుని పాదముల వ్రాలి 'మహాత్మా! భవవార్ధి
దాటఁ గోరి వచ్చితిని. కరుణాప్లవ మొసఁగి రక్షింపు' మన లేవ నెత్తి
నీవృత్తము చెప్పుమన 'నార్యా! నేనొక విప్రబాలుఁడ. కావేరీజలపూత
మగు చోళదేశము నావాసభూమి. సనందనాఖ్యుఁడను. సంసారము
తరింపంగోరి మహాత్ములకై జగంబున నాపరిభ్రమింపని తావులేదు.
నాభాగ్యమున నేఁటికి నిన్నుఁ గంటిని. నన్నుద్ధరింపు, మని పెక్కువిధ
ముల వేఁడ నాతనికిఁ బారమహంస్యపద మొసంగి శంకరుఁడు ప్రథమ
శిష్యునిగా గ్రహించెను. అది గాంచి యెందఱో జ్ఞానవంతులు శిష్యు
లై కొలువఁ జొచ్చిరి.

అంత నొకనాఁటిమధ్యాహ్నకాలమున శంకరుఁడు సశిష్యుఁడై
స్నానార్థము గంగ కరుగుచుండఁ ద్రోవలో నొకమాలఁడు కలుద్రావి
తూలుచు సమీపగతుఁడయ్యెను. వానిని దూరముగాఁ దొలఁగుమని
యతి పలుకఁగా నన్నెడఁ గలుగఁ బొమ్మనుచుంటివి? దేహమా?
దేహియా? ఇప్పుడు తొలఁగఁదగినది? అని ప్రశ్నింప నొడలు-జల్లు

మున నయ్యతిపతి యీతండు సాధారణశ్వపచుండు గాఁడని తెలిసికొని జగమంతయు నాత్మగా నెవ్వఁడు దృఢబుద్ధి నెఱుంగునో యాతఁడు ద్విజుండైనను మాలఁడైనను నాకు వంద్యుండే! హరి మొదలు పుత్తికా పర్యంతమగు దేహములందు దోఁచు చేతనయే నేను గాని దృశ్యముగా నను దృఢబుద్ధి గలవాఁడు పుల్కసుఁడైనను నాపాలిటిగురువే! యను నేతాదృశజ్ఞానకస్ఫోరకసూక్తుల నుతించుచు భక్తిపారవశ్యమునఁ గన్ను లు మూసికొని లోఁజూపునందు నామాలఁడే శివాకారముగాఁ గాన రాఁగ నొడలు గఱుపాటునఁ బొంగుచుండ నాశివుఁడు వ్యాససూత్ర ముల కద్వైతపరముగ భాష్యము రచింపఁ బ్రేరేపింపఁ గొంతవడికి స్వాస్థ్యము నొంది పరమేశ్వరుఁ డట్టిరూపముతో నేలా కానవచ్చె నని పరిపరిగతుల వితర్కించుకొనుచు నేటి కరిగి స్నాన మొనర్చి మాధ్యాహ్నికకర్మకలాపము నిర్వర్తించుకొని యాశ్రమంబు సేరి పరమేశ్వరు ధ్యానించి కాశినుండి బదరికారణ్యమున కరిగి యందుండి ప్రస్థానత్రియము రచియించి యద్వైతార్థప్రతిపాదకము లగు పెక్కుగ్రంథములఁ నిర్మించి వానిని శిష్యులకుఁ బాఠము సెప్పుచుండెను.

అట్లు చదివించునప్పుడు ప్రథమశిష్యుఁడగు సనందనుని సారెకుఁ బిలిచి 'యది యట్టుల యిది యిటుల' యని భాష్యరహస్యములఁ దెల్పుచుండుట నరసి యితరశిష్యుల కందఱు కసువొడమి గురునెడనిసుమంత యవిధేయత వెలిఁబుచ్చ నయ్యనఘుఁడు సనందనుదృఢభక్తి వీరికిఁ దెలుపుదుఁగాక యని గంగ కద్దరి నుండఁగా సనందనా! యన పిలచెను. ఇవ్వలకు రా నెంచి యాతఁడు నావకై యత్నింప నేదియు దొరకక గురుభక్తియే నావగా నెంచి గంగాప్రవాహమున 'జే' యని కాలుంపఁ గాలిక్రింద నొక తామరపూవు పుట్టి యుండెను. అతఁడు రెండవపాద మెత్త నింకొకటి పుట్టుటఁ గాంచి గురుని కరుణకదా కారణమనుకొని నిర్భయముగా నిలిచి గంగయందుఁ బోవుచుండెడుపద్మ

పంక్తిపై నడచి యీవలకు వచ్చెను గురుఁ డాతని లఘిమవిభూతిసి
ద్ధి కానందించి యభినందించెను. శిష్యులెల్లరు సిగ్గువడి క్షమియింప
వేడుకొనిరి. నాఁడు మొదలు సనందనుఁడు పద్మపాదుఁడయ్యెను.

తరువాతఁ బాశుపతు లమ్మహాత్ము నెదుర్పఁ దన్మతము ఖండించివైచెను. ఆవార్త జగమెల్ల వ్యాపింపఁ గాశీనివాసులు శంకరుని కీర్తిని బహువిధములఁ గొండాడిరి. అంత నొకనాఁడు ప్రాతర్వేళ శిష్యులకు భాష్యపాఠములు చెప్పుచుండ నొకవృద్ధబ్రాహ్మణుఁ డరుదెంచి సత్కృతుఁడై 'తదంతర ప్రతిపత్తౌ' యను బ్రహ్మసూత్రభాష్యమడిగి శంకరుఁడు దెలుప వేయువిధముల ఖండించివేసెను. శంకరుఁడును వానిఖండనమంతయు ననువదించి ప్రతిపూర్వపక్షమునకు సమాధానము సెప్పెను ఈరీతిగా వారిరువురకు నెనుమిది దినములు వాదము నడచెను. పొంతనుండి యరయుచున్న పద్మపాదుఁ డీతఁడెవఁడో మహానుభావుఁడని యెంచి 'శంకరుఁడన సర్వజ్ఞుఁడగు శంకరుఁడే' ఆతనితో వాదించువాఁడు బాదరాయణుఁడే కాని యన్యుఁడు కాఁబోఁడు అట్టితఁడి నావంటి కింకరుఁ డేమిసేయఁగలఁ డని యనుటయు శంకరుఁ డామాట కొడలు జల్లన నావృద్ధుని పాదముల వాలి వ్యాసుఁ డని స్తుతించెను. ఆద్విజుఁడును సంతోషపడి క్షమింపవేడుచున్న శంకరుని గౌగలించుకొని సూత్రభాష్య మంతయుఁ బరిశీలించి చూచి మెచ్చుకొని 'నాయనా! బ్రహ్మ మొదట నీకిచ్చిన యాయు వెనిమిదేండ్లే. తరువాత నీతపశ్శక్తిచేఁ బదునారేండ్లు మాత్ర మయ్యెను. కాని యది నీభాష్యప్రచారమునకుఁ జాలదు కావున మఱొకబదారేండ్లు నీకాయువు గలుగ వరమిచ్చితి నని పలికి యంతర్హితుం డయ్యెను. నిశ్చేష్టుఁడై చూచుచున్న పద్మపాదుఁ డయ్యా! మీతో వాదింపఁ దగినవాఁడు సూత్రకర్త యగు వ్యాసుఁడంతవాఁడు గాని యన్యుఁడు కానోపఁడని వ్యాసుఁ డంటినే కాని యీబ్రాహ్మణునివ్యాసుఁడని మీరు నుతింప విధ

తగ నుండెను. అదిగాక మీరే సూత్రభాష్యమునఁ గలిద్వాపరసంధి యందు వ్యాసుండు సూత్రముల నిర్మించినట్లు రచించితిరిగదా! ఆనాఁటి వ్యాసుఁ డిప్పు డెట్లు వచ్చు నని శంకరు నడుగ నాతఁడు వత్సా! ఆనాఁడు సూత్రముల రచింప నీనాఁ డుండఁ డని నీకెట్లు తోఁచినది? ఆయన చిరంజీవులలో నొకఁడని వినలేదా? అట్లయిన నాకేల కానరాఁ డందువా? జ్యోతిర్మయులగు నాదివ్యపురుషులు జ్ఞాననేత్రమునకుఁ గాని గోచరింపరు. మొదట నీవలెనే నేనును వృద్ధద్విజుఁడనియే వాదించితిని. నీవు వ్యాసుఁడనునంత జ్ఞానదృష్టి నరసితిని. వ్యాసుఁడై కానవచ్చెను. నీకుఁ దుదిదాఁక వృద్ధుఁ డగు పాఱుఁ డనియే కానఁబడెను. జ్ఞానప్రమాణానుసారము తత్త్వద్విధముగా సర్వమును గోచరించును. కాని మనకుఁ బ్రత్యక్షము కానంతమాత్రమున నేదియు లేదనరాదని దృష్టిభేదమును గూర్చి వివరించి వ్యాసుని నుతించి పరవశుఁడై కొండొకసేపు నిల్చిపోయెను. పిమ్మట గురుని యానతి స్మరించి దిగ్విజయమునకై వెడలనెంచి ముందు తనభాష్యములకుఁ గుమారిలభట్టుచే వార్త్తికములు చేయింపఁ దలంచి దక్షిణదిక్కునకు వెడలెను.

చతుర్థాశ్వాసము.

అట్లు వెడలి వచ్చునపుడు మార్గమం దొక బ్రాహ్మణుఁ డనుగమించువాఁ డుబుసుపోకకై కుమారిలుని చరిత్రము మొదటినుండియు శంకరున కీరీతిఁ జెప్పఁ దొడంగె. మహాత్మా! కుమారిలభట్టనఁగా వేదమార్గరక్షణముకై మహేశ్వరు నాజ్ఞచే భూమి నవతరించిన కుమారస్వామియే యందురు. ఆతనిని గూర్చి యెన్నో కథలు గలవు. ఉత్కలాంధ్రదేశసంధియందుంగల జయమంగళ మను గ్రామ మాతని జన్మస్థానమఁట. బాల్యముననె యుపనయనాదిసంస్కారములు గాంచి శ్రుతిస్మృత్యాదిక మంతయు నేర్చి పాండిత్యశౌర్యము గలిగి తంత్రవార్త్తికమను మీమాంసాగ్రంథమును రచించెను. ఆనాఁటికి దేశమందంతట జైనాదిమతములు వ్యాపించుటచే వేదవేత్తలకు, యజ్వలకు

నిలువ నీడ లేకుండెను. అది గాంచి కుమారిలుఁడు కటకటా! వేదమున కిట్టి దిక్కు లేనితనమా? అని దుఃఖించి నాస్తికులతోఁ బెక్కుసభలందు వాదమునకు డీకొని తన్మతరహస్యము లెఱుఁగమిచే నోడిపోవుచు వచ్చెను. ఆపరాభవము మాపుకొనుటకై ప్రతిపక్షరహస్యవిజ్ఞాన మావశ్యక మని యెంచి జైనమతగురువుల యొద్ద కేఁగి వారి మతగ్రంథములఁ గఱపుఁ డని వేడుకొని నిరాకృతుఁడై మాయచేసియైనను జదువవలెనని జైనపరివ్రాజకవేషము దాల్చి యొక జైనమతోపదేష్టకు శిష్యుఁడై చదువ మొదలిడెను. కొలఁది తరువాయిగా నంతయు నతి శ్రమపడి నేర్చెను. అంత నొకనాఁ డాగురువు వేదమును పరిపరిగతుల నిందింప మొదలిడెను. అది విని కుమారిలుఁడు కొంతతడవు లోలోన దుఃఖించి యోఁచినను నాఁగకుండుటచే గన్నీటి బొట్టొకటి విడిచెను. సహాధ్యాయు లదిచూచి పాఠానంతర మాతని పరోక్షమున గురువుతో 'వీఁడొక వేదవేత్త' యయి యుండును. మాయావేషమున మనవిద్య నేర్వవచ్చిన దొంగ. కాకున్న మీరు వేదమును నిందింప నట్లు దుఃఖించునా? అని పలుక గురుఁడు మండిపడి యీరేయి నిద్రించునప్పుడు మేడమీఁదనుండి క్రిఁదికిఁ ద్రోయుఁడన వారట్లు చేసిరి. తోఁపునడి మేల్కొని కుమారిలుఁడు 'వేదమే ప్రమాణ మగుచో నాకు హాని కలుగకుండుఁగాక' యనుకొనుచుఁ గ్రిందఁ బడి మరణింపక బ్రతికెను. కాని వేదమే ప్రమాణ మగుచో అని సంశయించుటచే నొక కన్ను మాత్రము పోయెను. జైనాదు లనిన నంతకుమున్నే రోఁతగల యా బుధున కీద్రోహకృత్యము కోపమును మచ్చరమును వృద్ధిచేసెను ఆకోపముతో విజయయాత్రకు వెడలి ధరణియంతయు నప్రతిహతముగ జరించుచు రిపుల జయించుచుఁ దుదకు సుధన్వనృపుని యాస్థానమున గల నాస్తికుల జయింపవచ్చెను. రాజసభఁ జొచ్చి యందలి విపక్ష పండితులను వాదమున జయింప రాజు కుమారిలపక్షపాతి యయ్యెను. అది గని జైనులు వాది దౌర్బల్యమున నోడినమాత్రమున వాదము

నకు న్యూనత యుండునా? అనిరి. రా జది విని వేదము జగత్కారణ మంటివి కదా! ఈకొండ యెక్కి క్రిందఁ బడి చావక నిలిచిన యెడ వేదమున కట్టి మహిమము గలదని నమ్మవచ్చు ననుటయుఁ గుమారిలుఁడు తత్క్షణమే యచట నున్న కొండశిఖర మెక్కి శ్రుతిమాతృకరుణచే నా కేయపాయమును గలుగ దని ధీరముగాఁ బలుకుచు, భూమికి దుమికి యక్షతదేహుఁడై నిలుచుటయు, రాజు జైనులం గాంచి వేదప్రామాణ్యమున కింతకంటెఁ బరీక్ష యేమి కావలెను? ఇప్పుడేని వీని మతము నొప్పెదరా? ఒప్పరా? యనఁగా వార 'లయ్యా! మంత్రమణ్యౌషధుల శక్తిచే శరీరము రక్షించుకొనవచ్చు' నని పలుకఁగా జైనులయెడ నిరసనము గలిగి "యింతకంటెఁ బరీక్ష యేమి కావలెను? మీమాట నీచముగా నున్న" దని ధిక్కరించి యిరువాగువారిని నొకతీవ్ర పరీక్ష యొనర్చెదను. అందోడినవారు యంత్రశిలలఁ బడి చచ్చుటయే పన్నిదము. అని పలికి యొక కుండయందు రహస్యముగాఁ బాము నొకదాని బెట్టించి మూఁత గట్టిగా నిడి యిం దేమున్నదో యెఱింగి యెవరు చెప్పెదురో వారి మతము ప్రమాణముగ గ్రహింతు నని ప్రతినఁ బూనెను. ఇరుతెగవారును బ్రాణాంతక మగు నా ప్రతినకు భయపడుచు నిండ్లకుఁ బోయిరి. ఆరాత్రి కుమారిలుఁడు కంఠదఘ్న మగుజలమందుఁ దాను, దనపక్షమువారు నిలిచి సూర్యు నుపాసింప వచనీయాంశము సూర్యమండలమునుండి వారికి వినిపించెను. దానికి వారు ధైర్య మొంది మఱునాఁడు సభకు వచ్చియుండిరి. నాస్తికులును తమ జ్యోతిషవిద్యాపాటవమునఁ గుండయం దేమున్నదో యెఱుంగుట కప్పుడ గణితము సేసి తెలిసికొని రాజుం గాంచి యిందొక పా మున్నదని చెప్పిరి. అంతట రాజు కుమారిలు నడుగ సభామధ్యమున నున్న ఘటమున కెదుట నిలిచి యాపాఁపశేసిపైఁ బవళించి శ్రీమహావిష్ణు వున్నాడనెను. అది విని ప్రతిపక్షులు నవ్విరి. రాజును సందేహముతోఁ గుండ మీఁదిమూఁత తొలఁగింప నారాయణుని దివ్యమూర్తి కనఁబడుట

యుఁ గడ గడ వడఁకి కుమారిలుని పాదములపైఁ బడి నన్ను శిష్యుఁగా స్వీకరింపు మని ప్రార్థించి యోడినవారిని యంత్రశిలలఁ ద్రోసి చంపుఁ డని యాజ్ఞాపింప భటులు తోడనే జగమునం గల నాస్తికులను వెదకి వెదకి మడియించిరి. వారిలోఁ గొందఱు ప్రాణభీతిచేఁ బరదేశములకుఁ బాఱియు వేదమతము స్వీకరించియుఁ బ్రాణముల నిలుపుకొనిరి. తక్కు గలవా రెల్ల రాజభటులచే హతు లైరి. అట్లు మరణించువారిలోఁ దన నకు జైనమతవిద్యను జెప్పిన గురువు గూడ నుండె నని యెఱిఁగి కుమారిలుఁ డా గురుద్రోహ పాపపరిహారమునకై ధర్మపరిష న్నిర్ణయప్రకారము నిష్కృతుల నేకము గావించికొని పరిశుద్ధుఁడై ప్రయాగక్షేత్రమునఁ బెక్కుయాగము లొనర్చి మమతాశూన్యుఁడై తపం బొనరించుచు న్నాఁడు. అని కుమారిలుని వృత్తాంతము నావిప్రుఁడు చెప్పుచుండ శంకరుండును వినుచు గమనాయాసంబు నెఱుంగకుండఁ బ్రయాగ కేఁగి యందుఁ ద్రివేణిని స్నానముచేయుచుండ 'గురువధప్రాయశ్చిత్తముగాఁ గుమారిలుఁడు తుషాగ్నిప్రవేశము చేసినాఁ' డని విని యెంతయు వగచి యాపౌరులవలన నాతని యున్నచో టెఱింగి సశిష్యుఁడై వేవేగఁ జని చూచునంతఁ తుషాగ్నిమధ్యమున సగపాలు దేహము కాలిపోయిన కుమారిలునిఁ గాంచి యాతని దృష్టిపథమున నిలిచి నమస్కరించుటయుఁ బొగచేఁ గన్నులు చూడరాకున్నను నెట్లో విచ్చి శంకరుం గని యాతని వృత్తాంతము దెలిసికొని శిష్యులచేఁ బూజలు సేయించి 'నీదర్శనమున నాజన్మము ధన్యమైనది. అనుటయు శంకరుండు సుధీంద్రా! గురువధ, యీశ్వరనిరాసము నను దోషములఁ దొలంచుకొనుట కీతుషాగ్నిప్రవేశము చేసితి వని జను లనఁగా వింటిని. అది నిజ మౌనా? అనుటయు మహాత్మా! గురువధమువలనఁ బాపము కలుగు నేమో యని యానాఁడే పెక్కురు ధర్మవేత్తల నడిగి 'తనంతఁ దాను బన్నిదము వేసి ప్రాణములు గోల్పోయిన గురువు నెడ నీకుం గర్తృత్వ మేమి గలదు? వేదరక్షార్థము నీవు యత్నించితివి. నీత ప్పేమియు లేదు' అని

వారివలన వినియుఁ బాపభీతిచేఁ బెక్కు యాగాదికములు నిష్కృతిగాఁ జేసికొన్నాను. కర్మశీలుఁ డగువిజ్ఞుఁడు శరీర మసమర్థ మగునప్పుడు భృగ్వగ్నిజలపాతములచే నిర్మముఁడై శరీరము విడువవలె నని స్మృతులం దరసి యీవ్రతముఁ బూనితిని గాని వేఱు గాదు. వేదము స్వతః ప్రమాణ మని ప్రకటింపఁ గర్మఫల మీశ్వరుఁ డొసంగఁజాలఁ డని నిరసించితిని గాని యీశ్వరాభావ మెన్నఁడును బలికియుండను ఇయ్యగ్నిప్రవేశము వ్రతముసుమా! ఈవ్రతము పూనకమున్న నీదర్శనభాగ్యము కలిగినచో నీరచించిన సూత్రభాష్యమునకు వార్త్తికపాఠము రచించి యుందు ననుటయు ఇప్పుడైనను మించినది లేదు. కమండలూదకమునఁ దుషాగ్ని నార్పివేయుదును. లేచి వచ్చి రచింపు మనఁగాఁ బుణ్యచరితా! పూనిన యీవ్రతము విడుచుకొనుట న్యాయము కాదు అంత్యకాలమున భగవంతుఁడ వగు నీవు మోక్ష మొసంగ సన్నిధానము సేసితి వంతియు చాలును. తారక ముపదేశించి కృతార్థునిఁ జేయుము వార్త్తికరచనమే వాంఛిత మేని నాశిష్యుఁ డగు మండనమిశ్రుని జయించి యాతనిచేఁ జేయింప మని మండనుని పాండిత్యమహిమాదిక మంతయుఁ జెప్పుటయు శంకరుం డాతనికి బ్రహ్మస్వరూప మెఱుంగం బల్కు బ్రహ్మానంద మొంది కుమారిలుఁడు సర్వబంధవిముక్తుఁడై భౌతికదేహము విడిచి పరమేశ్వరతేజమున విలీనుఁ డయ్యెను.

శంకరుఁడును శిష్యులతోఁ గూడ నాక్షణమే యాకాశమార్గమున మండనుఁ డుండుమాహిష్మతీపురమున కేఁగి యందలి వీథిం జనుచు మండనపరిచారికలఁ గాంచి వారివలన 'మండనుఁడు సంన్యాసుల మోము చూడఁ డనియు నేఁడు పితృశ్రాద్ధము నెఱవేర్పు చున్నాఁ' డనియుఁ దెలుప, నచ్చట నున్నయొక దేవళమందుఁ దాను విడిసి తన రాక యాతనికిం దెలుప శిష్యుల నంపెను. వారును బోయి కవాటబద్ధమగు ద్వారమునఁ బిలిచి పిలిచి యెట్టకేల కది తెఱువఁబడ లోనికేఁగుచుండ మండనశిష్యు లెదురై వారి రోధించి నిందింప నిరుతెగ

వారికిఁ గొంతతడవు వక్రోక్తులతో వివాదము నిర్మర్యాదముగ సాగెను. ఆసంగతి మండనుఁ డెఱిఁగి సబంధుపరివారుండై శంకరు నొద్దకు వచ్చి భిక్షావందనము సల్ప యతీంద్రుఁడు వాదభిక్షార్థము వచ్చితిని గాని యన్నభిక్షార్థము కాదనుటయు భిక్షానంతరము వాదము కావింతము రమ్మని కోరిన మండనునితోఁడ నాతనియింటి కరిగి యాతనివలనఁ బూజితుఁ డయ్యెను. మండనుఁడు యతీంద్రునితో 'దేవా! మనవాదమున జయాపజయములు నిర్ణయింప మధ్యవర్తిగా నొకని దేవలయునుగదా! నిమంత్రులగు నీద్విజులు జైమినీయవైయాసకసిద్ధాంతవేత్తలుకాన వీరియందొకని నేర్పఱుచుకొందమా?' అనుటయు శంకరుఁడు వారును వీరునేల? నీధర్మపత్ని సకలవిద్యలవిశారదయగు శారద యని విందును. ఆమెయే జయాజయనిర్ణయ మొనర్చు నన గృహి పన్నిదము దెల్పు మనుడు నోడినవాఁ డోడనివానియాశ్రమము గొనుటయే యని శంకరుఁడు పలికెను. మండనుఁడు సమ్మతించెను. ఆమఱునాఁడు సభయారంభమయ్యెను. జనులెల్ల విన మండనుఁడును, శంకరుడును మరలఁ దమ ప్రతిజ్ఞలను వెల్లడించిరి. ఆసమయమున మండనుని భార్యయుభయభారతి సభకు వచ్చి యధ్యక్షపీఠ మలంకరించి యిరువుర మెడయందుఁ జెఱియొక పువ్వులదండను వైచి 'ఎవ్వరి మెడయందలి పూలమాల ముందుగ వాడిపోవునో యాతండోడినట్లు,' యని దైవప్రమాణమును బలికి గృహకృత్యనిర్వాహణార్థ మింటిలోనికిఁ జనెను.

తరువాత మండనశిష్యులకును, శంకరశిష్యులకును వాదోపవాదములు కొంతతడవు నడచెను. అందు మండనశిష్యులు వెనుకాడుట యరసి మండనుఁడు శంకరునితో వాదింపఁ మొదలిడెను. వేదములే కాని వేదాంతములు ప్రమాణములు కా వని తొలుత వాదించి యందోడి 'తత్త్వమసి' యను శ్రుతివాక్యము భేదశ్రుతి యని తర్కసిద్ధాంతములచే శ్రుత్యుపనిషత్ప్రమాణములచే వివరించి యన్నిమార్గములందును

శంకరునిచే నపజయము నొంది యాఱవదినంబున మూఁగ యట్లూరకుండెను. సభ్యులు సాధువాదంబుల మిన్నుముట్టెను.

పంచమాశ్వాసము.

అత్తఱి భర్త యురమున వాడి వ్రేలాడు సుమసరిజను గాంచి యుభయభారతి తత్తఱ మొందుచుండె. మండనుండు జైమినిమతంబు నిరస్తమయ్యె నని ఖేదము ప్రకటింప శంకరుఁడు జైమినియాశయము సచ్చిదాత్మము నెఱుంగుటకై కర్మమార్గము సాధన మనియేసుమా యనుటయు నాతని కాసంశయము పోవక జైమినిని స్మరించెను. తోడన జైమిని తోఁచి 'శంకరుఁడు సాక్షాత్పరశివుఁ డనియు, నతని యుపదేశము గ్రాహ్యము. తదీయమతమే నామతము' అనియుఁ బలికి తిరోహితుఁ డగుటయు సందియము లెల్లబాసి శంకరుని శరణముగా వేడుకొనెను. యతిపతియు నాతనిని శిష్యుఁగా స్వీకరింప నెంచి యుభయభారతి వంకఁ గాంచుటయు నాపె యాతని యాశయ మెఱింగి ఆర్యా! అర్ధదేహమగు నన్నుఁ గూడ జయింపనిదే నీకుఁ బూర్ణవిజయము సిద్ధింపలే దనెను. అపుడు శంకరుఁడు 'సాధ్వీ! పురుషులు స్త్రీలతో వాదించుట యనుచిత మనగా జనకునితో సులభయు యాజ్ఞవల్క్యునితో గార్గియుఁ దొల్లి వాదింపలేదా? జయకాంక్ష గలవారు వాదమున స్త్రీపురుషవిభేద మెన్నరాదని పలికి యొడంబఱిచెను. అంత నయ్యిరువురకు బదునేడు దినములు వాదము నడచెను. ఎందును ఎనుదీయని శంకరుని పాండితీప్రాగల్భ్యముల కాయమ యచ్చెరు వొంది యీశాస్త్రములం దీతఁ డజయ్యుఁ డని తలంచి పుట్టు బ్రహ్మచారిగదా వీనికిఁ గామశాస్త్ర మచుంబితమై యుండును. వాదమును దానిలోనికిఁ దివిచి యందు జయింతును అని తలంచి ప్రశ్నానుప్రశ్నముగఁ గామమును గూర్చి ప్రసంగించుచుఁ మన్మథకళలఁగూర్చి ప్రశ్నించుటయుఁ దెల్లఁ బోయి "అమ్మా!" వాదమునకు సంబంధించని యిట్టి ప్రశ్నము నన్నడు

గుటచే నిగ్రహస్థానము నొందితివి. అయినను సభ కధ్యక్షురాలవగు టచే నిన్నుఁ గాదనరామింజేసి యూరకుండవలసివచ్చినది. అనాఘ్రాత మగు కామకళారహస్యము నన్నె ట్లడిగితివో కదా యని వింతగ నున్నది. వాదధర్మము ననుసరించి యొక్కమాసము గడు విమ్ము. తరువాత వచ్చి యందె వాదింతును అని గడువొంది యొక కొండగుహ యందు శిష్యులతో నివసించి కామకళాగ్రంథము లన్నియు శోధించి యందలి రహస్యము లన్నియుఁ దెలిసికొని యాశరీరముతోఁ బరకాంత తో వాదింప నధర్మ మని యొక చిలుకదేహమునఁ బరకాయప్రవేశ విద్యచేఁ జొచ్చి యొక కిరాతునకుఁ బట్టువడి వానిచే మండనునింటికిఁ గొంపోఁబడెను. అచట మండనుని పరిచారిక లాచిలుకతో శబరుని నుభయభారతియొద్దకుఁ దెచ్చుటయునామె వానికిఁగాసులనిచ్చియాచిలుకం గొని తదద్భుతధీశక్తికి వింతపడి పతి సన్నిధిని దానిశక్తిఁ బ్రకటింపఁజేసి యుపవాసవ్రతదీక్షిత యగు నామె యబుసుపోకకై కొనిచని యొంటిమెయి నుండి ప్రసంగవశమున శంకరునకుఁ దనకుఁ నడచినవాదముచెప్పఁగా 'నేనుత్తరమిత్తునా'యను చిలుకపలుకున కీయకొనఁ గామకళావిధాన మంతయుఁ గీర ముపన్యసించుటయు నామె దాని కచ్చెరువొంది కొంతసేపు కళలం గూర్చియుఁ గొక్కోకవాత్స్యాయనుల ప్రామాణ్యముం గూర్చియు వివదించి తుదకు నేదియు నిర్ణీతము గాకుండుటచే మధ్యవర్తిగాఁ జిలుకచెప్పినప్రకారము మండనుని దెచ్చెను ఆయన యావాదోపవాదము లాలించి యాయర్థము నేర్వ శంకరుఁ డరిగెను. ఆ యనఘుఁ డిది నిర్ణయించును. నేఁడో రేపో రాఁగలఁ డనుటయుఁ గీరము తాను వచ్చునపుడు 'శంకరుఁ డిటకుత్తరమున నున్న కొండగుహయందు సమాధి నున్న ట్లెవరో మును లనుకొనుచుండ వింటి నని యు, నైదాఱుదినములప్రయాణ మగు నని యుఁ దెల్ప నుభయభారతియు మండనుఁడును సపరివారముగా శుకసహితులై యాకొండగుహ కరిగి శిష్యులవలన సమాధియందున్నట్లు విని గుహాగ్రవర్తి యగు వట

మహీజము నీడం గూర్చుండి సేదదీర్చుకొనుచుండం బంజరస్థమగు శుకము లక్ష్మీనృసింహుని స్తవమొనర్ప నారంభించెను. అందఱు నానందాద్భుతరసతన్మయులై వినుచుండ సంసారవృక్షమునుండి యథోముఖుండనై క్రిందికిం బడుచుంటి నను నర్థముగల శ్లోకార్థమును జదివి పంజరమునందే యాధారదండమునుండి క్రిందం బడిపోయెను. అందఱు నిర్విణ్ణులై చూచుచుండం జిలుక విడిచిన పద్యములోని పైసగము చదువుచు గుహనుండి శంకరుం డివ్వలకు వచ్చుట యరసి మండనాదులు నాచార్యశిష్యులును నాశ్చర్యచకితు లగుచు నర్ఘ్యపాద్యాదికముల నర్పించుటయు నుభయభారతి తాను జయేచ్ఛచేం జేసిన కాపటకత్వము వెల్లడించి యా తప్పిదమును క్షమింప వేండుకొని తనభర్తయు దాను నోడిపోవుట యంగీకరించి 'భర్త నెడంబాయజాలక యట్టి యవినీతిప్రసంగము సలిపితి' ననియుం జెప్పెను. మండనుండును 'దేవా! శుకదేహమునం జొచ్చి కామకళాభ్యాసము నాశాస్త్రమున వాదోపవాదములును సలుపు దోషమునకుం బరిహారకముగ నృసింహస్తవముసేసి పరకాయప్రవేశవిద్యాప్రభావమున మానవదేహమున మరలం జొచ్చి, యసాధారణమహిమము వెల్లడించిన భవదీయ చరిత్రము నొనియాడ నే నేపాటివాండను' అని తనయోటమి నొప్పుకొని సశిష్యుండగు నయ్యతిపతిని దోడ్కొని మాహిష్మతికిం దిరిగి సపరివారుండై వచ్చి ధనగృహకేదారాదికములు సంతతికిం బంచియిచ్చి సంన్యాసస్వీకారమునకై ప్రాజాపత్యేష్టి నెఱపి యగ్నిహోత్రముల నాత్మారోప మొనరించుకొన సంసిద్ధుం డగుటయు, వాద మారంభించినదిమొద లుపవాసవ్రతదీక్షిత యయి నవసి పోయియున్న యుభయభారతి శంకరునితో ఆర్యా! నాకును, నాపతికిని దాంపత్యసంబంధమున సాక్షియగు నీయగ్ని నాభర్తహృదయమునం జొచ్చుచుండ నూరక చూచుచు నీదేహముతో నేనుమాత్రము మిగిలియుందునే? అని పలికి పతితో 'నాథా! నాప్రాణములకు నీవ యధీశ్వరుండవు. కావున నిన్ను

విడిచి నేనుండుట తగవుకాదు. కాన నీయగ్నితోపాటు నన్నుఁ గూడ నీయందుఁ జేర్చుకొమ్ము' అని భర్తపాదములయొద్ద బద్ధాసనాసీనయై యోగము పూని శరీరము విడిచి యగ్నులయందుఁ దేజోరూపమున బ్రవేశించెను. అంత నా తేజమున సాక్షాద్భారతీరూపమును శంకరుఁడు గాంచి యామె పాతివ్రత్యప్రభావమును బెక్కురీతులఁ గొండాడి యామె యనుమతిని శృంగగిర్యాదిక్షేత్రముల మఠముల స్థాపించి యామె పాతివ్రత్యయోగశక్తులను లోకమునకు వెల్లడింతునని ప్రతినఁ బూని మండనునకుఁ దురీయాశ్రమము నొసఁగి 'తత్త్వమసి' యను సూక్తిని శంకారహితమగునట్లుపదేశించి సురేశ్వరుఁడను నామము నొసఁగి ధన్యు నొనర్చెను. అంత నాయనఘుఁడు మగధదేశమునందే పర్యటించుచు సన్న్యాసధర్మములను పాలించుకొనుచు బ్రహ్మానందము నొంది బహుకాలము గడపెను. పండితలోకమున కెల్ల నసాధ్యుఁడగు మండను నోడఁబుచ్చుటతో శంకరుకీర్తి మిన్నుముట్టి ప్రతివాదుల గుండెలు నీరుగాఁ జేసివైచెను. పిమ్మట శంకరాచార్యుఁడు శిష్యులతో దక్షిణదిక్కునకుఁ జైత్రయాత్రము వెడలెను.

షష్ఠాశ్వాసము.

అట్లు వెడలి శ్రీశైలమునం జేరి భ్రమరాంబామల్లికార్జునుల సేవించి యాప్రాంతముల నద్వైతమతము వ్యాప్తి నొనర్చుచు నుండు నెడ నొకకాపాలికుఁడు శంకరు నెట్లోని సంహరింప నెంచి యాయనను దర్శించి, నుతించి "మహాత్మా! శరీరాభిమానము లేనివారగుటచే మిమ్ముల నొకటి కోరుకొందును. కపాలధరుఁడగుఁ బరమేశ్వరుని మదినిడుకొని యీశరీరముతోఁ గైలాసమునకుఁ బోవుటకై పెద్దకాలముతపమొనర్చితిని. అంతఁ గపాలి ప్రొడనూపి చక్రవర్తి శిరమైనను సర్వజ్ఞశిరమైనను నగ్నియందు హోమ మొనర్పనీకోర్కె సిద్ధించునసెను. చక్రవర్తి శిరము నాకు లభింపదుగదా; సర్వజ్ఞునకై వెదుక నీవుగాక జగమున నె

వ్యాఁడునుఁ గానిపింపఁడు. దధీచి ప్రభృతులవంటి వాఁడవు నీవలన నా కోర్కె నెఱవేఱు నని వచ్చితి" ననుటయు దేహాభిమానశూన్యుండగు జగద్గురుఁ డాతనిం గాంచి 'అట్లె యొసఁగెదను. నేను వివిక్తస్థలమున సమాధియం దున్నతఱి వచ్చి నీయభీష్టము నెఱవేర్చుకొనుమంటియు కాని శిష్యులు చూచుచుండ వచ్చిన నీకోర్కె నెఱవేఱదు. వారు నాయెడఁ బరమభక్తులు కాన నెఱిఁగిరేని సహింప' రని సంకేతము చేసి మఱునాఁడు సమాహితచిత్తుఁడై యొంటిగ నుండెను. శిష్యులు స్నానమున కేఁగిరి. భీకరాకృతితో నాకాపాలికుఁడును వచ్చి శూలమెత్తి శంకరు నేయ నుంకించి యాయన వెనుకభాగమున జేఁకటియందుఁ బండ్రివిప్పులట్లు రెండుజ్యోతిస్సు లగపడుటయు, నెత్తినకాలును గేలు నట్లయుండఁ బెద్దకేక వైచి యుపగతసంజ్ఞుఁడయి క్రిందఁ బడి కొంతసేపటికి సచేతనుఁడై 'అదె సింహము నామీఁదఁ బడ నుండెను. మహాత్మా! రక్షింపు'మని మొఱపెట్ట, సమాధిఁ బాసిగురువరుఁడు కనువిప్ప గాపాలికుఁడు గిలగిలఁ దన్నుకొనుచుంట కనవచ్చుటయు జేరవచ్చి యారార్చి వెనుక నున్న సింహమువంకఁ గాంచ నారసింహరూపముతోచుటయు ప్రాంజలియై యద్దేవు ననేకవిధములఁ బొగడి యాకాపాలికు రక్షించి శాంతింపు మనుటయుఁ గ్రమముగా శాంతించి పద్మపాదుఁ డయి కానఁబడెను. కాపాలికుఁడును లేచి 'నరహరి! యెటువోతివి? రక్షింపు' మనుచు నేడ్చుచు శంకరుని పాదముల వ్రాలి తన దుస్సంకల్పము క్షమింప వేఁడుటయు నాయనఘుఁ డాతని యెడ సదయుఁడై తురీయాశ్రమ మొసంగి శిష్యునిగాఁ బరిగణించుకొనెను.

పద్మపాదుని గని శిష్యులందఱు నీకెటు నృసింహదేవుఁడు వశుఁడయ్యె నని యడుగఁ 'నేనహోబలక్షేత్రమున ము న్నొకప్పుడు తపం బొనరించుచుండ నొక బోయశిశువు నాకడకు వచ్చి స్వామీ! యేల యిటుశ్రమపడెద వని యడుగఁ గావున నన్నడుగఁ గంతము

దాఁక మనుష్యాకారముగల సింహ మొకఁ డడవిని గల దని విని దాని వె
దకుచున్నానని నేనంటినో లేదో యి దెంత పని యని యా చెంచుబుడుతఁ
డు తీఁగలతోఁ గట్టి నృసింహుని దెచ్చి నాయెదుట నిడుటయు నచ్చెరు
వొందుచు నుతించి దేవా! మునుల కేని యగోచరుండ వగు నీ వీవన
చరశిశువున కెట్లు వశుఁడ వైతి' వని యనుటయు నద్దేవుండు 'వీని భక్తి
యనితరసాధారణము. చెంచులక్ష్మి నన్నుద్దేశించి 'రమ్మనిన రమ్ము పొ
మ్మనినఁ బొ' మ్మని పాడునట్టి పాటను జెంచులు పాడుకొనుచుండ విని
దానిని వీఁడు భక్తిపరవశుఁడై పాడుచుండ సామగానముకంటె మిన్న
యై యాపాట నన్ను నాకర్షించి వీనివశ మొనర్చినది. ఇంతకాలము
నుండి తపము చేయుచుంటివి గదా! ఇన్నాళ్ళలో వీనివలె నచంచల
చిత్తవృత్తితో నున్న దెన్నాళ్ళో యరసికొనుము నేఁడుగదా వీనిమూలం
మున నట్టి పరిపాకమునకు వచ్చితివి? వచ్చుటతోడనె యిదిగో గోచ
రించితి నని చెప్పి మాయ మగుటయు నయో! కిరాతశిశువుపాటి
వివేకిని గానైతినే యని వగచుచుండ "ఓడకుము శత్రుపీడఁ గల్గుచో
నను స్మరింపఁ గాపాడుదు"నని యశరీరవాక్కొకటి వినరాఁగా స్వస్థుఁ
డనైతిని గురునకు నేఁడు వచ్చిన శత్రుపీడ నాదేయని నే ననుకొను
చుండ నాదేవుఁడు గురుని రక్షించి నాప్రాణము నిలువఁబెట్టెనని తన
పూర్వవృత్తము చెప్పి వారి నందఱ నాశ్చర్యచకితుల నొనర్చె.
తరువాత జగద్గురుఁడు సచ్ఛాత్రుఁడై యవనిఁ బర్యటించుచు గోకర్ణ
క్షేత్రమున కరిగి గోకర్ణేశుఁ గొండాడి హరిశంకరాఖ్యక్షేత్రము సేరి
హరిశంకరుల నభేదబుద్ధిఁ బూజించి శ్లేషకవితచే నభేదముగ నుతించి
యటఁ గదలి మూకాంబాదర్శనార్థియై యరుగుచుఁ ద్రోవయందొ
క మృతుఁడగు బాలుని కళేబర మొడియం దిడుకొని విలపించు విప్ర
దంపతులఁ గాంచి జాలి నొంద 'రక్షింపలేని దయాళుత్వము దుఃఖము
నకె యౌనుజుమీ' యని యశరీరవాణి వినవచ్చుటయు, 'నీ వనినది
నిజమే! మూఁడు జగముల నేలు నీకొకనికే దయచూప నర్హతగల' ద

ని యహంకారదూరుండై పలుకుటయు మృతబాలుఁడు పునరుజ్జీవితుఁడై యందఱ కానందాశ్చర్యములఁ గలిగించెను. శంకరుండును మూకాంబాలయము జొచ్చి యద్దేవినిఁ బూజించి శాక్త విధానమెల్ల నద్వైతపరముగ సమన్వయించి పరమాత్మరూపిణిగా నాదేవిని లోకోత్తరరీతి నుతించి యటనుండి బల్యగ్రహారము చేరెను.

అందుఁ బ్రభాకరుఁడను విప్రుఁడుగలడు. వానికొడుకు పుట్టినప్పటినుండియు నొక్క రీతిగనే జడుఁడుగా నుండును. పదుమూఁడేండ్లప్రాయము వచ్చెను. మూఁగయటు లుండును. శంకరుని మహిమము వినుచున్న యావిప్రుఁడాయూరు శంకరులరాక విని సుతునిఁజూపి వాని వృత్తమంతయు వినిపింప నాబాలుని జేరఁ బిలిచి యెవ్వఁడవు నీ వని యడుగుటయు నంత మున్నెన్నఁడు నెవరితోడ మాటాడని శిశువు నవ్వుచు గురూత్తమా! దేహేంద్రియాద్యతీతుండగు పరమాత్మస్వరూపుఁడ నను నర్థముగల పద్యములఁ జెప్పుటయుఁ బరమార్థము కరతలామలకముగా నెఱిఁగిన వాఁడగుటచే హస్తామలకుఁడని పేరిడి తండ్రిని సమాధానపఱచి యాబాలుని శిష్యునిగా గ్రహించి తోడ్కొని చని శృంగగిరి చేరి యందు నాలయము గట్టించి దానియందు మహాపతివ్రతాతిలక మగు నుభయభారతిపేర భారతీదేవిఁ బ్రతిష్ఠ గావించి భారతీసంప్రదాయుని సురేశ్వరాచార్యు నచట నెలకొలిపి మతవ్యాప్తిఁ జేయ నాజ్ఞాపించెను. అచట నప్పరమేశ్వరిని నిరంతర మారాధించుచున్నతఱి నొకబ్రహ్మచారి శిష్యత్వము గోరి వచ్చి యనవరతము నఖండభక్తి సేవింపఁ జొచ్చెను. ఆసేవయందును గురుని కాటిక లేటినీటియందు లెస్సగ నుదికి యాఱవేసి యందిచ్చుట యందెక్కువ శ్రద్ధగలిగియుండును ఒకనాఁ డాతఁడు గురుని కాటికలు గొని యేటి కరిగి యుదుకుచున్న సమయమునఁ బద్మపాదాదులు పాఠము చదువనెంచ శంకరుఁడు 'గిరి వచ్చుదాఁకఁ దాళుఁ డనఁ బద్మపాదుండు నవ్వుచు

'నార్యా! మందబుద్ధి యగు గిరికై ప్రతీక్షించుట యేల?' యనుటయు వాని గర్వ మడంగ మనస్సుచేఁ జతుర్దశవిద్యలను గిరి కనుగ్రహించెను. గిరియు నచ్చెరువొందుచు గురుని జేరి యద్వైతార్థనిబిడమగు తోటకవృత్తములచే గురుని నుతింప నందఱును నద్భుతపడి చూచుచుండిరి. గురువరుండు నాతనికిఁ దోటకాచార్యుఁ డని బిరుదునామ మొసంగి ముఖ్యశిష్యులలో నొకనిగ స్వీకరించెను.

అట్లు శిష్యచతుష్టయవిరాజితుండై శంకరుఁడుండు నెడ సురేశ్వరుం డేదేని గ్రంథము రచించి గురుల కార్యభారంబు కొంత యుపనయింపఁ దలఁచి తనతలంపు విన్నవింప విని గురుచంద్రుఁడు నాభాష్యమునకు వార్తికపాఠము రచియింపుము ఇయ్యది నీగురుఁడగు కుమారిలుని వాంఛితము. ఆయన బ్రహ్మభూయంబు నొందుతఱిఁ దన కాకోర్కి యున్నట్లు చెప్పెను. అది చేసినచో నాయన యాత్మకు శాంతియు లోకోపకారమును నగు నని పల్కుటయు సురేశ్వరుండును దానికై పూనుకొనెను.

ఆసంగతి వినిన చిత్సుఖాదు లగు శిష్యులు సురేశ్వరుఁడు చెంత లేనితఱి గురునితో 'మహాత్మా! పూర్వమీమాంసానిష్ణాతుఁడై కర్మవాది యగు సురేశ్వరుని మీభాష్యమునకు వార్తికము రచింపు మనఁ దన కభీష్టమగు కర్మమతసిద్ధాంతముల నందుఁ జొప్పింపక మానఁడు. ఆతఁడు వాదమందోడి బలవంతముగ సంన్యసించినవాఁడు. కావున లఘిమాదివిభూతియుక్తుఁ డగు పద్మపాదుని నియోగింపరాదా? మీకు భక్తుఁడు పాండిత్యమున నసాధారణుఁడు గాడా? కాదేని మీ పాదసంవాహనరూపమగు తపమున నఖండవిజ్ఞాన మార్జించుకొన్న యానందగిరిని నియోగింపవచ్చునే' యనిరి. అది విని పద్మపాదుఁడు హస్తామలకుఁ జూపి 'యీతం డఖిలాద్వయార్థనిధి యగు టెఱింగి మీరేకదా హస్తామలకుఁ డను బిరుదనామ మొసంగిరి? కావున నీతని ని

నియోగింపఁ దగు' ననెను. అది విని యాచార్యుఁడు నవ్వి యీతండు జ్ఞాని యగునే కాని యథావిధిగ విద్యలను గురులొద్దఁ జదువకపోవుట చే శృత్యర్థనిర్ణయమున కీతఁ డనర్హుఁడు. ఇతఁడ నేఁడ మూఁగుఁడై వర్తిలుట మీరును గాంచిరారే కదా! జనన మొందునపుడ సకలవేదశాస్త్రములు నెఱిఁగిన బ్రహ్మరతుఁడ కాని బాహ్యప్రపంచ మెఱుంగమి గ్రంథరచన కనర్హుఁ డనుటయు 'నీతనికి శ్రవణాదులు లేకయ సకలవిద్య లెటు వచ్చినవి? అని యడుగు శిష్యులకు గురుఁ డిట్లనెను. తొల్లి యమునానదీతీరమున నొకమునీంద్రుఁడు తప మొనర్చుకొనుచుండెడి వాఁడు. ఈహస్తామలకుఁడు శిశువై యున్నతఱి వీని నెత్తికొని నదికి స్నానార్థ మరిగి తాను స్నానముచేసి వచ్చుపర్యంతము కొడుకు నరయుచుండ నమ్మునిని వేఁడి యచట డించి తోడి బోటులతో స్నానార్థ మరగెను. వీఁడును నిటునటు దోఁగాడుచు నల్లఁ జని యయ్యేటఁ బడి ప్రాణములను బాసెను. స్నానానంతరము తల్లి వచ్చి పిల్లనికై వెదకుకొని యేఁటబడి కొట్టుకొనిపోవుచున్న బాలశవము నెత్తుకొని మునిచెంతనుంచి బోరన నేడ్చుచుండ సమాహితుఁడైన యయ్యతి బాహ్యావాసనల నొంది యెఱింగి యాశివు శరీరమునఁ జొచ్చి వారల దుఃఖము పోఁగొట్టెను. చచ్చి బ్రతికినాఁడు శిశువని యందఱు నానందించిరి. వీఁడు వేదశాస్త్రముల నెఱింగినను బాహ్యప్రపంచ మెఱుంగమి భాష్యములకు వ్యాఖ్య రచింప ననర్హుండు. సరస్వతీసాక్షికముగా సర్వజ్ఞత్వము గన్న సురేశ్వరుఁడు దక్క నన్యుల కాగ్రంథము రచింప నర్హత లేదు. ఇందఱు మీ రసమ్మతిని దెలుపుచుండ నాతఁ డొకవేళఁ బూనుకొనినను గ్రంథమునకు విఘ్నము రావచ్చును. ఈరీతి నిషేధించుట యనుచిత మనియైనఁ దలంపరే' యనెను. అంత చిత్సుఖాదు 'లార్యా! పద్మపాదుఁ డర్హుఁ' డని మరల దెలుపుటయు గురుండు వార్తికరచనమునకు సురేశ్వరుండె యర్హుఁడు. పద్మపాదుఁడు భాష్యముపై వేఱొక వ్యాఖ్య రచియింప వచ్చు నని యాజ్ఞాపింప సురేశ్వ

రుఁడు 'మహాత్మా! పద్మపాదుఁడే యాగ్రంథము రచించుఁగాక' యని తనకేల నున్న గ్రంథము గురుని పాదముల కడ నుంచుటయు నైష్కర్మ్యసిద్ధి యను నాగ్రంథము నరసి సంతసించి శిష్యులకుఁ జూపుటయు వారలు సిగ్గువడిరి. అపుడు సురేశ్వరుఁడు కటకటఁ బడి రచించుచున్న వార్తికపాఠమును బాఱవైచి యూరకుండె. పద్మపాదుఁడు భాష్యమునకుఁ డీక రచించెను. పూర్వభాగమునకుఁ బంచపాదిక యనియు, నుత్తరార్థమునకు వృత్తి యనియు నయ్యది యలరారెను. వ్యాససూత్రములకు డిండిమ మను నొక వ్యాఖ్య రచించి గురుపాదులకు సమర్పించెను.

అనంతర మొకనాఁడు సురేశ్వరునితో 'మంగళాచరణబలము లేక నీకృతి విఘ్న మొంది యుండవచ్చును. కానినీమనస్సు క్షోభించుటచేఁ బద్మపాదుని గ్రంథమైనను గట్టెక్కుట దుర్ఘటంబు' అని కనులు మూసి ధ్యానించి పద్మపాదుని టీక యందుపాదములె నిలుచును. అందైనను రెండుసూత్రములు మాత్రమే రహించును. శాపవశంబున మనుజుఁడవై పుట్టిన బృహస్పతివి నీవురచించు భాష్యటీక యాకల్పము వెలుఁగొందుగాక యని యాశీర్వదించి తోటకాదులను బ్రహ్మవిద్యాంచితము లగుగ్రంథముల రచింప నాదేశించెను. వారును బెక్కుగ్రంథముల రచించి యద్వైతమతవ్యాప్తికిఁ దోడ్పడిరి.

సప్తమాశ్వాసము

పద్మపాదుఁడు తీర్థయాత్రకై గురుని వేఁడి సెలవొంది వెడలెను. శంకరులు తల్లికవసానదశ ప్రాప్తించుచున్నదని యెఱింగి యోగవిద్యచే నాకాశమార్గంబునఁజని తల్లిని సమీపించి యామె హృదయమునకు విశ్రాంతి జేకూర్చి యామె కోర్కి. ప్రకారము ముందు రప్పించిన శివదూతల నంపి విష్ణుదూతల రావించుటయు నామె

బ్రహ్మానందానుభవముతో విమాన మెక్కి విష్ణుదూతలచే నర్చిరాది మార్గంబునం బరమపద మొందెను. అనంతరము జ్ఞాతులరావించి యామె శరీరమున కంత్యసంస్కారములు సేయుం డన నవినీతులయి నీవు లేని యప్పుడు మేము చేయుదుముగాని నీవు సన్నిధి నుండ మాకేమి పని యని నిరాకరింప వారిని గర్మబాహ్యులు వేదబాహ్యులునుగా శపించి యాపద్ధర్మముగాఁ దానె సంస్కారమునకుఁ బూనుకొని యగ్ని నిండని వేఁడి నిరాకృతుఁడై తల్లి దక్షిణభుజమథనము నగ్నిని బుట్టించి శవవహనార్థ మెవ్వరుం రాకుండుటచే 'నింటిపాణిద్వారము నొద్ద దల్లి శవము—నుంచి దహించి 'యిది మొదలుగా నీకాలటిగ్రామవాసులకుఁ బెరటిద్వారమే స్మశాన మగుఁగాక' యని శపించి యథావిధిగఁ దల్లికిఁ బారలౌకికక్రియలు నెరవేర్చి స్వాస్థ్య మొంది జగంబునం బ్రాదుకొనిన కుమతంబుల రూపుమాప నెంచి పద్మపాదుని రాకకై చూచుచుండెను.

గురు ననుజ్ఞ నొంది పద్మపాదుఁడు కాళహస్తీశ్వరుని భజించి, కాంచి కరిగి యేకామ్రేశ్వరునిఁ గామాక్షిం బూజించి, కల్లావేశుఁ గొలిచి, పుండరీకపురమున శివు నారాధించి, శివగంగ మునింగి, నటరాజు సేవించి, కావేరిని స్నాన మొనర్చి, శ్రీరంగేశ్వరుఁ గొలిచి, సేతువుం గాంచ నరుగుచు మార్గమధ్యమున నున్న మాతులునిం జూడం జనుటయు, నాతండు సబాంధవముగా సమ్మానింప నలరి వారలకు ధర్మంబులు చెప్పి సేతువు జూచి వచ్చుదాఁక స్వకృతభాష్యటీక దాఁచి యుంచు మని మేనమామచేతి కిచ్చి బయలువెడలి దుశ్శకునముల గణింపక సశిష్యుఁడై చనెను. మేనమామ యనిన నసాధారణపండితుఁడు. మీమాంసకశేఖరుఁడు. అతఁడు పద్మపాదుని గ్రంథ మంతయు నాతనివలన వినియుంటచే, దన మతమునకుఁ హానికరమని తలంచి గృహమం దుంచి యిల్లు తగులబెట్టి అయ్యో! నాయింటిమాట కేమి

మేనల్లుని గ్రంథము కాలిపోవుచున్నదే! అని గొంతెత్తి విలపించె నని కింవదంతి గలదు.

ఇటఁ బద్మపదుం డట్లు తీర్థయాత్ర కరిగి రామేశ్వరమున రామనాథు సేవించి మరలివచ్చి గృహదాహవృత్తాంతము విని గ్రంథనాశమున కలఁగెను మాతులుని గృహదాహమున నార్తి నొంది గ్రంథము నాబుద్ధియందే కలదని మరల వ్యాఖ్య రచింప నుపక్రమించు టెఱిఁగి బుద్ధిని హరించు పదార్థము దెచ్చి మాతులుఁ డన్నమం దిడి తినఁజేసె నని జనులందురు. ఆవార్త విని తనవలెఁ దీర్థయాత్రాపరు లగు సతీర్థ్యులు కొందఱు కనవచ్చుటయు, నాసమయంబున గురువరుఁడు కేరళమున నున్నట్లు విని యందఱు నటకరిగి గురుని దర్శించి మ్రొక్కి, వారియోగక్షేమము లరయుతఱిఁ బద్మపాదుఁడు తనమాతులుఁ డొనర్చిన దుష్కృత్యమును చెప్ప— సురేశ్వరుని వార్తికరచనమునాఁడు చెప్పియుండ లేదా? మీరానాఁ డాతని మదికిఁ గలిగించిన పరాభవాగ్నియే నీగ్రంథము కాల్చినది కాని మేనమామయుఁ గాదు. అగ్నియుఁ గాదు. ఇతరులకుఁ జిత్తక్షోభము కలిగింప నది యూరకుండునా? అది యటుండ నిచ్చి మున్ను శృంగగిరిని నాకు వినిపించిన పంచపాది మాత్రము నేను మఱువలేదు. దానిని వ్రాసికొమ్మని యాగ్రంథ మంతయుఁ జెప్పెను పద్మపాదుఁడది వ్రాసికొని యమితానంద మొందెను.

అంత నవ్వార్త కేరళదేశాధీశ్వరుఁడువిని తననాటకత్రయమును నగ్నిపాలగుటఁ జెప్ప శంకరుండు తొల్లివిని యుండుటచే నవియును జెప్పెను. రాజు వానిని లిఖించుకొని మీయభీష్ట మేమనుడుఁ గాలటివాసులకు నేనిచ్చిన శాపము పాలింపు మని పలికెను. ఆతఁ డదిశిరసా వహించి తనపురికిం జనియెను.

అనంతరము సహస్రశిష్యులు వేష్టించి తోడరా, సుధన్వ భూ

శాంతుఁడు ధనుర్ధరుం డయి వచ్చుచుండ, సేతువు దాఁకఁ బోవ వెడలెను. త్రోవలో మధ్యార్జునం బను శివక్షేత్రమున కరిగి మధ్యార్జునేశ్వరు నారాధించి పాపముల రూపుమాపి యాదేవుని 'నిగమసమ్మతమైనది యద్వైతమా? ద్వైతమా?' యని యడుగుటయు నాలింగము శిరోభాగమునుండి యొకదివ్య జ్యోతి వెలువడి 'యద్వైతమె సత్య' మని ముమ్మాఱు బొబ్బ వెట్టి మాయ మయ్యెను. చూపఱులు విస్మితులై యాక్షణమే శంకరునకు శిష్యులై పంచాయతనపూజాపరులై, యద్వైతమతము స్వీకరించి కృతకృత్యులైరి. పిదప శాక్తులు శంకరుని గాంచవచ్చి తమమతము ప్రశస్తమైనదనియు, స్వీకరింపు మనియుఁ బలికి శంకరునిచే నావాదమెల్ల ఖండింపఁబడి శిష్యులైరి. వారివెంట లక్ష్మీభక్తులు, శారదోపాసకులును రాఁగ వారినిగూడి వాదమున నోటుబుచ్చి యందఱ నద్వైతమతతత్పరులుగను బంచాయతన పూజానిరతులుగ నొనర్చి, యనంతరము మూఁగిన వామాచారులగు శాక్తుల సిద్ధాంతము లెల్ల ఖండించి ప్రాయశ్చిత్తములఁ జేయించి వారి నద్వైతుల నొనర్చెను.

పిదప నాచార్యపాదులు రామేశ్వరమునకు సహశిష్యముగాఁ జని రామనాథు సేవించుచు మాసద్వయ మచట నుండిరి. అయ్యెడ, శైవులు, రుద్రభక్తులు, జంగములు, పాశుపతులు ననువారు గుములు గుములుగ వచ్చి వేదప్రమాణములతోఁ దమతమ మతస్వరూపముల నెఱెంగించి లిఁగధారణము ముఖ్యమని తెలుప నయ్యతిపతి లింగధారణ మవైదిక మని యుపపత్తులు చూపి ఖండించి స్మార్తకర్మపరాయణులుగ వారి నెల్లర నొనర్చి లింగాంకనధారణము మాన్పి యద్వైత విద్యనుపదేశించి శిష్యులుగ ననుగ్రహించి యటనుండి యనంతశయనక్షేత్రమున కరిగె.

అష్టమాశ్వాసము.

ఆక్షేత్రమునంగల వైకుంఠుని భక్తి సేవించుచు నొక్క నెల యుండు నప్పటికి శంకరాచార్యుల యశంబువిని నోపక వైష్ణవ, పాంచరాత్ర, వైఖానస, భక్త, భాగవత, కర్మవిహీనులను షడ్విధవిష్ణుభక్తులు వరుసగా వాదింపవచ్చి తమతమ మతముల నుపన్యసింప విని యందలి లోపముల నెల్లఁ జెప్పి ఖండించి వారి నందఱ శిష్యులుగాఁ జేసికొని యటనుండి సుబ్రహ్మణ్యక్షేత్రమున కరిగి యచట నాసుబ్రహ్మణ్యస్వామి యథావిధిఁ బూజించి తండోపతండములుగ వచ్చుజనుల కెల్లరకు నద్వైతప్రబోధమ్ముల సేయఁ దొడఁగె.

అది గాంచి హిరణ్యగర్భమతస్థులు శంకరుని బ్రతిఘటించి యోడి దాసులైరి. పిదప వహ్నిమతస్థులు నట్లే శిష్యులైరి. తరువాత సౌరమతస్థులు కొండొక స్వమతశాస్త్రము తెలుపఁ బూని ఖండితులై జగద్గురుని పాదముల నాశ్రయించిరి. అనంతర మట నుండి వాయవ్యదిశకు వెడలి మార్గమధ్యమునఁ బ్రజలచే మహారాజోపచారముల నొందుచు వారల సందేహములనన్నిటిని దూలించి యద్వైతవిద్యారహస్యముల వెల్లడించుచు దైవచింతకుల నందఱ శిష్యులుగా ననుగ్రహించుచుఁ దిన్నగా గణవరమను పురము చేరెను.

ఆగణవరము గణపతిక్షేత్రము. అచటిప్రజ లందఱు గాణాపత్యమతస్థు లగుటచే నెవ్వరును శంకరు నాదరింపరైరి. అయిన నచటఁ బద్మపాదుఁడు శాకం బొనరించి యందఱకు భిక్షలు సేయుచుండె. అట్లు జరుగుచుండ నొకనాటి సాయంకాల మయ్యతీంద్రుని శిష్యులందఱు గుంపులు గట్టి వివిధవాద్యములతో శివతాండవలీలల నటింపఁ బూనఁ గ్రమముగా జనులు చూడవచ్చి తన్మయులై తాముగూడ నటింపఁ జొచ్చుట' గాణపతు లరసి 'సన్యాసులు చేయు నాట్యము మన

వంటిగృహస్థులకుఁ దగదు. వీరిమత మాకాశమువలె శుద్ధశూన్య మని యాక్షేపింప శంకరభగవత్పాదులు వారిం బిలిచి యావిషయ మటుండ నిచ్చి మీమతమెట్టిదో తెల్పుదురే యనుటయు వారలు గాణాపత్య మాఱు విధము లనియు సర్వమతశేఖర మనియుఁ దుండైకదంతాదిచిహ్నధారణ మావశ్యక మనియు వారలు దెల్ప హారిద్రాగణపతి, నవనీతగణపత్యుచ్ఛిష్టగణపత్యాది భేదమ్ముల వివిధమూర్తుల సేవించు నాగాణపతుల నందఱను వాదమ్మున నోడించి శిష్యులం జేసికొని వారల స్మార్తకర్మపరాయణులనుగా నద్వైతవిద్యానిరతులుగ నొనర్చి తామ్రపర్ణీతీరస్థు లగు ప్రజల కద్వైతవిద్యావిషయమునఁ గల సంశయమ్ములఁ దొలఁగించి, తన్ను సేవింప వచ్చిన కాంచీపురీజనులం బోలె వారి ననుగ్రహించి యాంధ్రుల రక్షించి, వేంకటేశ్వరపాదపద్మంబుల సేవించి విదర్భరాజనగరము చేరెను. ఆవైదర్భుఁ డెదురుగ వచ్చి శంకరాచార్యుఁ బూజించెను. యతీంద్రశిష్యు లచట వాదింప వచ్చిన భైరవమతానుయాయులఁ దూల్చిరి. పిదపఁ గర్ణాటదేశమునఁ బర్యటింప నుత్సహించుయతీంద్రుని గాంచి విదర్భభూపతి 'ఆర్యా! కర్ణాటదేశము కాపాలికాకీర్ణము. ఆస్తికులకది చేరరా'దని పలుకుటయు నధిజ్యధన్వుఁడగు సుధన్వుఁడు 'మీ కేభయమునురాదు స్వామీ! వీఁడు మీభక్తుఁడు గలఁ'డని పలుక నప్పుడె కన్నడమున కేఁగెను. అది యెఱింగి క్రకచుఁడను కాపాలికగురు వొకఁ డుగ్రాకారుఁడై శంకరుం గాంచి 'యోయీ' భస్మము దాల్తువు గాని కపాలము దాల్పవేల? బొంత దాల్తువు గాని రక్తసిక్తములగు నరశీర్షమాలికలను మద్యమునను భైరవుని బూజింపవు. ఆదేవుఁడు నిన్నెట్లనుగ్రహించు' నని విహీనముగా వదరుటయు నీఖలుని మెడవట్టి నవులకు నెట్టు డని సుధన్వుఁ డాజ్ఞాపింపఁ దద్భటులు వాని నవ్వలకుఁ ద్రోయ 'మిమ్ములను జంప కున్న నేను క్రకచుఁడనే' యని పగచాటి యాకాపాలికగురుఁడు వెడలిపోయి కపాలిగణ

ము గూడఁ గట్టుకొని యతులనందఱు వివిధాయుధంబుల నేయుటయు, నాద్విజులు భయపడి పఱచుచుండ సుధన్వుండు ధనుర్ధరుఁడై యెదిర్చి కపాలిబలమును జీకాకొనర్చుచుండ వేఱొకవంకనుండి కపాలిభటులు విప్రులపైఁ బడిరి. వారెల్లరు భీతిలి శంకరుని మఱుఁగుజొచ్చుటయు నయ్యాచార్యుండు వారి కభయమొసంగి యాకాపాలిక బలము నంతయు హుంకారముచే బూదిగా నొనర్చెను. సుధన్వుఁ డీవంక వచ్చుచుండిన కాపాలికుల నెల్ల నుఱుమాడెను. అంతఁ గ్రకచుఁడు మండిపడుచు శంకరుం జేరి 'దురాత్మా! నామహిమనుం జూతువుగాక' యని యొకకపాలము చేఁబూని భైరవుని ధ్యానింప విచిత్రముగ నదుఁ గలు వోడముటయు, నాకల్లు సగము ద్రావి మరల భైరవు ధ్యానింప నాదేవుఁడు ప్రత్యక్ష మయ్యెను. వాఁడ దేవునకు మ్రొక్కి "దేవా! నీపాదశ్రితులగు నిందఱఁ జంపిన యీదుష్టయతిని ద్రుంప' మన నద్దేవుండు మండిపడి "మత్స్వరూపుఁ డగు యతీంద్రుని జంపు మంటివిరా" యని శూలమున వాని శిరసు నఱికి నటింపఁ జొచ్చెను. అంతట శంకరుం డాక్రోధభైరవు సన్నుతించి దేవా! యద్వైతమతప్రబోధ మొనర్చుచుండ నీభక్తుఁడు వీఁడు వచ్చి నిందించి నీచే హతుఁడయ్యెను. ఇందలి సత్యాసత్యముల నీవెఱిఁగింపఁదగు ననుటయు 'నీవుభగవంతుఁడవు. నీ వొనర్చు సర్వము నేనొనర్చునట్టిదే. కలిప్రభావమునం గ్రూరులైన నీబ్రాహ్మణాధములఁ దరింపఁ జేయుము మంత్రబద్ధుండ నగుటచే నీదుష్టునకుఁ బ్రత్యక్ష మైతిని గాని ధర్మముచేఁ గా'దనిపల్కి యంతర్ధాన మగుటయు హతశేషు లగు వటుకాదులు భయపడి శంకరుని పాదములపైఁ బడి రక్షింపు మన వారిని గరుణించి శిష్యులచే వారికిఁ బ్రాయశ్చిత్తము గావించి స్మార్తక్రియాసక్తులుగ నొనర్చెను. పిదప నున్మత్తభైరవుఁ డను కాపాలికుఁ డొకఁడు వచ్చి స్త్రీపురుషజాతులు రెండేకాని జాతియనునది లేదనియు, వీని కీస్త్రీయే భార్య కావలె నను

నియమము లేదనియు, స్త్రీపురుషసంయోగసుఖమె ముక్తియనియు సట్టి సంగమమున భైరవుఁడానందించు ననియు నుపన్యసింప యతీంద్రుఁడు విని ముందు నీచరిత్రము తెలుపు మన నామాతామహుఁడు కల్లుగీసి యమ్మువాఁడు. యమ్మ తన శరీరము నితరుల సుఖమున కిచ్చెడు సువ్రిత. అని పలుకుటయు నీసీచుని నూరముగాఁ దొలఁగఁ ద్రోయుఁడన శిష్యులు వాని నవ్వల కీడ్చివైచిరి.

తరువాతఁ జార్వాకులను, సౌగతులను, క్షపణకులను, జైనులను, బౌద్ధులను జయించి శిష్యులఁ గావించుకొని, మల్లపురమున కరిగి మల్లారిభక్తులను వశపఱచుకొని, పశ్చిమదేశమున కరిగి విష్వక్సేనమతస్థుల నద్వైతులఁ గావించి, మన్మథమతము నిరాకరించి, కుబేరమతము హతాహత మొనర్చి, యింద్రమతము నిరసించి, యమమతము శ్రుతిస్మృతుల నుదాహరించి ఖండించి, వరుణ,వాయు,భూమి,తీర్థమతములు నగ్గాడి, శూన్యవాదము నురుమాడి, వరాహమతము గెలిచి, లోకసేవకమతము పోఁగొట్టి, గుణోపాసకమత మడంచి, సాంఖ్యమతము చెండాడి, కాపిలమత మెగురఁగొట్టి, పరమాణువాదమతము పరవఁజేసి, కర్మవాదము ధిక్కరించి, చంద్రమతము తృణీకరించి, యంగారకాదిగ్రహోపాసకుల నద్వైతులఁ గావించి, పితృమతము ఖండించి, గరుడానంతమతమ్ములు గెలిచి, సిద్ధోపాసకమతము చీల్చివైచి, గంధర్వోపాసకుల గండడంచి, భేతాళార్చకులవశబఱచుకొని, నీలకంఠమతము నఖండతర్కవాదపటిమఁ జెల్లాచెదరొనర్చి, తన్మతానుయాయుల నందఱ నద్వైతుల నొనర్చి, జగజ్జేగీయమానకీర్తి నలరారెను.

నవమాశ్వాసము.

తరువాత సౌరాష్ట్రాదిదేశంబులఁ బర్యటించుచు నిజభాష్యములను వ్యాప్తి నొనర్చుచు ద్వారవతి కరిగి యచటఁ బాంచరాత్రులఁ

గెలిచి, యుజ్జయినీపురమున కేఁగి యందు భట్టభాస్కరుం డనుమహా తార్కికశిరోమణిని బెద్దకాలము శాస్త్రవాదముసలిపి జయించి, బాహ్లీక దేశమున నార్హతమతస్థుల నోడించి, ఖండనకారునంతంతటి మహా పండితుల వశ మొనర్చుకొని కామరూపదేశమున కేఁగి యభినవగుప్తు డను మహామాంత్రికు నోటఁబుచ్చ నాతఁడు గపటహృదయుఁడై శిష్యునివలె నాశ్రయించి వెంటరాఁజొచ్చెను.

ఈరీతి నానా దేశముల నానామతముల జయించి, సర్వత్ర యద్వైతమతవిజయధ్వజముల నెలకొల్పి శంకరుఁడుండ నాయునకు భగందరమను నసాధ్యవ్రణ మొకటి పాయుస్థానమునఁ బుట్టెను. దేహాభిమానము లేనివాఁడగుటచే నామహాత్ముఁడు చికిత్స కంగీకరింపకున్నను బద్మపాదాదులు దేశదేశములు తిరిగి వైద్యులఁ దెచ్చి చికిత్స చేయించి నిరుపయోగ మగుట నాచికిత్స మాన్పి వారి నంపి మృత్యుంజయాది మహామంత్రోపాసన మొనర్చి యావ్యాధి మాన్పిరి. గురువరునకు నావ్రణము మాన నారంభించిన నాఁడే యభినవగుప్తున కట్టివ్రణమేపుట్టి గురునకుఁ బూర్ణముగ మానునాఁ డాతఁ డావ్రణముచె మరణించెను. కాకతాళీయముగ నిటు గలిగిన మరణమునకుఁ బద్మపాదుఁ డాభిచారిక మొనర్చె నందురు. అది నిజమనదగినది.

శంకరులు స్వస్థులైనపిదప నొకనాఁడు గౌడపాదమహర్షి కాన వచ్చి పూజితుఁడై గౌడపాదకారికాభాష్యము సాంతముగ విని దీవించి కన్మొఱంగెను. ఆమఱునాఁడ కాశ్మీరదేశమున శారదాదేవ్యాలయమున సర్వజ్ఞపీఠము గలదనియు నందు సర్వజ్ఞుఁ డగువాఁడె కూర్చుండ నర్హుఁడనియు, నాల్గుద్వారములందును దిగ్గంతులవంటి పండితు లుండి యొక్కవచ్చినవానిని వాదము నోడించి పంపుదు రనియుఁ బ్రాగాది ద్వారములు మూఁడును దెఱచియుండుననియు, దక్షిణదేశమునుండి వచ్చి

దక్షిణదిగ్ద్వారము తెఱచిన పండితుఁడే యింతదాఁక రాలేదనియు నొకవార్త విని సశిష్యుఁడై యతిసార్వభౌముఁ డచటికి వెడలెను. జయ జయారావములతో శిష్యులు వెనుకొనిరాఁగ శారదాలయమున కరిగి దక్షిణదిగ్ద్వారంబునఁ బోవుచుండఁ గణాదమతపండితుఁ డడుగు ప్రశ్న మున కుత్తరము సెప్పి యాతని మరలింపఁ బరమాణువాది యయ్యతి నెదుర్చి నాతని నిరుత్తరు నొనర్చి చనుచుండ, నంతలోఁ గాపిలుం డడ్డుపడి యడిగిన ప్రశ్నములకుఁ దగు ప్రతివాక్యము చెప్పి యాతని నంపె బాహ్యార్థవిజ్ఞానశూన్యవాదు లగు బౌద్ధులు శంకరు నెదిరింప నందఱకు నుచితముగ సమాధాన మిచ్చునంత దిగంబరమతస్థుఁ డయ్యతితో డీకొనెను. వానిని నిరాకరించునంత జైమినీమతవిదుఁడు వాదమునకుఁ బూన నాబుధుని క్షణమున జయించుటయు నాసకలపండితు లాయతీంద్రు మేధాసంపద కచ్చెరు వొంది దక్షిణద్వారము తెఱచి త్రోవ చూపఁ బద్మపాదుని కేలూఁది లోని కరిగి సింహాసన మెక్కనుండ నొకయశరీరవాణి యాకాశమునుండి 'అన్నా! నీవు మున్నె సర్వజ్ఞుఁడవు. పరీక్ష కాఁగి యిపుడును నైతివి. సర్వజ్ఞత యొకటియే పీఠాధిరోహణమునకు హేతువుకాదు. విశుద్ధత కూడ నుండవలెను. అది నీయెడ సందేహము. పరకాంతతో మదనకళారహస్యముల వాద మొనర్చి పాపము మూట గట్టుకొంటివి త్రికరణశుద్ధి లేదుగాన నీవీపీఠము నెక్కఁ దగవు' అని వినిపింప 'అమ్మా! సాక్షికభావము లేకుండునట్లు మండనుతోడి వాదమున నుభయభారతిని సాక్షిఁజేయ నామె తన భర్త యోటమికి భయపడి తానే వాదమునకు దిగుట నాతప్పగునా? ఆఁడుదానితో వాద మెట్లనఁగా గార్గ్యాదికాంతల వాదకథలు తెల్పి, ఆమెయే నన్నొప్పించి వివద్యమానాంశము విడిచి కామశాస్త్రవిచారమునకుఁ దింప గడఁవొంది? యాశాస్త్ర మామెఁ జయింపఁ జదివి పరకాంతతోఁ గామకళావాదము సేయు నవకీర్ణి నగుదు నని తలఁపున ను

క దేహము సొచ్చి యామె నోడించి తద్దోషపరిహారముగ శ్రీనరసిం
హుని స్తుతించి మరల మానుష దేహ మొందితిని. ఇందు నాయపరి
శుద్ధత యేమికలదు. అంతియుకాదు. నాకోడిమండనుఁడు సన్యసించుట
కగ్ను లాత్మారోప మొనరించుకొనునప్పు డాసాధ్వి యోగశక్తిచే
నగ్నులందు లీనయగునప్పు డామె దివ్యతేజమున వాణీరూపము చూచి
తిని. ఆవాణీదేవివి నీవే కావున నాచరితము చెప్పనేల? అదియుంగాక
యద్వైతమతస్థాపనకై కామశాస్త్రము నరసితినే కాని కామవశుఁడనై
యరసితినా? నాపరిశుద్ధి జగత్తునఁ జాటుటకై యిట్టు లంటివేమొ?
నాహృదయము మలినత్వములేక పరిశుద్ధమైన దని నీవనిన నంతియేచా
లును. నాకీపీఠారోహణము లేకున్న నేమి" యనుటయు మింటనుండి
శంకరుపయిఁ బూలవాన కురియ నచటిబుధు లాయనఘు నుతించిరి.
శారదయు 'భో సర్వజ్ఞ! పీఠాధిరోహణకళ్యాణ మితోఽస్తు తే,
యనెను. అంత శిష్యులు బలసికొలువ సర్వజ్ఞసింహాపీఠమున శంకరా
చార్యు లుపవిష్టులైరి. ఆకసమున దేవదుందుభులు మ్రోసెను. పూవుల
వాన దేవత లయ్యతిపై గురిసిరి. ద్వంద్వవిహారుం డగు నమ్మహితుఁ
డు కేవలస్వమతగౌరవార్థమే సర్వజ్ఞసింహాపీఠ మెక్కుటంజేసి నిగమధ
ర్మంబు పూర్ణంబుగ నడువఁ గట్టడజేసి కాశ్మీరమునుండి శృంగగిరి కరిగి
వ్యాసుఁడిచ్చిన వరము తలఁచి ముప్పదిరెండవయేడు సొచ్చుట తెలి
సికొని తనమనమునః—'ద్వారవతిం గలశారదాపీఠమున హస్తామల
కుని, బదరికావనమందలి జ్యోతిర్మఠమున దోటకాగార్యుని, జగన్నాథ
మునఁ గల గోవర్ధనమఠమునఁ బద్మపాదుని, శృంగగిరిని శ్రీపీఠమున
సురేశ్వరుని బాలకులుగ నియమించితిని. అద్వైతరాజ్యలక్ష్మి యచం
చలముగ వెలయు' నని ధైర్యమూని యటనుండి బదరికావని కరిగి య
చటఁ బాతంజలయోగవేత్తల నోడించి వారికి నిజభాష్యముల గఱపి

కీర్తి కెక్కెను. అంత యాయనకు ముప్పదిరెండేండ్లు పూర్తియగుట యుఁ గేదారమున కరిగి యచట శిష్యులకు బాధానివృత్తికై యుష్ణజలప్రవాహము సృజించి యాయువు పూర్తియగుట యెఱింగి హస్తామలకుని ముద్దిడుకొని, సురేశ్వరు నాదరించి, తోటకుని కౌఁగిలించుకొని, తక్కువారి నుచితరీతుల సమ్మానించి గురుపరంపరకు మ్రొక్కి, కేదారనాథు నెదుట నాసీనుఁడై ప్రాణాయామ మూని తురీయావస్థ నొంది బ్రహ్మరూపమున నద్వైతస్థితిఁ గాంచి యలరార నామహాత్ముని ధ్యానపథమున దత్తాత్రేయుఁడు పొడసూపి కైలాసము సపరివారుం డగు శివునిఁ జూపి వారందఱు నీరూపములే యని తెల్పెఁ. శివుఁడని స్తుతించుటయు నాహిమగిరి కైలాసగిరి యయు యాయన దక్షిణామూర్తిస్వరూపుఁడై ప్రమథులచే దేవతలచే మునులచే స్తూయమానుఁడై యొప్పెను.

కథాసంగ్రహము

సమాప్తము.

శ్రీరస్తు.

కథాప్రారంభము.

కేరళదేశవర్ణనము.

క. శ్రీలము వర్ణాశ్రమధ
ర్మాలంబము వేదశాస్త్రహర్మ్య మఖిలస
స్యాలక్షిత సుక్షేత్ర మి
లాలంకృతి భరతఖండ మలరుఁ బ్రసిద్ధిన్. 1.

సీ. ఘటుభోగగరిమ నేఁబదియాఱు దేశాల
ననుపమానం బను యశము వడసి
కాశ్మీరమటు శైత్యకార్కశ్య మొలుఁగక
యొండపాఁడిమి కలనేని గనక
యేలాలవంగతాంబూలసేవన మెల్ల
దేశమ్ములకు నుపదేశ మిచ్చి
ముక్కారు ముద్దను సెక్కితొక్కిగఁ బండు
సారకేదారవిస్తరము గలిగి
గీ. యివతళించుసమీరు పుట్టిల్లనఁగఁ
జిదిమిపెట్టిన నెత్తావిసీమ యనఁగఁ
దేజరిలుచుండుఁ గేరళదేశ మల్ల
భరతఖండము తలపూవుబంతి యగుచు. 2.

క. అందలి నీ రమృత మ్మిం
దిందిరవేణులు సురీప్రతిచ్ఛాయలు, త
చ్చందనవనములు నందన
నందనములు త్రిదివ మిదె యనం దనరారున్. 3.

సీ. ఏమూలఁ జూచిన నేలాలవంగాది
సురభిళద్రవ్యవిస్తరము మెఱయు
నేవంకఁ గనుఁగొన్న హిమవాలుకాచంద
నాదిశీతలపదార్థౌఘ మెసఁగు
నేయోరఁ గాంచిన నింద్రనీలాబ్జరా
గాదిరత్నముల చాయలె తనర్చు
నేదంస నరసిన నిక్షురంభానారి
కేళపూగాదివనాలి దోఁచు
గీ. భోగభాగ్యైకనిలయంబు భూమిలోక
కల్పవనకల్ప మనుపమానల్పశిల్ప
లలితసౌధావసథము కేరళము దనరు
వసుమతీసతి రతనాలబరిణ యనఁగ. 4.

శా. ఏలాచందనకుందసూనమధువుల్ హేలాగతిన్ గ్రోలి యు
ద్వేలానందముతో లవంగసుమమాధ్వీకంబునుం గ్రోలఁగా
వ్రాలంబోయి తదుష్ణగంధమున కోర్వన్ రాక భృంగమ్ము లం
దాలాపించును ఝుంక్రియామధురగేయంబుల్ వనీవీథులన్. 5.

చ. చలువల కిక్క, గంధవహశైశవకేళివిలాససౌధ, ము
జ్జ్వలమృదుపల్లవోల్లసితచందనపాదపజన్మభూమి, య
వ్వలిమల వియ్యమౌ మలయపర్వత మండన యుంటఁజేసి కే
రళ మనరాళశీతలిమరాజితమై క్షితిఁ గాంచె సన్నుతుల్. 6.

చ. కలఁగదు తాప మెక్కుడు వికాసము దప్పదు వేసరిల్ల దూ
హాలనవకంబుఁ బాయదు స్థిరాకృతి వీడ దొకప్డు బుద్ధి మ
ర్త్యులకు శరీరమం దెపుడు రోగమె పుట్టదు, గిట్టుఁ బుట్టుచోఁ
జలువలసీమ మోహఘుల జన్మగృహం బగు కేరళంబునన్. 7.

సీ. కాసారవాపికైకతరాంచితమ్ములై
యారామములు సర్వ మలరుచుండు
సామాన్యసంజ్ఞ నారామమ్ము లనుటె కా
ని యవెల్ల గుసుమితనిష్కుటముల
యట్టి నిష్కుటముల నజిరోపవనములఁ
బ్రతిసౌధమును గన్నుపండువౌను
దత్సౌధములయం దుదారభోగములఁ జూ
ఱలుగొంచు సంపన్ను లలయుచుండు
గీ. రట్టిసంపన్ను లెల్ల విద్యాభిరతుల
యట్టిబుధు లైహికాముష్మికాధికసుఖ
కర్మములఁ జేసి రోసి మోక్షంబు నొంద
నుత్కటేచ్ఛ వహింపక యుండ లేరు. 8.

క. చందనచర్చితకేరళ
సుందరదోరోరుహోపగూహనభాగ్యం
బొందుచు నందు మలయగిరి
మందానిలుఁ డాడు రేపు మాపన కెపుడున్. 9.

కాలట్యగ్రహారవర్ణనము.

శా. ఆవిర్భావము నొందెఁ దొల్లిట స్వయంవ్యక్తోరులింగాత్మకుం
డై విశ్వంభరఁ గేరళాన వృషశైలాధిత్యకాసీమఁ బూ
ర్ణావాహిన్యమృతాభిషేకము నజస్రం బందఁ గారుణ్యపా
రావారంబు మహేశ్వరాహ్వయపరబ్రహ్మం బజిహ్మకృతిన్. 10.

గీ. స్వప్నమునఁ దచ్ఛివాద్భుతవైభవమ్ము
గనిన యొకరాజ తచ్చోదనను రచించె
సంతతప్రభమైనప్రాసాదగోపు
రాదు లేర్పాటొనర్చెఁ బూజాదులకును. 11.

క. ప్రణతార్తిహరుం డగు త
త్ఫణిభూషణుకృప నిరీతిభావమునఁ గళాఽఽ
పణమై కాలటి యను బ్రా
హ్మణాగ్రహారంబు వెలయు నాగుడిపజ్జన్. 12.

మ. అలరుం గాలటియగ్రహార మమరోద్యానానుహార, మ్మనా
విల వేదశ్రుతవైదుషీనిరుపమోర్వీనిర్జరప్రాజ్ఞమం
డలి కావీరవిహార, మన్వహవితానప్రీణితామర్త్యదో
హాలవీహారము, కేరళక్షితివతంసామ్లానకల్హార మై. 13.

సీ. ఏయూరిపొలమేర నిందుశేఖరుని కా
ణాచి యైవృషగిరీంద్రము వెలుంగు
నేయూరిచేరువ రాయుచుఁ బరమప
విత్రపూర్ణానది వెల్లివిరియు
నేయూరిపొలములం దేకాలమును నేత్రి
పర్వమైసస్యసర్వస్వ మెసఁగు
నేయూరిగృహముల నింపారు ధనము ధా
న్యములు కవ్వము కట్టనట్టిపాఁడి
గీ. ప్రబలనాస్తికమతకుఠారప్రహార
మునకు నేయూరు శ్రుతివర్మమును ధరించి
యలరుచుండు, నాకాలటియగ్రహార
మవనిగతధాతృభువనవిఖ్యాతిఁ దనరు. 14.

సీ. ఇరుగెలంకులఁ బూగతరునారికేళద్రు
పంక్తుల వీథులు పరిఢవిల్లఁ
బూరితాటాకకప్పుల నొప్పు నిండ్లకు
నడుమ మిద్దెలు మేడ లొడిక మెసఁగ

నలుకుముగ్గులను జేమాకులఁ దలపించు
వేద్యంగణాళిందవితతి మెఱయ
స్వాహాస్వధావషట్స్వనపూర్వహుతహవ్య
సురభిధూమము లెల్లచోట్ల సుడియ
గీ తామతస్కరపీడారుజాప్రసక్తి
లేక ధర్మావలంబనశ్రీక మగుచు
సంతతబ్రహ్మపాఠఘోషమ్ము పొదల
వరలు నాబ్రహ్మపురి బ్రహ్మపురిని మించి. 15.

గీ. యజ్వ కానట్టిద్విజుఁ డందు నగపడఁ డన
నుండునే సోమిదమ్మ కాకున్నగృహిణి?
యెల్లవిప్రు లధ్యాపకులే యనంగ
నెల్లవటువు లధ్యేత లం చేల పలుక? 16.

ఉ. నాలుగువేదముల్ చదివినన్, బఠియించిన నాఱుశాస్త్రముల్
చాలును విద్య లంచు నలసత్వము నొందక, కర్మకాండ మా
మూలము నాచరించి, పరముక్తి మదిఁ గోరి, యనాద్యవిద్య ని
ర్మూల మొనర్చువిద్య కయి రోయనివాఁ డొకఁ డుండఁ డచ్చటన్.

శివగురుచరిత్ర.

క. అం దుండు సకలవిద్యా
విందువు విద్యాధిరాజవిఖ్యాతాఖ్యుం
డిందుధరుఁ డెవనినందను
నిం దండ్రిఁగ వలచెనో జనింప నరుండై. 18.

ఉ. ఆతనిపూర్వపుణ్యమున నాత్మభవుం డయి బ్రహ్మవర్చసో
పేతు డొకండు బాలుఁ డుదయింప, శివుం డగు జ్ఞానమందు వా
గ్రీతి గురుండ యౌ నని యెఱింగి కుమారున కాద్విజుండు ని
ర్ధూతభవుండు దా 'శివగురుం' డని పే రిడె సార్థకంబుగన్. 19.

ఉ. వాఁడును బ్రహ్మచర్యపరిపాలనకై గురుగేహవాసియై
యొడక సేవసేయుచు నిజోచితమాధుకరాన్న భోజియై
పోఁడిగ నగ్నికార్య మిరుపొద్దును దప్పకచేయుచున్ దమిన్
వీడక కూడ కన్యుల స్వవేదము నధ్యయనించెఁ బ్రాజ్ఞగా. 20.

గీ. కలుగునె క్రియాద్యనుష్ఠానఫలక మర్థ
బోధము విచారరాహిత్యమునను గావ
శ్రుతులఁ జదివి విచార మాసూరి సలిపె
నరయ వేదంబు దుర్బోధతరము గాదె. 21.

క. భయభక్తుల నిజశాఖా
ధ్యయనముతో నన్యశాఖకాధ్యయనము సే
సియు నంగము లరసి గురుని
దయను సమావృత్తుఁడై యతం డిలు సేరెన్. 22.

ఉ. మందర మట్లు చేరి తనమాతకు మ్రొక్కఁగ నాపె నందనున్
సందిటఁ జేర్చి తద్విరహజం బగుతాపము వాసె నన్నచో
నందియు మేల చందనరసంబునకంటెను శీతలంబు నాఁ
గం దగుఁ బుత్రగాత్రలతికాపరిరంభణ మన్నమాటయున్. 23.

సీ. ఆమ్నాయసంహిత నభ్యసించెను బద
క్రమజటాదికమునఁ బ్రశ్న సేసెఁ
బూర్వమీమాంస నపూర్వ మాపూర్వప
క్షము లొనర్చి తదీయసార మరసెఁ
గణభుజ్మతంబునఁ గదలించిచూచెఁ బ
శ్యాత్పాదమత రహస్యముల నొరసె
సాంఖ్యసిద్ధాంతపృచ్ఛను మెచ్చుకొనె నను
యోగమ్ము సలిపెను యోగసరణి

గీ. క్షితిని విద్యాధిరాజప్రసిద్ధిఁ గనిన
తనసమాహ్వాయ మన్వర్థతను రహింప
బుత్రిబుద్ధివిశేషబుభుత్సు వగుచు
శివగురుఁ బరీక్ష సేసి హర్షించెఁ దండ్రి. 24.

చ. అటు జనకోదితుం డయి స్మితాస్యవిభాహసితాబ్జుఁ డౌచుఁదో
ల్తటిగురుపంక్తి నెంచి సరళంబుగ నుత్తరమిచ్చుపుత్త్రువా
క్పటిమకు వేదశాస్త్రమతికౌశలి కుబ్బెను దండ్రి సంస్క్రియా
స్ఫుటమగువాక్కు విజ్ఞనకపూర్వముదం బుదయింపఁ జేయదే. 25

క. శ్రోత్రియుఁ డంతర్వాణి ప
విత్రకులుఁడు మంజురూపవిభవుఁ డనుచు నా
ధాత్రీసురసుతునకుఁ దమ
పుత్త్రికల నొసంగఁ బెక్కుభూసురు లరుదేర౯. 26.

ఉ. అం దొకసత్కులప్రభవుఁ డైనద్విజన్మవిపుత్త్రి భవ్యరూ
పం దతశాంతిదాంతిగుణపాలిక బాలికఁ దెచ్చి బాంధవా
నందము మీఱఁ బెండ్లియొనర్చెఁ గుమారునకు౯ ద్విజుండు మి
న్నందినవైభవంబున ముదంబుధిఁ దేల జనంబు లందఱు౯. 27

గీ. విధియుతంబుగ దేవేంద్రవిభవ మమరఁ
బరిణయం బన్నినాళ్ళు శుభప్రద మయి
జరిగెఁ, జుట్టాలు సత్కారభరితు లగుచు
దీవన లొనర్చి చని రాత్మదేశములకు. 28

మ అనురూపాకృతి, సౌమ్యశీల, మృదులవ్యాహార, సౌహార్దపా
లనదీక్షామతి, బంధుతాసురభి, బాలారత్న మార్యాంబనాఁ
గ,నిరూఢిం గనుకాంత యాశివగురుఖ్యాతాఖ్యుఁ డౌ కాంతుతో
మనువొందె౯ గిరిజామహేశ్వరసధర్మం బెంతయు౯ రాజిలె౯. 29

సీ. అత్తమామలకుఁ బాదాభివందనపూర్వ
మఖిలశుశ్రూషల నాచరించు
బతికనుసన్నఁ బ్రవర్తించు క్షీరనీ
రన్యాయమున భేదరహితవృత్తిఁ
దనివార నతిథిబాంధవుల కిష్టార్థవి
శ్రాణనంబున సంతసంబు గూర్చు
గృహకృత్యభారనిర్వహణావసరమున
వంచిననడు మెత్తదించు కేవి
గీ. సకలసౌభాగ్యభాగ్యలక్షణసమేత
యగుచు నయ్యార్యరనే కాక యవని నెల్లఁ
బరమసాధ్వీప్రశంసఁ బ్రప్రథమకక్ష్య
నందె నార్యాంబ గుణకదంబావలంబ. 30

గీ. అవుల శివగురుఁ డుత్కంఠ నాచరించె
నుత్తమర్త్విక్సహాయత నూని జాత
వేదఆధానము గృహస్థవిధి స్మరించి
కానినాఁ డెట్లు క్రత్వధికారి యగును? 31

సీ దేవతల్ గట్టని తేన్పఁ బెక్కొనరించె
యాగముల్ విత్తశాఠ్యమ్ము గనక
జంగమకల్పవృక్షం బనఁ బిత్రు, దేవ,
నరుల నిష్టార్థసంతతులఁ దనిపె
వేదపాఠవ్రతం బూఁది శ్రౌతస్మార్త
కర్మముల్ నడపె నిష్కామబుద్ధిఁ
గడపె నెంతయుఁ బెద్దకాలమ్ము గార్హస్థ్య
ధర్మమర్మజ్ఞావతంస మగుచు

గీ. స్మరనిభాకృతి యుర్వీసమక్షముండు
వాగ్రమాధికరణం బయి వరలు నాద్వి
జుండు సర్వగతులను బూర్ణుండె కాని
నందనముఖేక్షణాదృష్ట మొందఁడాయె. 32.

క. గోవులు ధనములు బహుస
స్యావృతకేదారములు ననర్ఘగృహము సం
భావన బంధుసమాగమ
మావిప్రు నలర్ప వాత్మజాప్రాప్తి నయో! 33.

శా. ఈయేఁ డుద్భవ మొందుఁ బుత్త్రుఁ డిఁక నయ్యేఁడున్ జనెన్ గాని యీ
పై యేఁడేని జనించు నన్నమతితోఁ బ్రాయంబు పో నేఁగుచున్
జాయం బల్కె బుధుండు 'ప్రాయము తనూసారంబు నోయెన్ గనుల్
గాయల్ గాచె వెలంది! పుత్రముఖవీక్షావ్యర్థకాంక్షార్తిచే. 34.

క. సుతుఁ గంటిమేని మన కా
తతశుభములు గలుగుఁ బంచతం బొందిన నం
చతివ యుపాయము లరసియు
విత యయి నాపుట్టు వెంచి వెత గాంతు మదిన్. 35.

గీ. గరిత పుత్రపౌత్రక్రమాగతిని మనల
నెవరు గణియింత్రు లోకమం దింకమీఁద
ఫలిత మగుశాఖఁ గాక ప్రవాళవేళఁ
బ్రసవఫలశూన్యతరువు నెవ్వండు దలఁచు'. 36.

చ. అన విని పల్కెఁ దత్సతి 'మహాత్మ! శివాఖ్య చరిష్ణుకల్పశా
ఖిని భజయింపఁ జిక్కె మనకేల స్థిరైశఫలంబు భక్తిమ
జ్జనుఁ డుపమన్యుఁ డొందినప్రసాదము సాక్షియ కాదె? దేవకో
టిని జడిమంబు నొందుట ఘటిల్లదు మర్త్యుల నొందు కైవడిన్' 37.

క. అనవుడుఁ బుత్త్రియస్మన
మునఁ దలఁచె నతం డుమార్థమును మస్తకమం
డనసోమార్థము నతజన
ధన మగుపరమాత్మఁ దీవ్రతపములఁ బొరయన్. 38.

శివగురుని తపస్సు.

మ. నిజగేహానతిదూరవర్తితటినీనిర్మగ్నుఁడై కంకమూ
లజలాస్వాదన శంకరున్ గొలిచెఁ దొల్తన్; మీఁదటన్ దత్పదాం
బుజమాధ్వీకవిలోలభృంగ మయి విప్రుం డాదరించెన్ దపం
బు జగానిల్కడ భార్యతో వృషధరంబున్ జేసె యేకాగ్రతన్. 39.

చ. ప్రతిపదమందు 'శంకర! హరా! గిరిజాహృదయాబ్జబంధురా!
సితకరఖండశేఖర! యశేషజగన్నిలయోదరా!' యటం
చతులితభక్తిఁ గూరి ఘటితాంజలియై పులకాంకితాంగుఁడై
నతుఁ డయి పోలుచున్ దపమొనర్పఁగ దీక్ష వహించె నచ్చటన్ 40.

శా. నేళన్ మీఁదక మేలుకాంచి చని యవ్విప్రుండు పూర్ణానదీ
కీలాలంబునఁ గ్రుంకి వచ్చి యభిషేకించున్ బ్రభాతంబులన్
వ్యాళాధీశవిభూషు శంకరు మహాన్యాసంబుమంత్రంబులన్
బాలన్ దేనెలఁ జక్కెరన్ దధిని బూర్ణానిమ్నగార్ణోర్మిగన్. 41.

చ. ఒకదళమేని వాడనిసుమోచ్చయమున్ నవబిల్వపత్త్రముల్
ప్రకటితభక్తిఁ దెచ్చి సుమబంధము లూర్చి సహస్రనామపూ
ర్వకముగఁబూజలన్ సలుపుఁ బ్రాహ్ణమునందు ధరామరుండు శూ
లికి మది జల్లనన్ బరిమళించుచుఁ దెమ్మెరలెమ్మె సూపఁగన్ 42.

మ. రవి యస్తాద్రిని జేరుదాఁక నతితీవ్రస్ఫూర్తి చిత్తంబు శాం
భవమూర్తిన్ మిళితం బొనర్చి యశనాంభఃపానముల్ మాని స్థా
ణువుధర్మంబు వహించి కావిరుచి మిన్నుల్ గ్రమ్మ నవ్వేళ సం
ధ్యవిధుల్ దీర్చి మహానటాకృతి శివున్ ధ్యానించుఁ గన్మోడ్పునన్

సీ. జటజూటమున నుచ్చైరవంబునఁ బొంగు
గాంగవేణికకు సాష్టాంగ మెఱఁగి
శ్రుతిసూక్తివితతి భాసురసుస్వరంబుల
వినుచు పాణికపాలమునకు మ్రొక్కి
యనుపదం బుల్కి స్వయంగ్రహపరిరంభ
సౌఖ్యమ్ము పతి కిచ్చుసతి నుతించి
యఇఉణాద్యక్షరోదయ హేతువగుఢక్క
ననుకరించు పదాంగదాహిఁ బొగడి.
గీ హా యటంచు మహీసురుం డాత్మయంద
శివునితాండవ మూహించి చింతసేసి
కనులగట్టినయ ట్లైనఁ గలఁగి యశ్రు
లొలుకఁ బులకితగాత్రుఁడై యొఱఁగు ధరణి. 44.

క. జాయయు స్వచ్ఛాయయటుల్
కాయము నియమోపతాపకలితత నవయన్
నాయకుఁ బాయక వృషధర
నాయకు బహుకాల మర్చనంబులఁ దనిపెన్. 45.

ఉ. చిన్నిపిపీలికల్ మొదలు చెట్లులు గుట్టలు గట్లు పుట్టల
చ్ఛిన్నతదేకభక్తి విధుశేఖరరూపములై కనంబడన్
గన్నులు మూసినన్ దెఱచినన్ మది భేదమువోయి యా ద్విజుం
డు న్నలినాక్షియున్ దముఁ గనుంగొని రొండొరు నీశబుద్ధితోన్.

క. క్రమముగ సకలచరాచర
మమలం బగుహృదయదర్పణాధిష్ఠిత మై
యమరఁ దమ కిరువురకు లో
కమున కభవునకు నభేదకలనము గలిగెన్. 47.

మ. జలదాచ్ఛాదితసూర్యబింబమువలెన్ శైవాలజాలావృతా
చలితాచ్ఛంబువుఁబోలి, మాయ దను నాచ్ఛాదింపఁగన్పట్టిన
ట్టుల కన్పట్టనియట్లు తోఁచు శశిచూడున్ జూచుచున్ గొన్నినా
ళ్లు లవిచ్ఛిన్నతపంబు లాద్విజుఁడు నాలుం జల్పి రేకాకృతిన్. 48.

క. అంబుదము విరియ భాస్కర
బింబము పొడసూపుపగిదిఁ బృథుతరమాయా
సంబంధ మ్మెడయ ననం
తం బానందమ్ము శివునితత్త్వము తోఁచెన్. 49.

గీ. ఇది యది యటంచు నన నేల యెల్లకరణ
కర్మములు, వార్థియం దనేకస్రవంతు
లణఁగి తామైక్య మొంది నట్లాయఖండ
తేజమున మున్గిపోయి శాంతిల్లె నెల్ల. 50.

క. ధ్యాతృధ్యానధ్యేయభి
దాతీతాద్వైతభావనాచంచలమై
వీతతరంగాంబుధిగతి
నాతాపసులకు విచిత్ర మగుస్థితి యమరెన్. 51.

చ. సగుణము నిర్గుణంబు నగుశాంకర తేజము శాంతమానసా
బ్జగత మొనర్చి పూజల జపంబుల ధ్యానములన్ సమాధులన్
బగళులు రేలు నద్దిర క్షణప్రతిమంబులు గాఁగఁ బుత్తు రా
ల్మగ లది యేమొ పన్నిదములన్ గెలువంగ ననంగ నెంతయున్.

క. వదలక చిర మిటు సౌఖ్యము
పుది నెఱుఁగక తప మొనర్చు మాంత్రికులు దొలున్
మొదలంటఁ గరఁగి పోనతి
మృదుహృదయుఁడు శివుఁడు కరఁగఁడే వెన్నవలెన్. 53.

వ. అంత బాలప్రాలేయరోచిర్మౌళికి నిస్తంద్రకరుణారసం బద్ధరామర
జాయాపతులవంక వంకలై తొలంక నంకించునత్తరుణంబున
మహాశివరాత్రిపుణ్యకాలం బరుదెంచుటయు. 54.

శివగురునకు శివుఁడు ప్రత్యక్షమగుట.

చ. శమదమమూర్తులైన ద్విజజంపతు లత్తఱి నాప్రభాత మ
ద్దమరేయిదాఁక నీశ్వరపదంబులు గొల్చుచుఁ బాడి పాడి వి
శ్రమమును జెందఁ దచ్ఛివపురస్థితభిత్తిక నాని మేను నే
త్రములొకయింత మూయ వసుధాత్రిదశుం డొకచిత్రముం గనెన్. 55.

సీ. గగనమార్గమ్మందు నిగనిగ మనునొక్క
వెలిమబ్బు తెలిగట్టువలెను దోఁచెఁ
జూడఁజూడఁగ నొక్కసురుచిరంబు మెఱుంగు
చిరచిర నిటునటు పరుగువాఱె
నామేఘ మంతంత నవనికి దిగి వచ్చు
నల్లై పురోభాగమందు నిలిచెఁ
దన్మధ్యసీమ నుత్తమకాంతి యొకమూర్తి
తెరఁ బాయునర్తకి సరణి మెఱసెఁ 56.

గీ. క్రమముగాఁ బూరుషుం డయి కదలఁ జొచ్చె
నభయవరదముద్రాంచితహస్తయుగము
తలను జాబిల్లి కనుల మందస్మితార్ద్ర
కరుణ యరమేన సతి గల్గి గిరిశుఁ డయ్యె. 57.

చ. అటువలెఁ దోఁచుశంకరుఁ గృతాంజలియై చలితాఖిలాంగుఁడై
చోటచోట నశ్రువుల్ దొఱఁగఁ జూపుల కందనిరూపు నేత్రసం
పుటమున నాని యాని స్తవముం బచరింపఁగ మాట రాక య
క్కట! భువివ్రాలె నాద్విజుఁడు, గౌరియయోయని జాలిఁబూలఁగన్.

క. హైమవతీవక్షోజమ్ము
గీమదజాబాలమే చకితమై నిజభ
క్తామరతరు వగు వలకే
లామ్మృడుఁ డటుసాచి పట్టె నతనిఁ దటుకునన్. 59.

ఉ. పట్టి సుతుండ లెమ్మిఁకఁ దపంబులం గుశ్రిస్సితి రీవు జాయయున్
బొట్టకుఁ గూ డెఱుంగర తినం డొకపండునుమాత్రి మంచుఁ బె
న్గుటుగ మావిపండ్లనుపఁ గోమలకాంతిసుగంధపూర్ణ మై
నట్టిది చిన్నపం డొకటి యాతఁడు సేకొనెఁ గేలుదోయిటన్. 60.

చ. కరయుగళంబునన్ సగముగాఁ బఱు కెత్తుడుఁ దద్రిసాల ము
ర్వరఁ బడి తద్రసంబు పరివాహము గట్టఁగఁ దుశ్రిఖ్యపాటుమై
నెఱిఁ గను విచ్చి నల్దిశ లనేకవిధంబులఁ గాంచియున్ హరున్
వరముగ నిచ్చు తత్ఫలముపాసనయున్ గనఁజాలఁ డింతయున్. 61.

క. వలిమలయల్లుఁడే చెంగట
నిలిచి ఫలం బొసఁగినటు గణించును గానీ
కల యను తెలియక యాతఁడు
కళవళమును జెందె నొక్కక్షణము మనమునన్. 62.

చ. మనసు దిటంబు సేసికొని మాయను జోపి పరిస్ఫుటంబుగాఁ
గనుఁగవ విచ్చి చూడఁ గఱకంఠునిలింగము గంటరీతి నుం
డిన యొకదివ్యదేవాలయమును నిద్దురఁ గూరినయాలు దేవళం
బును గననైన నచ్చెరువు పొందెఁ గలం గనుఁగొన్నదానికిన్. 63.

క. ఇట్టికలఁ గంటి నక్కట
యెట్టి ఫలం బొదవునో యనేకఫలంబుల్
గుట్టగఁ జూపఁగ ముట్టక
యిట్టిఫలంబునకు నేల యాసించితినో. 64.

క. అని మది నాస్వప్నఫలం
బునకై కొండొక విచారమును జేసి తుదిన్
దన శాస్త్రానుభవబలం
బున నీగతి నిశ్చయంబు పొందఁగఁ గల్గెన్. 65.

చ. సుతుఁ డుదయించు నొక్కఁ డతిసుందరరూపుఁడు పాండితీసము
ద్గతసితకీర్తిచిక్కణసుధాద్రవలిప్తదిగంగనాకపో
లతలుఁడ యౌను గాక విరళం బగునాయువు గాంచునంచు నెం
చితి నిది యెల్ల నీపెకు వచించినఁ గుందదె నేఁటినుండియున్. 66.

క. భగవద్విలాస మట్లుం
డఁగ నెవ్వం డాఁప నోపు, నగజాపతి య
ప్పగిది వర మనుచు వగ లీ
యఁగ నెంచునె భక్తదుఃఖ మరయఁ దలఁచు నే. 67.

వ. అని కొండొక కళవళ మొంది యొంది తుదకు. 68.

చ. అట నొక కంబ మూనుకొని యప్పుడ నిద్దురగొన్న ముద్దియన్
దటుకున లేపి యెల్లకలఁ దప్పక యామెకుఁ జెప్పి యప్ఫలం
బటు భువిఁ గూలి రూపఱునుదంతము మాత్రము డాఁచెఁ జిత్తమ
క్కటికము సెందినన్ ముఖవికార మొకింతయుఁ దాల్పకయ్యెడన్.

క. ఆనందాశ్రుఝరంబులు
మేనఁ బొడము గగుఱుపాటు మీఁదఁ బఱవఁగా
మానిని 'ధన్యాస్మి' యని భ
వానీపతి కాచరించె వందనశతముల్. 70.

మ. జననీ మాయెడ నీకు నెంత కృపయో సర్వేశు కారుణ్యదృ
ష్టిని మావంక మరల్చి వంశము ప్రతిష్ఠింపన్ బ్రసాదించితే
మని నీశక్తి నుతింతు శక్తిధరునీడై నాకుమారుండు కూ
డను వర్ధిల్ల ననుగ్రహింపు మని తోడన్ మ్రొక్కె శర్వాణికిన్.

ఉ. ఆపరమానుభావు లటుసాంబశివుఁ గనుమూయకుండ ని
ష్ఠాపటిమన్ నుతించుచు నుషస్సమయంబున మెల్ల నేఁగి పూ
ర్ణాపగఁ గ్రుంకి వచ్చి తొలియ ట్లభిషేక మొనర్చి తద్వ్రతో
ద్యాపన మాచరించి నిజధామయియాసువులై ముదంబునన్. 72.

సీ. వృషశిఖరీశ్వరశ్రీపాదములకు స
హస్రాభివాదమ్ము లాచరించి
యంబికాదివ్యపాదాంభోరుహపరాగ
పుంజమ్ము మస్తకంబుల ధరించి
గణనాథగండనిర్గళితమదాంబువుల్
మార్దించుకొని నిజఫాళులందు
శ్రీకుమారాంఘ్రివారిజగంధలహరుల
నాసాపుటికిఁ దర్పణం బొనర్చి
గీ. పారిషదవర్గమును బరిపాటిఁ గూడి
పాడి స్పృశియించి సెలవీయ వేఁడి వేఁడి
తిరిగి తిరిగి కనుంగొంచు గిరిని డిగ్గఁ
జాల కెట్టులో డిగ్గి రయ్యాలుమగలు. 73.

చ. అభవపరాత్ములై నియతులై పరిశుద్ధులు తత్సతీపతుల్
శుభదముగాఁ గలన్ దలఁచుచున్ జని యింటికి నన్నవస్త్రదా
నభరసుతృప్తభూసురజనంబులదీవన లీశ్వరోక్తిసం
నిభములుగాఁ దలంచుచు ననీదృశమోదము నొంది రాదటన్. 74.

ఆర్యాంబ గర్భము దాల్చుట.

ఉ. ఆదినమంద శాంకరమహార్మిళితంబు ద్విజాళిభుక్తశే
షాదన మారగించెను దదాజ్ఞను శ్రీశివగుర్వభిజ్ఞుఁ, డ
ప్పైదలియున్ నిజేశపదభక్తి మునింగి తదన్నభాగసం
ఖాద మొనర్చి తాల్చె శివగర్భము గర్భము నిర్భరద్యుతిన్. 75.

క. ఆరమణిగర్భ మెదుగ శ
రీర మ్ములలరెను బ్రభాతిరేకముచేతన్
వారితదృశ్యాతజగం
బై రవిమధ్యాహ్నదుస్సహాలోకగతిన్. 76.

చ. జగములు నాలుగున్ బది నజస్రము దాల్చుచు భూజలానలా
నిలగవియదర్కచంద్రపురుషుల్ నిజమూర్తులుగా వెలుంగుచు
న్నగపతికుండలుండె లలనామణిగర్భమయత్వ మొందఁగన్
మగువ శరీరగర్భ గతిమాంద్యము నొందె నటన్నఁ జిత్రమే. 77.

సీ. తన తేజమున సతితనువు నింపి జగన్న
యుఁడు డాఁగె శిశుఁడు తదుదరమందు
సుదతి రమ్యసుగంధిసుమధారణాంబోగ్య
దన రత్నభూషాది నడుగ నేల
యించుక బరు వైన దేపదార్థము గాని
దాల్పంగ నలయుఁ దద్దయు మృగాక్షి
విడిచినన్ విడువ కాబిడకు దౌహృదము చే
కూరిచె వెత దుశ్శరారివోలెఁ
గీ. గోరు దుర్లభవస్తువా కోర్కిఁ దీర్పఁ
దేర, నది కా దనుచుఁ గోరు వేఱయొకటి
నదియు నెటొ తేర, రోసి యన్యంబు గోరు
నువిద యది యీయఁ, గనుఁగొంచు నోకిలించు. 78.

ఉ. చూలును దాల్చువార్త వినుచున్ వెలలేనియపూర్వదుర్లభా
ర్థాళులు గూర్చి బంధునివహంబులు నూడిదగా నొసంగ నీ
లాలక యాస్వదించి యిసుమంత ముదంబును గాంచు; దుర్వ్యథా
మూలము గాదె గర్భభరముం ధరియించుట పూవుఁబోండ్లకున్.79

గీ. మనుజధర్మానుసార మిమ్మాడ్కి-ననుటె
కాని శివతేజమును దాల్చు కాంత కార్తి
గలుగు టె ట్లఖిలార్థులు మలఁగ జగము
లభవు సేవింతు రంచు మహాత్ము లనరె. 80.

సీ. తాను స్వభావావదాతవర్ణం బగు
ఋషభవాహనముపై నెక్కి-నట్లు
సంగీతవిద్యావిశారదు లైనగం
ధర్వులు బలసి తన్బాడినట్లు
వినయానుయానులై విద్యాధరాదిక
దివిజులు తను సన్నుతించినట్లు
"జయ జయ రక్ష రక్ష" యటన్న పల్కు-లా
లించి తా వరము లందించినట్లు
గీ. కలలుఁ గని తుళ్లిపడి మేలుకాంచి లలన
తత్పునఃపునరుక్తశబ్దంబు నాల
కింపఁగాఁ జాల దాదృశ్య మించుకంత
గాంచఁజాల దచ్చెరువును గనుట దక్క. 81.

ఆ. లలన నర్మభాషలను బల్కఁ బర్యంక
మెక్క వేసటను వహించుఁ గాస
యితరులను జయించి హృద్యవిద్యారాజ్య
సింహపీఠి నెక్కఁ జింతసేయు. 82

గీ. ప్రథమగర్భసంస్కారసంపర్కమునను
సర్వగర్భపావిత్ర్యమ్ము సంభవింపఁ
బురుషసంతాన ముదయింపఁ బుంసవనము
సేసె నార్యాంబ కెలమి నాశివగురుండు. 83.

క. ధీమంతులు పొగడ విధి
శ్రీమంతముగా నభీష్టసిద్ధికినై యా
ధీమంతుఁడు శివగురుఁ డల
సీమంతిని కాచరించె సీమంతంబున్. 84.

గీ. పరమసాత్త్వికవృత్తులపట్ల సమత
వైషయికవృత్తులందు నిర్భరవిరక్తి
నూను నాసతిచేష్ట తదుదరవాసి
పుత్రచిత్రచరిత్రఁ దెల్పుచుఁ దనర్చె. 85.

గీ. అతివ కడుపుననుండియు నర్భకుండు
తలఁగఁ ద్రోచె నురోరుహాద్వైతఫణితి
తఱిమి వైచె వలగ్నమాధ్యమికవాద
మరయఁగ మహాత్మగర్వంబు లవ్వి యగుట.

మ. అంబుజబంధుగర్భ యగుప్రాగ్దిశయొప్పు, నిగూఢకృష్ణవ
ర్త్మం బగుజమ్మియొప్పు, యుదరస్థసురద్విప యైనగంగయుం
దంబు సుధానగర్భ యగుధాత్రి పెంపగును శర్వపూర్ణగ
ర్భంబు భరించు నాద్విజపురంధ్రి యెడన్ గననయ్యె నయ్యెడన్. 87.

గీ. కుత్తుకుత్తు మటంచును సత్తువింత
లేమి, యరుచియు, విసు వొకిలింత లడరె
నగలు బిగువయ్యె వగలు మున్నగనె సడలె
గరిత కంతంత గర్భంబు పెరుఁగుకొలఁది. 88.

శంకరుని జననము.

గీ. సుఖముమైఁ బదియవనెల పొరఁబడంగ
నంత వైశాఖమాసంబునందు శుక్ల
పక్షపంచమి శర్వదైవతభమైన
యార్ద్రయం దభిజిన్ముహూర్తాంతరమున. 89.

చ. రవిశశిభౌము లుచ్చతరరాసుల నెల్ల గురుండు కేంద్రమౌ
భవనమునన్ విరాజిల శుభగ్రహయుక్త శుభగ్రహేక్షితం
బవుశుభలగ్నమందు నచలాధిపకన్య కుమారునిం బలెన్
శివగురుధర్మపత్ని సుఖసేవధి యై కనియెన్ గుమారునిన్ 90.

ఉ. కోరిక లెల్లఁ బండ ద్విజకుంజరుఁ డాత్మజుమోముఁ గాంచి ము
ద్వారిధి మగ్నుఁ డయ్యు శుచివారి మునింగి హిరణ్యనైచికీ
భూరుచిరాంబరాది ద్విజముఖ్యులఁ దేలిచి జాతకర్మసం
స్కార మొనర్చె శాస్త్రపరికార ముదారవిహారహారియై. 91.

క. జను లెల్లఁ బొంగి వైరము
లను మఱచి ముదంబునం జెలఁగు టరుదే త
జ్జననమహిమ వ్యాఘ్రాదిక
వనమృగములె వైర ముడిగి వరలిన వనుచోన్. 92.

సీ. చిగురొత్తి పూచి కాచి ఫలించె మ్రోళ్లైన
క్షితిరుహంబులు గూడఁ జిత్రముగను
నిర్మలమధురాంబు నిర్ఝరశాంతప్ర
చార మొప్పఁగ ఘనీపమితి మెఱసె
యాయజూకగృహంబులందుఁ ద్రేతాగ్నులు
వెలిఁగెఁ బ్రదక్షిణార్చుల వహించి
సుమసౌరభము దాల్చి సుడియుచు హోమాజ్య
గంధిలంబై వీచె గంధవహము

గీ. పుష్పవర్షము సురహర్షమును నభోంగ
ణమ్మునం దోఁచెఁ బంచభూతమ్ము లిటు న
వాకృతి వెలింగెఁ బంచభూతాత్ముఁ డైన
బాలు నుదయప్రభావసంబంధమునను. 93.

గీ. జాతె నద్వైతమత విపక్ష మతవాది
బుధుల హస్తాగ్రముననుండి పుస్తకములు
శ్రుతిశిఖాతతి నవ్వె, వ్యాసునిమనోంబు
జమ్ము వికసించెఁ, గలిగె స్వాస్థ్యమ్ము జగతి. 94.

క. సుతపూర్ణోత్సంగ యయిన
సతి రంజిలెఁ బూర్ణచంద్రసంగతిఁ బ్రాచీ
సతివలెఁ జలరుహహితసం
గతిఁ బ్రాగ్గిరితటియుఁ బోలెఁ గన్నులపండై. 95.

క. ధగధగ మనుతనుకాంతులు
నిగనిగ మనుచేర లంత నేత్రంబులు గుం
పగు కురుల మెఱయుబిడ్డని
మొగముం గని తల్లి నింగి ముట్టఁగఁ బొంగెన్. 96.

ఉ. ముద్దులు మూటగట్టు నిజపుత్త్రనిరూపము గాంచి మోహసం
పద్దశ మించి కన్నప్రసవశ్రమ మంతయు విస్మరించి య
మ్మద్దియ డెందమందు దయయున్ గను ప్రేమయు నొండ సన్న్యముల్
తద్దయు వెల్లివాఱ మృదులంబుగఁ బొత్తుల నుంచి కంపిలున్. 97.

శా. అంభోజాక్షి పతిన్ వృషాద్రిశివుతాదాత్మ్యంబునన్ జిత్తమం
దుం భావించుచు గర్భదోహదమునందున్ దిన్నస్వాద్వన్నత
త్సంభారాది శివప్రసాదముగ సంభావింపఁగా నేమొ త
త్సంభూతుం డగుడింభకుం డలరె సాక్షాచ్ఛంభుదివ్యాకృతిన్. 98.

సీ. అది యేమొ నొసటియం దక్షి యుండినయట్టు
లానవా లున్న దోయతివ కనుము
భుజములందుఁ ద్రిశూలమును బోలు రేఖలు
సుస్పష్టమై యొప్పు సుదతి! కనుము

చందమామ వెలుంగుచందమై కచబృంద
మంద మొందెను మందయాన! కనుము
స్ఫటికసన్నిభతనూచ్ఛవులందుఁ గన సగం
బతివయ ట్లగపడు నబల! కనుము
గీ. బిడ్డతనుకాంతిముందు దీపిక ల వేల?
యనుచుఁ గాన్కలఁ గొని యరయంగ వచ్చి
నట్టిప్రతివేశినులు శివుం డనుచు బ్రీమసి
పురిటియింటనె గుజగుజల్ వోయి రపుడు. 90.

చ. పురుటిదినంబు లభ్యుదయపూర్తిఁ దలిర్ప హితాప్తబంధు లం
దఱుఁ గవగూడి నామకరణం బొనరించెను "శంకరుండ" టం
చరసితిఁ బుత్త్రి శంకరదయాప్తి నటంచునొ "శమ్ కరోతి శం
కర" యని బాలు భావికథఁ గాంచియొ కాని ద్విజుండు పట్టికిన్.

వ. అంత ధాత్రీజనసహాయయై యా యార్యాంబ శుక్లపక్షశశాంకు
పగిది దినదినాభ్యుదయంబు నొంద నబ్బాలకు రాత్రిందివము కన్ను
మూయక యోముచుండు. 101.

ఉ. బాలకుముద్దునెమ్మొగముపైఁ బడుముంగురు లల్ల నొత్తి కెం
గేల స్పృశించి మెత్తి గిలిగింతలు వాఱఁగఁ జేపువచ్చు చ
న్బాలను ద్రావఁ బెట్టి వదనంబున లాలలుఁ బాలుఁ గాఱఁగా
సోలిన వాతెఱన్ దుడిచి జోటిక నిద్దురవుచ్చు సెజ్జపై. 102.

చ. జలకము లార్చి, మేనితడిఁ జల్వమడుంగున మెత్త నొత్తి, వీ
నుల తడి వోవఁ జేలకొన నోవక త్రిప్పుచుఁ, జ న్నొసంగి, క
జ్జలమును గంటఁ దీర్చిఁ నునుఁజాదున బొట్టు నొసంటఁ బెట్టి, వొ
త్తుల నిడి, జోల వాడుచు వధూమణి లాలనసేయు బాలకున్. 103.

సీ. కరము లాకసముపంకకుఁ జిమ్ము నూరక
వాలబుగ్గలు గుంటపడఁగ నవ్వుఁ
గమికిళ్లు పట్టి ముఖమ్మందుఁ జొరనిచ్చి
యొక ప్రక్క కొదిగి పన్నుండి కేరుఁ
జరణాంగుళముల హస్తముల నల్లనఁ బట్టి
నోటఁ జొన్పింప నారాట మొందు
నవ్యక్తమధురమై యమర నుంగుంగ యం
చనితరాపేక్షంబ యాడుచుండు.

గీ. పలుకు డెది యైన వినఁ జూచుఁ, బలుకరించు
వారి గుఱుతింప నేర్చు, ఛీత్కారములకుఁ
గులుకుమై నవ్వు, మఱి యెత్తుకొనుఁ డటంచుఁ
జేతు లదించు వేడ్క నాచిన్నికందు. 104.

గీ. బొజ్జ నును సెజ్జ మోవంగ బోరగిల్లి
పండి శిర మెత్తి కరములు రెండు మోపి
చిఱునగవు లాల లొలుకువా తెఱ నటింప
నాడుకొను బాలుఁడు కిశోరహరివిధాన. 105.

చ. క్రమముగఁ గూరుచుండుట కరంబుల మేదిని నాని జానుచం
క్రమణము నేర్చియుంట నెటు గన్నఁ గనంబడుచుండి లేచి వి
ద్దెము లొనరించుచుఁ జిలుకతీయున 'అమ్మ' యటంచు 'అత్త' యం
చమృతరసంబు చిల్కుఁ జెవులందు ద్విజార్భకుఁ డెల్లవారికిన్. 106.

సీ. అమ్మ యం చలఁత మాటాడు 'నో' మ్మనిపల్కి
యోపాసనము సల్పుచుండె ననుచు
'అత్తత్త' యనఁ దత్త్వమసి మహావాక్యార్థ
ముల్లమందు స్మరించుచుండె ననుచు.

'అన్నన్న' యని పల్కనప్పుడు నేతినే
త్యుపలబ్ధి నూహించుచుండె ననుచు
నలరి 'హు' మ్మనిన బ్రహ్మహ మ్మనుచుఁదాన
యుపరతాత్ముం డగుచుండెననుచు.

గీ. సాంజలిఁ డౌచు 'దాసోహ' మంచు ముద్దు
డై యనంగఁ దా "సోహ" మ్మటంచు హంస
జప మొనర్చెనె యంచు దచ్ఛైశవాస్ఫు
టోక్తులం దర్థ మూహించుచుండుఁ దండ్రి. 107.

సీ. ఏకాబ్దవయసునందే నేర్చె వర్ణస
మామ్నాయ మఖిలంబు నాత్మభాష
నబ్దద్వయవయస్కుఁ డయి లిఖితాక్షర
ప్రజ్ఞుఁడై వ్రాసి చెప్పంగ నేర్చె
హాయనత్రితయవయస్కుఁడై కావ్యపు
రాణముల్ విని తదర్థము లెఱింగె
గురుల కక్లేశ మాసరణి నేర్చిన విద్య
సహపాఠులకు బోధ సలుపఁజాలె

గీ. ననుదితరజస్తమస్కుఁ డయ్యును రజోఽభి
ఖేలనమునాఁడె మెఱిఁగె నిఖిలము లిపులు
మధురభాషణములఁ బ్రజామానసములు
వెన్న నొనరింపఁజాలె నాచిన్నిబిడ్డ. 108.

వ. అంత. 109.

క. హుతవహుతేజం బాజ్యా
హుతుల వెలుఁగుపగిది నాశిశూత్తము తను వం
చితచౌలసంస్క్రియాసం
స్కృతమై వితతద్యుతుల వహించి రహించెన్. 110.

క. అతఁ డుపపాదననిరపే
క్షితమతి యయ్యును జదివె నిఖిలకావ్యము లా
హృతిపూర్వక మాగమసం
హతిఁ గర్కశతర్కనయరహస్యము లెఱిఁగెన్. 111.

గీ. వాదజల్పవితండాకథాదిదక్షు
లై వచశ్శక్తి వాదిచయంబుఁ గూల్చు
బుధులునేని సురేజ్యునైఫణి మెలంగు
శంకరునిముందు మాఱాడ జంకుచుండ్రి. 112.

క. ఓడింపుద మని పంతా
బాడి బుధులు వక్రవచనులై మతముల మా
టాడిన నోడక వారలఁ
బ్రోడవలెన్ గెలుచు శంకరుఁడు శిశువయ్యున్. 113.

క. ఫణిరాట్కథావధీరణ
చణ మగు నముకక్రమోక్తిసరణి విని సుధీ
మణు లగువాదులు నుత్తర
మణువంతయు నీరు తప్పు లగు నను భీతిన్. 114.

గీ. ప్రథితుఁడై శేముషీమదగ్రణియు నైన
యతఁడు ఖండింపనట్టి దుర్మతము లేదు
ఖండితాత్మమతంబు నొక్కండుగాని
నిలుపుకొన్నది లేదు యత్నించియేని. 115.

క. రవివర్ణించితుఁ డమ్మా
ణవకునిచే నిజకులము దనర్చె సవతు లే
కవనిన్ సుతవద్గణమునఁ
బ్రవరుఁడ నైనాఁడ నని శివగురుఁడు దనిసెన్. 116.

శివగురునిర్యాణము.

క. సితాబ్దత్రియు సుతు నుప
నీతు సలుప మోదవిపరిణీతుఁ డయి జరా
న్వీతుఁ డగు శివగురుఁడు విధి
నీతాయుష్కృత యమోపనీతుం డయ్యెన్. 117.

చ. తనయుఁ డొకాన్ప దుర్లభము, తద్విభవాదులు చూచుటం దకం
తెను గడుదుర్లభంబు ధరణీసురుఁ డాతఁ డపారమౌ తపం
బును బచరించి యెట్టెటులొ పుత్త్రుని గాంచెను గాని యక్కటా
తన తనయోదయంబు తనుఁదాఁ గనుభాగ్యము గాంచఁ డయ్యెడున్.

గీ. మూర్ధమున వేయిపిడుగులు మొత్తినటుల
తనువు బగ్గని మండిపోయినవిధాన
మానసము ఛిన్నభిన్న మౌ మాడ్కి నొట
నవశయై వ్రాలె నార్యాంబ యవనియందు. 119.

చ. అటువలె మూర్ఛనొంది ఘటికాంతరమందు ససంజ్ఞయై యుర
స్తటమును మోదికొంచుఁ గనుఁదమ్ముల నశ్రులు వెల్లివాఱ ను
త్కటతమచింత మున్గి గళగద్గదికధ్వని పెచ్చుమీఱఁ జెం
గటిజను లేల? రాలుఁ గరఁగన్ విలపించెఁ బతిన్ స్మరించుచున్.

ఉ. ఏమని నన్ను డించి హృదయేశ్వర! పోయితి ధర్మ మర్థమున్
గామముఁ బొందఁ జన్నె ననుఁ గాదని, పెండిలినాఁడు జాతవే
దోముఖదేవసాక్షికవిధుల్ సకలంబును విస్మరింప నౌ
నే మితి లేని నీవిరహ మెట్లు సహింతు ననాథనై కటా! 121.

ఉ. దీపిక యాఱఁ బాడటిన దివ్యగృహంబువలెన్ భవచ్ఛరీ
రాపగమంబుచే నశుభమై బరువై చెడి డిందకున్న యీ

పాపపు దేహ మగ్నిశిఖపా లొనరించియు వెంట వచ్చి నా
థా! పరమందు నిన్గలియుదాన నటంచు విలాపమొందఁగా. 122.

శంకరుఁడు తల్లి నూరార్చుట.

క. అంతట హితు లాయమ కుప
శాంతివచనములను జెప్పఁ జల్లాఱద త
త్సంతాప, మట్టు లనుగతి
కెంతయు జింతించు తల్లి కిటు శిశు వనియెన్. 123.

ఉ. అమ్మరొ! యిట్లు లేడ్వఁ దగునా? వగవన్ విని తండ్రివచ్చునే
యిమ్మహి నెల్లకాల మొవఁడేని మనంగలవాఁడె? దేహి క
ర్మమ్మునఁ బుట్టు వృద్ధి గనుఁ గ్రమ్మగును, నైజగుణంబు వాప దై
వమ్మున కే నసాధ్య మిటు వందురి చేయున దేమి చెప్పుమా 124.

ఉ. ఈ వెటనుండి వచ్చితివొ యెచ్చటికేఁగుదొ యెన్నిజాములం
దీవిభుఁ జెందియుంటొ గణియించుకొనంగ సమస్తమోహముల్
ద్రోవక యే తొలంగుఁ గనుదోయి మొగుడ్చ జగంబె సున్న త
ల్లీ! విలపించు టేటికిఁ జలింపకుమీ భవితవ్య మెంచుచున్. 125.

క. ఏవాఁడు మడిసె నని వా
పోవుదువో యట్టివాఁడు పుట్టఁడు చావం
డీవివిధవికృతులును దను
భావము లని మది నెఱింగి పడయుము శాంతిన్. 126.

శా. మాయానాటక మీజగంబు తనువుం బాత్రమ్ముగాఁ జేసి య
స్మేయుం డొపురుషుండు సౌఖ్యము మహార్తిన్ జెందిన ట్లాడి, యా
యాయుష్కాలము చెల్లఁగా యవనికాభ్యంతర్గతుండై పునః
కాయప్రాప్తి నటించుఁ జూ భరతవాక్యం బుండ దేనాఁటికిన్. 127.

క. ఎవరికి వారే యనియెడు
వివేకిజనసూక్తి తల్లి వినవొకో పతివెం
ట వెడల మంటం బడిన ని
రువురుం గలియుదురొ కలియరో కర్మగతిన్. 128.

మ. తనువుం దాల్పంగజాల దుస్సహము వైధవ్య మ్మటంచున్ దొలం
గ న దెల్లన్ జెడునే "యవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ"యం
చనరే విజ్ఞులు; నేడు గల్గువ్యథ రేపైనన్ మ తెందైన నీ
కనుభోక్తవ్యము నూనె మానుకొనుమమ్మా ఘోరమియ్యత్నమున్.

క. అని నాల్గేడులబాలుఁడు
జననికి దుఃఖోపశాంతి సలుపఁగ విని లో
చనములు మనములు నీరయి
జన మాతనియెఱుక కార్తి సంతస మొనసెన్. 130.

గీ. సాధ్వి యార్యాంబ పతివెంట సహగమనము
సేయఁ దలఁచియుఁ బుత్రుఁ బోషించుకొఱకు
బాంధవజ్ఞాతిపుత్రుల ప్రార్థనమునఁ
బ్రాణములు దాల్పవలసె దుర్భరములైన. 131.

క. ఆతటి నాబాలుఁ డనుప
నీతుఁ డగుటఁ దల్లియాజ్ఞ నెఱపిరి శ్రద్ధో
పేతు లయి యౌర్ధ్వదైహిక
మాతనిజనకునకు నాహితాగ్నికి జ్ఞాతుల్. 132.

శంకరుని యుపనయనము.

ఉ. అంబుజమిత్రతేజని నిజాత్మజు నోముచుఁ జిత్తమందె దుః
ఖ బును మిగిగి వత్సర మొకం డెటొ పుచ్చి కుమారు పంచమా

బ్దాబు వయ స్సెటింగి హితబాంధవుల్ బిలిపించి మంచి ల
గ్నంబునం దల్లి దా వడుం గొనర్చెం గనుంగవ నశ్రు లూర్చుచున్.

గీ. బలిని దలద్రొక్కి రోదసీతలము గ్రమ్మ
వెడలువామనవటుమూర్తి విష్ణుం డనంగ
సాంగ మగుబ్రహ్మవర్చసం బనంగ బంచ
వత్సరవయస్కుం డానూత్నవటువు మెఱసె. 134.

శంకరుని వేదాదివిద్యాభ్యాసము.

క. ఉపనయనశబ్ద మర్థస
ముపేత మగునట్లు గురునియొద్దకుం జని య
చ్చపుభక్తిం బఠించెను ద
న్నిపుణుండు సాంగముగ నాల్గునిగమము లోలిన్. 135.

ఉ. ఇంచుక గాని లేఁడ యెపు డింతటివిద్య గ్రహించె నద్భుతం
బంచుం బ్రజల్ నుతింప, వటు లాదఱు తోడం బఠింపంజాల కిం
చించుక వెన్కవెన్కం బడ నెవ్వఁడు వీనికి విద్యం జెప్పలేం
డంచు గురుండు జంక నతం డధ్యయనం బొనరించెం జెచ్చెరన్.

ఆ. ద్విత్రిమాసములయధీతి నాయావిద్య
గురుసమత్వ మొందె గురువుపగిది
నతఁడ వేదముల సహాధ్యాయులకు లెస్స
చెప్పంజాలె నతివిచిత్ర మెన్న. 137

మ శ్రుతులన్ బ్రహ్మ, తదంగబోధమున గార్గ్యుం, డర్థతాత్పర్యసం
గతమా తత్కథలన్ బృహస్పతి, తదుక్తబ్రహ్మకర్మాంతర
జ్ఞతన్ జైమిని, తద్వచఃకలితవిజ్ఞానంబునన్ వ్యాసమౌ
ని, తదీయాభినవాకృతిన్ వెలయువాణీపూర్ణుం డాతం డహో! 138.

మ. ఎనసెన్ గాపిలతంత్ర, మెల్లమఱుఁగుల్ వీక్షించె నాన్వీక్షికిన్
గని భాట్టాగమఘట్టతత్త్వ, మడుఁగంటన్ గ్రోలెఁ బాతంజలం
బనిన్ దత్తదుపాత్తసౌఖ్య మఖిలం బద్వైతవిద్యాసుఖం
బునవేడిం దేఁ బ్రహ్మప్రయోజనము పెంపున్ దీర్ఘమందుం బలెన్ 139

ఉ. మాధుకరాన్నభుక్తి గురుమందిరవాసము వేదపాఠమున్
బోధము దేశికాంఘ్రియుగపూజనమున్ సహపాఠిదుర్లభా
గాధమనీషయున్ మెఱయ గాంగతరంగఘుమంఘుమారవో
ద్బధక వాఙ్ముఖంబుల నతండు హరించెఁ బ్రజాంతరంగముల్. 140

సీ. స్నానం బొనర్చి యుషఃకాలముననె మా
ర్తాండున కర్ఘ్యప్రదానమిచ్చి
యష్టోత్తరము శతం బావృత్తి గాయత్రి
యంచిత మనువు జపించి భక్తిఁ
బంచాక్షరం బుపాసించి తోడన యగ్ని
కార్యంబు విధిపూర్వకముగ నెఱపి
సబ్రహ్మచారు లాశ్చర్య మొందఁగ వేద
వికృతుల నవధానవిధుల మెఱసి
గీ. పరమసాధ్వులు వాత్సల్యభరితచిత్త
లగుచుఁ బెట్టెడు మాధుకరాన్న మెలమి
నారగించుచు బ్రహ్మచర్యవ్రతంబు
గడుపుకొనుచుండు నిష్కలంకముగ నతఁడు. 141

మ. జలపాత్రిమ్మను జోలెఁ గైకొనుచు సాక్షాద్భూత వేదంబు నా
బలు తేజంబున మించి శంకరుఁడు తద్బాడబ్య గేహాంగణ
స్థలి మధ్యాహ్నము సేరుచున్ 'భవతి భిక్షాం దేహి' యన్నంత సా
ధ్వులు వడ్డింతురు షడ్రసాన్నములు పుత్రుం జూచిన ట్లాదటన్.

గీ. మాధుకరమును బెట్టు సమ్మాన్య యుటంచు
వేరిగృహాసీమ కరుగు నవ్వార లెల్ల
ధన్యు లయినట్లు భావించి తడయు కింటఁ
గలిగి నంతటిలోఁ బెట్టి కడపుచుండ్రు. 143.

దరిద్రబ్రాహ్మణి కథ.

క. ఒకనాఁడు మాధుకరమున
కొకగర్భదరిద్రవసతి కొయ్యనఁ జని య
య్యకలంకచరిత్రుం డా
యెకఁ గని "భిక్షాం ప్రదేహి" యని పలుకుటయున్. 144.

క. కనుమాపు చినుఁగుఁ బయ్యెద
కొన కుతికంటున ఘటించుకొని యాగృహమే
ధిని దలు పోరగ దీసా
ననమాత్రము తోఁప నిలిచి నలఁకువ ననియెన్. 145.

గీ. తొలుత నాతండ్రి యీపాడునిలయమునకు
నేల వచ్చితి వీదినం బెటకుఁ జనిన
నచట నిటు లగునేమొకో యనుచు వగతు
నెట్టిదుశ్శకునంబున నిలు వెడలితొ. 146.

చ. కటకట యిట్టియెండ నడుగాళులు పొక్కఁ, జెమర్పు మోము, మై
పటిమ మడంగ, మాధుకరభైక్షముకై యరుదెంతు బిడ్డ! ని
న్నెటు చను మందుఁ బొమ్మనక యే మొనరింపఁగలన్ దరిద్రతా
ర్భటి నడపీనుఁగై మనునభాగ్యను నీముఖ మెట్లు చూచెదన్.

ఉ. గ్రామము వాడవాడల నిరంతరమున్ దిరిపంబు నెత్తి నా
స్వామి నమన్ దనూజులను సాకుచు నుండును దెచ్చుదానిలో

సాము మగండు, సాము నిజసంతతియున్, భుజియింపఁ బెట్టి యా
యా మెతుకుల్ భుజించి కొనప్రాణముతో మనుచుందు నందనా!

ఉ. ఇంకలిస్త్రీలు మాధుకరవృత్తిని వచ్చెడివారి మందిరా
లిందమునందు గోమయవిలేపనపూర్వకరంగవల్లికా
సుందరసీమ నిల్పి పరిశోధితపాత్రల మహాప్రసన్న మా
నందముతోడఁ బెట్టుదు రనన్ వినుచున్ గనుచుందు నిత్యమున్.

క. ఐనన్ నా కిటువంటిమ
హానందము నోఁచుభాగ్య మబ్బదుగద నా
దీనస్థితి కంతము లే
దేనే భిక్షించి తినఁదు నేమి యొసఁగుదున్. 150.

గీ. దాని కేమి నీవంటియుత్తముఁ డతిథి
తోఁపనతుఁ డైనఁ బనుపు టయుక్త మనుచు
నిలు నలుంగడ నరసి యామలకఫల మొ
కండు దొరుకంగ నది యిడఁగాఁ దలంచి. 151.

క. తలు పోరఁజేసి మొగమును
వలకేలును మాత్ర కానఁబడ మఱుఁగున న
న్నెలఁత నిలిచి యాయుసిరిక
ఫల మొసఁగుచు వటున కిటుల పలికెన్ గలఁకన్. 152.

గీ. నిజము వల్కెద నీవు నాత్మజునివంటి
వాఁడ వౌట నాయన్న యీప్రక్క నిలువ
నకట! శాల్దిగినట్టిబట్టకును నోచు
కొనమి నని పల్కి కన్నీట మునిఁగి వగవ. 153.

క. కని నవనీతముకైవడి
మనసు కరఁగిపోయి ప్రీతిమమాడ్కి నిలిచి యా

యనఘుం డాయమదారి
ద్వ్యసురాస మొనర్చ నెంచి దయ నిటు వలుకున్. 154.

శా. అమ్మా! చింతఁ దొఱంగు తావకదరిద్రావస్థ యీనాఁడ భ
స్మమ్మౌ నమ్మము నీవు నీపతిసుతుల్ సంతృప్తిగా సర్వసౌ
ఖ్యమ్ముల్ శాశ్వతభక్తి నొందఁగలవా రయ్యాదిరాశ్రీకటా
క్షమ్మున్ గాంతురటంచు లక్ష్మిఁ బొగడంగాఁ బూనె శ్రుత్యుక్తులన్.

సీ. హైరణ్యవర్ణయు హరిణియు సౌవర్ణ
రాజతస్రజయు హిరణ్మయయును
బురుపగోశ్వహిరణ్యపరిపూర్తిసంధాత్రి
యశ్వగజస్యందనాభిరామ
సాకార హాటకప్రాకార సత్కృత
యార్ద్రయు జ్వలియించునట్టిదియును
దృప్తయుఁ దర్పయుతియుఁ బద్మసంస్థిత
పద్మవర్ణయు శుభాస్పదవిలోక
గీ. చంద్రియు యశఃప్రభాస యుజ్జ్వలనశీల
దేవజుష్ట యుదార పద్మినియు ననఁగ
నాదిమధ్యాంతరహిత యైనట్టియాది
లక్ష్మికి నమస్కరింతు నలక్ష్మిఁ బాప. 156.

గీ. తల్లి యాదిత్యవర్ణ నీతపమునకు వ
నస్పతియు బిల్వవృక్ష మన్ప్రథ జనించెఁ
దత్ఫలంబు లడంచు నీతపముకతన
నాంతరం బగుమాయ, బాహ్యం బలక్ష్మి. 157

క. ఓముత దేవసఖుఁడు చిం
తామణితోఁ గీర్తితోడ న న్నొనయుచుఁ ద
ల్లీ! మను జనియించితి నీ
భూమిని; నాకొసఁగు కీర్తి బాలుపు సమృద్ధిన్. 158.

గీ. అంబరో! క్షుత్పిపాసావిలాత్మ జ్యేష్ఠ
యగునలక్ష్మిని మాయింతు నమ్మ నేన
యీవు నసమృద్ధిని నభూతి నెల్లదాని
నస్మదీయాలయమునుండి యపసరింపు. 169.

క. భూరూప మొంది గంధ
ద్వార, దురాధర్ష, భూతతతి కీశ్వరి, ని
త్యారోపితపుష్టి, కరీ
షారంజిత యైనలక్ష్మి నాహ్వానింతున్. 160.

క. చేతమునకుఁ గామము నా
కూతియు, వాకునకు సత్యగుంఫమ్ముఁ బశు
వ్రాతాన్నములకు రూపుం
బ్రీతి నొసఁగునీవు నను సమీపింపఁగదే. 161.

క. శ్రీపుత్రక! కర్దమ! కృపఁ
జేపట్టుము నన్ను, నావసించు గృహమునన్
గాఁ పుంపు పద్మమాలిని
నీపడసినమాతఁ బద్మినిన్ శ్రీదేవిన్. 162.

గీ. ఎలమి నర్ద్దేవతలు సృజియింత్రు నాకు
కార్యజాతమ్ము నెపుడు స్నిగ్ధమ్ము గాఁగ
నోచిక్లీత! నాయింట నుండునట్లు
చేయఁగదవన్న మీతల్లి శ్రీపురంధ్రి. 163.

గీ. పుష్టియును. బుష్కరిణి, యష్టి, యష్టికరయు
నార్ద్రయు, హిరణ్మయయుఁ బ్రహేమమాల్య
చంద్రయును సూర్యయు సువర్ణసరసపింగ
లాంగి యగులక్ష్మి జాతవేదా యొసంగు. 164.

క. ఏదేవికరుణ బహుధన
గో దాసీ తురగ పురుషకోటిం గనెదనో
యాదేవి ననపగామిని
శ్రీదేవిని జాతవేద చెచ్చెర యిమ్మా. 165.

క. అని శ్రీసూక్తవిధానం
బున సంస్తుతిసేసి చిత్తమున శ్రీవిద్యా
మనువు జపియించి స్తోత్రం
బొనరించెను సరసపద సముజ్జ్వల ఫణితిన్. 166.

సీ. క్షీరార్ణవాంతర శ్వేతాంతరీపమ్ము
నందు సంఫుల్లపద్మాకరమునఁ
గాంచనాంబుజకర్ణికాసింహాసికా
సీనయై వృతసురీసేవఁ గొనుచు
సవ్యాపసవ్యపార్శ్వములఁ గుంభియుగంబు
స్వర్ణకుంభాంబుల స్నాన మార్ప
శయయుగంబునఁ గుశేశయయుగ్మ మలర ర
త్నాభరణద్యుతు లలము దెసలఁ
గీ. బార్వతియు భారతియు నిరుప్రక్కల నిలిచి
నిటలతటమున నలకముల్ నటనసేయఁ
జామరలు వీచుచుండ నాస్థానిఁ దీర్చు
త్రిభువనైకమహారాజ్ఞి శ్రీ భజింతు. 167.

మ. నిధినిక్షేపము లెల్లఁ జుట్టి కొలువన్ హేమాబ్జసింహాసనం
బధిరోహించి సుపర్వ మౌళిమణి రుగ్వ్యాలీఢ పాదాబ్జయై
విధ వినిష్ణ్వాదుల లోకపాలనకళావిఖ్యాతులన్ జేయునం
బుధికన్యామణి నాదిశక్తిని గరంబుల్ మోడ్చి సేవించెదన్. 168.

క. కామగవీ కల్పక చిం
తామణులకుఁ దోడఁ బుట్టి ధనరూపిణివై
తామరసాక్షుని వక్షో
ధామమున వసించులక్ష్మి ధ్యాన మొనర్తున్. 169.

చ. అని యొనరించుశంకరు రమాభినుతుల్ విని పేదరాలు 'యా
చనికులు కాంక్షితార్థము లొసంగెడువారలవృద్ధిఁ గోరి దీ
వన లొనరింతు రే గాదె' యని స్వాంతమునన్ దలపోయుచుండ నిం
టను శతకోటిశంపలబెడంగునఁ దేజ మొకండు దోఁచినన్. 170.

ఉ. మేను చలింపఁ జూపు మిఱుమిట్లు గొనన్ హృదయంబుజల్లనం
గా నఖిలేంద్రియంబు లడఁగన్ నిరుపేద నెలంత మూర్ఛవో
నా నియతాత్ముఁ డామెఱుఁగునందు రమాకృతిఁ గాంచెనేమొ త
న్మానస మంటఁ దాఁకెడు విధంబున సన్నుతి సేసె నీ క్రియన్. 171.

గీ. అమ్మ! కడగంటనేని నీ వరయు దేని
జడుఁడె గానిమ్ము పార్థివేశ్వరుఁడ యగును
ఒత్తిగిలి నీ వుపేక్షించి యున్నఁ జక్రి
వర్తియేని యాచకచక్రవర్తి యగును. 172.

ఉ. అంబుధిరాజునంతటి మహాత్ముని గర్భమునందుఁ బుట్టి పీ
తాంబరుచెట్ట వట్టి యమృతాంశులసోదరివై జగత్ప్రభు
త్వంబునఁ బట్టభద్రవయి తల్లి రొ యీదృశు లైన పేదవా
రిం బరికించి లోఁ గనికరింపవు న్యాయమె నీకు నిందిరా! 173.

సీ. అన్యాయకృత్య సమాచరణ చణాత్ము
లైనవారల గృహాభ్యంతరముల
నక్షకేళీవిహారాయత్త చిత్తదు
ర్వ్యసన సక్తుల పదన్యాసములను

నభ్వగస్వాపతేయ ప్రాణ హారక
చోరనాయకులమంజూషలందు
వితథనాకర్షణవిక్రీతనిజతనూ
పుంశ్చలీదంతసంపుటికలందు
గీ. వాస ముందువు గాని పాప మ్మెఱుంగని
సత్యశౌచదయార్జవశమదమాది
సుగుణనిలయుల నిలయముల్ చేర వి దేమి
పాప మోతల్లి! యీపక్షపాత మేల? 174.

మ. సతతంబున్ భవదీయపాదసరసీజధ్యానమున్ జేయుచున్
బతి భిక్షించి గడించువస్తువుల సంతానమ్ముఁ బోషించుచున్
వెతలం జేఁకయి పట్టుఁ డన్నమున కేనిన్ నోచుకోనట్టి యీ
సతి నీక్షించి కరంగ కున్నదె భవత్స్వాంతంబు పద్మాలయా! 175.

చ. అసువులు కంట నిల్పి కుతికంటునఁ జెలకొనన్ ధరించియున్
వసతికి వచ్చుయాచకుఁ 'జనంగదె' యంచు వచింప నాల్కరా
కుసిరికకాయ నిచ్చె నిది యొక్కటి భూరిగుణంబుగాఁ గృపా
ప్రసరణ మూన్చి యీయమదురంతదరిద్రత మాన్పుమిందిరా! 176

క. అని మనసు నాటఁ బల్కుట
యును నభమున నుండి తద్ద్విజోత్తమభవనాం
గనసీమఁ గన రమాకృపఁ
గనకామలకములు ధారగాఁ గురియుటయున్. 177.

ఉ. చేతన నొందియున్ విగతచేష్టితయై సతి స్వప్నమో నిజం
బో తెలియంగరానిస్థితి నొక్కనిమేషముకాల ముండి య
త్యాతతభక్తి సిగ్గు నెడఁదట్టి వటూత్తము పాదపద్మముల్
చేతుల ముట్టి కన్నుఁగవ చేరిచి ముద్దిడి పల్కె నీక్రియన్. 178.

ఉ. నీఋణ మెట్లు దీర్చుకొననేర్తు? మకారణ మేఁగుదెంచి బం
గార మొనర్చితయ్య మదగారమసాధ్యమహాదరిద్రతా
ధారమ, యింద్రజాలమువిధంబునఁ దోఁచును భాగ్యవార్ధితా
పారదురంతమత్కలుషభంజనమున్ గడగంటఁ జేయుటన్. 179.

క. ఎంతటిపాప మొనర్చక
యింతటి పేదఱిమిఁ గందునే నే నిఁకకా
సంతయుసిరికఫలంబున
కింతటిసిరి యెట్లు? నీమహిమఁ గా కనఘా!

ఆ. దానఫలము వృద్ధిహానుల నొందుఁ బా
త్రానుగుణముగా నట దుప్రాజ్ఞు
లిట్టిపాత్ర మొదవునే యెంతపుణ్యుల
కైన? నాకె హేల నబ్బెఁగాక.

ఉ. ద్వారక కెట్టటో యరిగి తాపము నొందుచు ద్వారమందు దౌ
వారిక రుద్ధుఁడై యెటులొ వార్తను బంపు కుచేలుఁ దెచ్చి ధా
నారుచిఁ జొక్కి కాదొకొ ధనం బిడె కృష్ణుఁడు మున్ను; నీవు దాఁ
జేరఁగ వచ్చి లచ్చి దయసేసితి నేఁ డిదె దీనురాలికిన్. 182.

గీ. అనుచు నాయమ వినుతించునవసరమున
నాయవారంబునకు నేఁగి యలసి వచ్చి
నట్టియాగృహమేధి యుదంత మెల్ల
విని తనంఘ్రులఁ బడి మ్రొక్కి వినుతిసేసె. 183.

చ. అది గని శంకరుండు దరహాసము మోమున నంకురింప భూ
త్రిదశునకుం దదీయసుదతీమణికిం జరణాభివాదముల్
హృదయము పల్లవింప నొనరించి వచించెను 'మీయదృష్టసం
పద పరిపాక మొంది సిరివచ్చెను నేను నిమిత్తమాత్రుఁడన్. 184.

ఉ. నన్నును మించువా రనుదినంబును మీయిలు సేర రారొ? మీ
కన్న దరిద్రులిండ్లకు నిరంతర మేనును బోనొ? కాని యీ

యున్నతి మున్నిమీకొదవ, దొఱఁకని కేను నొసంగనైతి; ము
దెన్నఁడొ మీ రొసంగినదియే ఫలియించెను గాల మబ్బుటన్.

క. ధర్మార్థకామముల నతి
నిర్మలవిఖ్యాతిప్రసిద్ధినిం గనుచు మహా
శర్మమున వరలుఁ డిక, నని
యర్మిలి గురుపసతి కరిగె నందఱు ప్రాగడన్. 186.

క. ఆయుసిరిం ఫలముల నపు
డాయక పుట్టికల గాదియల ధాన్యమ్ముల్
పోయుగతిఁ బెట్టియలఁ బోఁ
బోయుచు నానందసింధువున నోలాడున్. 187.

సీ. కాంక్షించు గృహమేధి కర్ణకుండలకంక
ణాంగుళీయకధారణార్థ మెదను
గోరుచుందురు పుత్రికులు కటకాంగద
కర్ణికాకాంచ్యాదికము ధరింప
నభిలషింతురు తనయులు హేమనూపుర
కేయూరహారకింకిణులు దాల్ప
బేరమ్ము సేయు సొన్నారిఁ బిల్చి పడంతి
సౌవర్ణపాత్రాది సంతరింప
గీ. నవుర! శంకరకరుణాకటాక్షసముప
లబ్ధకాంచననిత్యకల్యాణపూర్ణ
మందిరావాససముదితానందపరవ
శాంతరంగమ్ముతోడ నహర్నిశంబు. 188.

ఆ. మెఱపు మెఱసినట్టికరణి నవ్వార్త వ్యా
పింప నగ్రహారవీథులందు

జనులు గుములుగట్టి చనుదెంచి శంకరుఁ
గాంచి మ్రొక్కి యభినుతించి రపుడు. 189.

మ. 'దివి మందారమహీజమట్లు భువి ధాత్రీదేవ దేవప్రజో
త్సవముల్ గూర్చు నుదారహారిగుణవిస్తారుండు శ్రీశంకరుం
డపురా' యంచుఁ బ్రజల్ నుతింప గురునభ్యాశంబునం దభ్యసిం
చె విశేషించి సమస్త శాస్త్రముల నార్జించెఁ యశోరాసులన్. 190

ఆశ్వాసాంతము.

శా. అర్ణోరాశిశయానసంధృతమనుష్యాకార! దివ్యద్యశః
పూర్ణస్వర్గసుధారసాతలదిగాభోగా! దిశేభాహితా
టర్ణారుఁతుదభగ్న శాంకరధనుష్టాంకారపాణౌకృతో
ద్దీర్ణశ్రీవిజయేందిరాజనకపుత్రీపత్కశత్రిత్రయా! 191.

క. నిత్యానందాద్భుతపం
విత్యాకృతి! నిత్యసుకృతి వేంకటరాయా
మాత్యవినుత్య! సుమిత్రా
పత్యార్ణ్యాణకృత్యముదితభావ! విభావా. 192.

మాలిని. కుశికతనయయాగాకుల్యహేత్యామిషాశి
శ్రిశిసుకరణనానాస్త్రప్రయోక్త్రిర్భకాత్మా!
విశద పదపరాగ స్పృష్టినష్టాశ్మభావా
విశ దపదప రాగస్పృష్టితుష్టర్షికాంతా! 193

ఇది శ్రీ గురుకరుణాసమాసాదితకవిత్వ 'కవితాభూషణ, విద్వత్కవిశేఖర'
వెంపరాల సూర్యనారాయణనామధేయప్రణీతంబగు
శంకరవిజయంబునఁ
బ్రథమాశ్వాసము.

శ్రీగురుమూర్తయే నమః

శ్రీ శంకరవిజయము.

ద్వితీయాశ్వాసము.

క. శ్రీధర వేంకటరాయ
శ్రీద రచిత సాదరార్ఘ్య ధృత మితిరహితా
మోదరసోదయ! మేదుర
సోదర సౌభ్రాత్ర పాత్ర సుచరిత! రామా!

వ. అవధరింపుము.

శంకరుని యాకారవర్ణనము.

క. కమనీయరూపవిలసిత
రమణులు తగుపతి వరించి రంజిలుక్రియ ను
త్తమ మగుసకలకల లను
త్తము శంకరుఁ జేరి భాగ్యదశ నింపారెన్. 1.

క. సరహస్యసకలవిద్యా
భరభరితుండై యశఃప్రభలఁ బ్రబలినశం
కరు దేహం బుపమానో
త్కరకథయును సైఁపనట్టికాంతి వహించెన్. 2.

మ. జల మిందూపలమున్ స్రవించునెడఁ దచ్చంద్రాశ్మమం దబ్జమే
మొలవం గల్గినఁ, దత్సరోజమున సంభూతంబయేనిన్ గొలం
కలశాసారమునన్ గుశేశయము మేలై పుట్టెనే, నద్ది దాఁ
దులన్ శంకరభవ్యపాదమున కొందున్గాక యెట్టెట్లులో. 3.

చ. అమలినశంకరాంఘ్రి లలితాబ్జసమం బనుచున్ దదాస్యబిం
బము ద్విజరాజమండలనిభం బని యందురు గాక, ప్రేమ్యభా
వ మెనసి పద్మపాదుఁ డలపద్మముఁ గాల నడంగఁద్రొక్కె, వ
క్త్రము ద్విజరాజమండలనిరంతరసేవ్యము నయ్యె నారయన్. 4.

ఉ. 'అంచితులైనయోగు లనయం బతిసర్మల మాచరించుకో
నెంచి మనోంబుజమ్ముల వహింతురు శంకరుపాదపద్మముల్
నించుఁ దదాస్య మిందిరముఖనిర్జరదుర్లభ మాసుధారసం'
బంచనఁ దమ్మి కంఘ్రి, శశి కాస్యము, మిన్నలు గావె యెన్నఁగన్.

మ. అమలజ్ఞానకళాఫలేగ్రహి, ఘనవ్యామోహముష్టింధయం,
బమితర్థివ్యపనోదరంభరి, యఘప్రాగ్భార కూలంకషం
బు, మదాద్యద్మర, మిద్ధతాప హరణంబుల్ శాంకరం బాపదా
బ్జము కారుణ్యరసామితంపచముగా భద్రంకరం బయ్యెడున్. 6.

మ. చరణాఘాతభిదా వ్రణోత్క్షణిత భాస్వత్పూషదోష్కాంశు చ
త్వరపాదాహతి మారిత ప్రణత బృందద్రోహి విఖ్యాతిసు
స్థిరుఁడుం డౌపరమాత్ముఁడే యగుటఁ దద్దివ్యాంఘ్రిమాహాత్మ్యని
ర్భరు లెవ్వారి నొసర్పు నెప్పుడు గతాపస్మారరోగార్తులన్. 7.

మ. ననసిత్యాభ్యుదయంబునన్ వెలుఁగుచున్ సారస్వతోజ్జృంభ హే
తువునై ప్రోషితతారుఁడై తిమిరముల్ తూలంగ, స్వాలోకముల్
దవులన్ జిమ్మెడు తత్కళాధరుని పాదకాంతి మాధుర్యమై
భవయుక్తంబగుటన్ హరించు ఘనతాపం బూన్పుఁ బ్రహ్లాదమున్.

గీ. నతియొ ముక్తిద మతనియానతపదంబొ
యనుచు వివదింతు రి ప్రాజ్ఞ శ్రుత్యర్థవిదులు
గాని తత్పాదభక్తాంఘ్రికమలసృతర
జఃపరీరంభకృతియె మోక్షంబు నొసఁగు. 9.

వ. మఱియుఁ బాలకడలి పెన్నురువులమురువైన చౌదంతితొండంబుడంబు విడంబించుచు విమలపట్టాంశుకావృతంబులగుత నూరుయుగంబు రాజిల్లెఁ (దిమేఖలాలంకృతంబగునప్పండితుకటీతటి హాటకవల్లిత్రయాంచిత స్ఫాటికశైలతటి గేలిసేయు. నాశ్రితమార్మికుని కేలుదోయిపుస్తకరూప

వేదపాఠమొక్కంటను, వాదివినిహిత తదామ్నాయాంతర్గతకంటకోద్ధా
రార్థంబుం బోలె బోధముద్రనొక్కటం బూని మెఱసె. నతిమృదు
లంబులు లలితంబులు నగునమ్మహితు కరపల్లవంబులు పొందమ్మిఁ డాలు
నకుం బాటచ్చరంబులును, నమరద్రుమంబులలేఁజివుళ్లకు సహచరం
బులు నయ్యె. శరదిందుకిరణధవళంబై బిసతంతుసుకుమారంబైన యు
పవీతంబుఁ దాల్చి విజయలక్ష్మిశయ్యాతలంబై యురరవిశాలంబై మాంస
లంబై తదీయోరస్థలి చూడ నొప్పారె. బహిరంతశ్శత్రునిగ్రహాలాం
ఛనజయ స్తంభయుగీప భావన శుంభల్లక్షణోపేతంబులు పరిఘాకారం
బులునై తద్దోర్దండంబులుద్దండకాంతి గండుమీఱెఁ. బ్రతిపక్షశిక్షణ
దక్షం బగువిజయశంఖంబుం బోలి ధీరధ్వనిం గంఠంబు దీపించెఁ.
గెమ్మోవిఁ దవిలినపలువరుసబిసువెలిడాలు నవనవంబగుపవడంపుఁ
దీవెల నలమినశారదం బైనపండువెన్నెలలం దలదన్ని యొప్పె. సంతత
ముఖాశ్రిత సరస్వతికినై విధాత నెలకొల్పిన నిద్దంపుటద్దంబు లనంగపో
లఫలకంబులు తులకించెఁ బయోధిసంభూతం బగునిందుబింబంబు
పగిదిఁ గాక సర్వలోకసుకృతజలధిసముద్గతం బగుతదాననంబు సద్గుణ
ప్రకాశకంబై దీపించె. యదంతరావాసయై యుందిరాసుందరి దీనవసు
మతీదేవపురంధ్రిదారిద్ర్యపిశాచోచ్చాటనమంత్రిం బగు కనకధారా
వృష్టి నెఱపె నట్టి యయ్యనఘునిలోచనమహిమంబు వర్ణింప నరిది.
దుర్వారవైరిదూషణవిజృంభణక్షయసముల్లసితసేతుకారకంబులు, నతి
కాయవిభ్రమధ్వంసకంబులు, సంసారిశాఖామృగహర్షాధాయకంబులుఁ
బయోబ్ధిపీచినదలంకారంబులును లంకారులు నగు నాతాపసకులచం
ద్రునికటాక్షాంకురంబులు శ్రీరామచంద్రకటాక్షములకు వియ్యంబు
లయ్యె నంతియ కాక. 10

మ. అతిఘోరక్షితిరూఢకంటకకులంబై మారదావాగ్నిహిం
త్యాతంబై బహుళార్తిపంకిలతరంబై యూమ ఘూనేకపో
ద్ధతమై ధైర్యముఁ మాల్పుసంసృతికదధ్వం బిచ్చు నాయాసవి
స్తృతి మాయించుదదీక్షణంబులు సుధావృష్టిక్రియాదక్షముల్. 11

ఉ. ఆకరుణాబ్ధిఁ జేరు త్రిపథాంగ యంచుఁ దదాననాచ్ఛభ
స్మాకలితత్రిపుండ్రకము నందురు కొంద, అదెట్టులైనఁ నౌఁ
గాక, త్రయీశిఖార్థము లఖండముగా వివరించుప్రౌఢిచేఁ
గైకొన సున్నకీర్తులత్రికంబునకుం బ్రతిభూత్రయం బగున్. 12.

గీ. కాంచి యెవ్వాని నిరుపమాకార మెదల
నిపుణులు మనోజ్ఞు మదనుఁ దృణీకరింత్రి
తండు శాంభవలీలావతార మనుచు
సుందరుండు నంచు జను లెంచ సుగమమె కద. 13.

చ. వికృతమహాజ్ఞతాగహనవీథులఁ జిక్కి భవాఖ్యదావపా
వకపరిపచ్యమాను లగువారల కందఱ కాత్మవిద్య లె
స్స కఱపి ప్రోవ, మౌన మెడసల్పి వటద్రుమమూలముఁ ద్యజిం
చి కదలె శంభుమూర్తి శమశీలమునం గొని శంకరాకృతిన్. 14.

శా. స్వాయచ్ఛందవిరుద్ధవాదకుహనాపాండిత్యవైతండికుం
డై యాశంకరుఁ డుద్భవింపఁ బదభక్తానంతతాపవ్యథా
పాయం బాయె నధీరులై వడఁకి రావైభాషికాదుల్ కథా
వైయాత్యప్రతిభల్ నశింపఁ జెసి రన్వైశేషికాద్యుద్ధతుల్. 15.

గీ. మదనజయమున సర్వజ్ఞమహిమ విబుధ
శస్యతను శంకరుం డల్లశంకరుండె
కాసి యాతండు యజ్ఞవిఘాతకుం డి
తండో యజ్ఞక్రియాసాధకుండు దలఁప. 16.

క. ఆమహితుపముని నొకనిఁ గ
లామాత్రతులానుకారి లక్షింపఁగ నౌ
నేమి జగత్త్రయవిబుధ
స్తోమంబున? నతని కతఁడె తుల నిక్కముగా. 17.

క. నందనమున సురతరు లటు
మందారములందు బహుసుమములటు లం దిం
దిందిరములయటు శంకరు
నందు సుగుణాబ్ధి మందమందు నసంఖ్యల్. 18.

మ. ఘన నూకామము వస్తుచర్చఁ, బ్రతిఘా కార్కశ్యహింసల్ క్షమా
ర్జనచే, దైన్యపరిగ్రహానృతకథాశల్ తుష్టిచే, మచ్ఛరం
బనసూయన్, మదమానముల్ పర*మహాత్మ్యాధ్యానవిత్తాశయా
ప్తిని ఖండించె నతండు తృప్తిపటిమన్ దృష్ణాపిశాచింబలెన్. 19.

గీ. చేరి తన్ను శుశ్రూషించుశిష్యజనుల
కామము సమూలఘాతమ్ముగా వధించె
సరవి రోషంబు చూర్ణపేషముగ నూఱెఁ
జెండె లోభాదికముఁ దృణచ్ఛేదముగను. 20.

సీ. ఘర్మమర్మచ్ఛిదాకారులై దివమందె
కాంతి యీచంద్రమఃకరము లేమి?
యవి కావు ముగ్ధరో! యభవనవీనావ
తారశంకరగుణోత్కరము సువ్వె.
ప్రాణేశ! యట్లని వ్యాకోచ మెట్లొందఁ
జాలె నీయుత్పలషండ మెల్లఁ?
దెలియరో! వినుము విస్మేరదిక్కామినీ
పాండురాపాంగ ప్రభాప్రవాహ
గీ. మనుచుఁ బ్రశ్నోత్తరములు దిగంతదంతి
దంపతుల కయ్యె; శంకగాత్యంతవిమల
సుగుణనిబిడాంబరాచ్ఛన్నజగములందు
ముసువులో గ్రుద్దులాట పెంపెసఁగుకతన 21.

* "పరులమే లగ్గింపఁగా నేర్చు బుద్ధిని" అని పాఠాంతరము.

మ. కనులం గాంచదు మాక్షికద్రవము, ద్రాక్షన్ శిక్షలం బెట్టు, నె
మ్మనమం దెంచదు క్షీర, మిక్షురసముం బాటింప, దాశాంతలం
ఘనజంఘాలము మాధురీమదభరాక్రాంతంబు సౌశంకరా
ర్యనిసర్గామలసద్గుణోత్కర మనార్యారుంతుదాకారమై. 22.

సీ. త్యజియించుకొనుఁగాక ధాత్రి సర్వంసహా
ఖ్యానమ్ము శంకరుశాంతిఁ గాంచి
పరిహరించునుగాక బాహులేయుఁడు గర్వ
విస్ఫూర్తి శంకరువిద్య లెఱిఁగి
వఱువట్టుగొనుఁగాక బాదరాయణికీర్తి
శంకరువైరాగ్యసార మరసి
విడువఁజూచునుగాక వేధ వాక్చాతురి
శంకరుకర్తృతాశక్తిఁ దెలిసి
గీ. యట్టిశాంతి యు నట్టివిద్యామహత్త్వ
మట్టివైరాగ్య మట్టివాచాతిదాక్ష్య
మొక్కశంకరునందుఁగా కొరులయందుఁ
గాంచఁ దర మానె వేయు పల్కులేల? 23.

శా. గోముం గన్నతదీయమూర్తి క్షమ నా గోత్రాసగోత్రమ్ము, శో
భాముగ్ధం బగుకీర్తి విద్యఁ బడయున్ భాషావిభావత్త్వమున్
గామంబుల్ శ్రితకోటి కిచ్చుతతి నాఁ గల్పద్రుకల్పంబు సీ
మాముక్తద్యుతి దానిఁ బోల జగముల్ మందాక్షమందాక్షమా.

క. కలుగఁడు తత్సదృశుఁ డిలా
తలమునను బురాతనాద్యతనులం దొకఁడున్
గలుఁగఁ డిఁక ననాగతమునఁ
గలిగెనె మేరువును బోలఁగలగిరు లెందున్. 25.

గీ. పొదలెఁ దత్కులమక్కళావిదునిచేత
మెఱసె సతఁడును సౌశీల్యగరిమచేతఁ
దనరె నాసుశీలమును విద్యామహత్త్వ
వెలిఁగె నావిద్యలును మహావినయలక్ష్మి. 26.

గీ. గుణములు చివుళ్లు, సత్కీర్తి కుసుమములు, శ్రీ
యద్బుధులు తేఁట్లు, కాంతి యనంతరసము,
బోధము ఫలంబు గాఁగ స్వర్భూజమట్లు
రాజిలెను దద్విచక్షణరాజమౌళి. 27.

శంకరవాగ్వర్ణనము.

గీ. కవివరుండగునతనివాక్చాతురిమంబుఁ
గాణభుజవాణి, కాపిలవాణి, యార
గేంద్రివాణియుఁ గనఁజాల వింత యనిన
నితరఫణితులగతి వచియింపనేల? 28.

గీ. భట్టభాస్కరమర్దనప్రాప్తదుర్ద
శానిమగ్నాగమాంతహస్తగ్రహమ్ము
లయిన శాంకరవాఙ్నివహమ్ము లోలుకు
నక్షరం బగుభవ్య రసాయనంబు 29.

శా. జాటాటీరజటాకటీతటనటత్స్వర్ణిమ్నగాభూమిలో
కాటాట్య ప్రథమావతార పటుగర్వాటోప లుంటాకమై
ధాటిన్ గర్జిలుశంకరాచలలురద్వాణీసరిచ్ఛంతీర్ఘురుల్.
మాటాడున్ జగతీభయప్రదము లౌదుర్భిక్షదుర్భిక్షముల్. 30.

సీ. మానసమత్తసామజయూథపమువారి
బోధభూపతివాసమునకు దారి

దురితపూర్ణాపారదుర్వాదనిస్సారి
సూరిహారీకృతాకారహారి
యమితచింతాతూలహరణవాతలహరి
తతసంసృతిపయోధితారణతరి
యఝుఁ నశంకరునిగమార్థవాగ్వైఖరి
వెలసెఁగథాదర్పకలితసూరి

గీ. జాలకండూలరసనాసనాళభూమి
పతనకారణారణ్యకశ్రుతినిపాత,
మచలితాద్వైతలక్ష్మీజయాంకఘంటి
కాఘణాఘణ ముపనిషద్గంధిలంబు 31.

సీ. ఘనసారకస్తూరికాగంధసంరంభ
పరిరంభణప్రియంభావుకములు
తాపోపగమనిర్మథననిశాకరకరా
హంకారభారకషాలంకషములు
ద్రాక్షాసితామధుగోక్షీరమధురిమ
వ్యాపారపూర్ణశివంకరములు
నవనవోద్భిన్నపల్లవగుచ్ఛకాంతిసం
దోహదోహలపశ్యతోహరములు

గీ. త్యక్తకంటక ప్రాజ్ఞపాంథప్రకీర్ణ
దీపితాద్వైతమోక్షఘంటాపథము
లంకృతామ్లానకుసుమమాల్యాంకతోర
ణములు శంకరుమృదుభాషణములగములు. 32.

ఉ. దవ్వుగఁ జిమ్మె దుర్ణయవితానరంజంబుల, నీతిబాధలన్
ఱువ్వె, గుణాలి మేల్పడి, సిరుల్ గనుశంకరువాక్సమీరముల్
మవ్వపుఁదావు లొల్కి విషమంపుభవాటవిలోన నాధియన్
గ్రొవ్వినయగ్గివేఁడిమిని గూరిననెవ్వగ లెల్లఁ జివ్వతన్. 33.

మ. రసదారాంగనటచ్చతుర్ముఖవధూరత్నాంఘ్రిమంజీరభూ
రసితంబో! విలసత్తదీయకటిభారస్ఫారసౌవర్ణసా
రసనారావమొ! తచ్చలత్కరయుగీరాజన్మణీకంకణో
ల్లసితక్వాణమొ! నాఁగ శంకరుకలాలాపంబు లేపారెడున్.

శా. ప్రావృట్కాలవిజృంభమాణఘనధీరధ్వానడింభంబు, వా
త్యావిక్రాంతివిఘూర్ణదర్ణవచలత్కల్లోలజృంభంబు, మ
ల్లీవల్లీప్రసవోదయత్పరిమళాశ్లేషప్రలంభంబు, వి
ద్యావారాంనిధి యైనశంకరుపటీయస్సూక్తిగుంభం బిలన్. 35

ఉ. * వేద్య మవద్యముల్ జహదవిద్యమునై యమృతోద్యమై సుధా
స్వాద్య మరాతిచోద్యకులిశాద్యవిభేద్యము సత్కళాసష
ద్యాద్యము యోగపద్యహృతసాద్యఘవద్యమునై ముముక్షుసం
వేద్యము నైనశంకరు నవేలశివోద్య మిదున్ సుఖాద్యముల్. 36

సీ. ఆయాసమునకు నవాంకూరమును బీజ
రూపంబు ఘనమనస్తాపమునకుఁ
బూర్వరంగమ్ము పరిభూతసంక్లేశమ్ము
లకుఁ బ్రాగ్భవాపూర్వలబ్ధములకు
వినఁ జెప్ప రాని వేవేలదోషములకుఁ
బ్రస్తావనాడిండిమస్తనితము
గార్మణం బనృతసంకథనమ్మునకు నిష్క
టమ్మ సచ్చింతాచయమ్ములకును

గీ. నగు చమేయావిచింతనీయాప్రధృష్య
మైనదేహాద్యహంకార మంతరింప

---

* (1) సుధా=అమృతమువలె; సు=మిగుల; అద్యము=తినఁదగినది; (2) సాది=జీవుల యొక్క; అఘవద్యము=పాపోక్తి; (3) శివోద్యము=శుభోక్తి; (4) సుఖాద్యము=సుఖముగా తినఁదగినది, సుఖ+అద్యము=సుఖమునందలి యాద్యము.

శంకరార్యోక్తి యనుపరశ్వథముదగ్ర
నఱుకఁ జాలినసాధనాంతరము గలదె? 37.

గీ. న్వాద్యతనమూక్తిగర్భశుక్త్యంతరుదిత
మౌక్తికం బగుశాంకరీయోక్తి క్షపణ
కపత్రితారణహాతి బౌద్ధ కాపథహాతిఁ
జేసి పడినయాశ్రితులకు సంజీవనంబు. ౩౮.

మ. ఘనఝంఝానిలకంపితద్యుతటినీకల్లోలకోలాహల
స్వనసోదర్యము నైకదుర్మతరజఃపాళీహరం బౌచుఁ బే
ర్చిన శ్రీశంకరకోవిదేశ్వరజరీజృంభద్వచోనిర్ఝరం
బనుకూలించు సధర్మదుర్మతనిఖాతా ఽశాంతి శాంతింపఁగన్. ౩9.

ఉ. ఆరఁగ నవ్వుమల్లెపువ్వులందలి తావులఁ గౌఁగిలించి మం
దారమరందధారల నణంగని కమ్మఁదనమ్ముఁ దేర్చి యా
చారవిచారసింధు వగుశంకరుప్రన్ననిపెన్నుడుల్ సుధీ
వారమనంబు లన్నికొన బాళిగొనన్ వలపింపఁ జేయవే. 40.

మ. అనవచ్ఛిన్నసుఖానుభూతి నిడునయ్యార్యోక్తిధారాసుధా
వనధిన్ దేలునెవండు నాసపడునే ద్వైతప్రబోధమ్ములన్?
గనునే కచ్చరదుష్పటచ్ఛరజరత్కంథానుబద్ధాదరం
బును జిత్రం బగుకాంచనాంబరశతంబుల్ దాల్చువాఁ డెవ్వఁడున్.

చ. నిరుపమశంకరోక్తిపరిశిక్షితచిత్తుఁడు తేనె నూనెగా
నరయుచు, ద్రాక్ష శిక్ష నిడి యద్దిర! క్షీరము క్షారమంచు వా
చఱచుచు మోచ కాచ మనఁ జాగి సితన్ భసితం బటంచుఁ జె
చ్చెర వెగటొందుఁ గుందు నిరసించు హసించు రసించుమించుగన్.

ఉ. తియ్యఁదనంబు నంతయును దేనియ యమ్మెను, ద్రాక్ష ప్రీతిచే
నొయ్యన నిచ్చెఁ, బాత్రి మనునూహను క్షీర మొసంగె, నిక్షువుల్

గయ్యమునందుఁ గోల్పడె వగన్, సుధ చోరభయాప్తి డాఁగెఁగా
కెయ్యెడ లేనితియ్యఁదన మెట్టుల గల్గెను శంకరోక్తికిన్. 43.

ఉ. కప్పుర మప్పుగాఁ గొనియెఁ, గస్తురి గాంచెఁ బఱంచి, మల్లియల్
చెప్పినసేవ సేసి పడసెన్, విలిచెన్ మఱి కుంకుమంబు దా,
నప్పుడొ చందనంబు హరియించెను శంకరుపల్కుఁదావులన్
జెప్పఁ దరంబె దన్మహిమ నిత్యసముల్లసనాతిధన్యముల్. 44.

ఉ. చవిగలకుంపెరుంగు దిని, చాలఁగఁ బాలనుఁ గ్రోలి, యించులోఁ
జవుల నెఱింగి, త్రావి వరుసన్ బువ్వుఁదేనియ జుంటితేనె మే
లవుకదళీఫలాలు దనివార మెసంగినవాఁడు శంకరా
ర్యవచనమాధురిన్ గనుఁడు నవ్వియ కావు సుధన్ స్మరించునే? 45.

చ. భవదవథుప్రతప్తజనపాళికిఁ గప్రపుజల్లు, మోక్షభా
ర్గవికి నిసర్గనిర్మలతరం బగుమౌక్తికయష్టి, యద్వయా
త్మవిపులసౌఖ్యవృష్టికృతతామరసాకరహంసి, శంకరా
ర్యవచనధార పుణ్యమున నబ్బును బుద్ధివిశుద్ధసిద్ధికిన్. 46.

సీ. మహిమాభిరంజితామ్నాయశేఖరగణా
వాపమం దంకురారోప మొంది
యమలామలసురేశ్వరాదికశిష్యసూ
క్త్యంబుధారాసేచనంబు వడసి
కలితకైవల్యకాంతారూపలలితప
లాశసంహతుల నుల్లాస మూఁది
విజ్ఞానధనలిప్సువిబుధమనస్సాల
జాలాధిరోహణలీలఁ గాంచి
గీ. తత్త్వబోధప్రసూనసంతతిని బూచి
యమృతఫలమై ద్విజాతి కుపాస్య యగుచు

నలరు సోమావతంసన వావతార
గురువచోవల్లి యొసఁగు భక్తులకు శుభము. 47.

మ. నటదీశానకిరీటకోటివిలుఠన్మందాకినీ ద్వేషు లు
ద్భటసగ్భిన్నసుధాసరోవరపరీవాహావగాహుల్ మదో
త్కటతద్ద్వైతమతానుయాయిదురహంకారాభిచారుల్ పరి
స్ఫుటవేదాంతము లైనసూక్తులఁ దనర్చున్ శంకరుం డున్నతిన్.

శా. సాహంకారసురాసురౌఘకరకక్ష్మాఘూర్ణదుద్దామదుం
థాహార్యక్షుభితామృతార్ణవతరంగాకారవాచాసుధా
వ్యూహాసారమునన్ భవాహ్వయదవాగ్న్యుద్వేగ్న మాజంతుసం
దోహం బొందెడు తాపమార్చుగురుఁ డెందున్ సత్కృతుం డౌటబ్రమే?

శంకరుని కీర్తి వర్ణనము.

గీ. కలశవారాశితోఁ గచాకచి యొనర్చి
కైరవాప్తునితోఁ గదాగది యొనర్చి
రజతశైలంబుతో భుజాభుజి యొనర్చి
యుల్లసిలు శంకరార్యసంఫుల్లయశము. 50.

క. పరిశుద్ధుఁ డెవ్వఁ డిల నను
తటి శంకరుకీర్తి కోడి తన్మదిఁ దిత్తుఁడై
హరిణాంకుఁ డాకళంకము
దొఱఁగుటకే కాదె జలధిఁ దోఁగును నేఁడున్. 51.

సీ. ధమ్మిల్లమున్మున వినూతనమల్లికాసుమ
సృష్టినిర్మాణకౌశలిని జూపుఁ
గాంతలలాటభాగమునఁ జాందనరస
చిత్రికశిల్పవైచిత్రిఁ జూపు

గ్రీవాంతరమునఁ దారావళీహారబం
ధురరచనాతిచాతురిని జూపు
మొనసి సర్వాంగీణముగఁ జంద్రికామల
క్షౌమధారణపటిష్ఠతను జూపు
గీ. నహహా! బహుళదివస్పృథివ్యంతరాళ
పూరితాపూర్వశాంకరీ మోరుకీర్తి
పూరములు హారిదంగనావారముల క
నల్పితాకల్ప మొనరింప నాత్మ నెంచి. 52.

సీ. ఉత్తుంగములఁ జేర్చు రొండొరుఁ ద్రోపాటి
హారిదంబుజేక్షణోత్కరము నేర్పఁ
గరముల నల్ల నాకర్షించుఁ బానశా
బృందమ్ము ప్రేమనిష్యంద మొప్పఁగ
దనివోవ ముద్దాడు దరికి రాఁ దివిచి యా
కాశమ్ము రాగసంగతిఁ జెలంగి
కై జాఱెనేని చిక్కం డటంచును వియ
ద్గంగ దివ్వును నిఱికౌఁగిలింతఁ
గీ. జకోరీవాళమ్ము పిలుచుఁ బ్రసన్నవృత్తి
శేషఫణి యాటలాడుకోఁ జిత్తగించు
శంకరార్యయశోహరిణాంకమూర్తి
యద్భుతం బైనసౌందర్యమరసి మురిసి. 53.

గీ. * కాంచు హారిదంతపంక్తి సాంకాశినమ్ము
నర్చుఁ జంద్రుని సాంహాసినము వెలార్చుఁ
సమ్మతచతురిమ సాంలోపినమును సలుపుఁ
దిమిరసాంఘాతిన మ్మాసుధీయశమ్ము. 54.

* "అభివిధౌ భావఇనుణ్" సమ్=సమంతాత్, కాశః=ప్రకాశ ఇతి, భావేఇనుణ్ 'అణి నుణః' సం-కాశ్-ఇన్=సంకాశిన్=అణ్ =సాంకాశినమ్. ఏవమేవ సాంహాసినం, సాంలోపినమ్, సాంఘాతినమ్.

చ. కుతుకపతన్మృగేంద్రనఖకోటివిదీర్ణకరీంద్రకుంభని
ర్గతనవమౌక్తికచ్ఛవినిశాయనిబద్ధనియుద్ధలై మహా
క్షితిధరఘూర్ణనక్షుభితసింధుచలత్పృథులోర్మిమైత్ర్యపే
క్షిత లయి లోకమందు విలసిల్లెను శంకరుకీర్తిమాలికల్. 55.

చ. చిరముగఁ జక్రవాళదరి! చెందె దనావిలభావ మల్ల శం
కరుసితకీర్తిచంద్రు నిఱుఁగౌఁగిటఁ బట్టుముదంబుచేనొకో?
సరిసరి నీవు నుత్పలిని! సమ్మద మొందవె? యేలె? యన్న న
య్యిరువురకున్ స్మితంబు జనియించెను బ్రశ్నల కుత్తరంబుగన్. 56

శా. దుర్వారాయతగర్వవైరిసుమనస్తోమాలతౌఘవాతూలమై
నిర్వేలాద్భుతబోధశీతకిరణోన్మేషర్ధిదుగ్ధాబ్ధియై
నిర్విఘ్నప్రసరద్భవాహ్వయదవాగ్నిస్ఫీతసంతాపశాం
త్యర్వాచీనపయోదమై సితయశుం డాశంకరుం డొప్పెడున్. 57.

క. ఇతిహాసపురాణంబులు
స్మృతులును శాస్త్రములు పౌరిఁబౌరిన్ బుధజనసం
యుతుఁడై యరసి యతం డు
న్నత మగు సర్వజ్ఞతాపదంబున్ బడసెన్. 58.

క. ఆయన మఱిమఱిఁ గాంచెను
వైయాసక శాంతివాక్ప్రపంచము, నుపశాం
త్యాయత్తశుద్ధతం గనె
నాయెడ సర్వజ్ఞభావమ ట్లలవోకన్. 59.

గీ. చక్కఁ జతురాస్యుఁ డయ్యె నపత్ప్రపంచుఁ
డనఁగఁ బురుషోత్తముండె యయ్యెను నభోగ
యోగి యనఁ, గామజేత యయ్యెను విరూప
దర్శనుం డనఁ బ్రథితుఁడై తనరె నతఁడు.

ఉ. ఆననమందు వాణి యలరారుటఁ బద్మజుఁ డంచు, సత్త్వమా
శ్రీనిరతాభిషక్తి విలసిల్లుట వారిజనాభుఁ డంచు, నా
ర్యానుపమానభక్తిరచితార్హణుఁ డౌటఁ బురారి యంచు న
మ్మానిసమాను శంకరుఁ బ్రమాణపురస్సర మెంతు రీ కోవిదుల్. 61.

ఉ. ఆపురుషోత్తముఁ గవియునాస నయోనిజమై జనించి మా
యాపరభిక్షుసీత యయి నైకనరానుస్మృతిభ్రమంబునన్
గోపన మైనసత్త్వఁ బ్రతికూలబుధారులఁ గెల్చె; కొన్నయా
తాపసరూపదేవు నవతారము కాదొకో శంకరుం డనన్. 62.

గీ. సంతతబ్రహ్మచర్యదీక్షావిభూతి
నతఁ డనూచానుఁ డగుటె కా దనుపమాన
కుశలతను మహాంతర్వాణిగూడ నగుట
నడపె గురుఁడు సమావర్తనవ్రతంబు. 63

క. ఏడేండ్లయీడునకు నిటు
లీడెఱుఁగనిపాండితీమహిమఁ గని గురులన్
వేడి సెలవొంది వటువుల
వీడుకొని యతండు నిజనివేశము సేరెన్. 64.

శంకరుఁడు తల్లికడకు వచ్చుట.

ఉ. చేరి నిజాంబికాంఘ్రిసరసీజయుగంబున కొయ్యనన్ నమ
స్కారము లాచరించి స్వసుఖం బెఱిఁగించుచు నామె సేమ మిం
పార నెఱింగి బాంధవుల నందఱ సాదరసూక్తులన్ బుర
స్కార మొనర్చి శంకరుఁ డఖండసుఖంబున నుండె నింటిలో. 65.

ఉ. సప్తశరద్వయోంచితుఁడు శంకరుఁ డాక్రియ నిల్లు సేరి య
త్యాప్తత మాతృదేవత సమర్చనలన్ దనియించుచున్ సరో

జాప్తుని సప్తజిహ్వుని నుపాస్తి యొనర్చుచు వేదశాస్త్రసం
ప్రాప్తమతిప్రకాశనిరవద్యసముద్యముఁడై విరాజిలున్. 66.

క. తరుణుఁడు కినియఁడు, వయః
పరిణతుఁ డాసన మొసంగఁ, బ్రణయమ్మున నె
ల్లరు నంజలి నొదలఁ గూ
ర్తురు, పసివాఁ డైన శంకరుం డగపడినన్. 67.

సీ. భయభక్తియుక్తులై పాయనివటువు ల
ధ్యాపించుఁ గోరిన యాగమములు
శ్రుతినదీష్టులఁ బరాజితులఁ జేయు వధాన
మొనరఁగా వికృతుల నుగ్గడించి
పలుకుఁ ద్రయీవాక్యముల ననులోమవి
లోమరీతుల బుధాళులు నుతింపఁ
గమ్రవీణాక్వాణకల్పంబుగా సామ
గాన మొక్కెనర్చు జా ల్గరఁగిపోవ.
గీ. నలువనలుమోముఁదమ్ముల మొలచినట్టి
మెలపు దులకింప నిర్దోషవిలసనముగ
వేదముల సాధనను జేయు విఘ్నవకుండ
శంకరుఁడు సజ్జనవ్రాతకింకరుండు. 68.

సీ. కఠవల్లితోడ శిక్షావల్లి శోధించు
వల్లించు నానందవల్లి యలరి
పఠియించు భృగువల్లి కఠమునర్థ మెఱుంగు
ఛాందోగ్యమున రహస్యములఁ దెలియు
నరయు శ్రద్ధను బృహదారణ్యకమ్మ న
ధ్యయనించి చూచు నారాయణమ్ము

ముండకమాండూక్యములయర్థములు గ్రోలుఁ
దాపనీయార్థముల్ తఱచి చూచుఁ

గీ. గనును భగవద్గీతార్థ మనుపదముగ
బాదరాయణసూత్రతాత్పర్య మరసి
సమ్మదాశ్రుపరిపూర్ణలోచనసరోజుఁ
డౌచుఁ బరవశుఁడై పోవు నాబుధుండు. 69.

గీ. పాణినీయవార్త్తికమహాభాష్యవిరచ
నాధ్వముల నధ్వనీనుఁడై యనుపమాన
మైనతత్త్వప్రభావమ్ము లాత్మఁ దలఁచి
సలుపు జోహారు లక్షరాక్షరమునందు 70.

ఆ. భాట్టజైమినీయపటిమ మాస్వాదించి
గాఢగూఢనిరవకాశతత్త్వ
దీయఫణితులను మదిం గండశిలలభే
దనముగాఁ దలంచి వినతిసల్పు. 71.

క. పరివిమలమతి గురులొద్దను
శ్రవణము గనినట్టివేదశాస్త్రమ్ముల న
ట్లవిరతమననక్రియ నా
త్మవశమ్ములు సేసికొనె నతం డనహీతుఁడై. 72.

ఉ. పుత్రునిపాండితీ మతిసముల్లసనంబు నిరంతరాశ్రిత
ఛాత్రగణప్రబోధము వచఃపటిమంబు తపశ్చికీర్ష స
న్మైత్రియుఁ గాంచి తల్లి ప్రమదంబునఁ బొంగుచు, నంతఁబో నిహా
ముత్రఫలానభీప్సితసముత్సుకతం గని కుంగు భీతియై. 73.

చ. ముదిసి హృషీకశక్తి గడముట్టుట నన్యులసాయ మొంద నె
మ్మదిఁ దలపోయుతల్లి కణుమాత్రము పీడ పొసంగకుండఁ ద

త్పదములఁ గొల్చు నాబుధుఁడు ద్వైతభావన; బోధసేయు "న
య్యది యటు లిద్ది యిట్టు"లని యాయమకోరిక ముక్తిమార్గముల్.

క. కడుపునఁ దన్నుం గన న
ప్పడఁతుక పడినట్టిపాట్లు, పతితో వహ్నిం
బడక తనకొఱకుఁ బ్రాణం
బొడల నిలుపుకొని తపించు టుల్లముఁ గలఁచన్. 75.

మ. 'తన వైదుష్యము తండ్రి కాంచకయ యంతం బొందె'నం చాపె కం
టను నీ రొల్కఁగఁ జూడఁజాల కడుగంటన్ సంస్కృతిప్రేమముల్
దునియన్ వేదపురాణశాస్త్రములయందున్ గన్నవైరాగ్యసా
ధనవైరాగ్యనిధానసూక్తి ఋషిగాథాబోధనన్ వేర్మిడిన్. 76.

ఆర్యాంబకొఱకు నదీపూర మింటిదరికి శంకరుఁడు దెచ్చుట.

క. ఒకనాఁ డాయమ గ్రామాం
తికతటినికి స్నానమాడ నిచ్చ లరుగు న
ట్లాక తెయు మధ్యాహ్నము సూ
ర్యకిరణపరితప్తసికతిలావనిఁ జనుచోన్. 77.

చ. చండకరప్రతాపహతి సొరు చెడన్ మయి వాఁడి ఘర్మవాః
కాండములన్ మునుఁగ, నరకాళులు పొక్కఁ, దమంబు కన్నులన్
నిండఁగ శ్వాస మాడ కవనీస్థలిఁ దెళ్లఁగ నయ్యుదంత మె
వ్వండొ వచింప శంకరుఁడు వైళమ యేఁగి కలంక నొందుచున్.

క. వివశ యగుజననిఁ గని యా
స్రవంతి నీరమును దెచ్చి చల్లియుఁ దత్సం
భవనళినీదళముల మె
ల్ల విసరి యుపచారములఁ గలంగుచు సలుపన్. '79.

క. ఆర్యాంబ తేఱుకొని పరి
చర్యలు గావించుసుతుని సౌజన్యమహౌ
దార్యములకు జననీహిత
ధుర్యతకును బొంగు చలఁతతో నిలు సేరెన్. 80.

గీ. చేరుజననికి శిశిరోపచారవిధుల
దాహశాంతి యొనర్చి నాతల్లి! నదికి
నరుగఁ జాలనిముదుసలి వైతి వకట!
'వల' దనుచు నీదుకోర్కె ద్రోవంగఁ జాల. 81.

క. అని పలుకుచుండునత్తఱి
చనుదెంచెను గేరళేంద్రసచివుఁడు మీఁద
ర్శనభాగ్యకాంక్షియై మా
జనపాలుం డనిపె, ననుచు సంభ్రమయుతుఁడై. 82.

ఉ. భక్తిభరంబునన్ వినతభావ మెలర్ప నమస్కరించి శాం
తోక్తులఁ దల్లిఁ దేర్చివిబుధోత్తముతో ననె నీమహైదుషీ
శక్తి జనంబు దెల్ప నృపచంద్రుఁ డనారత మాలకించి యా
సక్తిని నిన్నుఁ గాంచి నిజజన్మకృతార్థతఁ గాంచ నెంచుచున్. 83.

క. న న్నీపరివారముతో
నిన్నుం గొని తేర ననిపె నేఁడ మహాత్మా!
సన్నిధి సేయుం డన తగ
విన్నప మొనరింప బుధుఁడు విని వినకున్నన్. 84.

ఉ. నివ్వెఱ నొంది మంత్రి జననీపరిచర్యల మగ్నచిత్తుఁడై
సవ్విబుధావతంసునియుదంతము సాంత మెఱింగి యార్య!మీ
నెవ్వగ దీఱు టెంతపని? నీజననీహృదయాభిలాష నేఁ
డెవ్విధినేని దీరు నృపుఁడే తలపెట్టిన నేది కాదిలన్. 85.

వ. అని పలికి పరివారము నచట నిలిపి పవనజవనం బగుహయం బెక్కి యతిత్వరితగతిం జని యెదురుసూచుచున్నయన్నృపతికి శంకరుని మాతృశుశ్రూషాదీక్షయు నితరానపేక్షయు నభివర్ణింప విని యేడ్తెను దద్దయు దద్దరిల్లి ప్రెగ్గడం గాంచి. 86.

క. నీరాకరాకృతిగ నొక
సారణి తద్భవనసవిధసరణిగ నెపుడుం
బాఱంగఁ ద్రవ్వింపు నదీ
పూరమనోహారముగా నిపుడె యని మఱియున్. 87.

మ. భూపాలోత్తముఁ డంత శంకరపదాంభోరుడ్దిదృక్షావశుం
డై పర్యంతపరీతమంత్రిభటసేనాధీశుఁడై యశ్వధా
రాపాండిత్యము మించ వ్రేల్మిడిని జేరన్ వచ్చి తత్కోవిద
శ్రీపాదాంబురుహద్వయంబుఁ గయిసేసెన్ మౌళిరత్నచ్ఛవిన్. 88

క. పటువై శిశువై వాచా
పటువై వెలుఁగొందునవ్విపశ్చిన్మణి నై
కటికం డగున క్కేరళ
కటకాధీశ్వరు సుఖాదికము లడిగి తగన్. 89.

గీ. పరిజనసమేతుఁ డైనభూపతికి సముచి
తాదరోక్తుల సంతసం బావహింప
జనపతియు భక్తి మౌళి నంజలి ఘటించి
మృదులమధురోక్తులను వచియించె నిట్లు.

క. ఆకాంక్షింతును మది యా
వ్యాకీర్ణపదద్వయీసమర్హణభాగ్య
శ్రీకల్పితజన్మపవి
త్రీకరణము; నేఁటి కయ్యదియ సిద్ధించెన్. 90.

శా. బాలుం డయ్యు శ్రుతిశ్రుతానవరతవ్యాఖ్యావిధానైపుణో
ద్వేలుం డంచును వించు నిన్నుఁ గన నువ్విళ్లూరుచుండంగ నీ
వేళన్ సూర్యఖరాతపాహతిగతాభిజ్ఞానమాత్రంఘ్రిసే
వాలీనుం డయి తంచు మంత్రి పచియింపన్ వత్తు నాత్రమ్మునన్.

క. అని యార్యాంబాక్షేమం
బును మును విని వినయమున నృపుఁడు మ్రొక్కి పచిం
చె నదీవిమలాంబువగా
హానమునకై చింత దక్కుఁ డాంబయు నీవున్. 93.

క. పూర్ణాశై వలినీపూ
ర్ణార్ణోనిత్యావగాహనాసందరమా
పూర్ణు లయి జనని నీవు ను
దీర్ణచరితు లగుదు రెల్లి తెలవాటినచోన్. 94.

గీ. వగవఁ బని లేదు దానికో స్వామి యొక్క
మాఱు మన్మందిరము మీపదారవింద
రజమునఁ బవిత్రమొనరించి రాఁగ భద్ర
వారణముఁ దెచ్చినాఁడ నావాంఛఁ దీర్పు. 95.

వ. అని పూర్ణాపగాపూరపూర్ణంబుగ సారణి నిర్మింప నొనరించినతనయ
త్నంబు దెలిపి గజం బెక్కుమని కోర శంకరుండు బుషిపశస్యం
బుగ ని ట్లనె. 96.

గీ. అజినపరిధానమాధుకరాన్నభుక్తు
లమర శ్రద్ధ సంధ్యావాదనాగ్నికార్య
వేదపాఠముల్ గురుసేవ విధిగ వటులు
చేయువలె నంచు శ్రుతియ శాసించుఁ గాదె 97.

మ. నయమార్గప్రచరిష్ణుశీల! ధరణీంద్రా! నైజకర్మంబుఁ బా
సి యిభాద్యాధమభోగముల్ వడయ వాంఛింపంగ మాబోంట్లకున్
నయమా? వర్ణము లెల్లఁ దత్తదుచితన్యాయాధ్వవర్తిష్ణులై
నియమం బూనఁగ రాజు నిల్పవలెఁ గానీ వే అనన్ ధర్మ్యమే? 98.

వ. మజ్జననినిత్యమజ్జనక్రియ కీవొనర్చినయుపకృతికెంతయుఁ గృతజ్ఞుండ
నంతియ కాని యాశ్రమధర్మోల్లంఘనము సేయ మనసొగ్గదనుటయు.

చ అనయము వెల్లనై నృపతి యాతనిధర్మపథానువర్తనం
బును నుతియించి కానుకగఁ బ్రభూతసువర్ణము నప్పనం బొన
ర్చి నతులు సేసి తాను విరచించిన నూతననాటకత్రయం
బును వినిపించెఁ, బ్రీతిఁ దెలుపున్ నెఱసుల్ గలవేని యన్మతిన్.

క. రసగుణరీతిలలితములు
సుపంథిరుచిరములు సకలసుకవిష్టము ల
య్యు సదృశనాటకములు మా
నసమునకు ముదంబు గూర్చినన్ శంకరుఁడున్. 101.

క. 'నరపాల యిట్లు రససం
భరితము లయి నిష్కలంకభావము లగుసుం
దరకావ్యమ్ములు గలుగవ
ధర నీకిఁక నావలన వాంఛితము గలదె? యనన్. 102.

గీ. అమృతధారాధురంధర మ్మమితహృద్య
సార మగుశాంకరీయభాషణము వినుచు
విరచితాంజలిబంధుఁడై ధరణివిభుఁడు
గోరె స్వోపముఁ డైనకుమారుఁ బడయ. 103.

ఉ. అంతట శంకరుండు వసుధాధిపు నిట్లను హాటకంబు నా
కింత ప్రియంబు గా దొసఁగుమీ యిట నుండు గృహస్థకోటికిన్.

గాంతువు కామితం బచిరకాలమునం దనంగ దన్న సు
స్వాంతముతో నటంచు జనవల్లభు నంపుచు నేకతంబునన్. 104.

గీ. రాజవరవంశవృద్ధికారణము గాఁగ
సుత్రీత్యుదిత మైనయిష్టి వాకుసిచ్చి యుచిత
సత్కృతులఁ దన్పు; తేఁడును సంతసించి
యతని గుణములఁ బొగడుచు నరిగెఁ బురికి. 105.

క. అరిగి మఱునాఁడ పూర్ణా
సరిదంభోర్ఘురము వాఱు పారణి యలశం
కరుభవనసవిధసీమం
బొరయుచుఁ బ్రవహింపఁ జేసె నుత్సాహమునన్. 106.

ఆ. తిదిరి శంకరోపదేశానుసారమ్ము
సలిపె నిష్టి శాస్త్రసమ్మతముగ
భక్తి కలుగువారిఁ బాలించు నామ్నాయ
మదియు కాదె సృష్టి కాదికర్త. 107.

వ. అంత. 108.

సీ. తనపుత్రుశక్తి కత్యద్భుతస్వాంతయై
యార్యాంబ యానందమందుఁ దోఁగె
జననీమనోఽభిలాషము దీరెఁ గద యని
శంకరునాత్మ స్వాస్థ్యమ్ము నొందెఁ
దనిసెఁ గేరళవిభుండును గురుకటాక్ష మ
భ్యర్థితంబుగ నీయ నబ్బె ననుచుఁ
బరమావధియు మాతృభక్తికి శంకరుం
డనుజనస్తవము లభ్యధిక మయ్యె.

గీ. వలరి రాబాలగోపాల మగ్రహార
వాసులును దత్సుధీంద్రప్రభావముదిత
వసుమతీపాలరచితశాశ్వతమహోప
కారభరితకృతజ్ఞతోదారు లగుచు. 109.

ఉ. కాలటియగ్రహారమునఁ గాలిడఁగా నవకాశ మబ్బ న
ట్లోలిని జుట్టుఁబట్టఁ గలయూళులవా రరుదెంచి తత్సుధీ
బాలశశాంకుఁ గాంచి పదపద్మము లక్షుల కద్దికొంచుఁ బొం
బూలను బూజసేసిరి యపూర్వతదీయమహత్త్వ మెన్నుచున్. 110.

సీ. ధరణీసురార్భకపరివీతుఁడై యుడూ
త్కరవేష్టితామృతకరుని మించి
ధవళయజ్ఞోపవీతభ్రాజియై గాంగ
ఝరశోభి నీహారధరముఁ బోలి
లలితకృష్ణాజినాలంకృతుండై నీల
పటదీపితప్రలంబఘ్ను నవ్వి
ముంజమంజిమపుంజమంజుకటీరుఁడై
సహరితలతికద్యుశాఖ మీఱి 111.

గీ. బ్రహ్మవర్చసతాండవరంగమండ
పాయితానన నలినప్రసన్నమౌళి
నిర్ఘరితవాఙ్ముఖోక్తి నిర్ణిద్రబుద్ధి
వెలుఁగుశంకరుఁ గని జనుల్ విమలు లైరి. 112.

క. సకలార్థతత్త్వవిత్తా
ధికుఁ డయ్యును శాస్త్రవిహితదృఢతరభక్తిన్
బ్రకృతోపచారముల జన
నికి ముద మిడు నాతఁ డతివినీతి పొసంగన్. 113.

గీ. శంకరునకు శరణ్యము జనని యామె
కగు శరణ్యము పుత్రుఁ; డన్యోన్యయోగ
విరహ మెంతయు దుస్సహం బిరువురకును
సన్నిధానము త్రిజగతీశాసనమ్ము. 114.

శా. విద్యావంతుఁడు బుద్ధిమంతుఁడు గుణాన్వీతుండు పూతుండు సం
పద్యుక్తుండు పరిమాపదాంబుజయుగీభక్తుం డటంచున్ గృహ
స్థోద్యోగంబు ఘటింపఁ గన్యలఁ గులీనోత్తంసు లీ రాఁగఁ ద
ద్విద్యామూర్తి గొనంగ నొల్లఁ డసటన్ వేరిలుంచు టేలా యనన్.

శంకరుని పెండ్లాడు మని తల్లి కోరుట.

శా. ఆ యార్యాంబిక యొక్కనాఁడు సుతు నత్యాసక్తిమై డాసి "బి
డ్డా! యేనెల్ల సుఖంబు లొంద నిఁకఁ గోడల్ వచ్చు టెన్నండో? యీ
కాయక్లేశము లెంతకాలము పడంగా నుండెనో? కాని నా
కాయుష్యంబు నశింపకుండె, నన వాహా పెండ్లిమా టెన్నఁడున్. 116

క. నీ వెంతో విద్య నేర్చి శు
భావహవిధిఁ బెండ్లియాడి యాలును బిడ్డల్
సేవింప వరలుతఱిఁ గనఁ
గావలె ననుకొనిన తండ్రి కనఁ డాయెఁ గదా. 117.

ఉ. వృద్ధను నేను నట్లు గతియింపక మున్న మదీయలాలసా
సిద్ధి యొనర్చి యింటను వసింపు సుఖంబుగ, నిప్పు డెందఱో
శుద్ధకులుల్ తనూజలను సుందరరూపలఁ బెండ్లి సేయువాం
ఛోద్ధతి వచ్చి చూచి చనుచుండి రిదే యదనయ్యె దానికిన్" 118.

చ. అని యిటు తల్లి పల్క విని యాత్మజుఁ డీక్రియఁ బల్కెఁ 'దల్లిరో!
వినిచితి నీమనోరథము వింటిని, బాలుఁడ నేఁడ పెండ్లియా

డ ననువె? పోశ్రద్వైతేమెటు కడంగుదునో యిపు డేమి పల్కుదుర్
వనటను గాంచు టేల? బలవంత మదృష్టము మదెట్టు లున్నదో. 119.

గీ. ఈశరీరబంధమ్మున కేవపడుచు
నుండ నొకబంధ, మామీఁద నొకటి, యిట్లు
బంధసందోహమునఁ జిక్కి బాధపడుట
కెట్లు మన సొగ్గఁ గనుచుండి యెల్లజగము. 120.

ఆ ఫలము వృంతమందు బద్ధమై వ్రేలుట
పాకదశకు వచ్చుదాఁకఁ గాదె
యవుల నీశ్వరుండె యగుఁగాక పడకుండ
నదుకఁగలఁడె వృతమందుఁ దల్లి! 121.

క. అని తన మనోభిలషితం
బునకు విరుద్ధముగఁ బలుకుపుత్రునిబోధం
బును గా దనఁజాలక య
వ్వనిత నిరుద్ధాశ్రువుల నవా క్కయి నిలిచెన్. 122.

శంకరునకుఁ గన్య నీయ నొక విప్రుఁ డేఁతెంచుట.

ఉ. అమ్మఱునాఁడ యొక్కవసుధామరుఁ డాతని నాత్మజన్ వివా
హ మ్మొనరింప బంధునివహమ్మును దోడ్కొని తద్బృహేందిరగే
హమ్మున కేఁగుదెంచి తనయాశయ మార్యను గాంచి చెప్పి త
త్సమ్మతి శంకరాంతికము చయ్యనఁ జేరి కనంగ నయ్యెడన్. 123.

సీ. ఆసీనుఁ డయ్యెఁ గుశాసనమ్మందుఁ బ
ద్మాసనబంధదార్ఢ్యమ్ము మెఱయఁ
దాల్చె వక్షమున రుద్రాక్షమాలికలతో
విలసిల్లు జన్నోపవీతములను

దృఢముగాఁ దీర్చి సతిస్వచ్ఛభసిత తి
ర్యక్త్రిపుండ్రములు వెల్గుచునొసంటఁ
గౌపీనమును మౌంజికటిబంధము వెలుంగ
నలరె స్మితాంచితాస్యంబుతోడఁ
గీ. జుట్టుకొని భక్తి మీఱ శిష్యులు పఠింప
శాస్త్రముల నేకతాయనస్వాంతుఁ డగుచుఁ
జెప్పుచుండె శంకరసుధీసింహుఁ డరయ
దుస్సహం బయి బ్రహ్మతేజస్సు పొలయ. 124.

శా. ఆవిప్రేంద్రుఁడు బంధువుల్ హితులు దా మంతంత గూర్చుండి నీ
రావప్రక్రియ నాలకింప నిటు శాస్త్రప్రోక్తదుర్భేదస
ద్భావంబుల్ వివరించుచుండెను సుధాధారల్ విడఁ బాఱ నం
తేవాసివ్రజసంశయచ్ఛటలు శాంతింపఁ బటాపంచలై. 125.

గీ. వింటిరే జీవుఁ డారీతి వెనుకభవము
లం దొనర్చిన పాపపుణ్యప్రభేద
కర్మ మనుభవించుచునుండుఁ గాయ మాది
మమత వహియించి యదె సాధనముగ నకట. 126.

గీ. అది ప్రబోధసుధాకరమందు దేహ
నిందనప్రకరణము నుండి, వచింతు
విషయనిందాప్రకరణమ్ము వినుఁడు శ్రద్ధ
ఘోరభవవారిరాశిసంతారకంబు. 127.

ఆ. వెంగలీఁడు దేహి విషయజకర్దమ
మార్జనమ్ము ప్రాలుమాలి మఱచుఁ
బడు గృహస్థధర్మపంకమ్మునఁ దుర
దృష్టదృష్టి విరసవృత్తి యగుచు. 128.

ఆ. ఆలు రూపహీన యగునేని నరునకు
సంతకంబె దుఃఖ మనుచుఁ గలదె
యమితరూపయుక్త యగునేని దనకుఁ గా
కన్యపురుషవశము నందుఁ గాదె. 129.

ఆ. బిచ్చగాఁడొ బంటొ నెచ్చెలియో పర
పురుషుఁ డెవఁడొ కాని యరయు సాభి
లాషదృష్టితోఁ విలక్షణోదారరూ
పవతియేని భార్యవంక నెలమి. 130.

క. తనభర్తకంటె నాసే
చనికాంగుని బురుషు నన్యుఁ జాన యరసి నె
మ్మనమున వానిని వెదకదె
మనమునఁ బురుషుండు పరరమణి వెదకునటుల్ 131.

ఉ. ఆగతి మంజురూప యగు నాలిని జూచి ప్రతిక్షణంబు కో
పాగతిక్షీణుఁడై బలిభుగంతరపాతిబలిక్రియన్ సుఖా
భోగతిఁ బొందఁ, డా చెలియు యేతరిమై తనయూర్జ మీఱుచో
నాఁగద వైరి మించినది, యన్యుల గోరున దేసి యేమనన్. 132.

క. అనిపలికి దీనిపై వ్యా
ఖ్య నొనర్తును విపులముగ సమాకర్ణింపుం
డని కాంతాగర్హణ మొన
సినభణితమ్ముల నుపన్యసించె నిటువలెన్. 133.

మ. జననం బాదిగఁ జచ్చునందనుక పీసంబేని సౌఖ్యం బెఱుం
గనిజీవుండు దురాశఁ జిక్కుకొని సౌఖ్యభ్రాంతి నాలంచు నం
గన నొర్తున్ గళమందుఁ గట్టుకొని పంకంబందు నిర్మగ్నుఁడై
వసటం జెందుచు దిక్కుమాలి కృశుఁడై వర్తించు దీనంబుగన్.

గీ. సకలశాస్త్రార్థసారవిజ్ఞాతయేని
లేమ వాల్జూపులకుఁ జిక్కి లేడిపిల్ల
వలె ననుగమించుఁ గాని గెల్వంగ నేరఁ
డని వయస్యులతోడఁ బ్రహ్లాదుఁ డనఁడె? 135.

చ. పరమరహస్యముం దెలియఁ బల్కెడ నెంతటివిజ్ఞుఁ డైన సుం
దరియుఱిగుబ్బచన్గవ గనంబడునంత మనోజశక్తి రూ
భరవికలాత్ముఁడై సుకృతపాపవిభేదవిహీనుఁడై వశీ
కరణవృథాప్రయాసమునఁ గాఱియపాటు వహించు నిస్సిరో. 136.

క. మూత్రపురీషాసృక్కృత
పాత్రములం దేమి సుఖము ప్రాప్తించును స్త్రీ
గాత్రమ్ము ముక్తివల్లీ
దాత్రం బని యెంచి బుధుఁడు దలఁగి చనవలెన్. 137.

శా. భిక్షాన్నాదనుఁడై యొకోకడ సుషుప్తిం జెదునవ్యగ్ర కం
జాక్షిం జేకొనుటాదిఁ దృప్తి యగునిద్రాహానముల్ లేక చి
త్తక్షోభంబున నిత్తినద్గృహబహిర్ద్వారంబులం జిక్కి త
ద్వీక్షాప్రాప్తికి మోక్షలక్ష్మికిఁ జెడుర్ విజ్ఞానవిభ్రష్టుఁడై. 138.

క. "సంసృతిలతికాకందము
హంసగమన దాని కాస నందనివాఁడే
హింసలఁ గాంచఁడు ముక్తవ
తంసుం" డని బలి యనండె దామోదరుతోన్. 139.

గీ. పుత్రకేదారధనధాన్యశత్రుమిత్ర
భావములకు నిదాన మజ్ఞాతనయన
దాని నొక్కత విడువ నేతత్సమస్త
చింతలు నశించు నాశ్రయాసిద్ధివలన. 140.

సీ. లాలాంబుఝ్ఝరపరిప్లావితం బగు లేమ
మోవి యె ట్లమృతంపుబావి యగును
మసృణచర్మచ్ఛన్నమాంసగేందుక మైన
సతికుచం బెటు సుమస్తబక మగును
సంకులాంత్రాబద్ధకంకాళ మగుచెలి
దేహ మెట్లు మెఱుంగుఁదీఁగ యగును
దూషికాబాష్పసందోహప్రసవ మైన
చానకన్నెటు సరోజాత మగును
గీ. అహహా! పాదాదిశీర్షపర్యంత మరయఁ
గుణలవము గోచరము గాని కొమ్మఁ గాంచి
పురుషుఁ డాసాస వెంబడి పోవు టెన్నఁ
గామినీమూత్రగర్తసంగతికిఁ గాదె. 141.

క. అని యిటు శిష్యులమనముల
కును హత్త నుపన్యసింపఁ గూర్చుండిన వా
రనుమానించుచుఁ బరిణయ
మనఁజాలక యతనిసత్క్రియలఁ జేకొంచున్. 142.

ఉ. సంబర మెల్ల డిందువడఁ జల్లఁగ వారలు సేరవచ్చి యా
ర్యాంబకు నయ్యుదంతము సమగ్రముగా వినిపించి జన్మప
త్రంబును బుచ్చుకొంచు విశదంబుగ నయ్యది చూచి లేశమా
త్రంబు ముదంబు చూప రధరంబు మెదల్పర మిన్న నూచుచున్.

శంకరుఁ డల్పాయు వని తల్లి విలపించుట.

చ. అది గని యాసుధీజనని యాత్రముతో "నది యేమి తంత్రులా
ర! దయ వహించి చెప్పరె చిరంబుగ నాయువు గల్గి సర్వసం
పదల మదాత్మజాతుఁడు శుభంబులఁ బొందునె" యంచుఁ బల్క న
మ్ముదితభయంబుఁ గాంచియు నమోఘవచస్కుఁడొకండుదా ననున్.

సీ. చదువు నీతఁడు వేదశాస్త్రముల్ సరహస్య
మఖిలవిద్యలు నేర్చు నరయుమాత్రఁ
బాండిత్యసామ్రాజ్యపట్టాభిషిక్తుఁడై
యెదురు లేక జగంబు లేలఁగలఁడు
యశముచే సర్వదిగంతవిశ్రాంతుఁడై
పరిపంథితతిఁ బాఱఁబాఱఁ దఱుము
జ్ఞానామృతమ్ము పైఁ జల్లి సంసృతికర్ద
మోద్విగ్న మగులోక ముద్ధరించు
గీ. శాశ్వతగ్రంథరచనావిశారదుఁ డగుఁ
జక్రవర్తిత్వమో లేక సంన్యసనమొ
యొందునట్టిమహారాజయోగ మెనసె
నన్నియును లెస్సకాని యే మందు నమ్మ! 145.

ఆ. అనుచు నంగుళమ్ములను లెక్కయిడి యుత్త
మాయు వరయ, మధ్యమాయువేని
గానరాద, యని సగంబు సగంబు మ్రిం
గుచు వచించె నామె క్రుంగి పోవ. 146.

ఉ. ఆద్విజుఁ డాప్తబంధుయుతుఁడై చనె వచ్చినత్రోవఁబట్టి; యా
పద్విచలన్మనోబ్జ యయి పైదలి యంతట వంత మున్గ, యా
వద్విషయంబు శంకరుఁడు వచ్చి యెఱింగి సవిత్రిఁ బల్కు సం
విద్విభవాభిరామపదవీలలితోక్తుల శాంతియుక్తులన్. 147.

మ. జననీ యిట్టు లకాండశోకమును గాంచన్ ధర్మమే? కర్మమే
మని శాసించినఁ దప్పునే ప్రబలవాతాఘాతనిర్ధూతకే
తనచీనాంశుకకోటిచంచలము గాదా దేహ? మేమూర్ఖుఁడున్
గనునే సుస్థిరబుద్ధి దానియెడ వక్కాణింపు శా దన్నచోన్. 148.

క. సుతు లెందఱు సతు లెందఱు
గతజన్మంబులను బొందఁ గంటివొ నీ కా
సుతసతు లిపు డుండిరె సం
సృతిసంగము పాంథసంగ మే కద జననీ. 149.

క. ఉపచయగతి దేహంబై
యపచయగతి నదె శరీర మౌ నని బుధు లం
దుపచయము నపచయం బీ
ప్రపంచమున సంతతప్రవాహములు గదా. 150.

ఉ. ఈనవరంధ్రముల్ గలమెయిన్ బవనం బెటు లిన్నినాళ్లు దా
నై నిలువంగఁ జాలె నని యచ్చెరు వొందఁగ నేమి గాక యే
దే నొకఛిద్రమందుఁ బడియేఁగుట చోద్యమె? యిన్నియున్ గృతాం
తాననపంక్తిగాఁ దలఁపుమా వలపున్ విడునాఁడు దీనిపై. 151.

క. మృతియే దేహంబునకుఁ బ్ర
కృతి యని జీవించుటే వికృతి యనియు మహా
మతు లనుట వివేకించిన
ఋతము; జగద్విపరిణామ మెవ్వం డాఁపున్. 152.

క. నేఁడో రేపో మఱి యే
నాఁడో యీదేహవితతి నశియించుఁ గదే
నేఁ డైన ఖేద మిఁకొక
నాఁ డైన ముదంబు గలుగునా నాతల్లీ. 153.

గీ. మర్త్యులు శతాబ్దినడుమున మాఱిపోన
మర్త్యులు యుగాంతముననేని మఱియు వార
కాలమునఁ దారతమ్యంబె కాని మృత్యు
వొందనట్టివాఁ డొక్కఁ మృత్యుంజయుండె. 154.

చ. తరతర మాయమోహకు నమృతత్వనిదాను నుపాస్తి సేయ దు
స్తర మగుమృత్యువుం గెలువఁజాలుదు మంతియ కాని యిట్లు దు
ర్భర మగువేదనన్ బొరసి ప్రాణము గావఁగలారమమ్మ నీ
తర మగునేని నాకు నమృతత్వము గాంచ వరం బొసంగుమా. 155

క. విను మొకనుడి కైవల్యో
పనిషత్తు వచించు "నమృతభావము త్యాగం
బున నగుఁ; గర్మమునఁ బ్రజా
ధనములఁ జేకూర దనుచు ద్రఢిమ మెలర్పన్. 156.

శంకరుఁడు సన్యసింపఁ దల్లిని గోరి నిరాకృతుండగుట.

చ. భ్రమనశతన్ భవాధ్వమున బమ్మరిలన్ సుఖలేశసంగ్రహం
బమరదు సర్వసంగపరిహారముగాఁగఁ దురీయ మైనయా
శ్రమమును బూని శంభునిఁ బరాత్పరునిం భజియించి జన్మ మ
ర్థము గన నీయనుజ్ఞ నమృతత్వము గాంచఁ దలంతు నంబరో. 157.

మ. అని సంన్యాసజిఘృక్షుఁ దెల్పునుడు లల్పాయుష్కుఁ డన్మాటకం
బెను నిర్ఘాతనిపాతమై ధృతిగిరిన్ భేదింప ఖేదంబుతో
నను "నాతండ్రి యిదేటివాంఛితము? ప్రాణం బున్నయన్నాళు తే
ని నన్ గాచుచునుండకుండ నెటకేనిన్ బోదె సంన్యాసివై. 158.

గీ. మాను మీబుద్ధి, యాలింపుమా కుమార!
పూని గార్హస్థ్యమును, గాంచి పుత్రకులను,
జేసి క్రతువులఁ బొందు సంన్యాస మవుల,
నిదియ సత్సంప్రదాయ మం చెఱిఁగి కొనుము. 159

చ అకట! త్వదేకపుత్రిను గదా బ్రదుకంగలదాననే నిన్
వికలత వీడినేను మరణించినచో నెవరయ్య యౌర్ధ్వదై
హికవిధు లాచరించు రతివృద్ధ నన్ విడనాడిపోవుకో
రిక యెటు గల్గె, సర్వము నెఱింగియు నీకిఁయ జాలిమాలితే. 160

ఉ. నావుడు శంకరుండు కరుణంబుగ నేడ్చెడుతల్లిఁజూచి చిం
తావిలచిత్తుఁడై జననియంగద నెల్ల నిరస్తమోహ వా
చావిసరంబుచే నుడిపి సర్వవిధిజ్ఞుఁడు గాన నొంటిమై
భావమునం దిటుల్ తలఁపఁ బాల్పడె నెన్మిదియేండ్లయీడునన్.

గీ. సంసృతిని రోసె నామానసంబు మిపుల
విడఁవజాలక తల్లి తపించు నకట!
యెటులొ యొప్పించి చన నింత యెంతుఁ గాని
బుద్ధిఁ దలపోయ ధర్మవిరుద్ధ మిద్ది. 162

క. ఏయహఁము విరక్తుం డగు
నాయహమ పరివ్రజించు టది విధి యని యా
మ్నాయమ్ము తెలుపు టెఱుఁగనె
యీయమ యశరణ్య వృద్ధ యేడ్చుట కెంతున్. 163.

క. అని మనమున యత్యాశ్రమ
మును గొనఁగా నిశ్చయించి మోమున ఖేదం
బును జూపక సేవలఁ ద
జ్జనయిత్రిని దనిపెఁ దగ యథాపూర్వముగన్. 164.

ఉ. ఆయమ కోర భాగవతమందలిపుణ్యకథానకంబు లా
ప్యాయన మొప్పఁగాఁ జదివి యర్థము సెప్పి తదీయఖేదమున్
బాయఁగ దట్టె సమ్మదమునన్ హృదయాబ్జము పల్లవించి నా
రాయణనైకరూపచరితామృతసేచనపూరితంబుగాన్. 165.

సీ. జనకుఁ గా దని నృసింహుని జేరుప్రహ్లాదు
ననితరసామాన్య మైనభక్తిఁ
బసిపాపఁ డయ్యుఁ దపఃప్రతిష్ఠత ముకుం
దునిపదం బంటిన ధ్రువునిశక్తి

నిస్సంగుఁడై గోఁచినేని దాల్పక విరా
గకళావతార మహాశుకువిరక్తి
సంగదోషమున సారంగమై విప్రుఁడై
తరియించు నాజడభరతుముక్తి

గీ. సాంద్రమోదాశ్రురోమాంచజడిమఘర్మ
ముఖ్యసాత్త్వికభావసముద్రితాంగుఁ
డగుచు భాగవతపురాణ మంబకోఱకుఁ
జదివి వివరించె నారేయి శంకరుండు. 166.

క. భాగవతమందుఁ జదువువి
రాగులచరితములు హృదయరాజీవమునన్
మూఁగి యళులట్టుల మొరయ వి
రాగము ముప్పిరిగ దృఢతరంబై పొదలెన్. 167.

మ. "గురు వెవ్వం డగునో? లభించునొకో నాకున్ బ్రహ్మవిద్యాధురం
ధరభావ" మ్మనుచింత చేఁ గొడుకు "వృద్ధన్ నన్ను బోనాడి క్రి
చ్చఱ యత్యాశ్రమ మూనునేమొ సుతుఁ" డం చార్యాంబయున్ గన్నమా
యర యాఁరాత్రి, సుషుప్తికిన్ రిపులుచేతో నంతచింతల్ గదా. 168.

గీ. ఎట్టకేలకు నిద్రించి రిరువు రరుణుఁ
డుదితుఁ డౌతఱి లేచి శిష్యులను గూడి
శంకరుం డేఁగె నదికి సిస్నాసు వగుచు
సుప్త యగుతల్లి యింట నేడ్చుచును లేచె. 169.

చ. అటువలె మేలుకాంచి కలయన్ నలుదిక్కులు సూచి యింట నె
చ్చట సుతుఁగానలేక తనుసంధులు వీడఁగ ముక్తకంఠయై
యలమట నేడ్వఁ జొచ్చె నదియం దవగాహ మొనర్చుచున్నయ
వ్వటువులఁ గూడి శంకరుఁ డవార్యగతిన్ బఱతేర నింటికిన్. 170.

శా. ఆరీతిన్ హృదయంబు జాఱ నిది యే మమ్మాయటం చంబికన్
జేరన్ వచ్చుకుమారుఁ గౌఁగమున సంశ్లేషించి నాతండ్రి క
న్నారన్ నిన్ననఁగంటి, మంటి వెటు లవ్వా! డెందమింఁదాకఁ గం
గారై నీ రయిపోయెఁ బ్రాణము గళాగ్రప్రాంతమై యాడెడిన్. 171.

క. తనయా యది స్వప్నం బని
నినుఁ గని యనుకొనుచునుంటి నిజమనుకొని పొం
దినవగకు మేర గలదే
మనఁమా యతి వగుచునే నమందాయువవై. 172.

గీ. అనుటయుఁ విరాకు గదుర నయ్యనఘుఁ డాత్మ
నెట్టు లీయమ యిటు తెగియుంచెనో కొ
యనుకొనుచు నమ్మ దాని కే మల్లస్వప్న
మంతయు వచింపు మనుడు నార్యాంబ పలుకు. 173.

సీ. పరిపూర్ణవారినిర్ఘర మాచుఁ బూర్ణాత
రంగిణి మిన్నంటఁ బొంగినట్టు
లానదీపూరమం దవగాహ మొనరింప
నేను నీచేయూఁత నేఁగినట్లు
కటిదఘ్న మగునుదకముల నే నీరాడు
చుండిన ట్లీ వీఁదుచుం డినట్లు
వలదు రారమ్మని పలుమఱే నన్నట్లు
లీ వీఁదుచును లోని కేఁగినట్టు
గీ. లంతలో నీపదాగ్ర ముగ్రాకృతి యగు
నొక్కమకరంబు పట్టిన ట్లుపతపించు
చనుమతింపు మిష్టేని సంన్యాసమునకు
నంచు బల్కిన యటు కలయందుఁ గంటి. 174.

ఉ. కొండయె మాళిఁ గూలినటు కొండొక నిల్చి తపించు చెంతరా
గుండియదానినో కద యొకొండు వచింపక మిన్నకుండ న
ఖ్ఖాండములన్ బుటుక్కు మని కన్గొనుచుండ మునింగి లేచి నా
కొం డన కానతీవె యని యుక్కటి మున్గినయట్లు గానరాన్. 175.

ఉ. కోరిక దీఱకుండఁ బ్రతికూలమృతిన్ గన నేల తండ్రి నీ
కోరిన యాశ్రమంబె కయికొంచు సుఖంపడుమంటిఁ గాని వాః
పూరమునంద మాయమయి పోఁ గని యక్కట పుత్త్రి మిన్గితిన్
గోరిక దీర్పనైతి నని కుందుచు నెవ్వఁడు గానగామికిన్. 176.

ఆ. అమ్మ చఱచుకొనుచు నెమ్మోము నొదల
మోదుకొనుచు బాష్పపూరమగ్న
నగుచుఁ దీరభూమి నడలుచున్నటు పాడు
గలను గంటి మేలుకంటిఁ దుదకు. 177.

క. మేలుకొని యేడ్చుచు నెనలు
మూలలు గృహ మరసి నీదుపోఁడిమి గనమిన్
గాలుం గే లాడక యిలఁ
గూలితి నే మందు నిన్నుఁ గోల్పోయినటుల్. 178.

క. అని యేడ్చుచుఁ గంఠము వీ
డనిజనని మొగంబు నిజపటంబున నొయ్యొ
య్యన నొత్తుచు నిటు లను, న
య్యనఘుఁడు దైవంబుచేఁత కబ్బురపడుచున్. 179.

శా. తల్లీ! యేటికి శోక మొందెదవు నాదైవమ్మ నీస్వప్నమై
తెల్లం బౌనటు తెల్పెఁ గాంచుము స్రవంతీరూపసంసారమం
దుల్లోలంబుల దుస్స్పృహామకరక్రీడోత్పాతినై మున్గి యా
పల్లుప్తాసువు గాఁగ నుంటి ననుభావం బందు దీపింపదే. 180.

శంకరుండు సన్యసించుట.

క. అని జననీభుజబంధం
బున నే భవబంధ మూడిపో సంన్యాసం
బును మానసికముఁ గొనె నొ
య్యన "సంన్యస్తం మయా" యటంచు రయమునన్. 181.

ఆ. తెల్లఁబోయి తల్లి యుల్లంబు జల్లన
నెంతపని యొనర్చి తింతలోన
శోకవశత నంటెఁగాక నీవిప్రయో
గంబు సైఁపఁగలనె కన్నతండ్రి! 182.

శా. నా కెవ్వా రిఁక దిక్కు పుత్రక! నినున్ గాపాడి నీప్రాపునన్
జేకొందున్ సకలోపచర్యలు జరాజీర్ణాంగి నై నప్పు డం
చాకంఠంబుగఁ గోరుకుల్ గలిగి కాదా నాఁడు నీతండ్రితోఁ
బోకున్నా; నెటుగాక యుండ నడవిన్ బోఁ ద్రోసి పోనుంటివే. 183

క. శారీరపాటవముతోఁ
ధీరతయుఁ దొఱంగె నిట్టిదీనావస్థన్
భారము నీకే యగు నెడ
నేరికిఁ గాకుందుఁ దండ్రి యేర్పడఁ జెపుమా. 184.

క. నా విని యామాటలకుం
భావము చలియింప కతఁడు పల్కెను మమతా
భావ మభావ మ్మయి చెడ
నేవంవిధమధురమృదులహితభణితములన్. 185.

ఉ. ఏల విలాప మొంద జననీ! భవ మీఁగి బయల్పడంగ? నా
భీలదవానలార్చిరభివేష్టితవాసనికుంజనిష్క్రమో
ద్వేలభయాకులైణముగతిన్ మన మల్లల నాడిపోవ, నె
వ్వేళనొ సంన్యసింప కెటు వీటిడినై చెడఁజూతు నెంచుమా. 186.

క. కలలో ననుజ్ఞ యిడు ట
వ్వాలఁ బెట్టుము నన్నుఁ గాంచి పలుకవె 'యతివై
యిల బ్రతుకు', మనుచు నిప్పుడు
కలఁగెద వేలమ్మ పోవఁగా నే నుండన్. 187.

గీ. పుత్రుఁ డనెడివ్యామోహమ్ము పొందుకతన
నింత దుఃఖింతు గాక యొకింత తత్త్వ
మరసి యిటు సంన్యసించునా కర్తృకృత్య
మెదియొ శాసింపు మఖిలమ్ము నెఱుఁగు దీవ. 188.

శా. నీదేహంబు రుజావశం బగునయేనిన్ గాతు రర్హోపచా
రాదిన్; మృత్యువశంబ యౌనెడ యథార్హప్రక్రియన్ సంస్కృతుల్
ఖేదం బెంచక చేయువారలు ధనాప్తిన్ సత్ప్రజాభీతి దా
యాదుల్ వీరలు, నమ్మ యింక భయ మేలా నీమదిన్ దల్లిరో.

క. రే యైనన్ బగ లేనియు
నేమెడఁ గానిమ్ము నీకు మృతి యొదవెడుచో
నామెడ నను మదిఁ దలఁచినఁ
బాయక యరుదెంచి పరమపద మొందింతున్. 190.

క. కొడుకు యతి యైనచో జనకులకు నంత్య
సంస్క్రియలు లేకయున్న మోక్షమ్ము కలుగు
నేదియో లోక మొంది యం దెల్లపుణ్య
మఱిన భువిఁ గూలుపీడ నీ కమ్మ యేల? 191.

గీ. విధవ ననదను నను నింట విడిచి సుతుఁడు
సంన్యసించెనె యని క్షంతఁ జనదు నీకు
నిచట నే నున్న నీ వొందు దెట్టిఫలము
దానికి సహస్రగుణఫల మ్మానఁగలవు. 192.

చ. అని జననిన్ వచించి వినయంబున జ్ఞాతులఁ బిల్చి సంన్యసిం
పను గడుదూర మేఁగెద సమస్తము మత్పితృవిత్తమున్ గ్రహిం
చి నెనరు పూని వృద్ధదశఁ జెందు యనాథగ నున్నకన్నత
ల్లిని నరయుండటంచు ముకుళించినకేల్గవ వేడి యెంతయున్.193.

గీ. అనఘుఁ డాతండు మమత నహంత వీడి
బాష్పపూరమ్ము లొలుకు నంబను దదీయ
నికటమునఁ బెట్టి జనని సంతృప్తిపఱచి
సవిధవిష్ణ్వాలయము సేరఁ జనియె భక్తి. 194.

చ. చని యదునందనాంఘ్రిజలజంబులకుం బ్రణమిల్లునంత నొ
య్యన యశరీరవాణి విన నయ్యె "భవజ్జననీహితార్థ మా
జనపతి దెచ్చుని మ్రటినిసారణి భంగము లీతటంబు భే
దనమొనరించె దేవళము తప్పక కూలు" నటంచు బోరునన్.195.

శా. ఆశ్చర్యంబున మున్ని కేరళనృపాలాగ్రియు రాఁ బాచి "చే
తశ్చింతాపరిపూరకుం డగు ముకుందస్వామి నీ; తాపగాం
భశ్చంగచ్చటులోర్మిభగ్నతటసంవాసాతిబిభ్యత్తనం
తశ్చింతల్ దొలఁగన్ స్థిరంబుగ గుడిన్ గట్టింపు మోభూవరా.196.

క. అనుడు ముని త దాదేశం
బునఁ గ్రతు వొనరించి కామమును బడసిన యా
జనపతి యప్పుడ కట్టిం
చె నబాధక మైనచోట శ్రీహరికి గుడిన్. 197.

వ. అంతదాఁక శంకరుం డద్దేవళంబునను ముకుందు నుపాసించుచు నిలిచియుండి నిజకరంబుల నాకృష్ణవిగ్రహ ముద్ధరించి మూపున భరించి తెచ్చి నూతనాలయమునఁ బ్రతిష్ఠించి చిరంబు సుఖంబుండు మని ప్రార్థించె నంత. 198.

క. జగతీసముజ్జిహీర్షుం
డగు పుత్రుచరిత్ర మరసి యార్య యవిద్యన్
డిగ విడచి యనుమతించియు
వగ పొందును మరల మాతృభావమ్రదిమన్. 199.

గీ. తల్లిచే యదుకులదైవతంబుచేత
నతఁ డనుజ్ఞాతుఁడై భవ మంద రోసి
సంన్యసింప సుమారము చనఁ దలంచె
నాస్థితుం డెంచునే యబ్ధినడుమ దుముక. 200.

శంకరుఁడు బ్రహ్మోపదేశము గోరి యేగుట.

క. ఈరీతి మాతృమాధవ
కారుణ్యము వడసి విగతకామ్యార్థుండై
కూరిచి మదిఁ గృష్ణపదాం
భోరుహముల నతఁడు గేహమును విడిచి చనెన్. 201.

గీ. రూఢిఁ దైర్థియఁబ కాపరరూపుఁ డతని
యెదుటఁ గాముఁడు నిలువలేఁ డింత యనిన
నమ్మహానుభావున కెట్టు లంటుఁ గామ
మూలసంసారపాశబంధా లొకింత. 202.

ఉ. మున్ను విధుండు ధాత స్మరమోహితుండై చని రుత్పథంబునం
దున్నన మోహినీకచకుచాదుల నేనును గాంచి వెంబడిన్
సన్నకసన్నఁ బోతి నని శంభుఁడె నేఁడు స్మరార్తివార్త కా
సన్నుఁడు గానిభిక్షు వగు జాడ నకాముఁ డతండు రంజిలెన్. 203.

క. సురపూర్వామరవిద్యా
ధరనరగంధర్వులకు మదం బడఁచె నుశం

బరవైరిం గెలిచిన శం
కరుఁడు మునిస్తుత్యుఁ డగుట కనఁ జిత్రంబే. 204.

మ. ఎట వైరాగ్య మతండు ము న్గనెనొ కానీ, శాంతికిన్ లోఁగె హృ
త్పుట, మడ్డెన్ గమనాదికక్రియల సొంపున్ దాంతి, పాటించె వి
స్ఫుటమౌక్షాంతిమృదుత్వ, మయ్యుపరతి న్బ్రోయెన్ హృషీకార్థసం
ఘటనా, బింక సమాధి ధ్యానవితతౌత్కంఠ్యమ్ము చేకూరిచెన్.

ఉ. తీఱని వేడుకన్ విధివితీర్ణకృతాత్మతనుస్థితిన్ గృహా
దారమమత్వమున్ విడిచి తత్పరతన్ శివు నిల్పి మానసా
ధారమునందుఁ దా విజనతాలలితాయన మౌనపూరితా
పారముదంబునన్ జనియె భారము దూరము నాక యెక్కటిన్. 206.

గీ. పోవుచును మార్గమున వనమ్ములను నదుల
నగపురగ్రామనివసజ్జనంబు గనుచు
బ్రహ్మమే యైంద్రజాలికుపగిది నద్భు
తేంద్రజాలము సూపు నం చెన్ను మదిని. 207.

గీ. దండితాఖిలకాపథమండలుఁడు జ
గద్గురుఁడు దండ మూనెను గరమునందు
వాదినివహంబు నిజనిజాధ్వముల కీడ్చు
నలజరద్గవిఁ దన త్రోవ మెలఁపుకొఱకు. 208.

శా. దండం బూని యతండు కావనియెడన్ దైన్యంబునన్ వైదికుల్
కొండల్ పట్టరె విశ్వకద్రుతతి లేఖ్యంబో లె? నుచ్ఛృంఖలా
ఖండాహంకరణాన్యమర్మవిభిదాకండూలజిహ్వాగ్రపా
షండాఘాతము నొంది కుందుచును బెల్చన్ గాందిశీకాత్ములై. 209.

శంకరుఁడు గోవిందయతికడ కరుగుట.

ఉ. ఇఁదుభవానదీతటి రహించుచు శాంతినిశాంత మైనగో
విందయతీంద్రునాశ్రమనివేశముఁ గావులు దాల్చి మైఁ, గరం
బం దొకదండ మూఁది కదియం జనె శంకరుఁ డస్తశైలమా
శిం దివసావసానమున లీల ఖరాంశుఁడు చేరె నయ్యెడన్. 210.

గీ. తటకుజాయాతవాతపోతముల సేద
యణఁగ నాతఁడు ధృతవల్కలాజినవిట
పములఁ దరువులు మునులవాస మని తెలుపఁ
గనియెఁ గోవిందయతితపోవనము వేడ్క. 211.

గీ. ఆయతీంద్రునియుపదేశ మందఁగోరి
యచటియతు లెల్లఁ దెలుప నాయనఘుఁ డెఱిఁగి
యరసె బ్రాదేశమాత్రవివరము ద్వార
మైనగోవిందసాధుగుహాలయంబు. 212.

క. ఆరసి ప్రసన్నసమ్మద
కారి యగు యతీంద్రుగుహకుఁ గావించెను ము
మ్మారు ప్రదక్షిణనతు లటఁ
జేరి మునులు వినఁగ వినుతి సేసెను భక్తిన్. 213.

క. పక్షీంద్రధ్వజుపా న్పయి
త్ర్యక్షుపదాంగదము నై సహాబ్ధిధరణిభృ
త్కక్షితిఁ దలఁదాల్చు మహో
చక్షుశ్శ్రుతినాథరూపు సన్మునిఁ గొలుతున్. 2.4.

గీ. నిజసహస్రముఖీతూర్జనితభయమునఁ
బఱచిరే శిష్యు లని దానిఁ బాసి యేక

వదనమున శాంతుఁడై శిష్యపటలిఁ బోవ
నిల జనించు పతంజలి వీవ కావె. 215.

ఉ. అల్లపతంజలిన్ గొలుచునప్డు ప్రమాదము సేసి శప్తుఁడై
కల్లరి రక్కసుం డగునొకానొకపండితుఁ గొల్చి భాష్యముల్
గోళ్ల వటద్రుపత్త్రములకోటి లిఖించియు లేఁగ మేయుటన్
జిల్లులు వోవఁ బూరణము సేసి మహిన్ వెలయింతు వీవకా. 216.

గీ. అవనివివరమునని యధోభువన మొనసి
తన్మహాభాష్యమును యోగదర్శనమ్ము
శేషఫణిసన్నిధిని విమర్శించి వసుధ
వితత మొనరింపవే జగద్ధితము గోరి. 217.

ఉ. వ్యాసతనూజుఁ డౌశుకమహామునిశిష్యుని గౌడపాదు నా
యాసము రోసి కొల్చి పరమార్థ మెఱుంగువిస్పృత్వరప్రభా
వాసము శాంతివాసము దయాంబుధి నిన్ను భజించి బ్రహ్మసం
స్థాసుఖ మొంద నీచరణసన్నిధిఁ జేరితి నంచు భక్తితోన్. 218.

మ. అనఘుం డాతఁ డిటుల్ నుతింపఁగఁ దదీయాదృష్టశక్తిన్ సమా
ధినిరుద్ధస్థితి వాసి చిత్త మలరన్ దెల్వొంది 'యెవ్వాఁడ వీ'
వను గోవిందయతీంద్రుఁ బ్రాగ్జననపుణ్యవ్రాతజాతాత్మబో
ధనసంసూచకమైనవాక్కుల ననెం దాంతుం డతం డీక్రియన్.

ఉ. కాను ధరిత్రి, నంబువులు గా, ననలంబును గాను, వాయువున్
గాను, నభంబు గా నెపుడు, గా నిఁకఁ దద్గుణముల్, హృషీకసం
తానము గాను, వాని కెడదవ్వగుచున్ బరమత్వసంపదన్
బూను శివుండ నేను బరిపూర్ణపరాత్మవిబోధసుందరా! 220.

గీ. అనుచు నద్వైతదర్శనజనితము లగు
శంకరోక్తుల గురుఁడు హర్షంబు చెంది
'కంటిని సమాధిదృష్టి శంకరుఁడె భువిని
నవతరించెఁ ద్వదాకృతి ననుచు వత్స. 221.

క. అని చరణములు గుహాముఖ
మునఁ జూపఁగ శంకరుండు పూజించినతో
డన యాచార మిదియ యని
యనఘుం డుపదేశమిచ్చె నాశిష్యునకున్. 222.

క. పరమాత్మ నెఱిఁగి యుండియు
గురుశిష్యులసంప్రదాయగుప్తికినై శం
కరుఁ డాత్మవిద్యఁ గన న
గ్గురునకు శుశ్రూష సేసి కూర్చెను దృప్తిన్. 223.

— గోవిందయతి శంకరునకు బ్రహ్మోపదేశము సేయుట —

గీ. భక్తిపూర్వాచరిత తత్సపర్యలకును
ముదితుఁడై యుపదేశించె సదమలాత్ముఁ
డై నశంకరునకుఁ జతురాగమాంత
గతమహావాక్యముల నిట్లు యతివరుండు. 224.

'ప్రజ్ఞానం బ్రహ్మ'

గీ. కాంచ విన మూరుకొనఁగ బల్కఁగ రుచుల
సఁగతి యెఱుంగఁ జాలుప్రజ్ఞాన మేది
తనకు; నదె బ్రహ్మ మనునర్థమును వచించు
ఋఙ్నిగమశేఖరోక్తి యెఱింగికొనుము. 225.

'అహం బ్రహ్మాస్మి'

గీ. ఆత్మవిద్యాధికారి దేహంబునందుఁ
బూర్ణ మగుబ్రహ్మ 'మే' యనుబుద్ధిఁ బూని
సాక్షి యగు, నయ్యదియ బ్రహ్మసంజ్ఞ మనుయ
జుర్నిగమశేఖరోక్తి నెంచుము మనీష. 226.

'తత్త్వమసి'

గీ. తత్పదార్థంబు బ్రహ్మమ్ము, త్వంపదార్థ
మజ్ఞుఁ డగుజీవుఁ, డది యైతి వనుచు నైక్య
మును ఘటించెడి 'అసి' యని వినుచు సామ
వేదశేఖరవాక్యంబు వినుము దెలియ. 227.

'అయ మాత్మా బ్రహ్మ'

*గీ. స్వప్రకాశాపరోక్షత వరలునదియ
యాత్మ యనఁగ నహంకార మాదిదేహ
మవధి యగుదానికంటె వే ఱగును బ్రత్య
గాత్మ యనియె నథర్వవేదాంతసూక్తి. 228.

వ. అని మహావాక్యచతుష్టయం బుపదేశింప శంకరునకు నం దార్ఝం బగు 'ప్రజ్ఞానంబ్రహ్మ' యను మహావాక్యముచే 'అథాతో బ్రహ్మ జిజ్ఞాసా' యని బ్రహ్మమ్మునం దఖిలవేదాంతములకుఁ దాత్పర్యప ర్యవసానంబు వర్ణించిన వైయాసకసూత్రగ్రంథమందలి ప్రథమా ధ్యాయ మంతయుఁ గరతలామలకంబయ్యె. యాజుషంబగు "అ

*గీ. స్వప్రకాశము ప్రత్యక్ష మప్రమేయ
మయి యహంకార మాది దేహాంత మైన
దదె 'యిది' యనఁగ వెల్గు బ్రహ్మం' బనెడున
థర్వవేదావతంసోక్తి తత్త్వ మెఱుగు.

హం బ్రహ్మాస్మి" యను మహావాక్యమున నహంకారోపలక్షితం
బగునాత్మకు బ్రహ్మత్వవిధానమునెడఁ గలుగువిరోధముల నెల్ల
సర్వప్రమాణావిరోధముగా వారించి సమన్వయించిన ద్వితీయా
ధ్యాయ మంతయు హృద్గతంబయ్యె. సామవేదోదితమగు 'తత్త్వ
మసి' మహావాక్యమునందున జీవబ్రహ్మభేదంబునకు సాధనం బగు
తృతీయాధ్యాయ మంతయు ముంజేతికంకణం బయ్యె. మఱియు
నాథర్వణం బగు 'అయ మాత్మా బ్రహ్మ' యను మహావాక్యము
వలన నిత్యాపరోక్షం బగుప్రత్యగాత్మకు బ్రహ్మత్వంబు చెప్పి య
విద్యాధ్వంసన మొనర్చు చతుర్థాధ్యాయమందలి యర్థ మెల్ల
విస్పష్టం బయ్యె నిట్లు. 229.

గీ. సాంప్రదాయికవ్యాసవిజ్ఞాతృసూక్త
సూత్రమతగతి ననుసరించుటఁ గృపాళు
వైన తన్ముని శాస్త్రగూఢార్థజాత
మిద్ధగతి శంకరుండు సూక్ష్మబుద్ధి నెఱిఁగె. 230.

సీ. నారాయణునకు మున్ నలినగర్భుండు పుట్టె
నతఁడు గాంచెను వశిష్టాఖ్యమౌని
నతనికి శక్తి నా సుతుఁ డుద్భవించెఁ గాం
చెను బరాశరుని నమ్మునివరేణ్యుఁ
డతనికిఁ గల్గె సత్యవతియందు వ్యాసుఁ
డామహర్షికి సుతుఁ డయ్యె శుకుఁడు
శుకమహామునికి శిష్యుఁడు గౌడపాదుఁ డా
తనికి గోవిందనాథర్షి శిష్యుఁ

గీ. డట్టిగోవిందయతిశిష్యుఁ డై పఠించి
వడసెఁ బాతాళగతఫణిపతికటాక్ష

సముపలబ్ధమహాశబ్దశాస్త్ర మెల్ల
గురుకటాక్షమ్ముకల్మి శంకరుఁడు తాల్మి. 231.

గీ. ఇటుల ప్రాగ్జన్మపుణ్యసుఘటము నున్న
తంబు హంసాదికార్చ్య మాస్థాన మైన
యంతిమాశ్రమ మాశంకరార్యుఁ డొంది
వెలిఁగె నౌత్తానపాది రంజిల్లెడుపగిది. 239.

ఆ శ్వా సాం త ము.

ఉ. అర్దితదుర్దమాచలభిదాత్మజశౌర్య! యజర్యసాదిసా
హార్దవివృద్ధదోర్బలపరాస్తకణేహతికర్తృధూర్తహృ
ద్దుర్దశవక్త్రముఖ్యసురదుర్వ్రాదనీక! కబంధదోర్యుగీ
నిర్దయమర్దనోద్వమితనిస్తటశక్త్యనలాహుతాశరా!

క. మాయామానుష! మాని
ధ్యేయానాద్యంతరంతతేజా! త్రిజగ
ద్గేయా! యాదరవేంకట
రాయామాత్యాత్మరాగరంజితచరణా!

పృధ్వీవృత్తము. త్రయీశిఖరధర్మహర్మ్యతలరోచమానాకృతీ!
వ్యయీకృతసుకేతుపుత్త్రీసునమీరణోదీరణా!
భయంకరగతిస్ఫురత్పరశురామగర్వఘ్న
స్మరోపశమహేతునివృత్తివిధానరఘుంరఘూనిలా!

ఇది శ్రీ గురుకరుణాసమాసాదితకవిత్వ 'కవితాభూషణ, విద్వ
త్కవిశేఖర' వెంపరాల సూర్యనారాయణనామధేయ
ప్రణీతం బైన శంకరవిజయంబున
ద్వితీయాశ్వాసము.

శ్రీగురుమూర్తయేనమః.

శ్రీ శంకర విజయము.

తృతీయాశ్వాసము.

శ్రీప్రియ! యాదరసుబ్రా
హ్మణశాంతరంగమణిసౌధవిహా
రప్రీణన! మాంత్రిత్రా
ణప్రీణితభావ! పూతనామా! రామా!.

వ. అవధరింపుము.

యత్యాశ్రమము స్వీకరించిన శంకరుని వర్ణనము.

క. యతిపతి యతం డలరెఁ గో
హితశాటీపల్లవాపిహితతనుఁడై యా
యతసంధ్యారక్తాంబుద
తతిసంఛాదిత తుషారధరకూట మనన్. 1.

గీ. మృడుఁడె తా నౌట నతఁ డబోధేభ మడఁచి
యుద్యదంభోజబంధు మయూఖరక్త
శాటికారుణ పల్లవచ్ఛద్మమునను
గళదసృక్పూర తచ్చర్మ మెలమిఁ దాల్చె. 2.

చ. శ్రుతులకుఁ బూవుఁదోఁట యయి సుప్రథితోత్తమహంసనంసదా
యత్తగతియై త్రిలోకముల కందఁగ రానిస్వసత్యధామమం
దతిరతి గాంచి యుంట నితఁ డౌ నలబ్రహ్మ; బృహత్క్రియార్థ మీ
యతియెడ నౌపచారిక మటం చన రాక యథార్థ మయ్యెడున్. 3.

శా. మృద్వేకాంఘ్రిమహఃఖనిన్ ద్రిభువనం బెల్లన్ మితిన్ బూన్చి సం
పద్వృద్ధిక్షయవేళఁ బాయక యతిప్రాంచద్దశాకారమై
సద్వైరాగ్యమనోజ్ఞమై యమల మాసత్వంబునన్ మించుటన్
'తద్విష్ణోః పరమంపద' మ్మనుచు వేదం బీయతిన్ బేర్కొనున్.

ఉ. భూతివిశేష, గోనివృత్తి, భోగిసమాశ్రియ, భూతసంగ మో
పేతుఁడు గాకయుఁ ద్రిపుటభేదనదాహకుఁ డౌటఁ గేవల
ఖ్యాతు దశాతురీయుఁ బరమార్థము ద్వంద్వవిదూరు భావనా
తీతుని వీని వేదశిఖ లెల్ల శివుం డని చేయు వర్ణనల్. 5.

చ. పురుషఫలోరురోపకృతి పూజ్యము- లేదు సువర్ణధర్మ మెం
దరయ మహార్నిశోజ్జ్వలవిభారిసమేతము పార్థివంబు సౌ
నరద మిటుల్ సహాయవిరహంబున నష్టపురంబు లోర్చు శం
కరుఁ నిగమాంతముల్ శివునిగా వచియింపక యుండు టేక్రియన్.

మ. వ్యసనాసార దురంత దుష్కృత ఘనంబై దుర్దమాఘోర తా
మస మాసంవృతివర్షవేళ కెడయా * మార్గమ్మునన్ నిల్చి వై
రిసుధీకీర్తి బిసాంకురగ్రసనపూర్తిన్ హంసవంశోద్ఘ మి
చ్చ సమీచీనతరాళయాప్తి నలరున్ సన్మానసక్రీడలన్. 7.

ఉ. క్షీరము నీరమున్ గలియుచెల్వున బ్రహ్మజగంబు లేకమై
వే ఱొనరింపరానియెడ వేర్పడఁజేసి యశేషదోషదు
ష్పారము లైనశీలవదబుద్ధసుబుద్ధులు శుద్ధి సేసి యొ
ప్పారె నజస్రమప్పరమహంస, ద్విజాతిలలామ మెంతయున్. 8.

శా. నీరక్షీరనయంబునన్ బుధులకేనిన్ దథ్యమిథ్యావిచా
రారంభం బొనరింపరానియెడ నొయ్యన్ జేయుటన్ శంకరుం
డారూఢిన్ పరహంస యౌ-నటుల సేయన్ శక్తి లేనట్టియె
వ్వారున్ నింబఫలాశనైకరసికధ్వాంక్షానుజన్మల్ గదా. 9.

మ. పటుపున్ బాహ్యతమోహతిన్ గలుగుసర్వప్రాణిదృఙ్మాంద్య,మం
దటుకున్ మే లొనరింప మిత్రుఁడ యగున్-నాళీకబంధుం డగున్
హరియించున్ హితచక్రపీడ-బరహంసాకారుఁడై యిట్లు శం
కరుఁడర్థిన్ దెలుపున్ మహాత్ములకు జిజ్ఞాస్యార్థముల్ పెల్లుగన్. 10.

---

*మర్యాదయందుండి-పాఠాంతరము.

గీ. సాస్మృతిఁ దొఱంగఁ గోరి హంసత్వ మొంది
యతఁడు గోవిందయతిఁ గొల్చు నవసరమున
విషయములఁ జంచలాచలవృత్తిఁ దెలుపు
కరణి మెఱసెను మేఘ మాకసమునందు. 11.

వర్షాకాలవర్ణనము.

సీ. భువి కిచ్చు మాపుష్పము హరించి తన్నెఁ బా
దముల నంచర్క నబ్దమ్ము లడ్డె
విషయలోలమనీషిహృది బోధకళవోలె
క్షణికకాంతి మొగిళ్ల శంప మెఱసె
విష్ణుపదాప్తి సుహృత్తులకును బ్రహ్మ
ముపదేశమిచ్చె నానుఱిమె ఘనుఁడు
జ్ఞానగర్వులు యతుల్ నను యజింప రటంచు
నింద్రుండు విలు దాల్చి యెక్కె రథము
గీ. క్షోణి సత్త్వరజస్తమోగుణము లెనసి
మాయికము లౌవిలాసముల్ మఱయునట్లు
కుటజకందళబాణాద్రికుసుమరజము
లలముకొని వనీవాత్య లందంద వీఁచె. 12.

క. ఘనదైత్యులు తిమిరచ్ఛవి
తనువులతోఁ జిత్రచాపతతి ఖరఘోషం
బున విద్యుత్పింగాక్షులఁ
జనుదెంచిరి మునుల ధ్యానసవములు సెఱుపన్. 13.

గీ. మిన్నులమి వారిదంబు లమేయవారి
ధారలఁ దొరఁగఁజొచ్చె సంతతము నంత

శంకరుం డాత్మమున మానసంబు సేర్చి
యింద్రియప్రవృత్తుల సంగ్రహించికొనియె. 14.

చ. సనయపథంబుగా నుపనిషత్తులు సెప్పెడు సాంత్వవాక్యముల్
దన సహజాభిమానము ఘనంబు చిరాత్తమునేని వీడి యొ
య్యన ప్రియుఁడైనయప్పరమహంసునిఁ జేరి స్పృశింప ధీరవృ
త్తిని గనలేక తోడనె తదీయమనీష యండగ నెందునో. 15.

చ. సమయము గోదసుల్ జలదసంగతిలేని యఖండనైజసౌ
ఖ్యమె తనమూర్తిగాఁ గల చిదభ్రపథంబున సూర్యచంద్రబు
ధములె వెలు గనేర వనఁగా—నచిరద్యుతివల్లికల్ హుతా
శము నొకయింతయుఁ గ్రేవెలుఁగఁజాలునె మాటలు వేయు నేటికిన్.

ఉ. మాయఁ దొలంగి నైజమహిమస్ఫురణంబున నద్భుతావహం
బై యతినిర్మలంబు సహజామితశర్మము గుహ్యముఁ స్వభా
వాయితసత్య మాపరశివం బగునప్పదమందు నేది యా
దేయము హేయ మెద్ది యనుధీ నతఁ డెప్పు డొనర్చుఁ జింతనన్.

గీ. తటిదమేయప్రభానుసృతంబు మేఘ
మల్ల విష్ణుపదం బొందినట్టిదయ్యు
మలినతం జెందె వర్షాగమమున నసిన
భువి విరాగంబు నెవ్వండు పొందకుండు. 18.

క. సలిలాశయ కలుషతఁ గని
కలహంసలు మానసోత్సుకములయ్యె నెవం
డిలఁ గనఁడో యాశ్రయము సెడ
నలి మానసచింత జీవనస్పృహచేతన్. 19.

గీ. శుభ్రరుచి యాకలానిధి యభ్రవీధి
సాంద్రఘన మాటచేఁ బ్రకాశంబు వాసి

వరలునొకో మలినాంబరవాసియైన
యంత నెంతకళావంతుఁ డైన నరుఁడు. 20.

గీ. తతపిపాసువు లైనచాతకము లారఁ
గ్రోలె నుదకంబులను జిరకాలమునకు
ఘనసమాశ్రితుఁ డనువగుకాలమందు
నందునేకద దుర్లభం బమృత మైన. 21.

చ. ఇటు చటులానిలక్షుభితమహీజము ప్రాణిచయప్రచారసం
కటము పయోదనీలరుచిగాఢము నౌనలవర్షవేళ న
ప్పటుమతి సుధ్యుపాస్యపదపద్ము గురున్ భజియించు చిందుభూ
తటమున నుండె నింద్రియవితానము లోఁచి ప్రమోదమగ్నుఁడై.

చ. తెఱపి గనంగరాక దశదిక్కులు నేకముగాఁ దటిద్రుచుల్
పరఁగ మనుష్యకోటులు కలంగ నభంబున నేన్గుతొండముల్
పరుసన వ్రేఁగ గట్టినబెళంగున నమ్మయధార లొప్పఁగాఁ
గురిసెను బంచరాత్రి మతిఘోరగతిన్ సురరాజు వర్షమున్. 23.

—♦ శంకరుని యష్టవిభూతిసిద్ధి ♦—

గీ. తీరభూజాళితో నగ్రహారసమితి
నారసి లోఁగొని నర్మదాసరి దమేయ
పూర మొక్కుమ్మడిని బొంగి హోరు మనుచుఁ
బ్రళయకాలాబ్ధియటు మహీతలము ముంచె. 24.

ఉ. తోఁటలు దొడ్లు సర్వవసతుల్ జలపూరనిమగ్న మాట న
ప్పాటను బెద్దఘోష మొదవన్ నరనారు లపత్యయుక్తులై
ఱోట మునింగి దిక్కరయ కొక్కమొఱన్ బఱవంగఁగాంచి య
ప్పాటున కుమ్మలించి గురుభక్తుఁడు శంకరుఁ డాత్ర మొందుచున్,

క. గురుఁడగు గోవిందయతీ
శ్వరునచలసమాధి కెట్టిప్రత్యూహము చే
కుఱునో యని వెఱచి తత్పద
సరసిజములు మదిని నిలిపి చంచద్భక్తిన్. 26.

మ. అణిమాద్యష్టవిభూతిసిద్ధుఁ డగునయ్యాచార్యమూర్తిన్ మనో
గణమందున్ నెలకొల్పి తన్నును బరీక్షన్ జేయు రేవాతరం
గిణిపూరంబు కమండలూదరమునన్ గీల్కొల్పి మూర్ఛన్ దదు
ల్బణ మెల్లన్; గనె స్వస్థభావము జనం బాబాలగోపాలమున్. 27.

క. అభిమంత్రించి కమండులు
వభిముఖముగ వఱుత నొడ్డ నంభోధులకుం
భభవునియాచా·తికి స
న్నిభముగ నది గ్రోలె జగము నివ్వెఱపడఁగన్. 28.

ఉ. యోగసమాధినుండి యపు డుత్థితుఁడై గురుఁడున్ జగంబు ల
భాగ్యతులై నుతించు స్వపదాశ్రితు శంకరుఁ జీఱి "యింతలో
నీగతి యోగసిద్ధి గను టెంతయు మాకు ముదంబుఁగూర్చె నే
యోగియు నీక్రియన్ గనునొకో యణిమాదికసిద్ధు లద్దిరా!" 29.

క. అనిగాఢసమాశ్లేషం
బున శిష్యుని గారవించి పొంగుచు మదిలో
ననితరసాధ్యాద్వైతా
వనదక్షుం డయ్యె ననుచు స్వాస్థ్యము వడసెన్. 30.

—శరదృతువర్ణనము.—

క. అంతట మాయ దొఱంగి య
నంతానందంబు బ్రహ్మ మగపడినట్టుల్

సంతతజలదచయాప
క్రాంతి నొందవెఁబుప్పనత్ప్రకాశము మహికిన్. 31.

ఆ. నీలకంఠనటనలీలకు భరతవా
క్యంబు కమలకుముదకాశసుమవి
కాసమునకు నాందిగాఁ దోఁచె శారద
వేళ పరమశాంతిలీల మెఱయ. 32.

సీ. విద్యచే విమలమై వెలయుబ్రహ్మముభాతి
శరదాగతి నభంబు స్వచ్ఛమయ్యె
సదుపదేశముల శిష్యజనంబు యతులట్ల
తనిపె నోషధుల నబ్దములు నీట
మాయికావరణావసాయశుభ్రవిబోధ
గతి మేఘముక్తుఁడై గ్రాలె విధుఁడు
మత్సరాదులు వోవ మైత్ర్యాదిగుణముల
ట్లబ్జముల్ దోఁచఁగఁ బొల్చారె దిక్కు.
గీ. లుదరవర్తిభువనము పద్మోల్లసితము
మత్స్యకూర్మ మయంబు సంభ్రాంతచక్ర
మగుచు నర్మద పరమహంసౌఘసేవ
మగుట విష్ణుదివ్యాకృతి ననుకరించె. 33.

క. చిరసంభృతజీవన మ
బ్ధరములు ద్విజపంక్తి కొసఁగి త్యక్తతటిత్సం
దరులై ఘనవీథి గృహా
శ్రమము విడిచి ప్రవ్రజింపఁగాఁ దొడఁగెఁ దమిన్. 34.

గీ. కౌముదీభస్మచర్చితగాత్ర మొప్పఁ
జంద్రమండలకరక మూసక్తిఁ దాల్చి

క్రిమబంధూకసుమశాటికను ధరించి
యతివిధంబున శరదనేహస్సు వరలె. 35.

క. సంగతహంసము హృతరజ
ముం గతపంకంబు క్షోభముక్తముస్న పా
ల్చెం గాసారాంబువు లో
య్యం గంభీరంబు శంకరాత్మ విధమునన్. 36.

గీ. గగన మింపారె శరదబ్దగణపరీత
మగుచు నుజ్జ్వలభానుబింబాంచిత మయి
గంధసారద్రివాక్తమై కౌస్తుభాంచి
తం బగుమురారివిపులవక్షంబు పోలి. 37.

క. సముమాధవారు లగుటం గం
జములు విరిసి వెలిఁగె యోగసంపత్తిఁ బ్రఫు
ల్లములై యున్ముఖములునై
యమలము లగు మునులయంతరంగములక్రియన్. 38.

గీ. చిగురుటాకులకావు లచ్చుగ ధరించి
ధూళిభూతి నలంది మధువ్రతజప
మాలికలు వృంతకలికాకమండలువులు
పూని యతితౌల్యమును బొందె భూరుహములు. 39.

గీ. ప్రావృషేణ్యాదినంబులు భవ్యమతులు
ధారణాదుల శ్రవణాదిధర్మములను
గడపి పదపద్మధూళి జగమ్ము పూత
మానలు చరింపఁ దొడఁగి రయ్యవసరమున. 40.

క. గోవిందయతీంద్రుం డం
తేవసదవతంసు బ్రహ్మనిష్ఠితమతి వి

ద్యావల్లభు శంకరుఁ గని
భావమ్మునఁ బొంగి యిటుల పలికెన్ బ్రీతిన్. 41.

గోవిందయతియనుమతిని శంకరుఁడు కాశి కేగుట.

చ. శరదృతు వేగుదెంచెను దిశావలయంబు ప్రసన్నమయ్యె సం
సరణదవానలాంబుధరజాలము వేదకదంబజంబునై
బెరసిన తత్త్వపద్ధతి వివేచనసేసి యెఱుంగుపొంటె స
త్వర మరుగంగదే హరనివాసపురీవరమైన కాశికిన్. 42.

వు. గురుదేవుం డగు గౌడపాదముని నాకున్ జెప్పె నొక్కప్డు త
చ్చరితంబున్ వివరించెదన్ వినుము వత్సా తొల్లి ప్రాలేయభూ
ధరమం దత్రిమహర్షి సల్పె నొకసత్రంబున్ మహేంద్రాదికా
మరజుష్టంబుగ; వచ్చె దానిఁ గన బ్రహ్మర్షివ్రజం బర్మిలిన్. 43.

క. ఆయెడకున్ గృష్ణద్వై
పాయనముని శిష్యగణసమావృతుఁడై వి
చ్చేయఁగ బ్రత్యుత్థాన న
మోయుక్తిని బ్రహ్మసదము పూజ లొనర్చెన్. 44.

మ. ఒనరింపన్ దనివోఁది వ్యాసుఁడు సదస్యుండై సభాస్తారు లా
య్యనఁ గోరన్ శ్రుతిమస్తకార్థము లవేలాద్వైతవిజ్ఞానసా
ధనముల్ పెక్కు లుపన్యసించెను సుధాధారామదాహంక్రియా
హాసనోదారమృదూక్తిసారలహరీ వ్యాపార మేపారఁగన్. 45.

మ. తమసందేహతమంబు దల్చువిమలాద్వైతార్థసిద్ధాంతచాం
ద్రమసజ్యోతులఁ దాపమాఱుట సభాస్తారుల్ నమస్కారపూ
ర్వముగా నిట్లని రైకకంఠ్యమగ దేవా! నీమహత్త్వం బనూ
హ్యము నారాయణదివ్యమూర్తి వని కొండాడున్ గదే లోకముల్. 46

ఉ. వేదము లెల్లఁ జిక్కువడ విప్పితి వొప్పుగ భారతంబు న
ష్టాదశసత్పురాణములు చక్క రచించితి యోగశాస్త్రము
త్పాదనసేసినాఁడవు ప్రభావము సూపితి బ్రహ్మసూత్రస
ష్పాదనమందు లోకహితభావుకభావమునన్ దయానిధీ! 47.

గీ. అల్లసూత్రములకు నేఁడు కల్ల లనక
పలుకుచున్నారు విప్రతిపన్ను లగుచు
బుధతతి యథాయథం బర్థములను రేఁగి
వాని వారించుభాష్య మావశ్యకంబు. 48.

చ. అని మును లాడుపల్కులకు వ్యాసమహర్షి వచించె నిట్లు లో
యనఘచరిత్రులార! యిటు లాపరమేశ్వరు సంసదంతరం
బున నొకనాఁడు దేవమునిముఖ్యులు వాకొనియుండ్రి నన్నుఁ గ
న్గొని, యనుకూలకాలము గనుంగొన నౌనని యంటి వారికిన్ 49.

వ. అట్లనుటకుఁ గారణం బెద్ది యన

శా. ఆకర్ణింపుఁడు మానులార యొకరుం డస్మత్సమానుండు సు
శ్లోకుం డూర్జితశేముషీకుఁ డఖిలజ్ఞుం డుద్భవించున్; సము
ద్రేకం బొందుజలంబు కుంభమున నర్థిన్ గ్రోలు గోవింద సు
శ్లోకాంఘ్రిద్వయసేవ సల్పుచును శిష్యుండై నకాలంబునన్. 51.

క. దుర్మతముల్ మాల్పు చతఁడు
శర్మదముగ భాష్యరచన సలిపి గురువరున్
నిర్మలయశోవియద్గం
గోర్మిఘటాడోలలందు నూఁగాడించున్. 52.

క. అని సాత్యవతేయుఁడు దాఁ
జని చనుచున్ గౌడపాదసంయమి యొకనాఁ

డనె యోగసమాధి నిటు
గనుఁగొంటి నటంచు నిజముగా నేఁ డయ్యోగీ. 53.

క. అణిమాదిసిద్ధిపూరుం
డణుమాత్రము సూత్రసంచయార్థ మెఱుఁగునై
పుణిఁ గనఁ డనుభావ మ్మా
భణితమ్ములఁ గలదుగాదె పడసితి సిద్ధుల్. 54.

గీ. ఇది వశిత్వవిభూతిసు మ్మెనిమిదవది
తొంటియేఁడను జిక్కక దొరుక దిద్ది
యరయ నెవ్వాఁడు దొలుదొల్లఁ బొరయలేఁడు
నీసుకృత మేమొ చిక్కె నెమ్మదియు లీల. 55.

క. ఉత్తమపురుషుఁడవై తను
పాత్తోపము! తత్త్వవిత్ప్రవర! స్రిన్నన న
త్యుత్తమసబంధరచన జ
గత్తును నీ వుద్ధరింపఁగావలెఁ గరుణన్. 56.

ఉ. కావున వత్స! పొమ్ము శశిఖండకిరీటుపురంబు కాశికిన్
దేవనదీలలామకమనీయము సుమ్మది, యందు నాద్యయా
దేవత నిన్ననుగ్రహమతిన్ గరుణించును నమ్ము మంచు స
ద్భావము తోడ నానతిడెఁ దత్ప్రియశిష్యున కొజ్జ ప్రేముడిన్. 57.

గీ. ఇట్టు లనుశాసన మొసర్చి యెపుడు స్వపర
మానితార్థ్వాణకామయమాను శిష్యు
దృష్టులఁ బవిత్రిఁ జేయుచుఁ బ్రీతిఁ బుచ్చె
సూరతుం డగుగోవిందసువ్రతుండు. 58.

శంకరుఁడు కాశిఁ జేరుట.

ఉ. పంకజసన్నిభంబు గురుపాదయుగం బెడఁబాసి యుండఁగా
శంకరుఁ డోర్వలేక నతిసల్పి, మనంబును దత్పదాబ్జము

ద్రాంకిత మాచరించుకొని యారయు చేఁగెను నీపభూజపం
క్త్యంకితబాహ్యదేశ మయి యాగవిధూమిత మైనకాశికిన్. 59.

చ. కనియెను శంకరుం డమితకర్కశత ప్రభగీరథావనీ
శనురుతపఃఫలంబ యగుచున్ యతిసేవిత తీరకుంజపుం
జనిబిడ మౌచు భోగిపతిచారువిభూషణజాటజూటసా
మనసగుళుచ్ఛ మౌచు నసమం బయి పొంగెడుగంగఁ జెంగటన్.

క. హరినఖమునఁ బొడముటనో
హరమౌళిసుధాంశుసంగమా ప్తినో హిమభూ
ధరశిరమునఁ బడుటనో
సురనది కనవచ్చె స్ఫటికశుభ్రజలంబై. 61.

చ. భ్రమరకలారవంబులను బాడుచునున్నటు మారుతోచ్చల
త్కమలగణమ్ములన్ నటనకౌశలి చూపుచు నున్నయట్లు ఫే
నముల హసించుచున్నటు లనారతసంచలదూర్మిపాణిసం
ఘమ్ములఁ గవుఁగిలించునటు గాంగఝరం బలరారె న త్తఱిన్. 62.

చ. ఒకయెడ స్వర్విలాసినులయోరలువాఱుకటాక్షకాంతి మే
చక మయి, తద్విభూషణలసద్ద్యుతి నొక్కెడఁ జిత్రితంబునై,
యొకయెడఁ దత్కుచచ్యుతసముజ్జ్వలకుంకుమపంకనైకచ
క్రికములఁ బాటలం బయి, విరాజిలుచుండెను గంగ యెంతయున్.

క. సురసింధుసలిలముల శం
కరుఁడు మునిఁగి తేలె నీలకంఠజటాభ్యం
తరగంగాంబుగయహృతుం
మరుతస్యోగాత్తపుణ్యుఁ డుడుపతి యనఁగన్. 64.

గీ. స్వర్ణదీవారిబిందుసంకీర్ణ మగుచు
శంకరునిమూర్తి విలసిల్లెఁ జంద్రికిరణ
బృంద సంపర్కగళదంబుబిందు సుంద
రేందుకాంతాశ్మప్రతిమకచంద మొంది. 65.

క. హరిముఖసురనుత కాశీ
శ్వరపదయుగళంబు నచలభక్తిఁ గొలుచు చా
పురిఁ గొన్నాళ్లుండెను శం
కరుఁడు ప్రియతచిత్తుఁడై సుఖస్థితి వెలయన్. 66.

సనందనుఁడు శిష్యుఁ డగుట.

ఉ. అంతట నొక్కనాఁ డొకధరామరబాలుఁ డధీతవేదుఁ డ
శ్రాంతమహస్సమేతుఁడు విరక్తుఁ డదారపరిగ్రహుండు దు
ర్దాంతభవాతిఘోరజలరాశితితీర్షను వచ్చి తత్పదా
బ్జాంతికమందు వ్రాలె "నిడుమా శరణాప్లవ" మంచు వేడుచున్.

ఉ. వ్రాలఁగ నెత్తి విప్రగురువర్యుఁడు వల్కె నెవండ వోయి? యుం
దే లరుదెంతు? వెందు వసియించెద? వింతటిధైర్య మేలొకో!
బాలుఁడ వయ్యుఁ దోఁచెద వబాలునిలీల నొకండ వయ్యు వే
యేల యనేకు లట్లగుదు నైకతనుప్రియభావ మొప్పఁగన్. 68.

గీ. అనుడు ద్విజపుత్త్రుఁ డనె నవఘాత్మ! హరిప
దాబ్జభక్తిహేతూదక యగుకవేర
జాతటిని వాఱు సర్వసస్యములు పొదలు
చోళదేశము వాసము క్షోణిసురుఁడ. 69.

గీ. పూజ్యులను గాంచ దేశ మామూల మే న
టాట్యమానుండనై పత్తునయ్య యిటకు

సంసృతిపయోధి మున్గఁ దా్రిసంబు గంటి
మనుపుమా దేవ తత్పరగుని నొనర్చి. 70.

క. అమృతఝురభంగతుంగము
లమలాపాంగములు వఱపి యార్తుని ననుఁ గా
వుము నాగుణదోషవిమ
ర్శనమునఁ "గరుణాబ్ధి" వనుయశము చెడు జగతిన్. 71.

మ. నను రక్షించిన 'దీనబంధు' వనుచున్ బ్రఖ్యాతి చేకూరుఱీ
తిని శ్రీమంతుని బ్రోవ నీ కెటుల సిద్ధించున్? మరుత్క్షోణియం
దున వర్షింప ఘనుండు సాధుజనమత్స్యాం డౌకిక్రియన్ నూఱుహా
యనముల్ దాఁ గురియన్ బయోధి వినుతుం డౌనా త్రిలోకీగురూ!

మ. భవదీయామలవాఙ్మయామృతసర్వస్వత్సారసాంచజ్ఝరీ
భవరుచ్యాంబుల నాడునాఁడు మతి 'స్ఫారత్వంచేషువిర్వాంచితం
బవసుం బాత్మహితజ్ఞతాం హిత' మం చావారిజాతోద్భవం
బవువిశ్వంబు విలోకముల్ సలుపుకొం చట్టాడుతన్ స్వేచ్ఛమై. 73.

ఉ. ఆతతభానువాసము హిమాంశుపురంబు మహేంద్రధామమున్
వాత కుబేర వహ్నిసదనంబులు బ్రహ్మజగంబు నేవి య
ద్వైతమతంబు త్వద్వచనఫక్కి నెఱుంగు విశుద్ధబుద్ధికిన్
ఖ్యాతవిరక్తిఘాతుకముఁ గౌతుకమున్ ఘటియింపఁజాలునే. 74.

ఉ. ఐహిక యోషిదాదివిషయంబు లిసీ విషవల్లికాఫల
వ్యూహము లౌటఁ గౌతుకము నూన్పవు మా కెపుడున్ మనోజ్ఞరం
భాహృదయంగమోరుకుచపాళ్యుపగూహనసౌఖ్యహేతుస
మ్మోహనశక్రిలోక మది పుణ్యమయేని యగణ్యమే సుమీ. 75.

క. వైరించపదం బేనియుఁ
గోర నికఁ జకోరచంచుకుట్టితపూర్ణా

బ్జారిగళదమృతధారాం
కూర మగు భవన్నవోక్తిఁ గోరుదు దేవా! 76.

సీ. వాంఛింతు దేవ! ధ్యానాభూములందు శు
భంకరం బౌట నీపాదపూజ
ప్రార్థింతు నవయశఃప్రస్తావసౌవస్తి
కం బౌట నీకుఁగైంకర్య మెలమిఁ
గాంక్షింతుఁ బ్రాగ్భవాఖండతపఃపచే
ళిమఫలం బౌట నీ కమితసేవ
నభిలషించెదను దీనాధ్యంకరణ మౌట
యుష్మదీయపదాంబుజోపచర్య
గీ. మలినసంసృతినైరాయమాణము సక
లాధిముష్టింధయమ్ము నీయంఘ్రిసేవ
యబ్బుచో నలంకర్మీణమై ప్రసితము
నై మదీయమనంబు చెల్వారుఁగాదె. 77.

ఉ క్షోభముఁ గూర్చుసంసరణఘోరరుజల్ శమియింపఁజేయ ని
న్నే భజియింతు వెజ్జులకు నెల్లను వెజ్జనుచుల్ 'భిషక్తమం
త్వా భిషజంశృణోమి' యని వైదికవాగ్వినుతప్రభావుఁడౌ
నాభవునూతనావతరణాకృతి వీవ కదయ్య దేవరా! 78.

గీ. అని నుతించెడుద్విజకుమారునకు దయ మ
హాత్ముఁ డతఁ డిచ్చెఁ బారమహంస్యపదము
నతనినె సనందనాహ్వాయఖ్యాతశంక
రాదిశిష్యుఁడుగా మహితాత్ము లండ్రు. 79.

ఉ. ఆర్తిము మీఱఁ సంసృతిభయంకరవార్ధిఁ దరింపఁ గోరి సాం
యాత్రికుఁ డీవయై 'మనుపుమా'యని చేరినవానిఁ బుణ్యాచా

రితుని నుత్తమాశ్రమతరీసమధిష్ఠితుఁ జేసి సత్కృపా
రితముఁబట్టి త్రిప్పుచు దరిన్ గురుచంద్రుఁడు చేర్చెఁ జల్లఁగన్.

గీ. మఱియుఁ బెక్కురు దేవతాంశములఁ బుట్టి
యిట్టుల తేజస్వులగు వార లాయతీంద్రు
శిష్యతను బొంది రామహాక్షేత్రమునఁ ద
మంతట విరక్తు లయ్యు లోకానుగతిని. 81.

శా. మౌనవ్యాఖ్యను బ్రహ్మతత్త్వ మెఱిఁగింపన్ వామదేవాదిస
న్మానుల్ శంకలు వాసి శిష్యు లయి సంభావితు లేదేవు, నా
జ్ఞానానందమయుండె శిష్యజనరక్షాదీక్ష నర్వ్యాకృతిన్
బూనన్ శిష్యతఁ గాంచి క్రొల్చెదరు ధన్యుల్ దేవు రుత్సాహులై.

మ. పురుషార్థార్థుల సాధుశబ్దములనే భోగీంద్రుఁ డానందని
ర్భరులన్ జేయును, గల్పితార్థముల సంభావించు వాల్మీకి, తాఁ
జిరకాలార్థదదీర్ఘసూత్రసరణిన్ జిక్కున్ను వ్యాసుండు, శం
కరుఁడో యర్థిఁ గృతార్థులన్ సలుపు శీఘ్రం బష్టమార్థంబులన్.

క. ఆతనిహారిసమమహిమా
న్వీతు నుపాసించి తన్మహిమ వక్రపథ
స్ఫీతనిజమతులు సాధువు
లైతనరఁ దలిర్తు కాశికావాసిజనుల్. 84.

గీ. భానుమండలమునఁ జండభానునట్లు
విరులఁగమిఁ బారిజాతభూమిరుహ మట్లు
నేత్రకమలమ్ములను వృత్రశత్రునట్లు
శిష్యతతి శంకరుండు రంజిల్లుచుండె. 85.

శివుఁడు మాలని రూపమున శంకరుని బరీక్షించుట

క. అటువలె షణ్మాసాంతం
బటు లగుశిష్యులను గూడి మహితుఁ డతఁడు త
త్పుటభేదనమున నుండఁగ
నట నొకదివసమునఁ బ్రాహ్ణ మపసరిలఁగఁగా. 86.

సీ. ఆకాశపురవైరి యలికనేత్రాగ్నిక
ణము లట్లు తపనోపలములు వెలిఁగె
మాయిన్వై రవి త్రిప్పి మణిభూగతాంశుపిం
ఛము, మరీచినదీర్ఘురము సృజించె
నంబుజషండమధ్యంబునందుఁ గుటుంబ
సహితంబు కలహంససమితి డాఁగె
వారిమధ్యాభిగత్వరములై మీనమ్ము
లతినిశ్చలత నిల్చి యాడఁదొడఁగె
గీ. సకలశాకుంతగణము భూజాతకోట
రాంతరశయాళువై మూఁగలట్టు లుండె
బర్హితతి శైలకందరాభ్యంతరముల
నణఁగె నాఁటికఠోరమధ్యాహ్నవేళ. 87.

ఆ. అట్టిమధ్యమాహమం దబ్జసుముకర
జఃకషాయ మైనసౌరతటిని
నాహ్నికములు దీర్చి నంతేవసద్యుక్తుఁ
డగుచు శంకరార్యుఁ డరుగువేళ. 88.

సీ. కార్మొయిళ్లలము తోల్కాఱునాఁటి యమాస
నకురే యిరుల నవ్వునల్లమేను
మొల నీలిగోచి యూదలఁ దెలియంపె కు
త్తుక వెంషికంటె కాల్బోయి మోట్లు

కలు ద్రావినట్టిమైకము తలకెక్కి నె
త్తురు లొల్కునటు లున్నతొగరుఁగనులు
కేల దుడ్డును బల్కు నాలుక యొదుగమి
తడఁబడుమాటలతప్పుపాట
దనకు నమరంగఁ గఱకుఁజందమ్ము లూఁదు
పగిది మొఱఁగుచు నల్వంక బలసి కుసుకుఁ
బరుగునన్ నాల్గుజాగిలా లరుగు దేర
నంత్యజానట్టివాఁ డెదురయ్యె నొకఁడు. 89.

క. బెదరుచు నడుగులు దడఁబడ
నొదుఁగుచు 'దూరముగఁ దొలఁగు మోరీ' యనుకో
విదవరు శంకరగురుఁ గని
పోదవయ్యా యని జనంగముం డిటు లనియెన్. 90

ఆ. అద్వితీయ మంచు ననఘ మంచు నఖండ
మను చసంగ మను చనాది సత్య
బోధసౌఖ్యరూపము నటంచు శ్రుతు లెన్ను
నాత్మ వేఱుసేయు దబ్బ మయ్యె. 91.

గీ. కేల దండకమండలుల్ గీలుకొల్పి
కావులను దాల్చికొని మాటకారు లగుచు
జ్ఞానగంధంబు లేక వేసాలు పూని
గేస్తులను గొంద ఱిటు మోసగింతు రకట! 92.

క. పో మ్మొడగా ననెదవు దే
హమ్మా దేహియొ తొలంగ నగునట్టిది? భే
ద మ్మున్నె యన్నమయుకో
శమ్ముల కొంటొంటి, కటులె సాక్షులకేర్పన్. 93

ఆ. ప్రత్యగాత్మయందు బ్రాహ్మణశ్వపచభే
దమ్ము నీకుఁ దలఁపఁ దగునటయ్య?
గంగలోనఁ గల్లుకడవలో బింబించు
సర్యమునకు భేద మనుచుఁ గలదె? 94.

గీ. దేహముల నెల్ల వెలుఁగు చదేహుఁడైన
పూర్ణుని బురాణపురుషుని బుద్ధి మఱచి
'యేను శుచి ద్విజుఁడను, మాల వీ'వటంచు
నేల మిథ్యాగ్రహమ్ము యతీంద్ర! నీకు. 95.

గీ. అప్రతర్క్య మనంత మవ్యక్త మాద్య
మమల మగురూపమును విమోహమున మఱచి,
యక్కటా యేన్గుచెవివోలె నస్థిర మగు
దేహమం దె ట్లహంత సిద్ధించె నీకు. 96.

గీ. ముక్తికిని మార్గ మగువిద్యఁ బొందికూడఁ
దుచ్ఛమైనట్టి జనసంగ్రహేచ్ఛ విడువ
వెంతవారు మఁన్గుదురు మాయికవగుఁ డనఁ
జాలు పరమాత్మని మహేంద్రజాలమందు. 97.

ఆ. అంచుఁ బుల్కసుఁడు వచించిన విని మది
నంచితుండు గురుఁడు సంచలించి,
మించునబ్బురమున ముంచినయవ్వాని
కించుప్రీతి మార్వచించె నిట్లు. 98.

చ. నొడివితి వయ్య సత్యము తనూభృదనుత్తము "వీఁడు మాలఁ"డ
వెడమతిఁ బాసితిన్ బరమవేత్త వు నీవచనంబుఁబట్టి; ప్రా
ణుఁడుల నెటిలను తన్మననమాత్మవికాసము గాంచి యాత్మయం
దెడఁద ఘటింతు రే గాని బుధు లెవ్వరు నేర్వ రభేదభావనన్. 99.

క. జగ మెల్లను గనఁబడు నా
త్మగ నేదృఢబుద్ధి కెవ్వఁ డతఁడు ద్విజుఁడైనన్
దగ మాలఁడైన వంద్యుం
డగు నని దృఢనిష్ఠ నాకు ననవరతంబున్. 100.

గీ. హరిమొదలు పుత్తికావధి పరఁగుదేహ
లందుఁ దోఁచెడు చేతన యగుదు నేను
దృశ్య మెన్నండు కా ననుదృఢమనీష
వాఁడు పుల్కసుఁ డైననాపాలిగురుఁడు. 101.

గీ. తత్త్వదర్శానుభవమొందుతఱి నెటనెట
బోధ ముండునో యది యేన పూర్ణముగ ను
పాధిబాధను మిగిలెడుబోధ మేన
యనుధిషణ గల్గునరుఁడు నా కగును గురుఁడు. 102.

చ. అని కనుదోయి మోడ్చి ఘటితాంజలియై నమియింప వేఁడున
య్యనఘువిలోనిచూపున సహస్రతటిల్లత లొక్కటన్ దళు
క్కనినటులై తదంతరమునందు నవేందుకిరీట మొప్పఁ దె
ల్లనిమెయితోఁ శివాకృతి విలాసముగాఁ గన నయ్యె నయ్యెడన్. 103.

సీ. కాదంబరీపూర్ణఘటి భక్తజనదిది
    త్సాధృతామృతకలశంబు గాఁగఁ
గరధృతలగుడ మగ్రమున ముమ్మొన గల్గి
    తళుకొందు శూలాయుధంబు గాఁగ
బలసి తోఁ వచ్చు కుక్కలు తన్నుఁ బొగడ సాం
    గము లైననాల్గువేదములు గాఁగ
శిరమునందలి పటచ్చరఖండ మరయుచుం
    డఁగ సుధాభానుఖండంబు గాఁగ

గీ. నల్లనగు మేను క్రిమముగాఁ దెల్లవాఱ
నెన్నొసటఁ గన్ను మి న్నంటియున్నమౌళి
యమరఁగా సచ్చిదానంద మష్టమూర్తి
మూర్తియై తోఁచె నాదివాకీర్తి యపుడు. 104.

క. భయభక్తివినయధృతివి
స్మయహార్ద సమేతుఁ జూచు శంకరుఁడు దయా
మయు దృగ్గోచరు మృత్యుం
జయుఁ బొగడం దొడఁగె స్వప్నసదృశదశాప్తిన్. 105.

గీ. దేహదృష్టిని దాసుండ దేవ నీకు
జీవదృష్టిఁ ద్వదంశమై చెలఁగువాఁడ
నాత్మ దృష్టి నీ వౌదు సర్వాత్మ యిట్టుల
శాస్త్రతతిఁ గాంచి మతి వినిశ్చయము గంటి. 106.

ఉ. లోకము నిస్తమస్కమగు లోపల వెల్పలఁ గూడ దేనిచే
లోకముచేత; ముజ్జగములో నెది పేటిక శాణమున్ ఖనిన్
సోఁకకె వెల్గు; నేకతము చూడ మునుల్ ప్రియఁతింత్రు దేనికై
యాకమనీయసర్వనిగమాంతవతంసముఁ గొల్తు రత్నమున్. 107.

సీ. గహన మాపరతత్త్వ మహహా దెల్పెడుశాస్త్ర
గురుత లక్షింప నెవ్వరితరంబు
గురువర్యుకరుణ చేకుఱ దేనిఁ జదివిన
యాశాస్త్ర మెల్ల నిరర్థకంబు
జ్ఞానవైభవము లేదేని సంచిత మైన
గురుమాళికృప జలాంకురము గాదె
పరతత్త్వ మది యలవడ దేని జ్ఞానవై
భవము నిరాలంబ మవును దోన

గీ. యట్టితత్పదస్వపదలక్ష్యార్థ మగుచు
ననుపమాద్భుతములపరమావధి యగు
పరమతత్త్వమునకు నమోవాకముల స
మర్పణ మొనర్తు నాయహంమతి గతింప. 108.

చ. అని వినుతించుచుం ముకుళితాక్షులతెప్పలసందు లో త్రిక్రొం
చును బ్రిమదాశ్రువుల్ దొఱఁగఁ జొక్కెడునక్కమనీయమూర్తికి
ట్లని యలదివ్యతేజమునయందు వెలుంగుకురంగపాణి యా
ననమునునుండి పాయస మనం వినవచ్చె మృదూక్తి తియ్యనై. 109.

ఆ. అస్మదాదిపదవి నందితి నీతపో
నిష్ఠ కొందితిని గరిష్ఠముదము
వ్యాసమానిరీతి నస్మదనుగ్రహా
సారపాత్రమైతి సద్వరేణ్య. 110.

మ. శ్రుతులం వే ఆనరించి వ్యాసుఁ డటుపై సూత్రించె బ్రహ్మార్థసం
గత మాగ్రంథముఁ గూలముద్రజముగాఁ గాణాదసాంఖ్యాదిదు
ర్మతముల్ బోరన పెల్లిగిల్లి పడ ధర్మత్రాతమై; నేఁ డధో
గతి నొందెం గలిదుర్విలాసమున నాగ్రంథ మ్మపార్థంబునై. 111.

ఆ. మూఢమతులు రెండు మూఁడు వేదోక్తులు
బలముగా గ్రహించి భాష్యములను
గూర్చినారు; వానిఁ గోవిదుల్ పెక్కురు
కడఁకఁ జేసినారు ఖండనమ్ము. 112.

గీ. కాన వేదాంతసారవిజ్ఞాత వైన
నీవు తద్దుర్మతముల ఖండించి వైచి
సూత్రభాష్య మొనర్పు మచ్చుగను శ్రుత్యు
పోద్బలితయుక్తిజాతాభియుక్తముగను. 113

క. తావకమై యనవద్యం
బావిష్కృతభాష్య మిందుఁ డాదిసురలసం
భావన వడసి విధాతృప
భావరివస్యామహోత్సవము గూడఁ గరున్. 114.

గీ. భేదవాద భేదాభేదవాద శైవ
సౌర వైష్ణవ శాక్తా ద్యసారమతము
లోడఁబుచ్చి మండనబుధు నోర్చి జగతి
స్థాపన మొనర్చు మద్వైత తత్త్వమతము. 115.

ఉ. ధాతుస్త్రీల మోహాంతమసచండమయూఖుల నచ్చటచ్చటన్
ధాత్రిని నిల్పు యద్వయమతప్రథితాత్మవివేకపాలన
క్షేత్రములన్ బొనర్చి కృతకృత్యుఁడవై ననుఁ జేరు దంద వై
చిత్రి శివుండు కన్నెఱఁగెఁ, జెందె గురుండును స్వాస్థ్య మల్లనన్.

క. కని స్వాస్థ్యము నలువఁగులు
గని లోఁ గనిపట్టినాఁగఘుఁ గాని, వెలిన్
గనినప్పుఁ గాని కానక
మనమునఁ బరికించు చేటిమార్గము పట్టెన్. 117.

ఉ. మాలనిమాటలన్ వినుచు మాన్పడి దేశికుఁ డుండ ధారిణిన్
సోలుచు వ్రాలుశిష్యులకనుంగవ కప్పుడు గల్గఁ జేతనా
లీల; నలుంగడన్ గనుచు లేచి గురున్ వెనుకొంచు నెండలోఁ
గాళులు గాల గంగ మునుఁగన్ జని రాత్మల నబ్రమొందుచున్.

చ. అటు చనుచున్ గురుండు మనమందిటు తర్క మునేయుఁబూనె ధూ
ర్జటి ననుఁ బట్టి చూడ నపరాధము నాఁడెనఁ గానరాద, తా
నటు ప్లవుఁడై కనంబడుట యద్వయనీతి కభేదభావనా
ఘటిమయ మాల మంచుఁ దెలుపన్ దఁ పోసియొకో విచిత్ర మా.

సీ. నీచేతఁబడె భాష్యనిర్మాణ మని గురుం
డాడఁడే న న్నంపునాఁడ ప్రీతి
నది గాక బాదరాయణువాంఛితముగూడ
నస్మదుద్దిష్టమే యని యనండె
వత్స నీపురికిఁ దత్ప్రియసార్థము గాదె
పరమపవిత్రసంపత్తిఁ దలఁచి
మఱచినాఁడను శిష్యవరణమ్ములో నని
తలఁచినాఁడొకొ యుమాదయితుఁ డాత్మ
గీ. గ్రంథలేఖనమునకుఁ బత్త్రములు గంట
ములును సంసిద్ధపఱుపనో మెలపు మీఱ
నీశ్వరుపరీక్ష కగ్గ మా కేల కలిగె
నలసత వహింప నావంతయైనఁ గాని. 120.

శా. 'అద్వైతార్థసుధారసం బొసఁగుభాష్యంబుల్ రచింపంగ రా
గద్వేషాదులఁ బాయఁగావలయు, లక్ష్యజ్ఞాన మీయోగికిన్
విద్వత్సమ్మతిఁ గల్గెఁ గల్గదొ స్వయంవిజ్ఞాత్రుఁ డం' చెంచి రూ
పద్వంద్వమ్మునఁ గాన వచ్చెనొకొ చెప్పం జాలఁ దల్లీలలన్. 121.

ఉ. పాశుపతాస్త్రలబ్ధికిఁ దపంబొనరించుకిరీటిఁ జూడ రాఁ
గా, శబరాకృతిన్ బడయఁగా రణమున్ బచరింపఁ గారణం
బా శివుఁడే యెఱుంగవలె నద్దిర భక్తులఁ జిక్కుత్రోవలన్
క్లేశము పెట్టి ప్రోచుటలు లీలలుగా శశిఖండమౌళికిన్. 122.

మ. అనుకొంచున్ జనుచున్న దేశికునితో నంతేవసచ్ఛ్రేణి యి
ట్లను దేవా! కన మిట్టిచిత్రము ప్లవుం డన్నట్టియమ్మాటలే
వినిపించెన్ దదుపర్యుదంతమును భావింపంగ వైవశ్యమున్
గనుటన్ మూలనిపాకయున్ దెలియఁ డొక్కండేని మాయంబులన్.

క. అని కళవళించుశిష్యులు
వెనుకొని రా ననుపదమ్ము విస్మితుఁ డగుచున్
జని మాధ్యాహ్నికవిధి సుర
ధునిఁ దీర్చి మదిని గురుని ధూర్జటిఁ గనుచున్. 124.

ఆ. నిశ్చయించుకొనియె నిఖిలజగద్ధిత
మ్ముగ రచింప భాష్యమును గడంగి
విశ్వనాథుకరుణ వెల్లివాఱుటఁ జేసి
కరతలామలకము కరణిఁ దోఁచె. 125.

శంకరుఁడు బదరికాశ్రమమున కేఁగుట.

ఉ. అంబుజకుట్మలాంతరసమగ్రనిరోధము వాసి యేఁగురో
లంబములై వడిన్ యతిలలాముఁ డతం డవిముక్తపట్టణం
ద్రంబును వీడి హర్షముదంచితుఁడై వెసలన్ బ్రసిద్ధమా
ర్గంబున వేడ్కమై బదరికావనసీమకు శిష్యయుక్తుఁడై. 126.

గీ. అరుగుచుండె నద్వైతవిద్యాభిరూప
సార్వభౌముం డటం చస్త్రైల మూనెఁ
జంద్రబింబాతపత్త్ర మాశాలతాంగి
చామరము దాలిచెను బ్రకాశచ్ఛలమున. 127.

క. 'దేవనరులకును శాంతం
బై వరలెడి నుత్తరాశ' యనుశ్రుతిసూక్తిన్
ద్రోవన్ గల తీర్థములన్
సేవించుచు బదరికావనికిఁ జనఁజొచ్చెన్.

చ. ఒకయెడ నుష్ణపూర్ణమయి యొక్కెడ దారుణశీతలంబునై
యొకయెడ సూటిమై మఱియు నొక్కెడ వక్రమునై సకంటకం

బాలకయొడనై యకటకట మిఁకొక్కడనై యతిమూర్ఖచిత్తమ
ట్లకట! వ్యవస్థ లేనిపథముం దతఁ డేఁగఁ దొడంగె ధీరతన్. 129.

చ. అనఘ మచేష్ట మవ్యయము నాపరమాత్మను గాంచువాఁడ య
య్యును బథమందుఁ బాంథజనయూథముతోఁ బయనించువేళలన్
దినె మధురంబు లౌఫలతతిన్, సలిలంబులు ద్రావె,నిల్చెఁ గూ
ర్చెను శయనించె లేచెను జరించె యతీంద్రుఁడు లోకరీతిగన్. 130

ఉ. వేగ మెలర్ప నయ్యతి దవీయసి యౌ పదవిన్ గ్రమించి కా
రీగురుసంస్రవద్వరఝరీజవరీతి పరీతమై గుహా
భాగనితాంతభోగపరవత్సరయావతపూర్ణమై ధరి
త్రిగతనాకమైన బదరీవనపుణ్యధరిత్రిఁ దార్కొనెన్. 131.

శంకరుఁడు ప్రస్థానత్రయాదిగ్రంథరచన మొనర్చుట.

చ. వన మది సొచ్చి శంకరుఁడు ద్వాదశవర్షవయస్సునన్ బొన
ర్చె నతిగభీరమున్ మధురరీతియు నౌనటు సూత్రభాష్య మం
దనయము బ్రహ్మనిష్ఠులయి * యాఱిట నేఁటిటఁ దొమ్మిదింట నా
ర్తి నెఱుఁగు మానుఁడున్ గలసి ధీరత వేదశిరోవిచారుఁడై. 132.

క. ఉదితోదితగుణయుతముగ
విదళితసుస్థిరవిమోహవిభవంబుగ సం
విదితాద్వయాత్మతత్త్వా
స్పదముగ విరచించె నుపనిషద్భాష్యంబున్. 133.

మ. మఱియు మహాభారతసారభూతము లగు భగవద్గీతలకు భాష్యంబు
నిర్మించె, నధ్యాత్మవేత్తృధ్యేయం బగుసనత్సుజాతీయమ్ము వ్యా
ఖ్యానించె; నృసింహతాపనీయమ్మునకు వ్యాఖ్య నొనర్చె; నర్థపరి

* (షడూర్మలు, సప్తధాతువులు, జ్ఞానేంద్రియపంచకసహితాంతఃకరణచతుష్టయ యుతనవకము)

శీలనంబున నవివేకధ్వంస మొనర్చి సకలజనుల విరక్తుల నొనర్పం
జాలు నుపదేశసాహస్రికాద్యనేకగ్రంథంబుల నబ్బుధాగ్రియుండు
సంగ్రహించె. 134.

గీ. శంకరార్యార్కుఁ డుదయించి జగతి వెలుఁగ
బళిర! దుర్వాదిచంద్రప్రభాయుతమ్ము
కుమతికృతదుర్వివరణాంధతమసపటలి
నామరూపమ్ము లొందకుండఁగ నశించె. 135.

సనందనుఁడు పద్మపాదుఁ డగుట.

గీ. పరులతర్కమ్ముల నరుణతరుణకిరణ
సరణి శరనిధివలె నశోష్య మగునైజ
భాష్య మెల్ల నధ్యాపించెఁ బరమవినయ
నిధు లగువినేయులను యథావిధి నతండు. 136.

సీ. అట్టుల శిష్యచిత్తాంబుజార్యముఁ డగు
శంకరార్యుని శిష్యసమితియందు
శమపూర్వగుణములఁ బ్రముఖతఁ గని సనం
దనుఁడాది కొంద ఱయ్యనఘుకొద్ద
భాష్యములను బఠింపఁ దొడఁగి రందు స
సందనుఁ డాశ్రిపు లందరాస
యద్భుతవినయ మొప్పార నిజస్తుతి
విని గహనార్థవివిత్సఁ జేసి
గీ. మరలఁ బఠియింపఁ గోర, శంకరుఁడు నిజప
దాబ్జ నిరుపమభక్తుని నతని నుపని
షద్రహస్యార్థకోశ మాస్యకృతకోశ
మెలమి ముమ్మాఱు చదివించె నెల్లదయును. 137.

ఉ. చీటికి మాటికిఁ బ్రథమశిష్యు సనందనుఁ బిల్చుఁ, బిల్చి ధీ
పాటవ మొప్ప భాష్యములపట్ల రహస్యములన్ వచించు;ని
న్నేటికి స్నానమాడఁ జని యించుక నిల్చినఁ దోడి తేర న
ప్పాటన యున్నశిష్యులను బంపును తాఁ జనుఁ గొన్నివేళలన్. 138.

ఉ. అల్లసనందనుండు గురునాజ్ఞను మౌళి భరించి రేవగల్
వల్లె యొనర్చుపాఠములవంక జనించెడి సంశయంబు ల
ల్లల్లన యొజ్జకున్ దెలిపి యందు యథార్థ మెఱింగికొంచు రం
జిల్లు సతీర్థ్యులీరసముచే నుడుకన్ మనమందు నిచ్చలున్. 139.

ఆ. బుద్ధిశాలి శిష్యుఁ బుత్త్రునికంటెను
గూర్మి నాదరింత్రు గురువు లెపుడు
బుద్ధి గలుగ దంచుఁ బొగులక మూర్ఖుండు
గలుగువానిఘనత కలుగుచుండు. 140.

సీ. అది యేమి మనకంటె నాసనందనుఁ డూడి
పడినాఁడె యని యీర్ష్యఁ బలుకువారు
నాపాటిశుశ్రూష యహరహంబును మన
మొనరింపకున్నామె యనెడివారు
సకలభూతసమత్వసంపన్నుఁ డగుగురుఁ
డిటు సేయఁదగ దంచు నెంచువారు
నెంతవాఁ డైన నే మిది సాక్షి పాక్షిక
బుద్ధి కం చేమేమొ మూల్గువారు
గీ. నగుచు నీర్ష్యాభరాకులస్వాంతు లగుచు
నొక్కకొన్నాళ్ళు లోలోన నుడికి యుడికి
కుమిలి కుమిలి రవుల్కొని గురుని దూఱఁ
జాల కూరక యుండ్రు తచ్ఛాత్త్రగణము. 141.

ఆ. అది యెఱింగి యొజ్జ యదసీయభక్తిఁ జూ
పెదను వీరి" కనుచు నదనుకొఱకు
సరయుచుండి యొక్క తఱి సనందనుఁ డభ్ర
గంగ కవలిదరి మెలంగుచుండ. 142.

ఉ. కాంచి లభించె మంచియవకాశమురా! యని యోసనందనా!
యంచును జీర 'నో' యనుచు నద్దరి నుండి యతండు వల్క 'ర'
మ్మంచు గురుం డనంగ సరయుం బరుదే నిటు నట్టు నావకై
యంచెలఁ గాంచి యేది నరయుంబడకున్న నతండు ధీరుఁడై. 143

ఉ. అంతటిఘోరసంసృతిమహాజలరాశిఁ దరింపఁజేసి యొ
క్కంతతరంగిణిన్ గడపదే గురుభక్త్యుడుపం బటంచు ని
శ్చింతమనస్కుఁడౌచు నునిచెన్ బదమున్ గయిమోడ్చి గాంగపూ
రాంతరమందు 'జా గురువరా' యనుచున్ భువి నుండుకై వడిన్.

క. పద మట్లుంచెడునప్పొట
నుదితంబై కమల మొకటి యుండుట గని స
మ్మదమున గురు ధ్యానించుచు
ముదమునఁ బద ముంచి నిలిచె భువి నిలుచుగతిన్. 145.

ఉ. రెండవపాద మెత్తఁగ ఝరిన్ దనయంతన పుండరీక మిం
కొం డుదయించె దానఁ బద మూనె; నిటుల్ తటినీజలంబులం
దుండి తమంతఁ దా మనుపదోచ్చలనంబునఁ బుట్టుతమ్ము లా
తం డవలీల మెట్టుచు ద్రుతంబుగ నేఁగఁ దొడంగె గంగలోన్.

సీ. పుష్పాంతరమునకుఁ బోవుతుమ్మెదమాడ్కి
జలజాంతరమునందుఁ జరణ ముంచు
దోలికాకేలి కాందోళితుండను బోలెఁ
గమలమ్ముతోఁ పాటు గాలి కూఁగుఁ

పురుషరూపము దాల్చుసరసిజాలయవోలె
నలపోక నొకకంజమందు నిల్చి
నెకానసం బూనులోకేశుఁడ ట్లొక
సితసరోజమున నాసీనుఁ డగును

గీ. అనుపదం బబ్బి మొందుచు నతఁడు గురుకృ
పాత్రలఘిమవిభూతిమహత్త్వమునను,
దేటికంటె వాయువుకంటె దేలిక యయి
పద్మవీథిని జని గురువరుని జేరె. 147.

ఉ. తామరసాంతరంబులఁ బదంబు క్రమంబున మోపి వచ్చును
ద్దామనిజాంఘ్రిభక్తిపరతంత్రుని శిష్యుని గౌఁగిలించి పూ
ర్ణామలయోగసిద్ధి దెలియం గురుచంద్రుఁడు 'పద్మపాదుఁ' డన్
నామమునన్ బహూకృతు నొనర్చెను దాపడి శిష్యులారయన్.

వ. నాఁటాదిగ శిష్యులందఱును భయభక్తులు మీఱఁ బద్మపాదు
నెడను గురునకేణ్యునెడను ననన్యసామాన్యవిశ్వాసమ్ముగలిగి గొలు
చుచుఁ బ్రస్థానత్రియ మధ్యయనించుచుండు రట్టియెడ. 119.

పాశుపత మతనిరాసము.

మ. అనవద్యం బగునాత్మవిద్య నిటు లధ్యాపించు నాశంకరున్
గని తత్త్వజ్ఞపదంబునం గలకనద్గర్వుల్ వివేకమ్ముదు
ర్వనవహ్నుల్ కుమతస్థపాశుపతు లొప్పన్ జేయునాక్షేపముల్
విని యాచార్యుఁడు తద్వికల్పనములన్ వేదోక్తులన్ దూలిచెన్. 150

క. అటు దూలిచి తద్గర్వా
ర్భటి యొక యించుక సడల్చి పటుతరయుక్తి
స్ఫుటము లగుతదాగమములఁ
జటులత మథియించె నీరసంపదునట్టుల్. 151.

ఆ. అద్వితీయనిరత యగునీశసమత యె
ట్లగును ముక్తి? భేద మమరి యుండ
ధ్యానజన్య మాట నది నశింపదె? భావ
కార్యములకు నిత్యకలన గలదె? 152.

సీ. అవయవహీనంబు లగుగుణంబులకు సం
క్రమము గల్గక యుండుఁ; గానమోక్ష
దశ నీపశువులందుఁ బశుపతిగుణసంక్రి
యము గల్గునను టసమంజసమ్ము
వనజగంధము వాయువునఁ బోలె నయ్యాత్మ
నమరునీశ్వరగుణం బనుట పొసఁగ
దలగంధసమవాయి యనిలాప్తి నొసఁగుఁగం
ధజ్ఞాన, మున్న వాతమునఁ దావి?
గీ. ముక్తులం జెందు శివుగుణంబు లన, నేక
దేశులో? కృత్స్నములొ యవ్వి తెలుపవలదె
తొంటిపక్షానఁ బూర్వోక్తదోష మబ్బు
నబ్బు శివున కజ్ఞత్వాదు లవలిదాన. 153.

మ. అని యిట్లయ్యతిమాలి వజ్రికరివం బౌతర్కపాళిన్ విరో
ధినిహీనార్థము లెల్లఁ గూల్చ స్మయవృద్ధిన్ బండితంమన్యులై
మనునాతాంత్రికు లెల్ల వీడిరి— గరుత్మత్పక్ష ఘాతాభిహా
తన శీర్యత్ఫణనిర్యదుద్గరళధూర్తవ్యాళసంకాశులై. 158.

శా. మానిస్తుత్యుఁ డతండు శేషఫణికిన్ మందాక్షముం గూర్చె వ్యా
ఖ్యానైపుణ్యమునన్; దనర్చె బహుశిష్యస్వాంతకంజార్కుఁడై,
జానొందించె యశస్సుమాలి జగమున్, శార్దూలవిక్రీడితం
బూనెన్ వాదిమృగప్రపంచము నెదన్ బ్రోద్యత్పరాక్రాంతిమై.

క. తతనిగమాంతారణ్యవి
హృతియై యతినిశితయుక్తిపృథునఖదంష్ట్రా
తతియై యతిమృగపతి దు
ర్మతవాదిద్విపభయంకరత వెలుఁగొందెన్. 156.

గీ. బాలుఁ డయ్యు నమానుషశీల మగుప్ర
భావమున మించు నయ్యతిపతిని గాశి
నగరవాసులు విస్మయానంత్య మెనసి
వినుతి సలిపి రిటుల్ భక్తి గొనలువిగుడ. 157.

కాశీవాసులు శంకరు నుతించుట.

గీ. పలుగతుల సర్వతంత్రముల్ వెలువరించు
నిమ్మహితుచేత ధిక్కారణమ్ము వడసి
భేదవాది భేదాభేదవాది ముఖ్య
మతనదీష్ణులు సతత ముమ్మలిక గొంద్రు. 158.

ఆ. వీని యాత్మనిష్ఠ కానందమున మున్ను
యంగజారి దోఁచి యాగమాంత
సూత్రభాష్యరచన సొరిదిఁ గావింపఁ జో
దన మొనర్చెనంట ధన్యుఁ డితఁడు. 150.

చ. అనఘుఁడు వ్యాసమాని మును పర్థి జరద్గవిఁ బట్టి దుర్విలో
కనతిమిరస్ఫురత్కుమతకర్దమమగ్న సముద్ధరించెఁ, ద
త్తనువును భాష్యసూక్త్యమృతధారలఁ జిల్కి యపంకఁ జేసెఁ బె
ల్చన శ్రితలోకశంకరుఁడు శంకరుఁడాదర మూఁది యిత్తఱిన్. 160.

శా. త్రైలోక్యం బెది యిచ్చుకర్మఫలదుగ్ధం బానునో హాయిగాఁ
గ్రోలున్ బ్రాజ్యసవప్రవృద్ధతరవిప్రస్తోమ మం దెద్ది? యా

శీలం బొగవిఁ దర్కపంకమున దుశ్శీలు ర్వ్యదండ్రోయ స
చ్ఛీలు డయ్యెతి భాష్యసూక్త్యమృతవృష్టిం జేసె నిష్పంకగన్. 161.

సీ. 'బ్రహ్మేతరంబు సర్వము మిథ్య' యనె నంచు
పలిగి కొందఱు కూర్చుగు లయి తెలుపుఁగ
నిగమకర్మనియోజ్యునిం గొల్వఁదగిన ది
య్యది యంచుఁ గొంద ఱత్యార్తిఁ గుపుప
నర్థచౌర్యమును నర్థాభాసమును బూను
పరులు గొంద ఱొనర్చ వంచనంబు
పరిపరిగతులఁ గొందఱు స్వరూపస్వభా
వము లెఱుంగకయ హాస్యము నొనర్పఁ
గీ. బెద్దయుం బ్రొద్దు దిక్కు కాన్పింప కల్ల
లాడిపోయినయుపనిషదబల నేఁడు
శంకరార్యాశ్రయంబు నిశ్శంక మొనసి
యనుపమానందరసలాభ మందఁ గల్గె. 162.

ఉ. క్రొమ్ముడి పట్టి రాజసభకున్ బడ నీడ్వఁగ దుస్ససేనుఁ; డు
చ్చమ్ముగ దిక్కులే కడలుసాధ్వి ని ద్రోవది శౌరి గాచిన
ట్లిమ్మెఱ భేదవాదిజను లేఁచఁగఁ గుందుత్రయీలతాంగి దుః
ఖమ్ము దొలంచి కాచెను జగద్ధితబుద్ధి నితండు బాపురే. 163.

మ. కవితానర్గళనీరపూరముల సద్గ్రంథాచ్ఛగంధంబులన్
శ్రవణానందవచోవిభూషల, స్మృతిప్రస్తప్రోక్తిదీపాళి దు
ష్టవచఃఖండనమండనమ్ములఁ బరేచ్ఛాపూర్తిహారంబులన్
మిపులన్ బూజితఁజేయు శంకరుఁడు వాణిన్ మందబంధీకృతన్.

సీ. తుత్రించి వేయంగ బౌద్ధుం డెంచి వెన్నంటి
ధావింప నెట్టెట్టొ తప్పి బ్రిదికె

నతిక్లిష్టమునను గణాదుచే స్వాత్మలా
భము గాంచి యొకయింత భయము వాసె
మార్గమాత్రమ్ము కౌమారిలాదులు నూప
నిజపదగమనంబు నేర్చెఁ గొంత
సాంఖ్యు లార్తిని బాప సదయు లన్యులుఁ ప్రాణ
ధారణార్థతఁ గూర్చ ధైర్య మొనసె
నిటుల వెతఁగూలి గతిమాలి కటకటఁబడి
యెట్టకేలకుఁ దేఱుకొన్నట్టిపురుషుఁ
జేసెను బరేశునిగఁ గృపాసేచనమున
శంకరుఁడు విశ్వలోకశుభంకరుండు. 165.

సీ. ఒకరు భూతగ్రస్తు నకట దేవుని గాంచఁ
జాలకు లేఁ డంచుఁ జాటినారు
కొంచియు క్షణికవిజ్ఞాను లౌట నొకళ్లు
'లస్తి' యంచన విభీతాత్ము లైరి
భూతమాత్రవియుక్తుఁడై తనర్చును దేవుఁ
డని నిర్ణయించిరి యంత నొక్క-
రఖలభూతములు గుణావళి వాసి యొ
ప్పారుచుండును దేవుఁ డనిరి గొంద
గీ. ఱంతియే కాని యందొక్క-రైన భూత
చయమున కసత్త్వ విధియింపఁ జాలకునికి
భయపడెడుబ్రహ్మ కొసఁగె నభయము భూత
సత్త్వ విధ్వంస మొనరించి శంకరుండు. 166.

మ. మను చార్వాకులు నిహ్నవించిరి; మృషాభూతాకృతిన్ గూర్చియా
త్మను గాణాదులు డాఁచి; రాపయి బలాత్కారమ్ము చేతన్ నియో
జ్యుని గావించెఁ గుమారిలుం, డమలు సాంఖ్యుల్ తత్ప్రధానాత్ముఁ జే
సినవా, రాతని శంకరుండు వొనరించెన్ నేఁడు సర్వేశ్వరున్. 167

ఉ. పూలును బండ్లుఁ గ్రాలుసురభూజలతావితతిన్ హసింపఁగాఁ
జాలి శుభంబు భూమ్య మగుశాంకరభాష్యముసూక్తులన్ గనన్
జాలినవారి కన్వయగుణంబుల శూన్యములై సరస్వతీ
ఘాలతలాశుభాక్షరనిభంబులు దుర్వివృతుల్ రుచించునే. 168.

ఉ. మారకిరాతతీక్ష్ణశరమర్దననిర్దళితాత్మధైర్యలా
వారలకల్పితంబులు నబంధహారంబులునైనగ్రంథముల్
ధీరుఁ డెవండు కాంచు నొకతేప-జగద్గురువర్యవక్త్రని
స్సారితశుంభదద్వయవిచారణధోరణి శుద్ధుఁ డైనచోన్. 169.

చ. అమృతఝరీమదాపహర మాయతిశేఖరుసత్ప్రణీతితో
సమముగ గ్రంథముల్ రచనసల్ప నిబద్ధ యెవండు పూనెనే
ని మృడకిరీటకోటితటినీచటులోర్మిలతుల్య మాతరం
గము లుపశల్యకుల్య కడఁకన్ సృజియింపఁగడంగ కుండునే. 170.

గీ. పేదరాలికై బంగార మేది కురిసె
నహహ! యెది యుమాసౌందర్యలహరిఁ గూర్చె
శివభుజంగము భయహారిఁ జేసె నెద్ది
యట్టికవివరువాగ్ధార హర్ష మిడదె. 171.

మ. మృదువాగ్ధారలు కల్పసూనలహరుల్ హృద్యైతదీయార్థసం
పద చింతామణిరుగ్ఝరీగుణనికావారంబు వ్యంగ్యంపుసం
పద స్వర్ధేనుపయస్తరంగములు గా భవ్యస్వకావ్యంబులన్
ద్రిదివంబున్ సృజియించె శంకరుఁడు,సంక్రీడింప నందున్ బుధుల్.

శా. రంభాపక్వఫలాభముల్ నుడువు, లర్థంబుల్ శ్రీమధ్వాంససం
రంభఁబుల్, మృదువైనవ్యంగము సుధామాధుర్యసాధీయమా
సంభావింపఁగ శంకరార్యరచితాంచత్కావ్యగవ్యాంబులం
దుం భాసిల్లెడునొక్కపద్యమె కవిస్తోమంబు రంజింపఁ దాన్.173.

ఉ. వేత్త్రుమనోహరంబు కురువిందనవాంకురతుల్య మైనవా
గ్వృత్తుల కంజపుంజబిలవిచ్యవమానమరందధారకున్
బొత్తగునర్థరాశి సురభూజపుఁబూవల పూనువ్యంగ్యసం
పత్తిని మోదమిచ్చు నతిభవ్యము లాయతివర్యకావ్యముల్. 174.

మ. యతిచంద్రోద్ధృతమాత్రియీశిఖరభాష్యం బట్టిమాహాత్మ్యసం
భృత మాటన్ విని స్వర్ధునీతటగతుల్ విద్వాంసు లత్యాంఘ్రిసం
మతపత్యాశ్రితులై పతంగహుతజన్మధ్యోత్పిపిత్సాధ్యులై
మతి ఖండింపఁగ నెంచి రీసునఁ దలంపన్ లేక భావ్యర్థమున్. 175.

క. ఒరసిన నఱకినఁ గాల్చినఁ
బరమావధి వన్నెఁ గాంచుబంగ రటు, రిపుల్
తఱచిన కొలంది రంజిలఁ
దొరఁకొనె శంకరునిసత్కృతుల్ భాష్యంబుల్. 176.

గీ. శంకరక్షీరవారాశి జనన మొంది
భాష్యశశి యమృతము బుధావళి కొసఁగుచు
నణఁచెఁ దనగోత్రతులఁ గుమతాంధకార
మవనిసురహృచ్చకోరచయంబుఁ దనిపె. 177.

గీ. మహి ననాదివాక్సాగర మంథనమునఁ
బొడమి ధిక్కృతరిపు లగుబుధులు గోరి
నను వగుయతీంద్రచంద్రభాష్యామృత మజ
రామరత్వం బొసంగుచుఁ గోముమిగిలె. 178.

క. యమిపతిరవి భాష్యద్యుతిఁ
దమ మడఁచుచు సుజనహృదయతామరసవికా
సము సేయుచు నహితదివాం
ధములకు వ్యథ నొసఁగుచును నతంద్రిత మెఱయున్. 179.

ఆ. న్యాయమంథమంథనమ్మున నాగమాం
బుధిని భాష్యనూత్నసుధ జనించి
శ్రవణమాత్రమున నొసంగుఁ దా నమృతత్వ
మఖిలవిబుధజనుల కద్భుతముగ. 180.

గీ. కమలనాభునిపదమునఁ గలిగె గంగ
భాష్యసూక్తి శంకరముఖాబ్జమునఁ బొడమె
గనఁగ నొక్కటి తనవారి జనుల ముంచు
మగ్నులను దేల్చు నొకఁ డింతమాత్ర వాసి. 181.

శా. వ్యాసుం డమ్మఁగఁ జూపె సూత్రకలితన్యాయౌఘరత్నంబు, ల
బ్ధాసంపన్నత నాఁ డొకండు గొన రారా సూరు, లీనాఁ డనా
యాసా బయ్యవి దాల్పనే తొడఁగి రర్థావాప్తి విద్వాంసు, లా
వ్యాసుం డొండెఁ గృతార్థతన్, యతిలలామాదార్యమూలంబునన్.

సీ. సకలపండితలోకజన్మసహస్రసం
పాదితాపారతపఃఫలంబు
శ్రుతిసరోరుహదళాయతలోచనాబృంద
క్లృప్తధమ్మిల్లమల్లీస్రజంబు
శుభదవైయాసికసూత్రసుందరమధు
రోద్గతాగణ్యపుణ్యోదయంబు
భారతీచిరభోగ్యభాగ్యవైభవవిస్త
రాయతామూల్యకోశాలయంబు
గీ. నయినశంకరభగవత్పదార్యరచిత
భాష్యమును గ్రోలుభాగ్యంబు పడయువారు
భావికాలజనుర్వ్యథాపాయ మొడలి
మోక్షలక్ష్మిస్వయంగ్రహమ్మున సుఖింత్రు. 183.

మ. శ్రుతివారాంనిధిమందరాద్రి యగు భిక్షుగ్రామణీగ్రంథప
ద్ధతి- యానందమునన్ బరావరవిదుల్ తన్నొందఁగాఁజేసి దు
ర్మతదుర్భేదతమంబునన్ గనులు వోఁ బ్రాల్మాలునవ్వారికిన్
స్మృతి నింధానము లైనతర్కఖరరోచిర్దీప్తులన్ జూపుఁ దాన్. 184.

సీ. సీతామనోహరు సేతువుచే ద్వైత
మొదవ్ర గన్న సముద్రభూమిదాఁకఁ
జిష్ణున రుద్రుండు తివ్వంగ వంగిన
శృంగముల్ గలమేరుశిఖరిదాఁక
నహరహ మ్మర్కుడు లగుగ్రహమ్ములు పుట్టు
పురుటి ల్లుదయభూమిధరముదాఁకఁ
నపరదిక్కున వరుణాలయవప్ర మ
ట్లలరునస్తాద్రియవ్వలనుదాఁకఁ
గీ. గేళి సలుపు నిరాఘాటలీల లొప్పఁ
జతురుదధిమేఖలాపరిష్కృతిఁ దనర్చు
నుర్వి శ్రీశంకరార్యసముద్ధృత మగు
బ్రహ్మవిద్య యద్వైతాపవర్గపద్య. 185.

వ. అని.

క. ఇటు కాశీపురజనములు
పటుగతిశంకరువిరక్తి పాండిత్యయశో
నటనములు నుతింపఁగ న
క్కటకమె కా దఖిలదిశలు గ్రమ్మె మెఱుపటుల్. 186.

వృద్ధబ్రాహ్మణుఁడయి వ్యాసుఁడు శంకరుని బరీక్షించుట.

గీ. ఆయతీంద్రుఁడు పటుదీక్ష నభ్రతటిని
యంతికమునందు సూత్రభాష్యమ్ము శిష్య

తతికి శంకాపహముగ బోధ మొనర్చు
చుండఁ గొన్నాళ్లు గడవంగ నొకనాఁడు 187.

క. ప్రాతర్వేళన మేల్కని
స్నాతుం డయి నిత్యకృత్యసమహాయకృతి
ప్రీతుండయి యొకవటమహి
జాతముక్రీనీడ గురుఁడు ఛాత్రులతోడన్. 188.

గీ. దర్భవిష్టరములను బ్రీత్యఁ గ్రిపల్ల
వాస్తరణములఁ గూర్చుండి యలఘుపూర్వ
పక్షసిద్ధాంతముల సూత్రభాష్య మెలమి
బోధ మొనరించుచుండె నపూర్వఫణితి.

ఉ. చెంతల నున్న జంతువు లచేతనవస్తువులున్ గరంగి పో
నంతటివారు శిష్యు లవశాత్మతఁ జిత్రసమాను లౌట యే
వింత? శ్రుతిస్మృతిద్వయముఁగ వేయి తెఱంగులఁ దేనె లొల్కువా
క్సంతతి దేశికాగ్రణి విచారణపూర్వము బోధసేయఁగన్. 190.

క. కటకట సూర్యోదయ మగు
తఱి గూర్చుండిరి యదేమి తన్మయతయొ భా
స్కరుఁ డంబరమధ్యమునకుఁ
నరుదెంచుట యెఱుఁగకుండి రాగురుశిష్యుల్. 191.

గీ. ఎట్టకేనియు నెఱిఁగి యిప్పట్టునందుఁ
గట్టిపెట్టుద మిఁక మాధుకరపుభిక్ష
మునకు నరుగుదమే యనుకొనుచు నవురు
సవురులై వారు పోనెంచునవసరమున. 192.

సీ. తనయంతఁ దాన కంపన మొందుశిరమునఁ
జికిచికిపల్ల వెండ్రుకలు దూల

బీఱనరాలు నిస్సారతఁ బ్రకటింప
నుహ్హుహ్హు మని దగ్గనులివు మీఱ
సాలెగూండ్లటు సితభ్రూలోమపంక్తులు
కనుఁగవ గనరానికరణిఁ గప్ప
నొకచోట నిడఁబోవ నొకచోటఁ బడుచుండు
నడుగుల తడఁబాటు నడఁ గుదుల్ప
గీ. నుదుట డాకేలు గదియించి యెదుటఁ గనుచు
దండమును వలకేలను దాల్చి వంగి
యుప్పునిన భూమిపైఁ బడునొక్కవృద్ధ
విప్రుఁ డరుదెంచె నచటి కవ్వేళ నలసి. 193.

ఉ. వచ్చి యి వేమిపాఠములు వత్సలు! మీరు పఠించుచుండిరి మీ
రెచ్చటివార లీతఁ డెవ రెయ్యది గ్రంథ మటంచు శిష్యులన్
మచ్చికఁ బ్రశ్న సేయుడు నమస్కృతిపూర్వము లేచి యాసనం
బిచ్చి సపర్య సల్పి వచియించిరి శిష్యులు సుస్మితాస్యులై. 194.

ఉ. ఘోరభవాబ్ధి మున్గుజనకోటిఁ గృపామతి నుద్ధరింప శా
రీరకసూత్రముల్ మునివరేణ్యులు వ్యాసులు మున్నొనర్చ; ని
స్సారమతుల్ తదర్థము లసంగతముల్ పచరింపఁ గాంచి యీ
ధీరుఁడు సూపె భాష్యఫణితిన్ మునియాశయముల్ సుసంగతిన్.

మ. జగదాచార్యుఁడు భిక్షుకోత్తముఁడు ప్రస్థానత్రయీభాష్యక
ర్త గతాహంమతి భేదవాదికుమతధ్వాంతాంబుజాప్తుండు శ్రీ
భగవత్పాదులు శంకరుం డన జగత్ప్రఖ్యాతిఁ గన్నట్టి యీ
సుగుణిన్ మాగురుమౌళిఁగాంచి యెవరంచున్ బల్కవింతయ్యెడున్.

సీ. ఎఱుఁగవా యైదేండ్ల యీడునఁ బేదకాం
తకు లక్ష్మి నొసఁగునుదంతరీతి

నాలింపవా యష్టమాబ్దవయస్కుఁడై
సంన్యసించినమహాశ్చర్యచరిత
వినవొకో యోగసిద్ధిని నర్మదాంబుపూ
ర్ణమ్ము కుండికను నణంచుకథను
దెలియవా వేదాంతకలశవారాంనిధి
మంథాద్రి యితఁ డనుమహితకీర్తి

గీ. జగ మెఱింగినమాగురుచరిత మేము
తెలుపఁ బునరుక్త మగు, నీక తెలియకుంట
యబ్బురం బంచు గర్వ మావంత యుబ్బఁ
బలుకుటయు శిష్యు లాచార్యపాటవమ్ము. 197.

చ. అనఘుఁడు తజ్జరద్విజుఁ డహా! భవదీయగురుండు బ్రహ్మసూ
త్రనివహభాష్యకర్తయె? కరంబు ముదం బొనయించె, సౌర! నా
జననము ధన్య మయ్యె నిఁక జ్ఞానసుధల్ గడుపారఁ గ్రోల న
య్యెనె యని యబ్బిన ట్లభినయించుచు శంకరుఁ గాంచి యి ట్లనున్.

శా. స్వామీ మిమ్ముల భాష్యకర్తలను గాంచం గల్గె, మీశేముషీ
సామర్థ్యం బతిమానుషం బని భవచ్ఛాత్రాళి యగ్గించె నే
డీ మీదివ్యవచఃప్రభావము చవుల్ దీపింపఁ గొంతన్ జరా
భూమచ్ఛన్నమదీయకర్ణముల దుప్పుల్ దుల్లఁగా నింపవే. 199.

చ. అనుటయు లేఁతన వ్వొలయ సద్గురుమౌళి వినీతి నిట్లు ప
ల్కెను ద్విజచంద్ర! పెద్దల కగున్ నియమింపఁగ నంతెకాని నే
ననెడియహంకృతిన్ బలుకు టర్హమె పిన్నల కెన్నఁడేని నీ
పనుపున నాయెఱింగినది పల్కెద నాజ్ఞయొసంగుమా యనన్. 200.

క. ఆముదుసలిపాఱుఁడు మదిఁ
బ్రేమం బిగురొత్తఁ బలికెఁ 'బ్రియ మయ్యె భవ

తో ౕౘమలవినీతసల్లా
పామృతపానమున' ననుచు నా స్థం బలికెౕ. 201.

శా. సాధ్యం బైనది బ్రహ్మసూత్రముల భాష్యంబుౕ రచింపంగ నీ
కధ్యాత్మజ్ఞవతంస! యొడ్డ గగునే? యాలించి పోదుౕ దృతీ
యాధ్యాయాది 'తదంత' రేత్యాదితసూత్రార్థంబ భాషింపు, త
న్మధ్యాశంకలఁ దూల్చి నీసలుపుసిద్ధాంతప్రపంచంబుతో ౕ. 202.

వ. అనఁటయు శంకరుండు వినయాలంకృతుండై 'ఓం నమో బ్రహ్మ
దిభ్యో బ్రహ్మవిద్యాసంప్రదాయకర్తృభ్యః పరమగురుభ్యో మహ
ద్భ్య' యని. 203.

సీ. గురుపరంపరఁ గొల్చి గురువులదయఁ జేసి
యరసిన యర్థ మే దైఅ వచింతుఁ
గాని నాయది యించుకేని గల్గ దటంచు
వినతి సల్పి, సుఖోపవిష్టుఁ డగుచు
'శుభ మస్తు వినుమి యాసూత్రార్థసారంబు
జీవుండు చనుఁ గరణావసాద
మందుఁ దదూ్ఖతసూక్ష్మాంశమ్ముల౦ గూడి
యనుచుఁ దాండిశ్రుతియందుఁ గథిత

గీ. మర్యో గౌతమజైమినీయంబు లైన
ప్రశ్నమ్ముల ను త్తరములఁ బ్రస్ఫుటముగ
దీని యర్థ' మ్మటం చసందిగ్ధముగను
హత్తుకొనఁగాదె మదిఁ దెల్పుమా ద్విజేంద్ర! 204.

చ. అని యతిచంద్రుఁ డాడిన తదర్థము వించు జరద్ద్విజుండు ప
క్కున నగి వావదూకుఁ డయి కోవిదదిగ్గజమధ్యమందుఁ దా
నిని శతధా వికల్పముల నీటుఁగ జేయుచు ఖండనం బొన
ర్చెను వినువార లద్భుతపరీతమనస్కులుఁ గాఁగ నీక్రియౕ. 205.

వ. 'వేత్థ యథా పంచమ్యా మాహుతా వాపః పురుషవచసో భవంతి' అయిదవయగ్నియందు వేల్వఁబడిన యుదకములు పురుషుం డగు నని యెఱింగితి' వను గౌతమప్రశ్నమునకు 'ద్యుపర్జన్యపృథివీపురుషయోషిత్తు'లను పంచాగ్ను లందుఁ గ్రమముగ శ్రద్ధాసోమవృష్ట్యన్న రేతోరూపంబు లగునైదుద్రవ్యములుగాఁ దెలిపి యైదవయాహుతియం దుదకములే పురుషరూపము నొందు నని కదా! సమాధాన మంటివి. యతీంద్రా! జీవుఁడు కరణావసాదమున దేహాంతరము నొందుపట్ల రవంత విచారింతము. 'దేహాంతరప్రతిపత్తియందు వ్యాప్తు లగు నింద్రియములును, నాత్మయును గర్మవశంబులై వర్తిల్లునా? కేవల మాత్మయే యరిగి దేహమట్ల యింద్రియములుగూడ నూత్నముగాఁ బుట్టఁగా నచట భోగస్థానమును గల్పించుకొనునా? కేవల మగుమనస్సే భోగస్థానము నుద్దేశించి యరుగునా? శుకము వృక్షమునుండి వృక్షాంతరమున కెగిరి చనురీతి జీవుఁడే దేహమును విడిచి దేహాంతరము నొందునా? యనెడు వికల్పజల్పనమ్ములఁ గూర్చి వినుము. దేహాంతరమునకుఁ బోవుజీవునితోఁ గూడుకొని యింద్రియము లరుగు ననుట శ్రుతివిరుద్ధము. ఎట్లంటేని 'య త్రాస్య పురుషస్య మృతస్యాగ్నిం వాగప్యేతి, వాతంప్రాణ, శ్చక్షు రాదిత్యం, మన శ్చంద్రమసం, దిశశ్శ్రోత్ర మిత్యాది (మృతుఁ డగు పురుషునివాక్కగ్నిని, ప్రాణము వాయువును, చక్షువు సూర్యుని, మనసు చంద్రుని, శ్రోత్రము దిక్కులను బొందుచున్నవియును) శ్రుతివినవా? మఱియుఁ బ్రథమాగ్నియందు వినఁబడని యప్పులు పంచమాహుతియందుఁ బురుషుఁ డగు ననుట యసాధ్యము. ద్యులోకాదిపంచాగ్నులు శ్రద్ధాదిహోమద్రవ్యపంచకమున కాధార మగు నని చెప్పఁ బడెఁగదా! అందు బ్రథమాగ్నియందు హోమద్రవ్యముగాఁ జెప్పఁబడినశ్రద్ధను విడిచి చెప్పఁబడని యప్పులను గల్పించుట సాహసము. ఆశ్రద్ధనే

హోమద్రవ్యముగాఁ జెప్పఁబోవఁ బ్రత్యయ (జ్ఞాన) విశేషత్వప్రసిద్ధ మగుశ్రద్ధను హోమము చేయుట యెట్లు పొసఁగును? ఒకవేళ నప్పులే శ్రద్ధాదిక్రమమునఁ బంచమాహుతియందుఁ బురుషాకృతి నొందు నని యంగీకరించినను— దత్పరిష్వక్తుఁ డైనజీవునకు గమన మెందును వినరామింజేసి జీవునిగమన మసంగతము' అని భూత సూక్ష్మాంశక్రమము, నాసూక్ష్మాంశములతో జీవుఁడు కూడుకొనుట, జీవునిగమనము నన్నియు మానుమిడి ఖండించుసంత. 206.

గీ. అతఁడు చెప్పిన దంతయు ననువదించి
ప్రతిభటద్విజుగుండెలపట్టు జాఱ
తీర్థకరుఁ డైనశంకరదేశికుఁ డిటు
ఖండన మొనర్చె స్వమతరక్షకము గాఁగ. 207.

వ. అదియెట్లన:— శంకరుం డాముదిసాఱుని గాంచి మహాత్మా; యవ ధరింపుము జీవుని దేహాంతరప్రతిపత్తిని గూర్చినశంకాచతుష్టయము సాంఖ్యబౌద్ధవైశేషిక దిగంబరకల్పితములు, నుదాహృతశ్రుతికి విరుద్ధములును గావున ననాదరణీయములు. మఱియు నప్పుశబ్దశ్రవణసామర్థ్యమునఁ గేవల ముదకములతో సంపరిష్వక్తుఁడై జీవుఁడు పోవు నని కాదు. అభూతసూక్ష్మాంశములం దుదకములే యధికముగా నుండుటంజేసి యప్పుశబ్దము ప్రయోగింపఁబడె ననుకొనినచోఁ బ్రశ్న ప్రతివచనములఁ గలుగువిరోధములు తొలంగు. ఇఁక 'త్రివృత్కరణ శ్రుతియందుఁ దేజోబన్నత్రయమువలన దేహారంభకత్వోపలబ్ధిగలుగుట వలనను, నది త్రయాత్మకమగుటవలనను గేవల మప్పులకు దేహారంభకత్వము గలుగు ననుట పొసఁగదు. 'పార్థివధాతువే దేహములం దధికముగాఁ గానచ్చుట లేదా' యందు వేమో? వినుము. ఇతరాపేక్షచే నప్పులకే బాహుళ్యము కలుగుటవలన నప్పు లని గ్రహింపఁ బడెను కావున నప్పు లనః సకలము లగు దేహబీజము లని

గ్రహించుట యుత్తమము. ఇంతియ కాదు. దేహాంతరప్రతిపత్తి యందుఁ బ్రాణములగమనము శ్రుతం బగుటలేదా;'త ముత్క్రామంతం ప్రాణోనూత్క్రామతి, ప్రాణ మనూత్క్రామంతం సర్వే ప్రాణా అనూత్క్రామంతి, (ఉత్క్రమించుచున్నజీవునితోఁ బ్రాణ మనుసరించును. ఆప్రాణము ననుసరించి యెల్లప్రాణములు ననుగమించును.) అనుశ్రుతియే ప్రమాణము. ఆ ప్రాణగమన మాశ్రయము లేక సంభవింపదు గానఁ బ్రాణగతి ప్రయుక్తములును దదాశ్రయములును, భూతాంతరోపసృష్టములు నగు నప్పులకు గమన మర్థాపత్తి ప్రమాణమున సిద్ధించుచున్నది. లోకమందు జీవించి యున్న వానిప్రాణములు నిరాశ్రయములై వేఱుచోటి కరుగుట గాని, యన్యత్ర యుండుటగాని కానము గదా! ఇఁక వాగాదు లగ్న్యాదుల నొందుట యన్ననో గౌణము గాని ముఖ్యముగాదు. ఆశ్రుతియందే చెప్పఁబడిన 'లోమము లోషధులను, కేశములు వనస్పతులను బొందు' ననువాక్యమునఁ గూడ ముఖ్యార్థబాధ కానచ్చుటం జేసి వాగాదీంద్రియాధిష్ఠాన దేవత లగ్న్యాదులు గావున మరణకాలమున వాగాదీంద్రియోపకారనివృత్తిమాత్రమే కలుగు నని పై శ్రుతి కర్థము. అట్లధి దేవతలు నివృత్తములైనపిదప నింద్రియములు జీవు ననగమించుట విరుద్ధము కానేర దని యౌపచారికార్థము గ్రహింపనగును. ప్రాణములు లేకయు దేహాంతరమం దుపభోగము గలుగుట యసంభవము. కావున వాగాద్యధిష్ఠాతృ లగునగ్న్యాదిదేవతలు మరణము కలుగ నుపకరింపక నివర్తిల్లుట మాత్రము చెప్పఁ దలఁచి వాగాదు లగ్న్యాదులను బొందు నని యౌపచారికముగఁ దెలుపఁబడె. అట్లయినఁ 'బ్రథమాగ్నియం దప్పు లనుట యెట్లనిన నప్ఛబ్దముచే నాశ్రద్ధయే యభిప్రేతమయినది. కాన నాది (శ్రద్ధాశబ్దవాచ్యాప్పులు) మధ్య(వృష్టిశబ్దవాచ్యాప్పలు) అంతము (రేతశ్శబ్దవాచ్యాప్పులు) లందు నప్పు

లుండుటవలనఁ బైవాక్య మనాకుల మగుచుండుట లేదా? మఱియుఁ బంచమాహుతియందు నప్పులకుఁ బురుషవచస్త్వ మెట్లని ప్రశ్న కలుగఁగాఁ బ్రతివచనమున హోమద్రవ్యముగా శ్రద్ధాశబ్దావతారము లేనిచోఁ బ్రశ్న యొకటియును, బ్రతివచన మొక్కటియునై యేకవాక్యత లేకుండును. ఇందలి శ్రద్ధాశబ్దమునకు మానసమగు ప్రత్యయము (జ్ఞానము) అనిగాని, జీవుని ధర్మ మనిగాని యర్థము చెప్పునెడలఁ బశ్వాదులనుండి హృదయాదులు వేఱుపఱచినటుల ధర్మినుండి ధర్మమును హోమార్థము విడఁదీయుట యసంభవము. కావున నాయప్పులే శ్రద్ధాశబ్దముచే నుపాదేయము లగుచున్నవి. "శ్రద్ధావా ఆపః" అను వైదికప్రయోగముచే శ్రద్ధయన నప్పులనుటస్పష్టము. గమనకర్తలగు నప్పులకు బీజరూపత్వముచేతను, సూక్ష్మత్వగుణయోగముచేతను మాణవకునందు సాహసపరాక్రమాదిసామ్యంబున సింహశబ్దమువలెనే యాయప్పులందు శ్రద్ధాశబ్ద ముపపన్న మగుచున్నది. శ్రద్ధాపూర్వకకర్మసమవాయమువలనఁ బురుషులందు మంచశబ్దమువలె నప్పులందు శ్రద్ధాశబ్ద ముపపన్నమగుచుండె. శ్రద్ధాశబ్దమున కప్పులను నౌపచారికార్థమున కేని బ్రసిద్ధి వలదా యనునెడ స్వతఃప్రమాణ మగుశ్రుతియే కలదు. "ఆపో హాస్మై శ్రద్ధాం సన్నమంతే పుణ్యాయ కర్మణే" (పురుషునకుఁ బుణ్యకర్మాచరణమున నప్పులే శ్రద్ధను గలిగించుచున్నవి) యను వేదవాక్య మప్పులు శ్రద్ధకు హేతువులని చెప్పుటఁబట్టి యాయప్పులందు శ్రద్ధాశబ్ద ముపచరితమగుచున్నయది. ఇందుఁ జెప్పఁబడిన ప్రాణప్రయాణక్రమ మిష్టాపూర్తాదికర్తలై పితృయానమున జను జీవులది గాని సామాన్యజీవులది కా దని యెఱుఁగ నగు నని ప్రతివాదిఖండన మంతయుఁ దూల్చి స్వపక్షము మండన మొనర్చుచు నెన్నిపూర్వపక్షములు సేసిన నన్నింటికి రాద్ధాంతములు సోపపత్తికముగాఁ జేయుచుండ వాదం బతితీవ్రంబుగ నడువఁదొడగె.

చ. సురగురుకుండలీశ్వరవచోవిభవాంచితులై వెలుంగు న
య్యురుపుర కయ్యె వాక్కలహ మిట్లు దినాష్టక; మట్టిచో నిరం
తర మెడఁ బాయకుండు హితతంత్రుఁడు పద్మపదుండు మొక్కి శం
కరగురుచంద్రు నిట్లను నఖండితభక్తివినీత్యుపేతుఁడై. 209.

క. దేవా నీ వలశంకర
దేవుం డవ! ని న్నెదుర్ప దిట మూనినభూ
దేవుఁ డితఁడు వ్యాసుండే
కావలె లేకున్న నిట్టికౌశలి గలఁడే. 210.

గీ. శంకరుఁడ శంకరుండు, సాక్షా న్ముకుందుఁ
డైనహరి బాదరాయణుఁ డంతవారు
కింకగొని వాదుచఱువంగఁ గింకరుండ
నైన నే నేమి యిపుడు సేయంగలాఁడ. 211.

వ. అను నప్పలుకులందు వ్యాసమహామునిదివ్యనామామృతవర్ణములు చెవుల సోఁకుటయు నొడలు జల్లు మన హృదయంబు దిగ్గన క్షణకాలంబు మాన్పడియు జగద్గురుం డాజరద్ద్విజునకు సాష్టాంగనమస్కారము చేయుచు భూమియందు దండమువోలెఁ బండుకొని యుండి తదీయపాదపద్మంబులు నిజకరపద్మంబులం బూని యిట్లని వినుతింపఁ దొడంగె.

మ. కనిపింపంగదె మౌనిచంద్ర! యసితాంగజ్యోతు లుద్యత్పయో
దనికాయంబులఁ జిమ్మఁగా, జడలు తప్తస్వర్ణవల్లీచయం
బును మించన్, గరుణామృతం బొలుకుచున్ భూభాగమున్ జ్ఞానస
స్యనితాంతోన్నతిఁ దేల్చునీయనఘ మౌనాకార మింపారఁగన్.

సీ. శరదిందుబింబభాస్వరకమండలు వొప్పఁ
దాపింఛసచ్ఛాయతనువు మెఱయ
సప్తవింశతిమౌక్తికాప్తాక్షమాల యా
శ్రితతారకావళి చెలువుమీఱ

శార్దూలచర్మవస్త్రజటావిభూతిరు
ద్రాక్షధారణ శివు ననుకరింప
నద్వైతవిద్యాంకుశాంచలమ్మున కహం
కారకరీంద్రి మగ్గలము లోఁగ
గీ. నాత్మకృతశాస్త్రశంకూజ్జ్వలాచ్ఛసూత్ర
దామముల నకృత్రిమగోవితానములను
గట్టి యిరుగ్రేవ శిష్యులు చుట్టువాఱ
వెలయు నీరూపుఁ జూపింపవే మహాత్మ. 214.

వ. అనుచు నానందబాష్పసంప్లుతాక్షుల నుతింతుండై. 115.

క. అటువలె నాబుధవృద్ధునిఁ
బటుమతి ద్వైపాయనునిగఁ భావించి విశం
కటభక్తిని నిటలతటీ
ఘటితాంజలియై నుతింపఁగాఁ దొడఁగె నిటుల్. 216.

ఉ. పాలితశిష్యలోక! ద్విజవల్లభ! దుర్లభతావకీనని
ర్మలవిచక్షణత్వము నెఱింగినయంతటినుండి ధాతయో
శూలియొ హెళియో క్రొ యనుచుఁ వెఱఁగొందుదు నంతెకాని నా
పాలిటిభాగధేయ మగువ్యాసగురుం డని యెంచ నయ్యెదన్. 217.

క. ఈమాడ్కిని శారీరక
మీామాంసాంభోధిఁ దఱచు మేటిని గన మే
సీమను సాత్యవతేయమ
హాముని గాక వని కగుఁ దదాశయ మెఱుఁగన్. 218.

క. ఆకారమాత్రభేదము
చేకొనువ్యాసర్షి వీవు చిరజీవివి యి
చ్ఛాకల్పిత సృష్టివి యే
యాకృతిఁ గనలేవు సంశయము నా కేలా? 219.

ఉ. స్వాగతమయ్య నీకు మునిచంద్ర! పరాశరమౌనిపుత్ర! నీ
వీగతి నాదుభాష్యము పరీక్ష నొనర్చి పరోపకారదీ
క్షాగరిమంబు చాటితి జగద్ధితబుద్ధిఁ బురాణముల్ సమ
స్తాగమసారగర్భము లహో రచియింపవె యెంతవాఁడవో. 220.

సీ. కలగూరగంపయై గాసిఁ జెందెడు శ్రుతు
లచ్చుగట్టి విభాగ మనువుమఱచి
వేదసారమ్మున వెదవెట్టి యష్టాద
శపురాణనిర్మాణసఫలతఁ గని
గీతామృతాసారపూతభారతపంచ
మామ్నాయవిరచన యశము గాంచి
యుపనిషత్సారమ్ము నొగి సూత్రములుగ ని
ర్మించి బ్రహ్మంబు చిత్రించి చూపి
గీ. కరతలామలకముగా జగచ్చరిత్ర
మెఱిఁగి వెలుఁగొందు నీయొద్ద నేను నాదు
భాష్య మన నెంత? శోధింపవచ్చు టరయ
ననుఁ గృతార్థు నొనర్చు నుపాహనె కదయ్యా! 221.

చ. కలియుగమందు సోమరులు గాఁగల రెల్లద్విజన్ము లంచు సం
కుల మగు వేదసంచయ మకుంఠితశేముషిఁ జీల్చి నాల్గు శా
ఖల నొనరించి వ్యాసుఁ డనఁగా జగమందుఁ బ్రశస్తిఁ గన్న నీ
యలఘుమహానుభావమున కంజలి యొగ్గెద బాదరాయణా! 222.

క. ఎఱుఁగక త్రికాలముల నే
వరుస సృజించితివి భూతభావిభవంతీ
చరితప్రబంధములఁ దా
నరసినక్రియ; నెంతవాఁడ వయ్యా మహాత్మా! 223.

గీ. అంతరాంగమ్ము సైతమ్ము నలరిచి బహి
రంతరాంధ్యమ్ము స్థూలసూక్ష్మాంధ్య మెల్లఁ
దఱిమి హరియింపఁగలభారతక్షపాక
రుఁడు మెఱసె వ్యాసవారాశిఁ బొడవుసూపి. 224.

గీ. సాంగషట్కమ్ము లగుశ్రుతు లఖలశాస్త్ర
మమ్మహాభారతాంభోధి యలపురాణ
సముదయం బెల్ల నీయంద జననమొందె
నీది కానట్టి వాఙ్మయం బేది జగతి. 225.

చ. ఋత మగుబ్రహ్మ దాఁ బొడమి ద్వీపమునందు సహస్రశాఖశా
యుత మగుచుర్ – సుశామితసముత్సవమై, మునిచంద్రరూపక
ల్పతరువుగాఁ దనర్చి, నిజపాదసమాశ్రయ మొందునాసుదృ
క్తతి కొసఁగున్ మహోన్నతముగాఁ దనరారుఫలంబు నర్మిలిన్.

గీ. ఆర్తిశమనార్థము గిరీశు నాత్మఁ దాల్తు
ప్రాక్తనగవీచయమ్ము వక్త్రమునఁ గాతు
వరకృపాదృష్టిఁ దొలఁగింతు నరకబాధఁ
జెప్ప నెటు నీగుణమ్ము విచిత్రకృష్ణ! 227.

గీ. కలుగక మలంగక వెలిలోపలలు లేక
యుండు నని దేని వివరించుచుండును శ్రుతు
లట్టి సచ్చిదానందఘనాకృతి పర
మాత్మ వీవ నారాయణాంశావతార! 228.

సీ. అని కేలుదోయి మాళిని జేర్చి మ్రొక్కుచుఁ
గనుచుండ మదికోర్కి కనుగుణముగ
ముదుసలిపాఱురూపునన ద్వైపాయనా
కారమ్ము తనకు నొక్కనికె తోఁప

బరవశుం డగుచు నిర్భరతరానందసం
త్యన్మానసుం డయి యంతలోనఁ
దెలివొంది పరగురుదేవ! యంచును వృద్ధ
విప్రునంఘ్రుల వ్రాలి విడువకున్న
గీ. నాదరంబున నిరుగేల యతిలలాసము
నెత్తి కౌఁగిటఁ జేర్చి యవ్వృద్ధవిప్రుఁ
డపరిమితహర్ష వారాశియందు మునిఁగి
యిట్టు లనుఁ దేనియలసోన లుట్టిపడఁగ. 229.

వ్యాసుఁడు భాష్యమును శోధించి చూచి వరము లిచ్చుట.

ఉ. చక్కని జ్ఞానదృష్టిని నిజంబుగ నన్నును వ్యాసపీఠమం
దెక్కఁగఁజేయు నీప్రతిభ కెంతయు సంతస మొందినాఁడ, నీ
వెక్కటి వ్యాసుఁ డాదియగుసిద్ధచరిత్రుల లెక్కలోనికిన్
దక్కఁగ నేలుకొంటి సముదంచితపారమహంస్యరాజ్యమున్. 230.

చ. పరమఋషీంద్రకోటులు భవత్కృతభాష్యమహత్త్వమున్ నిరం
తరము నుతింపఁగా విని సదాశివుప్రేరణచేతఁ బట్టలే
కరయఁగ వచ్చినాఁడ ముద మయ్యె భవత్ప్రతిభావిశేషభా
సుర మగుభాష్యధోరణికి సూరివతంస! చిరాయు రస్తు తే. 231.

గీ. అనుచు దీవించు వృద్ధువాక్యశ్రవణస
ముత్థహర్షము రోమాంచపూరకైత
వమున వెలి కుబ్బ శంకమతవార్ధిచంద్రుఁ
డయినశంకరుఁ డవ్వాని కనియె నిటుల. 232.

ఉ. పైలసుమంతుముఖ్యులు తపస్వులు శిష్యులుగాఁ జెలంగు న
ద్వేలవిభూతి వ్యాసగురుదేవునిముందు తృణంబునేని గా

నేల తదీయసూత్రరవి కేడ్తెఱ మామకభాష్య మెత్తిని
వ్వాళి యొసంగ నెంచితి నపత్రపనేని దలంప కక్కటా!

ఆ. మున్ను సాహసము స్వబుద్ధిఁ గావింతు వ్యా
సప్రశిష్యబిరుదశాలి నగుచు
నరసి తత్సదుక్తులందలి మద్దురు
క్తుల సమీకరింప వలఁతి వంటి, 234.

ఆ. అని వచించుశంకరాచార్యుచే నున్న
భాష్య మాదరమునఁ బాణియుగళిఁ
బుచ్చుకొని సమస్తమును బ్రసాదాదిగు
ణాంచితమ్ము ద్విజుఁడు గాంచె వరుస. 235.

ఉ. అంతట బ్రహ్మసూత్రహృదయానుగుణార్థము గల్గి నైజవా
క్సంతతిఁ బూర్వపక్షములక చ్ఛణఁగించుచు యుక్తియుక్తసి
ద్ధాంతములన్ దనర్చుయతితల్లజుభాష్యము నెల్లఁ గాంచి చే
తోంతరసీమ సంతస మనంతము గాంచి వచించె నీక్రియన్. 236.

ఆ. గురునియాజ్ఞఁ జేయ దొరఁకొంటి సూత్రభా
ష్యమ్ము; గానఁ గాదు సాహస మది
యింక సాహసముగ నెంతు సూక్త దురుక్త
ములు పొసంగు నిందుఁ దెలుపు మనుటె. 237.

క. మీమాంసకాగ్రగణ్యుఁడ
వామూలము శబ్దశాస్త్ర మరసితి గోవిం
దామలచరితునిశిష్యుఁడ
వేమియు వెలువడు దురుక్త మెది నీనోటన్. 238.

గీ. అంధకారమ్ము హరియించి యరుగఁ డట్లు
వెడలితివి బ్రహ్మచర్యాన విషయములను
జక్కడంచి యప్రాకృతజనుఁడ వౌటఁ
బరమపురుషుఁడ వీవు సర్వజ్ఞమౌళీ. 239.

క. అమితార్థగర్భములు నిరు
పమలఘురూపములు గూఢభావము లగుసూ
త్రములు మదీయములు వివర
ణము సేయఁగ నీవు గాక నాథుఁడు గలఁడే. 240.

గీ. చాలు లేవఁడు నిసర్గదుర్జ్ఞానతరము
లైనసూత్రములర్థమ్ము లాకళింప
నెంతక్లేశ మ్మగును రచయితకుఁ దలఁప,
నంత క్లేశమ్ము వ్యాఖ్యాత కగును గాదె? 241.

గీ. అస్మదాశయ మెఱిఁగి యథార్థముగను
భాష్య మొనరింపఁజాలు నెవ్వాండు సాంఖ్య
ముఖ్యపీడిత మగుశ్రుతిమూర్ధపథముఁ
జక్క నెవఁ డెత్తుఁ బరశివాంశంబుదక్క. 242.

గీ రోసము సుదూరముగఁ ద్రోసి వేసి సకల
కలల మదిఁ దాల్చి గిరజాధికరణ సర్వ
మూర్తి యొప్పార వెలుఁగు నపూర్వశంక
రుఁడవు నిన్ను వర్ణింప నెవ్వఁడు వలంతి. 243.

మ. మును వ్యాఖ్యల్ రచియించి రెందఱో బుధుల్ పూర్ణంబు సూత్రాశయం
బును సర్వజ్ఞుఁడ వీ వెఱింగినటు లప్పల్ వా రెటుల్ కండ్రు? కా
వున భేదాన్వయవాది కోవిదులపెంపుల్ మాల్చి వేదాంతవి
ద్యను గ్రంథమ్ము లొనర్చి కావు మిఁక నన్నా పోదునా యిచ్ఛమై?

వ. అనుటయు శంకరుండు మహాత్మా నావిన్నపం బవధరింపుము భవ దనుగ్రహంబున భాష్యములు రచించితి శిష్యులకు బోధించితి ధైర్య మ్ము వీడక కుమతముల హతాహత మొనర్చితి నాచేయఁదగిన దీలో కంబున నేదియుఁ గానరాద ముహూర్త మాత్రము మణికర్ణి కాతీరం బున సన్నిధానంబు సేసితేనిఁ జిరాయుష్మంతుండ నగుదు నీసన్నిధి నీ హేయం బగు కాయంబు వాయనుంటి ననుటయు ముదుసలిపుడమి వేలు పి ట్లనియె. 245.

శా. వత్సా! యింకను నీ కనిర్జితులు భూభాగంబునం దుండ్రి వి ద్వత్సింహంబులు, వారినిఁ గెలిచి యద్వైతాధ్వరత్వాచణో ద్యత్సిద్ధాంతములన్ స్థిరంబులుగ సంస్థాపింపఁ బెక్కేఁడు లొం నుత్సర్జించినచో ముముక్షు జననీన్యాయార్భకంబై చెడున్. 246.

ఉ. సారతరార్థసంభృతవిశంకటభావయుతప్రసన్నగం
భీరభవత్ప్రణీతకృతిబృందవిలోకజహర్షపూరముల్
ప్రేరణసేయుచుండె యతిబృందము హిందుఁడ వైన నీకు స
త్కారముగా వరంబు నొసఁగన్ వలె నంచు నిదే యొసంగెదన్.

సీ. అంబుజాసనుఁ డిచ్చినట్టియాయువు నీకు
నెనిమి దేఁడులె జనియించు తఱికి
నీభాగ్యమహిమ నెన్మది కెన్మి దేం డ్లెక్క
గురుతరంబగు తపోభరముకలిమి
నిఁక నొక్కపదియునాఱేఁడులయాయువు
నామాటఁ బట్టి యనాప్త లభించు
నాచంద్రతారార్క మవని భాసిలు భవ
త్కృతమైన భాష్యమ్ము రతనమట్లు
గీ. మొనసి దుర్వాదిగర్వముల్ తునియునట్టి
భణితములఁ జేయుమా! యెల్లవారి ఖేద

బుద్ధిరహితుల నద్వైతశుద్ధమార్గ
గాములుగను బ్రహ్మనందధాములుగను. 248.

క. అనుజరదవనీసురునకు
ననుమితపారాశరునకు యతిపతి యనుఁ బా
వనయుష్మత్సూత్రసహాం
చనమున నాభాష్యమును బ్రచారము వడయున్! 249.

చ. అని తనకన్నుదోయి కమృతాంశునికైవడిఁ జల్లనైన రూ
పున వెలుఁగొందు వృద్ధమునిపుంగవు నంఘ్రులు నెన్నొసంట సోఁ
క నతు లొనర్చి శంకరుఁడు గద్గదికస్వరసంభృతాశ్రుఁడై
కనుఁగొనుచుండ నాద్విజుఁడు కన్మొఱఁగెన్ గలఁగన్నవైఖరిన్. 250

వ్యాసునిగూర్చి పద్మపాదునకుఁ గలిగిన సందేహమును శంకరుఁడు వారించుట.

ఉ. ఆజరదగ్రజన్ముఁ డటు లంతరితుం డగునంత నొజ్జ కం
భోజపదుండు మ్రొక్కి వెఱపుట్టఁ జలించుచు 'దేవ! యెవ్వఁడో
యాజగతీసురుం డెఱిఁగి తయ్య వచింపు పరాశరాత్మజుం
డో, జితకాముఁడైన శుకుఁడో, హరుఁడో, హరియో, విరించియో.

మ. భగవంతుం డగుబాదరాయణమహాబ్రహ్మర్షి గాకున్న మీ
జగదుద్ధారకమైనభాష్యమునఁ బెల్చన్ బూర్వపక్షం బొన
ర్పఁగలాఁడే యనుచున్ ఘృణాతురముగా'వ్యాసుం'డటం చంటి నెం
చఁ గలిద్వాపరసంధి నుండె నని భాష్యంబందు నేఁ జూడనో. 252.

శా. ఆనాఁ డుండినభాష్యకర్త యిపు డయ్యా యెట్లు తా వచ్చి మీ
తో నుచ్చావచవాదముల్ నెఱపి తోడ్తో నేఁగెనో యంచు డెం
దానన్ సందియ ముప్పతిల్లెను భవత్కారుణ్యపాత్రంబ యా
నేనిన్ దీనుఁడు వీఁడు వేఁడినది స్వామీ చెప్పి రక్షింపుమా. 253.

గీ. అనినఁ జెలువవ్వ నవ్వి యి ట్లనె గురుండు
బలియు ద్రౌణియుఁ గృపుఁడును వ్యాసుఁడును వి
భీషణుం డాంజనేయుండు భృగుకులుండు
ననెను నేడ్గురు చిరజీవు లనుట వినవొ. 254.

క. విరచించెనఁట కలిద్వా
పరసంధిని బ్రహ్మసూత్రపటలి ననిన ని
త్తఱి వ్యాసుఁ డుండునా యని
యుఱుమఱి నీ కేల గలిగె నన్నా చెపుమా! 255.

సీ. జ్ఞాననేత్రమ్మునఁ గాని గానఁగరారు
జ్యోతిర్మయులు మహాసుకృతతనులు
జ్ఞానప్రమాణానుసారంబు వారల
దర్శనం బబ్బుఁ ద త్తద్విధమునఁ
దొలుత నజ్ఞానంబువలన వృద్ధిఁజెఁ
డట్టులైఁ తోఁచె మాయామయముగఁ
గ్రమముగా జ్ఞానదీపము జ్వలింపఁగఁ గృష్ణ
తనుఁ డైనవ్యాసుఁడై కనఁగనయ్యె
గీ. నతఁడు చిరజీవి యగుట భ క్త్యతిశయమునఁ
గొలుచువారికిఁ దద్భక్తి కొలఁది వివిధ
రూపములఁ దోఁచి నేఁడును బ్రోచుచుండు
సందియము డింపఁ దన్నామజపము సలుపు. 256.

గీ. నాల్గుమోములు దాఁచిననలువ యతఁడు
రెండుచేతుల నారాయణుం డతండు
కన్ను నొసటనులేని ముక్కంటి యతఁడు.
వ్యాసముని నాఁగ సామాన్యుఁ డని తలంచె. 257.

సీ. బ్రహ్మాండగోళపరంపరల్ తనబొజ్జ
యందుఁ దాలిచిన నారాయణుండు
అజానసిద్ధదివ్యజ్ఞానకళికల
నలరారెడు పరాశరాత్మజుండు
సరయుసద్యోగర్భజనురాత్త తాపస
తేజుఁ డౌసత్యవతీతనూజుఁ
డఖిలవేదాంతవిద్యాలాభమునకుఁ ద
పోధికుం డగుబాదరాయణుండు

గీ. భారతమ్ముఁ బురాణముల్ పదునెనిమిది
విరచన మొనర్చినట్టికవిబ్రహ్ముండు
అతఁడు వ్యాసుఁడు తన్మహితానుభావ
మెంచఁగా సాధ్య మౌనె విరించికైన. 258.

ఉ. ప్రాకృతదృష్టిఁ దొల్తఁ గన బ్రాహ్మణవృద్ధయి కానిపించి నీ
వాకున జ్ఞానదృష్టిఁ గన వ్యాసుఁడవై కనుపించె నాకు; నీ
కో కడముట్ట వృద్ధదశ నుండిన పాయుఁడుగాఁ గనంబడేఁ
గై కొనఁజేయు భేదముల జ్ఞానమునందలితారతమ్యముల్. 259.

చ. ప్రతిపరమాణువందు నిజభాస్వరతేజము నింపి లోకసం
తతిఁ దనయందుఁ గూర్చుకొను తాత్త్వికులైనమహాత్ములన్మహిన్
వెతకుట యేల జ్ఞానులకు? వీక్షణరోధకమాతమంబుఁ బ్రా
కృతులు జయింపనేరక 'యదృశ్యులు'గా భ్రమ గొందురిగా కదన్.

మ. కర మీక్షింపఁగరానిద వ్యోగిరి కంక శ్యేనగృధ్రంబు లం
బరమం దుండి యిలాగతార్థముల విస్పష్టంబుగాఁ గాంచునై
ఖరి నజ్ఞానులదృష్టి కందని యనేకంబుల్ మనోదృష్టి గాం
తురు జ్ఞానుల్ తమజ్ఞానశక్తి కొలఁదిన్ లోకంబులం దన్నిటన్. 261.

సీ. జనుషాంధుఁ డీజగంబును శూన్యముగ నెంచుఁ
గను లున్నవాఁడు నమ్మునె తదుక్తిఁ
గూపమండూక మకూపారవార్త న
మ్మనిమాత్రి వార్ధి లే దనుట యొల్లు
బధిరుఁడు శంఖారవము శూన్య మని పల్క
విశ్వసింతురె ధ్వనిఁ వినెడువారు
ముక్కుఁడి సుమనఆమోదమ్ము లే దన్నఁ
బూవున నెత్తావి పొనుఁగువరునె
గీ. యటులె యజ్ఞాని ప్రత్యక్ష మాదరించి
లే దనఁ బరోక్షవస్తువు పోదు దానిఁ
గాంచ దక్షుండు జ్ఞాని యొక్కండ కాన
జ్ఞానము నరుండు గడియింపఁ గడఁగవలయు. 262.

గీ. తపమునను కాని రాదు చిత్తపరిశుద్ధి
జ్ఞాన మాచిత్తశుద్ధిచేఁ గాని రాదు
తెలియ దపరోక్ష మాజ్ఞానబలము లేక
యిన్నిటికి మూల మాగురుకృపయె సుమ్మి. 263.

క. అనుచుం బల్కెను గానీ
మనమునఁ జే వెట్టి కలఁచుమాడ్కిని నావ్యా
సునివిరహ మేఁచ నెట్టో
పనివడి గురుఁ డొందె స్వస్థభావము తుదకున్. 264.

గీ. గురునియానతి దిగ్జయస్థిరమనీషఁ
డై కుమారిలభట్టుచే నాత్మరచిత
భాష్యమునకు వార్తికముఁ గూర్పంగఁజేయ
వెడలెఁ దొల్త నగస్త్యుండు విడియుదిశకు. 265.

ఆ శ్వా సాం త ము .

శా. ధర్మగ్లాన్యపనోదనార్థగతమర్త్యక్షోణి! తత్త్వార్థవి
త్కర్మంధ్వాంతరచక్షురధ్వగతలక్ష్యజ్యోతి! యాంహాత్యలం
కర్మిణోద్యతకార్ముకక్షపితరక్షశ్చక్రి! యావజ్జగ
న్నిర్మాణాదిమహేతుభూతమయమూర్తీ! జానకీనాయకా!

క. వేంకటరాట్సచివమణీ
సంకల్పఫలీకృతిప్రసన్నసురమణీ!
సంకల్పజన్మజనక! ని
రంకుశపౌలస్త్యమదనిరాస శరాసా!

పంచచామరము

చలాఽచలాకృతిప్రజద్విశాలకీశరాట్చమూ
చలాచలాఽవనీతలా! నిశాటవాటపాటనో
చ్చలాఽచలాఽఽయుధోజ్జ్వలాజిసాంయుగీనశౌర్య! చం
చలా చలామరేంద్ర లక్ష్మ్యజస్రసుస్థితిప్రదా!

ఇది శ్రీ గురుకరుణాసమాసాదితకవిత్వ 'కవితాభూషణ', 'విద్వ
త్కవిశేఖర' వెంపరాల సూర్యనారాయణనామధేయ
ప్రణీతం బైన శంకరవిజయంబున
తృతీయాశ్వాసము.

శ్రీ శంకర విజయము.

చతుర్థాశ్వాసము.

శ్రీక్షీద్వేంకటరాయా
లక్షితమాహాత్మ్య! భరత లక్ష్మణశత్రు
ఘ్నక్షితితనయానిలతన
యాసౌమక్షేమకామనాశ్రియ! రామా! 1.

వ. అవధరింపుము.

కుమారిలభట్టు పూర్వవృత్తాంతము.

ఉ. అట్టుల జైత్రయాత్రకు మహామతి శంకరదేశికుండు దన్
జట్టులు గొల్చిరాఁ బథమునన్ జనుచుండఁగ నొక్కవృద్ధుఁ డ
ప్పట్టున వారిఁ గొల్చి చనువాఁ డొకరుం డలవోకవోలెఁ ద
ద్భట్టబుధేంద్రుపూర్వచరితం బిటు చెప్పఁదొడఁగె నేఁగుచున్. 2.

క. సర్వజ్ఞ! తమ రెఱుంగని
దుర్వి నెదియు లేదు గాని యున్నవి కథ లా
యుర్విసురుఁ గూఱిచి యవి
సర్వము విని చెప్పవలయు సార మ్మందున్. 3.

చ. అతని మహేశు నాజ్ఞ ధరయందు నరాకృతిఁ గన్న పార్వతీ
సుతుఁ డగు నక్కుమారుఁ డనుచున్ శ్రుతిరక్షణదీక్షితుం డటం
చతిమహిమాన్వితుం డనుచు నందఱు సెప్పుదు, రావిచిత్రపుం
గత లవి యెంత విన్న మదిఁ గౌతుక మాఱదు దేశికేశ్వరా! 4.

గీ కలదు జయమంగళ మ్మనుగ్రామ ముత్క
లాంధ్రదేశమ్ములకు సంధియందు, నందు

నందఁ దాంధ్రులలో యందు ద్విజాన్వయమునఁ
బుట్టెను గుమారిలుం డనుపూతవృత్తి. 5.

క. పొడమి సకలసంస్క్రియలను
బడసి శ్రుతులు స్మృతులు శాస్త్రపటలిఁ జదివి యె
వ్వ్యేడ సాటిలేనిశౌర్యము
కడలొత్తఁ గుమారిలుఁడు జగంబున మించెన్. 6.

గీ. భట్టపాదాహ్వయాంతరప్రథితుఁ డగుచు
జైమినిమునీంద్రవిరచితశాస్త్రవార్థి
గుంభజునిపోలె నలవోకఁ గ్రోలి తేర్చి
తంత్రవార్త్తిక మనెడుగ్రంథము రచించె. 7.

శా. మీమాంసాగమవజ్రపంజరము బంహిష్ఠార్థనిక్షేపము
ద్దామామ్నాయతరీనియామకము శ్రౌతస్మార్తకర్మాకృతి
గ్రామాదర్శము తత్పురాణనిచితార్థగ్రావటంకంబు ప్ర
జ్ఞామంతవ్యము తంత్రవార్త్తిక మనంగా గ్రంథసామాన్యమే. 8.

వ. అది యట్లుండె నత్తఱి. 9.

సీ. సర్వవస్తులు పరోక్షజ్ఞాన విషయంబు
లనుచు వాదించు సౌత్రాంతికులును
సకలమ్ము నకపరోక్షజ్ఞానవిషయతఁ
బటుమతిఁ జెప్పువైభాషికులును
విశ్వంబు విజ్ఞానవిపరిణామమె యంచుఁ
బలుకుయోగాచారపండితులును
దేహాతిరిక్తంబు దేహప్రమాణ మా
త్మం బని యనుచు దిగంబరులును

గీ. బరఁగ దేహాత్మవాదిచార్వాకమతులు
భూమి యీనినయటు నిండిపోయి వేద

మాత గళహస్తమునఁ ద్రోసి మట్టుచుండఁ
గనులు చిల్లులువోవఁగాఁ గాంచె నతఁడు. 10.

గీ. క్రముకతాంబూలపత్త్రచూర్ణములు గలియ
మదము నారుణ్యము జనించుమాడ్కి దేహ
పరిణతము లైనభూతాళివలనఁ బొడముఁ
జేతన యటన్న చార్వాకనీతి కడలు. 11.

సీ. వేదవాదులఁ జూచి వెక్కిరించెడువారు
శీలవంతులను దూషించువారు
యజ్ఞసంభారమ్ము లపహరించెడివారు
ఋత్విగ్గణంబు గాఱించువారు
శ్రోత్రియులను జెఱగొంచుఁ గూడెడివారు
దైవమ్ము లే దంచుఁ దలఁచువారు
ప్రకృతియే సృష్టికారణమం చఱచువారు
ప్రత్యక్షవాదులై పరఁగువారు
గీ. వర్ణభేదమ్ము తలఁగింపవలె నటంచు
నఖిలపాషండసంప్రదాయములఁ దెచ్చి
యలజడి యొనర్పసాగిరి నాస్తికౌఘ
మవధి దాఁటుమహాంభోధియనువు దోఁప. 12.

సీ. అకృతకమ్ములు శ్రుతు లనుమాట నమ్మరా
దున్న దే కర్త లే కొక్క క్రియయు
నాకమే లేదు జన్మమ్మున నెటుగల్గుఁ
బశుమారణాత్తపాపంబు గాక
పారవశ్యమ్మె నిర్వాణమ్ము గాన సీ
ధురససేవన యది దొరకు హేల

నింద్రియక్షోభమ్ము హింస యాట యథేష్ట
విహరణంబె ధర్మవృత్తి హేతు

గీ. వనుచు స్వేచ్ఛాప్రచారులై యాదిగౌత
మోదితసుశీలమునుగూడ నుజ్జగించి
కేవలము వేదచోదితక్రియల కెదురు
సలుపుటె మతంబుగా నాస్తికులు ప్రబలిరి. 13

మ. అది యెల్లం గని యక్కుమారిలుఁ డహింసాదిప్రబోధం బొన
ర్చుదయాళుం డగుబుద్ధదేవుమతమున్ గ్రూరంబుగాఁ జేసి రీ
వదరుంబోతులు పెక్కురై యెటు సహింపన్ జెల్లు నీపెడ దు
ర్మదులన్ వీరి నడంపకున్న శ్రుతిధర్మం బెల్ల వమ్మయ్యెడున్. 14.

మ. మసి యాయెన్ గులరీతి వేదము కళామాత్రంబు శేషించె నె
క్కసమాయెన్ జినధూమకేతువుల లెక్కం బెట్ట హో యంచు మా
నస మింతింతగ వ్రీల నాస్తికమతాంతర్వాణులన్ గెల్వ నెం
చి సభారంగములందు నోటువడెఁ దత్సిద్ధాంతమర్మజ్ఞతన్. 15.

గీ. శత్రుపక్షరహస్యవిజ్ఞాత కాక
జయము నెటు పొంద నౌ నంచు సౌగతాగ
మంబు పఠియించుపూన్కిఁ దన్మతగురువుల
నెందఱినో వేడి వైయర్థ్య మెనసి పొగులు. 16.

ఉ. వైదికకర్మశీలుఁడు సవంబు లొనర్చినసౌనికుండు చీ
చీ దయమాలువాఁ డని హసించుచుఁ దిట్టుచుఁ బొమ్మటంచు మ
ర్యాద దొఱంగి పల్కుటయు నక్కట యెట్టు లెఱుంగు టంచుఁ జిం
తాదహనంబు నిచ్చలు మనం బెరియింప సహించె నాత్మలోన్.

క. ఆరీతి గొన్నిదివసము
లోరిచెఁ గానీ జిగీష యుక్తాయుక్తా

చారవిహారుని జేయఁగఁ
జోరక్రియనేని జదువఁ జూచి మనమునన్. 18.

కుమారిలుఁడు బౌద్ధాగమము లభ్యసించుట.

మ. "కపటోపాయము సన్నిద్ధైన రిపుమార్గంబున్ గ్రహింపందగున్
గపటిన్ గైతవరీతిచే గెలువ నౌఁగా" యంచు భావించి జై
నపరివ్రాజకవేష మూని యొకజైనప్రాజ్ఞు శుశ్రూషచే
సి పఠించున్ సుగతోక్తిమర్మములఁ దచ్ఛిష్యాంతరాసీనుఁడై. 19.

కం. కించిన్న్యూనముగా గ్రహి
యించెను దన్మతరహస్య మెల్లఁ దెలియ, నా
వంచన మెఱుంగకుండఁ జ
రించుచు నుండఁగ నొకప్డు క్రించుఁదనమునన్. 20.

కం. ఆగురువు వేదమాతను
వేగతుల వినింద సలుప వీనులు ప్రిదులన్
మూఁగయటు లుండె నైనను
నాఁగక యాసుధికిఁ గనుల నశ్రులు వొడమెన్. 21

గీ. నింద హెచ్చ బుధేంద్రుకన్నీరు వెచ్చ
నయి కణాకృతి నొక్కమా ఱవని రాలె
బౌద్ధమతలక్ష్మి గూడ నప్పట్ల విడిచె
నాత్మసంతుష్టయభిజనితాశ్రుకణము. 22.

గీ. పాఠము సమాప్త మయ్యె నప్పట్ల నుండ
కెటకొ యాతఁడు సనుడు నచ్చట సతీర్థ్యు
లెల్ల గుమిగూడి 'కనుఁబ్రామి యెవఁడొ వీఁడు
మనరహస్యము లెఱుఁగవచ్చినఖలుఁడంచు. 23.

క. కాదేని మనగురుం డటు
వేదము దూషింప నట్లు విలపించునొకో
వైదికుఁ డగుటయు నిజము ప్ర
మాద మ్మొనరించుపొత్తు మన కందఱకున్. 23.

క. అని తర్కించి వినిశ్చయ
మును గురునకుఁ జెప్ప నతఁ డపూర్వామర్షం,
బున వీనిని రే నిద్రిం
చినతఱి సౌధంబునుండి క్షితిఁ ద్రోయుఁ డనెన్. 24.

ఉ. నా విని శిష్యు లెల్లరు మనంబునఁ బొంగుచు వల్లెయంచు నా
రే వివశత్వ మొంది నిదురించుతనున్ మహిఁ ద్రోయఁ గూలుచున్
దైవవశాన మేల్కొని మొదల్ దలఁచెన్ 'శ్రుతులే ప్రమాణ మా
నో విపులాధిపాతహతి సుంతయుఁ బొంద' నటంచు ధీరుఁడై. 25.

గీ. అటుల తలఁచుచు సౌధాగ్రమందునుండి
పుడమిఁ బడి కీడొకింతయుఁ బొరయఁ డయ్యె
గాని 'శ్రుతియె ప్రమాణంబ యేని' యనిన
సంశయార్థక మొకటన్న చదిపి నైచె. 26.

—♦ కుమారిలుని దిగ్విజయము ♦—

మ. తొలుతన్ సౌగతు లన్న నేవపడు, నందున్ దన్ను వారట్లు గా
సిలఁ ద్రోయన్ మఱియింత దాని బలియించెన్ జెప్ప నే మున్న ద
య్యలఘుజ్ఞాని త్రయీవిఘాతకుల మాయం జేయ మాత్సర్యసం
కలితాంతఃకరణంబునన్ వెడలె దిగ్వాటంబు లాటాడఁగన్. 27.

శా. క్రౌంచారాతి వతార మన్నప్రథతో రాజిల్లుచున్ భట్టపా
దాంచన్నామమునన్ జెంద చరణవ్యక్తీకృతం బౌజగం

బించఁ జేయుసహస్రరశ్మివలె గౌరీశాజ్ఞ ధాత్రిన్ వెలా
రించెన్ జైమినిసూత్రితం బగుత్రయీబృందంబుతాత్పర్యమున్.

గీ. అటుల ప్రకటించుచు జయించు చఖిలదిశలు
క్రమముగ సుధన్వనృపతి పురంబు సేర
నెదురు సనుదెంచి ప్రమొక్కి భూమిపుఁ డపుడు
పూజ నొనరించె విధ్యుక్తముగను భక్తి. 29.

మ. నరనాథార్చితుఁడై బుధుఁడు ముద మారన్ జేని దీవించి త
త్పరిపన్మధ్యసువర్ణపీఠి నమగోద్యానం బధిష్ఠించుచున్
సురభింబోలె నలంకరించి సవిధక్షోణిజరాజత్ప్రిక
స్వర మాలించి వచించె భూభుజుని దద్వ్యాజంబునన్ ధీరతన్. 30.

క. శ్రుతిమాసకరుతి మలినా
కృతి నీచైర్గతియు నైనయిక్ష్వాకవిపం
తతిసంగతి నీ కోపర
భృతము కలుగదేని ఖ్యాతి కిరవౌ దనినన్. 31.

క. సాభిప్రాయం బగుద్విజ
నాథావణ మాలకించి యంఘ్రితలస్పృ
ష్టాఖిలభుజగములవలె
క్షోభించిరి కినుక నచటిసుగతమతస్థుల్. 32.

గీ. బుద్ధసిద్ధాంతధాత్రీజములను యుక్తి
పరశువునఁ దున్మి తూటాడి భట్టపదుఁడు
ప్రోగుసేసినతద్గ్రంథరూపకేంధ
నముల రవులించె గోత్రధాగ్ని నాల్గుకడల. 33.

క. రోషారుణరుచికలితను
లౌషశభిజ్ఞాననముల నానృపుపథ ప్రి

త్యాపాతపత్రమనలిన
భూషితసరసీపరికారమున నలరారెన్. 34.

మ. వాగ్రాక్షేప మెలర్ప నొండొరుల గెల్వం బూనువాదోపవా
దారావంబు రసాతలం బవియఁ జేయన్ సాగె; నాధీరుఁ డే
పారన్ గూర్చి నధోగతిన్ క్షణములో నాజైనగోత్రాళికిన్
సారామేయకఠోరతర్కములఁ బక్షచ్ఛేదమున్ జేయుచున్. 35.

ఉ. విజ్ఞుఁడు భట్టపాదుఁ డరిబృందము దాల్చు ననన్యసాధ్యస
ర్వజ్ఞపదంబు నోర్వని తెఱంగున వారిని బొమ్మలట్టుల
వాగ్విజ్ఞులభాతి మానపరిరబ్ధులఁ జేసి, నరేంద్రు డాసి, స్వ
ప్రజ్ఞఁ బ్రశంససేసె శ్రుతివాఙ్మహిమంబు సుబోధ మానలుల్. 36.

ఆ. అపుడు రాజు పలికె నాకుమారిలుని వి
ద్యావశంబు గద జయాజయంబు?
లీయహార్యశృంగ మెక్కి వేదమహత్త్వ
మెఱుకనడఁగఁ బుడమి నుఱుకఁగలవె? 37.

ఉ. 'వేదము బ్రహ్మరూప మని వేదము సర్వచరాచరంబు ను
త్పాదన సేయుఁ బ్రోచును యథార్థ' మటంచు వచింతు తత్తయీ
మేదురశక్తి నీవు పుడమిన్ బడి చావక నోవ కున్న నీ
పాదము లాశ్రయించెద భవద్గురుభావము నమ్మి యుండెదన్. 38.

వ. అని ధీరముగాఁ బలికె నంత.

చ. అది విని బౌద్ధు లొండొరుల మానసముల్ గనుఁగొంచు నుండ భూ
త్రిదశుఁ డకృత్రిమోక్తుల స్మరించుచుఁ దద్గిరిశృంగ మెక్కి స
మ్మదమున బొంగి 'వేదము ప్రమాణము కాన నొకింత హాని నా
కొదవదు వేదమాతృపదయుగ్మమె నాకు శరణ్య మయ్యెడున్. 40.

శా. ఆలింపుండి సమస్తలోకులు త్రయీ వ్యాహారముల్ శాశ్వతం,
బాలోచింపఁగ దైవ మాశ్రితచయాధారాధీనమై వెల్గుఁ, ద
ల్లీలాకల్పితలోకసంచయుఁడు నాహ్వార్యర్థియై యుండి యీ
శైలాగ్రిచ్యుతు నన్నుఁ బ్రోవఁగ నుపేక్షం జేయఁ డే నమ్మితిన్'. 41

మ. అని యుచ్చైర్నినదంబునన్ నిగమమాహాత్మ్యంబు నగ్గించి మె
త్తనిపూసెజ్జను వ్రాలుచందమున గోత్రిన్ వ్రాలె నాకాశచుం
బనచుంచుక్షితిభృన్మహోన్నతశిరోభాగంబునం దుండి ‘జే’
యనుచున్ నిర్భరధైర్య మూని జనహాహాకారముల్ మీఱఁగన్.

క. దాహిత్రివితీర్ణశ్రీ
మోహానిచ్యుతసురాలయు యయాతిఁగ సం
దేహించిరి చూపఱు తుం
గాహార్యశిరోనిపతదనంతామరునిన్. 43.

ఆ. కొండనుండి తూలపిండంబు డంబున
నుఱలు నితఁడె లోకగురుఁ డటంచుఁ
దన్ను నమ్మువారి దైన్యము పోకార్చు
శ్రుతియు యనుచుఁ బలుకఁ జొచ్చె జనము. 44.

శా. జీమూతోత్థిత గర్జిత శ్రవణ విశ్లిష్టాత్మకుం జాహింభుక్
స్తోమాకార తదద్భుతక్రమకృతి స్ఫీత్యుద్గతానేకది
గ్ధామ బ్రాహ్మణవృత్తు నక్షతు బుధుల్ దర్శించి తేఁదుల్ శ్రుతి
ప్రామాణ్యమ్ముగ్రహించి మాఱుకొనుచున్ బౌద్ధాళితో నిట్లనున్.

గీ. కంటిరే వేదవాక్యములఁ గలుగు మహిమ
మెఱిఁగితిరె దేవుఁ డున్నట్టు లిప్పుడేని

యనుటయు సమంతభద్రమతానుయాయు
లని రనంగీకృతినిఁ దెల్పు చవనిపతికి. 46.

గీ. 'అవనిపాలక! మతనిర్ణయమున కిది ప్ర
మాణ మెటు? లోషధుల మణిమంత్రముల శ
రీరతు యగా' ననుచు నైంద్రియికవిషయ
మపలపింపఁగ నృపుఁడల్గి యనియెనిట్లు. 47.

శా. ఆకాశోన్నతభూరిభూమిధరశృంగారోహియై వేదవా
చాకారుణ్యబలంబునన్ ధరణిపైఁ జాకుండ వ్రాలంగ, ని
ర్భీకప్రక్రియ నప్రమాణ మనినారే మిమ్ము నే శ్రోత్రియ నే
వీరల్ మందులఁ జానకుందురో కదా వీక్షింపఁగాఁ దగ్గదే. 48.

గీ. అని కుమారిలు బలసియున్నట్టిద్విజుల
బౌద్ధపండితమండలిఁ బొఱఁజూచి
వేదమునకును మణ్యౌషధాదులకును
గలమహిమభేదములు చూపవలయు నేఁడ. 49.

చ. అడిగెద నొక్క ప్రశ్న మిము నందుల కుత్తర మేరు చెప్పలే
కెడయుదు రట్టివారి పథియుంచెద యంత్రశిలావిఘట్టనన్
బడి చని భూరికుటీభయదఘాతము దోఁప ద్విపక్షవాదులున్
గడగడలాడి పోవఁ బ్రతినన్ సహాయించి క్షితీశుఁ డయ్యెడన్. 50.

క. ఏకతమున నొకఘటమునఁ
గాకోదర ముంచి మూఁత గట్టిగ నిడి మీ
రీకడవ నేమి యున్నదొ
వాకొనవలె ననుచుఁ బిడుగపాటుగఁ బలికెన్. 51.

క. ద్విజుఁడున్ సౌగతులున్ భూ
భుజుఁ గని యెల్లిటిప్రభాతమునఁ జెప్పెద మీ

నిజ మని ప్రసన్నుఁ డొనరిచి
నిజవసతుల కరిగి రెవల నెవ్వఁగ మిగులన్. 52.

మ. పచరించెన్ ద్యుమణిన్ గుణించి తప మాఁబాదబ్యు మారేయు ప
ద్మచయప్రక్రియఁ గంఠదఘ్నజలమధ్యస్థానులై యంతటన్
వచనీయాంశ మినుండు చెప్పి యభిధానం బొంద నేఁతెంచె వి
ప్రచయుం బట్టులె వచ్చె జైనతతి కుంభస్థాపితాగ్రజ్ఞమై. 53.

చ. క్షితిపతి సింహపీఠ్యాన వసించి సభన్ నలువంకఁగాంచి 'చే
రితిరె ద్విపక్షవాదులు నెఱింగితిరే ఘటగుప్తవస్తు' వం
చతిసతుఃమ్ముతో నడుగ నాస్తికులద్ద గుణించిజ్యోతిష
ప్రతిభ వచించి రిందు నొకపన్నగ మున్నదియంచు సత్యమున్ 54.

వ. అంత భట్టారకుఁడు సభామధ్యస్థం బగుకుంభంబున కెట్టయెదుట నిలిచి యంజలిబంధ బంధురుండై.

సీ. ఆమ్నాయపేటిక యైనమార్తాండుండు
ప్రానాదరాజ మేప్రభువరునకు
శబ్దశాస్త్రానుశాసకుఁడైన శేషాహి
హారంబట్టుతలిమ మేహరాయలు కాని
కఖలాంతరస్థుఁడై యూడించు బొమ్మల
మాడ్కి లోకముల నేమాయలాఁడు
యజ్ఞమ్ములందు హవ్యప్రీతుఁడై స్వర్గ
ఫలమిచ్చు యాయజూకులకు నెవ్వఁ

గీ. పట్టిశ్రీపతి యాదినారాయణుండు
శంఖమును జక్రమును గద శార్ఙ్గధనువు
కరచతుష్టమున కలంకారములుగఁ
గుండలోఁ గుండలీంద్రుపై బండియుండె.

క. అనుటయుఁ దోడిద్విజన్ములు
నని రటులసలె; మింటనుండి 'యది సత్య మటం
చు నొక యశరీరవాణియు
విననయ్యెను సభ్యు లెల్ల విస్మయ మొందన్ 17.

క. నరనాథుం డది విని య
బ్బురపడి తత్సమితిమధ్యమునకు రయమునై
నరుదెంచి కాలుఁ గేలుం
గరము వణఁక ఘటము మూఁతఁ గ్రక్కునఁ దోచెన్. 58.

శా. కుంభాచ్ఛాదనమున్ దొలంచుటయు నక్కుంభీనసాంగంబునం
దంభోజాక్షుఁడు దోశ్చతుష్కమునఁ జక్రాద్యాయుధంబుల్ వెలుం
గం భాషాపతి నాభిపద్మమున వెల్గన్ లక్ష్మి కాళ్లొత్త నీ
లాంభోదమ్మటు లెస్స పండికొనినట్లై మాయమయ్యెన్ వెసన్.

సీ. పృథివీశ్వరుం డశరీరవాక్యంబుఁ గుం
భాచ్ఛాదన మ్మూడ్చి యరసె లోన
నరయ వాసవునకు నమృతము ప్లాఘుట
మందుఁ జూపట్టెఁ గంజాక్షుమూర్తి
న్యస్తాన్యవస్తుసందర్శనమ్మున ధరా
పతి సంశయము వాసి శ్రుతిని నమ్మి
శ్రుతివినిందకులు దుర్మృతికి సిద్ధులు గం డ
టంచు ఘోరముగ రాజాజ్ఞ వొడమె
గీ. నాతుషాగాద్రి యాసేతు వవనిఁ గల త్ర
యీవిరుద్ధుల నాబాలవృద్ధకముగ
సంహరింపనిభృత్యుండు చచ్చువాఁ డ
టంచు నతిభీకరముగ శాసించె నృపతి. 60.

ఆ. త్రుంతు రిష్టునేని దోష మించుక సేయు
నంతమాత్రమున మహాత్ము లలిగి
చంపలేరె తొల్లి జామదగ్న్యుఁడు పాడి
తప్పి నడచుఁ గన్నతల్లిఁ దానె. 61.

క. స్కందానుచరుం డగునృప
చందిరుచేఁ బడిరి ధర్మశత్రులు జైనుల్
క్రందుగఁ; దత్త్వాలంబా
ప్తిం దనరెడు యోగిచేత విఘ్నములగలిన్. 62.

సీ. శ్రుతి ప్రమాణమ్ముగా మతిఁ దలంచెద మంచు
విలపించి మ్రొక్కువారలను దక్క
శ్రౌతకృత్యముల దూఱ మిఁకెన్న డేచుఁ గం
పిలి యంగలార్చువారలను దక్కఁ
జీనాది దేశముల్ చెదరిపోయి మతంబుఁ
దొలఁగక బ్రతుకువారలను దక్కఁ
నవమానమున నాత్మహత్య గొగ్గి శరీర
ముల విసర్జించువారలను దక్క
గీ. నెల్లెడ నసించు నాస్తిక బృందములను
వెదకి వెదకి వధించిరి విపులయంత్ర
శిలలఁ గదియించి నృపునాజ్ఞఁ దల ధరించి
కలికమున కేని లేకుండుకరణి భటులు. 63.

ఉ. కాలగతిన్ దమం బడఁగఁ గాంతితతిన్ రవియట్లు జైను ల
న్యేశ నశింప వేదపదవిన్ బ్రసరింపఁగఁ జేసె విప్రుఁ, డా
లీల మృగేంద్రుఁడొచ్చు కబళించె రిపుద్విపకోటిఁ గాపునన్
గ్రాలె నిరంతరాయగతిగా ద్రుమతిశాఖలు గ్రమ్మ నద్రిశల్. 64.

కుమారిలునిపశ్చాత్తాపము.

మ. అవమానంబున కోర్వ కాత్మనధర్మత్యాయత్తు లావారిలో
మిపులర్ ముఖ్యుఁడుగాఁ గుమారిలునకున్ బెంపార బౌద్ధాగమం
బు వినేయుం డని నేర్పినట్టిగురుఁడున్ ముండ్రై నశింపం, దదీ
యవినాశంబున కేన హేతు వని నిత్యం బాద్విజుండార్తుఁడై. 65.

ఉ. వంచన మేన చేసి చదువన్ దొరఁకొంటినిగాక మాయ యొ
క్కించుకయున్ గురుం డెఱుఁగునే జయ కాంక్ష ఋసీ నయానయం
బెంచఁగనీయ దొజ్ఞ వధియించినపాపము వాయ నిష్కృతిన్
గాంచనె? యెట్టిదుష్కృతియ నొనర్చితి? నాజయ మేల? కాల్పనే 66

మ. అని మీమాంసకుఁ డాకుమారిలుఁడు ప్రాయశ్చిత్తమున్ గోరి స
జ్జనసంఘంబుల డాయ, వారు "జయదీక్షన్ గొన్న తేజస్వి నం
టునె పాపంబు? గురున్ వధింప నఘమున్ బుణ్యంబు సామాన్యులన్
దునుమన్ గల్గునె? యేఁటి కింత కలఁగన్ దోషజ్ఞ! యూలింపుమా. 67.

శా. తేజశ్శాలికిఁ బ్రత్యవాయ మనుసంధింపంగ రా దంచు ని
ర్వ్యాజస్ఫూర్తి స్మృతుల్ వచించును; ద్వదారంభంబు వేదార్థర
క్షాజాగ్రన్మహిమాఢ్య మౌ, నఘము రాగద్వేషమూలంబు- నీ
వాజిన్ రాజభటుండవోలె నిగమజ్ఞా! నిత్యశుద్ధుండవే. 68

శా. ఐనం గాని యుధిష్ఠిరుండు తనక్షాత్రాచారముం బూని యే
నానావైరులఁ దుంచి, యందు గురులన్ బంధూత్కరం బెంచి శో
కానంత్యమ్మునఁ గ్రాఁగి దానికయి ప్రాయశ్చిత్తముం బూనుచం
దానన్ దృప్తికి నీ వొనర్పు తపమున్ ద్యాగంబు యాగంబులున్ 69.

క. అన స్వస్థచిత్తుఁడై య
య్యనఘుఁడు సర్వస్వ మపుడ యాచకుల కొసం

గను గేహక్షేత్రము లి
చ్చెను భూసురతతికి దండసిలఁ బాపంబుల్. 70.

ఉ. యాగములం దొనర్చిన సహస్రగుణం బగుటన్ బ్రయాగ మా
యాగము మాని యున్నను బ్రయాగము యాగఫలంబు లిచ్చునం
చాగమ ముంట నాతఁడు ప్రయాగకు నేఁగి వసించి యెన్నియో
యాగములన్ బొనర్చి చరితార్థతఁ గాంచినవాఁడు సత్తమా. 71.

ఉ. కర్మరుఁడై యఘోరకలికాలమహోఘము లొత్తగిల్లి పో
దుర్మతమర్మహాం డయి శ్రుతుల్ స్మృతులున్ విరులట్ల విచ్చి గం
ధోర్మిల సర్వలోకముల నూఁపఁగఁ జూచుచు నీప్రయాగనే
శర్మమునన్ వసించు శ్రుతిజాగరజై మినిశాస్త్రవర్మమై. 72.

వ. అని కుమారిలభట్టచరితంబు వృద్ధవిప్రుండు దెలుపుచుండ నూఁకొ
నుచు మార్గాయాసంబు గణింపక కతిపయప్రయాణంబుల
సశిష్యుఁడై చని చని. 73.

శంకరుఁడు ప్రయాగ కేఁగి కుమారిలుని దర్శించుట.

గీ. ఔపనిషదరహోవేత్త యఖిలకుమత
భేత్త యతిమాళి సాధితవేదకర్మ
జాలుని గుమారిలుని వాదలీల విజితుఁ
జేయువేడ్కఁ బ్రయాగమ్ము సేరి యంత. 74.

చ. అవహితభక్తి మున్కలిడునట్టి నరాళి మెయిన్ సితాసిత
చ్ఛవిగ నొనర్చుపొంటెఁ గృతసంగకళిందతనూజ యైనజా
హ్నవి నఘహంత్రి భవ్యపురుషార్థపథం బగుదాస భిక్షుపా
ర్థివుఁడు ప్రయాగమధ్యగతఁ బ్రేమ కడల్కొనఁ జేరె నొయ్యనన్.

సీ. భాగీరథీఝరీపరిరుద్ధవేగమై
కాళింది యెచ్చోట జాలువాఱు
నమలరుక్సంప్రదాయము నేర్వ నెందేని
నంచలు జలము సేవించుచుండు
శర్వరీసహవాససౌఖ్యార్థులై చక్రి
యుగము లెచ్చటినీట నొలసి యుండు
నాచంద్రతారకం బమరాకృతుల సుఖ,
యింతు రెచ్చో మునుక లిడినవారు
గీ. గ్రాలునంతఃప్రవాహ సరస్వతి యెట
యమున యై గంగయు నయి సితాసితముగ
నట్టివేణీత్రితయసంగమాంబులందు
మునిఁగి శంకరగురుఁ డిట్లు వినుతిసేసె. 76.

గీ. సిద్ధనది! శంకరజటోపరుద్ధ వగుటఁ
గ్రుద్ధ వయ్యుఁ దన్నిభులఁ బెక్కుర సృజింతు
బద్ధఁ జేయరె జటల నవ్వారలు జడ
బుద్ధు లెఱుఁగంగలారె రాఁబోవుదాని. 77.

ఉ. అంబరొ సత్పథానుసరణాతికుతూహల వయ్యుఁ దాల్తు హే
యం బగుసస్థులన్ సతత మక్కట యే మనుకొంటిఁ గాం స
త్యంబు నెఱింగితిన్ ద్వదమలాంబునిమజ్జను లైనసజ్జనౌ
ఘంబు నలంకరించుటకుఁ గా నివి యెల్ల గ్రహింతు వాస్థమై. 78.

గీ. ఔర స్వాపానుషంగజాడ్యము గనుజ
నాళి స్వాపానుషంగజాడ్యాపగతుల
సల్పుదువు విషయవిరక్తజనుల ధూర్త
మాళిల నొనర్తు విది యేమి మార్గమమ్మ. 79.

సీ. అనుచుఁ ద్విజేశుని వినుతించుచుఁ గటీర
మున శాటికను జుట్టుకొని కరయుగి
వైణవదండ ముప్పర మెత్తికొని పట్టి
యఘమర్షణానగాహం బొనర్చి
చరితార్థుఁ డయ్యెఁ దా జనసంగ్రహార్థమ్ము
సచ్ఛాత్రుఁడై యందు స్నానమాడు
నత్తఱిఁ దనుగర్భమందుఁ దాలిచి కని
పెంచఁ బాట్లొందుసవిత్రిఁ దలఁచి
గీ. తీర్చికొని యనుష్ఠాన మత్త్రరమునఁ ద
మాలసుచ్ఛాయఁ గల్హారపాళిశీత
వాతసేవల విశ్రాంతి వడయువాఁడు
శంకరుం డొక్కజనవార్త సరగ వినియె. 80.

—: తుషాగ్నిప్రవిష్టుఁ డగుకుమారిలుని శంకరుండు దర్శించుట :—

గీ. సజ్జనుల కేడ్గడయునై యచలము నుండి
యిలఁ బడి శ్రుతిప్రమాణత నెవఁడు చాటె
నెవ్వనిప్రసాదమున వేల్పు లెప్పటట్ల
యజ్ఞభాగంబు లొందుభాగ్యంబు గనిరొ. 81.

క. అట్టిఘనుండు కుమారిల
భట్టపదం డకట స్వగురువధపాప మడఁగ
జిట్టుముకచిచ్చులోఁ బడె
నట్టె త్రయీహృదయవిజ్ఞుఁ డాస్తికుఁ డగుటన్. 82.

గీ. ఆతఁ డొకపాటివాఁడె యధీతవేద
జుష్టమంత్రుండు ప్రచారితదుష్టతంత్రుఁ
డఖిలతంత్రస్వతంత్రుండు నిఖిలభువన
మండలీభ్రాంతకీర్తియంత్రుండు దలఁప. 83.

క. అనువార్త విని యతియుఁ జ
య్యనఁ జని తుషరాశిసంస్థు నాభట్టపదున్
గనియెఁ బ్రభాకరముఖశి
ష్యనివహ మశ్రువులు గాఱ నర్చ లొనర్పన్. 84.

క. పొగయుచు రవులుతుషాగ్నుల
సెగల నశేషముగ మేను చిటచిటఁ గాలన్
వగ లేని మొగము బాష్పో
పగతాబ్జ మనన్ వెలుఁగు వానిం డాసెన్. 85.

సీ. చరమదేహము భస్మసాత్కృత మయి లోని
యస్థులు కాలి మ్రగ్గుచు రాల
దరివగర్భనాడీకాంత్రములు చిమ్మనఁగ్రొవ్వు
లన నిప్పుఁ జుయి చుయ్యనుచు నార్పఁ
బలలపిండమ్ములు భస్మమ్ము గాక చి
ట్టెము గట్టి కమరుగంధములు గ్రిక్కఁ
గాలఁగా మిగిలి సూక్ష్మముగఁ గాలెడుచర్మ
మున బుస్సు మని కప్పుపొక్కు లెగయ
గీ. మలయునిష్కలదహనధూమ్యాపరితాన
మునఁ గనుంగవ గనరాక కనుచునున్న
భట్టపాదుని గని యార్తి పట్టఁజాల
కంతటవిరాగి శంకరుం డశ్రు లొడ్చె. 86.

ఉ. అంతలఁబొంతలన్ గనఁగ నౌనఘున్ యతిచంద్రునిన్ గటా
క్షాంతనిరీక్షఁ గాంచి జ్వలదగ్నిసభుండు జిటీఁగ నేపలా
క్సంతతిరక్షకుం డగు ద్విజన్ముఁ డదృష్టచరున్ విబుద్ధవృ
త్తాంతుని గంటి నేఁ డనుచు నానినమోదము చెప్ప సాధ్యమే. 85.

గీ. అవశుఁడై పడియుండె నాద్విజుండు
శిష్యతతిచేత భక్తిఁ బూజింపఁ జేసె
భిక్షుఁగాని శంకరుండుఁ దృప్తిని దనర్చి
స్వకృత మగుబ్రహ్మసూత్రభాష్యంబు సూపె. 87.

క. అది యట్టిద సుజనదయా
స్పద మయినని నిఖిల మగునిబంధనము యశః
పద మొందుఁ; గానియెడ నం
దదుకుబ్రతుకు గాంచవచ్చు నణఁగ వచ్చున్. 87.

వ. అంత భట్టపాదుం డాగ్రంథమును గన్నులఁ గాంచి యుస్సురని
వగచి యిట్లను.

గీ. ఇట్టి దీక్షను నేను గ్రహింపనేని
భాష్యములకు రచింపనే వార్తికములఁ
గనఁగఁ దత్ప్రథమాధ్యాయమున కెనిమిది
వేలవార్తికముల యవలీలఁ గావో. 88.

ఉ. సారవిహారసంసరణసాగరమగ్నులకున్ భవాదృశో
దారచరిత్రులైనమహాత్ములసంగతి యొక్కటే సుమీ
పారము సేరఁగాఁ దగునుపాయము గా; కితరంబు లేతదు
త్తారణశక్తి నుత్తవె కదా వగ దా సలుపన్ జగద్గురూ! 89.

క. చిరముగ భగవంతుని నిను
నరయఁ గోరెదను నేఁటి కది తీరెను సం
సరణార్థ్యగు లగు నరులకుఁ
గర మభిమతసిద్ధి యిష్టగతిఁ గలుగునొకో. 90.

గీ. కాల మిష్టుఁడో నొకవేళఁ గలుపుఁ
గలుపు నొకప్పు డరిష్టులౌ ఖలులతోడ
నటుల కలిపియు నెడఁబాపు నంతలోన
కష్టసుఖములు కాలంబుకైవసములు. 93.

వ. అనవుడు యతిపుంగవుఁడు 'సిబుధేంద్రా! భవదీయచరితం బంతయు వింటి. భావత్కం బగుతంత్రవార్తికం బధ్యయనించితి. నీవు మహీతలంబునం దవతరింపవేని జైమినిప్రయాసంబు వ్యర్థంబుగాదె. హవ్యంబుల దేవతలకు గవ్యంబులఁ బితరులను దనిపితివి. వైదికమతకంటకు లగుజైనాదిపాషండజనంబుల నుచ్చాటనం బొనర్చి జన్మం బర్థవంతము గావించికొంటి వైన నేమి నేఁ 'డాజైనగురుద్రోహము నీశ్వరనిరాస మనునిజదోషద్వయపరిహారకంబుగఁ దుషాగ్నిఁ జొచ్చి తని కింవదంతి యాక్షేత్రంబునం దాలించితి. తుషాగ్నిప్రవేశ హేతు వది యగునే వినవలతు ననుటయుఁ గుమారిలుఁ డిట్లనె 94.

సీ. చదివినాఁడను వేదశాస్త్రమ్ము లామూల
మాచూడముగ బాల్యమంద శ్రద్ధ
విరచించినాఁడ నిస్ఫురదీక్షఁ దంత్రవా
ర్తికముఖ్యకృతులు సుప్రతిప్రియముగ
గెలిచినాఁడ సభాస్థలుల వితండావాదు
లగుజైనకోటి వెంపఱఁ గడంకఁ
బొందినాఁడ ననర్ఘములు భోగములు, యాగ
ముల దైవతర్పణంబు దొలఁచికొంటి
గీ. వేదమార్గరిరక్షమై వెదకి వెదకి
నాస్తికులఁ బలుమాఱు వేఁటాడినాఁడ

వార్ధకమునఁ బ్రయాగకు వచ్చినాఁడ
వ్రతి నౌచుఁ గాల మిటఁ బుచ్చి నైచినాఁడ. 95.

సీ. అక్షర మ్మొక్కటి యైనఁ జెప్పినవాఁడు
గురుఁ డనుమాట నే నెఱుఁగనొక్కొ
స్వమతాభిమానవిశ్వాసంబులు గురుండు
తనుఁ దా నశింప నాతప్పు దెట్లు
గరుఁడు సౌధమునుండి కూలఁద్రోయింప జీ
వించియు నింత నిందించితినొకొ
నృపతి యారీతిపన్నిదము వెట్టెను గదా
నేన యోడినఁ జాక నిలుతునొక్కొ
గీ. కుమతవిధ్వంసనము సేయుకొఱకుఁ గెలుతుఁ
గాని గురుఁ జంప నూహించి కాదుగద! య
జాక్షపాణీయముగ నది సంఘటిల్లెఁ
జేసికొంటి దానికిని బ్రాచితము దేవ! 96.

శా. నామూలంబున దేశికుండు బలవంతావైనచా వొందినాఁ
డేమో యంచు ననేకనిష్కృతులు మున్నే చేసికొన్నాఁడఁ జు
మ్మా మీమాంసకుఁ డౌట 'శత్రుజయమం దేదోషమున్ లే'దటం
చామోదించిరి ధర్మవేత్త లలరాఁ డా సేతుశీతాద్రులన్. 97.

మ. 'భృగుపాతంబా తుషాగ్నిలోఁ బడుటా వారిన్ జొచ్చుటో సల్పఁగా
నగుఁ గాయం బసమర్థమౌనెడలఁ గర్మాసక్తుఁ డౌ వేత్త, పు
ణ్యగతుల్ హస్తగతంబు లావ్రతి' కటం చామ్నాయముల్ దెల్పవో
పగవా రట్టుల కింవదంతులను నాపై మోపినా రేమొకో. 98.

క. వాని నటుపెట్టు పాండవు
లానాఁడు తనూనిరీహు లగుచు మహాప్ర

స్థానమ్ము సలుపరే యటు
తేనున్ జొచ్చితిఁ దుషాగ్ని నిది వ్రతము సుమీ. 100.

చ. శ్రుతియ స్వతఃప్రమాణ మనుచున్ బ్రకటింపఁగఁ బూని వేనిసం
గతి మొదఁబాయ నించుకసుఖంబును గూడఁ బ్రపంచ మీయ న
ర్థ్వాతఁ గనఁ జాలదో-యొకపు ద్వైనను నాశ్రుతిలోకసిద్ధు నం
చితపరమార్థు నీకు నిరసించితిఁ గాని యొనర్ప నిహ్నుతిన్. 101.

గీ. నీవు భాష్యమ్ము సేఁత వింటిసు ముదంబు
గంటి నద్దానికిని వార్తికంబు గూర్చి
యశము గనువాఁడ ననుకుతూహలము గందు
నేమి లాభ మామాట నే నిపుడు నుడువ. 102.

ఉ. ఆతతసారతత్త్వమున నార్యజనంబులఁ బ్రోవఁ,గావ న
ద్వైతము, భూమిఁ బుట్టుభగవంతుఁడ వంచు నెఱుంగుదున్ యతి
వ్రాతలలామ! మున్న కనుపట్టి ననున్ జరితార్థుఁ జేయుచో
నీతఱి నిట్టిదీక్ష వహియింప నిఁ కేమన లాభ మే మగున్. 103.

గీ. అకట దీక్ష వహించి తుషాగ్నిఁ బడితిఁ
గాన శాబరభాష్యమ్ముకరణి నీదు
భాష్యమునకును వార్తికపాఠమును ర
చించి యశమొందుభాగ్యము చెందనైతి. 104.

క. అన నీమద్వికసితముఖ
వనరుహుఁ డయి గురుఁడు వలుకు వైదికధర్మా
యనకంటకు లగుజైనులఁ
దునుమఁగఁ బొడమినయుమాసుతుండవు గావే. 105.

గీ. ఆజనుఃపావనుఁడవు నీ కఘము గలదె
యేటి కీదుష్కరవ్రతం బిదె కమండ
లూదకము చల్లి బ్రతికింతు నొనర భాష్య
వార్త్రికమ్మొ రచింపు ధీవర్య లేచి. 106

ఆ. అనెడుబుధవతంసు నాత్మవిద్వర్యుని
శమధనైకధుర్యు శంకరార్యుఁ
బ్రశ్రియంబు దోఁపఁ బలికె విద్యాధనుం
డైనభట్టపాదుఁ డనువుమీఱ. 107

సీ. నీపల్కు లెస్స గానీ, శుద్ధమైనను
లోకవిరుద్ధముల్ సోఁకఁజాల
నాజానకుటిలులందైన వింటనుబోలె
గుణమొ మహాత్ములు గూర్చుచుంద్రు
చిరమృతునేని సంజీవింపఁజేయుదు
పటుదయోర్మిళ దృష్టిపాతముసన
వ్రత మాగమోక్త మారంభించి త్యజియించి
బుధజనాదర మెట్లు పొందువాఁడఁ
గీ. దెలియనె భవన్మహత్త్వ? ప్రాణులను దున్చి
మరల సృజియించునీకు న న్మనుపు టెంత?
యైన విడఁజాల నీపూనినట్టివ్రతముఁ
దారకబ్రహ్మ మెఱిగించి ధన్యుఁ జేయు. 108.

గీ జగతి నద్వైతపథము విస్తరిలఁజేయఁ
దలఁచితేని జయింపు విద్వత్పరార్ధ్యు
మండనాఖ్యు దిగంతసంభ్రాంతయశుని;
నతఁడు జితుఁ డైన జగ మెల్ల హస్తగతమ. 109.

ఉ. ఆతఁడు కర్మయోగమును వ్యాప్త మొనర్చుచు విశ్వరూపవి
ఖ్యాతిని మించె ధాత్రిని; మహాగృహియై శ్రుతికర్మసక్తుఁడై
ప్రీతిఁ బ్రవృత్తిశాస్త్రపదవిన్ బడి, రోయు నివృత్తిశాస్త్ర మ
న్నా! తగుయుక్తి వక్ష్యని నొనర్చుకొనన్ గడముట్టుఁ గోరుకుల్.

వ. "ఉంబేకుం" డనుపేర లోకంబునం బరఁగు నవ్విశ్వరూపుఁడు నాశి ష్యుండై సకలవిద్యామండనుండు కావుటంజేసి మండనుం డనుబిరు దనామంబున వ్యవహృతుం డగుచు నుండు, నుభయభారతి యను పేర నొప్పునయ్యార్యయజ్వాశిరోమణిజాయ "యుంబ" యనునా మంబున బంధుజనులచేఁ బిలువంబడుచుండు. నాయమ దుర్వా సోముని శాపంబున మానవియై జనించినభారతియ యని ప్రసిద్ధి గల దది య ట్టుండనిమ్ము. 111.

క. ఆవిబుధుఁ డఖిలశాస్త్రిక
లావళి నను మించు శిష్యులందుఁ బ్రియతముం
డీ వతనిసతిని సాక్ష్యవి
ధావర్తినిఁ జేసి గెలు మతని వాదమునన్. 112.

గీ. అతనిచేఁ దావకీనభాష్యమున వార్తి
కముల గ్రథియింపఁజేయుమీ యమలచరిత!
సమయమునకు విశ్వేశుచందమున వత్తు
తారకముఁ దెల్పి నను ధన్యతముని సల్పు. 113.

మ. నిలు నిర్వ్యాజకృపా!ముహూర్త మిచటన్,నీరూపు యోగీంద్రహృ
న్నళినాంభోరుహభాగ్యమున్ గనుచుఁ బ్రాణంబుల్ విడంజూతునం
చలఘుజ్ఞాని యతం డనన్ గురుఁడు శుద్ధాద్వైత మంతవ్ప్రహి
ర్గళితాజ్ఞానము బ్రహ్మమున్ దెలిపె నిష్కండామలజ్ఞానమున్. 114.

క. శంకరుఁ డిటు నిఖిలజగ
చ్ఛంకరుఁ డుపదేశ మిచ్చి తా రాష్ట్రధని
శ్శంకగతి మండనాఖ్యుని
భంకరభవనమున కేఁగ వాంఛించుటయుఁన్ 115.

ఉ. మాటలు మాని శాంతిధనమాన్యుఁడు భట్టపదుండు హృత్తమః
పాటన మామమత్వవినివారక మద్వయతత్త్వ మూని జం
జాటము లెల్ల నూడిచి ప్రసన్నము వైష్ణవధామ మొందె న
ప్పాటన శంకరార్యునికృపారస మందుటఁ జూచుచుండఁగన్. 116.

—: శంకరుఁడు మండను దర్శింప నరుగుట :—

గీ. అపుడు భగవంతుఁ డగుశంకరార్యుఁడు సహ
శిష్యుఁడై యోగశక్తిఁ జెచ్చెర నభోయ
నమునఁ జని చేరుకొనియె మండనబుధేంద్రు
కాఁపురం బైనమాహిష్మతీపురంబు. 117.

గీ. రత్నకిమ్మీరవరణ మబ్రమ్ము గూర్ప
సరసి మాహిష్మతీపురాభ్యర్ణవనిని
నంబరవతీర్ణుఁడయ్యె నారాయణావ
తారుఁ డగుభార్గవునిశేవ దంశి యతఁడు 118.

చ. వికసితవారిజాతవనవీథుల నాటల నాడు, చూర్మికో
దకకణశీకరంబులను దానములాడుచుఁ, దీరసాలమా
లిక లెగఁబ్రోఁకి యుంత గదలించుచు నయ్యెడ నర్మదానిలా
ర్భకములు భాష్యకారుశ్రమభార మడంచి భజించెఁ జల్లఁగన్. 119.

ఉ. ఆహరితామలోపవనమందుఁ గృతాహ్నికుఁ డౌచు స్వస్తికా
రోహణశాలియై ఖరకిరుండు వెలుంగ గురుండు శిష్యసం

దోహము గొల్చి రా బుధవిధుం డగుమండనుఁ గాంచు వేడ్కఁ ద
ద్గేహము సేరుచుం గనెఁ దదీయభుజిష్యలఁ ద్రోవ నొక్కెడన్.

గీ. నీరు దేనేగు నప్పరిచారికులను
మండనసుధీందుగృహ మెట నుండు ననుచు
నడుగ నద్భుతశంకరు నతనిఁ గాంచి
ముదితలై యిట్లు పల్కి రమ్ముదిత లంగి. 121.

సీ. మహి వేదము స్వతఃప్రమాణమా పరతఃప్ర
మాణమా యనెడుసంభాషణముల
ఫలము నిచ్చునది నిచ్చలు కర్మమా పర
మాత్మమా యనెడు వ్యాహారములను
జగము శాశ్వతమా యశాశ్వతమా యన్చుఁ
గెరలి వాదించెడుగీఃఫణితుల
యత్యాశ్రమంబా గృహస్థాశ్రమంబా మో
క్షాధాయకం బగు ననెడునుడులఁ

గీ. గిరభామిను లేగృహద్వారబద్ధ
పంజరస్థమ్ములై శాస్త్రపటలి శుకులఁ
జదివి వాదించుకొనుచుండు నదియ మాప్ర
భుండు మండనపండితుం డుండుగృహము. 122.

సీ. ప్రాకారతోరణవ్యాకీర్ణ మయి శిలా
స్తంభశతభ్రాజితంబు నగుచు
గర్భగృహాశ్వరాగారశయ్యాగార
శిల్పనై పుణ్యప్రసిద్ధ మగుచు
సర్వవిద్యాపాఠశాలాప్రపంచసం
భావితతత్స్రోభాగ మగుచు

నఖిలర్తు ఫల లతాంతాంచిత తరులతా
భ్యర్హితప్రమదావనాఢ్య మగుచు
గీ. విబుధమండనమిశ్ర నివేశ మదిగొ
తాళభూజోచ్ఛ్రితంబు విద్యాలయాంక
విలసితం బయి రెండువీధులకు నడుమ
వైజయంతంబు తలఁదన్ని తేజరిల్లు. 123.

క. అం దొక పెద్దవితర్దిక
యందుఁ గద్దియ వసించి యావిబుధుఁడు రా
త్రిందివము శిష్యబృందము
లం దనుపు శ్రుతిశ్రుతమ్ములను నేరుపుచున్. 124.

గీ. గృహముననె యుండె నేఁడు పైతృకము నెఱపు
చున్నవాఁ డన్యులను జూడ నొల్లఁ డితరు
లింట గా లిడకుండ బహిష్కవాట
బంధన మొనర్చె నెటు లేఁగువాఁడ ననుచు. 125.

మ. పటువాగ్వైఖరి నిట్లు వా రనఁ బరివ్రాణ్మౌళి తాఁ బాదుకా
ఘుటికాసిద్ధు లెఱుంగుటన్ దివిఁ జనన్ గోరెన్ మదిన్, గాని యా
తటిలో నాచెఁ నతండు ధిక్కరణముల్ గావించు నేమో విశం
కటదీక్షన్ బితృకార్యమున్ నెఱప విఘ్నం బొందు నన్భీతిచే. 126.

క. కావున ముందుగ నీయం
తేవాసుల నంపి వార్త తెలిపినచో న
న్నావిప్రుం డతిథిగఁ గొని
పోవును దనయింటి కనుచు బుద్ధిఁ దలఁచుచున్. 127.

శంకరశిష్యులకును, మండనశిష్యులకును వాక్కలహము.

ఉ. అచ్చట నొక్కెడన్ నిలిచి యారసి శిష్యుల 'మీర లేఁగి మే
మిచ్చట నున్నవార్త వచియించి బుధేంద్రుఁడు సమ్మతించెనే
నిచ్చటి కేఁగుదెం, డవుల నేఁగుద మప్పుడ' యంచుఁ బంపఁగన్
జెచ్చెర వారు మండనమనీషి గృహావరణంబు సేరుచున్. 128.

ఉ. కాంచ బహిష్కవాట మతిగాఢపినద్ధమహార్గళంబు గా
వించుట నోచరించుటయుఁ బెద్దయెలుంగునఁ బిల్చి పిల్చి 'యో'
యం చొకమాఱు పల్కనటుఁ లైన నొకింత దిటంబునన్ బ్రతీ
క్షించుచు నుండ మండనుభుజిష్యులు తీసిరి తత్కవాటమున్. 129.

ఆ. తీయునంత లోని కాయతుల్ బిఱబిఱఁ
జొచ్చి వచ్చుచుండఁ జూచి మీర
లెవ్వ రేమిపనికి నేఁతెంతు రివ్వేళ
ననఁగ వారు మండనార్థ మనుచు. 130.

చ. మొదలిటికక్ష్య దాఁటి చనఁ బో నట మండనశిష్యు లొక్కమై
యెదురుగ నేఁగుదెంచి జనియించెకికోపము దీగ్గఁద్రావునె
మ్మదులఁ జలాచలావయవమండలిఁ గోకనదోపమాక్షులన్
మదము బయల్పడన్ దదయసం బరికట్టిరి కోఁతిమూఁక నాన్. 131

క. ముండితశిరములు కావులు
దండములు కమండలువులుఁ దాల్చుపరివ్రా
ణ్మండలము గువ్వకరిగొని
దుండగమునఁ బెలుచ నవ్వఁదొడఁగిరి వారల్. 132.

ఆ. నవ్వి పుర్వఁదిట్టి చివ్వకుఁ జేసాచు
మండనాంతవాసిమండలికిని

శంకరార్యశిష్యసమితికిఁ గొంతశోక
నడచెఁ దీవ్రజల్పనములపాడు. 133.

వ. అట్లు పెద్దరొదగాఁ గొంతడవు వారు నడచినపిదప సద్దుమాన్పి మండనశిష్యుం డొకఁడును శంకరశిష్యుఁ డొకండును నిట్లు వివదింపఁజొచ్చిరి. 134.

సీ. ఎటనుండిరా ముండి యిహిహీ యనుచుఁ బల్కు,
నాగళం బే ముండి ననుచుఁ బల్కె
నది కాదు నీత్రోవ నడిగితి నాఁగ, నా
తెరువు నీతో నేమి తెల్పె ననియె
నీయంబ ముండ పోరా యన్నది యనంగ,
నడుగు ని న్నట్లంట న్యాయ్య మనియె
బీతమా సుర యిట్లు పిల్చుచుంటివి నాఁగఁ,
బీత మె ట్లగు సుర శ్వేత మనియె
గీ. నెఱుఁగుదువె దాని రంగు నా, నేను రంగు
నీవు తద్రుచి నెఱుఁగుదు మింత నిజమ
టంచు వక్రోక్తులను నిరసించుకొనుచుఁ
గినుక వెలిఁబుచ్చుకొనిరి ప్రాకృతులపగిది 135.

గీ. అలకళంజసంగ్రసనమదాత్మజాత
దుష్ప్రలాపంబు లిట్టులే తోఁచు ననఁగ
సత్యమాడితివి త్వదాత్మజాతుఁడు పిత
వలెఁ గళంజాశియై పేలువాఁడ యనియె. 136.

గీ. ఖరముమోయఁగఁ జాలనికంథ నకట
మోయఁగలనీకు దుర్వహమ్ములుగ దోఁచె

నా శిఖాయజ్ఞసూత్రంబు లధమచరిత
బ్రహ్మబంధుఁడ నినుఁగన్నఁ బాతకముర. 137.

క. నీజనకుఁ జేని మోనం
గాఁ జాలనిబొంత మోవఁ గలిగితిఁ గానీ
యోజాల్మ! సిగయు జన్నిద
మోజన్ క్షత్రిభార మగుట నుత్సర్జింతున్. 138.

క. ఆలికి నన్నము పెట్టం
గా లావఱి శిష్యపుస్తకభరము మోవం
జాలినబ్రహ్మవినిష్ఠతఁ
దాలుచునీగుట్టు ప్రకటిత: బయ్యెఁగదే. 139.

క. గురుజనశుశ్రూషఁ దొఱఁగి
తరుణీశుశ్రూషయందుఁ దర్పరమతివై
వరవైశ్యకర్మవినిష్ఠతఁ
దరవైశ్యునినడత ప్రకటితం బయ్యె బళే. 140.

క. భామలకడుపునఁ బుట్టియు
భామలు పెంపంగఁ బెరిఁగి బాలిశ నేఁడా
భామల దూఱుచు నుంటి వి
దేమి కృతఘ్నత్వ మూని యేలా బ్రతుకన్. 141.

క. ఎవ్వరినుండి జనించితొ
యెవ్వరిచనుఁబాలఁ గ్రోలి యిటు పెరిఁగితివో
యవ్వెలఁదుల నెటు గవయుదు
వువ్విలుతుని కేలిఁ బశువుపోలిక మూఢా. 142.

గీ. యత్నపూర్వ మగున్న లకట! యుద్వాసించి
వీరహత్య నొంది తౌర జడుఁడ!
పరమపదము బ్రహ్మ మెఱుఁగఁగాఁ జాలక
యాత్మహత్య గంటి వౌర ఖలుఁడ! 143.

క. చోరునివలె దౌవారిక
వారము వంచన మొనర్చి వచ్చెద విస్సీ
పారాశరులకుఁ గూ డిడ
కౌరా మెటు కుడుతు డేగ యట్టుల ఛీఛీ 144.

గీ. కర్మకాలమునందు మూర్ఖాళితోడ
మాదృశులకు వాకొంట ధర్మమ్ము గాదు
తెలివి యతిభంగముగఁ బల్కఁ దెలిసి నోరి
యతికి భంగ మొనర్చు నా కగునె దోసఁగు? 145.

క. "యతివలన భంగ" మని స
మ్మతిఁ బంచమ్యంతమున సమాస మ్మోర్మదు
ర్మతి' చెప్పుకొనుము కా కటు
యతి భంగింపంగ నీకు నలవియె యెపుడున్. 146.

ఆ. బ్రహ్మ మేడ? నిద్రాచారరతు లేడ?
నెచటిసన్యసనము లిట్టికలిని
మృష్టభోజనార్థ మిట్టుల యతివేష
ధారివైతి వంచుఁ దలఁపవచ్చు. 146.

ఆ. నాక మేడ? నిద్రాచారతు లేడ?
నగ్నిహోత్రి మేడ? నకట కలిని
గ్రామ్యధర్మతత్పరతనె కర్మఠరూప
ధారి వైతి వంచుఁ దలఁపవచ్చు. 148.

క. అని గృహి, యతి, శిష్యద్వయ
మనయము కినుపొంది తీవ్ర మగువాదమునన్
తనతనమర్యాదోల్లం
ఘనమునకై రాత్మకర్తృకతఁ గన కుంటన్. 149.

ఉ. కొందఱు లోని కేఁగి తమకున్ యతిరాజికి నైనవాదపుం
దందడిఁ దెల్పఁ గొందొక వితాకయి మండనుఁ డాత్మ నెంచెఁ "గ
ర్మందిని జూడ" నన్నునియమంబున నుండఁగ నాగురుండె తా
నందెనటే తురీయ మగునాశ్రమ మే మొనరింతు నియ్యెడన్. 150.

క. గురుఁడు గురువరుఁగ శంకరు
వరియించి తరించె నంచు వార్త వినియు మం
దిరమం దడుగిడుపారా
శరుల నరయ కుంట శిష్టసమ్మత మగునే. 151.

సీ. ప్రబలసిద్ధాంతనిబద్ధ మౌపూర్వమీ
మాంసాగమ మ్మప్రమాణ మెట్టు
లెందుఁ బ్రాయశ్చిత్త మే నెఱుంగక నల్పు
కర్మకాండము మానఁగల్గు టెట్లు
సర్వజ్ఞుఁ డస్మదాచార్యుఁ డే మారసి
సంన్యసించెనొ యొంచఁజాలు టెట్లు
శ్రాద్ధకాలమునఁ బారాశరిభిక్షాప్ర
దాననిషేధవిధాన మెట్లు

గీ. పాయు టెట్టుల గురుసంప్రదాయసరణి
నిష్టమేని యనిష్టమే నేకమతిని
శిష్యుఁ డాచార్యమతమునే స్వీకరింపఁ
దగు నటం డ్రిప్డు డీచేటు తలఁగు టెట్లు. 152.

వ. అని తనమనంబునఁ గొంతసేపు మథనము గావించి భట్టపాదులపాద
ములు నమ్మినవాఁ డగుటంజేసి యాసుధీసింహుఁడు యతివదనవిలో
కననిరాకరణవ్రతంబు తత్క్షణంబ యుత్సర్జించుకొని. 153.

మండనుఁడు శంకరునకు భిక్షావందన మొనర్చుట.

శా. సందేహమ్ములు వాయదట్టి నిజశిష్యశ్రేణి నీక్షించి 'క
ర్మందుల్ పూజ్యులు శ్రాద్ధవేళ గృహధర్మం బీఁగ న్యాయంబె? వా
రిందున్ రాఁ గని మీరు చూడఁ దగునే యెచ్చోట నున్నా' రటం
చుం దోడ్తోడన మండనుండు సహశిష్యుండై యెదుర్వచ్చి తాన్.

గీ. అర్ఘ్యపాద్యాదికంబుల నర్చ లిచ్చి
తనవినేయులయవినయమును క్షమింప
వేడుకొని శంకరార్యుఁ డవ్వీట నుండె
ననుపలుకు వించు హర్షించి యంగవించి. 155.

శా. పౌరుల్ పిన్నలుఁ బెద్దలున్ హితులు సంబంధుల్ నిజాంతేవస
ద్వారంబున్ దను నంటిరాఁ జని పురాంతర్వర్తి దేవాలయ
ద్వారోపాంతవితర్దికాసమతలాధ్యాసీను ధీశ్రీసమా
హారున్ శంకరుఁ జేరి తా సలిపె సాష్టాంగప్రణామంబులన్. 156.

క. ద్విజుఁ డటు 'న కర్మణా న
ప్రజయా' యను శ్రుతిఁ బఠించి వందన మిడఁగా
ఋజుగతి 'నారాయణ' యనుఁ
ద్రిజగద్వంద్యుండు తద్యతిగ్రామణియున్. 157.

ఉ. వందన మావిధిన్ సలిపి పాద్యము నర్ఘ్యము నిచ్చి భిక్ష మా
మందిరమం దొనర్పవలె మత్పితృదేవత లెల్ల నేఁటితో

నందెద రూర్ధ్వలోకముల నంచును శ్రాద్ధము నేఁడ యంచుఁ గ
ర్మందిలలాము శంకరుని బ్రార్థనసేయ ననుఁ స్మితాస్యుఁడై. 158.

ఆ. అన్నభిక్షుఁ గోరి యరుదేర నోయన్న!
వాదభిక్ష మిడఁగ వలఁతి వేని
క్షణము నందువాఁడఁ; గా దందువా చెప్పు
వచ్చినట్టిత్రోవఁ బట్టి పోదు. 159.

క. ఓడనివానికి నోడిన
వాఁ డంతేవాసి యగుట పన్నిదము సుమీ
నేఁడే వాదింతము తగఁ
ప్రోడల రావింపు ధర్మమూర్తుల సభకున్. 160.

క. యత్యాశ్రమి వయ్యు వివా
దాత్యాసక్తుండ వగుట యర్హమె యంటె
శ్రుత్యంతపథావనమై
యత్యమె హేతువుగఁ దెలియుమా బుధవర్యా! 161.

చ. జగతిఁ ద్రయీశిరఃపథము జాగ్రతి నొంద ప్రచారమందు నుం
డఁ గనుట దక్క వాంఛితము నా కెదియుఁ గనరాద, నీవు కే
వగలు త దేకదృష్టిని సవంబుల మున్గి, భవాగ్నితాప మా
ర్పఁగఁ దగు మన్మతంబును దిరస్కృతిసేయుదు వట్టి దిట్టవై. 162.

ఆ. అభిభవించి నిన్ను నఖలవివాదిని
జగతిఁ దన్మతస్థుఁ జాటువాఁడఁ
గొనుము నా మతమ్ము గొనకున్న విపదింతు
వో 'జలోఽస్మి' యందువో పఠింపు. 163.

గీ. అను యతీంద్రునియర్థయుక్తాభిభాష
ణముల కరుదంది కీర్తిసంతతుఁడు బుధుఁడు
నవపరీభావ మెనసియుఁ బ్రవచియింపఁ
బూనె నిజగౌరవము మనంబునఁ దలంచి. 164.

గీ. అనునె వీఁడు 'జితో౽స్మి' యంచును సహాస్య
వదనములవాఁడె వాదింప వచ్చెఁగాక
వేదసమ్మతమతమును వీసి యెపుడు
మానిపరికల్పితమతంబుఁ బూనఁబోఁడు. 165.

ఉ. 'వచ్చునె యెన్నఁడే నొకవిపశ్చిదపశ్చిముఁ, డౌనె వానితో
నచ్చుగ నాకు వాదకథ' యంచుఁ గుతూహల మొందు నా కిదే
వచ్చె జయోత్సవంబు, మనవాదకథన్ ఫలియించు విద్యలం
దొచ్చెములేని నాశ్రమ; మహో! సుధ యబ్బ నెవండు గాదనున్.

సీ. శమియింపఁజేయుదు యమహంతనేని స్వ
యమ్ముగా నామహిమ మ్మెఱుఁగవొ
కానిమ్ము కలహమ్ము కలహంససత్కలా
భరితయాష్మాకీనభావణముల
వినవొ దర్శనపాఠజనిత మానాపొంధి
వైరిగర్వవనీకుఠారధార
నాసించి తి ల్లోల యత్యల్పభిక్షమ్ము
వాదభిక్షమె యిచ్చువాఁడ మెచ్చు
గీ. వాద మన సిద్ధముగ నున్నవాఁడఁ జిరము
గా నభిలషింప వాది యొక్కరుఁడు రాఁడ
యట్టిలోపంబు దీఱంగ నరుగు దెంతు
వింక సందేహ మేల యతీంద్రచంద్ర! 167.

క. కాని యిటఁ బ్రాడ్వివాకుని
గానన; గెలుపోటములు తగఁగ దెలిపెడువి
జ్ఞాని లభింపనివాదున
మాన కుభయకంఠశోషమాత్రము మిగులుగ. 168.

క. వాదముల వాదియును బ్రతి
వాదియుఁ గొందురు విపక్షపక్షము, గానఁగ
వాదించు మనకుఁ దెలుపుమి
యేది ప్రతిన? యెది ప్రమాణ? మెవ రధ్యక్షుల్? 169.

గీ. ఏను గృహమేధిముఖ్యుండ నీవు భిక్షు
కాధిపతి విందు మనవిజయాపజయము
లకును బణనిర్ణయము సేయు మకుటిలముగ
నవుల వాదింతము జిగీష యచ్చుపడఁగ. 170.

క. ధన్యుఁడ నైతిని యతిమూ
ర్ధన్యుఁడు వివదింప నాకుఁ దారసిలుట, వా
గ్జన్యము రే పగు, నిప్పు డ
నన్యమతి నొనర్తు మధ్యమాహక్రియలఁగ. 171.

వ. అని యాబుధుండు సుతపకాలము సమీపించుటఁ దెలిసి పునఃపున
రభివాదపూర్వకంబుగాఁ దనగృహంబునకు విచ్చేయఁ బ్రార్థిం
చుటయు, దండకమండలుధారియై యిలాగతుం డగుసరోజహితుం
డుంబోలె స్వశరీరకాంతుల దశదిశలు వెలింగించుచుఁ బాదచారియై
సహశిష్యసంతతికంబుగ మానియై శంకరార్యుండు రాజవీథిం జని
చని యొక్క యెడఁ గక్ష్యాంతరమ్ములు గడచి మండన మందిరమ్ము
దరియంజొచ్చి యర్ఘ్యపాద్యాద్యుపచారంబులం బడసి నిమంత్రిత

బ్రాహ్మణద్వయం బెదురు వచ్చి వందనంబు లాచరింప ముది
తుండై యుండునంత. 172.

శంకరుఁ డుభయభారతిని దీర్పరిగ నిర్ణయించుట.

ఉ. ఆసరసీజసంభవకులాభరణంబులు జైమినీయవై
యాసకశాస్త్రపారగు లటంచును వారలలో నొకండు ధ
ర్మాసన మెక్కి వాదముజయాజయముల్ ప్రకటించు నంచు సం
న్యాసివరేణ్యుతో విబుధనాథుఁడు దెల్పుచు నుండునత్తఱిన్. 173.

చ. కలువల నీనుసోగ తెలిగన్నులు వీనులకోన లానఁ జె
క్కులఁ జిలునవ్వువెన్నెల లిగుర్పఁగఁ గొప్పవటూస్థలిన్ విభా
సిలఁ దెలిపట్టుఁగంచెలయుఁ జీరయుఁ దాలిచి విశ్వరూపుకో
మలి యరుదెంచి యయ్యతికి మన్నన మిన్నగ మున్ను గానరాన్.

క. పూఁదీవ కమ్మతెమ్మెర
చే దుసికిలునటుల వంగి, చేర్చి నొసంటన్
చేదోయి, వందనం బిడెఁ
బైదలి తను వ్రీడ ప్రౌఢి భక్తియు వంపన్. 175.

ఉ. ఆయెడ భట్టపాదుఁ డనినట్టినుడుల్ మది నెంచి శంకరుం
డాయతివర్య మహావిదుషి యంచుఁ దలఁచి బుధేంద్రుఁ గాంచి 'యే
లా యొరు లీవివాదముజయాజయముల్ వివరింప? నీవె యే
న్యాయము దీర్చు దాని దలయందు ధరింతుఁ ద్రిశుద్ధిఁ బల్కితిన్'.

క. అనుటయు నందఱు నౌ నౌ
నని రమ్మండనుఁడు నాలు నంగీకృతిఁ దె
ల్పెను గర్మకాల మెఱిఁగి భ
వనాంతరాళమున కేఁగె బాడబ్యమ్మున్. 177.

ఉ. అందఱు లోని కేఁగి సరయూంబునఁ స్నానము లాచరించి మా
ధ్యందినసత్కృత్యముల్ నెఱపు నంతటఁ బైతృకకర్మదీక్ష ని
ష్పందతఁ దాల్చి మండనుఁడు భక్తినయుక్తిసపర్యఁ దన్పెఁ గ
ర్మందిని వ్యాసజైమినులమాఱట యాక్షితిదేవయుగ్మమున్. 178.

గీ. మోదమున శంకరునకు హస్తోదకమ్ము
"నమృత మ"స్తని మండనుం డమర నొసఁగ
శాశ్వతబ్రహ్మలోకవాసమున కరిగి
రతనిపితరులు విశ్వదేవతలు నపుడ. 179.

ఆ. భక్ష్యభోజ్య చోష్యపానీయలేహ్యాది
వివిధభోజనముల నవనిసురులు
ముగుర కిడిరి బ్రహ్మముగ సర్వ మెంచుచుఁ
దృప్తి గదుర గృహియు గృహిణి శ్రద్ధ. 180.

క. 'తృప్తాస్స్థ' యనఁగ మువ్వుర
సప్తార్చిస్సముల నన్నజలదానములన్
దృప్తుల నొనర్చి యనిపి ని
జాప్తులతో నన్నశేష మతఁడు భుజించెన్. 181.

గీ. చామర లిడంగ శిష్యు లిష్టప్రసంగ
ముల నొనర్చుచు వైదుష్యవిలసనముగ
భోజనాయాస మెడయ నమ్ముగురు కొంత
సేపు మొగసాలయందు నాసీనులైరి. 182.

క. ఆవిధి శ్రమ ముడిగి మహీ
దేవు లిరువు రరిగి రెవరి తెన్నున వారల్
రేవాతీరగతం బగు
దేవాలయమునకు నరిగె దేశికవిభుఁడున్. 183.

చ. అరిగి కదంబసాలనివహాంచిత మానొకమండపంబునన్
స్థిరముగఁ గూరుచుండి నిజశిష్యులు కోరఁ గురుండు గేస్తుతో
జరిగిననాఁటివృత్తముఁ బ్రసన్నవచస్సరణిన్ వచించుచున్
జరిపెను నాఁటిరే యమృతసన్నిభమై కథ్రమియింపఁ జల్లగన్. 184.

శంకరమండనమిశ్రుల వాదసభ.

శా. ప్రాతశ్శోణసరోజబంధురుచి నభ్రం బుల్లసిల్లన్ యతి
వ్రాతాధ్యక్షుఁ డతండు కాల్యములు నిర్వర్తించి సచ్ఛాత్రుఁడై
ప్రీతిన్ మండనపండితౌకమునకున్ విచ్చేసి చొచ్చెన్ సుధీ
వ్రాతాలంకృత మాసభాభవనమున్ వాదంబు గావింపఁగన్ .185.

చ. సకలకలావిశారదను శారద నాత్మసధర్మిణిన్ సమా
ధికరహితన్ బ్రతీతపతిదేవత సాక్షిణిఁ జేసి వాదకౌ
తుకమున నుండె మండనుఁడు దొయ్యలియున్ బతియాజ్ఞఁ బాడ్వివా
కకృతికి మేకొనెన్ జనులు కన్నులపండువుగాఁ గనుంగొనన్. 186.

క. అధ్యాసించెను బరిష
న్మధ్యస్థితధర్మపీఠి మహిళామణి త
త్సృధ్యభిరూపత్వవివే
కాధ్యాస్థను వచ్చుశారదాంబికవోలెన్. 187.

గీ. మండనునివాదకుతుకసమ్మర్ద మెఱిఁగి
యలరుచుఁ బరావరజ్ఞుఁడౌయతిమహేశుఁ
డూనెను బరావరైక్య సంధాన పరము
గా స్వకీయప్రతిజ్ఞ నుత్కంఠ నిట్లు. 188.

సీ. అనఘమై పరమార్థమై సచ్చిదమలమై
యద్వైతమై యొప్పునట్టిబ్రహ్మ
మనవధికాజ్ఞానమునఁ జిక్కి ముత్తెపుఁ
జిప్ప వెండిగను దోఁచిన తెఱఁగున

యావ జ్జగదాప్రపంచము వెలుంగును దత్ప
రావరైక్యజ్ఞాన మబ్బనేని
విశ్వప్రపంచంబు విలయంబునొందునం
తన తెల్ల మగును స్వాత్మవ్యవస్థ
గీ. దాన నబ్బు నిర్వాణ ముత్తమము దానఁ
గలుగుఁ దప్పక జన్మమోక్షము ధ్రువముగ,
నిందులఁ బ్రమాణ మెయ్యవి యందువేని
సకలనిగమాంతవాక్యప్రపంచంబు సువ్వె. 189.

చ. విజయముగొందు నిందు, నొకవేళఁ బరాజయమే ఘటిల్లుచో
నిజము వచింతు సంన్యసననిష్ఠ సమస్తము వాసి, కావులక
ద్విజవర! రోసి, తాల్చెదను దెల్పుల; వాదమునందులక జయా
పజయఫలంబు లియ్యుభయభారతియే మన కేర్పఱించుతక. 190.

క. అనుచును శంకరభిక్షుం
డనల్ప మగుస్వప్రతిజ్ఞ నటుపూనఁగ మం
డనుఁడు స్వమతప్రతిష్ఠా
పన మగుశపథమ్ము నెఱపె స్పష్టముగ నిటుల్. 191.

సీ. చిదాప్రపవస్తువుఁ జెప్పఁ బూనఁగ శబ్ద
శక్తి కయోగంబు సంభవిలుట
నప్రమాణమ్ము వేదాంతమ్ము- లిఁకఁ బూర్వ
భాగమో యటుగాక, వాక్యగమిత
మైన యశేషకార్యంబులపట్లను
దాఁ బ్రమాణంబు బయి తనరుచుండుఁ
గనఁ గ్రియామాత్రంబునను బ్రసిద్ధమ్ములౌ
శబ్దంబులకు శక్తి సంఘటిల్లు

గీ. నాయువు సమాప్త మగుదాఁక బ్రాణికోట్లు
సలుపవలెఁ గర్మకాండ మాసక్తి మిగులఁ
గర్మ మటు శ్రద్ధఁ జేయఁగాఁ గలుగు ముక్తి
యంతియే కాని లభియింప దన్యయుక్తి. 192.

క. వాదున జయేతరం బా
పాదిల్లిన నీప్రతినకుఁ బరమ విరుద్ధం
బూఁదెద నీ వనినటు లీ
నాదయితయె సాక్ష్యపదమునన్ వర్తిలుతన్. 193.

వ. అని. 194.

క. యతియున్ గృహపతియుఁ బరా
జితుండు చేతాశ్రమంబు సేకొనునట్టుల్
ప్రతిన లిటు నెఱపి యాభా
రతి నిలిపిరి సాక్ష్యవిష్టరభ్రాజిత గాఁగన్. 195.

మ. పరమోత్కంఠ యతీంద్రుఁడున్ గృహియు సభ్యశ్రేణి క్రైమోద్బఁద
త్పరిషద్వేదిక నాభిముఖ్య మమరన్ దర్భాసనాసీను లౌ
తఱి వారిర్వురకంఠసీమ సుమనోదామంబులం బూన్చి య
య్యరవిందాయతపత్రనేత్రి యన నిట్లాలింప సామాజికుల్. 196.

క. ఎవ్వరిగళమున విలసిలు
మవ్వపుఁబువుమాల తొలుత మ్లానం బగునో
యవ్వానిద యోటమి యగు
నెవ్వరు వచియింపఁదగ్గ దే ముందు నిఁకన్. 197.

గీ. అంచు దివ్యప్రమాణ మయ్యతివ దెలిపి
యతియుఁ బతియు భుజింప భిక్షాశనముల
నాయుత మొనర్ప నంతర్గృహమ్ము సొచ్చి
నవుల వాదింప వారలు దివురుచుండ. 198.

శంకరశిష్యులకును, మండనశిష్యులకును జరిగిన వాదము.

క. మీ రేల మేము చాలమె
యారయుచుండుం డటంచు నాబుధశిష్యుల్
పారాశరివరు శిష్యులు
నారంభించిరి వివాద మండఱు వినఁగన్. 199.

వ అందు మండనశిష్యుం డొక్కరుండు శంకరగురుచ్ఛాత్రు నొక్కనిం
గాంచి. 200.

క. ఓయతిశేఖర! నీవు తు
రీయాశ్రమ మెట్లు గొంటి స్మృతులన్ శ్రుతులన్
వేయిగతుల సన్న్యాసం
బీయుగమునఁ ద్యాజ్య మనుట యెఱుఁగవె యకటా. 201.

గీ. మఱియు శ్రుతులును స్మృతులుఁ బ్రమాణములుగఁ
దెలియఁ బల్కెద వినుమయ్య! కలినిషిద్ధ
ములు తురగమేధ గోమేధ పలంపైతృ
కాఁతిమాశ్రమ దేవరన్యాయవిధులు. 202.

సీ. యజ్ఞాధ్యయనహీన మానాశ్రమచతుష్ట
యమ్ము బ్రాహ్మణ్య మె ట్లనువుపఱచు
'నహరహ స్సంధ్యా ముపాసీత' యనువిధి
దూరుఁడై యగునె శుద్ధుఁడు ద్విజుండు
యజ్ఞోపవీతచూడాపవర్జనమున
నిరయమ్ము ద్విజుఁ డెట్లు నిస్తరించు
సత్కళత్రమునందు సంతతిఁ గనక వి
పుత్రుం డెట్లుల పితౄణమును దొఱఁగుఁ

గీ. గాన వేదోక్త కర్మసంధానపరత
నందె యతియపుణ్యలోకాప్తిఁ గోర
వలయునే కాని యతి యాట కలియుగమునఁ
దలఁపరాని దటంచు విద్వాంసు లనరె. 203.

చ. యతివర! స్వర్గరాజ్యతనయాదికముల్ లభియించుఁ గర్మప
ద్ధతిఁ జరియింప నంచు శ్రుతితత్త్వవిదుల్ ద్విజు లెల్లఁ గర్మముల్
మతి నొనరింతురు; కర్మ మణుమాత్రము వాయఁగరాని దంచు న
చ్యుతుఁడు కిరీటికిం దెలుపుసూక్తి నెఱింగియు భ్రష్టులైతిరే.

గీ. కర్మమును గాల మెఱిఁగి తత్కర్మ మర్హ
కాలమున సల్పువానినే జ్ఞాని యండ్రు
విహితకర్మాచరణనిష్ఠ వెలయువాఁడె
భక్తిమంతుండు మఱి జ్ఞానవంతుఁ డనఘ. 205.

ఆ. కలినిషిద్ధ మనుట తెలిసియు సన్న్యాస
మెట్లు మీగురుఁడు గ్రహింపఁ దెగియె
నందు బ్రహ్మచారి యయి సన్న్యసించెనే
ప్రక్రమంబు విడిచి వక్రబుద్ధి. 206.

క. అన శంకరశిష్యం డను
మనీషివర! యింత చదివి మందప్రజ్ఞా
జననుత్యం బగుజ్ఞానం
బు నెఱుంగక యుంట యబ్రముగఁ గన్పట్టున్. 207.

క. ఎందాఁక వర్ణభేదం
బెందాఁక శ్రుతిప్రచార మెసఁగుఁ గలియుగం
బం దంతదాఁక నిలుకడ
నొందును సన్న్యాస మగ్నిహోత్రము లుర్విన్. 208.

మ. మఱి సంతానజదోషసంహతులఁ గర్మప్రాప్తదోషంబులన్
దరిఁ గొల్పన్ దుషవహ్ని స్వర్ణమటు సన్న్యాసంబు; సంసారమం
దరయన్ రాగవిదూరుఁ డౌతఱియు సన్న్యాసాప్తికిన్ గాల మం
దురు శాస్త్రజ్ఞులు, బ్రహ్మచారియు విరక్తుం డైన నర్హుం డగున్,

సీ. సకలచరాచరస్థానమై వెలుఁగొందు
బ్రహ్మంబె యజ్ఞసూత్రంబు గాఁగఁ
బరమవిజ్ఞానభాస్వద్దీపకళిక యే
జానైన కేశపాశంబు గాఁగ
జన్మమృత్యుభయార్తి సమయించు ముక్తియ
యమృతోపమాన యర్థాంగి గాఁగ
నాత్మైక్యజాత మహానంద ముద్రాను
భవ మాత్మజాత లాభంబు గాఁగ
గీ. నేను నీ వనుభేద మొక్కింత లేక
జగమె తా నయి యుంట సంసారముగను
బరమవిజ్ఞాని భాసిల్లు నిరత మైన
సచ్చిదానందరససమాస్వాద మెనసి. 210.

గీ. వాఁడె యజ్ఞోపవీతి యవ్వాఁడె శిఖియు
వాఁడె సూ దారవంతుఁ డవ్వాఁడె పుత్ర
వంతుఁ డగు; వాఁడు పొందులాభంబు బ్రహ్మ
కైన హరికైన హరునకు నైనఁ గలదె. 211.

గీ. యజ్ఞసూత్రంబు కర్మాంగ మనిరి బుధులు
కర్మములె విడుచోఁ దదంగంబు సూత్ర
మేల తాల్పఁగవలె? జ్ఞాన మెపుడు పొడము
నపుడు శిఖఁ దాల్పకున్న నే మగుఁ గొఱంత. 212.

ఉ. కావున యజ్ఞసూత్రము శిఖల్ ద్యజియించును యోగి; కర్మతం
డావిలబుద్ధిఁ దాలిచి నిరంతరకర్మఫలానుభోక్తయై
పోవుచు వచ్చు చెందుఁ గడగుట్టఁగఁ జాలక జీవభావముల్
ద్రోవఁగఁ జాలఁ డంచు విబుధుల్ వచియింతురు పెక్కురీతులన్. 213.

సీ. కటిసూత్ర మాచ్ఛాదకముగఁ గౌపీనంబు
శీతార్తిఁ బాపి రక్షింపఁ గంథ
నక్షమాలిక నవ్రణాక్షీణమైనవ
దండంబు నుదకమండలువును
మధుకరవృత్తిసంపాదితానేకాన్న
భుక్తి శిఖాసూత్రములవిముక్తి
నిత్యకర్మాదికనిరసనంబును బర
బ్రహ్మానుసంధానపాటవంబు

గీ. నిరతరమును బూని జ్ఞానసందీప్తి నెనసి
మౌక్తికప్రోతసూత్రసంభావనమునఁ
బరమహంస గనందగు బ్రహ్మతేజ
మాపిపీలిక మాబ్రహ్మమైన జగతి. 214.

గీ. అనుచుఁ జకచక మనుదివ్యమైనవచన
రచన యతిశిష్యుఁ డాగృహిప్రథమశిష్యు
నధరము మెదల్పనీయక యాఁకవేట్టు
నంత; విన వచ్చె మధ్యాహ్న మయ్యె ననుచు. 215.

వ. తోడన గోష్ఠి చాలించి సాంతేవాసులై యతియుం గృహపతియు నిశాంతాభ్యంతరమ్మున కరిగి మాధ్యాహ్నికక్రియాకలాపనిర్వర్తన పూర్వకంబుగా భిక్షలు భోజనమ్ములు నిర్వర్తించుకొని విశ్రాంతి నెఱుంగకయ యప్పుడ గోష్ఠీమందిరము సొచ్చి వివిధవిద్వజ్జనసమ

ష్టంబున నిరువాగుశిష్యులు సకలశాస్త్రసమ్మతంబుగా న్యాయము వాదము సేయఁ జూచుచు దినసావసానమున యథేచ్ఛ మఱిగి, రమ్మఱుదినమునుండి యథాపూర్వము సపరివారంబుగ పరిష త్తలంకరించి యుత్తరోత్తరము లగు ఛాతుర్యవాదము లందలి జయాపజయంబుల మోదవిషాదము లొందుచు వచ్చుచుఁ బోవుచుఁ దదేకధ్యానమగ్నమానసులై దివసపంచకం బేఁగించి షష్ఠవాసరమున వేఁబోకఁ గరణీయంబులు తీర్చుకొని సభకు విచ్చేసి మాలాలంకృతకంధరులై శంకరమండనులు తామె వాదమునకుఁ బూనుకొని రయ్యవసరంబున. 216.

ఉభయభారతీసాక్షికంబుగ శంకరుఁడును మండనుఁడును వాద మొనర్చుట.

శా. నానాదేశసమాగతుల్ బుధులు నానాఁటన్ గుముల్ గట్టి యా
స్థానం బెల్ల నలంకరించి విన నుత్సాహంబులో నుండ, శి
ష్యానీకంబులు నొజ్జలన్ బలసి యాయాగ్రంథముల్ చేతి కం
దీ నుండఁగన్ గనవచ్చునాగరజనం బేసద్దు లేకున్నెడన్. 217.

ఆ. సాధువాద మొకట సభ్యులు గావింప
శ్రోతుల సాక్ష్యమున స్వమతము నిలుపు
కొనుచు నొండొరులకుఁ గుతుకమ్ము మోదమ్ము
గూర్చునదుల వాదు కొనలు సిగిడె. 218.

ఉ. ఒండొరులున్ బ్రగల్భు లయి యుత్తరముల్ విదళించు చర్థిఁ గూ
ర్చుండి స్మితాంచితాననము లొప్పఁగ మేనుల స్వేదకంపముల్
మెండుకొనంగ మిన్నుదెస మిన్నక చూచుచు, నుత్తరంబు లే
కుండుచుఁ, గ్రోధవాక్ఛలము నొందుచు నుండిరి యుర్వరయ్యెడన్.

గీ. అపుడు క్షోదక్షమం బైనయాబుధేంద్రు
దాక్ష్య మరసి యతీంద్రుఁ డుద్దవిడిఁ దాల్చె

క్షోభితాఖిలపక్షు సతోఁ విదాంతి
కాప్రకాశితకక్షుని నల విపక్షు. 220.

ఉ. అంతట మండనుండు స్వమతావనసైపుణశూన్యుఁ డయ్యె వే
దాంతవచఃప్రసిద్ధ మయి యద్వయమార్గము సూపునట్టిసి
ద్ధాంతములన్ బరశ్శతవిధంబులఁ దూల్చుచుఁ బల్కఁజొచ్చె ని
క్లాంతయు మచ్చరంబు జనియించి జయించుతలంపు మించఁగన్.

క. శమధన! హేయోపాదే
యముల విడిచి సిద్ధ మగుపదార్థముఁ దెలుపన్
క్షమ మగువేదాంతోక్తులు
ప్రమాణ మనఁగఁ బొసఁగు నెటు పరిశీలింపన్. 2 2.

గీ. కర్తృతాధర్మయుక్తుఁడై క్రాలు జీవుఁ
డీశ్వరుఁ డకర్తృతాధర్మ మొనసి యుండు
నట్టి ప్రవిరుద్ధధర్మాశ్రయముల కెట్లు
లైక్య మమరుఁ? బ్రమాణ మిందరయ మనిన. 223.

గీ. యతివరుం డను నుద్దాలకాదిగురులు
శ్వేతకేతుప్రముఖశిష్యవితతిఁ 'దత్త్వ
మసి' యనుచు నైక్య మెఱిఁగించి యలరఁజేయు
వాక్యము ప్రమాణ మగు బుధవర్య! యనుచు. 224.

మం. హుంఫడాదులమాడ్కిఁ బాపోపశాంతి
కై జపార్హమ్ము లైనవేదాంతవిదిత
తత్త్వ మస్యాదివాక్కు లర్థమ్మునను వి
వక్ష యెటు లొనఁగల్గుఁ జెప్పంగదన్న. 225.

శం. అర్థవిదులు హుంఫడాదిశబ్దమ్ము ల
ర్థాప్రతీతిచే ననర్థ మనిరి

యర్థ మిట్లు తెల్ల మఱుచుండఁ దత్త్వమ
స్యాదికము జపార్థ మనుట యెట్లు? 226.

మం.పన్నుగఁ 'దత్త్వమసి' యనుట
విన్నన్ జీవేశ్వరుల కభేదము స్మృత మా
పెన్న మఖకర్త యీశా
భిన్నుం డను స్తుతినిబోలి విధిశేష మగున్. 227.

శం.యూపముఖాధ్వరాంగములయుష్ణకరాదిసురాకృతిస్తవా
లాపము కర్మకాండపరిబద్ధము గావున నర్థవాదతా
వ్యాపన మొప్పుఁ గాని యెటు పల్కెదు తత్త్వమసీతివాక్యమా
రా! పరకాండదృష్టముగదా 'విధిశేషమ' యంచు ధీనిధీ. 228.

మం.మ. పవమానాన్నమనోర్కు లాదియగునబ్రహ్మంబునన్ బ్రహ్మబు
ద్ధి విధింపన్ జనుమాడ్కిఁ గర్మపరివృద్ధిం గోరి యీసూక్తి దాఁ
దివుచున్ జీవునివంక బ్రహ్మమనుబుద్ధిన్; గాన నారోపితా
త్మవిభాసం బగుజీవుఁ గొల్చునిగమాంతంబుల్ ప్రమాణంబులే.

శం మనమునుబ్రహ్మమంచుఁగొలుమా యనువాక్యమునందుబ్రహ్మభా
వనకు లిఙాదికంబు గనుపట్టినయట్టుల ధీవరా! విధా
ననియతి తత్త్వమాదివచనంబుల నున్నదె? జీవునే యుపా
సన మొనరించు నయ్యుపనిషత్తు లటంటివి సత్య మెట్లగున్. 230.

మం.చ. యతివర! రాత్రిసత్రమునయందు విధిన్ ఫలదర్శనాప్తి నే
గతి ఘటియింతు, రాపగది గా నిట ముక్తిఫలశ్రుతిన్ బ్రక
ల్పితవిధి యంచు నీశ్రుతి వివేచనసేయుట పాడి, కానిచో
వితథము గాదె యద్ది "పృథివీపతి శేష" యటన్నకైవడిన్. 231.

శం సరి నీ వన్నటులేని మోక్షము క్రియాజన్యంబు కానన్ విన
శ్వర మా స్వర్గమువోలె, సల్పఁగను సల్పన్ మానఁగా నన్యమా

కరణిఁ సల్పవశం, బుపాసన మనఃకార్యంబు దా నౌటఁ; న
త్కరణిఁ గామిని జ్ఞానలబ్ధ మగుమోక్షం బెన్న నిత్యం బగుఁ. 232.

మం. తత్త్వమసి యనుసూక్తి నీతలఁచినట్లు
లే యుపాసనాపర్యవసాయి గాక
పోవుఁగా, కీశ్వరునితోడ జీవునకును
దెలుపుచుండుట లేదె సాదృశ్య మనఘ 233.

శం. సాదృశ్యం బనఁ జేతనత్వాన్వితమా? సార్వజ్ఞ్యసార్వాత్మ్యధ
ర్మాదిప్రాప్తమొ? యెక్రియఁ దెలిపె — నాద్యం బంటివేసిఁ బ్రసి
ద్ధోదంతమ్ము వచించు టెందులకు? నోహో యన్య మంటేని ద
ద్భేదస్థాపక తావకీనమతసూక్తిప్రాతికూల్యం బగుఁ. 234.

మం. ఆత్మగుణనిభ సుఖవిబోధాదిగుణము
లల యవిద్యావృతిని జీవునం దభాస
మాన మగుఁగాక; నిత్యతామాత్రమునన
సామ్యము వచింప నుక్తదోషంబు తొలఁగు 235.

శం. నీ వనువాక్యశక్తినె మనీషిమణీ! “పరమాత్మభావ మా
జీవున కబ్బు నా నలుకఁ జెందఁగ నెందులకయ్య? యయ్యవి
ద్యావరణంబునం బరమాత్మత కౌప్రతిభాసశంక నీ
వే వెడలించినాఁడవుగదె నిజ మారయుమా మనంబునన్. 236.

మం. జీవుతోఁ జేతనత్వమ్ముచే జగత్ప్ర
సూతి యగునాత్మకును సాటిఁ జూపుత; జగ
మనఘ! చిజ్జన్య మగుట సాంఖ్యాదికథిత
మగుప్రధానాదివాదమ్ము లంతరించు. 237.

శం. అటు లగునేని ‘తత్త్వమసి’ యంటకు నీమతమందు ‘అస్మి’ యం
చటఁ బలుకన్ వలెంజుమి ‘తద్వైతత’ యన్నశ్రుతిన్ గనన్ జగ

ఘటితజడత్వశంక తొలఁగఁగఁ దదీక్షణశబ్ద మొప్పఁగా
నటులఁ; బ్రధానవాదము నిరాసము సేయు టసంగతం బగుర్. 238.

మం. 'నాహ మీశ్వర' యనెడుభేదావగమము
తత్త్వమసివాక్యజన్యబోధమున కతి వి
రుద్ధమై యుండ నైక్యసంసిద్ధి కలదె?
యదియు స్వాధ్యాయవిధి జపార్థంబ సూవె. 239.

శం. భేద మొకటేఁగెఁ శక్తి యవిషయమున్న
నాదనెఁ నభేదవాదవేదోక్తిబాధ
కరణమునకు భిదాసన్నికర్ష మమర
దెట్లు ప్రత్యక్ష మనెదు జీవేశ్వరభిద. 240.

మం. ఈశభిన్నుఁడ నే నన నెసఁగుభేద
శబ్ద మాజీవునకు విశేషణ మగుటను
గలుగుఁ దత్సన్నికర్షమ్ము; కరణభేద
ములకు * సంప్రయోగాభావ మొలయుచున్న. 241.

శం. కనద యతిప్రసక్త మగుఁ గానఁ దదేకవిశేషణత్వ మే
యనువున సన్నికర్షత; భిదాశ్రయ మింద్రియసన్నికృష్టమై
తనరినొ విశేషణత దాఁ గనఁజాలును సన్నికర్షతర్;
గనఁగదె సన్నికర్ష మెటు గల్గు నతీంద్రియ మైనయాత్మకుర్. 242.

మం. అరయ భేదాశ్రయమ్మగు నాత్మ కింద్రి
యమున సన్నికర్షమ్ము లే దంటి నహహా
ద్రవ్యములె కానఁ జిత్త మాత్మయును గాసి
కిబ్బ గాదె సంయోగసమాశ్రయతను. 243.

---

* సంయోగాదికసన్నికర్షము లేకున్నను.

శం. ఆఁగుము పల్క—, కాత్మ విభువౌ నటుగా కణు వౌతఁ జిత్తసం
యోగిత రెండుపక్షముల నూహ యొనర్చినఁ గానరాద యో
* యోగివరేణ్య! సావయవ మొందును సావయవంబుతోన సం
యోగము, గాని తా నవయవోజ్ఝితుతో నెపుడేనిఁ బొందునే 244

చ. మన సొకయింద్రియంబ యని మాటకు నంటిమి— లోచనాదికం
బునకు సహాయమాత్ర మయి పొల్చును దీపమువోలెఁ గావునన్
మనసున కింద్రియత్వ మణుమాత్రము లేదిక 'నింద్రియంబులన్
మనసును నేన' యంట 'యుడుమండలిఁ జంద్రుఁడ' నన్నరీతి నౌ.

మం. అక్షతతిని భేదజ్ఞాన మబ్బ దేని
వరలుఁగాక సాక్షిస్వరూపమయి; దాని
తో విరోధ మెనయునిశజీవు లొక్కఁ
డన నెటు ప్రమాణ మాతత్త్వమాదకోక్తి. 146.

శిం. అలయువిద్యావృతుం డైనజీవునకు మా
యావృతుం డగు పరమాత్మునకును
సాక్షిస్వరూపమై జానొందుప్రత్యక్ష
మెఱిఁగించు భేదంబు పరఁగినట్లు
యాశ్రుతి శుద్ధజీవాత్ములయైక్యంబుఁ
దెలుపు భిన్నాశ్రయుఁబులు గనుటను
నవిరోధ మగును— గా దంటేని ♦ పూర్వమై
వెలయుప్రత్యక్షంబు బలవిహీన

* మండనుని సంబోధించుట.

♦ 'పౌర్వాపర్యే పూర్వదౌర్బల్యం ప్రకృతివత్' అను జైమినీ యసూత్రము ననుసరించి 'ప్రత్యక్షము— శ్రుతి' యను నీరెండిటఁ బ్రథమమగు ప్రత్యక్షమును చరమమగుశ్రుతి బాధించునుగదా 'పూర్వం

గీ. మఱి (3) యపచ్ఛేదనయరీతి ననుసరించి
చరమ మగుశ్రుతిచే బాధ పొరయఁ గాదె
మును గలుగురజతజ్ఞానమునకుఁ బిదపఁ
గలుగు శుక్తిప్రమ ప్రబాధక మ్మగునటు. 247.

పర మజాతత్వా దబాధిత్వైవ జాయతే । పర స్యాననథోత్వాదా న్నత్వబాధేన సంభవః' అను శాస్త్రమునఁ బరము పుట్టనికారణమునఁ బూర్వశాస్త్రము దేనిని బాధింపకయే పుట్టును. ఇఁకఁ బరశాస్త్రమో పూర్వశాస్త్రబాధకుఁ గాక యితరథా పుట్టనే పుట్టదు. కావునఁ బర మెల్లప్పుడు బాధకమే యగును. ఎట్లనఁ:— బ్రకృతియాగమునఁ గృతోపకారు లగుకశలు ప్రథమాతిదేశమున వికృతియాగమునఁ బ్రసక్తము లయ్యును గల్ప్యములును, జరమభావులు నగునిరపేక్షము లైనశరములచే బాధింపఁబడుట లేదా? అట్లే యిందును.

(3) అపచ్ఛేదన్యాయము:— బహిష్పవమానస్తోత్రము నుద్దేశించి యన్వారబ్ధముగా గమనము చేయుచుండు ఋత్విజులలో నుద్గాతకుఁ గచ్ఛాపచ్ఛేదము కలుగుచో 'య దుద్గాతాఽపచ్ఛిద్యేత అదక్షిణం యజ్ఞం నిష్పాద్య తేన పున ర్యజేత' యను శ్రుతిచే నారంభింపఁబడిన క్రతువును దక్షిణారహితముగ సమాప్త మొనర్చి, సదక్షిణాకముగ మరల యజ్ఞము చేయుట ప్రాయశ్చిత్తముగా విధింపఁబడె. ప్రతిహర్తకుఁ గచ్ఛాపచ్ఛేదము కలుగుచో 'యది ప్రతిహర్తాఽపచ్ఛిద్యేత సర్వవేదసం దద్యాత్' అను శ్రుతిచే సర్వధనదానరూప మైన దక్షిణతో నారబ్ధయాగము సమాప్త మొనర్చుట ప్రాయశ్చిత్తముగా విధింపఁబడె. క్రమమున నుభయాపచ్ఛేదము కలుగుచోఁ దొలిదాన దక్షిణారాహిత్యము, రెండవదాన సర్వస్వదక్షిణయును నుభయమునకు విరోధము కావున నుత్తరనిమిత్తకప్రాయశ్చిత్తముతోడనే యారబ్ధక్రతుసమాప్తి నొనర్పవలె' ననెడు నపచ్ఛేదన్యాయమునఁ బూర్వ మగు ప్రత్యక్షము పరమగు శ్రుతిచే బాధిత మగును.

మం. సంయమీంద్ర ఘటాదికసరణి జీవుఁ
డఖిలవిత్త్వము లేమిఁ బరాత్మభిన్నుఁ
డగు ననెడియ నుమానాన నయ్య భేద
వేదమునఁ గడ్డు బాధ రాలేదె కనుమి. 248.

శం. నీవు నుడివిన భేదమ్ము నిక్కువమ్మొ
కాల్పనికమో వచింపు నిక్కంబయేని
దవులు దృష్టాంతహాని రెండవదయేని
సిద్ధసాధనదోషంబు సెందు మరల. 249.

మం. వినుము స్వప్రత్యయాబాధ్యభేదవత్త్వ
మిల ఘటాదికమందు సాధ్యంబు సూవె
* యాత్మబోధముచే నబాధ్యప్రభేద
మొప్ప ననినంత నేదోష మున్నదయ్య. 250.

శ. ఎనయ స్వశబ్దము బోధిం
చినది సుఖాదులను జెందుజీవుఁ డనిన మా
♦ కు నభీష్టము—తద్రహితే
శుని నన దృష్టాంతహాని చొప్పడు మరలన్. 251.

---

* ఘటజ్ఞానముచేఁ బటజ్ఞానము బాధింపఁబడనట్లు స్వజ్ఞానముచే నబాధిత మగు భేదము ఘటాదులందు సాధ్యము' అని మామతము. ఆత్మజ్ఞానముచే భేదమునకు బాధ లేదని నీమతము (అద్వైతము) నగుటచే సిద్ధసాధనదోషము తొలఁగినది.

♦ స్వప్రత్యయాబాధ్యభేదాశ్రయత్వరూపసాధ్యమునందు స్వశబ్దమున కర్థము సుఖాదుల నొందుజీవుఁడా? తద్రహితుఁ డగుపరమాత్మయా? జీవుఁ డనినచో నట్టి భేదాశ్రయత్వము మాకును నిష్ట మగుటచే సాధింప నక్కఱలేదు. అనఁగా సిద్ధసాధనదోషము. పరమాత్మ యనినచో ఆత్మజ్ఞానముచే సర్వజ్ఞానములు నశించుఁ గాన దృష్టాంతమైన ఘటమందు ఆత్మప్రత్యయాబాధ్యభేదాశ్రయత్వరూపసాధ్యము లేదు.

మం. వ. యోగీంద్రా! మామతమున దీయనుమానప్రమాణమున జీవే శ్వరులకు నిరుపాధికము సాధ్యము. నీమతమున జీవేశ్వరుల కౌపా ధిక భేదమే కదా. అదియు యుగ్మ నెడల నుపాధియగు నవిద్య తత్త్వ జ్ఞానముచే నివర్తింప భేదమునకు మిథ్యాత్వము సిద్ధించుం గా వున నీవు సాధించునది జీవేశ్వరుల కౌపాధికభేదమును మేము సా ధించునది నిరూపాధికభేదము నగుటంజేసి సిద్ధసాధనదోషము పరి హృతం బయ్యెం గాదె. 252

శం. ఆర్యా! నిరుపాధిక భేదంబునకు (6) దృష్టాంతముగాఁ జూపఁబడిన ఘటేశ్వరభేదముగూడ నవిద్యోపాధిక మగుటచే నచ్చట నిరుపా ధిక భేద మంగీకరింపఁబడమింజేసి దృష్టాంతహాని కలిగెను మఱి యు నీయనుమానమున 'సాధ్యవ్యాపకత్వే సతి సాధనావ్యాపకత్వ ముపాధిః' అను లక్షణముఁబట్టి బ్రహ్మానిరూపిత నిరూపాధికభేదము ఘటాదులందుఁ దప్పక యుండటంజేసి సాధ్యవ్యాపకమై, యసర్వ జ్ఞత్వరూపసాధనము గలజీవునియందు జడత్వము లేకుండంజేసి సాధనావ్యాపకత్వము గల జడత్వ ముపాధియగుటచే నీవు హేతు వనుకొనినది సోపాధికమై హేత్వాభాస మగుచున్నయది. మఱి యు 'ఆత్మా పరస్మా దభిన్నః, చిత్త్వాత్, పరవత్ (పరమాత్మ వత్) అను ననుమానముచే జీవునకుఁ బరమాత్మాభేదమును సా ధించుచిత్త్వరూపహేతువు గలుగుటంబట్టి నీచూపినహేతువు స త్ప్రతిపక్షితము గూడ నయ్యెనే. 253

మం. వ. (బ్రహ్మపక్ష మగుననుమానము ప్రయోగించి సిద్ధసాధ్య త్వాదిపరిహారమును శంకించుచు) బ్రహ్మ జీవప్రతియోగిక ధర్మి ప్రమాఽబాధ్యభేదవత్ । సంస్కృతిశూన్యత్వాత్ । అని మేము సా ధించుచుంటంజేసి జీవభేదము బ్రహ్మజ్ఞానబాధ్య మని నీ వొప్పు

---

(6) దృష్టాంతము వాదిప్రతివాద్యుభయసంప్రతిపన్నమే కావ లయు నని శాస్త్రనియమము.

దానికి విపరీతముగనే సాధించుచుండుటచే సిద్ధసాధనదోషము లేదు.
ఘటాదిప్రమచే జీవభేద మబాధ్యమని నీ వంగీకరించుటంజేసి
దృష్టాంతహానియు లేద. 254.

౪౦. అజీవప్రతియోగికభేదము యావద్ధర్మిప్రమాబాధ్యము కా దని
యా? యత్కించిద్ధర్మిప్రమాబాధ్యము కా దనియా? అచ్చట ఘట
గతమైన జీవభేదమునకుఁ గూడ స్వధర్మిబ్రహ్మజ్ఞానబాధ్యత్వము
స్వీకరించుటచే యావద్ధర్మిజ్ఞానాబాధ్యత్వము సంప్రతిపన్నము కా
మిం దృష్టాంతహాని ఘటిల్లుటంజేసి ద్వితీయపక్ష మాశ్రయింపనెంచ
నందు స్వరూపాతిరిక్తభేదవాదిమతమున ఘటాదికమందు బ్రహ్మ
మందును గలజీవభేద మేకమే గావున నాభేదధర్మి యైన ఘటము
సంబంధమగు జ్ఞానము నబాధ్యమైన జీవభేదము బ్రహ్మయందు
మా కంగీకృత మగుటచే నీకు సిద్ధసాధనదోషము. ఇంతియ కాదు.
సాధ్యకోటియందలి ధర్మిపదముచే వివక్షితము సగుణమా? నిర్గుణ
మా? సగుణ మందువేని సగుణస్వరూపజ్ఞానముచే భేదమున కబా
ధ్యత్వము మా కిష్టమగుటచే సిద్ధసాధనదోషము. నిర్గుణ మందు
వేని యదియు దోషాయత్తమే యగు నెట్లంటేని వినుము. ఆనిర్గు
ణస్వరూప మైనబ్రహ్మము తాను బక్షముగాఁ బ్రమిత (ప్రమాణ
సిద్ధ) మై యగునా? యప్రమితమై యగునా? అందు ద్వితీయపక్ష
మున నాశ్రయాసిద్ధి కలుగు, నిఁకఁ బ్రథమపక్షమం దన్ననో:—
జీవాభిన్నముగాఁ బరమాత్మ తత్త్వమస్యాది వేదాంతవాక్యములం
బ్రసిద్ధమగుటచే నీవు చూపిన యనుమానమువలన నావేదాంత
ప్రమాణమునకు బాధ కలుగు 'జ్యోతిష్టోమో న స్వర్గఫలదః,
క్రియాత్వాత్, మర్దనక్రియావత్' అను ననుమానము 'జ్యోతిష్టో
మేన స్వర్గకామో యజేత' అను వేదవాక్యమునకు విరుద్ధార్థబో
ధక మగుటచే నెట్లాభాసరూపమో నీయనుమానమును నట్టిద.

మం (అనుమానస్థాపనమునం దసమర్థుండై యామార్గము వదలి శ్రుతి విరోధము చూప నెంచి) 255.

ఉ. వాని చెలంగఁ "దత్త్వమసి" వైదికసూక్తిని దూల్చు 'ద్వాసుప ర్ణా సయుజా'యటన్న*శ్రుతిరాజము; జీవున కాత్మకుఁ భిదా న్యాసము గల్గ నయ్యెరువురం దొకఁ డాస్థను బిప్పలాదియై భాసిల; నొం డభోక్త యయి భాసిలు నం చెఱిఁగించి మస్కరీ.256

తం. గీ. వినుము ప్రత్యక్షసిద్ధమై విఫల మగుప రాత్మభిద కేల శ్రుతి మాన మగుట; నితర థా తెలియఁగాదె యద్ది; స్వార్థమ్మునం ద తత్పరము లయ్యె నర్థవాదములు దనరు. 257.

వ. అజ్ఞాతార్థంబునందె శ్రుతికిఁ బ్రామాణ్యము జైమిని చెప్పుటంజేసి ప్రత్యక్షసిద్ధమును ఫలరహితము నగుజీవాత్మభేదము దెలుప శ్రుతి యేటికి? తత్త్వమస్యాదివాక్యవిరుద్ధము లగునేతాదృశశ్రుతులు స్వా ర్థమునం దతత్పరములయ్యె నర్థవాదమాత్రములు గాకపోవు.

మం క. శ్రుతిమూల మగుట గీతా స్మృతిప్రసిద్ధార్థవాక్యరీతిఁ, బ్రమాణ స్థితిఁ గనుఁ బ్రత్యక్షసమా ర్జితార్థవాక్యమును నిగమాజీవిక యగుటన్. 259.

వ. "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత" యను గీతా వాక్యమునకు మూల మగు తత్త్వమసి యనుశ్రుతి ప్రమాణమగు నట్లే ప్రత్యక్షముచే సిద్ధమగు నర్థము బోధించు 'ద్వాసుపర్ణా'యను నీయభేదశ్రుతియుఁ బ్రమాణమే యగును. 260.

---

*శ్రుతి. ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే, తయో రన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్న న్నన్యో అభిచాకశీతి. అని

శం. వేదమూలంబు బగుట వేదవిత్స్మృత్యాగ్ర
మందు స్మృతియు ప్రమాణమా నంమవేని
యెటు స్మృతి ప్రమాణ మగును జీవేశభిదను
స్మృతిలవాజ్ఞలు స్సైత మెఱుంగుదాన. 261.

ఉ. ఆనిగమంబు జీవపరమాత్మలఁ జెప్పు నటంచు మాటమా
టానకు నంటివేగా, కిది యథార్థము- సత్త్వమునుండి వేర్పడం
గా నలపూరుషుఁ దెలిపి క్రిచ్చుఱ వానికి సర్వసంసృతి
న్యూనత పాదుకో నుడువుచున్నది తన్నిగమమ్మె యెన్నఁగన్. 267.

మం. దేవ యీశ్రుతి సర్వజ్ఞజీవులను ద్వ
జించి తా సత్త్వజీవుఁ జెప్పనేని
జడమునకు భోక్తృతను జెప్పఁజాలు నేత
దాగమమ్మునకుఁ బ్రామాణ్య మమరు టెట్లు? 263.

శం. నేము నీ కళంకనీయుల మాపైంగ్య
మగురహస్య మిట్లు వ్యాఖ్యసేసె
'నత్తి సత్త్వ' మంచు 'నభిపశ్యతి జ్ఞ' యం
చు నదసీయ మంత్రమునకు సరిగ. 264.

వ. ఎట్లంటేను 'తయో రన్యః పిప్పలం స్వా ద్వత్తీతి సత్త్వం, అనశ్న
న్నన్యో అభిచాకశీ త్యనశ్న న్నన్యో అభిపశ్యతి జ్ఞః, తావేతౌ స
త్త్వక్షేత్రజ్ఞౌ' అని పైంగ్యరహస్యము. పిప్పలభోక్త సత్త్వ మనియు
నభోక్తయై సాక్షిమాత్రుఁడుగా నుండువాఁడు క్షేత్రజ్ఞుఁ డనియు
వివరించుటఁ జేసి సత్త్వజీవులను గ్రహించిన మావాదము నీ
కళంకనీయము. 265.

మం. ధీర సత్త్వశబ్దమ్ము శారీరవాచి
యగుట క్షేత్రజ్ఞపదము పరాత్మవాచి
యగుటఁ బైంగ్యరహస్యదితార్థ్యమునను
నల్ల వాక్యమ్మునకుఁ దోఁప దన్యపరత. 266.

కం. ప్రాప్తరూప! త దేత దిత్యాదిసూక్తిఁ
జిత్తమున సత్త్వపదవృత్తి సెప్పఁబడియె
దానసే చెప్పఁబడియె క్షేత్రజ్ఞశబ్ద
వృత్తి శారీరకద్రష్టృవిషయమందు. 267.

వ. సత్త్వ మన నంతఃకరణ మనియు క్షేత్రజ్ఞుఁడన శారీరుఁ డనియుఁ బ్రసిద్ధమగుటవలనను పైంగ్యరహస్యమందు నట్లే వ్యాఖ్యాతంబగుటవలనను రూఢియైనది. ఆపైంగ్యరహస్యమున (8) 'త దేత త్సత్త్వం యేన స్వప్నం పశ్య త్యథ యోఽయం శారీర ఉపద్రష్టా సక్షేత్రజ్ఞ స్తా వేతౌ సత్త్వక్షేత్రజ్ఞౌ' అనియుండె. కావున సత్త్వమనఁ జిత్తమనియు క్షేత్రజ్ఞుఁ డన శారీరుఁ (జీవుఁ) డనియు నిశ్చితము. 268.

మం 'యేన' యని స్వప్నదృశిధాతు వ్వాని కర్త
చెప్పఁబడెఁ గాన నయ్యది జీవుఁడె యగు
నెలమి క్షేత్రజ్ఞశబ్దాభిహితుఁడు స్వప్న
దృక్కు నఖిలవిదుం డగు నీశ్వరుఁ డగు. 269.

కం. అభిహితం బయ్యెఁ దిబ్బ్రత్యయమునఁ గర్త
యమరెఁ గరణార్థమునఁ దృతీయావిభక్తి
ద్రష్ట శారీరధర్మవిశిష్టుఁ డగుట
యేనపదవాచ్యుఁ డనఘ! కాఁ డీశ్వరుండు. 270.

(8) యేన=సాధనమగు నేచిత్తముచేత, స్వప్నం=స్వప్నమును (క్షేత్రజ్ఞుఁడు) పశ్యతి=చూచుచున్నాఁడో, తదేతత్=అయ్యది, అనఁగా ఆచిత్తము, సత్త్వం=సత్త్వము. అథ యః=ఎవఁడు, శారీరః=శరీరగతుఁడై, ఉపద్రష్టా=చూచువాఁడై యుండునో, సోఽయం=అట్టియాతఁడు క్షేత్రజ్ఞః=క్షేత్రజ్ఞుఁడు తౌ ఏతౌ=అట్టియిద్దయము, సత్త్వక్షేత్రజ్ఞౌ=సత్త్వమును క్షేత్రజ్ఞుఁడును. అని వ్యాఖ్య.

మా, శారీరపదమువ్యుత్పత్తి 'శ
రీరే భవతి' యనునర్థరీతి నగుఁ దదా;
ధారముగ వెలుఁగు నీశుఁడె
శారీరపదాభిధేయసమయము నెనయున్. 271.

శం. ఈశుఁడు వెలుంగఁడే శరీరేతరమునఁ
దెలియ శారీరశబ్దాభిధేయుఁ డెట్లు
లగును? నభము శరీరమం దఖిలమందు
నుండఁగద దాని శారీర మందు రెవరు. 272.

మ:. జీవునిఁ బ్రాజ్ఞునిన్ దెలియఁ జెప్పక బుద్ధిశరీరభాజులన్
గేవల మిద్ది చెప్పనెడ నిత్యజడం బగుబుద్ధి 'యత్తి' యం
చేవెర వ్రాని భోక్త్రిగ యతీంద్ర! వచింపఁగవచ్చు? నట్లయే
నీవు ప్రమాణ మెద్ది వచియింతువొ నూతనముగాక యిమ్మెయిన్.

శం. ఇను మదాహంక మయ్యు దా నసలయుక్తి
దాహకతఁ గాంచుగతి నచేతనము యయ్యు
బుద్ధి చిదనుప్రవేశము బొందుకతన
భోక్తృధర్మంబుఁ బొందుఁ బ్రబుద్ధబుద్ధి! 274.

వం. నీడయెండధోరణిని జీవుఁ డీశుండు
గనఁగ భిన్నులనుచుఁ గారకములఁ
బరఁగు; శ్రుతి "ఋతం పిబంతౌ" యని యశేద
వేదబాధకమ్మ గాదె యదియు. 275.

వ. 'ఋతం పిబంతౌ సుకృతస్య లోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే,
ఛాయాతపౌ బ్రహ్మవిదో వదంతి పంచాగ్నయో యేచ త్రిణాచి
కేతా' అని కఠవల్లీస్థయగు శ్రుతియు "ఋతం కర్మఫలం, పిబంతౌ-పా
నప్రయోజ్యప్రయోజకౌ" యని తద్వివరణమును బ్రమాణములు.

కం. వ్యవహారసిద్ధభేదము
వివరించు చబాధక మ్మభేదశ్రుతి కౌ
చవులను భేదశ్రుతి కది
యవు బాధక మత్యపూర్వ మగుటఁ బ్రబలమై. 277.

మం. మానాంతరోపబృంహిత
మానాభేదశ్రుతియు బలాఢ్య యగుటచే
మానాంతరవిధురార్థం
బౌ నైక్యశ్రుతికి యతివరా! బాధక మౌ. 278.

వ. ఇందుఁ బ్రమాణాంతర మనఁ బ్రత్యక్షప్రమాణము యుపపన్న
మగు. దాన నుపబృంహితం బగుట భేదశ్రుతి బలిష్ఠమై యాప్రత్యక్ష
బాధితార్థమగు నభేదశ్రుతిని బాధించునే కాని యభేదశ్రుతి భేద
శ్రుతిని బాధింపనేరదు. 279.

కం. నిగమజ్ఞ! ప్రమాణాంతర
మొగిఁ బ్రబలములుగ నొనర్ప నోపక శ్రుతులన్
దగ దుర్బలములుగాఁ జే
యఁగడంగునుజుమి గతార్థతాదానాదిన్. 280.

క. అని యాతీరున శంకరుఁ
డనయము వాదించి మండనాస్యపిధానం
బొనరించెఁ దత్కుశత్రిం
బనుమోదింపఁగఁ దదీయ మగువాదంబున్. 281.

వ. అట్టియెడ సభ్యులసాధువాదంబు లొక్కతఱి మిన్నంటి దేవతూ
ర్యంబుల నతికరించె. 282.

—♦ ఆ శ్వా సా ం త ము ♦—

మ. దివిషత్తూర్యధిమింధిమిస్వనమిళద్గీతిస్ఫురద్గానవా
హావరంగాప్తజయేందిరాశుభవివాహాతిప్తముక్తాఫలో
త్సవసంసూచకపుష్పవర్షవిబిశద్వ్యావాపృథివ్యంతరా
శవలక్షద్యుతిలిప్తకీర్తిలలనాలాస్యోద్ధవేద్ధాకృతీ! 182.

క. పుణ్యజనపణ్యపుణ్యవి
గణ్యా! ఖరదూషణాదికతపస్విద్రు
ట్పుణ్యజనాగ్రిణ్యమితా
రణ్యానీదావదహన! ప్రశమితకుహనా! 283.

ఉ త్సా హ ము.

నల సుషేణ మైంద వాలినంద నార్కనంద నా
నిలజ జాంబవ ద్గవాక్ష నీల ముఖ్యకపిచమూ
విలసనాత్త విజయపూర్తి! వేంకటాఖ్య మంత్రిహృ
జ్జలజ సతతవాస రక్త! తరణివంశ మౌక్తికా! 285.

ఇది శ్రీ గురుకరుణాసమాసాదితకవిత్వ 'కవితాభూషణ', 'విద్వ
త్కవిశేఖర' వెంపరాల సూర్యనారాయణనామధేయ
ప్రణీతంబైన శంకరవిజయంబున
చతుర్థాశ్వాసము.

శ్రీ శంకర విజయము.

పంచమాశ్వాసము.

శ్రీయుత! యాదరవేంకట
రాయామాత్యార్చితాంఘ్రిరాజీవ! ముని
ధ్యేయైకజ్యోతీరూ
పా! యామ్నాయాంతదివ్యదాకృతి! రామా!

వ. దేవ! అవధరింపుము.

— మండనుని పరాజయము —

శా. సంధ్యానానటదిందుశేఖరశిరశ్చంచద్వియన్నిమ్నగా
వంధ్యోర్మిస్ఫుటఘుంఘుమారవసదృగ్వాగ్గుంఫసౌభాగ్య మా
సాంధ్యంబుల్ బచరించి శంకరుఁ డనుచ్ఛ్వాసంబుగా మండనున్
వింధ్యాహార్యము సూర్యునట్లు నిలిపెన్ వేదాంతవాదంబులన్ !.

క. గిరిశిఖరనిస్సరన్ని
ర్ఝరధారాధోరణీవిరాజితమై వా
క్తరుణీచరణాంగదరవ,
పరిహాసకమై తదుక్తిఫక్కిన్ వెలంగెన్. 2.

ఉ. సభ్యులుమందహాసవిలసన్ముఖులై యతి మెచ్చ; వైదుషీ
లభ్యయశఃప్రకాండవికలత్వము మండనుఁ డొందెఁ, దత్సతీ
బిభ్యదుదారచిత్త మనభీష్టము తెల్పక తీరమిన్ వ్యథా
క్షుభ్యదుదంత మయ్యె సభ ఘూర్ణిత మయ్యెను దక్షణంబునన్.3.

శా. దక్షుండై యతిమాళి నించెడు సుధాద్రాక్షాసదృక్షోక్తివై
చక్షుణ్యంబులు విశ్వరూపమహిళాసంమానముం గాంచి య

ధ్యక్షత్వంబున మించి సభ్యుల కమందానందసంధాయులై
విక్షోభం బొదవించె మండను మనోవీథిన్ గళత్స్రగ్రుచిన్. 4.

గీ. ఉభయభారతియును భర్త యురమునందు
వాడి వ్రేలెడు సుమమాలవంకఁ గాంచి
కాంచి నిలువెల్ల స్వేదప్రకంపనములు
గండకువు నా నచేష్టయై యుండె నంత. 5.

ఉ. దుర్మతఖండనైకపరతుం డగు శంకరు నైగమాంతవా
గూఢ్మల నాఁగ్రహం బుడిగియున్ విచికిత్సఁ జలాచలాత్ముఁడై
కర్మజనుండు గేస్తనిమొ 'గాసిల నేఁటి పరాజయార్థ మా
న్మిరలజైమినీయమతనిర్మథనార్థము నుందివంతగన్. 6.

ఉ. నైగమకర్మమార్గఘటనాచతురుండు తపస్వి యాగతా
నాఁగతవేది లోకహితయుక్తుఁడు జైమిని వ్యర్థసూత్రకృ
ద్యోగము సేయువాఁడె? యని యుల్లము తల్లడ మొందు' నన్న న
య్యోగివరుండు పల్కు విశదోక్తుల డెందము కందళింపఁగన్. 7.

క. కాసంతయేని యపనయ
మాసంయమివంకఁ బొడమ, దజ్ఞుల మాటల్
వీసంబు నెఱుఁగఁ జాలుదు
మే సత్యమ్మైనమౌనిహృదయం బనుచున్. 8.

గీ. పండితాజ్ఞేయ మంటి వప్రారికాంక్షి
హృదయ;.మది మెట్టిదయ్యె వర్ణించి చెప్పుము
యుక్త మని తోఁచెనేని నీయుక్తి దళద
హంక్రియుఁడనై గ్రహింతు నిండారుమదిని. 9.

క. అని మండనపండితుఁ డన
విని శంకరదేశికుఁడు వివేకమునన్ వం

దనపూర్వముగా నాజై
మిని పాండిత్యాదికము సమిద్ధతఁ బల్కెన్. 10.

మ. వినుమా జైమిని సచ్చిదాత్మకలనాభిప్రాయుఁ డయ్యెన్ జగ
జ్జనముల్ వైషయికేచ్ఛ మున్గుటను దత్సంతారణార్థంబు బ్ర
హ్మనిదానాప్తికి సాధనంబైన పుణ్యంబెన్నఁ గర్మప్రవృ
త్తి నిరూపించెను దత్తదర్హ మగురీతిన్ జాతకారుణ్యుఁడై. 11.

క. జ్ఞానావబోధహేతుక
మైన 'త మేత' మను వచన మది ధర్మచయో
త్థానకముగఁ జూపుటఁ ద
న్మానియు మోక్షేచ్ఛు వని సమర్థింతు మిటన్. 12.

వ. అది యెట్లంటేని వినుము 'తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిది
షంతి యజ్ఞేన దానేన తపసాఽనాశకేన' యనుశ్రుతి బోధోత్పత్తికి
హేతు వగుటం జేసి బ్రహ్మచర్యాదికధర్మంబుల నాచరింప విధించు
చుండెఁ దద్వచనాపేక్షకంబుగా జైమిని బ్రహ్మనిరతుండ కానఁ
గర్మ మవశ్యాచరణీయ మని నిర్ణయించె నియ్యది యయ్యనఘు
నభిప్రాయం బనుటయు. 13.

గీ. అడిగె నిటుల గృహస్థు "క్రియార్థకంబు
లగుట శ్రుతులు సఫలము లన్యార్థకోక్తు
లెల్ల వ్యర్థ" యని సూత్రించి ఋషి శ్రుతుల క
సిద్ధవస్తుపరత్వ మేబుద్ధిఁ బలికె. 14.

వ. 'ఆమ్నాయస్య క్రియార్థత్వా దానర్థక్య మతదర్థానా' మనుసూత్ర
మునందుఁ గ్రియార్థకంబు లగుటం జేసి శ్రుతులు సఫలము లగు నక్రి
యార్థకంబు లగువాక్యంబులు నిరర్థకంబు లని జైమిని వచించియు

నిగమవాక్యములె సిద్ధవస్తుపరము లని యేల తలంచెనో యనిసందియ
మొందుచుంటిని. 15.

చ. అనుడుc బరంపరాగతి హితాద్వయ మయ్యును వేదరాశి దాc
గనుcగొన నాత్మబోధఫలకం బగు కర్మముచేc గృతార్థమై
తనరుటc గర్మకాండ భణితంబులు కర్మపరంబు లంచు జై
మిని విరచించినాc డని యమిప్రవరుం డను మండనుం డనుc. 16.

గీ. అఖిలవేదములకు సచ్చిదాత్మపరత
యభిమతం బేని జైమిని, కపురుష మగు
కర్మమున కేల ఫలదాతృకత వచించు
నేల పరమేశు నిరసించు నిద్ధచరిత. 17.

వ. అనుటయు శంకరుండు. 18.

సీ. "కర్తృపూర్వక మీజగం బను ననుమాన
మే యీశుc బ్రకటింప నింక వేద
మనువాదమాత్రమై యలరుc గా" కనెడు కా
ణాదసిద్ధాంతమ్ము నరసి మాని
యశ్రుతివిదు లోప శౌపనిషదపురు
షు నెఱుంగనంచు నాశ్రుతులె తెలుప
ననుమాన మోపునే యనుభావమున నీశ
పరమైన యనుమాన మురలునట్లు
గీ. యుక్తిశతముల నిరసించు చొగిని జగము
పుట్టుట నశించుటయు ఫలంబులు సమస్త
మీశ్వరుని వంకc గా వనియెను మదుక్త
మంతయును జైమినీయాశయమ్మె సుమ్ము. 19.

చ. అవిదితతన్నిగూఢమహితాశయులై బుధు లమ్మునీశ్వరుల్
దవిలి 'నిరీశవాదియ యితం' డను నంత నిరీశవాదిగా
నవునె పరాత్మవిన్మణి? యహస్కరదీప్రమయూఖపుంజముల్
బవలు నిశాటనాహితతమంబు మలీమసముల్ బొనర్చునే. 20.

మండనుని సంశయములు తొలంగ జైమిని ప్రత్యక్షమై చెప్పుట.

క. అని యిటు జైమిని హృదయం
బును యతిశేఖరుఁడు దెలుప బుధుఁడును సభ్యా
వనితావతంసమును గని
రనన్యసామాన్యమైన యానందంబుల్. 21.

గీ. అంత నప్పండితుఁడు విదితాశయుండ
యయ్యుఁ గించిద్విశయుఁడై హృదంతరమునఁ
దద్వచఃక్రమజిజ్ఞాసఁ దలఁచు నంత
జైమినియుఁ గోచరించి యీసరణి ననియె. 22.

క. విను భాష్యకారుఁ డగునీ
యన నాసూత్రముల కెద్ది యర్థ మని వచిం
చెనొ యది నాహృదయము సుమి
మనమున సందియము వీడుమా యిఁక సుమతీ. 23.

క. గురుఁ డటు చిదేకరసత
త్పరతన్ శ్రుతిశీర్షభాషితములకుఁ దెలుపన్
బెఱరీతి నొక్కసూత్రము
విరచింతునె తదుపలబ్ధవిజ్ఞానుఁడనై. 24.

క. చాలింపుము సందియపడు
టాలింపుము దెల్పెదను రహస్యం బితఁ డు

ద్వేలభవమగ్నలోకము
పాలింపఁ జనించి నట్టి పరమాత్మ సుమా. 25.

ఉ. ఆదియుగంబునన్ గపిలుఁ డన్యయుగంబున దత్తమౌని యా
మీఁది యుగాన వ్యాసుఁ డటుమీఁదియుగంబున శంకరుండు జ్ఞా
నాదిక మిచ్చి ప్రోతు రిల నంచును శైవపురాణ ముండె నీ
వీదమిచక్రవర్తి మతమే గ్రహియింపు తరింపు సంసృతిన్. 26.

మండనమిశ్రుఁడు శంకరుని స్తుతించుట.

గీ. అనుచు మండను బోధించు యతిలలాము
మనము నం గౌఁగలించి జైమిని తిరోహి
తుండయిన యంత నయ్యతీంద్రునకు మ్రొక్కి
యాయజూకావతంస మిట్లని నుతించె 27.

క. ప్రకృతివి జగములకు సమా
ధికరహితుఁడ వతులబోధదేహుఁడ వయ్యున్
వికలాత్ములఁ బ్రోవఁగ భౌ
తిక దేహుఁడ వైతి వని మదిన్ నినుఁ గంటిన్. 28.

ఉ. ఓయతివర్య! యౌపనిషదోక్త్యద్వైతైకపదంబుఁ దత్త్వము
స్యాయుధ మీవు గైకొని నిరంతరమారయవేని భ్రష్టతా
ప్యాయనసౌగతప్రలపితాంధకకూపపిచండపాతమున్
బాయఁగఁ జాలునే విలయభావముఁ గాంచక యున్న యింతకున్.

చ. కలఁ గని మేలుకొంటి ననుగాఢమతిన్ గలయందె యన్య మా
కలఁ గను మూర్ఖురీతి నవగాఢతమోవశు లౌచుఁ గొంద ఱా
త్మలఁ బరలోక మందు టమృతత్వ మటంచుఁ దలంతు రట్టివా
రలఁ గని నవ్వుచుందురు నిరాకృతమాయులు తావకాశ్రితుల్. 30.

ఉ. అరయఁ గర్తృతాముఖరమై గతసారము సాధవంబుఁ బోఁ
గోరని భేదవాదిమతకుత్సితముక్తియునీ యదేల? యో
ధీర! త్వదుక్తముక్తిఫణితిన్ గనఁ జూతు సదాతనంబు సం
సారహరంబు చిత్సుఖరసప్రద నిర్ఝరమౌట నీపయిన్. 31.

ఉ. రాక్షసకామినీవృత ధరాసుత నీకు ప్రియన్ గనంగ నే
యీక్షితి వాయుసూతి నుతికెక్కను మ్రింగిన యీశుకై యవి
ద్యాక్షణదాచరీజఠరదారణమున్ బచరించి యీశు స
ద్వీక్షణపాత్రుఁ జేయు భవదీయమహత్తకియత్త యున్నదే. 32.

క. జగదార్తిహరణచణ! భవ
దగణితమహిమంబు దెలియ కాముక వాదిం
పఁగడఁగిన మదపరాధము
తగ క్షమియింపఁగదె సూరత ప్రథముఁడనై. 33.

గీ. అప్రమేయప్రతిభు లౌకణాదకపిల
గౌతమాదులె వేదసంఘాతభావ
నిర్ణయ మొనర్ప మోహ మొందిరి యనంగఁ
జాలుదురె యన్య; లోకశివాంశంబుదక్క 34.

మ. అమృతాసారకిరద్భవద్వదనజాతాలాపపీయూషభా
స్సముదాయంబు దిశావకాశముల మించన్ జిత్తమాలిన్యబీ
జములై కూడిన కాణభుక్కపిలపశ్యత్పాద శాస్త్రోక్తిసం
తమసస్తోమముతోఁ బ్రయోజనము కానన్ వచ్చునే లేశమున్.

సీ. దేవుని భేదించి గోవుల భంజింపఁ
దివిరెడు నభినవయవననివహ
మవని యంతయుఁ బర్వ, నవ్వారి సేవించు

నవ్వారి కెచ్చట నెవ్విధమున
ముక్తి గల్గునె యంచు మున్నహర్నిశమును
జింతించుచుందురుఁ జిత్తమంద
సద్వాదిరాజు లుత్సారితకలిమలుల్
విష్ణుతత్త్వాభినివిష్టమతులు

గీ. పరమనిపుణులు నైన భావత్క శిష్య
కుంజరులు సర్వదిక్కులు గూడముట్టి
జృంభణము సూప నిఁక నేల చింత నొంద
సత్వభావితభావ! యాచార్యదేవ! 36.

గీ. మందమతికృతవివరణదంవశూక
విక్షతిహతంబు లగు శ్రుతుల్ విమలయుష్మ
దుక్త్యమృతసేక మొదవక యున్న వరలఁ
జాలునే యాత్మవిధృతానుశయము లగుచు. 37.

గీ. తీవ్రతరదుస్సహాభవోష్ణదీధితిప్ర
బలతరాతపజాత తాపంబు శాంతి
నందునే భవదీయసూక్త్యమృతకరమ
యూఖసంపర్కమునఁ దక్క నొండొకంట. 38.

ఆ అకట! కర్మయంత్ర మందెక్కి శ్రుతతపో
దారపుత్రగేహదాసవిత్త
ముల జనించు మానమునఁ గూలు నన్నెత్తి
తల భవాంధకూపబిలమునుండి. 39.

క. తొలుబాముల దుష్కర మగు
నలఘుతపము చేసికొంటి; నటుగాక కృపా

జలధి! జగదీశ నీతోఁ
గలుగునె యీవాదజల్పకథ లిటు నాకున్. 39.

సీ. శమరూప పూర్వపుణ్యమున కంకుర మెద్ది
దమ సముద్గతి కెద్ది తలిరుటాకు
వైరాగ్యవిటపికిఁ గోరకం బెది సహా
సత్త్వవల్లిక కేది ననలజొంప
మేశాగ్రితాసుమ బృందంబునకు నమం
దమరందబిందు సంతాన మెద్ది
సంతతశ్రీదకు సముదితఫల మెద్ది
ధీరస్తుత్యునకు నిందేయ మెద్ది
గీ. పరమగురువర్య! యట్టి శ్రావకమనోజ్ఞ
వచనపరిచయమును బూర్వభవసహస్ర
సముపలబ్ధ సంఖ్యాతీతసారపుణ్య
పటుతరీపాకమునఁ గాదె పడయఁగంటి. 40.

గీ నాకసంవాసులకుఁ బూరుషార్థ మొసఁగు
భువిని భవమగ్నజనులకు మోక్ష మొసఁగు
సత్కృపోర్మిళ నీకటాక్షఝురి దలఁప
ధన్యుఁ డగువాఁడ మున్న నద్దానియందు. 41.

చ. పోఁతులచన్నుదోయి పయిపుట్టపుఁగొంగు దొలంచి ముట్టి కోఁ
గిలిగొని హాళిఁ జొక్కి కరఁగించి రమించుచుఁ గొంద ఱింద్రగా
కలఘుయశోఽగ్రులై నిపుణులై తగువీరలు దేశికేంద్ర వా
గ్గళితసుధాఝరీప్లవనకౌతుకులై విహరింత్రు ధీరతన్. 42.

చ. తిమిరహారంబు లౌ విశదదీప్తుల భాసిలు ధ్యానతంతుగుం
ఫమిళితతావకోక్తిపృథుమౌక్తికహారములన్ ధరించి మో

దమునఁ జరించు నీకుఁ దనుఁ దాన వరించును హృద్య విద్య య
య్యమరవరాదులకు గొనక యంతటి భూష బుధాళి కున్నదే 43.

ఉ. వేదవిలాసహేతు వగు విశ్రుతతావకకీర్తికిన్ బుధుల్
మోదముగంద్రుగా- కలనభోమణిదీప్తికి గూబ లట్లు మో
హోదధి మున్గుచున్ ఖలసముత్కరముల్ గురుశంకరార్చనా
సాదితమోహరాశి నయి శాశ్వతికాత్మసుఖాబ్ధి దోఁగెదన్. 44.

సీ. సంతానశాఖి యుష్మచ్చింతనమ్ము స్వ నం
దనవనమ్ము భవత్పదప్రణామ
మమరభూరుహావల్లి యనఘ! భవత్సమా
రాధనాతంత్రిదుర్వారవాంఛ
మందాకినీనది సుందరభవదీయ
వరగుణనికురుంబవర్ణనంబు
స్వర్గంబు నేత్రగోచర మౌ భవచ్చర
ణాంభోజయుగళంబునర్హణంబు
గీ. గానఁ బ్రాజ్ఞు లనూనచింతానిధాను
లగుచు భవదాశ్రయము గాంచి యాత్మలందుఁ
దృణసమంబుగ గణియింతు త్రిదివజగము
సచ్చిదానందధుర్య! యాచార్యవర్య! 45.

గీ. తాన సంతానకాంతానికాయ్యవిత్త
ములను గార్హస్థ్యకర్మశృంఖలఁ ద్యజించి
శరణముగ వరియించుతు నీచరణయుగళి
కరుణ నను నేలుకొనుము కింకరుని దేవ. 46.

చ. అని యిటు మండనార్యుఁడు యథార్థతఁ దద్గుణముల్ నుతింప, మె
చ్చినమది నాత్మవేది గురుశేఖరుఁ డప్పు డనుగ్రహించి మా

తనిఁ గొన నెంచి వాని సహధర్మచరిన్ గన, నాపెయున్ యతీం
ద్రుని మహితాశయంబును గనుంగొని యల్లనఁ బల్కె నీక్రియన్.

భారతి తన పూర్వవృత్తాంతమును జెప్పుట.

క. యతివర! యెఱుఁగుదును భవ
న్మతిఁ దొల్లిటఁ దెల్పె నొకఁడు మానీంద్రుఁ డనా
గత మగునావృత్తం, బ
క్కతను వచించెదను శ్రద్ధగా విను మనఘా! 48.

ఉ. శైశవమందు మజ్జననిసన్నిధి నుండ నొకప్డు వచ్చె మా
నీశుఁ డొకండు పింగరుగుదీర్ణతటిత్ప్రతిమానజటాజూ
టీశిరుఁడై త్వగావృతకటీరుఁడునై సకలాంగలిప్తభ
స్మాశితికాంతిమండలుఁడునై వసుధాగతశంభుఁడో యనన్. 49.

గీ. వచ్చినమునీంద్రునకు నర్ఘ్యపాద్యముల నొ
సంగి నాతల్లి మౌళి నంజలి ఘటించి
నాభవిష్యచ్చరిత్ర మంతయును దెలుపఁ
బ్రార్థన మొనర్చె నిటు లనురాగ మొలుక. 50.

క. మహనీయ! యెఱుఁగను నా
దుహిత భవిష్యంబు; తెలియుదు తపోమహిమన్
మహితాత్ములు ప్రణతులకుం
బహుళకృప రహస్య మెఱుకపఱచెదరు గదే. 51.

ఉ. ఈయమ కాయు వెంత? సుతు లెందఱు గల్గుదు రెట్టివాఁ డగున్
నాయకుఁ? డధ్వరంబుల నొనర్చునొకో? ధనధాన్యపూర్ణ యౌ
నే? యని భావ్యుదంతమును బృచ్ఛ నొనర్ప నిమీలితాక్షుఁడై
యా యతి పల్కెఁ జూచినక్రియన్ మదుదంతము నెల్లఁ జిత్రమా.

ఉ. ధారిణివేదబాహ్యమతధాటికి వేదపథంబు గూల నం
భోరుహసూతి యుద్ధరణమున్ సలుపన్ జనియించు బ్రాహ్మణా
కారవిహారుఁడై; గిరిశు గౌరి, హరిన్ సిరివోలె, నమ్మహా
సూరిని నీవె పెండ్లియయి సూనులఁ గాంచును గాంచు సౌఖ్యముల్.

గీ. అంతట దురంతకుమతకృతాంత మయి వి
నష్ట మగునౌపనిషదసన్మతము ప్రోవ
మానుషాకార మూని యీశానుఁ డవని
నిజపదాబ్జవిన్యాసమునఁ బూత నొనర్చు 54.

క. యతిరూపుఁ డైన గౌరీ
పతితో నీకూఁతుపతికి వాదము గలుగున్
జితుఁ డగు విస్పృష్టగృహుఁ డయి
గతి నీ వని కొలుచు నాజగద్రక్షకునిన్. 55.

గీ. అని చనియె నమ్మునీంద్రువచోనుసార
ముద్భవించినదాది నెం దోట యెఱుఁగ
నట్టి మత్పతి వేదవేదాంగవేత్త
జితు నొనర్చితి నీవ సూ శివుఁడ వార్య. 56.

భారతి శంకరునితో వాదింపఁ గోరుట.

ఉ. ఐనను నపనోహరు సమగ్రివాగా జితుఁ జేయ నైతి సా
మే నగునన్నుఁ గెల్చికొన మీ యితరున్ నిజశిష్యుఁగా యతీ
శాన! లభించుఁ బూర్ణజయశంసలు నీకు, భవాదృశున్ మహా
జ్ఞాని నెదిర్చి వాదము నొనర్పఁగ నాకును వేడు కయ్యెడున్. 67.

క. అని యాయజూకవరవ
ర్ణిని యనపేతార్థమును ననింద్యము మధురం

బును నగుపలుకుం బలుకఁగ
విని యయ్యతి ప్రతి వచింప వేడుక గనుచున్. 58.

క. చిత్తము వాదోత్సుకమ్మ
యత్తమ్మైన దంటి; వంబుజాక్షులతో ధీ
రోత్తములు వాదొనర్తురె
మెత్తురె యెవ రైన ననుడు మొలఁతుక వలికెన్. 59.

చ. గరితలొ లాఁతులో యెవరు గాని స్వకీయమతంబు నొంప నో
ర్తురె స్వమతానవవ్రతపరుల్ వివదింపక? యాజ్ఞవల్క్యుఁడు
ద్ధరగతి గార్గితో, సులభతో జనకుండును మున్ను వాదొన
ర్చ్పరె? ధర వారికీర్తి కొకవాటియునున్నేని గళంక మబ్బెనే? 60.

గీ. అని తరుణి యుక్తియుక్తముగను వచింప
ప్రతినదీహారిరాశీశ్వరుండు ముదితుఁ
డై యొడంబడె విద్వత్సభాంతరమున
నుండి యాసాధ్వితో వాద మొనరఁ జలుప. 61.

ఉ. అంతట నొండొరుల్ గెలుచునాదట నయ్యతిరాజమౌళి క
న్యాంతకు వాద మయ్యె మతికౌశలగుంఫితశబ్దనిర్ఘరీ
కాంతము తెచ్ఛ్రుతిప్రభవగాఢతరాద్భుతవత్సుధీస్తవా
క్రాంతము నొంచు సభ్యజనకర్ణపుటామృతబిందుధారమై. 62.

గీ. వారలవిచిత్రపదయుక్తిభరితవాద
మాలకింప సహస్రాస్యుఁ డలతి యెంత
నుండు వాచస్పతియు నశనుండుఁ బోలఁ
జాల రసపింప నెవఁ డింకఁ జాలు జగతి. 63.

క. పగ లనక రేయి యన కి
ట్లగణితమై వాదకథ నియమకాలము ద
క్కఁగ నయ్యెతి కాసతికి జ
రిగెఁ బదునేడహము లొక్కరీతిని యవురా. 64.

గీ. అపుడు భారతి యకృతకోక్త్యాదులందు
సకలశాస్త్రములను వీఁ డజయ్యుఁ డనుచు
మది విచారించి యొక్కింత కొదికి యంత
లోన దిటపడి నిశ్చయ మూని నిటుల. 65.

ఆ. పుట్టుబ్రహ్మచారి పురిటింట సన్న్యాస
మూని సతతనియమధానఁ డౌటఁ
గామశాస్త్రగంధ మేమియు లేదింకఁ
గాన నేఁడు గెల్చుదాన దాన. 66.

వ. అని నిశ్చయించుకొని పూర్వాహముపూర్వాహ్ణమున నడచినబ్రవృత్తి నివృత్తి మార్గద్వయమునందలికీడుమేళ్ళవాసి మరలఁ బ్రసంగంబునకు రాఁ దివిచి యాగరితయి ట్లను. 67.

ఉభయభారతి శంకరునిం గామశాస్త్రమునఁ బ్రశ్నించుట.

చ. యతిజననాథ నీసమయమందు వచింతు 'మనంబె బంధమో
క్షములకు హేతు' వంచు విన సంతస మయ్యె, మనంబు హేతు వే
క్రమమున నయ్యెనో తెలుపఁగావలెఁ? గర్మము తాన బంధమో
క్షములకు హేతు వౌ మనసు కర్మవశంవద మంద్రుగా బుధుల్. 68.

గీ. అనుడు శంకరార్యుఁ డనె సాధ్వి కర్మము
ననుసరించు బుద్ధి యనుట నిజము

మనసు లేని బంధమును గూర్చి యొసఁగేయు
ముక్తి; తనయభావమున ఘటించు. 69.

వ. మనంబు తానుండి బంధమును, నశించి మోక్షమును గల్గించునది కావున భావాభావములచే బంధమోక్షములకు హేతు వగు, బుద్ధి కర్మానుసారిణి యనుటయు నవిరుద్ధంబు. 70.

క. అది సంకల్పవికల్పా
స్పద మయి సత్పదమునం దసద్బుద్ధి, యస
త్పదమున సద్బుద్ధి సదా
యుదయింపఁగఁజేసి జీవునుద్బాధించుక్. 71.

సీ. తనముద్రియున్నట్లు ధనము నా దనిపించి
వనటలు ముంచును మనసు గాదె
తనకర్మమున జనించినవాని నాత్మజుఁ
డని సేవ సేయించు మనసు గాదె
యెచటనో జనియించునింతి యిల్లా లని
తనవారి మఱపించు మనసు గాదె
తనశరీరము శాశ్వతం బనిపించి ముం
చును లోభవారాశి మనసు గాదె.
గీ యెఱుక యేలవమే నుదయించెనేని
మఱపి యనర్థమ్మునం బెట్టు మనసు గాదె
రాగకలుషితమై కామరాక్షసునకు
జననకారణ మైనది మనసు గాదె. 72.

క. ఏతాదృశదుర్మానస
జాతం బగు కామమునఁ బ్రసక్తి నుయినసా

ఖ్యాతిశయము నాభాసిక
మై తనరు నిమిత్తకారణానుగుణముగన్. 73.

చ. కలుగునెడన్ మనోలయము, కల్గదు గామము, దానఁ గామినీ
కలుషముఁ బుత్రమోహమును గాడ్పడు, దేహమునన్ మమత్వమున్
దొలఁగు లభించు మోక్షము; మనోలవ మున్నెడఁ గామపీడ వ
ర్థిలి సుతదారబంధపరిధిన్ బడి జీవుఁడభావుఁడై చనున్. 74.

ఉ. నా విని పల్కె నవ్వనిత న్యాయమె కామము నట్లు కూలి? దే
వా! వినవా తృతీయపురుషార్థ మటంచన ధర్మ మర్థమున్
గావలెనా? త్రివర్గమునఁ గామము త్యాజ్యమె? వీని మూఁడిటిన్
బోవ నడఁచి యుద్దవిడి మోక్షము నొందెడివాఁ డెవండిలన్. 75.

గీ. ధర్మము విశేష్యమై తొల్తఁ దక్కు రెంటి
కిని విశేషణమై పొసంగును గదన్న
ధర్మమును ధర్మమైనర్థమును కామ
మౌను మోక్షసౌధమ్ముసోపానపంక్తి. 76.

క. మోహమున, మరమున, దేహము
సామున భామల ధరించి సంతతము మహా
కామపురుషార్థదీక్షితు
లామూర్తిత్రయము ముక్తు లగుదురొ కాదో. 77.

క. ధర్మార్థంబుల నారసి
మర్మ మెఱిఁగి విడిచి నట్లు మాటాడితి వే
మర్మ మెఱిఁగి కామమ్మును
నిర్మమతఁ దొఱఁగి ముక్తినిం గనఁ దలఁతో. 78.

మ. అనుడున్ శంకరుఁ డిట్లు పల్కు సుచరిత్రా! తత్త్రివర్గంబు దాఁ
బునరుత్పత్తికి గారణంబు లగుటన్ మోక్షార్థి యమ్మాట ము

న్గినఁ దప్పించుకొనన్ వలెన్ మునుఁగఁజేనిన్ దప్పుగా నేఁగనా
వని శాస్త్రంబులు దెల్పవే శుకుఁడు ప్రహ్లాదుండు దృష్టాంతముల్.

క. జనకాదులు సంస్కృతులే
పనదూరులు త్రివర్గభానుజలై ము
క్తిని గనుట విశేషవిధ యు
గున; యది సామాన్యమగునొకో జగములకున్. 80.

ఉ. ముక్తులు గా రటందురె త్రిమూర్తుల వారలు, దారలన్ దనూ
సక్తులఁ జేసికొన్నవరుసన్ గనుపింతురి తమఃప్రసక్తిఁ, బ్రి
త్యక్తమతత్త్రయంబున భిదాప్రథ లేనివిధాన దంపతీ
తోత్పత్తికి స్త్రీత్వపుంస్త్వములు యూహములున్ శశశృంగభంగికల్.

ఉ. జ్ఞాని శ్రుతిశ్రుతంబుల ననప్రకృతిన్ మదిఁ గొన్ని దానఁ బూ
ర్ణానుభవంబు గాంచుఁ, దన కక్కఱ గల్గ సుసాధ మా సిహాం
బేని పరంబునేని-యది యెల్లను జ్ఞానమహత్త్వఁ జేపడున్
గాన వృథా శ్రమంబు గలుగన్ వివదింపకు నమ్ముచో ననున్. 82.

గీ. ధర్మమట్టుల యర్థ, మర్థమ్మునట్ల
కామమును జ్ఞానశక్తి నిగాఢముగఁ బ
రీక్ష సేసియు రోసి యీ మోక్షపథము
నఁదుఁ జరియింతు నా తెలియనిది లేద. 83.

క. అన నమ్మానిని యతి వం
చనఁ బలుకుచునుండె ననుచు స్వాంతమ్మునయుం
దనయము తలపోసి తనకు
ననయుం బని యైన నెంచ కన నీరీతిన్. 84.

శా. ద్వైతజ్ఞానరహస్యముల్ దెలియ కద్వైతంబు సిద్ధించునో
క్కో తద్వైతపథానుయోగమును వాకో నుండ ని ట్లాడ నా

నే? తప్పించుకొనఁగ యుక్తు లిటు చన్నె పన్నఁగా జ్ఞాని కూ
హాతీతంబు ఘటిల్ల దంటి విది చోద్యం బద్దియుఁ జూచెదన్. 85.

వ. అని కామపురుషార్థంబు ధర్మ్యం బనియు సాక్షాత్సాధనము గాకున్నను మోక్షమునకుఁ బరంపరాసాధనం బేని గాకమాన దనియుఁ గా దనియుఁ గొంతసేపు వివదించి ప్రసక్తానుప్రసక్తంబుగా స్త్రీపురుషజాతివిశేషంబులఁ గూర్చి చర్చించితుట్టతుద కయ్యిందువదన కేవలజిగీషాయత్తచిత్తయై యెదిరిం దన్ను మఱచి యిట్లని ప్రశ్నించె. 86.

గీ. ఇంచువిలుకానికళ లెన్ని? యెట్టి వవ్వి?
వానినెల వెంచ నెది? శుక్లబహుళపక్ష
ములను నెట్లు ప్రవర్తిల్లు? బొలఁతులందు
నెటుల తోఁచును? బురుషులం దెటుల తోఁచు? 87.

వ. అనుచు నతర్కితోపనతముగాఁ బలుకుటయు. 88.

క. విద్యలగని యగు నయ్యన
వద్యాంగి జిగీషఁ బిఱుగువడినటు లను నా
చోద్యమునకు భిక్షుకపతి
చోద్యమున మునింగి నింగిఁ జూడ్కి నిగిడ్చెన్. 89.

క. ఘనుఁ డతఁడు మాఱు వలుకక
మనమున నిటు లెంచెఁ గళలమర్మమ్ముం జె
ప్పనియెడ జితుఁడ నగుదు జె
ప్ప నెటుల మన మొప్పు రచ్చపట్టున సతితో. 90.

ఉ. అంతియ కాదు కామకళయందుఁ బరాజయ మొందుమాత్ర నో
క్కింత కొఱంత గాంతునె? యి దెల్లను జూచు ప్రజల్ యతీంద్రుఁడ
క్కాంతకు నోడె నేదొ యడుగన్ దగునుత్తర మీయ నేర కం
చెంతయు వింతఁ జెప్పుకొనరే సకలజ్ఞత వోదె నేటితో. 91.

శంకరుఁ డుభయభారతిని గడువు వేడుట.

మ. అని భావించి సభాంతరంబున లతాంతాస్త్రాగమమ్ములన్ వచిం
పను సందేహముతో నచుఁ బితకశాప్రశ్నంబు గావించి తం
గన యిమ్మా గడు వొక్క మాసము సమగ్రం బద్ది నే నేర్చి వ
చ్చి నినున్ గెల్చెద నిద్ది ధర్మమె కదా చింతింప వాదమ్ములన్. 92.

ఉ. మానిని! నాకు నెట్లొ యవమానము చేకుఱ వాదరీతికిన్
గాని యనంగశాస్త్రవచనంబులఁ బ్రశ్న మొనర్చి నిగ్రహ
స్థానము నొందితైనఁ బరిషత్తున సాక్షిణి నిన్నుఁ గా దనం
గా నగునే, య దేల యొసఁగంగదె సమ్మతి పోయి వచ్చెదన్.

క. నావుడు మండనమిశ్రుని
దేవియు సభ్యులును ననుమతింపఁగ శిష్య
పరివృతుఁడై దవుల నొక వ
నీవీథిగతాద్రి కతఁడు నెమ్మిం జనియెన్. 94.

వ. మండనమిశ్రుపుస్తకభాండాగారమునుండివలయు కామశాస్త్రగ్రం
థములు గొంచునటుల చని చని యయ్యటవి నిరుపహతి యగునొ
క్క కొండ నెక్కి యందొక్క గుహం గాంచి శిష్యులం బిలచి
యిట్లను. 95.

చ. సమతలమై పురస్థితవిశాలశిలాఫలకాభిరామమై
యమరిన దామహాగుహ; తదగ్రవటద్రువు తత్సమీపమం
దమలజలాప్తమై ఫలభరానతభూరుహషండరమ్యతీ
ర మగు సరోవరంబును విరాజిలుచున్నవి కాంచిరే గదా. 96.

వ. ఇది వసింప ననువుగ నుండు నని పలికి కందమూలఫలాశనుండై
యచటన నిలిచి. 97.

శంకరుని కామకళాధ్యయనము

సీ. అధిగమించెను సుమనోస్త్రసంప్రోక్త మా
రతిశాస్త్రజలధి పారంగతముగఁ
జదివె నామూలాగ్ర ముదితకౌతుకుఁడౌచుఁ
గూచిమారవచోనిగుంఫనముల
నభ్యసించెను బహువ్యాఖ్యాపరీక్ష వా
త్స్యాయనకామసూత్రముల నెల్లఁ
గఱచెఁ బ్రత్యక్షరపరిశీలన మొక్కప్పుఁ
గూలంకషముగఁ గోకోక్తకృతిని
గీ. నాయికానాయకుల విభిన్నతలు తెలిసె
హావభావంబులు రసంబు లాకళించె
భరతమునినాట్యశాస్త్రము నెఱిఁగె నంది
కేశ్వరకృతాభినయశాస్త్రహృదయ మరసె. 98.

క. శారీరవిచారంబుల
నారయు యోగాగమమ్ము నాయుర్వేదం
బారతిపతిశాస్త్రముతో
వైరుద్ధ్యము నొందుచోట్ల వరుసఁ బరీక్షన్. 99.

మ. అగునే యిట్టి యలంక్రియాభినయనాట్యంబుల్ 'రసో వై స' య
న్నిగమాంతోక్తిప్రమాణమై వెలయు వర్ణించున్ రసోత్పన్నహృ
ద్యగుణానందము నెల్లతావులను బ్రహ్మానందసబ్రహ్మచా
రిగ, సత్యంబో కో స్తావకంబో యని తర్కించున్ గ్రహించున్ మదిన్

గీ. అటుల క్షోదక్షమముగ నయ్యతి సుమాస్త్ర
శాస్త్రపాథోధి మథియించి సార మధిగ
మించెఁ దల యూఁచె మెచ్చె హసించెఁ బెద్ద
విశ్వసించె జుగుప్సించె నెమ్మనమున. 101.

మ. మఱి యీసంయమిచంద్రుఁ డిట్టియ మదిన్ భావించె నాతన్వి దు
ర్భరవాదోత్సుకతానిమగ్నమతి నప్రష్టవ్యసంప్రశ్నముల్
బురుషున్ న న్నడిగెన్, సభన్ నిలిచి పూవుఁబోణి కే నెట్టు లు
త్తర మిత్తున్ మది మెత్తురే జనులు నిందల్ క్రిందుగోకుండునే

చ. ప్రజ గనుచుండ నిండుసభ భామినితో మదనాగమంబు ని
ర్లజగముగఁ బల్కు టెట్టు లబలామణి యొంటి వసింపఁ గాంచి చె
ప్పఁ జనునె, చేర నౌనె, మగవాఁడఁ గదా; గన నొండుపాయ మం
చజగవపాణిరాణి హృదయాబ్జముఁ జేర్చి భజించు భక్తితో. 103.

క. అంతట దశమదివసమం
దంతేవాసులను బిలిచి యతిపతి యను-ని
శ్చింతముగ సమాధిస్థితిఁ
గొంతతడవు పూన నె చికొటెని మదిలోన్. 104.

చ. అనవరతంబు మీరలు గుహాముఖమందు వసించి యుండి నా
తనువున కేయపాయమును దాఁకని వైఖరిఁ గాచి యుండుఁ డం
చును గుహ సొచ్చి యొక్కెడ విశుద్ధమనంబున దర్భశయ్యపైఁ
దనువును వ్రాల్చి ప్రాణతతిఁ దట్టి సమాహితుఁడయ్యె నొయ్యనన్.

—: ఉభయభారతికిఁ బరాజయభయము :—

ఆ. సభ ముగించి యుభయశారద యానాఁడు
మొదలు భర్తృవిరహమునకుఁ గలఁగి
శారదను భజింప సాగెను నియతోప
వాసదీక్ష గొని దివానిశంబు 106.

ఉ. ఓటమి తప్ప దన్నతలఁ పుల్ల మునఁ ల్ప్రాఁగఁ బ్రాణనాథుభి
తూటన మెట్లు కంటునరయంగల నన్నభయంబు జీవితో

చ్చాటన కుద్యమింప నిజసంస్మృతి వైభవముఁ స్మరింప, క
జ్జోటి పరాభవానలముచొప్పు దలంచి కృశించు నెంతయుఁ.107.

ఉ. పుత్త్రిలఁ గాంచఁ బో, దుఁగపుఁజెలుఁలం బనిఁ బూన్పఁబో, దహో
రాత్రిము ముద్దుసేయుశుక రాజి మృదూక్తుల మెచ్చఁబో, దిహా
ముత్రఫలానురక్తి మనముఁ జొరనీదు, నిజేశునిఁ గలా
మాత్రిముఁ బాయనేర, దల మానిని భావి స్మరించి భీతయై. 108.

క. ఉండునెడ నట కిరుపదో
క్కండవదినమందుఁ జెలిమికత్తె యొక, ర
య్యాండజగమనకడకు ను
ద్దండరయంబునను వచ్చి దడయ కిటు లనెఁ. 109.

—: శబరుం డుభయభారతికిఁ జిలుకను దెచ్చియిచ్చుట :—

గీ. అమ్మ మనవీథిద్వారంబునందు నున్న
వాఁడు శుకయుక్తపంజరపాణి యైన
శబరుఁ డొకరుండు నీదుదర్శనము గోరు
చున్నవాఁడు శుకంబు నీ నున్నవాఁడు. 110.

క. మనకీరవారమునకం
టెను దక్కరంబు కళల నిపుణం బని పే
రొక్కనె శబరుఁ డుబుసుపోకకుఁ
గొనవే నీమదికి శాంతి కుదురును జూవే. 111.

సీ. అనవుడుఁ దోడి తెమ్మనుచు నంగన పల్క
వేవేగఁ జని బోటి వీథి నున్న
శబరు సకీరపంజరసమేతాగ్రహ
స్తుని లోనికిని దోడుకొనుచు వచ్చె

నంత వనేచరుం డాపంజరము గృహా
ధీశ్వరి గన నెట్టయెదుట నునిచి
మృగయార్థ మేఁగుచూ కగపడె నీకీర
మటవిని నొకసర స్తటి ద్రుమంబు

గీ. నీడగన్నులు మూసి మౌనికృమను:న,
నదియరసి యబ్రిపడి మెల్ల నడుగు లిడుచుఁ
జేరిపట్టంగ నామోము తేఁటిచూచి
యేమిధైర్యమొ గాని తానిటుల నలికె. 112.

శా. అన్నా! నేనొకమౌనియాశ్రమమునం దాబాల్య మిన్నాళ్ళుగా
నున్నానెల్లకళల్ గ్రహించి జగమం దున్నట్టిశాస్త్రజ్ఞులన్
గన్నారం గన గోరి వచ్చుచును నీకైజిక్కితిన్ నన్నుఁ జం
పన్నీ కొండొకముద్దుఁ గానె యనుకంపన్ రక్షింపుమా. 113.

ఆ. చదువుకొన్నవారిసన్నిధి నను జేర్పు
మనెదుఁ గొదువవిద్యలను గ్రహింతుఁ
బారితోషికములఁ బడసి బిడ్డలతోడఁ
బెద్దకాల మనుభవింతు సుఖము. 114.

చ. అనుటయు నల్లఁ బంజరమునం దిడి పండ్లు నొసంగఁ గంటితోఁ
గనమికి వింతనొంది నుడికారపుసొంపున కుబ్బి, యీపురం
బున కరుదెంచి యిందు బుధముఖ్యుడు మండనుఁ డుండునంచువిం
చునిటకు దెత్తు నీవతనిజోటికి వంటగదమ్మ నావుడున్.115.

శా. ఔ నేనే యనియాపురంధ్రి ధనధాన్యాన్నాంబరశ్రీల స
మ్మానింపన్ శబరుండు తద్గుణములన్ బల్మారు కొండాడి యెం
తేనిన్ బొంగుచుఁ గానకున్ జనుడు నాధీమత్ప్రయోజాస్య దా
సీనీతం బగుపంజరంబు తిలకించెన్ గేలఁబై కెత్తి తాన్. 116

ఉ. అంతటిదాక మూగయటు లందు వసించుశుకంబు సాధ్వి!న
న్నంతకహాస్త్రముక్తగఁ దయామతిఁ జేసితి నీకుభర్త కున్
సంతతికిన్ బ్రభూతశుభసంపద గల్గుత మంచు బల్కి ద
త్కాంత మనంబునన్ దదుచితజ్ఞతకున్ వెఱగందిచెచ్చెరన్.

గీ. చల్లనైనహిమాంబుల జలకమార్చి
చక్కెర లనంటిపండ్లు రసాలఫలర
సములు దాడిమఫలము బీజముల మేపి
యలసటను దీర్చి పతిమ్రోల కపుఁత తెచ్చె. 118.

ఉ. తెచ్చి తదుక్తియాచితి నుతించి కిరాతు డొసంగువార్త వా
కృచ్ఛి తదీయవిజ్ఞత నెఱుంగ గుతూహల మొందుభర్తకై
మచ్చుగ శాస్త్రవాద మొకమాత్ర మొనర్చి ముదంబు గూర్చిలో
మెచ్చుచు గృహ్యకీరముల మించిన దంచును సంతసించుచున్. 119.

ఆ. భవన కీరపంక్తిఁ బరిపాటిఁ దెప్పించి
వేదమందు శాస్త్రవాదమందుఁ
బోటిపెట్టి పెద్దప్రొద్దు వాదించి జ
యించునాశుకంబు నెఱుక కలరు.

సీ. అష్టవిధంబైనయవధానముల వేద
ములు తలక్రిందుఁగాఁ బలుకనేర్చు
పూర్వపక్షముల నొప్పుగ దాననువదించి
నిర్నిబంధముగ ఖండించునేర్చు
వాచావిరోధ శాఖాచంక్రమములందు
నిగ్రహస్థాన మొందించునేర్చు
తతవాఙ్ముఖము లుపోద్ఘాతోపసంహార
గుంఫితమ్ములుగ వాక్రుచ్చునేర్చు.

గీ. మెఱయఁ దద్గృహశుకముల వరుస గెలిచె
నవ్వినూతనశుకము 'శుకావతార
మిది' యనుచు మండనుండు సమ్మదితుఁ డగుచు
మెచ్చి చూడఁగ నిల్లాలు మేలనంగ. 121.

క. తపముల నుపవాసంబుల
నపగతబల యయినయబల కది కాలక్షే
పపదం బగునని బుధుఁడా
సపడియెఁ జిరకాలమైత్త్రీసంబంధమునన్. 122

ఉభయభారతికిని జిలుకకును జరిగిన కామశాస్త్రసంవాదము.

వ. అంత నయ్యింతి యాశకుంతకులావతంసంబు నంతిపురికిఁ దోడ్కొని
పోయి తగిన యాహారంబు లిడుచు నాయాశాస్త్రంబుల వాదము
లొనర్చుచు నెలవోక నమ్మఱునాఁడు ప్రసంగవశంబున శంకరా
ర్యునకుం దనకు నడిచినవాదోపవాదంబులఁ జెప్పునంత నక్కీరంబు
ఱెక్కల టెక్కించి యిక్కువదండంబున ముక్కు నిటునటుఁ జక్కఁ
జేసికొని యొయ్యారంబుమీఱ నతివా! శంకరు నిరుత్తరుఁగావించిన
నీప్రశ్నమునకే నుత్తరం బిత్తునె యన నమ్మదిత సమ్మదితయై యేది
చూత మనుటయు. 123.

గీ. ఇంచువిలుకానికళ లెన్ని యెట్టి వవ్వి?
వానినెల వెంచ నెది? శుక్లబహుళపక్ష
ములను నెట్లు ప్రవర్తిల్లు? బాలఁతులందు
నెటుల తోఁచును? బురుషులం దెటుల తోఁచు? 124.

వ. అని కదా భవదీయప్రశ్నంబు

గీ. అంగభవునికళల్ పదునైదు సువ్వె
సతులయంగుష్ఠ పద గుల్ఫ జాను జఘన

నా భ్యురః కక్ష కంఠ గండ రదన వద
నాక్షి ఫాల శిరమ్ముల నవ్వి యుండు. 125.

ఆ. అవి యణీయ మైన యూకృతి రోమకూ
పాష్టమాంశమందు నధివసించు
నతివ! పద్మినీప్రభృతిజాతిసతులకు
నింక వానిగతుల నేర్పఱింతు. 126.

చ. క్రమగతి నెక్కు డిగ్గు రతిరాట్కళ లింతికిఁ గృష్ణశుక్లప
క్షములఁ బ్రతీకపంక్తి బసిఁ జానరొ! యూర్ధ్వదర్శనాదిప
క్షము సుమి శుక్లపక్ష మనఁగాఁ; బెరపక్షము సూవె కృష్ణప
క్ష మనఁగఁ జెల్లు దీనిని రసజ్ఞు లెఱింగి సుఖింతురు చాతురిఁ. 127.

వ. ఇయ్యది సామాన్యంబు, విశేషంబు వివరించెద నవధరింపుము. 128.

సీ. పద్మిని కెడమ క్రేవను నెక్కు సితపక్ష
మున; డిగ్గు బరపక్షమునఁ గుడిగతి
సితపక్షమెక్కు దక్షిణగతి హస్తిని,
కపరపక్షమున సవ్యముగ డిగ్గుఁ
గృష్ణపక్షమున దక్షిణగతి నెక్కుచి
త్రిణి కాద్యపక్షమ్ము దిగు నెడమగ
శంఖిని కసితపక్ష మ్మెక్కు నొక క్రేవ
వల క్రేవ డిగు శుక్లపక్షమందు

గీ. పక్షభేదముచే నిట్లు పథము మాఱి
మెలఁగు నాల్గుజాతు లింతులకు వరుస
మదనకళ కాలి బొటవ్రేలు మొదలు మస్త
కావధిగఁ దోఁచుఁ బదియునై దవయవముల. 129.

గీ. సరవి హస్తినీ, చిత్రిణీ, శంఖినులకుఁ
బద్మినికి, నవయవపరిపాటి దినది
నమ్మగాఁ గామకళ యౌవనమునఁ బ్రబలి
వార్ధకంబునఁ గ్రమశ్లథత్వంబు వడయు. 130.

వ. ఇయ్యది వాత్స్యాయనునిమతము. ఇఁకఁ గొక్కోకునిమతం బన్ననో యువతులకు ననంగకళ శుక్లపక్షప్రతిపదాది నంగుష్ఠప్రభృత్యవయవముల వామపార్శ్వంబుగా నెక్కి కృష్ణపక్షంబున వలపటినైపు నుండి డిగ్గువిధమునఁ బురుషునకును గృష్ణపక్షప్రతిపదాదిదక్షిణపార్శ్వముగా నెక్కి శుక్లపక్షమున వామపార్శ్వముగా డిగ్గుననియు, శుక్లకృష్ణపక్షవిభాగ మార్తవదర్శనాపేక్షితంబేని బురుషునెడ వ్యభిచరితం బగుటఁ జేసి చాంద్రమానమాసప్రథమద్వితీయపక్షము లని గ్రహించినటు తోఁచు. స్త్రీపురుషులిరువురయందుం గర్తృతాసామ్యమున్నను బురుషకళావివేచనము వాత్స్యాయనుం డేల డిగ్గవిడిచెనో కొక్కోకుండు గ్రహింపఁజాలఁ డయ్యె నది యటుండనిమ్ము. అట్లు కళామర్మవిదులై తాడనపేషణదంతనఖక్షతచుంబనచూషణవషట్కృతాదు లగు దశసంస్కారములును; చేటితకుట్టితక్లితనామితఘట్టితాఖ్యలం బరఁగు పంచతంత్రములును, జతురశీతిబంధమ్ములను దెలిసి ప్రయోగనిపుణు లగురసికులకు నీయడిగినయర్థంబు కరతలామలకం బనుటయు, నక్కాంతారత్నము తదీయవైదగ్ధి కబ్బపడుచుఁ గొక్కోకవాత్స్యాయనుల మతభేదము నుద్దేశించి యిట్లను. 131.

కొక్కోక వాత్స్యాయనుల మతభేదముపై నడచిన వాదము.

మ. చిలుకా! నీమతి మెచ్చఁగాఁ దగు, సమీచీనంబు లౌ నీదుప
ల్కులు; కానీ తుదిఁ దక్కశాపిధమునన్ గొక్కోకవాత్స్యాయన

ర్షులకుఁ బల్కులు భిన్నవాక్యానుపూర్వ్యల్ సెప్ప నర్థాన న
న్యులతాత్పర్యము యూటఁ జెప్పఁదగు నట్లో యేకవాక్యత్వముల్.

ఆ. అఖిలశాస్త్రములసమన్వయపద్ధతి
యిదియ పూర్వాపూర్వఋషిమతంబు
లుత్తరోత్తరిష్టసత్తమాభిప్రేత
మగుటఁ దదనువాద మగుట గాదె. 133.

వ. కావున వాత్స్యాయనమతం బరయ నందు రంజనీయయు నధికర
ణంబు నగు స్త్రీకళాస్థానంబులు కర్త యగుపురుషునకుఁ బ్రథమ
జ్ఞేయంబు లగుట వివరింపబడె. దానం బురుషకళాస్థానంబులుం
గమ్యమానంబు లగుట లేదె? తదంశముం గొని కొక్కోకుండు
ప్రస్ఫుటీకరించె నని యేకవాక్యత వచియింప సమంజస మనుటయు
నాశుకతిలకం బిటు పలుకు. 134.

ఉ. పంచశరాగమాధ్యయనపద్ధతి నెట్టులొ యట్టులే ప్రయో
గించుటయందుఁ గూడఁ బతికిన్ సతికిన్ సమకర్తృభావ మూ
హించి వచించె నా ఋషికులేంద్రుఁడు 'కారకభేద మున్నటుల్
గాంచఁగ నౌ నటన్న 'మతికల్పిత' మంచు నిరాకరించుచున్. 135.

వ. సతీపతుల కధికరణకర్తృభావ మసంగతంబగుట గర్తృత్వసామాన్య
ముచితం బనుటయు నయ్యింతి యిట్లను. 136.

గీ. మారనిగమాధ్యయనమాత్రఁ బూరుషుండు
నింతియును గర్తృతను వహియింతు రిగాక
యధికరణ మింతి, కర్త నాయకుఁడు నరణి
దండములవైఖరిఁ బ్రయోగదశను గారొ? 137.

క. అన విని కిలకిల నవ్వుచు
ననియె శుకము మదననిగమ మాద్యంత మెఱిం

గినదానవె సుచరిత్రా
జనతిలకమ! యిటుల పలుకఁ జనునే నీకున్. 138.

ఆ. మేషయుగళకృతసమీకమందుఁ గపిత్థ
యుగళభేదమున నొగిని మల్ల
యుద్ధమందుఁ గర్త లుభయమ్ము లైనట్టు
లాలుమగలు కర్త లగుదు రతివ. 139.

వ. కావుననే "తే నోభయో స్సదృశీ సుఖప్రతిపత్తి" యని యుభయు
లకు సుఖసామ్యము సిద్ధాంతీకరింపఁబడె ననుటయు నాకొత్తడితల
మానికంబు తలయూఁచి కామతంత్రమునఁ బురుషుండు స్వతం
త్రుఁడా యస్వతంత్రుఁడా యని యడుగ నాకీర మిట్లనె 140.

గీ. కర్మబద్ధుండు పురుషుఁడా కామతంత్ర
మందె కాదు ధర్మార్థమ్ము లందు నైన
నస్వతంత్రుండె కర్మఫలానుషంగ
ముక్తుఁ డౌదాక స్వాతంత్ర్యమును గనండు. 141.

క. అనుటయు కొండొకతడ వం
గన యుత్తర మీయఁ గానఁగా లేక నభం
బును గాంచి చూపు మరలిచి
యనియె జిలుకతోఁడ నూతనాంశము గొనుచున్. 142.

శా. కొన్నొక్కర్షమాత్ర బు నా క్రియఁ దృణాంకూరంబు చందంబునన్
స్వీకారింతువు పారదారికమునన్ వాత్స్యాయనుం డేవియో
వక్కాణించె నవెల్ల ధర్మ్యములె? లేవా వైశికంబం దన
య్యుక్తాన్యాచరణోపదేశములు సిద్ధాంతాంగనాద్రోహముల్.

సీ. అన శుకం బిట్లు వల్కెను సాధ్వి కోర్కెఁ
డటుల వాత్స్యాయనుం డాడెఁ డెపుడు
సాధ్య కాని పడంతి సాధించుటయు సాధ్య
మైనచెలి నలర్చు, టాత్మరక్ష
రతిఁ గరంచుట" స్మరశాస్త్రముప్రయోజన
మనినఁ గోర్కె కు నే మనఁగఁ గలదు
ధర్మార్థకామత్రితయము పరస్పరా
నుపహతముగఁ బొంద నొప్పు ననుచు
గీ నందు నేకైకసేవ యనర్థ మనుచు
నైహికాముష్మికసుఖాప్తి కనువు గాఁగఁ
బలుకు వాత్స్యాయనుం డొకపాటివాఁడె
యగునె నరులకుఁ దద్బోదయుంబు నెఱుఁగ. 144.

మ. పరదారాభిగమంబు సేయువిటు లుత్పాదించుమహాధురం
ధరమార్గమ్ముల నెల్లఁ జెప్పి "పరకాంతాలోల్య మాయుర్యశో
హరణం" బంచును బారదారికరహస్యజ్ఞాత గాఁడేని నే
ర్పరి గాఁ డాత్మకళత్రరక్షు నరుఁ డెవ్వాఁడేని యంచాడఁడే. 145.

క. తనదారల నితరుఁడు వం
చన నిటు లొనరించి కైవసము చేసికొనున్
గనుచుండ ననుచు గృహులకుఁ
ముని సేయుప్రబోధ మెంతముఖ్యమొ తలఁపన్.

ఉ. వైశికమందు వేశ్య విటవర్గము నొంచి తదీయవైభవం
బాశుగతిన్ హరించుట కుపాయములన్ బ్రవచించు టెన్న ని
ర్వేశరసాభిలాషమున వేశ్యను జేరినవారు దుస్సహ
క్లేశము గాంతు రంచు నెఱిఁగించి జగద్ధిత మూన్పఁగాదొకో. 147.

గీ. అంతిపురికాంతలను గవయఁగ నుపాయ
ములను దెలుపక మున్న తాఁ బలుకలేదె
రాజదార లగమ్య లౌరా మలందు
ముఖ్య లని తల్లితో సామ్యమును ఘటించి. 148.

క. ఈరెండుపరికరణంబుల
వైరుధ్యము స్పష్టపఱచు వాత్స్యాయను చే
తో రీతి నది సదసదా
చారంబులఁ గలిపి చేయుచాలన యనుచున్. 149.

వ. మఱియు గ్రంథాంతమ్మునఁ గామశాస్త్రతత్త్వజ్ఞుఁడు ధర్మార్థకామ
ములను బ్రత్యయమ్మును లోకస్థితి నెఱింగి వర్తించునే కాని రాగ
మ్మున వర్తింపఁడనియు, నవ్వాఁడు త్రివర్గపాలకుఁడై లోకవర్తిని
యగుస్వస్థితిని బోధించుకొనుచు జితేంద్రియుం డగుననియు దెలిపి
తాను బ్రహ్మచర్యమ్మున సమాహితచిత్తుఁడై లోకయాత్రార్థ మీ
శాస్త్రరచనకుఁ బూనుకొంటేఁగాని రాగవశమ్మునఁ గాదని పలికిన
పలుకులవలన నమ్మునిహృదయంబు స్పష్టంబు కాదే. కావున మో
పాధికారలిప్తులై త్రివర్గోపాసనాశీలు రగుశ్రోత్రియులకు నంత
ర్యాణుఁకు నయ్యార్షగ్రంథ మొక్కటియే ప్రమాణం బనుటయు
న వ్వారవర్ణినీలామ నివ్వెఱపడియు యథాపూర్వముఁగ నిట్లను.

క. ఈశాఖాచంక్రమ మే
లా శుకమా! పురుషునెడ సుమాస్త్రికలపై
నాశంకించెదునా కే
నో శాస్త్రము లంచుఁ బల్కెదో దుష్ప్రసక్తిన్. 151.

గీ. కర్త లేక కద సంప్రయోగమున రతియుఁ
బఱియు నీమతమందు నో పతగరాజ!

తరుణికిం గల్గు స్మరకళల్ పురుషునకును
గలవొ లేవొ వచింప కీపలుకు లేల? 152.

చ. అన విని కీర మిట్లను లతాంగి యనంగకళల్ నృదేహ మె
ల్లను గబళించి రాగముబలంబునఁ బ్రస్ఫుట మౌట వానినిన్
బనివడఁ జెప్ప వ్యర్థ మని పల్కురు, పూర్వులు స్త్రీకళాభిరం
జనపరమావధుల్ మదనశాస్త్రవిధుల్ సకలంబు మానినీ! 153.

మ. అటు పుంస్కాండగతాంగజన్మకళ వ్యాఖ్యన్ జేయనే కాదె చె
ప్పుట గల్గెన్ గళరూపుఁ దద్గమనతన్మఖ్యస్థలంబుల్ తదు
త్కటతా కాలముఁ దన్నిరూపకమతద్వంద్వాంతరం, బందు న
క్కటపాత్రిబల్యనిరూపణం, బిదియ శాఖాచంక్రమం బయ్యెనే 154.

వ. మన్మథకళాస్థానతదారోహణావరోహణాది భేదంబుల మతద్వయంబు
నే నుపన్యసింపఁ గొక్కోకవాత్స్యాయనుల ప్రామాణ్యాప్రామా
ణ్యంబుల కీవ తివిచి శాఖాచంక్రమదోషంబు నాయం దారోపింప
వాదధర్మంబె. 145.

క. అన నుభయభారతీసతి
యను-శాఖాచంక్రమమున కగపడి తనుచున్
గనుఁబ్రామఁ జూచె దవె న
న్ననుటయు శుక మిట్టు లను రుషాకులితమతిన్. 156.

చిలుక తగవు దీర్ప మండనుఁ గోరుట.

ఉ. ఇద్దఱివాదమున్ విని సమిద్ధమతిన్ గుణదోషముల్ గనన్
ముద్దియ చెప్ప నీపతి ప్రభుండు సుమీ యన నమ్మృగాక్షి తా

నుద్దవిడిన్ నిజాధిభువునొద్దకు నేఁగి సమస్తవృత్తమున్
దద్ద వచించి తెచ్చెను ఠీవంబున వాదజయాభిలాషచే. 157.

క. తెచ్చి యుచితాసనమునన్
మచ్చికఁ గూర్చుండఁబెట్టి మహిళామణి వా
క్రుచ్చెను దనకుం జిలుకకు
వచ్చినవాదోపవాదవైఖరి మరలన్. 158.

ఉ. అంతట నాబుధేంద్రుఁడు జయాపజయంబుల నిర్ణయింప లే
కెంతయు గీరశక్తి నుతియించుచుఁ గామకళారహస్యసి
ద్ధాంతము లభ్యసింప గడు వందిచనెన్ గద శంకరార్యుఁ డ
ద్దాంతుఁ డొకండ తీర్పుటకు దక్షుఁ డతం డెట నున్నవాఁడొకో.

చిలుక చెప్పినప్రకార ముభయభారతియు భర్తయు శంకరునిసన్నిధి కేగుట.

చ. అనుకొనుచుండ నిట్టు లను నాశుక మోబుధచంద్ర! శంకరుం
డు నతనిశిష్యు లుందురు గడుంగడుద వ్వగుకాన నొక్కకొం
డ నిచటి కేగుదెంచుతరుణంబున నయ్యటవిన్ మహీజశా
ఖను వసియించి నేను గనుగంటను గంటిని వింటిఁ జిత్రమున్. 160.

శా. కందోలమ్ములఁ గందమూలఫలముల్ గైకొంచు మధ్యాహ్నమా
ర్తాండద్యోతవిభీతులై యతులు మద్వాసద్రుమచ్ఛాయఁ గూ
ర్చుండన్ వచ్చి, ప్రసంగమున్ సలుపుకొం చుండంగ నాశంకరా
ర్యుం డాకొండగుహన్ సమాధిగతుఁడై యున్నట్టు లాలించితిన్.

గీ. ఆయనఘచరితుఁ డెపుడు బాహ్యప్రపంచ
సంగతుం డౌనొ కాని చూడంగవచ్చుఁ
బంచషాహప్రమాణసంప్రాప్య మగుచుఁ
గ్రాలుఁ దద్వాసగుహ యుత్తరముగ నిటుస. 132,

ఆ. అనుచు శుకము పలుక నాద్విజుం డాలును
సపరివార మటకుఁ జనఁగ నెంచి
కొర వివదమాను లన్ననిద్రిలు గొండ్రి
గెలుపొ యోఁడొ యాలకించుదాఁక. 163.

వ. బిడ్డలను గొంతపరివారంబును గృహంబున డిగ్గవిడిచి యమ్మఖునాఁ
టికేఁబోక 164.

సీ. అర్హాభృత్యానీతయాప్యయానము నెక్కి
యాత్మశశత్రిమ్ము నరుగఁ బనిచి
శాస్త్రపుస్తకములు ఛాత్రులు గొని పొండు
శంబళిరథము లెక్కింగఁ బలికి
యన్నదానార్థపదార్థముల్ వైయాఘ్రి
శకటాళిఁ దేర నాజ్ఞప్తి సేసి
పటగృహాపంక్తిఁ గాంబళశకటంబులఁ
బదిలంబుగాఁ దేరఁ బనుపు వెట్టి

గీ. యగ్నిహోత్రమ్ములను దేవతార్చనాప
దార్థమ్ములఁ గొంచు మత్తవృషాంచితశక
టాంతరమ్ము నధిష్ఠించి యపుడు వెడలె
మండనుఁడు శంకరుం డుదుకొండగుహకు. 165.

సీ. పర్యంక శయన దర్పణ దంతకంకతి
కా తాలవృంతాదికముల గములు
కార్పాస వాల్క రాంకవ కౌశేయ ర
ల్లక నిచోలాదిచేలవ్రజంబు
కలశ కందు గళన్తికా శరావ ఋజీష
దర్వ్యాది పచనపాత్రముల గములు
తైలాజ్య గుడ మధు దధి శర్కరాదులు
శాలితండుల సూపసంచయంబు

గీ. గొనుచు దాసదాసీజనం బనువుమీఱ
శకటముల నెక్కి తొలుదొల్తఁ జనుచు విడియ
వలనుపడుచోట్ల నిలిచి లోపములు లేని
యట్లు లమరింప నతనిపఁ్రియాణ మొప్పె. 166.

క. ఆసన భోజన విద్యా
వ్యాసంగంబులను స్వగృహమందటు లట నా
భూసురుఁ డొందుచు నగ్ని ను
పాసించును వళమె వానిభాగ్యము పొగడన్. 167.

ఉ. శంకరుఁ డేమి తీర్చునొ విశంకటయుక్తుల నీశుకంబు న
న్నంకిలి వెట్టనే యని నిరంతర మాంతరచింతతో శుకా
లంకృతపంజరమ్ము కరలగ్న మొనర్చి తపించుచుండు న
ప్పంకజపత్రనేత్రి పతి పజ్ఞను బాయక తొల్త నేఁగుచున్. 168.

గీ. స్వయముగాఁ గీరమునకు నాచార్యబుద్ధి
నాసతీమాళి మొక్కి నీరార్చు భక్తి
ఫలరసముతోడఁ దేనెఁ దావంగఁబెట్టు
దాడిమీబీజములఁ దన్ను దారిఁ జనుచు. 169.

చ. యమిపతిఁ గాంచువేడుక ద్విజాగ్రణి తాను గుటుంబినీసమే
తముగ శుకోపదిష్ట మగుదారిని భృత్యులు గొల్వ నేఁగి స
ప్తమదిన మొక్కశైలమునుపత్యకఁ జేరి యతీంద్రశిష్యు ల
గ్రమునను దృష్టిగోచరముగాఁగ మనంబున హర్ష మొందుచున్.

సీ. సపరివారమ్ముగా జాయసమేతుఁడై
శైలాగ్రమును చేరి శంకరార్యు
శిష్యులఁ గని గురుశేఖరుఁ జూపరే
యని వేడ వార లి ట్లనిరి ధీర!

యీగుహాంతరమునం దేకాంతయోగస
మాధి నున్నారు సుమ్మీ ప్రబోధ
మొనరింప నాజ్ఞ యీయను లేద నేఁటితో
గడువు పూర్ణం బగునుడి మఱచెన

గీ. యనుచు మాలోన మే మీయయహార్యుక్ష్యాదిఁ
గలఁత నొందుచునున్నాము నిలువుఁడయ్య
యని త దభ్యాగతులకు నర్ఘ్యంబు బాద్య
మిచ్చి పూజించి యలరించి రింపుమీఱ 171.

ఉ. అందఱు నద్గుహాంతిక మహావటభూజము పెద్దనీడ నం
దందు వసించి దప్పియుపమంత దొఱఁగుచు నుండునంతలో
సుందరసూక్తులన్ బొగడఁ జొచ్చె నృసింహుని మాకరందని
ష్యందము లందుఁ జిందునటు లాశుక మాశుకవిత్వవిత్తమై. 172.

శుక మొనర్చిన నరసింహస్తవము.

ఉ. శ్రీనిలయాబ్ధిమందిర! సరీసృపరాజ ఫణామణీఘృణీ
స్నానపవిత్రగాత్ర! మునిసంచయనాథ! ధురీవాత్మ! చక్రపా
ణీ! నతలోకరక్షక! యహీనభవాంబుధినావ! దేవ! ల
క్ష్మీనరసింహ! నా కొసఁగుమీ భవదీయకరావలంబనమ్మున్. 173.

ఉ. మానితపద్మగర్భశతమన్యుపినాకికిరీటకోటిసం
ధానవిరాజమానవలిసప్రతిమానపదాబ్జకాంతి కాం
తా! నిరవద్య! కంజభవనాకుచవారిజరాజహంస! ల
క్ష్మీనరసింహ! నా కొసఁగుమీ భవదీయకరావలంబనమ్మున్. 174.

ఉ. సూనశరోగ్రఘోరగజసూదనబాధఁ గలంగి మత్సరా
హీనని వాఘపీడఁ గృశియించుచు సంసరణాఖ్య మామహా

కానసమందుఁ జిక్కి కడఁగానక చింతిలుదుర్ మురారి! ల
క్ష్మీనరసింహ! నా కొసఁగుమీ భవదీయకరావలంబముర్. 175.

ఉ. దీనత మున్గిపోయితి నిదే యతిఘోర మగాధమూల మ
న్యూనతరవ్యథాశతమహోరగసంకుల మాచుఁ దోఁచు నీ
హీనభవాంధువందు, నెటు లీకృపణుర్ దయ నుద్ధరింతు ల
క్ష్మీనరసింహ! 176.

ఉ. పూని భవాబ్ధిలోపలను బొల్చెడుభీకర కాలనక్రము
గ్రినరోకముర్ దెలిచి యక్కట! దేహము నిక్కఁబట్టి యిం
పూని గ్రహింప రాగరసనోర్మిహతిర్ మతి దప్పియుంటి ల
క్ష్మీనరసింహ! 177.

ఉ. కానఁగఁ బాపబీజ మురుకర్మలతాశత మింద్రియచ్ఛద
వ్యానత మంగజప్రసవ మార్తిఫలం బగు సంసృతిద్రుమం
బూని యధోముఖాప్తిఁ బడుచుంటి-నటంచు నతాస్యమై శుకం
బానిమిషంబ క్రిందఁబడె నక్కట పంజరమంద జాఱుచుర్. 178.

గీ. అర్ధపద్యంబుఁ జదివి యుధోవనతవ
దనముతోఁ బంజరస్థితాధారయష్టిఁ
బాసి యడుగునఁ బడి యుండెఁ బక్షి, యుభయ
భారతియుఁ జూపఱును విన్నపాటు నొంద. 179.

ఉ. ఆనగగహ్వరాంతరమునందుననుండి వినంగవచ్చె సు
స్వాన మొకండు దాని విన సద్దొనరింపక యెల్ల రుండఁగా
మానితకీరసూక్తికడమర్ గొని-కావవె దేవదేవ! ల
క్ష్మీనరసింహ! నా కొసఁగుమీ భవదీయక[...]వల[...]బముర్. 180.

క. అని పఠియించుచు శంకర
మునిచంద్రుఁడు రాహువదనమును బాసినయిం

దునివోలె గహ్వరాంతర
వినిర్గతుండై వెలింగె వికసన్ముఖుండై. 181.

క. అటు దోఁచి నిటలతటసం
ఘటితాంజలి యగుచుఁ గన్నుఁగవ మోడిచి యి
ట్టటు గనక నృసింహస్తవ
మిటు పూరింపం దొడంగె హృద్యరచనచే. 182.

ఉ. ఆనఁగ రానిసంసృతిమహాహిరదోగ్రవిషంబు సోఁకి బో
గ్గైనశరీర మూని, ప్రళయానలమధ్యపతత్తృణాకృతిన్
హానికి లోఁగి యుంటి భుజగాంతకవాహా! సుధాబ్ధిగేహా! ల
క్ష్మీనరసింహా! 183.

ఉ. మానవిహారసంసృతిసమాఖ్యదవాగ్నికరాళకీలసం
తానము చుట్టు ముట్టికొన దగ్ధతనూరుహరాజినై త్వదీ
యానఘపాదపంకజజలాశయ మాశ్రయ మొంద నెంతు ల
క్ష్మీనరసింహా! 184.

ఉ. హీనభవాఖ్యజాలముల నిట్టి తగుల్కొని యింద్రియార్థసం
తానము లన్నగాలములఁ దక్కఁగ మ్రింగి విశీర్ణతాలుమ
స్తానన మైనమీన మయి యత్యధికార్తి నశింప నుంటి ల
క్ష్మీనరసింహా! 185.

ఉ. మానకఘోరసంసరణమత్తకరీంద్రము మర్మపంక్తి ఖం
డానిహతిన్ నలంప నలిన జ్జయి మేను చలింపఁ బ్రాణముల్
స్థానము వాసి పోవునను త్రాసము గాంతు జగన్నివాస! ల
క్ష్మీనరసింహా! 186.

ఉ. జా నగుమద్వివేకధనసంపద దుర్దము లైనయింద్రియ
స్తేనచయంబు దొంగిలి త్యజింపక మోహమహాంధకూపగ
ర్భానఁ బడంగఁ ద్రోచిరి దురంతమదంథత గుర్తెఱింగి ల
క్ష్మీనరసింహా! 187.

ఉ. శ్రీనలినేక్షణాధిప! కుశేశయనాభ! జనార్దనా! సురే
శాన! సితాబ్జనేత్ర! మధుశాసన! కేశవ! శౌరి! కృష్ణ! వి
ష్ణూ! నిఖిలాసురాంతక! యశోనిధి! దీనుఁడ నం చెఱింగి ల
క్ష్మీనరసింహా! 188.

మ. అని యీరీతి మనోజ్ఞ మై తంబగు నృసింహస్తోత్రముఁ గాంగపూ
రనిరాఘాటవచఃప్రణీతిఁ బరిపూర్ణం బాచరించెన్ మనో
వనజంబుల్ నరసింహపాదయుగళీభక్తిప్రపూర్ణంబులై
వినువా రందఱు తాండవింప యతిభూభృన్మౌళి హేలాగతిన్.

గీ. పద్మపాదాదు లగుశిష్యపటలి సంభ్ర
మమున సాష్టాంగముగ వందనము లొనర్చి
పాద్య మర్ఘ్యంబు నొసఁగ నాశ్వాస మొంది
మ్రొక్కు మండనుఁ దజ్జాయఁ జక్కఁ జూచి. 190.

గురు డుదలిసకలకరుఁడు మండను సభయభారతిని సంభావించుట.

క. ఓపుణ్యాదంపతులు మీ
రీపట్టున కేఁగుదెంతు రేటికిఁ బరివా
రోపేతమ్ముగ క్రమమున
గోప్పి యహో! నేఁడు రానొకో గడు వగుటన్. 191.

క. అని యందఱుఁ గలయంగాఁ
గనుఁగొని కూర్చుండఁ బనిచి క్రమముగఁ గుశలం

బును బృచ్ఛచేసి దర్భా
సనమున నాసీనుఁ డయ్యె శంకరుఁ డంతన్. 192.

క. యోగక్షేమము లరసెడు
యోగీంద్రునిచరణకమలయుగళి నిటలసం
యోగము గన నుండనుఁ డను
యోగమ్మున నొనర్చెఁ బ్రీతియోగము మెఱయన్. 193

శా. దేవా! నీమహిమంబు మాదృశభవాబ్ధిక్రోడనిర్మగ్నదు
ర్భావుల్ జీవు లెఱుంగు టెట్లు? లిది స్వప్నంబొ మహామాయయో
భావింపఁగ మహేంద్రజాలమొ మహీభాగంబు రూపాంతర
వ్యావృత్తిన్ గనెనో వచించుటకు సాధ్యంబేని వాక్రువ్వవే! 194

ఉ. యోగమహత్త్వఁ గీరతను వొయ్యనఁ బ్రాణములోన చొచ్చి శా
మాగమవాదమందుఁ దృణమట్లుల మత్సతి నోర్చి తత్త్వమా
యోగము బంధ మంచు నది యూడ్చ నృసింహు నుతించి పూర్వదే
హాగతిఁ గన్న నిన్నని కృతార్థుఁడ నైతి మహాత్మ! నేఁ డిటన్. 195

శంకరుఁడు గెలుపొందినటు లుభయభారతి యంగీకరించుట.

మ. అనుకేశన్ క్షితి సోఁక నెన్నొసలు సాష్టాంగంబుగా మ్రొక్కి త
ద్వనితోత్తంసము నాయవజ్ఞ క్షమియింపం జూడు గౌరీశపా
వనరూపాంతర! జ్ఞానరత్నఖని! సర్వజ్ఞుండ వీ వన్న మా
టను భావింపక లేనిపోనికడగండ్లన్ బెట్టితిన్ మూర్ఖనై. 196.

ఉ. ఉల్లమునందు నీవు గెలుపొందు టెఱింగియుఁ గూడ వల్లభా
యల్లకదుఃఖభీత నయి యడ్డము సొచ్చి స్మరాగమంబునన్
గాల్లకు బందమున్ వయితుఁ గాని య వెల్లఁ దృణీకరించి నా
వల్లభు డించి పోవ వనువార్త స్మరింపను మందబుద్ధినై. 197.

క. ఆశైశవసన్న్యాసిక
దా శంబరవైరినిగమతత్త్వవిమూఢుం
డా శోధింతము ధాన;ని
రాశుం డగు; గెలిచినేని యవక్త్రి యయున్. 198.

ఆ. అనఘునల్పబుద్ధి నంది నీసర్వజ్ఞ
తామహత్త్వ మకట! తలఁప నేర
కిట్టిక్లేశమునకు నెర సేసి నామూర్ఖ్య
మెల్ల వెల్లడింతు హీనగతిని. 199.

ఉ. కాపటికత్వ మెల్ల వెలి గ్రక్కక తజ్జనితాఘు మెట్టువో
నోపును దేవ!పంచముసభ నుగ్మలితో సుమసాయకాగమా
లాపము లెత్తి సన్న్యసనలక్షణముల్ దిగఁద్రావి పల్కఁగా
నోపక యోడఁ దా ననుదురూహఁ బ్రవర్తిలితిన్ క్షమింపుమా.

శా. నీయౌదార్యము సన్నుతింపఁ దరమా నే? నీయతిత్వంబున
ట్లే యస్మత్ప్రతిదేవతానియతిఁ బాలింపన్ దలం పూని శా
దా యీకీరము మేను సొచ్చి స్మరశాస్త్రార్థప్రసంగక్రియా
మేయాభిజ్ఞతఁ జాటి నన్ గెలుతు స్వామీ! ధర్మరక్షార్థివై. 201.

క. స్వచ్ఛ మగుధర్మఫక్కి న
సచ్ఛస్మరకళకు సమితి మదికిననీసం
పిచ్ఛక్తి కసాధ్యంబు జ
గచ్ఛంకర! శంకరా! జగంబుల నున్నే? 202.

క. తల మొత్తి నీముఖం బెటు
తిలకింతున్ జిలుక యనుమతిన్ రతిపతిమి
న్కల నిగ్గుమాలి నీతోఁ
బలికినదార్ఢ్యమ్ము జ్ఞప్తివచ్చెవ దేవా! 203.

గీ. ఘనము పద్యార్థమును బఠించుచును కూలి
పాలిణము దొఱఁగ గుహనుండి పయిపగంబు
చదువు చేతెంచునినుఁ గాంచునమయ మాది
నొడలు చచ్చినయ ట్లుయి యున్నదాన. 204.

గీ. సర్వవిద్యల కీవ యీశానుఁడవును
సర్వభూతమ్ములకును నీశ్వరుఁడ వీవ
బ్రహ్మకధిపతి వోపరబ్రహ్మమూర్తి
తలఁప నీవ ప్రత్యక్షసదాశివుఁడవ. 205.

చ. మదనమదాపహర్త! సుమమార్గణశాస్త్రవివాదపద్ధతిన్
సదమున న న్నెటుల్ గెలువఁజాలక నివ్వెఱ నొంది తత్కళన్
బడఁపడి నేర్వఁగా గడువు న న్నటు కోరి శ్రమంబు నొందుటల్
మది నరయంగ నీకు నవి మర్త్యచరిత్రవిడంబనల్ గదా. 206.

క. ఇరువురమే మటు నీచేఁ
బరాజయము గనుటకును ద్రిపన్ గాంచము, భా
స్కరుచే నిశాకరాదులు
పరిభవ మొందుట యకీర్తివహ మగునొకో. 207

సీ. బాల్యంబునన్ యోగి పల్కినపల్కు ప్ర
త్యక్షమ్ముగా నయ్యె నక్షరాల
నీవు సాక్షాచ్ఛంకరావతారం బౌట
మాజన్మములు బుధమాన్య మయ్యె
నాప్రాణనాథుఁ డెంతటివాఁ డగుంగాక
యయ్యె శిష్యుండు నీ కనఘు యిపుడు
పతివిప్రయుక్తనై బ్రతుకు భారముగ న
ట్లుండు నీలోకమం దొంటిపాటు

గీ. పతికి నాకు దాంపత్యసంబంధసాక్షి
యైనగృహపతి వహ్ని త్రేతాగ్నిరూప
యజ్ఞపురుషుండు నను సించి యకట భర్త
యాత్మలో లీన మాచుండ నరయఁగలనె? 208.

శంకరుఁ డుభయభారతి పాండిత్యము నుతించుట.

మ. అని దుఃఖంబు సుఖంబు గావియొకచిత్తావస్థలో మున్గి యుం
గన యుండన్ యతిశేఖరుండును నమస్కారంబు గావించి నా
జననీ! ని న్నొకమర్త్యభామ యన దోషం; బీధరిత్రిన్ బవి
త్రి నోనర్పన్ జనుదెంచు వాణి వని తథ్యం బేను వాక్రుచ్చెదన్.

మ. భవదీయాచరమాఖిలాగమకళాపాండిత్య, వాగ్వ్యక్తిపా
టవ,గార్హస్థ్యవిధావనైకదృఢనిష్ఠా,నాథపాదారవిం
దవిలీనాంతరవృత్తివర్తనము లత్యాశ్చర్యనిర్ణిద్రగా
రవమున్ నామదికిన్ ఘటించె సుచరిత్రాలోకచూడామణీ! 210.

గీ. మర్త్యజగమున నేనరమాతృనకును
నీయభిజ్ఞత లే దన్న నెలఁతుకల వ
చింప నేటికి? నీవు విరించిసతివో
యంబ! వేదాలఁ గన్నగాయత్రివో టు. 211.

క. అని యిటు వినుతించుచుమతీ
శుని పదముల కలికతలము సోఁక నెఱఁగి మం
డనుఁడు దనపురికి యతి ర
మ్మని సాంతేవాసుఁ గోరె యనుమతి గనుచున్. 212.

సశిష్యుండయి శంకరుండు మండనదంపతుల కోర్కెపై మాహిష్మతీపురంబు చేరుట.

ఉ. వచ్చినతోత్రవఁ బట్టి పరివారముతో శకటంబు లెక్కె ము
చ్చిచ్చును దేవతాతతి భజించు తెఱంగున శిష్యులన్ గురున్

బొచ్చెము లేనిభక్తిఁ దగఁ బూజలఁ దన్పుచు దీర్ఘయాత్ర న
ట్లచ్చట నచ్చటన్ విడియుచా గృహమేధి యొనర్చెఁ బైనముల్.

సీ. అది సమాధిస్థితి యనఁగొంటిమే కాని
ఎఱుఁగము గురుని యియ్యోగశక్తి
యోగవిద్యాశక్తు లూహింప నబ్రమ్ము
శుకదేహమం దెట్లు చొచ్చె నొక్కొ!
చొచ్చు; గా కామేను వృచ్చి వ్రేల్మిడి మన
యెదుటనే తన దేహ మెటుల చొచ్చె?
నణిమాదిసిద్ధుఁ డౌనాచార్యునకుఁ బర
కాయప్రవేశ మగ్గలమె తలఁప
గీ. ననుచు గురు నద్భుతావహ మయినయోగ
శక్తి కనుగ్గునందు నాశ్చర్యపడుచు
నరుగఁ దొడఁగిరి పద్మపాదాదు లొలసి
తత్కలాలాభలోభసోత్కంఠబుద్ధి. 214.

చ. అటు గొని వచ్చి యాబుధుఁడు నాలు సశిష్యుని శంకరార్యుఁ బ్రి
స్ఫుటతరభక్తి భిక్షలిడి పూజలఁ దేలిచి బంధుతాసుహృ
త్పటలికి సర్వమున్ వినిచి శ్వస్తనకార్యములన్ స్మరించి రే
యెటువలెనో క్రమించి రుదయించె సహస్కరుఁ డంతఁ బ్రాగ్దిశన్.

క. కొడుకులకుఁ గూతులకుఁ దమ
విడిముడిఁ బొలములును బైఁడి వెండియు సమమా
వడువున విభజించి యొసఁగె
నే మమతం ద్రెంచికొని మహీనిర్జరుఁడున్. 216.

క. యతిపతిజితనిజపతిగళ
గతాపగతకాంతిమాలఁ గను టాదిగ నా

సతి యుపవాసవ్రతదీ
క్షిత యగుటను నవసె వేసఁగిని గదళిక నాన్. 217.

ఉ దంపతు లిర్వు రాత్మ మమతన్ విడనాడి కృతావగాహులై
సొంకఱఁ గట్టి కావుల విశుద్ధమనంబులఁ, దోఁచినట్లుగా
సంపద లెల్ల యాచనికసాత్కృతమున్ బచరించి చుట్టముల్
గుంపులు గట్టి రాఁగ సభకున్ జనుదెంచి రపూర్వవైఖరిన్. 218.

సీ. స్వస్తివాచనికకైవల్యోపనిషదుక్తి
ఘోషమ్ము దశదిశల్ కొనలు నిగుడ
నౌపాసనాగ్నిఁ ద్రేతాగ్నులఁ బుత్త్రిలు
ఛాత్రిలు కయికొంచు సరస నడుమ
నుపవాసములఁ గ్రుస్సి యుప్పున నిలఁ గూలు
ధర్మగేహిని తోడఁ దరలి రాఁగఁ
గన్నీరు కాల్వలు గట్ట బధుభుజిష్య
వితతి యంజలి గూర్చి వెనుకొనంగ

గీ. శాంతరసమున కధ్యవసాయ మనఁగ
దోఁచుమండను నంతంతఁ జూచి సభ్యు
లవనిఁ జాఁగిలి మ్రొక్కి జయారవముల
వెల్లడించిరి మది వెల్లివిరియుభక్తి. 219.

క. గురుఁడును శిష్యులుఁ జుట్టలుఁ
బరిషజ్జనములును నుభయభారతి పతితో
నరుదేఁ గని విస్మయసా
గరమందు మునింగి రొక్కక్షణ మయ్యెడలన్. 220.

సంన్యాసము స్వీకరింపనున్న మండనుని దేహమున
నుభయభారతి యోగశక్తిచే లీన మగుట.

సీ. ఆఁడుదానికిని సంన్యాసమ్ము గొనఁగ న
ర్హత యున్నదే విధులందు ననుచు

సంన్యసించెదువేళ పతిఁగూడఁ బతితోడ
నిట్లుండఁగావలె నేమొ యనుచు
మన కేమి దెలియు ధర్మరహస్య మీమొకం
టెను శాస్త్రములను గంటిమె యటంచుఁ
బతితోడఁ బ్రివ్రజింపఁగ నీపెబిడ్డ
కాధారముగ నెవ్వ రగుదు రనుచుఁ

గీ. బరమవైరాగ్య మాకృతిఁ బడసినట్టు
లరుగుదెంచెడు నాగేస్తురాలి నరసి
గుములు గట్టి వికల్పజల్పము లొనర్చ
సాగి రొక్కుమ్మడిన సభాస్తారు లెల్ల. 221.

క. అయ్యెడ మండనవిబుధుం
డయ్యతిపతి కెఱఁగి భవమహాబ్ధిఁ దరింపన్
జయ్యనఁ గృపాతరణిసా
హాయ్యము నీవయ్య శాశ్వతామృత మొనయన్. 222.

క. అని యటఁ బ్రాజాపత్యే
ష్టిని విధివిహితముగఁ జేసి చెచ్చెర నగ్నుల్
గొని యాత్మారోప మొన
ర్పను గడఁగెడువేళ యతికి భారతి పలికెన్. 223.

శా. దేవా! నాపతి సంన్యసించి చన నీదేహంబు సంతాన మీ
యావాసంబును నాకుమాత్రి మిఁక నేలా? మాకు దాంపత్యదీ
క్షావిధ్యాదిమసాక్షి యయ్యనలుఁ డస్మత్కాంతు నాత్మంబునం
దావాసింపఁగ నుండునే మిగిలి వైయర్థ్యంబునన్ భూమిపై. 224.

ఉ. ఏను దివానిశంబు హృదయేశ్వరుభవ్యపదాంబుజద్వయీ
ధ్యానము దక్క స్వప్నమున నైనఁ దదన్య మెఱుంగనేని నే

నీనియతాత్మనాత్మకళనేనిఁ దదాత్మను జొచ్చునగ్నితో
మానుగఁ జొత్తుఁగాక యసమానమదీయసతీత్వశక్తిచే. 225.

క. అని భర్తృపాదజలజము
లను శిరమునఁ జేర్చి యసువులకు నవధితి వీ
వనుమాటఁ దలఁచి నీయా
త్మను నాప్రాణములు సేర్పుమా యగ్నులతో. 226.

ఆ అనుచు నోడివి లేచి యాత్మేశుపాదాబ్జ
సన్నిధానమందు సాధ్వి యామె
పరమయోగసరణిఁ బద్మాసనాసీన
యగుచుఁ బ్రాణవాయు నవధిఁబెట్టె. 227.

మ. చరణాంగుష్ఠతలాది వాయుగతి సంస్తంభించి నాభీస్థలం
బురముం గంఠము బ్రహ్మరంధ్రమును నొయ్యొయ్యం సమాకర్షణం
బరుదారం బొనరింపఁ బ్రాణములు దివ్యజ్యోతిరాకారవి
స్ఫురణం దేహము వాసి యగ్నిశిఖలం జొచ్చెం దటిత్ప్రాయమై.

ఆ. పిడుగుపడినరీతి విఁజమాఁకిడినట్లు
క్షణముకాల మచటిసభ్యజనము
మూఁగలట్లు చిత్రములపోల్కి నోటమా
టయును గంటఁ జూ పడంగి యుండె. 229

ఉభయభారతి భార్యావతారమని శంకరుం డెఱింగి స్తుతించుట.

సీ. ఆదివ్యతేజమం దరసి వాణీరూప
మొదలు జల్లన శంకరుఁడు నుతించెఁ
దీవ్ర మానామె పాతివ్రత్యశక్తికిఁ
జేమొత్తి మ్రొక్కిరి శిష్యకోటి
యాసాధ్వి నియతేంద్రియత్వసంపత్తిని

నోరార(బొగడిరి పౌరసమితి
స్వచ్ఛంద మైనతత్స్తుతిమరణంబున
కాస్థాన మాశ్చర్యమందు మునిఁగె

గీ. క్షణము కాలంబు మాత్రిన్నాటు గనియుఁ దెలిసి
తడయ కాత్మను నారోపితము లొనర్చెఁ
దత్సతీదివ్య తేజోవితానలీన
మైనవై తానికాద్యగున్న లాబుధుండు. 230.

ఉ. సాంజలిబంధుఁడై నిలిచి యత్తటి శంకరదేశికుండు త
న్మంజులదీప్తిపుంజము మనంబున శారదఁగాఁ దలంచి యో
కంజజురాణి వాణి కనుగంటఁ గనుంగొనుచుండ వహ్నిలో
నం జొలఁబాటె రూపఱుట న్యాయమె యంచు నుతించె నార్యుఁడై.

శా. పాతివ్రత్యతపఃప్రభావ మిం కంబా చాటె చెప్పంగ నీ
వేతన్మానుషజన్మ మొంది తని యూహింతుః భవత్పాండితీ
చాతుర్యంబుఁ దలంప మర్త్యభువనాజయ్యం బనూహ్యంబు, వి
ద్యాలిత్వాకృతి యౌసరస్వతిగ సిద్ధాంతీకరింతుః నిన్నః. 232.

గీ. నాకు జితుఁడై ధవుండు సంన్యాస మూనఁ
దనకు వైధవ్య మబ్బుట, దలఁచి యామె
యోగశక్తి నాత్మకాత్మ నొనరఁ జొచ్చె
తే వసాధ్యమ్ము లిఁకఁ బతిదేవతలకు. 233.

మ. అస్మృతం బొలెకై మసల్కుఁ వివిధశాస్త్రార్థప్రసంగబులం
దమరాచార్యఫణీంద్రవణ్ముఖుల లజ్జాయత్తులం జేయునీ
విమలప్రజ్ఞఁ దలంప మానుషివె సావిత్రీమహాదేవివో
హిమవత్పుత్రివొ లక్ష్మివో యగుదు కాదేఁ దల్లి వాగ్దేవివో. 234.

ఉ. అంతరదృష్టిఁ గాంచ నిగమాంతసరోజవనాంతరాంతరా
శ్రాంతవిహారహంసి వని శంభు రమేశ విధాతృ సేవితా
నంతమహత్త్వ వంచుఁ బరమాణుగతస్థితి వంచు భారతీ
కాంత వటంచుఁ దోఁచె నరకాంతపు మాత్రము గావు మాతృకా.

గీ. వైఖరీరూపవై వెలువడుదు జగతి
మధ్యమాఖ్య నుందఁట గళమధ్యమందు
నగపడుదు యోగదృష్టిఁ బశ్యంతి నాఁగ
గాని నీపరావాఙ్మూర్తిఁ గనుట యరిది. 236

క. కనుకలికి వినుకలికి వా
ఙ్మనసముల కగమ్య మయి సమాధి మెఱుపు నాఁ
జనునప్పరాఖ్యవాక్కగు
నిను నస్మద్దృశులు చూడ నేర్తురె దేవీ. 237.

గీ. మనుజదృష్టి నుపాసించుమంత్ర మీవ
జీవదృష్టి ననుం గన్న దేవి వీవ
జ్ఞానదృష్టి మదాంతరశక్తి వీవ
యాత్మదృష్టి 'నే' నన్నపదార్థ మీవ. 238.

చ. ఎఱిఁగితి నాత్మ నిన్నుఁ జననీ! పరమేష్ఠికళత్ర మంచు నీ
శ్వరుని సగర్భ్య వం చఖిలవాక్కుల కాదిమదేవతాకృతిన్
బరఁగెడుదాన వంచు భువనంబులఁ బ్రోవ రమాదిరూపభా
సుర మగు చిత్కళాంశ మనుచున్ బరమార్థవిచారధోరణిన్. 239.

సీ. సర్వకాలము నీసుచరిత సాధ్వుల కొజ్జ
బంతియై జగతి నేర్పడుటకొఱకుఁ
బరమపాతివ్రత్య మరవిందదళనేత్రి
కలఘుతపం బంచుఁ దెలుపుకొఱకు

దత్త్వైశ్వర్యాతిధన్య కసాధ్యవి
జ్ఞానమొుం డుండమిఁ జాటుకొఱకు
నట్టి జ్ఞానమున యోగాతీతశక్తి ల
భించు నంచును బ్రకటించుకొఱకు
గీ. శృంగగిర్యాదిక క్షేత్రరంగములను
బీఠములను స్థాపింతు నీపేర నందు
శారదాంబ! నీదివ్య తేజం బజస్ర
మావహించి మదర్చితం బౌను గాక. 420.

ఉ. అంచు నుతించు చొక్కఁగడె యయ్యతి చొక్కున నుండి మీఁలితా
త్ర్యంచలనిస్ఫురత్తాను ప్రభుకు లాస్యము ముంపఁగ లోని చూపునన్
బొంచిత చిత్సుధాంబుధి తరంగ దభంగ తదంగనాకృతిన్
గాంచి యభీష్ట మామె యొసఁగన్ గొనినట్లుల విచ్చెఁ కన్గవన్.251.

మండనుని సంన్యాసస్వీకారము.

ఆ. అగ్నిహోత్రముల నిజాత్మ న ట్లారోపి
తములుగా యథావిధాన మాచ
రించి కామములఁ ద్యజించి యమ్మండనుఁ
డాశ్రయించె శంకరాంఘ్రియుగళి. 242.

గీ. ఎలమి గురుఁడును సన్న్యాసగృహ్యవిధిని
మండనున కంత సకలధర్మముల నడఁచి
నిఖిలభవదుఃఖహానికిఁ గల్గెడు మగు
'తత్త్వమసి' సూక్తి నొడివెఁ దత్కర్ణసీమ. 243.

క. సన్న్యాసపూర్వముగ నా
ధన్యుఁడు భిక్షించె; నాత్మతత్త్వము గురురా
జన్యుఁడు గఱపి శ్రుతిశిరో
మాన్యమ్ము తత్త్వమసి సూక్తిమర్మముఁ దెలిపెన్. 244.

గీ. ఘట మటుల జాతిరూపాదికమ్ము కలిమి
నాది యనెడు భిదాశ్రితనమ్మనను న
నాత్మ యగు దేహ మీవు గా; వం దభేద
సంస్కృతి విపర్యయజ మంచుఁ జక్క నెఱుఁగు. 245.

సీ. దండఘాతమున ధ్వస్తం బగుఘటము లో
ప్యమ్ము దండాది లోపక మనఁబడు
నాలోప్యమునకు స్వవ్యతిరిక్తదండాది
క మ్మెన్నఁగా లోపకముగ నౌను
అటు స్వవిలక్షణం బయి ద్రష్ట యైనట్టి
యాత్మవస్తువు జ్ఞాత యైనయంత
దేహత్రితయమును దృశ్యత్వ మెనసిన
హేతువునఁ నశియించు; నిట్టు
గీ. లాత్మ మేసికి లోపక మగుచు వేఱయ
దేహమునె బ్రహ్మ మనుచు సాధించు టెట్లు
పొసఁగు? ద్రష్టకు మఱి దృశ్యమున కభేద
వచన మున్మత్తవిప్రలాపంబు గాదె. 246.

ఉ. ఆదినె నీవు కావు సుమి యక్షము లయ్యవి సాధనాళి దా
త్రాదులపోల్కి; వానియెడ నాత్మత చెల్లదు, కన్ను నాదియన్
భేదము లేదె స్పష్టముగ? వీనియభావము జూడవే సుషు
ప్త్యాదికభావమందు? నటులౌట ఘటాదులపాటి వవ్వి యా. 247.

గీ. ఆత్మభావము దా నింద్రియములకు సము
దయగతం బేని యం దొంటు వ్యయము నొంద
నాత్మత నశించుఁ; బ్రత్యేకమందు ననినఁ
గాయమె నశించు బహునాయకత్వమునను. 247.

గీ. 'చక్షురా ద్యన్యతమగ మెంచంగ నాత్మ
భావ' మనఁ గన్ను వో స్మృతి పాయవలదె?

స్మృత్యనుభవంబు లే కాశ్రయొద్ధ మగుటఁ
జూచువాఁ డొక్కఁడు మఱొండు శ్రోత యగును. 249.

క. 'చనె నా మన మొకయెడ' ననఁ
గను భేదము కలిమి సుప్తి కాలలయంబున్
గనుఁ గానఁ జిద్విభిన్నమ
మన, మది గా దాత్మ, కరణమాత్రంబ యగున్. 250.

క. భేదావగతి ననన్వయ
మూదుకొనుట నిటులె బుద్ధి యాత్మం జెప్పుదుర్
గా దది, కరణాదిఁబలెఁ
దాదాత్మ్యభ్రాంతి విడువఁదగు నీ కార్యా! 251.

గీ.*చరమకృతిధాతుపదయుక్తి పరఁగుకతనఁ
గాదహంకృతియును నాత్మ; నాదు ప్రాణ
మనుప్రతీతిఁ బ్రాణమును గా దాత్మ, సకల
ముపరతం బగుసుప్తియం దుండుఁ గాక. 252.

గీ. ఇటుల దేహాదిభిన్నమై యెసఁగు నాత్మ
తదవివిక్తమై త్వంపదోక్త మగు, విశ్వ
హేతు వగునాత్మ తత్పదఖ్యాత మగును
దదుభయైక్య మసీతిపదంబు తెలుపు. 253.

క. అన మండనుఁ డనుఁ దేహం
బునకుఁ దమంబునకు నైక్యమునువలె సర్వ
జ్ఞునితోఁ గించిజ్జ్ఞున కే
యనువున నీవాక్య మైక్య మది కనో యనుదుర్. 254.

వ. శంకరాచార్యుండు నవ్వి యిట్లను. 255.

---

* 'అది వికారాశ్రయం బగుటకతనఁ' అని పాఠాంతరము.

మ. అరయన్ వాచ్యగ మిప్పిరోధ మగుఁ దత్ 'సోఽయం పుమా'నన్న నై
ఖరి; నిప్పట్లను దద్విరోధ మెడయంగా నిర్విరోధత్వభా
స్వరవాచ్యంబున కొంచు నేక మగులక్ష్యంబే వచింపంగఁ ద
త్పర మౌఁ దత్పదయుగ్మ మన్నెడ విరోధం బెద్ది వాక్యప్రియా!

వ. నీ వనిన విరోధ మిద్ది వాచ్యగత మగుఁ గాక. నిన్న చూచిన పురుషుని నేఁడు విలక్షణవేషంబున నుండఁ జూచినను 'వాఁడే వీఁ' డన విరోధము పొడసూపనటుల తత్త్వంపదద్వయవాచ్య మగు పదార్థ మొక్కటియే యని చెప్పు నాశ్రుతియందు విరోధమేమియుఁ గానరాదు.

ఉ. కావున నిర్వివేకమతిఁ గర్మశతాపరిహార్య మై చిరం
భావిత మై తనూప్రభృతిభావగతం మగునయ్యహంమతిన్
దోషము ఘోరసంసరణదుఃఖవిముక్తికి హేతు వన్న స
ద్భావన నాత్మభావమున భావము దార్పు మజస్ర మోసుధీ! 258.

గీ. కాయమున వీడు మమతను గాక భూరి
మాయువహ్నిమాత్రాదిసామాన్య మగుట
నటులె బహిరర్థమమతఁ బోనాడు నిర్వి
శంక మగుచిత్తముఁ బరాత్మవంక నిలుపు. 259.

ఉ. తీర మొకండు వాసి పెఱతీరము సేరెడుదీర్ఘమత్స్య మా
తీరముకంటె భిన్న మయి తీరవిలిప్తము గాక పొల్చునా
ధోరణి జాగ్రదాది విహృతుల్ గయికొంచును దేహి వానికిన్
వే ఱయి యుంటె కాదు వినవే కనఁ డించుక హానిధర్మముల్. 260.

శా. జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలు చిదంశం బైననీయందె ధీ
వ్యగ్రత్వంబునఁ గల్పితంబులు; మహీశ్వభ్రాహిదండాదరూ
పాగ్రత్వంబులు రజ్జువందు భ్రమచే నుత్పన్న మౌఁ గాన నీ
వగ్రీయంబు తురీయతత్పదమమై తాద్యభ్రమల్ వాయుమీ 261.

సీ. ప్రత్యక్త్తమము పరపదము వేత్తకుఁ జేరు
వగు; నజ్ఞునకు దూర మగును జూవ్వొ
యంతర్బహిర్వర్తి యైన జిత్తును వెలి
నెమకి యజ్ఞు లెఱుంగ నేర రాత్మఁ
బాంథప్రపాసంగఫక్కి నానాఖ్యల
గృహము లాచు దేహము లేఁగెదరు తుదకు
ననిశసుఖాద్యకృత్యములు దుఃఖదము లా
సుఖము జన్మాంతరసుకృత హేతు

గీ. వాక్కుపతి విన్నప్రత్యక్తి నొదవును బరి
పక్వమతి కాత్మవిజ్ఞానపాటవంబు
మందగతిఁ బట్టువడు మంధమతికిఁ గూడ
సద్గురువరాంఘ్రిసారసాశ్రాంత సేవ. 262.

ఆ. ప్రణవసాధనము నుపాదిష్టకర్మముల్
సేసికొనుచు గురుని సేవణమున
మలము లెల్లఁ దొలఁగ, మానసంబు ధరింప
నోపుఁ దత్త్వబోధ ముక్తరీతి. 263.

క. మనసు దివానిశమును గురు
ననువర్తించునది - వేత్త యగుగురుఁడె శివుం
డనఁదగు-ననువర్తనఁ దు
ష్టసి గనెనా కృపను జూచు శిష్యునిమోముఁ. 264.

సీ. ఆమోదపాలనీయము గురునాజ్ఞ, య
య్యది కల్పలత యభీష్టార్థఘటన
నలుగ గురూపదిష్టాత్మదేవత గుఱుం
డోము- నాతఁడె యల్ల నున్నె దిక్కు

ఆచార్యసేవ యిష్టావాప్త్యనిష్టనా
శములకై విధినిషేధములఁ దెల్పుఁ
గొల్చువే ల్పొసఁగుఁ గోర్కులె నైన గురుఁడు లే
కవ్వేల్పుఁ గనఁ దెలియంగ రాన

గీ. గురుఁ డలరెనేని దేవతోత్కరము నలరు
గురుఁ డలిగెనేని దేవతోత్కరము నలుగు
నాత్మభావన సమాప్తిపు లగుసురతతి
మదిఁ దలఁచుదేశికుఁడు విశ్వమయుఁడు గాఁడె. 265.

చ. అని యిటు లప్పురాణగురుఁ డర్థిమెయిన్ బరమాత్మతత్త్వమున్
వినిచిన మండనుండు భజనీయగురుప్రవరాంఘ్రియుగ్మమం
దు నొసలు సోఁక వ్రాలి త్వదనూనదయామృతవత్కటాక్షపా
తనమున నిన్నినాళులకు ధన్యుఁడ నైతి నటంచుఁ బల్కెడున్. 266.

క. గురుఁ డతనికి నొనరిచె స
త్సురేశ్వరాభిఖ్య దిగ్వధూకృతసఖ్యన్
మెఱసె విధాతృసుఖాధిక
తరశంకరముఖ్యశిష్యతన్ గని వాఁడున్. 267.

చ. అటు లతఁ డాసురేశ్వరసమాఖ్యను నర్మద నర్మదాధునీ
తటతల మాని యున్నమగధక్షితిఁ జేరి త్రయీశిరోవచః
పటలవిచింతనన్ స్వపదభాగురుసౌఖ్యములో మునింగి త
త్కటకమునంద యుండి బహుకాలము పుచ్చె మమత్వదూరుఁడై.

సీ. పండితాజయ్య మామండనబుధమదే
భముఁ బట్టి కట్టుఁగంబమునఁ గట్టి
పరిణతవిద్వత్త్రికరణగతదోషపం
హతి పొల్లువోవఁ దూర్పారఁ బట్టి

సద్గుణాంచితు లైనజనుల కవ్వారి యగా
తంగేటిజున్న చందమున నడరి
దుర్గమదుర్మతా దుర్లపక్షుముల నెల్ల
బిఘుగుపాటుగను నొప్పించి త్రుంచి
గీ. శంకరాచార్యవర్యుఁ డచ్చటు దొలంగి
చనియెఁ గీనాశపాలితాశకును గుసుమి
త వివిధకలాశ విభ్రమద్భ్రమర గీత
మధుర రుతి పూర్ణ వనమార్గ మధిగమించి 269.

ఆశ్వాసాంతము.

శా. విద్యుత్పింగ పటీ వృతాసితపయోభృత్కోమలాంగాంచితా!
స్వాద్యామేయ దయాంబువర్ష శమితాచ్ఛస్వాంతతాపత్రయా!
విద్యాలాంగలఫాలకృష్టిదళితాఽవిద్యాఖ్యత్ప్రణ్యాంతరం
గోద్యత్స్వాత్మవివేకసస్యఫలరూపోదారమోక్షప్రదా 270.

క. అస్త్రాయితతృణఖండ! ము
నిస్త్రీకృతగండశిల! తృణీకృతశివచా
పా! స్త్రైణాభినవప్రస
వాస్త్ర! పవిత్రోదరాన్వయాబ్ధీందునుతా! 271.

సుగంధివృత్తము.

శంకరా బ్జగర్భ జంభశాస నాదిపాయకా!
న్యంకురూప దేవశాత్రవాసుమోక్షనాయకా
పంకజాతలోచనాప్రపంచపంచసాయకా!
కంకకాకదాశకీశకామితార్థదాయకా!

ఇది శ్రీగురుకరుణాసమాసాదితకవిత్వ 'కవితాభూషణ, విద్వత్కవిశేఖర'
వెంపరాల సూర్యనారాయణనామధేయప్రణీతంబైన
శంకరవిజయంబున
పంచమాశ్వాసము.

శ్రీగురుమూర్తయే నమః.

శ్రీ శంకరవిజయము.

షష్ఠాశ్వాసము.

శ్రీ వేంకటరాయసచివ
భావగగనవీథికానపాయుసమగ్రేం
దీవరబాంధవ! మైత్ర్యా
కావనిపాలకమతల్లికా! రఘురామా!

వ. అవధరింపుము!

గీ. సనకసముఁడైన శంకరాచార్యుఁ డల ది
శను మహారాష్ట్రముఖ్యదేశముల శమిత
విమతమతమానుఁడై గ ంధవితతి వెలయఁ
జేయుచుఁ గ్రమక్రమమున శ్రీశిఖరిఁ జేరె. 1.

క. ఆకొండ వెలుంగు స్వయం
భూకౌశలమై యహీంద్రభూషప్రియమై
వ్యాకోచమల్లికాగం
ధాకలితక్షితిజమై ద్విపారిసిబిడమై. 2.

వ. అందు. 3.

క. తొలిచెఁ దన మేను యతిరా
ట్త్రిలకుఁడు కలికలుషభంగ ధిక్కృతతుంగన్
జలదుత్తుంగతరంగన్
సలలితపాతాళగంగ శైలాసంగన్. 4.

చ. నతజనమోహభంగము ననంతపథస్పృగమేయశృంగమున్
హతపటుపాపసంగముఁ గలాలపదభ్రిగభృంగమున్ సమా
శ్రితపృథుగంగమున్ సుకృతశృంగముఁ దుంగమునైన యాగిరిన్
యతిపతి యెక్కి, కాంచె నఖిలాంగము పొంగఁగ నీశు లింగమున్.

క. నతజనభవభర్జను నతి
నుతిమాత్రామృతరమార్జనుని భ్రమరాంబా
కృతసంసర్జనుఁ గొలిచెన్
యతి ప్రణతార్జునుని మల్లికార్జును భక్తిన్. 6

గీ. తీరరుహభూమిరుహవినివారితోష్ణ
ప్రమథితాఖిలతృష్ణ నిరస్తకార్ష్ణ్య
మైన కృష్ణాధుని తటమ్మునందు నివ
సించెఁ గొన్నాళు లాచార్యశేఖరుండు. 7

చ. అచటఁ బవిత్రకీర్తి విమలాద్భుతవర్తి గురుండు దా స్వయం
రచితము చిత్రవాక్యరుచిరంబు నసద్గ్రహనిగ్రహార్థ మా
ప్రచురకృతివ్రజంబు గుణరాజివిరాజితు లౌ బుధాళికిన్
స్వచతురిమంబునన్ దెలియఁ బల్కి యొనర్చెను సుగ్రహంబుగన్

చ. ఇతరము లౌశ్రుతంబుల జయించెడి తచ్ఛ్రితభాష్యసంచయం
బతఁ డసదర్థధిక్కరణ మబ్బ వచింపఁగఁ గాంచి యీర్ష్యమే
వ్రతముగ దూఱు పాశుపత, వైష్ణవ, శైవ, మతాద్యజప్రదీ
క్షితుల సురేశ్వరాదియతిశిష్యులు లీల జయించి రత్తఱిన్. 9.

గీ. అందుఁ గొందఱు గతమత్సరాభిమాను
లై స్వమత మొల్ల కయ్యతి కైరి శిష్యు
లవులఁ గొందఱు ధృతమన్యులై జఘన్య
మతులు తన్నిధననిరీక్షమాణు లైరి. 10

మ. ఖలనీచోక్తులె వేదమాళు లనుచున్, గల్పించుచున్ వేదముల్,
ఖలవృత్తిన్ నిజవేదమార్గ మెఱియంగాఁ గూల్చుచున్ గొంద ఱీ
చ్ఛల సాక్షాత్పరమాత్మ శంకరునిడన్ స్పర్ధాగతిన్ గృష్ణు నం
దలుకన్ బౌండ్రకుఁ డట్లుపొందఁ గని రంత్యం బాగతిన్ జెచ్చెరన్.

మ. యతిరాట్సూక్తి నదీష్ణశిష్యుల కథావ్యాపారపారీణభా
షితముల్ వెల్గఁ గణాదవాణి గణనాశ్రీఁ గోల్పడెన్, గాపిలం
బు తిరోధానము సెందె, శైవ మశివంబున్ బొందె, గర్హార్హ మ
ర్హాత మాయెన్, గనె వైష్ణవంబుగతి దార్ఢ్యం బారయన్ దుర్గతిన్.

చ. అదయత శంకరార్యుఁ డటు లన్యమతంబుల సంకరం బడం
పఁ దొడఁగె బౌద్ధవాద, మదె పద్ధతిగాఁ గొనెఁ జార్వాకోక్తి సం
పద, యిఁక నెత్తువెట్టినను బల్కద భాట్టమతంబు, కాపిలం
బది స్ఫుటచాపలం బయి యనాదృత మయ్యెను దగ్ధబుద్ధికిన్. 13.

కాపాలికుని చరిత్రము.

ఉ. కాల మొకింత యయ్యతి సుఖంబుగ నచ్చటఁ బుచ్చ, నొక్కనాఁ
డాలరి రావణుం డటు సమాత్తమునీశ్వరవేషుఁడున్ సము
న్మీలదనల్పదోషుఁడు వినింద్యకృతిప్రవణుండు నైన కా
పాలికుఁ డొక్కరుండు గనవచ్చె నమాయు నమాను నమ్మునిన్.

గీ. అటుల డగ్గఱి కాంచెఁ గమాద్యవశ్య,
వశ్యవిషయతురంగతపస్విలోక
మృగ్యు, గురుమౌళి సత్యమాత్మీయభాష్య
మెలమిఁ గఱపి రహస్స్థలి మెలఁగువాని. 15.

క. చిరముగఁ గోరెడు యతివరు
నరసి మనోరథము సిద్ధి నందినటు ముదం
బరసి నిజలాభముదితుని
దరిసి గురు వచించెఁ జేయఁ దలఁచినది యిటుల్. 16.

మ. సదయాత్మా! భవదీయమైన గుణముల్ సార్వజ్ఞ్యసౌశీల్యభూ
తదయాదుల్ విని కాంచ వచ్చితి సముత్కంఠాతిరేకంబుచే
త దవీయీకృతదేహమానను, విజితద్వైతోక్తి, విధ్వస్తమా
హు దృఢాద్వైతుని నిన్నుఁ గా కొరుని నీయుర్విన్ గనన్ శక్యమే?

ఆ. పరుల మేలుకొఱకె పడసితి వీమూర్తిఁ
గంటి దివ్యగేయకర్మకీర్తి
ఫలు తపాంగలేశముల సజ్జనులయామూర్తి
విమలసూక్తిఁ గొందు విశ్వమూర్తి. 18.

చ. అమలగుణాకరత్వమున నందితివే భువనైకమాన్యతన్
గ్రమగతి; విశ్వవిత్త్వమునఁ గంటివయా యభిమానశూన్యతన్
రమణవిజిత్వరత్వకలనన్ గనవో గళహస్తితాన్యతన్
శమివర! కంటి స్వాత్మమ యొసంగు కడంక మహావదాన్యతన్. 19.

ఆ. అఖిలశుభగుణాలయములుం బరావర
జ్ఞులును నగు భవాదృశులను గోరి
యెట్టి దుర్లభేష్టమేని బొందకయ కా
ర్యార్థు లెన్నఁడైన నరుగువారె? 20.

క. కావున సర్వజ్ఞుఁడ వగు
నీవు సలుపు మేలు వడసి నృకరోటిధరున్
దేవుఁ దనియించి తత్కృపఁ
గావలె ధన్యుండ ననెడు కడఁకను వత్సున్. 21.

ఉ. ఈతను వ్రాఁది రాజతమహీధరసీమకుఁ బోయి శర్వుతో
బ్రీతి వసింపఁ గోరి, శతవర్షము లుగ్రతపం బొనర్ప; సం
ప్రీతమనస్కుఁడై శివుఁడు దృగ్గతుఁడై యనెఁ "గాంతు నీయభి
ప్రేతపు మర్థ మయ్యది లభింపఁగ నొక్కటి చేయఁగాఁ దగున్. 22.

క. సర్వజ్ఞశిరమొ యగ్నివి
నుర్వీపతి శిరమొ వేల్చు టొప్పు ననియె మున్
శర్వుఁ, డదిమొదలు వెదకియు
సర్వజ్ఞుని గననియల్లి జనపతిని గనన్. 23.

గీ. కంటి నేఁడు భాగ్యగరిమ జగద్ధితా
చరణు సర్వవిదుఁ బ్రశాంతు నిన్ను
నింక మదనుబంధ మీఁడేలు; జనుల బం
ధములు నిన్నుఁ జూచుదనుకఁ గాదె. 24.

ఆ. చక్రవర్తి శిరసా సర్వజ్ఞపుత్రియయో
యస్మదిష్టసిద్ధి కగును హేతు
వఁదుఁ దోఁటి దాత్మనైనఁ దలంపరా
దున్న దపర; మీర లున్నవారు. 25.

క. శిర మొసఁగ మీకుఁ జేకఱు
స్థిరయశ మభిమతము నాకు సిద్ధించు 'విన
శ్వరము తను' వనుట బుద్ధిం
దలఁచి యెది రుచించునో యొనర్పుఁడు దానిన్. 26.

చ. శమధన! నిన్ను దేహ మొసంగు మనన్ మన సొప్పకుండె, స
ర్వ మొసఁగు దాత యైన నొసవంగలఁడే స్వశరీర? మీవు ని
ర్మముఁడవు దేహమం దనభిమానుఁడ వంచుఁ బరోపకారకృ
త్యమునకె మేను దాల్చినమహాత్ముఁడ వంచుఁ దెగింతుఁ గోరఁగన్.

ఆ. పరుల క్లేశ మింత పాటింతురొకొ యహ
ర్నిశము స్వార్థపరత నెగడుజనులు
పగఱఁ జంప వజ్రి పవి కంచు దాధీచ
మైన యస్థి నిర్దయముగఁ గొనఁడె. 28.

క. తృణమటు దధీచిముఖ్యులు
క్షణిక మ్మగు నొడలు పరులకై విడిచి జగ
ద్గణముఁ గయిసేయరే గుణ
గణమున స్థిరకీర్తిమూర్తి కాశితు లగుచున్. 29.

సీ. ధిక్కృతైషణులు త్వాదృశులు శాంతులు పర
తుష్టికై కాదె తాల్తురు శరీర
మాచంద్రతారార్క మనపాయయశమున
వరలఁడే జీమూతవాహనుండు
స్వార్థపరాయణు లస్మాదృశులు దయా
దూరులు కొందఱుందురు మహాత్మ!
సంతతవాంఛావశంవదులై వివే
కము గోల్పడెదరు కార్యములయెడల

గీ. నరయఁ దనుధారుల కదేయ మఖిలసుజన
గర్హ్య మగు కోర్కెఁ గోరుదుఁ గాక నీకు
ధృతవిరాగున కీరాని దేది యుండు
నిష్ట మొసఁగ నీకంటె నా కెవరు గలరు. 30.

క. దేవా మ్రొక్కెద నీశిర
మీవే యని కాళ్లఁ బడిన హీనుఁ గని దయా
సేవధి యాసుధి విశ్వ
వ్యావృత్తమనస్కుఁ డగుచు ననియె నిటువలెన్. 31.

ఉ. ఈ విటు గోరి తం చలుగ నిచ్చెద శీర్షమె, యేబుధుం డపా
యావిలకాయ మీయ వెనుకాడునొ యర్థులు వేఁడ; నెట్టి ర
క్షావిధు లున్నఁ గాలమువశం బయిపోయెడిపాడుమేనిచే
నావల మేల కల్గు నెడ నద్దియ కాదె పుమర్థ మేరికిన్. 32.

చ. వినుము సమాధి నుండెద వివిక్తమునం, దొకరుండ నీవు వ
చ్చినయెడ నిచ్చువాఁడ నిజశీర్షము; నంద తెఱుంగ నిచ్చుచోఁ
బని చెడు, వీరె శిష్యు లతిభక్తు లెఱుంగ సహింప; రెవ్వఁడై
నను దను వీఁగ సైఁచునె? స్వనాయకుకాయము డిందు టోర్చునే?

క. అని సంకేత మ్మెఱుఁగఁ దెలిపి
యనిపినఁ గాపాలికుఁడు నిజావసథము చే
రెను శంకరుఁడును దనయు
న్నఁటన మిన్నక యుండె భావనిష్ఠుతి దనరన్. 34.

శా. ఆకాపాలికుఁ డాత్తశూలుఁడు త్రిశుండ్రాంచల్లలాటుండు నా
నాకంకాళవిభూషితాంగుఁడు నితాంతక్షీబుఁ డుష్ణాంశుబిం
బాకారోగ్రవిలోచనుండు నయి యిట్టట్టింత గన్గొన ని
ర్భీకుండై యతిమౌళివాసమహిఁ జేరెన్ ధీరసంచారుఁడై. 35

క. స్నానాదికనిత్యాను
ష్ఠానములకు శిష్యు లెల్లఁ జన సంకేత
స్థానమున స్థిరత నాత్మ
ధ్యానమ్మున నుండె శంకరాచార్యుండున్. 36.

గీ. భైరవాకారుఁడైన కాపాలికుని గ
నుంగొని గురుండు దేహ మొసఁగ నెంచి
యాత్మ నాత్మను గూర్చి సమాహితాత్ముఁ
డౌచుఁ గరణోపసంహార మమర నుండె. 37.

సీ. నిజసౌఖ్యధిక్కృతాసమమహారాజ్యుం డౌచు
నిర్వికల్పసమాధి నెగడువానిఁ
జిబుకంబు జత్రువుఁ జేర్చి జానూపరి
నుత్తానకరముల నొప్పువాని
సామిమీలితవిలోచనుఁ డౌచు నాసాగ్ర
సీమఁ జూపు ఘటించి చెలఁగువానిఁ
బూర్వాంగ మెత్తరంబుగను సిద్ధాసన
మమర సమాసీనుఁ డైనవాని

గీ. శోషితవిబోధమాతృహృషీకలయు స
మాహితుండై జగంబు నేమఱినవాని
ఘను సనత్సుజాతాదిసంకాశు శంక
రార్యుఁ గని డగ్గఱఁగ నయ్యనార్యుఁ డరిగె. 38.

వ. ఇట్లరిగి బాహ్యప్రపంచంబు మఱచి నిర్వికల్పసమాధి నున్న న
య్యాచార్యు నరసి మఱిసి యెదుట నిలిచి శూలంబు నెత్తి కంఠం
బు గుఱిసేసి యేయ నుంకించు నత్తఱి. 39.

ఆ. అయ్యతీంద్రు పిఱుఁద నల్లంత నొకమూలఁ
గోనచీఁకటిని రగుల్కొనియెడి
చండ్రనిప్పులట్లు జ్వలియించు తేజోయు
గంబు గానన్నైనఁ గంప మూని. 40.

క. ఎత్తిన కాలును గేలును
నెత్తిన యట్లుండఁ బ్రాణమిట్టట్టయి, వా
నెత్తి నెఱపి యాక్రోశం
బత్తులువ పడెన్ ధరిత్రి నపగతసంజ్ఞన్. 41.

మ. పడి యొక్కింతటఁ జేతనన్ బడసి దేవా కావవే నాపయిన్
బడ నుండెన్ కుటిలాంతదంతచలజిహ్వాభీకరం బాననం
బడరన్ వక్రనిశాతవిస్ఫుటనఖం బౌ హస్త మొప్పారఁగా
మెడజూల్ నిక్క మృగేంద్ర మొక్కఁ డదిగో మిన్నంటు శౌర్యో
న్నతిన్.

క. ఆతతబిల మన నోరును
జ్యోతు లనఁగ గ్రుడ్లు మెఱయ నుఱుకఁగ నుండెన్
జేతమ్ము పగిలె శరణా
యాతుని భీతుని నన్ను మహాత్మ మనుపవే. 43.

మ. అని యుచ్చైర్ధ్వని మొఱ్ఱ పెట్టఁగ గురుం డాత్మానుసంధాన మం
తన కోల్పోయి బహిఃప్రపంచగతి నేత్రద్వంద్వమున్ విచ్చి కాం
చినఁ, గాపాలికుఁ డగ్రభూమిఁ గనిపించెన్ జెమ్మటన్ దోఁగి కం
పనముల్ బొందెడిబొందెతోడఁ దిరుగం బడ్డట్టి కన్గ్రుడ్లతో. 44

క. గిలగిలలాడుచుఁ గన్నుల
వలవల నశ్రువులు గాఱ వాతను లాలా
జలములు దొఱుఁగ భయమునఁ
గలఁగెడునవ్వానిఁ గాంచి కరుణామయుఁడై. 45.

గీ. అభయహస్త మ్మొసంగి కాయంబు నిమిరి
యొయ్యఁ జేయూఁత నొసఁగి కూర్చుండఁబెట్టి
చల్లని కమండలూదక మ్మలఁ జల్లి
ధీర మగు మాటల నొకింత తేర్చి వాఁడు. 46.

ఆ. కుదురుకొని యొకింత గురుని పిఱింది మూ
లకు నిగిడ్చి చూపులను దటాన
గొంతు కౌఁగిలించుకొని చచ్చితి నటంచుఁ
జావుఁగేక వైచె సరభసముగ. 47.

చ. గురుఁ డచలాత్ముఁడై వెనుకకున్ మెడఁ ద్రిప్పి కనంగ నొక్కటన్
నరహరి దివ్యమూర్తి నయనంబుల సోఁకె రసాయనంబుగా
సురుచిరబోధదీపికరుచుల్ హృదయంబునఁ బండువెన్నెలల్
నెఱపె ముహూర్తమాత్రమ యనిర్వచనీయ మవస్థ పైకొనన్. 48.

క. నయమున నాఖలు వీడిచి
భయమున భక్తిని నిటాలబద్ధాంజలియై
రయమునఁ దజ్జ్యోతి కెదుర
శయయుగి ముకుళించి నిలిచి చక్కఁ గనంగన్. 49.

సీ. కటికుజుంజుఱుజూలుకడ సోఁకి మబ్బు లే
కినదూదిపింజలై తునిసి చెదర
నుబ్బి గొబ్బునఁ బెట్టు బొబ్బరింతకు భూత
బృందంబుగుండియల్ పేటులెత్తఁ
బృథుహుంకృతులకు మూర్ఛిల్ల లోక మిదేమి
వచ్చెనో యని సురల్ బమ్మరిల్లఁ
గలఁగ మున్నీరు, రక్కసులు కూయిడ, నద్రి
కూటముల్ వగుల, దిక్కులు జ్వలింపఁ

గీ. దెగి నభము గూల ధాత్రి దిద్దిర భ్రమింప
నసమ లయకాల కా లాట్టహాసహాసి
ఖరనఖరశాతదంష్ట్రాప్రకాశచక్రి
మొలయఁ గనవచ్చె నారసింహోగ్రమూర్తి. 59.

క. కరవాలము శూలము భీ
కరదృక్ఫాలమ్ము దంష్ట్రికానఖరాంత
ర్భరితాసురాంత్రజాలము
నరసింహుఁడు మెఱవ యతి వణంకెఁ గలంకన్. 51.

శా. నాకంబున్ మహియున్ హరిద్వ్రతతి ఛిన్నాభిన్నమై కూల, ఘో
రాకారంబున మాఱుమ్రోగెడు నృసింహాట్టహాసధ్వని నాలించి చిం
తాకూలంకషచిత్తవృత్తు లయి తత్రత్యుల్ జనుల్ గాంచ రా
నాకాపాలికుఁడున్ యతీంద్రుఁడు నృసింహస్వామియున్ గానరాన్.

ఉ. భీతిలి కొంతసేపు పెదవిన్ గదలింపక చేష్ట దక్కియున్
జేతము సక్కఁజేసికొని జీవము లేనటు కూలి యున్న య
ప్పాతకిఁ జూచి "దేశికుని భంగమొనర్పఁగ వచ్చి నారసిం
హాతిరుషన్ మృతిన్ గనియెనా" యని యెన్నుచునుండి రంతలో.

ఉ. మానవపంచవక్త్రి సమక్షమునన్ బద మూఁది భిక్షుకే
శానుఁడు ధీరభావము ప్రసన్నతరార్థము నూఱ నంబుధా
రాసభమైన సూక్తిమధురస్ఫురణన్ గవితన్ నుతింపఁగాఁ
బూనె విశుద్ధసత్త్వమయబోధ మగాధముగాఁ గడల్కొనన్. 54.

సీ. అట్టహాసభయంకరాకార మేటికి
మందస్మితానన మిందుఁ జూపు
శతకోటిభానుదీధితి సంహరించి పూ
ర్ణేందుకోమలకాంతి విం దొనర్పు
తివిచి నెన్నొసటి తార్తీయీక నేత్రంబు
సదయశీతలకటాక్షములఁ గనుము
శితకఠోరసటావిజృంభణం బుడిచి ము
ఖేందుమరీచులై యొసఁగ నెఱపు
గీ. వైజయంతికతోడ శ్రీవత్సముద్ర
తోడ శ్రీకాంతతోడఁ గన్దోయి దనియ
శాంత మగు నీస్వరూప మచ్చముగఁ జూపు
మోడెదను జూడ దేవ నీవేఁడిరూపు. 55.

క. ఉపసంహరింపు కోపము
కృప ననుఁ గావంగదన్న కిల్బిషమతి వీఁ
డపగతచేతనుఁడై పడె
విపులాస్థలి, వీనిఁ బ్రోవవే తొలుదొల్తన్. 56.

క. నీరూపు సాత్త్వికం బఁట
ఘోరము క్రోధనము రూపుఁ గొనఁ దగునె? సుఖ
శ్రీ రేకెత్తె శమము గను
మా రా! హరి వయ్యు హరగుణాశ దగునొకో. 57.

గీ. ఎల్లభయముల నిను స్మరియింప నరుఁడు
వానిఁ బోనాడి సుఖ మొందు వైళ మనినఁ
గనుల నినుఁ గాంచు నిఁక నేమనఁగఁ గలదు
భవదవేక్షణమే దుర్లభమ్ము గాని. 58.

క. స్మరియించి భవచ్చరణాం
బురుహమ్ముల నెల్లవాఁడు ముక్తుం డగు నం
దురు, నినుఁ గని యాభైరవుఁ
డొరఁగెఁ స్మృతి దొఱఁగి వీని నోముట భరమే 59.

గీ. పితృకృతవ్యసనార్దితదితితనూజు
రక్షణ మొనర్ప సర్వాంతరాళగతుఁడ
వనుటఁ బ్రకటింపఁ దలఁచి కాదా నృసింహ
మూర్తివై వెల్వడితి కంబమున మహాత్మ! 60.

సీ. విశ్వమ్ము సృజియింతు వృతరజోగుణుఁడవై
చతురాననుం డనుసంజ్ఞ నెనసి
సృష్టి నంతయుఁ బ్రోతు శ్రితసత్త్వగుణుడవై
విష్ణుసంజ్ఞాప్రభవిష్ణు వగుచు
దాని హరింపఁగాఁ, బూని తమోగుణం
బలరెదు హరసమాహ్వయుఁడ వగుచు
జగదనుగ్రహబుద్ధి శర్వాదులై తోఁతు
గాక నీ కెవి పుట్టుకయు గుణములు
గీ. వాఙ్మనసదుర్లభంబు తావకపదం బ
టంచు నామ్నాయసూక్తి వెన్కంజవేసి
తెలుపఁగా నేర కెట్టులో తెలియఁ బలుకు
నట్టి నిను దేవ! తెలియఁగా నగునె మాకు. 61.

క. ప్రమథపిశాచకగుహ్యక
సముతియు నరహరి! త్వదాఖ్య శ్రవణము సోఁకన్
దెమలుదు రన రక్కసు లే
క్రమమున నీయెదుట నిలువఁగాఁగల రరయన్. 62.

ఉ. ఈవ జగంబు లెల్ల సృజియింపఁగఁ బెంపఁగ నాదికారణం
బీవ నియంత వౌదు నృహరీ! యనవద్యమనంబులన్ సదా
నీవ కదా విచింత్యుఁడవు, నిన్నునె చిన్మయు నాశ్రయింతు నీ
కావలుఁ డోడె, వీఁడు మలుకన్, మహి కిమ్మ భయమ్ము గమ్మునన్.

చ. జగములు కోరుచుండె నిను శాంతిలు మంచు భవత్కృపాతినూ
రగులకుఁ గోటిశంపలతెఱంగున వెల్గెడు నిట్టిరూపు చూ
డఁగఁ దర మౌనె? వేగమె యడంపకయున్న నశించిపోవు ము
జ్జగ, ముడిగించి కోపము ప్రసన్నుఁడవై ననుఁ బ్రోవు మోహరీ!

మ. సమయం జేయుత నామహాకలుషముల్ సంవర్తకాలోద్ధత
ప్రమథాధీశలలాటపావకశిఖాపాపచ్యమానత్రిలో
కమిళద్ఘోరపటత్పటధ్వనిసదృక్షుం బౌనృసింహాట్టహా
సము బ్రహ్మాండఘటోదరభ్రమణనాశస్వానమై యొప్పఁటన్. 65.

సీ. అనద్ధవాతంధయగుణమంథానసం
క్షుబ్ధాబ్ధికల్లోలసుహృద మగుచుఁ
బ్రళయనిర్ణిద్రరుద్రప్రోచ్ఛ్రుతరహత
డమరుకధ్వానలుంటాక మగుచుఁ
గల్పాంతజృంభితానల్పాంబుదస్ఫూర్జ
దురువజ్రగర్వసంహారణ మగుచుఁ
నాదిఘోణీంద్రఘోణాతిస్యదోద్గత
ఘుర్ఘురనిర్ఘోషఘోర మగుచుఁ

గీ. బ్రహ్మాండకటాహవిపాటనచణ
కర్ణఘోరధ్వనిస్ఫూర్తినిర్ణిరోధ
మైన శ్రీనరసింహాట్టహాస మస్త్ర
దనవధికపాపసంఘాత మడఁచుఁగాత. 66.

క. అని భక్త్యావేశంబునఁ
గనుఁగవ నానందబాష్పకణములు జాలై
తనువును ముంపఁగ మ్రాన్పడి
కనుఁగొను చుండంగ నానృకంఠీరవుఁడున్. 67.

చ. క్రమముగ వాలి జూలు, నలికస్థలనేత్రము, వక్రదంష్ట్ర, లు
గ్రము లగు పంచశాఖనఖరంబులుఁ, గన్నులకెంపు, నట్టహా
సమును, బఱయోదలీన మగుచంచల ఱట్టు లణంగి పోవ రూ
పమునను బ్రహ్మపాదుఁ డయి భాసిలె నెల్లరు వెల్లఁ బాఱఁగన్. 68.

ఉ. కాలును గేలు గూర్చుకొని కంఠము శోషిలఁ గ్రుక్కవేయుఁగాఁ
జాలమిఁ గుందుచున్ బవనచాలనలాలన శుష్కనాసికా
పాళిఁ గదల్చుచున్ గనులపాప లణంగమి కుబ్బు గొంచుఁ గా
పాలికుఁ డల్లలేచి నలువంకఁ గనుంగొన సాగె వెఱ్ఱి నాన్. 69.

క. 'నరహరి యెటు కనుమొఱఁగితి
కరుణను దర్శన మొసంగి కావుము నీతీ
వ్రిరుపాప్రసాదములు పయిఁ
బఱచుట నేఁ డిచటఁ జచ్చి బ్రదికితి దేవా.' 70.

క. అని పేరెలుఁగున నుడువుచుఁ
జని శంకరదేశికాంఘ్రిసరసీజమ్ముల్
కనుఁగవకు నద్దికొని శిర
మునఁ బూనిచి ముద్దువెట్టి మ్రొక్కి వచించున్. 71.

ఉ. చేసిన తప్పు చెప్పుకొనఁ జెల్లు నటందురుగాదె నిన్ను సం
న్యాసిని సంహరించి మహి నాస్తికవాదము నుద్ధరించు పే
రాసను వచ్చి మాయ నుసులాడి యలీక మొనర్తుఁ గాని కై
లాసవిభుండ వీ వని తలంపన యెంతటి పాపజీవినో. 72.

శా. శూలం బూని భవచ్ఛిరోపహరణౌత్సుక్యంబునన్ వచ్చి యా
లీలకేసరిమూర్తి వైనవనమాలిన్ గంటి మోక్షేందిరా
లాలిత్యంబును జూడఁగాంటిని జగల్లాభఘ్నుండ నౌసిమనో
లీలల్ గా కఘముల్ దొఱంగి శుభముల్ సిద్ధించునే పాపికిన్.73.

మ తలలన్ బోడు లొనర్చి కావులును గంతల్ దాల్చి భిక్షాన్నభు
క్తులకై గేస్తులఁ బీడవెట్టుచు విరక్తుల్ గాని వేదాంతు లీ
యిలఁ బెంపెక్కిరి వీరిఁ జక్కడఁచుటే యిష్టార్థ మన్బుద్ధి మా
యల వంచింపఁగ వచ్చి నీమహిమఁ దత్త్వార్థంబు వీక్షించితిన్.74.

క. క్రూరుఁడ గాపాలికమత
చారుఁడ నద్వయమతాభిచారుఁడఁ బాపా
చారుఁడఁ జారుఁడఁ జోరుఁడ
భీరుఁడ నీకడను గప్పిపెట్టుట మేలా. 75.

ఉ. తప్పుల నొప్పుకొంటి నిదె దాసుఁడ నైతి శిరం బొసంగ నీ
వొప్పిన యప్పుడే నెఱుఁగకుంటి భవన్మహిమంబు; కన్నులం
గప్పినచిమ్మచీఁకటు లణంగె నృసింహమహోనిరీక్షచే
నిప్పు డెఱింగితిన్ నృహరి యీవు నొకండె యటంచు దేవరా!76,

క. అపరాధము క్షమియింపుము
కపటాత్ముని నన్ను శుద్ధుఁగా శిష్యునిఁగా
నెప మెన్నక నొనరిచి భవ
విపులాబ్ధిఁ దరింపఁ జేయవే నాతండ్రీ. 76.

మ. అని వల్కోడు నిరంతరాశ్రిల యతీంద్రాంఘ్రిద్వయీ క్షాళనం
బును గావించి స్వపాపకృత్యపరితప్తుం డైన కాపాలికుం
దన కేలన్ సాఁచి యతీంద్రుఁ డెత్తి చెవి నద్వైతార్థముం జెప్పఁ దో
డనె వాఁ డొప్పె యతీంద్రుఁడై, భ్రమరకీటం బట్లు తద్భావనన్. 78.

క. అంతట నాతఁడు కలలో
వింతలు గని మేలుకొన్న విధమునఁ గనులం
తంతలుగ విచ్చి యూర్చుచు
వంతలు దిగఁద్రావి యిటు స్తవం బొనరించెన్. 79.

సీ. పొందితోఁ గైలాసమునకుఁ బోవ నిజోత్త
మాంగ మొసంగు మం చడుగువేళ
నేకతంబునఁ గేల భీకరశూల మం
కించి దునుముటకు నుంకించువేళ
నాభీలనారసింహాట్టహాసవిదీర్ణ
హృదయమై యిల మేను చెదరువేళ
శరణన్నమాత్ర నాదురితంబు మఱచి య
ద్వైతామృత మొసంగి తనుపువేళ
గీ. నొక్కవిధమునఁ గన్పట్టుచుంటి నీకు
లే దహంకారమమకారలేశములు వి
దూరితద్వంద్వ! త్రిజగదుద్ధారకావ
తార! యుష్మచ్చరిత్ర మత్యద్భుతమ్ము.

గీ. అనుచుఁ గొండాడి గురునికటాత్తు మొంది
వాఁ డలరుచుండ నప్పద్మపాదుఁ గని ప్ర
సాదితు నొనర్చి తెట్లు ప్రహ్లాదవశ్యు
ననెడు శిష్యుల కిటు తెల్పె నాచరిత్ర. 81.

ఉ. మ న్నొకయప్పు డేను దపముం బచరింప నహోబిలాద్రియం
దున్న యగణ్యపుణ్యవన మొక్కటి సొచ్చి యనేకఘస్రముల్
తిన్ననిభక్తిఁ గొల్చితిని దేవు నృసింహుని భక్తవశ్యు నా
కన్నులఁ గాంచఁ గోరి కుతుకం బతిమాత్రముగాఁగ రేవగల్. 82.

క. అంత నొకనాఁడు తమి నా
చెంతకు నరుదెంచె బోయశిశు వొక్కం డ
త్యంతాద్భుతరసకాంత
స్వాంతుండై యిట్టు లడిగె సవినయఫణితిన్.

ఆ. కాన నేల యొంటిగా నుంటి వో యయ్య
యేల మాట మాని జాలిపడెద?
వని యమాయికోక్తి నతిమూఢభక్తి న
న్నడుగ నిట్టు లంటి నలఁతి నగుచు. 84.

క. ఆకంఠ మ్మద్భుతమును
జాకృతి, కంఠీరవాత్మ మవులఁ గలమెకం
బీకాన నుంట విని నే
నై కొనఁగా వెదకుచుంటి నగపడ కుండెన్. 85.

క. అని యుంటినో లేదో య
వ్వనేచరార్భకుఁడు కాన వడిఁ జొచ్చి లతా
వినిబద్ధుఁ జేసి నరహరిఁ
గొని తెచ్చెఁ గనుంగొనఁగ నకుంఠితభక్తిన్. 86.

గీ. యతుల యతులభక్తిలతలకుఁ జిక్కక
మతుల కైతల ముంచుమాయలాఁడు
నేఁడు చెంచుబుడుత నెఱిఁ గట్టువనలతా
వితతిఁ జిక్కి చూచు వెఱ్ఱిపోలె.

క. అనుకొనుచు లేచి సాష్టాం
గనతులఁ గావించి మునిని కాయంబుమనో
వనజముల కగమ్యుఁడ వి
వ్వనచరునకుఁ జిక్కి తెట్లు పరమాద్భుత మా. 88.

గీ. అంచు నేఁ బల్క విని హసించు మొగము
తోడ నొడివెను నరమృగేంద్రుండు వీని
యట్లు బ్రహ్మాదులైన నేకాగ్రచిత్త
మమర ధ్యానింపలే రొక్కపైడ నన్ను. 89.

ఉ. చెంచులు చెంచితల్ విపినసీమలఁ బాడెడు నానావిలాస మూ
లించి శిశుత్వ మాది యాదలీకృతి మానసమందు నన్ను బం
ధించి 'వశంవదుండ నయితిన్ వర మిమ్ము' సనన్ హసించుచున్
లంచము లేల నాకుఁ గరుణామయ! యన్న నిరీహుఁ డారయన్. 90.

శా. ఆనాఁ డాదిగ సర్వకాలముల సర్వావస్థలం జిత్తముం
దీనామూర్తినె నిల్పి 'రమ్మనిన రమ్మిమ్మ పొమ్మనన్ బో' మ్మటం
చానందంబునఁ జెంచులక్ష్మి మును నన్నట్టి యాపల్కులన్
గానం బీతఁ డొనర్ప సామునిగమోద్గానంబులై సోలుదున్. 91.

క. 'రమ్మన్న రమ్ము, పొమ్మనఁ
బో' మ్మని స్వాధీనపతిక పోలిక[illegible]
శమ్ముగఁ బాడఁగ వీనిప
ర మిక్కడె యని పచ్చి పోదు రాత్రిందివముల్. 92.

శా. అధ్యర్థాబ్దముగా మదాకృతి [illegible]ధ్యానాక్రియన్ గొల్తు, బ్ర
హ్మధ్యానాత్ముఁడ వైన దొక్కక్షణమే నం దున్నదే? నేఁడుగా
నా ధ్యాతవ్యు నెఱుంగఁజాలితి కిరాతాలాపమూలంబుగా
నధ్యగ్రంబునఁ దోన సల్పనె? యటం చత్యగ్రితుం డౌటయున్. 93.

చ. అకట! వివేకశూన్య శబరాత్మజ చిత్తవిశుద్ధిలేశ మ
బ్బక యిటు భ్రష్టనైతి నని భావమునన్ వగ నొంద నోడకో
డకు రిపునిట్లు గల్గిన యెడన్ నినుఁ జేరెద నంచు నభ్రవా
క్యొకటి వినంగనైన మది నూఱడి కొల్తు నృసింహు సర్వదా. 94.

గీ. ఒజ్జకును నాకు నెప్డు దభేదోపచార
మగుట నమ్మహితుని జంప నరుగుదెంచు
రిపుని శిక్షించి జగ ముద్ధరించె దేవుఁ
డందఱము ధన్యులము దక్కెనయ్య గురుఁడు. 95.

గీ. ఈచరిత్ర త్రిసంధ్యమ్ము నెవఁడు చదువు
విను నెవం డాతఁ డపమృత్యువును దరించి
భక్తుఁడై భుక్తభోగుఁడై ముక్తి నెనయు
ననిన ముద మంది రందఱా హరిఁ దలంచి. 96.

క. శ్రీనరసింహావిచిత్రక
థానక సంశ్రవణజాత తన్మయతా ము
ద్రానిరతిఁ దచ్ఛుభాహ్వాయ
గానమ్ముల నెల్ల రాడఁగాఁ దొడఁగి రొగిన్. 97.

గీ. అంత నొకనాఁడు సహశిష్యుఁడై యతీంద్రుఁ
డఖిలతీర్థమ్ములఁ జరించు చప్రధృష్య
మైన కలినుండి ధర్మమ్ము నరయు చుదధి
తటిఁ దనర్చు గోకర్ణతీర్థమున కరిగె. 98.

ఉ. హాటకగర్భకైటభనిశాటవిపాటనవందితున్ జగ
న్నాటకసూత్రధారు లలనాకలనార్ధశరీరునిన్ సము

చ్ఛాటితకామలోభముఖశాత్రవజృంభణు వైదికాధ్వశ్రేం
గాటకు శ్రీమహేశుఁ గనుగంటను గాంచి నుతించె నీక్రియన్. 99.

గీ. జలధరాద్వైతవక్త్రలక్ష్ములను నొక్క-
చక్క, నొకటఁ దటిల్లతాసాధితాంబు
దావినాభావసంప్రదాయమును జాటు
చున్న మన్మథరిపుమూర్తి సన్నుతింతు. 100

క. వలకేలికురంగము డా
పలిమెయి డాల్ గఱికఁ గొఱుకఁ బఱవ, నెడమచేఁ
గల శుకి వరియె న్నని వల
పలిడాల్ తినఁ బఱవ వెలుఁగు భాసము నేనే. 101.

క. అంబాగళమంగళసూ
త్రంబే యుద్గళమునం గరాళవిష మసా
రంబుగఁ జేసెనో యాభూ
మంబున నైక్యానుభావమహితుఁడ నైతిన్ 102.

గీ. అని గుణత్రయాతీతమహార్షి జనవి
భావ్య గోకర్ణపతి వచఃప్రసవములను
బూజలొనరించి సుఖమునఁ బుచ్చె మూఁడు
రాత్రులు జగత్పవిత్ర తత్క్షేత్రమందు. 103.

ఆ. అంత వేగఁ జేరె హరిశంకరాఖ్యాది
వ్యస్థలము యతీంద్రుఁ డద్ది భక్త
పాపహారకముగ వైకుంఠకైలాస
పురవిసర్గభూతముగ నెఱింగి. 104.

గీ. అఖిలభేదవాదులభ్రమలు లడఁచి పుచ్చఁ
దలఁచి యద్వైతముద్రాప్రదర్శకు లయి

మించు హరిశంకరులను బూజించి యతఁడు
ద్వ్యర్థ మగుసూక్తితతి నిట్లు లభినుతించె. 105.

హరిహరస్తుతి.

గీ. *విమలసోమకలావిలాసమును వంద్య
మైనమైనమహం బూని యయ్యనాది
1. గోసమాకర్షియై జగద్గోప్త యగు వి
భుం డొసంగుతం గుశల మెప్పుడును నాకు. 106.

క. గిరిలీలోచితదేహ
స్ఫురణమహామందరాగమును దాల్చి సుధన్
2. సురల కొసఁగ నవిషాదిగ
వరలెడు దైవతము కరుణ వాంఛింతు నెదన్. 107.

---

* 'విమల' యను పద్యము మొదలుకొని పది పద్యములందు విష్ణుద
శావతారములను శివుని శ్లేషముచే స్తుతించుట

1. మత్స్యావతారము:— విమల = మిక్కిలి పాపము గలవాఁడగు, సోమక = సో
మకుఁ డను రాక్షసునకు, లావి = నాశకమగు, లాసము = క్రీడయును, మైనమ
హము = మీనసంబంధమగు తేజమును, ఊని = పొంది, అనాదిగో = పురాతన
వాక్కు లగువేదములను, సమాకర్షి = ఆకర్షించినవాఁడు —
శివపక్షమున:— విమల, సోమ, కలా, విలాసము = స్వచ్ఛ మగుచంద్రకళయొక్క
సొగసును, మైనమహము = మేనాపత్యమగు తేజము,అనఁగాఁ బార్వతిని, ఊని=
గ్రహించి, అనాదిగో= పురాతనవృషభమును = సమాకర్షి = ఆకర్షించినవాఁడు.
2 కూర్మపక్షము:— గిరిలీలోచితదేహస్ఫురణన్ = గిరియొక్క భ్రమణమునకు తగిన
దేహముయొక్క స్ఫూర్తితో, మహామందరాగమున్ = గొప్పదగుమందరగిరిని,
దాల్చి, సురలకుసుధ నొసఁగన్, అవిషాదిగ = విషాదము లేనివాఁడుగ, వరలెడు=
ప్రకాశించు, దైవతము.
శివపక్షము.— గిరి = కైలాసమందలి, లీలా = క్రీడకు, ఉచిత = తగిన, దేహస్ఫుర
ణన్=దేహస్ఫూర్తితో, మహ=ఉత్సవమునందు (దేవతలది), అమంద=హె
చ్చైన, రాగమును = ప్రేమమును, దాల్చి, సురలకున్ = దేవతలకు, సుధన్=
అమృతమును, ఒసఁగన = ఇచ్చుటకే, విషాదిగన్ = హాలాహలభక్షకుఁడై, వర
లెడు=ప్రకాశించు— దైవతము అని.

క. మహిమానసముల్లాసకుఁ
డహహా వరాహీశతనుసమంచితుఁ డాద్యుం
3. డిహపరసుఖమందు దేవుం
డహరహ మేలుత మదర్పితాంజలిఁ గొనుచున్. 108.

గీ. సటలపెంజాలు మెఱయ నస్వప్నరిపుమ
తంగజముఁ గూల్చి యుల్లాసితమ్ముగాఁగఁ
4. జేర్చు ప్రహ్రాదరేఖ నొనర్చు నలపు
రాణపంచాస్యుఁ డగుదేవుఁ బ్రస్తుతింతు. 109

గీ. ప్రథితనవదక్షు బల్యాహరణదృఢేచ్ఛ
ధృతి నజిన మూని వామనాకృతిని వాల్చి

---

3. వరాహపక్షము:— మహి = భూదేవియొక్క, మాన = చిత్తసమున్నతిని, సముల్లాసకుఁడు=తొలగించువాడు, వరాహీ + ఈశ = సూకరీభర్త. అట్టిసూకరముయొక్క, తను=శరీరముచే. అంచితుఁడు=పూజ్యుఁడు.

శివపక్షమున:— మహిమానన్=మహిమయున, గొప్పతనముచే. సముల్లాసకుఁడు=తాండవముచేయువాడు. వర = శ్రేష్ఠమగు, అహీశతను = పాఁపఱేనిమేనిచే, అంచితుఁడు=కూడినవాఁడు.

4. నృసింహపక్షము:— సట=జూలయొక్క, పెంజాలు=పెద్దగుంపు. మెఱయన్-అస్వప్నరిపు మతంగజమున్=రాక్షసశ్రేష్ఠుఁడగుహిరణ్యకశిపుని, కూల్చి, ప్రహ్రాదరేఖ=ప్రహ్లాదునిరూపు- (రలయోరభేదః) ఉల్లాసితముగాఁగన్=ప్రకటనమగునట్లు-పురాణపంచాస్యుఁడు=పురాతనసింహము.

శివపక్షము:— సటలపెంజాలు=జటలయందలిపెద్దనది, మెఱయన్-అస్వప్నరిపు=రాక్షసుఁడైన, మతంగజము=ఏనుగుఁను. అనఁగా గజాసురుని, గూల్చి, ప్రహ్రాదరేఖ=పెద్దధ్వనియొక్కరూపు.

5. వామనపక్షము:— ప్రథితసవ=ప్రసిద్ధయాగమున, దక్ష=సమర్థుఁడగు, బలి=బలియొక్క, ఆహరణ=హరించుటయందు, దృఢేచ్ఛన్ = దృఢమగు నిచ్ఛచే, కాంతార, హితుఁడు=వనవాసముగోరినవాఁడు, ఆశ్రమిజనతకు, ఆనాల్గాశ్రమములజనులకు, ఆద్యుఁడు=ప్రథముఁడగు బ్రహ్మచారి.

5. బియును గాంతారహితుఁడై విశిష్టతపము
సలుపు నాశ్రయించినవాద్యుఁ డీశుఁడుఁ గాచు. 110.

గీ. కరధృతోలసన్మహాఖండపరశు వయిక
నత్తపఃకృతవీర్యనందనుని నర్జు
6. నాఖ్యు నోర్చి నక్షత్రేశ్వరావతంస
విస్ఫురణుఁడైనవే లోపము విడక నన్ను.

ఉ. నా కమితాత్మశర్మకలనంబు దయామయుఁడై ఘటించు నా
ళీకభవోగ్రతేజమున లీల రతిప్రియు దుర్దశాననుం
బోకడవెట్టు విక్రమధనుం డగు జోదు. ధరాత్మజాకుచో
7. న్మైకకరాహస్తసాక్షి యయినట్టి రసజ్ఞుఁడు దేవుఁ డెప్పుడున్. 112.

శివపక్షమున:— ప్రఘతసవ = ప్రకటింపఁబడె యాగముగల, దక్ష = దక్షునివలన, బలి = బలిని. ఆహరణ = గ్రహించుటయందు, దృఢేచ్ఛన్ = గొప్ప యిచ్ఛచేత, వామన్ = భామను-భార్యను, ఆకృతిన్ = శరీరమున, తాలిచియును = ధరించియును, కాంతారహితుఁడు = కాంతతో రహితుడు (విరోధము)

6. పరశురామపక్షము:— కరధృత = చేత ధరింపఁబడిన, లసత్ = పదనుగల, మహా = పెద్దదియు, అఖండ = పూర్ణమగు, (మహా= ఉత్సవముల చే, అఖండ= పూర్ణమైనది) పరశువు = గొడ్డలికలవాడు, కనత్తపః = మెఱయు తపస్సుగల, కృతవీర్యనందను, నర్జునున్ = కార్తవీర్యార్జునునిని, ఓర్చి=ఓడించి, న, క్షత్రేశ్వరావతంస, విస్ఫురణములేనివాడు.

శివపక్షమున:-చేఁబూనఁబడిన గొప్పఖండపరశుకలవాఁడు, కనత్తపఃకృత= మెఱయు తపస్సులనఁజేయఁబడిన, వీర్య = శౌర్యముచే, నందనున్ = ఆనఁదించునట్టి. అర్జునున్ = ఓర్చి. నక్షత్రేశ్వర = చంద్రరూప మగు అవతంస = శిరోభూషణముయొక్క, విస్ఫురణుఁడు = ప్రకాశముగలవాఁడు.

7. రామపక్షము:— నాళీకభవ = బ్రహ్మ (అస్త్రము) సంబధమైన, ఉగ్రతేజమునన్ = భయంకరతేజముచే, రతిప్రియున్ = కాంతాసంభోగేచ్ఛువగు, దుర్దశాననున్ = దుష్టుఁడగురావణుని, ధరాత్మజ = భూపుత్రి యగుసీత

శివపక్షము:— అళీకభవ = అలికముసఁ బుట్టిన, ఉగ్రతేజమునన్ = అగ్నిచే అళికమునకు రూపాంతరము అళీకము, తత్సంబంధమైనది అళీకము, అగుపుట్టువు గలది అళీకభవము— ధర = కొండయొక్క, ఆత్మజ = కూఁతురగుపార్వతి.

మ. అవదాతస్థిరధర్మమూర్తి యగుచున్ హాలాహలస్వీకృతి
ప్రవణోదగ్రగళంబు రాజిల వృషావష్టంభకోత్తాలకే
తువు భాసిల్లఁగ, రోహిణీరమణుఁ డెంతో ప్రేమ ముద్దాడు మా
8. శివిరాజిల్లెడు దైవతము పాలించున్ ననున్ సర్వదా. 113.

గీ. పరఁగ నాకలితాహితాపముగ నంక
సీమను వినాయకుండు వసింప నుల్ల
9. సిలుచుఁ బూతనామోహాకచిత్తవృత్తి
యా కలాప కలాపుఁడు నాకు దిక్కు. 114.

---

8. బలరామపక్షము:— అవదాత = తెల్లని, స్థిరధర్మ = చలింపని ధర్మముగల, మూర్తి = మేనుగలవాడు, హాల = కల్లును, హల = నాఁగటిని, స్వీకృతి = గ్రహించుటయందు, ప్రవణ, ఉదగ్ర = మీఁదియగ్రముగల, గళము=కంఠము, రాజిలన్, వృష = ధర్మము, అవష్టంభక = ఆధారముగాఁగల, ఉత్తాల = పెద్ద తాళవృక్షము అనెడు కేతువు. రోహిణీరమణుఁడు = వసుదేవుఁడు, ముద్దాడు మాళి; విరాజిల్లన్.

శివపక్షమున:— హాలాహల = కాలకూటముయొక్క, స్వీకృతి,-వృష = వృషభ మునకు, అవష్టంభక = అవలంబమైనదియు, ఉత్తాల = ఎత్తైన- రోహిణీరమ ణుఁడు = చంద్రుడు.

9. కృష్ణపక్షము:— అంకసీమను = సమీపస్థలిని, ఆకలిత = కలిగింపఁబడిన, అహి తాపంబుగన్ = పాములకు బాధకలుగునట్లుగ, వినాయకుఁడు = పక్షీంద్రుఁడు వసింపన్, పూతనకు మోహముకలిగించు మనోవ్యాపారము గలవాఁడై.

శివపక్షము:— ఆకలిత = తొండముచేఁ దాల్పఁబడిన, అహిత=శివశిరసున నున్న, ఆపము=గంగోదకము కలుగునట్లుగా, వినాయకుఁడు, అంకసీమను, ఒడియందు, వసింపఁగా, పూత=పవిత్రమగు, నామ=నామమును, ఊహక=ధ్యానించువారి, చిత్త=చిత్తములందే, వృత్తి=వర్తనముగలవాడు, కలాప=చంద్రుఁడు-కలాపుఁడు- భూషణముగా కలవాఁడు.

క. సర్వజ్ఞభావుఁ గరుణా
ఖర్వుని మారారిఁ గ్రతువిఘాతుకకృతపూ
10. జోర్వాదరు బోధనిధిని
నిర్వృతిప్రదున్ బరాత్మునిన్ స్మరియింతున్. 115.

క. జనముల చేతోవిషయం
బును దాఁటి వెలుంగునది, తమోహారకమున్
11. గనఁగ సదావాసవిధృత
మనమును నా భూమమునకు మఱిమఱి వినతుల్. 116.

వ. అని భక్తిరసావిష్టచేతస్కుండై. 117.

క. మోచాఫలరుచిసూచక
వాచాఫణితుల వృషాకపాయీశులకున్
వాచంయమనుఁ డర్చన లిడి
వే చని మాకాంబికానివేశమ్మునకున్. 118.

శంకరుఁడు మృతుఁ డగుబాలుని బ్రతికించుట.

ఉ. అచ్చట నొక్కెడన్ సుతు గతాసువు నంకమునఁ జేర్చి సారెకున్
హెచ్చిలు వంతఁ గుందెడు తదేకతనూజులు విప్రదంపతుల్

---

10. బుద్ధపక్షమున:— సర్వజ్ఞుఁడు, మారజిత్తు, బుద్ధుని నామములు, క్రతువిఘాతుకు లొనర్చు పూజలయందు గొప్ప ఆదరముకలవాడు.

శివపక్షమున:— క్రతువిఘాతుక=వీరభద్రుని, పూజ=పూజయందు, ఉరుఆదర=పెద్దఆదరముకలవాడు.

11. కల్కి-పక్షము:—సదావాస-సత్యయుగమందు, కృతయుగమందలి, ఆవాస-నివాసమందు, విధృత - ధరింపఁబడిన, మనము - అభిప్రాయముగలది.

శివపక్షము:— సత్ - సత్పురుషులయొక్క, ఆవాస - నివాసములయందు, లేక సత్ - ఉత్తములందు, ఆవాస - ఉనికి.

సచ్చరితుల్ గనంబడఁగ శంకరుఁడుఁ గరుణాళు వౌటఁ దా
నొచ్చిన మానసంబునఁ గనుంగొని వారల; దూలె జాలిమై. 119.

ఆ. అటుల కుందుచుండ నాకాశవాణి వి
నంగనయ్యె 'రక్షణంబు సేయఁ
జాలనట్టి నరు దయాళుత్వ మెంతయు
దుఃఖమునకె యౌను దుది' కటంచు. 120.

క. అశరీరవాణి విని య
వ్వాశి యనె 'నీమాట నిక్కువము ముజ్జగముఁ
గుశలమున మనుపఁ జాలిన
కుశలున కొకనికె సుమి తగుఁ దయ సూపఁగ'. 121.

ఆ. అని యతీంద్రుఁ డన క్షణాంతరమందె సు
ప్రోత్థితాకృతిని ద్విజోత్తమాత్మ
భవుఁడు లేవ నచటి ప్రజలు సార్వజనీన
తచ్చరిత్ర కద్భుతంబు గనిరి. 122.

వ. అటుల కర్తృతారాహిత్యమును భూతదయాపరతయుఁ బ్రకటించి యాజనపదంబున నొక్కెడ.

మూకాంబాస్తవము.

క. సాలకృతమాలతాలర
సాలతమాలాది సాలశాల్యుపశల్య
శ్రీలము సొచ్చెను మూకాం
బాలయ మఖిలార్థసిద్ధి కది తా వగుటఁ. 124.

గీ. చొచ్చి యుచ్చావచానందజోచ్చబాష్ప
ముగ సముద్గీర్ణరోమాంచముగ నుదార

భక్తిఁ గరుణావలంబ నంబను నుతించె
నాగమాద్వైతములకు నైక్యము ఘటిల్ల. 125.

దండకము:— శ్రీమజ్జగన్మాత! సామాగమోద్గీయమానానుభావా
తిలోకోద్భవోపేత! యుష్మద్యశశ్శ్యాంతరాలక్షితజ్ఞానదీపాయి
తా! శీతశైలేంద్రసంజాత! మాతా! భవద్దివ్యమాహాత్మ్య మగ్గింపఁ
గా వేదవేదాంతరాసుల్ పురాణంబులున్ సర్వశాస్త్రంబులున్ జాల
వంచెంచ నస్మాదృశుం డల్పబుద్ధిన్ దలంపన్ సమర్థుండె? తల్లీ! మి
తోక్తిన్ నుతింపం బ్రవీణుండె? యాదిత్యసంస్తుత్యనిస్తుల్యచారిత్ర!
పారేపరార్థమ్మగా వెల్గు నీపాదకంజాతసంజాతభాస్సంచయంబందు
మన్నారుపైనార్పదుల్ దీధితుల్ పావకార్కేందులన్ జొచ్చి యా
వజ్జగచ్చక్ర మాలోకవంతంబుగా లీలఁ గావించు విశ్వోదయైకప్ర
సూ! చిత్తవీథిన్ మహాభాగు లొకొందఱావాహనాద్యంబు లౌత
చ్చతుష్షష్టిరాజోపచారంబులన్ బూన్చి దివ్యాఽపటీదానపూ
ర్వంబు త్వత్పూజఁ గావింతురు ధన్యాత్మ! సౌజన్యసమ్మాన్యు లౌ
కొందఱేతచ్చతుష్షష్టిసంఖ్యోపచారంబులం దొక్కఁ డొక్కండె
కొంచున్ విశుద్ధాఖ్య నాజ్ఞాఖ్యఁ జెన్నొందు చక్రద్వయిన్ దోఁచు
పద్మంబు సద్మంబుగా వెల్గు ని న్నన్వయానంద మబ్బంగఁ బూ
జింతురు సంశుద్ధిదం బంచుఁ గాత్యాయనీ! ప్రాకృతుల్ మర్త్యలో
క్కం డొనర్తు ర్బహిష్పూజనే; మధ్యముల్ గొంద ఱంతర్బహిః
పూజఁ గావింతురొకం డుత్తముల్ గూర్తు రంతస్సపర్యైకమాత్రం;
బాకం డుత్తమోత్తంసు లిచ్చన్ ద్వదైక్యానుభూత్యేకలగ్నా
త్ములై యుండి యేపూజయున్ జేయమెనే చేయ రోయంబ!
లంబాలకా! నీలకాదంబినీడంబరాలంబ తన్వంగి! దీపించు నష్టోత్త
రత్రింశతిప్రఖ్య మాతృకాలావాటిలో మేటి యాబోధినీముఖ్య
చంచత్కలాపంచకమ్మందు వెల్గొందు యుష్మత్పదాంభోజముల్
పండితుల్ భక్తిఁ బూజింతురు కళ్యాణి!

కల్పాంతకాలాగ్నిరూపంబునన్ నీవ లోకంబులం గాల్చి పీయూషరూపంబునన్ వహ్నిఁ జల్లార్చి, యవ్వాని సృష్టించి, చంచత్సుధామూర్తివై పెంచు దీవే యటంచున్ నినున్ ధ్యానమున్ సల్పువా రౌదు రీసృష్టికెల్లన్ స్వయంకర్త్రులో యమ్మ! బ్రహ్మాండభాండోదరీ! భవ్యశాతోదరీ! దేశికోక్తిప్రభావమ్మునన్ మున్న తాఁ గన్నయానిన్నె 'సైవాహ మస్మీ'తి భావంబునన్ బ్రత్యభిజ్ఞానలక్ష్యంబుఁ గావించుకో నేర్చువారే కదా ప్రత్యభిజ్ఞామతాంతర్గవిజ్ఞాతలై ధన్యతన్ మించువా రంబరో! యైహికంబైన భోగమ్ములం బొందఁ గాంక్షించి యాధారచక్రంబునం దుత్తరం బౌ నధిష్ఠానచక్రంబునందున్ నినుం గాంచి యారాధనన్ జేయువారున్ మణీపూరకంబందు నిన్నుం గనుంగొం చుపాసించువారున్ భవత్పట్టనప్రాంతసీమాంతవాసంబునే కందు రో దేవి! నిన్నున్ శ్రితానాహతాభిఖ్యచక్రన్ భజింతెవ్వ రవ్వారు త్వత్పట్టణాంతర్నివాసంబు గైకొందు రో గౌరీ! విశుద్ధాఖ్యచక్రస్థితన్ నిన్నుఁ గన్గొన్నవారల్ త్వదీయంబు సామీప్యమున్ గాంతు, రాజ్ఞాఖ్యచక్రంబు నందున్న నిన్నర్చనల్ సేయువారల్ భవత్సామ్యముం గాంతు, రాపైధ్రువాభిఖ్య నేపా సహస్రారపద్మంబునం గర్ణికాసీనఁగా నిన్ను వీక్షించి యొయ్యం జతూరీతికైక్యానుభూత్యస్తతాపత్రయుం డైన యాసాధకేంద్రుం డొకొక్కండు సాయుజ్యమున్ జెందు వందారుబృందారకాపీడసందీపితామందరత్నప్రభాబృంద సిందూరితాత్మీయపాదారవిందా! చిదానందసద్వల్లికాకంద!

తొల్దొల్త నాసాధకేంద్రుండు శ్రీచక్రషట్చక్రకైక్యంబు భావించి యామీఁదఁ జక్రేశునకున్ నీకు నేకత్వ మీక్షించి, మంత్రీనకున్ నీకభేదంబు వీక్షించి, ధ్యాసించి ధ్యానించి నీతో నభిన్నత్వముం గాంచు నంచున్ సమస్తాగమంబుల్ ప్రపంచింప మాహాత్మ్య మీ కేడు లోకంబు లింపారఁగా నేలు శ్రీరాజ్ఞి! యద్వైతసి

ద్ధాంతసమ్రాజ్యసింహాసనాసీన! శ్రీశ్యామలాకార! మూకాంబికా
రూపకామేశ్వరీ! కామితార్థప్రదాత్రీ! నమస్తే నమస్తే నమః. 126.

క. అని వాక్పూజల మూకాం
బను గొల్చి యతండు భైక్షభక్తమునన తు
ష్టిని గనుచుఁ గడపెఁ గొన్నా
ళ్లనయము సాధకులు తనమహత్త్వము పొగడన్. 127.

వ. అనంతరంబ. 128.

సీ. హుతపయస్స్వేద్ధాగ్నిహోత్రనిరతపావ
నామోద మనుగేహ మల్లుకొనఁగఁ
నిజకర్మనిరతసద్ద్విజులఁ గన్గొని యప
మృత్యు వబ్బుచు వెలికేఁగి బ్రతుక
ద్వసహస్రసంఖ్యశ్రుతిశ్రుతిపాఠకు,
లాహితాగ్నులు పొలుపారుచుండ
శ్రౌతరహస్యవిజ్ఞాత లౌ నార్త్విజీ
నవిధానచతురు లెందఱొ వసింప
గీ. మధ్యనివసదుమానాథమండిత మయి
యలరు శ్రీబలినామాగ్రహారమునకుఁ
జనియె మూకాంబికానివాసమును వీడి
శమధనుఁడు శంకరుండు సచ్ఛాత్రకముగ. 129.

హస్తామలక చరిత్రము.

మ. కలఁ డాబ్రహ్మపురిన్ బ్రభాకరుఁ డనంగా సర్వశాస్త్రార్థతుం
దిలధీశాలి, ప్రవృత్తిశాస్త్రకలనాధీనుఁడు విప్రుం డొకం
డలఘువ్యాప్తియశోనిమగ్నభువనుం, డయ్యాయజూకుండు పు
ష్కలకైదార్యహిరణ్యధేన్వనడుహాగారాదియై రాజిలున్. 130.

క. ఆతనికి సర్వసంపద
లీతీరున నమరియున్న నే మయ్యె యథా
జాతుం డగు నొక్కతనూ
జాతుఁడు సంజాతుఁ డయ్యె సతతము వగవన్. 131.

ఉ. రూపునఁ గాముఁ, గాంతి మిహిరు,న్మఖరోచి విధున్,క్షమన్ క్షితిన్
రాపులఁ బెట్టువాఁడ యయినన్ విన వాకొన నేరఁ డింత యా
లాపము నేని, ధ్యానపథలగ్నమనస్కత మాదచేష్టుఁడై
యూపసివాఁడు తండ్రికి నిరంతర మాంతరచింత గూర్పఁగన్. 132.

ఆ. జడుఁడువోలె సుతుఁడు చరియింపఁ 'బ్రాక్కర్మ
మా? స్వభావమా? గ్రహగ్రహమ్మ?
హేతు' వంచు నెవ్వఁడేని బహుశ్రుతుఁ
డరుగుదేరఁ దండ్రి యడుగ నెంచు. 133.

గీ. అంత శిష్యప్రశిష్యు లత్యమితపుస్త
కౌఘభారికులై వెంట నంటి రాఁగ
వచ్చె నాయూరి కొక పూజ్యపాదుఁ డనుచు
విని తనూజుఁ దదంతికమునకుఁ బంపి. 134.

ఉ. 'కూడదు శూన్యహస్తముల క్షోణివిభున్, గురు, నిష్టదేవతన్
జూడఁగ' నంచు శాస్త్రములఁ జూచుట నాసుధి సోపహారుఁడై
పోఁడిగ నొజ్జ డాసి ఫలముల్ దరిసించి తదంఘ్రి వ్రాలి కొం
డాడి, కుమారు భస్మపిహితానలసన్నిభు మ్రొక్కఁ జేయుడున్.135,

ఉ. ఆవటుఁడున్ స్వజాడ్యము బయల్పడఁ దత్పదసీమ వ్రాలియున్
లేవమిఁ గాంచి, దేశికుఁడు నెమ్మదిగాఁ జెయి వట్టి యెత్తి భూ
ళీవికృతాంగమున్ గవుఁగిలించి కపోలము మెత్త నొత్తి; భూ
దేవుఁడు విన్నఁబోయి గురుదేవునితో నిటు వల్కె దీనుఁడై. 136.

క. దేవా! దేవర వాకొనఁ
గావలె నదనీయజాడ్యకారణ; మితరుల్
నీవలె నెఱుఁగ, రీతని
జీవిత మాలించి యవ్వలఁ జెపుమా వెరవున్. 136.

మ. పదుమూఁడేఁడుల యీడు వీని కిపు డప్రాప్తావబోధంబుగా
నుదితుం డౌటఁ బఠింపలేఁడు నిగమమ్మొక్కవర్ణమ్మున్; వ్రాయలేఁ
'డది మేధాప్తికి హేతు' వం చుపనయం బత్యర్థ గావింతు నె
య్యదియున్ మేల్ గనరాద యేమనెదనయ్యా! నామహాపాపమున్.

సీ. తన కీడుజోడైన దారకు లాడఁగోఁ
బిలువ నేఁగం డాడఁ దేఁపఁ బోఁడు
పలుగాకు లగుబాలకులు ముగ్ధుఁ డని కొట్ట
వెత నొందఁబోఁడు కోపింపనేరఁ
డొకనాఁ డుపవసించు నొకనాఁడు భుజియించు
స్వైరియై చెప్పినపని యొనర్పఁ
డులుకండు పలుకండు మెలఁకువ గలిగియు
నింట నందఱు నెలుఁగెత్తి పిలువఁ

గీ. గొంద ఱందు రనేడ మూకుం డటంచు
నం డ్రొకండు గ్రహావిష్టుఁ డనుచుఁ బూర్వ
పాపకలితుండొ దైవశాపోపహతుఁడొ
యం డ్రొకం; డ్రేను దల్లియు నడలి పోవ. 138.

క. అనెడు ప్రభాకరు మాటలు
విని శంకరదేశికుఁడు సవిధవర్తిఁ గుమా
రుని నీ వెవండ విటు జడుఁ
డన నుం దే లనుడు నమ్మహాత్ముఁడు పలుకున్. 139.

ఆ. మనుజ దేవ యక్షులును గాను బ్రాహ్మణ
క్షత్రి యార్య శూద్రజాతిఁ గాను
బ్రహ్మచారి గేహి వనవాసి భిక్షువుల్
గాను బోధరూప మైనవాఁడ. 140.

క. జడ మేను గా, నీఁకను నా
కడ నుంటను జడమె కదలఁగలుగు ననుట కె
న్నఁడు సంశయింప, నపగత
షడూర్మిషడ్భావవికృతి సచ్చిన్మయుఁడన్. 141.

ఆ. నాకుఁ బోలెఁ గలుగుఁ గాక యియ్యనుభూతి
భువి ముముక్షువర్గమున కటంచుఁ
బదియురెండు మేలి పద్యాల నొడివెఁ జి
దాత్మతత్త్వ మెల్లయది ఘటించి. 142.

గీ. మిహిరుఁడే లోకచేష్టానిమిత్త మగు ప్ర
మితి మనోక్ష్యాదివృత్తినిమిత్తములు, న
భఁబువలె నిర్గతాఖిలోపాధిక మగు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 143.

గీ. జ్వలనమును నౌష్ణ్య మటు మనశ్చక్షురాది
నిత్యబోధాత్మ మేకమై నెగడు దేని
నూఁది తా మబోధాత్మ మయ్యును దనర్చు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 144.

గీ. ఆననాభాసకము ముఖత్వాప్తి నద్ద
మందుఁ దోఁచిన, లేదన్య మటులె జీవుఁ
డొగిఁ జిదాభాసకుం డన నొప్పు మతుల
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 145.

గీ. అద్ద మొడలింప నాభాసహాని నొక ము
ఖమె యకల్పనముగ వెల్గు గతి మతిలయ
మునఁ జిదాభాసకుం డణఁ తనరు నెవ్వఁ
డట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 146.

గీ. ద్యుమణి బహుఘటజలములఁ దోఁచు గతి నె
వఁడు స్వతఃప్రకాశుండు కేవలుఁడు శుద్ధుఁ
డయ్యు బుద్ధులఁ బెక్కైన యట్లు వెలుఁగు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 147.

గీ. నిర్మనశ్చక్షురాదికేంద్రియుఁడ యయ్యు
నల మనోత్వ్యాదులకు మనోత్వాది యగుచుఁ
దన్మనోత్వ్యాదులకును నంటం డెవండొ
యట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 148.

గీ. నైకదృక్ప్రకాశుఁడు రవి యాగపద్య
గతిఁ బ్రకాశ్య మ్మటు లనేకమతుల నెవ్వఁ
డేకబోధాకృతిని బ్రకాశీకరించు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 149.

గీ. అర్కుఁ డొకఁ డయ్యుఁ జలితాంబులం దనేకు
లై స్థిరాంబుల నగ్నిభావ్యత నొకఁ డగు
*గతిఁ జలస్థిరమతుల నెక్కటి వెలుంగు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 150.

---

*గీ. తరళజలమం దనేకమై స్థిరముల నొకఁ
డవు చనలభాతి నొకఁడయ్యు సవిత వెలుఁగు
గతిఁ జలస్థిరమతుల నొక్కఁడయి వెలుఁగు
నట్టి – అని పాఠాంతరము.

గీ. జలధరచ్ఛన్నదృష్టి యగా జనుఁడు సూర్యు
నిష్ప్రభునిగ ఘనచ్ఛన్నునిగఁ దలంచు
నటు విమూఢదృష్టికి బద్ధుఁ డటుల తోఁచు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 151.

గీ. అఖిలవస్తువులను బోత్రమై యనన్య
మయిన నేదాని 'నావస్తు లంటఁ జాల
వభ్రిమటు సదా శుద్ధుఁ డచ్చాకృతి యగు
నట్టి సచ్చిత్సుఖస్వరూపాత్మ మేను. 152

గీ. తగ నుపాధుల మణుల భేదతయుఁ బోలె
నమరు భేదత బుద్ధిభేదములఁ నీకు
జలములను వెన్నెలలకుఁ జంచలత పగిదిఁ
జుట్టుకొనె నీకుఁ జలత విష్ణూ! చిదాత్మ. 153.

క. అని చెప్పిన యాశ్లోకము
లను బరమార్థమ్ము కరతలస్థామలకం
బన నుంట వానికిని గవి
కిని హస్తామలకసంజ్ఞ క్షితి నెలవుకొనెన్. 154.

ఉ. అంతట దేశికేంద్రుఁడు ద్విజార్భకుఁ డిట్లుపదేశమేని లే
కంతటి బ్రహ్మబోధము తనంత నెఱింగెనొ యంచు నద్భుత
స్వాంతమునన్ దలంచి ద్విజబాలకు మౌళి స్వహస్త మూన్చి న
త్యంతకృపామృతాతిశిశిరాయితదృగుప్రచి వీచు లూఁచఁగన్. 155.

గీ. హస్తమస్తయోగ మటు సల్పి దీవింప
మాటలాడకుండ మాణవకుఁడు
పోయె నాత్మగేహమున కెల్ల రరుదంద
నపుడు తండ్రిఁ జూచి యనియె గురుఁడు. 156.

ఉ. నీసుతుఁ డిట్టి మందమతి, నేరఁడు నీపని సేయ, నెందులన్
బాసట గాఁడు నీకు, నెది పల్కఁడుగా, కెఱుఁగున్ బురాభవా
భ్యాసమునన్ సమస్త; మటు తొంటన స్వానుభవైకగర్భప
ద్యాసమసృష్టి సేసెను నిరక్షరకుక్షియ మైన నేర్చునే. 157

క. లేదితని కింత సక్తి గృ
హాదులయెడ లేదు స్వకను వందును భ్రాంతిన్
దాదాత్మ్యము; లేదు పెఱల
నా దనుమతి యనినఁ గలుగునా యొందేనిన్. 158.

క. భవబంధముక్తుఁ డగు ని
య్యవధూత గృహస్థుఁ జేయ నలవియె విద్వ
త్ప్రవరా! యనుపుమ, నాతో
నవు నీకు శుభంబు లనుదినాభ్యుదయంబుల్. 159.

శా. అం చాశీస్సు లొనర్చి దేశికుఁడు పిప్రాంగీకృతుండై వటున్
గొంచున్; దూర మనువ్రజించిన ద్విజన్మున్ దాంతుఁ గావించి వీ
డ్కొంచున్ స్వైరగతిన్ జనంగ-విబుధుండున్ జేరె స్వాగార మ
భ్యంచద్జ్ఞాననిరస్త పుత్రవిర హోద్యత్స్వాంతచింతాకుఁడై. 160.

వ. తదనంతరంబ.

• శృంగగిరియందు భారతిని ప్రతిష్ఠించుట.

సీ. ఉండు నేఁడును దప మొనరించుచును ఋష్య
శృంగుఁ డాత్మభృదంతరంగుఁ డెవటఁ
బ్రవహించు నెచ్చోట స్పర్శమాత్రవితీర్ణ
రంగన్మహాభద్ర తుంగభద్ర
యెట నుండ్రు ప్రాజ్ఞు లధీతస్వశాఖు ల
భ్యాగతార్చాల్పితస్వర్గశాఖు
లెందు నుఁదురు యజ్వ లిజ్యాశతాధరు
లశ్రాంత మెదివి గతాంతరాయ

గీ. మట్టి శ్రీశృంగగిరికి నయ్యతివిభుండు
పద్మపాదాదిశిష్యులు పజ్జ రాఁగ
వెడలె శతధృతి మఘవత్ప్రభృతిసుపర్వ
కాండవినుతుం డవాప్తకాముండు నగుచు. 161

క. సిగ్గువడ భుజగపతి, కృతు
భుగ్గురువర నిర్విశేషముగ వాకొనె నం
దగ్గురుఁడు ప్రాణితమములు
మొగ్గఁగ జీవేశభేదమును నెగ్గొందన్. 162

గీ. హరిహయవిమానకల్ప మనల్పశిల్ప
మైన ప్రాసాద మచ్చట నలవరించి
యందు బ్రహ్మాదిపూజిత యైన దేవి
కన్వహార్చననియమమ్ము ననువుపఱచె. 163

సీ. ఏలేమ బ్రహ్మ కిల్లాలుఁగొమ్మగ నెంత్రి
పారపాండితిఁ బట్టి పేరిఁ బట్టి
యేదేవి వైదగ్ధి కెదురాడఁ జాలక
శంకరుం డంతవాఁ డింకఁ బాతె
నేయమ్మ కెదురు లే రీరేడుజగములఁ
బరమపాతివ్రత్యపాలనమున
నేసాధ్వి యోగమహిమ నగ్ని సొచ్చి ప్రా
ణేశులో లీనమయ్యెను గడఁగి

గీ. మండనార్ధాంగలక్ష్మి యేమానవతియొ
యట్టి భారతిపేర నయ్యాదిశక్తి
నచట నద్వైతపూర్ణసిద్ధాంతలక్ష్య
ముగను స్థాపించె భిక్షుకపుంగవుండు. 164

ఆ. ప్రీతిని నెఱపి యచల భారతీసంప్రదా
యుని సురేశ్వరాహ్వయుని విధేయు
నెలవుకొల్పె దేవి నిరత మర్చించు చ
ద్వైతమతము జగతి వ్యాప్తి సేయ. 165.

క. భారతి యన శారద యనఁ
బేరొంది నిజాశ్రితుల కభీష్టము లిడుచుఁ గా
రుణ్యమూర్తి యయి శృం
గేరిని నాదేవి నేఁటికిని వెలుఁగొందున్. 166.

ఉ. ఆజగదేకదేశికుఁ డహర్నిశ మాపరదేవతాపదాం
భోజయుగంబునన్ హృదయమున్ గదియించి సపర్యలన్ మహా
రాజుల కట్టు లాభువనరాజ్ఞి కొనర్చుచు నుండు నంతఁ బూ
ర్ణాజుఁడు బ్రహ్మచారి యొకఁ డాగురుఁ జేరె భవార్తి తీర్చవె. 167.

ఆ. ఆత్మధర్మచారి యాచార్యచిత్తాను
సారి యల్పతరవచఃప్రసారి
భూతదయకు జన్మభూమి యై వాఁడు మ
హాప్రసలుపు శంకరునకు భక్తి. 168.

సీ. తొలుత మేల్కాంచి స్నాతుండయి గురుఁడు సు
ప్తోత్థితుండగు వేళ కుండు నెదుట
సలిలాదికము బహిష్కార్యార్థ మొనగూర్చి
దంతకాష్ఠమ్మును సంతరించుఁ
గంబళాదుల మెత్తగా నాసన మమర్చు
నందిచ్చుఁ దనుమార్జనాంబరంబు
లుదికి చక్కఁగఁ గావు లోర్మిమై నీటార్చు
నమరించు దేవతార్చార్థ మెల్ల

గీ. వినయమున వేఁడి శ్రీపాదవనజయుగళి
మొ త్తమొ త్తన నొత్తు 'సామీ' యటంచు
నేఁగుదెంచు సుషు ప్తి యాఁదేనిఁ బిలువ
నాతఁ డానందగిరి సమాహ్వయమువాఁడు. 169.

గీ. ఆవులింపండు హాసియింపఁ డండఁ గాళ్లు
సాఁచి కూర్చుండఁ డనఁ దగ్గ సమయమందు
నూరకుండఁడు, మాటాడఁ డొకటి వృథగ
వెన్ను కననీఁడు గురుచెంత నున్నయపుడు. 170.

క. గురుఁడు విడియు నెడల విడియు
నరిగెడుచో నరుగుఁ, జెప్ప నడఁకువ విను, జె
ప్పెర సేయుఁ జెప్పకయ హిత
మరసి యొనర్పును గురున కహిత మ్మొదియున్. 171.

చ. ఒక దివస మ్మతండు నికటోర్విని బాఱుస్రవంతి నొజ్జశా
టిక లుదుకన్ దమిం జని కడిఁది విలంబ మొనర్ప వాని రా
కకు నయి పాఠ మాఁపి యటు గాంచుచు నయ్యతి శాంతిపాఠ ము
త్సుకు లయి చెప్పశిష్యతతితో 'గిరి రాఁడొకో తాళుఁడా' యనన్.

ఉ. అంబుజపాదుఁ డప్డు నిగమాన్తగురూక్తికి నవ్వి బుద్ధిమాం
ద్యంబున శాస్త్రముల్ గన నసర్హునకై గిరికై ప్రతీక్ష సే
యం బనియేమి? యం చవినయంబున భిత్తిని జూప వానిగ
ర్వంబు నడంప స్వాశ్రితులవంక నయన్ బ్రకటింప నొజ్జయున్.

క. కరుణారసమ్ము చూపులఁ
దొరుఁగ నొసఁగె మనసునన్ జతుర్దశవిద్యల్
గిరి కద్దిర! గురుకృప ని
ర్జరధేనువ కాదె శిష్యసమితికి నెందున్. 174.

ఉ. పోఁడిగ సర్వవిద్యలును బుద్ధిఁ దమంత స్ఫురింప వైళ మా
మ్రేడితవిస్మయంబున సమీపగతుం డయి పాదుకాద్వయిన్
దోడన వ్రాలి దేశికుని దోటకవృత్తకవిత్వఫక్కిఁ గొం
డాడఁ దొడంగె నాతఁ; డరయన్ బరతత్త్వము వెల్లివాఱఁగన్.

తోటక వృత్తము } జనురత్యయతోయము సౌఖ్యవిప
ఘ్నమత్స్యము నౌభవకంధి మునుం
గు నన్ శరణాగతుఁ గూర్మిని దే
ల్చి నిరంతర మారయు లీల గురూ! 176.

తోటక. తెగిపో విషయేచ్ఛలు, దేహగభీ
తెగిపో నొనరించి మతిం బరమా
త్మగతం బొనరించి సదా వరలం
దగు దీవు విమోహ మణంచి సుధీ! 177.

తోటక. అది నాయది నే నది యన్మతి నీ
హృది నన్నమయాదుల నీఁగు మజున్
హృదయస్థు ననంతుని నీశుఁ జిదా
స్పదు 'నే' నని యెంచుము భవ్యగుణా! 178.

తోటక. అలవారెభిదన్ జలజాప్తునకున్
వలెనే-కలశాది దివంబునకున్
బలె-బుద్ధిభిదామహిమన్ బహుతా
కలనం బది నీకును గల్గుఁ గదే. 179.

తోటక. రవిరుజ్నిభచిత్ప్రసరంబునఁ గం
దువు బుద్ధిని లోకమనోగత మా
నవి యెల్లను; గావున నా దవికా
రివి సత్పద మాదువు శ్రీచరణా. 180.

క. అని తోటకవృత్తంబుల
ననితరసుజ్ఞాన మైన యధ్యాత్మజ్ఞా
ననిదానం బగు స్తవమును
నొనరిచె గురుమూర్తి యాత్మయు నొకండ యనన్. 181.

సీ. శ్రీశంకరాచార్యహృద్యపదాంభోజ
ములు పంటపొలముగా మొలచె నెద్ది
ప్రాఁకె నెయ్యది రోదసీకటాహము దాఁటి
తద్దేశికోపఘ్నదండ మూఁది
మోక్షరక్తిఁ బ్రవాళములఁ గాంచె నెద్ది త
త్కరుణామృతావసేకంబుఁ బడసి
శీతలతదపాంగపూతమై యెది భవ
తాపవారక మనాతప మొసంగు
గీ. నట్టి గిరిభక్తివల్లి ఝుంపారఁ గాంచె
నమలతోటకవృత్తవృంతావలంబ
నం బగు ఫలంబు భోక్తృమనస్సురూప
శుకగణాస్వాద్యమాన మాచును దనర్ప. 182.

చ. వితతసమున్నతిన్ బడసి పృథ్విపయిన్ బద మూఁది వ్రాలి యు
న్నతపద మొందఁ గోరెడు జనంబులకై మిను ముట్టి తా నధః
కృతభువనత్రయం బగుచు నేదియొ వంశము గల్గు నిచ్చె నా
యతిపతిసేవ శిష్యతమ మంతయు నంత మొనర్చు టబ్రమే. 183.

క. ఎఱుఁగకె సుపర్వసూక్తులు
గురుదయ నానందగిరి యకుంఠితఫణితిన్
వర వేదశిఖార్థమ్ముల
విరచించెను దోటకాఖ్య వృత్తమ్ములుగాన్. 184.

క. అమృతరసమధురిమధురీ
ణము లగు తద్వాక్యగుంఫనమ్మున కాశ్చ
ర్యముపడిరి పద్మపాదా
దిమహామతు లకట! తత్సతీర్థ్యులు మతులన్. 185.

గీ. అమితభక్తిఁ దదీయాననాబ్జ మాక
రందనిష్యంద మయి పుట్టువొందుతోట
కాఖ్యపద్యకవిత్వంబు నరసి శిష్ట
జనము లాకవిఁ దోటకాచార్యుఁ డనిరి. 186.

గీ. అలఁతి యయ్యు మహార్థ మనల్పనీతి
యుపనిషద్వేద్యపరమార్థోపహితము
శిష్టపదజుష్టమును నౌట శిష్టజనగృ
హీత మయి తత్ప్రకరణము ఖ్యాతి కెక్కె. 187.

క. శంకరుచేఁ దోటకనా
మాంక మెనసి పద్మపదనిభాతిప్రతిభా
లంకృతుఁ డౌటఁ దదాది న
పంకిలగతి ముఖ్యశిష్యపద మతఁ డొందెన్. 188.

సీ. అవని పర్యటనేచ్ఛ యతివరాకారభా
గ్ధర్మార్థకామమోక్షమ్ము లొకొ
సర్వతోవ్యాప్తి కాంతౌధృతమానవ
తనుకఋగాదివేదమ్ము లొకొ
యామ్నాయపఠనపాఠాదరవిచరిష్ణు
కమలగర్భచతుర్ముఖమ్ము లొకొ
సామీప్యసారూప్యసాలోక్యసాయుజ్య
చతురభిదానమోక్షమ్ము లొకొ

గీ. యని వసుంధరఁ గల విబుధాగ్రియాయు
లెదల నుత్ప్రేక్షసేయఁ బెంపెక్కి వెలసె
నబ్జపాద సురేశ హస్తామృతఫల
తోటకాఖ్యతచ్ఛిష్యచతుష్టయమ్ము. 189.

శా. స్ఫారద్వాఃప్రఘుణద్విపేంద్రకటచంచద్దానకల్లోలవి
స్తారాస్వాదనలోలబంభరవధూఝంకారనీరంధ్రది
గ్ద్వారం బైన మహేంద్రసంపద లనర్గాగ్రియుగ్ యతీంద్రోక్త వి
ద్యారాజన్య మకింపచానతతి బ్రహ్మానంద సంధానమై. 190.

ఉ. ఆనతమంథశైలమథితాంబుధిగర్భసముద్భవత్సుధా
ఫేనసమానమై యమృతస్రృష్టినిభం బగు కీర్తితో, నస
న్మానసమార్గ మెల్లఁ గనుమాత్ర నిరుద్ధ మొనర్చు నయ్యతీ
శానుఁడు రాజిలెఁ ద్విపదజయ్యులు శిష్యులు చేరి కొల్వఁగన్.191.

సురేశ్వరుని గ్రంథరచన.

వ. అనంతర మొక్కనాఁడు గురుసార్వభౌముఁడు విశ్రాంతుండై యు
న్నతఱి సురేశ్వరాచార్యుండు సమీపించి వందన మొనర్చి తద
నుజ్ఞ నొంది జగదుద్ధారకంబు నద్వైతసిద్ధాంతప్రచారకంబు నగు
నెద్దియేని గ్రంథంబు రచియించి గురువుల కార్యభారంబు గొంత
యుపనయింపఁ దలంచి యిట్లను. 192.

క. గురువర! నీకయి నాకుం
గరణీయం బెద్దియేని గలదే నద్వా
పరముగ ననుఁ బనిగొనుమీ
గురుభక్తుని జీవితమ యగుఁ గా సార్థకమై. 193.

చ. అనుచు, సురేశ్వరుండు వినయంబునఁ గోర గురుండు పెద్దయూ
ర్పును నిగుడించి యిట్లను నిరుత్తరులై ప్రతిపక్షు లెందు న

దును జెడ వాదమం దోడిచి తుత్తుమురుల్ బచరించినట్టి స
జ్జనమణి యక్కుమారిలబుధప్రవరుం డెదఁ బాయఁ డేమెడన్. 194.

ఉ. నీకు గురుండు నాకు భజనీయుఁడు వైదికధర్మమార్గర
క్షాకృతకృత్యుఁ డాతఁ డవసానదశన్ నను దేశికుండుగాఁ
గైకొని సంన్యసించి తనకామిత మొక్కటిమాత్ర దీఱమిన్
వ్యాకులుఁడై శరీరమెడఁబాసెనె యంచుఁ దపింతు నిచ్చలున్. 195.

చ. ఎనిమిదివేలవార్తికము లేన రచించి భవత్కభాష్య ము
ల్లోని వితతప్రచార మొనరింపఁ దలంతును గాని తీఱ ద
య్యెను మదభీష్ట మంచుఁ దపియించె ననుం గని బ్రహ్మభూయమున్
గనుతఱి దానికై వగవఁగాఁ బని లే దని యెంత సెప్పినన్. 196.

గీ. జైమినిమతంబు చేపట్టి జైనమతము
నడఁచి నట్టి యుగ్రింపష్యుఁ డగు హరుండు
ప్రచురపాషండమతగిరీరమ్మద మగు
నతని మది కోర్కి పాలనీయుంబు గాదె. 197.

ఉ. ఆతని యంతరాత్మకు నిరంతరశాంతియు, మత్ప్రణీతభా
ష్యాతిరహార్థవిస్ఫురణ మబ్బి జగంబు తరించుటల్, త్వదీ
యైతదభీష్టసిద్ధియును నిన్నియుఁ జేకుఱుఁ గాన వార్తిక
వ్రాతము సల్పుమా విబుధవంద్య! సమర్థుఁడ వీ వొకండవే. 198.

క. నా వుడు సురేశ్వరుం డను
భావత్కము భాష్య మరయ వశమె సతర్కం
బై విపులగభీరార్థం
బై వెలయుట జంకెదను మహాత్మ! మనమునన్. 199.

గీ. అయిన రచియింపఁ బూనెద నమితకరుణఁ
జల్లనై పండువెన్నెల సరణిఁ దోఁచు

భవదపాంగేక్షణములు నాపైని బడుట
సాధ్వసధ్వాంత మింతింత శాంతి గనుట. 200.

వ. అంత.

ఆ. కొండ యెక్కినట్లు గురుఁ డుల్లమున నుబ్బెఁ
బూని గ్రంథరచనమున కతండుఁ
జెంత వినుచునున్న చిత్సుఖాదులు శిష్యు
లనిరి గురు నొకప్పు డరసి యిట్లు. 201.

సురేశ్వరునిపై సతీర్థ్యుల యీర్ష్య.

క. గురువర! మీకం టెను మే
మెఱిఁగిన దేది లేదు గాని, యిందఱు విద్వ
ద్వరు లైన శిష్యు లుండఁగ
దొరకెనె యీకర్మవాది తోడ్పడ మీకున్. 202.

సీ. బోధింపఁడే స్వయంబుగఁ గర్మమార్గమ్ము
నిరతమ్ము కర్మతత్పరత మనఁడె
డీకొనఁడే సార్వలౌకికు నీరశ్వరే
శ్వరు యుక్తి బహుళత నభావుఁ జేసి
నిరసింపఁడే స్వర్గనిరయాదిదము కర్మ
ఫలమ గా కీశుండు గలుగఁ డనుచుఁ
దలఁపడే యీశ్వరప్రియమ్ముౕను బురాణ
తతి వ్యాసశిష్యశిష్యతను గనుట
గీ. నీదృశుండు వ్యాఖ్యాత యౌనేని లోక
హితము మాట యటుండ నహిత మనర్థ
మగును మీభాష్య, మీతని యర్థ మెఱిఁగి
మెలఁగుఁ డని విన్నవింతు మోయలఘుసుహిమ. 203.

గీ. వెలయు గురుశిష్యులకుఁ బక్షభేద మొదవ
వారి కెటు గురుశిష్యభావము పొసంగుఁ

బొసఁగినను శిష్యపక్షంబు పూర్వపక్ష
మౌను గురుపక్ష మవుల సిద్ధాంత మవును 204.

శా. ఆజన్మంబుగఁ గర్మనిర్వహణదీక్షాయత్తచిత్తంబుతో
నీజాగ్రిస్మతి తా నొనర్చుటయ కా కెల్లప్పుడున్ గర్మమే
బీజం బౌఁ దివిదివాదిసౌఖ్యమునకున్ శిష్యోక్తిఁచి తద్భావముల్
యోజింపుండి మనం బటం చితరులన్ బోధింపఁడే యెల్లెడన్.205.

ఆ ఇట్టివాని కానతిచ్చుచో నీభాష్య
మందుఁ గర్మమతము నదుకకుండ
విడువఁ, డీరు తదభివృద్ధిఁ గోరుచు మూల
మునకె చ్యుతిని జేయ ననుమతింతె?. 108.

ఆ. వాదమందు నోడి బలవంతముగ సంన్య
సించినాఁడు విశ్వసింపఁజాల
మితని మానిపింపుఁ డీభాష్యము నిబంధ
నమ్ము గూర్చు నుద్యమమ్మునుండి, 207.

ఉ. ప్రీతి నభీష్టకర్మ మొనరింప సమర్థత గల్గు నెవ్వఁడే
నేతఱిఁ గర్మ మింత త్యజియింపఁగరాదు యతిత్వముల్ గొనన్
ఖ్యాత దురాగ్రహంబె యయినన్ జనుపాంథులు మూఁగ లర్హు లా
రీతికి' నంచుఁ జాటుదురె రెక్కొని భాట్టమతానువర్తనుల్. 203.

గీ. అట్టి సంన్యాసదూషకం బైన భాట్ట
మతమునను పక్షపాతి యీ నితఁడు గాన
భాష్యవార్తిక మొనరింపఁ బంపు మన్య
దక్షు నొక్కని శిష్యబృందమున నెంచి. 209,

చ నెమకుట యేల యగ్రధరణీ లఘిమాదివిభూతిభూషితుం
డమరఁడె పద్మపాదుఁ? డవురా! వివరింపఁ దరంబె తత్కృశా
గ్రమతి యపారపాండితి నఖండభవత్పదభక్తి శాంతశీ
లము మహితాత్మ! యాతఁ డవిలంబ మొనర్పఁగలాఁడు గ్రంథముల్.

సీ. కైశోర మాది నిష్కలుష మానైష్ఠిక
బ్రహ్మచర్యమునఁ బేర్పడినవాఁడు
సంన్యాస మొనసి యుష్మత్కృపఁ బ్రస్థాన
ధర్మమర్మజ్ఞుఁడై తనరువాఁడు
ప్రాంచితాద్వైతసిద్ధాంతసంవ్యాప్తికై
బద్ధకంకణుఁ డయి పరఁగువాఁడు
లఘిమవిభూతిఁ గాల్నడ గాంగఘనము ను
త్తరియించి మహి మించు బిరుదువాఁడు

గీ. సకలవిద్యలఁ బుంభావశారదాంబ
యగు సనందనుఁ డిదిగో మీ యనుగుఁదమ్ము
లండఁ గొని యుండ నెదుకంగ నగునె యొరుని
భాష్యవార్త్తికరచనకై పనుపువెట్ట. 213

గీ. యుష్మదంఘ్రిసంవాహనాత్యుగ్రతపముఁ
జేసి పరమేష్ఠిపత్నిదయాసుధఁ గొని
వరలు నానందగిరి భవద్భాష్యములకు
సరిగ వ్యాఖ్యాన మొనరింపఁ జాలుఁ గాదె. 214.

చ. అనునెడఁ బద్మపాదుఁడు కృతాంజలియై యిటు పల్కు 'దేవ! యి
య్యనఘుఁ డొకండె దక్షుఁడు కరామలకుం డఖిలాగమాద్వయా
ర్థనిధి' యటంచు దేవరగదా బిరుదాఖ్య నొసంగి మెచ్చి రీ
తని నియమింప నౌను ద్వరితంబుగఁ గూర్చును వ్యాఖ్యయొప్పుగన్.

క. అను పద్మపాదుఁ గని గురుఁ
డని దరహాసము ముఖాబ్జమం దుదయింపన్
వినుమీ హస్తామలకుం
డనితరసామాన్యమతియ యగు జ్ఞానమునన్. 214.

ఉ. కాని సమాహితుం డగుటఁ గాంచఁడు లోకచరిత్రి, విద్యకై
పూనికఁ దండ్రి యెంత శ్రమమున్ గనినన్ జదువం డొకక్షరం
బే నుపవీతుఁ డయ్యు శ్రుతు లించుక నేరువఁ డొజ్జఁ గొల్చి, యె
ట్లైన నవేదబోధుఁ డగునా? శ్రుతిమర్మము లుగ్గడింపఁగన్. 215.

ఆ. ఇతఁ డనేడమూకగతి వర్తిలుట మీరు
నరసినారు గాదె యట్టివాఁడు
తగఁడు దీని;కిఁక యథాశాస్త్రము గురూప
దేశ మొందుశ్రుత్యధీతి వలయు. 216.

ఆ. జనన మొందు నపుడు సకలశాస్త్రమ్ములు
శ్రుతులు నెఱుఁగు బ్రహ్మరతుఁడ కాని
యెఱుఁగఁ డెటు బహిప్రవృత్తిఁ గావున నన
ఘాఁడు రచింప గ్రంథ మొకటి యైన. 217.

క. నావుడు శిష్యులు వల్కిరి
దేవా! మాయర్థ మడుగఁ దివురుదు మీతం
డేవిధి శ్రవణాదులు లే
కీవిజ్ఞత నెల్లఁ బడసె నెఱిఁగింపు దయన్. 218.

హస్తామలకుని పూర్వజన్మవృత్తము.

వ. అనుటయు గురువరుం డిటు లనియె. 219.

మ. యమునాతీరమునం దు సాధుచరితుం డొ క్కవాంఛయమా
త్తముఁ డత్యంతవిరక్తుఁ డుండు నెడ; నేతన్మాత తత్సన్నిధా

నమునన్ బాలుని వీని డించి తృణ మన్నా! చూడవే యంచు స్నా
నమువకై బోటులతోఁడ నేఁగుటయు నంతన్ వీఁడు దోఁగాడుచున్,

చ. చని విధి దుర్విపాకమునఁ జయ్యన నన్నదిఁ గూలి మ్రిందఁగాఁ
దనువును గొంచుఁ దల్లియును దత్సఖులున్ మునిమౌళి నుంచి హా
యని విలపించుచుండఁగ సమాహితుఁ డాయతి బాహ్యవాసనల్
గని మది ఖిన్నుఁడై శిశువుకాయము సొచ్చెను యోగశక్తిచే.

ఆ. పరతనుప్రవేశవరయోగశక్తి నీ
తనువునంద నిలిచెఁ దాపసుండు
చచ్చి బ్రతికె నంచు జనులు ఘోషింప హ
స్తామలకుఁ డనంగ నయ్యె వీఁడు. 222.

ఆ. విదితవేదశాస్త్రవిజ్ఞానుఁ డయ్యు బా
హ్యప్రవృత్తి లేక యలరు చుంట
భాష్యమర్మములను వ్యాఖ్య నొనర్పఁగా
నర్హుఁ డౌట యరిది యన్నిగతుల. 223.

క. మఱి మండనుం డనంగా
సరస్వతీసాక్షికముగ సర్వజ్ఞత్వం
బరుదారఁ గనియె నతఁ డొ
క్కరుఁ డిక్కృతిఁ జేయు వలఁతిగాఁ గన్పట్టున్. 224.

ఉ. అంతియ కాదు దక్కొరు లనర్హులు వ్యాఖ్య నొనర్పఁ; బెక్కు ర
శ్రాంత మసమ్మతిన్ దెలుప గ్రంథ మొనర్పఁగఁ బూను టన్నఁగా
నాంతరవిఘ్న మొందునొకొ! యన్విచికిత్సను మాన్చివైతు మీ
రింత విచారమున్ సలుప రేమనువాఁడను మీకడంకకున్. 225.

సీ. అనఁ జిత్సుఖాదు లి ట్లనిరి 'భవన్నిదే
శమున సనందనుం డమలచరితుఁ
డొనరించుఁ మీరాతలంచిన భాష్యము నిబంధ
న మెల్ల నొక్క క్షణమ్ములోన
బ్రహ్మచర్యమునుండి పడసెఁ దురీయాశ్ర
మము శేముషీప్రకర్షమున వెలసె
జను లెల్ల రానందమున మునింగెదరు త
ద్రచన జాతఁడె సమర్థత గలాఁడ
గీ. టంచు నమ్మండనునికంటె నర్హుఁ డన్యుఁ
డుండె నని తెల్పుచుండు శిష్యులకు ననియె
భాష్యమున కన్య మైన నిబంధనమ్ము
పొందుగాఁ జేయుఁగాక సనందనుండు. 226.

ఆ. తివిరి తాఁ బరప్రతిజ్ఞ మావార్త్తిక
మతఁడు సేయ వలవ; దది యొనర్పఁ
గా సురేశ్వరుండు గావించెఁ బ్రతిన దీ
క్షను వహించెఁ గానఁ జనదు మాన్ప. 227.

క. అని శిష్యుల నాదేశిం
చినగురుని సురేశుఁ డరసి చింతగొనక యి
ట్లను దేవ! యొక్కరును మె
చ్చని వార్త్తికరచన సేసి శ్రమపడు టేలా? 228.

శా. గార్హస్థ్యంబున నుండి కర్మకలనాగాఢాభిమానుండనై
యర్హత్వంబును గంట యిప్పుడ నవద్యం బయ్యెనే? యేయతిన్
గర్హింపన్ గలనేని; సంన్యసనమున్ గైకొంచు బ్రహ్మైక్య మ
భ్యర్హం బంచుఁ దలంపలేని కుహనావ్యాపారినే దేవరా! 2 9.

మ. శ్రుతి మర్మంబుల నెల్ల వార్త్తికములన్ జొప్పింప నాకేల వి
శ్రుత మావేశ్మ గ్రంథమున్ సలిపి మెచ్చన్ గాంచరాదో? యహం
కృతి మున్నే విడనాడి యీకృతికినై యేలా యహంకార? ము
ద్ధతపాటచ్చరవృత్తి కీర్తి ననుసంధానించునే చెప్పుమా. 230.

గీ. వేదమున లేమి సంన్యాస మాదరింప
రా దనుమతంబు నాది యన్వాదు నమ్మి
రాది మనవాదములఁ బూనినట్టి ప్రతిన
లెఱుఁగరో వీర లవి శ్రుతిహితము గావొ. 231.

ఉ. వీరలు భిక్షుమాణు లయి వేశ్మముఁ జేరుటఁ గాంచి మత్ప్రతీ
హారులు వారణన్ సలిపి రంచు ననున్ యతిదూషకుండు గా
దూఱుట విందు; న ట్లయినఁ దోడన మీకెటు భిక్షుకై నమ
స్కారముసేసి భిక్ష విధిసమ్మతమై తనరారఁ జేయుదున్? 232.

ఆ. జతుఁడ నౌట సంన్యసించితి నన మేలె
యాత్మతత్త్వ మెఱిఁగి యతివిరక్తి
సంన్యసింతు వాదసంరంభ మెన్నంగఁ
దత్త్వనిర్ణయంబు దలఁచి కాదె. 233.

మ. అవమానం బని యెంచఁ గాని యిఁటు లధ్యాత్మజ్ఞు లౌవీర లి
ట్టివిధిన్ న న్నెద నమ్మకుండుటకుఁ గంటిన్ దాప మీనాఁడు సౌ
ష్ఠవ మొప్పన్ రచియించి వార్త్తికము భాష్యవ్యాప్తిఁ గావించు స
త్కవి యీపద్మపదుండె కావుత భవత్సంకల్పసంసిద్ధిగన్. 234.

క. అని కేలనున్న గ్రంథం
బును గురువరు పాదపద్మముల దాపున నుం
చెను దన విరచించిన ద
త్త్వనఘము నైష్కర్మ్యసిద్ధి యనునద్దానిన్. 235.

గీ. కాంచి చేకొంచు గురుఁడు నిష్కర్మతత్త్వ
విషయబోధపరిధానమై విపులయుక్తి
యగుచు నాద్యంతహృద్యపదానుగుంఫ
మగుమహాగ్రంథ మరసె నాద్యంతముగను. 236.

క. అరసి ముదితాత్ముఁడై య
వ్వరకృతి శిష్యులకుఁ జూపె వారలకుం జే
కుఱెఁ బ్రీత్యయు మింతవిబుధు
నరయము దత్త్వజ్ఞు నన్యు నని రేకముగాఁ. 237.

సీ. ఇంతటివైరాగ్య మెటు దెల్పఁ గల్గె నీ
కర్మనిర్మగ్నుఁ డక్కజము గాఁగ
నాపూర్వపక్షమ్ము లరయ గుండియ లావు
లింప విపక్షు లెల్లింప కుండఁ
యాకృతాంతచ్ఛాయ కడలి నోరెండి మూ
ర్ఛిల్లరే పరమతస్థిర మనీషు
లాయర్థయుక్తి భావాధిక్యము నెఱుంగ
వశ మానొకో బృహస్పతికి నేని
గీ యనుచు రచనాపటిష్ఠత యర్థగరిమ
భావగాంభీర్య మద్వైతభణితిఁ గాంచి
చిత్సుఖాదులు మదియందు సిగ్గుభయము
నచ్చెరువు నొంది గుసగుసలాడుకొనిరి. 238.

ఉ. అంత సురేశ్వరుం డనె మహాత్మ! 'యిదంకృతిపూరణార్థమం
దింత యశంబొ విత్తమొ యొకించుక గౌరవమో లభించు' నఁ
స్వాంతమునఁ బ్రవర్తిలఁ, నిజంబు జగద్ధితకృత్య మంచుఁ జిం
తింతుఁ ద్వదాజ్ఞ మీఱి గణనీయుఁడ నౌదునె శిష్యకోటిలో. 239.

గీ. ఆక్రమింపదు బాల్యమ్ము యౌవనస్థు
యౌవనము వృద్ధుఁ జేరరా దటులె మున్ను
దవిలి గృహినై నఁ గలుగునే తత్స్వభావ
మరుగు నరుఁ డొందునే పూర్వమైన స్థితిని. 240.

సీ. పూర్వమీమాంసాప్రభుండు కుమారిల
భట్టదేశికు నత్యవాంఛ యనియు
నటుమీఁదఁ ద్విగజ దేశాచార్యుఁడవు పరి
శీలించి నన్ను శాసింతు వనియు
నుభయులశుశ్రూష నోలి మతద్వయిఁ
గల లక్ష్యముల సిద్ధిఁ గంటి ననియు
సన్న్యాసధర్మనిష్ణాతుండనై లోప
మొందు లేనటు చరియింతు ననియు

గీ గురువుల ఋణంబు దీర్పఁ జేకుతెను సదవ
కాశ మనియును దలఁచి తత్కోశరచన
పూనుకొనునాకుఁ బ్రత్యూహాలు ఘటిల్లె
నకట! నాదైవసంకల్ప మట్టిదేమొ. 241.

గీ. నన్ను మాత్రమ గృహి ననఁ జన్నె మున్ను
కానివా రెవ్వరయ్య మోక్షమును బంధ
మును మనంబె ఘటించుఁ గావున మనోవి
శుద్ధుఁ డౌనేని యగుఁ త గేస్తుండొ యతియొ. 242.

గీ. మున్ను గృహినై మహార్థసంపన్నముఁగ ర
చింతు నైయాంఽకాదివిశిష్టకృతుల
నిపుడు నామది భవదీయవిపులసేవఁ
దక్క నన్యంబు గావింపఁ దలఁపఁ బోదు. 243.

మ. ప్రకటోజ్జీవనగా నొనర్తు వఁట యర్వాచీనదుర్వాదిగ
ర్వకరాళానలకీలలం బడఁగ నద్వైతార్థబద్ధాదరా
త్మక విద్వద్వరబుద్ధి సంస్థితము శ్రద్ధన్ వాక్సుధల్ జిల్కి; వే
నికి సాధ్యం బగునో యెఱుంగను నినున్ సేవించి యప్పింగఁగన్. 244

క. అని భాష్యమునకు గురునా
జ్ఞను గొంత రచించు వార్తికమును శపిం
చినగతి నపు డవ్వాలవై
చెను నిర్మముఁ డాచు నాసుశీలుం డంతన్. 245.

చ. అది తిలకించి భిక్షుజనతాగ్రణి భాష్యముపైని వార్తికం
బొదవదె యక్కటా! యనుచు నల్లమునం దుదుకెత్తధీరుఁడై
యదియు వివేకనీరముల నార్చి, సురేశ్వరుఁ జేయఁ బంచె స
మ్మదమున వేదభాష్యములమర్మము దెల్పెడు వార్తికద్వయిన్.

వ. అట్లు చేయఁ బంచి. 242.

గీ. భావనిభమృదువాక్యసంపాదితార్థ
మాత్మపదభూతపూర్వపక్షానుగతము
యుక్తిసాధిత సిద్ధాంతయుతము తత్ప
దము కృతిని గాంచి మెచ్చి మోదమున ననియె 248.

సీ. విద్యైకధన! నీ వనినదే సత్యం బగు
యాజుషశాఖ నాయది, తదంత
గతభాష్యమనిన నా కతిముదం బగుఁ గానఁ
దద్వార్తికము మదర్థము రచింపు
మఱి కాణ్వశాఖ. నీయది- తదంతగతాస్మ
దీయభాష్యమునకుం జేయు వృత్తి

సన్మార్గగాము లౌజనుల వర్తన మెన్నఁ
బరహితాచరణైకఫలము సూవె

గీ. యార్తిహారికి నారెంట వార్తికమ్ము
సలిపి కార్తికచంద్రికాసదృశకీర్తిఁ
దనరుమా దుశ్శ్లోక్తిరోధంబు తొంటి
యట్లు కలుగదు నామాట నండఁ గొనుము. 249.

మ. అని శ్రీశంకరపూజ్యపాదుఁ డనఁగా నవ్విశ్వస్వరూపుండు స
ద్వనచ్చైతుండు రచించె నాగమశిరోభాష్యద్వయీవార్తికం
బును, గుర్వాజ్ఞ యలంఘనీయ మని, సంపూరించి గ్రంథ మ్ముపా
యనముం బట్టెను దేశికాగ్రణికి సీమాతీత మహాభక్తితోన్. 250.

గీ. వర్ణించె సనందనుం డొక్కటీక
భాష్యమున కొజ్జ యానతి వడసి, మదియుఁ
బంచపాదిక యనఁ బూర్వభాగ మమర
వృత్తియన నుత్తరార్ధ మింపెనయఁ దనరె. 251.

ఉ. ఆరసి వ్యాససూత్రనివహార్థవివేచనమున్ స్వకీర్తిడిం
డీరసమృద్ధికిన్ విజయడిండిమనామక మైన వ్యాఖ్య గం
భీరతరోక్తి యుక్తి పరిమృష్టముగా విరచించి యొజ్జ కం
భోరుహపాదుఁ డిచ్చెను బ్రమోదము మీఱ నుపాయనంబుగాన్.

క. తదనంతరమ్ము గురుఁడును
మది గ్రహసంచార మెంచి మంతనమునఁ దన్
గదిసిన సురేశ్వరున కనె
సదయాంతఃకరణుఁ డగుచు సాంత్వనఫణితిన్ 253.

సీ. ప్రారిప్సితగ్రంథ మంతరాయము గాంచు
మంగళాచరణసామర్థ్య మెడయ
నామంగళంబు ననంతజన్మాచరి
తంబై యిదానీంతనంబుఁ బోఁచు
నెవ్వాఁడు బహుజన్మకృతమంగళుఁడో వాఁడు
సంసిద్ధిఁ గను నేఁడు సలుపకున్న
నద్యతనప్రాక్తనానందమంగళం
డయ్యు సజ్జను లున్న రనినఁ జెపును.
గీ. నీకృతికి నేఁడు విఘ్నము సోఁకు పెన్నఁ
జాల దనుకొందు మంగళాచరణబలము
ఉల్లమున నున్న రనుచు నీ వుపతపింప
నెటు సనందనుఁ డింక గ్రక్కున గలఁడొ. 254.

వ. అని యించుకతడవు కన్నులు మూసి ధ్యానించి నిట్టూర్పు పుచ్చి యిట్లను. 255.

గీ. ఈసనందనకృతటీక నేనుపాద
ములె వెలయు, సూత్రయుగము యాదుల రహించు
నీవు ప్రారబ్ధవశమున దేవగురుఁడ
వై పొడమి చేయుదువు భాష్యమందుఁ డీక. 256.

శా. ఆకల్పంబలరారుఁగాక భవదీయంబంచు దీవించి భి
క్షాకాధీశుఁడు తోటకాదుల మహాగ్రంథమ్ము లద్వైత దీ
క్షాకంబుల్ విరచింపఁ బన్పఁగ ననేకగ్రంథముల్ బ్రహ్మ వి
ద్యాకల్పంబులుగా రచించి రల విద్యార్థుల్ యథాశక్తిగా. 257.

ఆశ్వాసాంతము.

శా. కస్తూరీహిమవాలుకాఘుసృణసౌగంధ్యాప్తసీతాస్వయం
హస్తప్రాపితవీటికారసన జాతానందవీప్స్యాయుతా
ధస్తాధూర్ధ్వగసారవాజ్ఞమధుగంధగ్రాసమందానిలో
పాస్తిప్రస్ఫుటమోదకారణదయోధ్యాసౌధమధ్యస్థితీ. 258.

క. నిధ్యానమాత్రపావిత
మర్త్యేటవివరిత్రశబరమహిళా! మహిచ
కాద్రిద్యత్తూ! వేంకటరా
యాధ్యాత్మారామ! జనకజాత్మాధీశా! 259.

స్వాగతము. శర్వరీట్ప్రకలసన్నిభగండా!
యుర్వరోరుభరయుగ్భుజదండా!
శర్వచాపబలచండిమఖండా!
గర్వితాహితవిఖండనచండా! 260.

ఇది శ్రీగురుకరుణాసమాసాదిత కవిత్వ 'విద్వత్కవిశేఖర,
కవితాభూషణ' వెంపరాల సూర్యనారాయణనామ
ధేయప్రణీతంబైన శంకరవిజయంబున

షష్ఠాశ్వాసము.

శ్రీ శంకరవిజయము

సప్తమాశ్వాసము.

శ్రీమత్కౌసల్యాగ
ర్భాంబుధిశుభ్రాంశు! శ్రీనివాసా! వేంకటరా
యామాత్యజప్యనామ! ని
రామయతాపసమనోభిరామా! రామా!

వ. దేవా! అవధరింపుము

ఆ. అవుల నొక్కదినమునందుఁ బద్మపదుండు
తీర్థయాత్ర సేయుదివుట నొంది
యభ్యనుజ్ఞ వేఁడ నాచార్యుఁ డీరీతి
ననియె యాత్ర మాన్పు నాశయమున. 1.

సీ. సత్క్షేత్రవాస మొజ్జలచెంత నుంటయు,
యనఘతీర్థము తదీయాంఘ్రిజలము
తదుపదేశకృతాత్మదర్శనం బఖిలదై
వతదర్శనమ్ము తద్వాక్కు బుక్కు
శుశ్రూషమాణశిష్యున కొజ్జచెంతఁ జౌ
ర్యము గూడ దితరత్ర యరుగఁ గూడ
దమితమార్గాయాస మందరా, దందిన
నిద్రచే స్వాధ్యాననిష్ఠ చెడును

గీ. సన్న్యసనము విద్వత్సన్న్యసన మటంచు
వివిదిషాసన్న్యసన మంచు ద్వివిధ, ముభయ
మందుఁ దత్త్వంపదార్థైక్య మాప్య మగుట
గమ్యము త్వమర్థమే కాని కా దితరము. 1.

క. అలవడు నొకచో సలిలము
లలవడ వొకచోట; నొకట నమరును శయ్యా
స్థల, మొకట నమర, దిటు వాః
స్థలలిప్సం బథికుఁ డేమి సౌఖ్యము నడయుక్ · 2.

గీ. జ్వర మతీసార మాదియౌ వ్యాధు లలమ
నేయుపాయంబు గానరా కేఁగుటకును
నాఁగుటకు సాధ్యపడ కల్లలాడుఁ బాంధుఁ
డట్టితఱిఁ బాసి చనును సహాయుఁడేని. 4.

ఆ. అధ్వగునకు నబ్బ వహారాది స్నానశౌ
చాదికము సమాధు లమరపూజ;
లొదవ రాప్తమిత్రు, లదన నన్నము గాదు
మొగము వాఁచు శోకమునకుఁ గూడ. 5.

చ. అనుటయు శిష్యుఁ డి ట్లను మహాత్మ! భవత్కథితంబు కాదనం
జనునె గురూపకంఠమున సంస్థితిఁ గల్గుసుఖంబు గల్గ దెం
దు నయిన దేశపర్యటనదుస్త్యజవాంఛ బలాత్కరించుచుం
డెను బరదేశయాత్రల గణింతునె కష్టము లవ్వి కొత్తలే? 6.

గీ. అష్టకష్టమ్ములందు హెచ్చైనకష్ట
మరయఁ బరదేశయాత్ర గృహస్థతతికి
నేఁ బరివ్రాజకుఁడనయ్యు నెమ్మనమునఁ
దలఁతునే ద్వంద్వజన్యబాధాలవంబు. 7.

గీ. ఆత్మ కంటవు కష్టసుఖాదికమ్ము
కలుగుఁ గర్మానుసారము కాయమునకుఁ
గర్మమో కాలపరిపాటిఁ గలుగుఁ గాల
గతికి దేశవిభేదమ్ము గలుగ దండ్రు. 8.

ఉ. కావునఁ బో ననుజ్ఞ నొసఁగన్ మిముఁ గోరెదఁ బ్రేమతోడ మీ
దీవన నాకుఁ దోడయి విదేశమునన్ దొలఁగించుఁ గ్లేశముల్
కావలె నన్న దుర్ఘటసుఖంబులనేని ఘటించు ధర్మదీ
క్షావిహితక్రియావనవిచక్షణమై ననుఁ జేయు ధన్యునిన్. 9.

క. అనుచు గురూక్తనిషేధము
లను బ్రతివచనములచే మలంపఁగ గురుఁడున్
మనమున నలరుచు ననె నీ
మనసుద్రఢిమ మరయఁ దత్క్రమమున నుడివితిన్. 10.

ఆ. పిన్నవయసువాఁడ వెన్నియో వేత లబ్బు
నొంటిగా భ్రమించుచుండువేళ
నమ్మరాదు జనుల నమ్మకపోవరా
దన్యదేశగామి యగునరుండు. 11.

సీ. విహితకృత్యమ్ము లన్వహము పాల్యము లవి
స్మర్తవ్య మధ్యాత్మతత్త్వచింత
విదితసంవిదుల సౌహార్దము సంపాద్యము
శ్రోతవ్య మాత్మైక్యరూఢరీతి
యనఘచరిత్రు లాయతు లభిగమ్యులు
సహ్యమ్ము దైహికశ్రాంతిభార
మాపద్రహితపదం బాశ్రయణీయ, ము
త్సర్జనీయమ్ము మితంపచాళి
గీ. విమతు లమతులు కుమతులు వెలయుచోట్ల
త్యాజ్యములు సూవె యేవేళలందు నీకు
వితత మొనరించు చద్వైతమతము జగతి
వివిధపుణ్యస్థలములు సేవించి రమ్ము. 12.

క. అను గురుని వాగమృతఝుర
మును గ్రోలి ప్రహృష్టహృదయమునఁ జనె దేశా
టనమునకుఁ బద్మపాదుఁడు
చనె గురుఁడును శృంగగిరికి సహశిష్యుండై. 18.

చ. అచట సురేశ్వరాదిమహితాత్ములు శిష్యులు గొల్వ శారదా
పచితివిలగ్నచిత్తుఁ డయి భాసిలుచుండఁగ నొక్కనాఁడు మా
తృచరణసేవ లేవడి స్మృతిం దవులన్ బుణ మీఁగియున్ బుణో
పచయమునందు బద్ధుఁ డగుభాతిఁ గలంగి యనున్ స్వశిష్యులన్.

శంకరుఁడు తల్లిసమీపమునకు యోగశక్తి నరుగుట.

మ. అది యేమో పరదేవతార్చనము సేయన్ నేఁడు గూర్చుండ నె
మ్మది చేపెట్టి కలంచిన ట్లయిన; దస్మన్మాత ప్రాణావసా
నదశన్ నన్ను స్మరింపఁ బోలు వెస జ్ఞానప్రక్రియన్ ముక్తిసం
పద చేకూర్పఁగఁ బోదుఁ గావలదే ప్రాగ్దత్తవాగ్దానమున్. 15.

ఆ. సన్న్యసించుతఱిని జనయిత్రి వేఁడ బ్రా
ణావసానకాలమందు వచ్చి
నినుఁ దరింపఁజేయుదు నటంటిఁ దఱి యైన
యటుల యోగశక్తి నది స్ఫురించె.

క. అని యవలంబితగగనా
యనుఁడై క్షణమంద జననియంతికమునకున్
జనియె నసాధ్య మ్మని క
ల్గునె యెయ్యెడ యోగసాధకున కెన్నంగన్. 17.

క. చని యాతుర యగుమాతను
గని తత్పదములకు మ్రొక్కఁ గాంచి, జలదమున్

గను ఘర్మతప్తుఁ డటు ల
వ్వనిత తనూతాప మపుడ వాయఁగఁ దట్టెన్. 18.

గీ. తా నసంగుండ యయ్యుఁ జిత్తమునఁ గరఁగి
యమితమోహాంధతమసాపహర్త యతఁడు
తల్లి యిదె వచ్చినాఁడ సంతాప ముడుఁగు
నిపుడ యొడఁగూర్తు నీకోర్కి యేమి యనుచు. 19.

క. చిరమున కనామయుని సుతు
నరయుట హర్షించి మంద మగు స్వరమున ని
త్తఱి భాగ్యమ్మునఁ గుశలిని
నరసితి నిను నింతకంటె నభిమత మున్నే. 20.

ఆ. నేఁడు వేగుఁబోక నిన్నుఁ దలంచితిఁ
బ్రాణ మింక దేహమందు నిలువ
దనుభయంబు నూని యన్న యెచ్చో నున్న
వాఁడొ యెపుడు వచ్చువాఁడొ యనుచు. 21.

ఉ. పుత్రి! జరాతిశీర్ణ మగు మూర్తి భరింపఁగఁజాల, దీనికిన్
బాత్రితఁ గల్గ శాస్త్రవిధిపద్ధతి సంస్కృతి సేసి భవ్యనా
రిత్రిక! పుణ్యలోకచిరవృత్తి నొసంగఁ గదన్న! యన్నఁ దా
పత్రియవారకుం డతఁ డభంగవిమోక్ష మొసంగుభావనన్. 22.

శంకరుఁడు తల్లికిఁ దత్త్వోపదేశము సేయుట.

చ. అమితము, నద్వితీయము, మహాసుఖరూప, మపాస్తమాయ, మ
చ్ఛమహిమ, మప్రమేయమును స్వప్రభమున్ విగతామయంబు జ
న్మమృతిజరాదిదూరము సనాతన మాపరమాత్మతత్త్వ మా
యమ కుపదేశమిచ్చె సనకాదివినుత్యుఁ డతండు భక్తిమై. 23.

గీ. అపుడు జనయిత్రి యను సౌమ్య! యగుణ మాత్మ
నాకు రుచియింప దిఁక సగుణమ్ము రమ్య
మైన దైవతమును దెల్పు మకట! బుద్ధి
కంద దేక మనాకార మగుపరాత్మ. 24.

ఆ. అనుచుఁ దల్లి యన దయాళుఁ డాయతి భుజం
గప్రియాతవృత్తకవనరీతి
భక్తి శివు నుతింప భవుఁడు ప్రసన్నుఁడై
యనిపె నాత్మదూతలను ద్రుతంబ. 24.

ఉ. శూలపినాకపాణు లగుచుం జనుదెంచిన ఫాలనేత్రుదూ
తాళిని గన్నులారఁ గని యాయమ వీరలవెంటఁ బోవఁగాఁ
జాల నటంచుఁ బల్కుటయు శాంకరదూతలఁ బోవ వేఁడి స
చ్ఛీలుఁడు శంకరుండు వినుతించె రమాధవు నాదరంబునన్. 25.

వ. అంత.

సీ. కమలామృదూరుభాగప్రసారితపాద
సరసీజయుగళు నాజానుబాహు
నీళామహీకరాలోలచామరవీజి
తుని వినతాసుతస్తూయమాను
దేహభృదస్త్రాధిదేవతాపంచకా
ర్చితుఁ దమాలాసితద్యుతిశరీరు
నుదయదుష్ణమయూఖసదృశరత్నకిరీటు
నుత్ఫుల్లపుండరీకోపమాక్షు

గీ. భుజగరాజన్యభోగతల్పుని ముకుందు
సుతుఁడు వినుతింప నారూపె మతి ధరించి
పరమయోగీంద్రుశరణి సంసరణ మెడయఁ
దన్మయత నొంది యార్యాంబ తనువు దొఱఁగె. 27.

చ. అంత శరత్కలానిధికరామలదీప్తి చలద్ధ్వజాఢ్యముల్
గాంతము సౌవిమానమును గైకొని వచ్చిన విష్ణుమూతలన్
శాంతమనోజ్ఞ వేషులఁ బ్రసన్నులఁ గాంచి నుతుల్ నుతించున
క్కాంత విమానమం దునిచి గ్రక్కునఁ దోడ్కొని వార లేగుచో.

గీ. అర్చి, రహ, రాద్యపక్షమ్ము లతకరించి
నుత్తరాయణ మబ్దమ్ము లుత్తరించి
పవన రవి విధు తటి దబ్ధిప హరి విధిజ
గంబులను దాఁటి పరమపదంబు చేరె. 29.

శంకరుఁడు స్వయముగఁ దల్లికి నుత్తరక్రియలు నెఱవేర్చుట.

ఉ. ఆమెడ గేహముల్ పొలము లర్థములున్ దన వెల్ల గొన్నగో
త్రీయులఁ బిల్చి యీయమ మృతిం గనె నుత్తరకర్మ మీరు శా
స్త్రీయముగా నొనర్పఁ డనఁ జెంతను బుత్త్రుఁడ వుండి మమ్ములన్
జేయుఁ డటందు వేల తగునే యిటు పల్కఁగ నీకు శంకరా. 30.

గీ. నీయభావమ్మునం దేమ చేయువార
మాత్మజుఁడు చెంత నుండియు నౌర్ధ్వదైహి
కక్రియలు తల్లి కొనరింప జ్ఞాతిజనుల
కిటు నియోగించు టాలింప మెచట నెపుడు. 31.

చ. అనుటయు సంయమీంద్రుఁడనునక్కటయిఁతటిమాధ్యమెందునుం
డునె చరమాశ్రమస్థితు ననున్ గృహిధర్మముఁ బూను మందురే
జనని యటంచు వచ్చితినె చక్క వినుండు ముముక్షు వీమె, నా
వునఁ దదభీష్టమున్ నెఱపుపూన్కిన వత్తు నొనర్తు నిష్టమున్. 32.

క. పూర్వాశ్రమసంబంధము
సర్వము తెగె నాకు, మీరు జ్ఞాతుల రేత

త్సర్వస్వ మనుభవించుచు
గర్వంబున శాస్త్రపథము గాదనఁ దగునే. 33.

మ. మమతన్ నేనరు దెంచినాఁడ ననుచున్ భావింపఁ బాపంబు ని
ర్మమతన్ గర్మము లుజ్జగించి స్మృతిధర్మం బోముచున్ జ్ఞానవ
ర్త్మమునన్ సంసృతిభీతు లౌజనుల సంరక్షింప నీక్షించుస
త్క్రియలన్ సంయములన్ గృహస్థునటుపల్కన్ నాల్కయెట్లాడెనో.

శా. ధర్మాధర్మవివేచనన్ మఱచి యర్థంబే ప్రధానంబుగా
దుర్మోహంబున బ్రుంగి శాస్త్రవిధులన్ ద్రోసాడి పాపంబునన్
నిర్మగ్నాత్ములు గాఁదలంతురె? విధానిష్ణాతు లౌపెద్ద లీ
మర్మంబున్ వివరింత్రు పోయి యడుగన్ భావ్యంబు మీకియ్యెడన్.

ఆ. గురువు నౌదుఁ గాని కొమరుండఁ గా నీపె
కేను సంన్యసించి యేఁగి యుంట
నిడిగొ చనుచు నుంటి నీకర్మలోపంబు
పఱచు మిమ్ముఁ గంతపాశ మగుచు· 36.

సీ. ధృతి సర్వసంగపరిత్యాగినై యేఁగు
నా కింతకలుషంబు సోఁకఁ బోదు
నను సంన్యసించుపుత్రుని గన్నయీామె కే
కర్మలోపములు మోక్షమ్ము చెఱుప
వీకర్మలోపంబు మీకులంబులు తర
తరములు చెఱుపక సురిఁగిపోవ
దర్థాశ విహితకర్మానుష్ఠితిఁ దొఱంగు
ఖలులఁ బూతుల స్మృతుల్ సలుపలేవు

గీ. శాస్త్ర మాచారముఁ దలంచి సత్పథమునఁ
బొందు పోకున్నఁ గులహాని పుట్టితీఱుఁ

గేరళమున కకీర్తి చేకూఱు నూర
మరయుఁడీ తప్పుతోవను మరలుఁ డీవు. 37.

క. అని ధర్మము లెంతగఁ జె
ప్పిన జ్ఞాతిచయంబు పెడచెవిని బెట్టిరె కా
ని నిదానింపర యతిపతి
పను పౌనరింపకయు యిట్లు పలికిరి పెలుచన్. 38.

సీ. పితృకర్మ మొనరింపఁ బిఱుతివిసిరె మునీ
శ్వరులు వారికి లేవె శాస్త్రవిధులు
యతి నంటి వపులఁ బ్రాయశ్చిత్త మొనరించు
కొనఁదగు నిది తోఁసి చనఁగఁ దగద
యాత్మజుం డెట్టివాఁ డౌఁగాక పితృపార
లౌకికవిధులు సల్పంగఁ గర్త
తదభావమునఁ గాక దరి కేఁగ నన్యుల
కధికార మిసుమంత యైన సున్న
గీ. విహితకర్మము మానుసీవిధమున నవి
హిత మొనర్చినమేము నిష్కృతివిరహిత
మైనప్రత్యవాయమ్మున కగ్గ మాదు
మీఁదు నందును గతులు లేకుండు మకట. 39.

ఆ ఇది గృహస్థకృత్య,మే మన్నయ ట్లీవు
సేయవలయు నొండు సెప్పఁదగదు
కా దటందువేనిఁ బోదుము నీయిచ్చఁ
జేసికొనుము మాకుఁ జెప్ప కనుడు. 40.

క. ఆపలుకులకుం గనలుచు
నీపై ష్ప్రితికర్మబాహ్యు లీ రమ్యోద రం

చాపాపచరితులకు యతి
శాపమొసఁగ యతిని దిట్టి చని రెట కేనిఁ. 41.

క. అది ధర్మ మిది యధర్మం
బది కార్య మ్మిది యకార్య మని తోఁపద దు
ర్మదులమదికి భగవంతుం
డెదురఁ బడి నిజమ్ము దెలుపనీ యెటు గానీ. 42.

శా. శాపం బిచ్చి యతీంద్రుఁ డాత్మజననీసంతారకుం డయ్యె సం
తాపం బందుచు 'వీడి పోఁ దగ దనాథప్రేతసంస్కారరూ
పాపద్ధర్మ మి'దంచు మాతృశవదాహార్థంబు వైశ్వానరం
బాపల్లెం గలవారి వేడ, నిడరై రాపుల్కప మ్మెవ్వరుఁ. 43

ఉ. తా నఖిలజ్ఞుఁడే యగుత ధర్మము సెప్పుమమఁ శపించి య
ద్దానికె సిద్ధ మయ్యెనె యధర్మము గాదొకొ తా నొనర్చ, వై
శ్వానర మిం డటంచు మను శప్తుల నేఁ డెటు వేఁడ వచ్చె? ని
ప్పైన నొసంగ మారసెద మాశవ మొక్కఁ డెటుల్ దహించునో.

క. అనువార కాని యచటికిఁ
జనువా రనలమ్ము నొసఁగి సాయపడఁ దలం
చినవారు లెక్క కొకరును
గనరా రతిచిత్ర మూరఁ గలయెవ్వారుఁ. 45.

మ. అటు లింటింటికిఁ బోయి ని ప్పడిగి వ్యర్థాయాసుఁడై శంకరుం
డట నున్నట్టి నిజాన్వవాయులయకృత్యం బెంచి కోపించి యం
తటఁ దన్మాతృపసవ్యదోర్మథనముఁ గావించి దీప్రాగ్ని న
ప్పటఁ బుట్టించి దహించెఁ దత్కుణపముఁ వాసోపకంఠస్థలిఁ.46

క. దహియించి యాదురాత్ముల
బహుళాహంకారపంకపటల మిగుర న

మ్మహితుఁడు వా రందఱు శ్రుతి
బహిష్కృతులుగా — శపించి వదలక వారిన్. 47.

ఆ. 'యతులు మీగృహమ్ములందు భిక్ష యొనర్ప
రింక గృహోపకంఠమే శ్మశాన
మగును మీ' కటంచు నతిఘోరశాపమ్ము
నిడియె నీట నగ్గి వోడమినట్లు.

క. అదిమొదలాదేశస్థులు
చదువరు శ్రుతి యతులు భిక్ష సలుపర తదే
హ్యాదవసితముల, శ్మశానము
సదనాంతికభువియె గాఁగ జరుగును నేఁడున్. 49.

చ. అకట మహానుభావులయెడాటమునన్ బచరించుబుద్ధిపూ
ర్వక మపరాధ మేరికి శుభంబు ఘటించును? శాంతుఁ డంచు మి
న్నక సుజనున్ వ్యథాకులు నొనర్పఁ బ్రమాదము; చందనద్రుశా
ఖక యని రాపువెట్టఁ బటుకీలలతో ననలంబు పుట్టదే? 50.

మ. తిఱకింపన్ యతిమాళి చేసిన దశాస్త్రీయంబుగా నున్నఁ గే
వలధర్మావనబుద్ధిఁ జేయుటను నాపద్ధర్మ మాఁ దాదృశో
జ్జ్వల తేజస్కులు దూల్చివైచెద రవశ్యంభావ్యధర్మక్రియా
కలనాయాతము ప్రత్యవాయముఁ దపోగాఢప్రభావంబునన్. 51.

గీ. అద్ది ధర్మవ్యతిక్రమంబట్ల తోఁచు
నరయ సాహస మా నది మైన నమ్మ
హాత్ము లొనరించి రని యన్యు లాచరింప
రాదు మోస మా నవరిదౌర్బల్యమునను. 52.

క, లోకావనార్థజన్ముల
లోకాతీతప్రవృత్తి లోకులకెపుడున్

స్వీకార్యము కా; దిఁకఁద
ద్వ్యాకులె గాత్రిహ్యామ్మ లంచు వాకొనును స్మృతుల్. 53.

చ ఇటు జననిక్ మునీంద్రసమభీప్సితముక్ విత మస్కముక్ సుఖో
త్కటముఁ బునర్జనుర్విరహితం బగుసద్గతిఁ జేర్చి యాతఁ డం
తట ధరఁ బాదుకొన్నపిమతంబు లడంపఁగ దీక్షఁబూని ప
ర్యటనవిలంబముక్ సలిపె నబ్జపదాగమునంబు గోరుచుక్. 54.

పద్మపాదుఁడు దక్షిణదిగ్యాత్ర నొనర్చుట.

ఆ. మున్ను గురుననుజ్ఞఁ జన్నట్టియప్పద్మ
పదుఁ డుదీచ్యతీర్థపటలిఁ గొల్చి
చనె నవాచి దిశకు సకలామయఘ్నుకు
నెందుఁ గలశజన్ముఁ డెపుడు నుండు. 55.

చ. కని సుభగోరగాభరణకమ్రితనుక్ బృథులింగసన్నిధా
నుని గరుణారసాప్లుతమనోయుత యానుముఁ గూడి మాళిఁ జం
ద్రునికళఁ దాల్చి సమ్ముదఘనుం డగువానిని గాళహస్తినా
థుని సురపాదిదైవతనుతుక్ శివు నయ్యతి గాఢభక్తిమై. 56.

శా. స్నానం బాడి యతండు కాంచనముఖీస్వచ్ఛాంబుపూరంబునం
ద్వానంత్యంబున భావపుష్పసకరం బర్పించి యుగ్గించె వా
క్ఛ్రీనృత్యమ్మున భక్తిపూర ముబుకక్ శ్రీకాళహస్తీశ్వరుక్
జ్ఞానానందమయప్రదీపకళికక్ జ్ఞానప్రసూనాంబికక్.

గీ. కాళహస్తిశుననుమతిఁ గాంచి, కాంచి
కరిగెను బవిత్ర మగుక్షేత్ర మగుటఁ దెలిసి
భవమహాంఽధిసంతితీర్షువుల కదియ
తరణసాధన మనుచుఁ బెద్దలు వచింత్రు. 58.

గీ. ఆత్మభాగ్యాతిశీతిచే నచటివిశ్వ
పతిని నేకామ్రనాథుని నతులఁ గొలిచి
యంతకాంతకుఁ డగురుద్రుహార్ద మరయ
నన గృహాంతర్గత యగు కామాక్షిఁ దెలిచె. 59.

వ. మఱియు నాతిదూరమున నలరారుపురాణపురుషుఁ గరుణారసస్నిగ్ధ స్వాంతు ననాదిమధ్యాంతు లక్ష్మీకాంతుఁ గల్లాలేశుఁ గాంచి నుతించి, యచట గదలి శుచిస్మితవదనమునఁ బార్వతీరూపపరిణత యగునాదిమప్రకృతికిమాత్రము గోచరింప సదా నృత్యము సలుపు సదాశివునివాస మగుపుండరీకపురమున కరిగి, నిర్మలస్వాంతంబును దివ్యచక్షువునై మునిజనంబు తన తాండవము చూచి జన్మమృత్యు జరాభయ మపనయించి తరింప నేత్రమనోవినోదకారకుం డగు పరమేశ్వరు భజించి శివభక్తులం గని తత్తీర్థమహాత్మ్య నడుగ నం దొక్కఁ డిట్లు తద్వృత్తము నెఱిఁగించె. 60.

ఉ. భక్తుల కోర్కె మై శివుఁడు భావమునన్ స్మరియింప గంగ యా సక్తిని జెంతఁ బాఱుటఁ బ్రజల్ శివగంగ యనంగఁ దీర్థమై ముక్తి శివాజ్ఞచే నొసఁగు మున్గినమాత్ర నఘంబు వాసి స ద్భక్తులు గాంతు రీశ్వరునితాండవ మందురు కొంద ఱుత్తముల్.

క. కొందఱు నాట్యంబున శ్రమ
మందిన శివుఁ దేర్ప శివయె యనురాపగ రూ
పొంది ప్రవహించుటన యిది
పొందెను 'శివగంగ' నామము నటం డ్రెలమిన్. 62.

చ. నటదభవోత్తమాంగక పినద్ధచలాచలజాటజూటసం
పుటగళితాభ్రగాంగజలముల్ ప్రణటత్తటరుద్ధనిర్ఝరీ
త్రుటితపతత్కణంబు లయి తోడన పార్శ్వమునుండి జాఱి పా
ఱుట శివగంగ నాఁగఁ దనరున్ దదభిఖ్య యటండ్రు పండితుల్.

చ. అనితరసాధ్యభక్తివివశాత్మకుఁడై నరుఁడేఁగి గంగలో
మునుకలు వెట్టిపెట్టి మఱి పుంగవకేతను పాదపద్మముల్
కనుకలి ముట్టిముట్టి హృదిఁ గ్రిన్నన శోధన చేసిచేసి తా
ననవరతంబు గాంచఁగలఁ డంగజసంహరుదివ్యరాల్యముల్. 64.

క. శివగంగ మునింగి యుమా
ధవుఁ గనుఁగొన్ననరునుదారసుకృతనై
భవము వివరింప దక్షుఁడు
భవుఁ డొక్కఁడగునుగాక పరు లర్హు లౌనే! 65.

గీ. అన విని పయోజపదుఁడు జితాత్ముఁ డభవ
యోజితాత్ముఁడై సమ్మదం బూని తీర్థ
మందు మజ్జన మొనరించి యఖిలలోక
భర్త యగుశంభుపదములవ్రాలి మ్రొక్కె. 66.

ఆ. అచటు వాసి దశరథాత్మజకృతసేతు
దర్శనార్థ మరుగఁ దలఁచి యయ్యు
నుత్తముఁడు మునీంద్రుఁ డొయ్యనఁ జనువాఁడు
సరణిఁ గనెఁ గవేరజాస్రవంతి. 67.

క. క్షీరోదవాసగసితుఁడు
వారిజనాభాదినామవర్ణితుఁ డగునా
హైరణ్యాచేలునకుఁ గా
వేరిపులినసీమ నుంట వేడ్కయుఁట మదిన్. 69.

గీ సహ్యపర్వతకన్యాప్రసన్నతరప
యోభిషిక్తముల్ భగవత్పదాబ్జములు ద
లంచి బహుశిష్యగణము సేవించుచుండ
వెడలె నభిరుచిత్స్థలి వేగఁ జేర. 69.

పద్మపాదుఁడు మేనమామ యిల్లు సేరుట.

క. పోవుచు మధ్యేమార్గ
మ్మావిమలుఁడు మాతులునిగృహమునకు బహుశి
ష్యావృతుఁడై చేరుటకు సు
ధీవరుఁ డగుమేనమామ దేలె ముదబ్ధిన్. 70.

వ. అంత నయ్యెడ నున్నసుహృద్బంధుగణంబు లప్పద్మపాదుఁ జూచి
గుములుగట్టి యొక్కపటి వచ్చిరి. 71.

ఉ. వచ్చినవారిలో నొకఁ డవారితసమ్మదబాష్ప వయ్యె, వా
విచ్చి యొకండు గోడ్వడె, నవేలముదంబొకఁ డందె, నొక్కఁ డ
త్యుచ్చముగా హసించెఁ, బ్రమదోన్నతి నొక్కఁడు పాక్చరిత్ర వా
కుచ్చె మితోక్తి మొక్కె నొకరుం డనుదుల్ దిగమ్రింగి వైచుచున్.

చ. ప్రమదము మీఱ వానిఁ గని బాంధవు లిట్టని రార్య! యెంత కా
లమునకుఁ గాన వచ్చి? తఖిలం బగుబంధుత హార్దపూర్ణచి
త్తములను గోరు నీదుశుభదర్శనభాగ్యము నొంద, నేమి పా
పమొ యొకమాఱు నేనిఁ గనుపట్టవు చుట్టఱికంబు వోయెనే. 78.

క. కలుగరు సుతులు సఖులు బం
ధులు యతికిన్ రాజబాధ తోఁప దెపుడు చో
రులవలనిభీతి పొడమదు
తలఁప యతితత్త్వము కృతార్థతామూలము సూ. 74.

గీ. సుమఫలాభ్యంచితంబుఁ బ్రాంశువు సశాఖ
కోపశాఖాక మగుశాఖ నుర్విజనులు
పీడ వెట్టెడుగతి ధనాన్వితు దరిద్రు
లండఁ జేరి పీడించెద రనుదినంబు. 75.

గీ. రాదు నిద్దుర, లేదు శర్మము కుటుంబ
రక్షణవిలుప్తచిత్తు లాపగ్నిజల కింక
దేవతాభ్యర్థ్వాణం బేడ? దీర్ఘయాత్ర
యేడ?నర్హాన్నిషేవణం బేడఁ దలఁప. 76.

ఆ. నీవు సన్న్యసించునావార్త వింటిమి
తెలుప నొక్కవిప్రకులుఁడు తొల్లి
యెంతకాల మైన నీవు రా విపుడు తీ
ర్థముల కనుచు వత్తు దైవవశత. 76.

సీ. సౌఖ్యమ్ము నొసఁగునవృక్షముల సమాశ్రయిం
చియు వానివిడుచువిష్కిరములట్ల
పరక్లప్తమఠసుగావసథమ్ము లాశ్రయిం
చియు యతి వానిఁ ద్యజించి యేఁగు
సుమములవ్రాలి సారము సంగ్రహించి భృం
గములు తద్రస మానుకరణి వెలయ
నిల్లిల్లు దిరిగి యోయిరము భిక్షించి త
త్సార మాని తపస్వి సౌఖ్య మొందు
గీ. ఘనవిరాగోదితాత్మావగతియ భార్య
తనువె భవనంబు మఱి సంయతంబె సుఖము
ధృతవిరాగులు శిష్యులే సుతులు గాఁగ
నలరుయతులకు నర్థనీయంబు గలదె. 78.

ఉ. దారపరిగ్రహార్థము సదా మనుజుం డొనరించి యత్నముల్
దార లభింపఁ బుత్త్రులఁ గనన్ మదిఁ గోరెడి, నిల్లు గోర్కులన్
సారెకుఁ బర్వులెత్తి కనఁజాలఁ డొకింత ఫలంబు ధాత్రిఁ జే
కూరునొకో సమాప్తి యని కోర్కుల కారయ నెన్నఁడేనియున్.79.

గీ. కోరుకొన్నట్టికోర్కి చేకూరదేని
యమితదుఃఖంబు గను నరుం డభిలషితము
తొలఁగ నేరఁడు కామతత్పరున కెందు
వెతలె కాన ధరింప నౌ మతి విరక్తి. 80.

ఆ. అనఘ! చిత్తశుద్ధి యగు మూలము విరక్తి
కదియ మూల మగు మహన్నిషేవ
కంద్రు గానఁ దిరుగుచంద్రు భవాదృశు
లుర్వి నల్దిశలఁ బరోపకృతిగ. 81.

క. అజ్ఞాతగోత్రులై బ్రా
హ్మజ్ఞానుల యయ్యు జడులయటు కనఁబడుచున్
ప్రాజ్ఞులు ప్రాణ్యనుకంపా
భిజ్ఞులయి చరింత్రు విషయవిముఖత వెలయన్. 82.

క. చరియింత్రు లోకసంగ్రహ
పరులై తీర్థములు శుద్ధభావులు మహితుల్
దురితవిదూరులు వారలు
కరమున సోఁకిన జలంబె ఘనతీర్థంబౌ. 83.

గీ. నీదు దర్శన మనుపమామోద మొసఁగె
నుండు కతిచిద్దినంబు లోపండిత! యిట
నేఁగఁగల వంచు నేత్వద్వియోగచకితు
లగుచు బంధువు లిప్పుడే వగచుచుండ్రి. 84.

సీ. నాట్యమందిర మనంతక్లేశములకు సా
హసకృత్యముల కెల్ల నాశ్రయంబు
ప్రాసాదరాజంబు పైశూన్యమున కస
త్యాలాపకోటికి నాలయంబు

హింసావిశేషాదిమాంసలమ్ము హిరణ్య
బహుళతృష్ణాలతోపఘ్నయష్టి
ఖలజనోరగసముత్కరవామలూరువు
జ్ఞానవంతులకు స్మశానభూమి
గీ. యగుగృహం బాశ్రయించుకొన్నట్టిక్రూర
చరితులము మేము నీసాంద్రకరుణఁ జిలికి,
శుద్ధుల నొనర్చి యతిచంద్ర! యుద్ధరింప
కున్న నోయన్న! యెన్న మా కున్నె దిక్కు. 85.

క. అని వాత్సల్యముఁ దైన్యము
నినుమడిగాఁ బలుకులందు నెసఁక మెసఁగఁ బ
ల్కినతనచుట్టములకు ని
ట్లనియెఁ బరివ్రాట్టతం డుదారార్థముగన్. 86.

గీ. అధికతాల్పత్వముల నెంచ కదిర! దేహి
కూర్చు దైవమె యోగవియోగములను
నుండవలె నిర్వికారచిత్తుం డయి నరుఁ
డిష్టము ఫలించినను ఫలియింపకున్న. 87.

ఆ. అన్నదాత యెవ్వఁ డగు నాకటంచు మ
ధ్యాహ్నవేళ క్షుత్తృడార్తి వచ్చు
నతిథిక్షుత్తు దీఱ నన్నంబు నిడ్డ సు
శీలు పుణ్యమహిమఁ జెప్పఁ దరమె. 88.

ఉ. స్నాన మొనర్చి యగ్ని నిరుసంజను వేలిచి, తాల్చి దండముం
బూని మృగాజినంబు, శ్రుతిఁ బోలఁ బఠించుచుఁ జేరువర్ణిచం
దానన మధ్యమాహమున దండియు గేస్తులయిండ్లు సేరు బి
క్షానకునై యతాత్ముఁడను శాస్త్రవదావదుఁ డౌచు నిచ్చలున్.

ఆ. తనువు నెవని యన్నమునఁ బెంచుకొనుచుఁ ద
పంబు సేయు నతఁ డపస్వితపము
దక్కు నట్టియన్నదాతకు సగము ద
క్కును సగమ్ము కర్త కనవె స్మృతులు. 90.

చ. అరయ విచక్షణుం డగుగృహస్థు గృహస్థితుఁ డయ్యుఁ గ్లేశముక్
బారయక త్రైర్థికుల్ గనెడుపుణ్యము నొందు ధనాఢ్యుఁ డేని యం
దఱును గృహస్థుఁ జేరుకొని దానముచేతనొ ప్రీతితోనొ త
స్కరగతినో బలాత్కృతినొ చక్క భుజింతురు తదీయవిత్తముల్.

క. తనుపఁ దగు వేదవిదు వి
ప్రుని దాన సమస్తనిర్జరులు తనియుదు ర
య్యనఘునియం దఖిలసురలు
ననయము వసియింతు రనె స్వయంబుగ శ్రుతియే. 92.

సీ. నిజధర్మనిష్ఠులు నిఖిలార్థవేత్తలు
విజితేంద్రియులును సేవితసమస్త
తీర్థుల్ పరోపకృతివ్రతుల్ మహితు
లేఁ తెంతురు గేస్తు నిశాంతమునక
కావునఁ దత్తీర్థసేవాఫలంబు గే
హమునను౦డియ తద్గృహస్థుఁ డెనయు
గృహికి నిజావాసమే తీర్థ మగుట వ
దాన్యుండు గావలె ధనికుఁ డెపుడు
గీ. మూషికాద్యంతరస్థితమ్ములును గోమృ
గాభ్రగాదిబహిర్వర్తులైనజీవ
సృష్టి జీవించు గృహి నాశ్రయించి కాన
గేస్తు సర్వోత్తమునిగ నంకింతు మదిని. 93.

గీ. తనువు మూలంబు పురుషార్థమునకు నన్న
మాతనువునకు మూలమం చనె నిగమము
లన్న మొదవ మూల మ్మాగృహస్థు మాకు
నఖిలఫలము గృహస్థుద్రిమాశ్రియంబ. 94.

క. మఱిమఱి చెప్పెద వినుఁ డా
దరమునఁ బూజింపుఁ డతిథిఁ దద్గృహమున శా
తురుఁడై రాఁ;బూజితుఁ డు
ద్ధరించు, ధిక్కృతుఁడు కులము హరియించు వడిన్. 95.

క. చేయుఁ డనభిసంధిగ నా
మ్నాయోదితకర్మములు, సమస్తము పరమే
శాయత్తము సేయుం, డటు
సేయంగాఁ జిత్తశుద్ధి సిద్ధించు వెసన్. 96.

చ. జవమునఁ గౌఁగిలించు నెలజవ్వని మవ్వపుఁబైఁటఁ దుఋల్లుచ
న్గవ నునుఁజందనద్రిపమునన్ విలసిల్లు నురమ్ముతోడివా
రవుదురె కాక పీ; రిఁక యహాయతివర్యపదాబ్జపూజనో
త్సవగతపాపులై దయయు ధర్మము గల్గి తరింతు్రి గా కొగిన్. 97.

చ. అని తనబంధువిప్రతతి కబ్జపదుం డుపదేశ మిచ్చి స
ల్పె నపుడు భిక్ష మాతులునివేశమునందు; భుజించి కూరుచుం
డినతఱి మేనమామయు వినేయుని కేలఁ గలట్టిగ్రంథమున్
గని యడిగెన్ సరోజపదు'గ్రంథ మిదేమి'యటంచుఁ బ్రీతిమై. 98.

—: పద్మపాదుఁడు తనభాష్యటీక మేనమామకడ దాఁచుకొని యరుగుట :—

క. మామ యన నసామాన్యుఁడు
మీమాంసాశాస్త్రమున నమేయప్రతిభా

ధాముఁడు ప్రాభాకరమత
గామి యఖిలవేదవిదుఁ డఖండయశుండున్. 99.

ఆ. అంతవాఁడు తన్ను నాదృతి నడిగె నం
చపరిమితముదంబు నంది యార్య
వర్య! శంకరార్యభాష్యమునకుఁ డీక
యనుచు మామ కద్ది యరయ నొసఁగె. 100.

ఉ. కాంచి తదీయటీక మతికౌశలికిన్ ముద మొందెఁ గాని యిం
చించుక యొంట రెంటఁ గనియెన్ వెత, తద్రచనాచమత్కృతిన్
గాంచినమోద మన్యమతఖండనలక్షితదుర్దమోక్తియు
క్త్యంచితరీతి నస్తమయ మయ్యెను మామకు నేమి చోద్యమో. 101.

క. స్వాభిమత మై తనర్చెడు
ప్రాభాకరమతమునకు నిరాకరణం బా
యాభాగమ్ములఁ గని మది
క్షోభించి యసూయ మాటికొని వినుతించెన్. 102.

ఆ అపుడు భాగినేయుఁ డనె మాతులునకు సే
తువు భజింపఁ బోవుదును ద్వదాల
యమున గ్రంథ ముంచి యరయు మోయార్య! నా
ప్రాణ మెల్ల దానిపై నెయుండు. 103.

గీ. ఇతరులకు గోగృహాదులయెడల నెంత
ప్రేమ ముండునో యంత సంప్రీతి పుస్త
కములయెడ మా కటంచు నాగ్రంథ మప్ప
గించి వెడలెను సేతువుఁ గాంచు కోర్కెన్. 104.

చ. అటు చనఁ జూచున ప్డదరె నాయతివామభుజోరునేత్రముల్
తటుకునఁ దుమ్మె నొక్కఁ, డఖిలం బడి కాంచియు దుర్నిమిత్తసం

కటుత గణింప కాతఁ డధికం బగువేడ్కఁ జనెన్ సశిష్యుఁడై
యెటు విధి త్రిప్పు నట్లె భ్రమియించుట నైజగుణంబు ప్రాణికిన్.

శా. చింతించెన్ మది నప్డు మాతులుఁడు 'స్వస్రీయుండు పేర్కొన్నసి
ద్ధాంతంబుల్ గురుపక్షహాని సలుపన్ దక్షమ్ము; లీగ్రంథముల్
సాంతంబుల్ దహియింప, నాగురుమతం బవ్యాహతిన్ వ్యాప్తమౌ
నిం తేలా యన;వాక్కులన్ మలఁపరా దీగ్రంథ మావంతయున్.

ఆ. నైజపక్షనాశనముకంటె గృహనాశ
నంబు మే లగుట గృహంబుతోడఁ
బుస్తకము దహింతుఁ బొడగానరా దంచు
నింటి కగ్గి వెట్టి యిట్టు లేడ్చె. 107.

ఉ. అక్కట! జాలిమాలి గృహ మగ్ని యిదే దహియించుచుండెఁ బెం
పెక్కిన సర్వసంపదలు నీక్రియ బూడిద యాట కేమవన్
దక్కఁగ మేనయల్లునమితశ్రమ మాకృతి కేడ్తు నింటిలోఁ
జిక్కి నశించె నే మనుచుఁ జెప్పుదు రే పతఁ డేఁగుదేరఁగన్. 108.

గీ. అనుచు విలపించె నని యెల్లజనులు చెప్పు
కొనెదు నైతిహ్య మీవిరచనకు మూల
మఘ మొనర్చెదువాని కెంతగు ఫలంబు
దాని కినుమడిగాఁ జెప్పువాని కబ్బు. 109.

పద్మపాదుఁడు దర్భశయనాదిపుణ్యస్థలముల కేఁగుట.

మ. అటు లాపద్మపదుండు శిష్యసహితుండై యేఁగుచోఁ ద్రోవచ
క్కటి ఫుల్లర్షివరాశ్రమంబు గన రాఁగాఁ బొంగి యం దేఁగె న
చ్చట మున్ రాముఁడు రావిచెట్టుమొదలన్ జాపంబు దానుంచి ని
స్తటచింతాజలరాశిలో మునిఁగెనో దర్భాసనాసీనుఁడై. 110.

ఉ. ఏగతి సాగరంబుఁ దరియించితును జానకి నెట్లు చూతు నిం
కేగతి భూచరిష్ణు లగునిక్కపివీరులసేన లబ్ధిపైఁ
బోఁగల వంచుఁ జింత మనముళ్ మథియింపఁ గుశాసనస్థుఁడై
రాఘవుఁ డుండఁ గానఁబడెఁ గ్రిచ్చఱ జ్యోతి యొకండు దవ్వులన్.

చ. అభిముఖమై తదుజ్జ్వలమహా స్ఫురదించుట గాంచి కీశరా
ట్ప్రభ నిలుచుండి ఫాలతటసంఘటితాంజలియై కనంగఁ ద
త్ప్రభయుఁ గ్రమక్రమంబుగను బంచజనాకృతిఁ దోఁచి తాపస
ప్రభుశుభరూపమై నయనపర్వ మొనర్చుచుఁ జేరవచ్చుచున్. 112.

క. పాపాపహంత సౌమ్యుఁడు
లోపాముద్రాయుతుం డలోకద్యుతి వా
తాపిదమనుఁ డర్ణవనివ
హాపోశనపటు వగస్త్యుఁ డై కనఁబడియెన్. 113.

వ. రాముండు నక్కుంభసంభవసందర్శనంబున హృదయంబునం గల ఖేద ముపశమిల్ల నల్లన సతీయుతుం డగునమ్మహర్షి కర్ఘ్యాదు లొసంగి తత్పదంబుల శిరంబు సేర్చి కొండొకతడ నట్లన యుండి ధృతిఁ బూని యుత్థితుఁడై యి ట్లను. 114.

ఆ. జనకసముని నిన్నుఁ గనఁ గల్గుట శమించె
నెల్లదుఃఖ మబ్ధి యుంకినటుల
యే నవాప్తకాముఁ డైనాఁడ మాసూర్య
వంశ మొందె నేఁ డవార్యమహిమ. 115.

సీ. తొలుత రాజ్యపదచ్యుతుఁడనై సతీభ్రాతృ
సహిత మరణ్యావాసము నొనర్తు
నచట మారీచుమాయల నేను ద వ్వేఁగ

నవనిజ రావణుం డపహరించెఁ
గొనిపోయి యసుర సీత నశోకవని డాఁచె
నని మే న్దొఱుఁగనున్న దనియు వింటిఁ
దరుచరాధిపునిమైత్ర్యము గాంచి తత్సేన
గొలువ రా నడ్డ మీాజలధి దగిలె
గీ. దాఁటు టెటు? దీని రక్కసు గీటడంచు
టెట్లు? జానకిఁ దెచ్చుటయెఁ? ట్లటం చు
పాయ మెఱుఁగక యుండ నాపాలిదైవ
మనఁగ నీదర్శనం బబ్బె మునిలలామ! 116.

వ. అనుటయు నత్తాపసలలామం బి ట్లనియె. 117.

చ. వగవకు వత్స! భానుశశివంశజు లైనమహాత్ము లెందఱో
వగల మునుంగ రే వ్యసనవర్జితులై విలసిల్ల రొక్కొ! ము
జ్జగమున నీసహోదరునిసాటి ధనుర్ధరుఁ డుంట కల్ల, యి
య్యగచరనేత బాసటగ నబ్బె ననాథుఁడ నంట లెస్సయే. 118.

గీ. ఇంతటిసహాయసంపత్తి యిరవుకొనియె
నే నిదె హితోపదేష్టనై యేఁగుదెంతు
నింక నివ్వారిరాశి ని న్నేమి సేయు
స్వాంతమందుఁ దలంపు గోష్పదము గాఁగ. 119.

చ. కలికములోనికేని యుదకం బొకబొట్టును లేనియట్లు లీ
జలధి నొనర్తు, నీవుఁ గపిసైన్యము నేఁగఁగ వచ్చుఁ గాని యం
దుల యశ మెల్ల నాదె యగుఁ, దోయధి నీ వెటొ కట్టితేని య
య్యలఘుయశంబు నీది యగు యత్న మొనర్చి రచింపు సేతువుః.

మ. అరిఁ జెండాడి ధరిత్రిపుత్రిఁ గొని నీ వాచంద్రతారార్క మా
స్థిరకీర్తిన్ గను మంచు నగస్త్యముని యాశీర్వాదమున్ జేసి క
న్దొలఁగన్ సేతువు గట్టి వార్ధికిఁ గపీంద్రుల్ సేనతోఁ గొల్వఁ జె
చ్చెర లంకాపురి సొచ్చి వ్రచ్చి రిపు, దెచ్చెన్ రాముఁ డాభూమిజన్.

వ. అని యాక్షేత్రమహిమ వర్ణించి తత్తీరంబున నాభిక్షువు స్నానం బాచరించి రామనాథునకుఁ బ్రణామము లొనర్చి మనుజులకు శ్రద్ధ గలుగుటకై తద్వైభవం బంతయు శిష్యులకుఁ జెప్పుటయు నందొక్కపండితుం డగుశిష్యుండు 'రామేశుఁ' డనునామ మేసమాస మనుటయుఁ దత్పురుష కర్మధారయ బహువ్రీహి భేదంబుల ముత్తెఱం గగు నని పద్మపాదుం డిట్లు వివరించె. 122.

గీ. తత్పురుష మంచుఁ దొలి రఘూద్వహుఁడు నుడివె
నభవుఁ డనియె బహువ్రీహి యనుచు భక్తి
నమరు నది కర్మధారయం బనిరి సమస
నమ్ము వివరింప 'రామేశ' నామమునకు. 123.

చ. అనుచు సమాసమున్ దెలుప నచ్చటికోవిదలోక మెల్లఁ ద
ద్వనరుహపాదుధీపటిమ భక్తి నుతింపఁగఁ గొంతకాల మం
దున వసియించి శిష్యసహితుం డయి తీర్థము లెల్ల నాడి య
య్యనఘుఁడు మాతులీయనిలయంబును జేరెను బర్యటించుచున్.

సీ. గృహదాహమును విని ఖిన్నుఁడై యాపద్మ
పాదుఁ డాగ్రంథావసాదనమున
కందిన యత్యార్తి కంటెను మాతులు
నిల్లుపోకకు దురటిల్లి మిగుల
'నను విశ్వసించి డాఁచిన గ్రంథదాహమ్ము
నకె కాని గృహనాశనమున కడలు'

ననెడు మాతులుని నూరార్చి నాబుద్ధిలోఁ
గలదు గ్రంథ మ్మని తెలిపి యప్డు

గీ. వ్యాఖ్య మరల రచింప నుపక్రమించు
టెఱిఁగి బుద్ధిఘ్ను మగుద్రవ్య మిరవుకొల్పి
యోగిరము పెట్టి తినిపించె భాగినేయు
నప్పయోముఖవిషకుంభ మంత్రి జనులు. 125.

పద్మపాదాదిశంకరశిష్యు లొక్కటఁ గూడుకొని యాచార్యులఁ జేరుట.

వ. ఆసమయంబునఁ దన్నుంబోలెఁ దీర్థయాత్రాపరు లగుసతీర్థ్యులు కని
ష్ఠాశ్రమస్థు లగుకొందఱా వృత్త మెఱింగి యరుదెంచి కృతప్రణా
ములై యనేకదివసయోగక్షేమమునఁ బరస్పరప్రశంసల నొనర్చు
కొనిరి. 126.

మ. పటువాచావిజితాంగిరఃఫణిపతిప్రాచేతసుల్ దద్వశుల్
ఘటితాచార్యపదాబ్జచిత్తు లయి శంకల్ దక్కఁ యాపల్లవో
త్కటతేజ బల్లవ మట్లు ద్రుంచి యసుహృత్త్యాహితాత్యాహితా
ర్భటి దీపింతురు; దేశికాంఘ్రి పురుషార్థం బెద్ది చేకూర్పదో. 127.

గీ. అంతఁ దచ్ఛంకరార్యశిష్యప్రతాన
మాలకించె స్వదేశకీయమును సుఖద
మైనయొకవార్త నఖిలతీర్థాటనంబు
సలిపి వచ్చినయొకవిప్రకులునివలన. 128.

చ. గురువరుఁ జూడఁ జాలమికిఁ గొందల మందెడుశిష్యబృంద మ
క్కఱణి నెఱింగి పొంగి కనఁగాఁ జనఁగోరిరి కేరళాన; క
త్తఱి కె గురుండు గూడఁ దనతల్లికి నంత్యవిధుల్ పొనర్చి ని
బ్బరముగ నాత్మధర్మపరిపాలనసక్తి విరక్తి రాజిలెఁ. 129.

క. కేరళమున విష్వక్సం
చారుండై మానసమున ఛాత్త్రులరాఁగన్
గోరి చని పొగడ దేశికుఁ
డీరీతి మహాసురాలయేశు నొకతఱిన్. 130.

సీ. పరిపూర్ణుఁడవు జగత్పతి నీవు లీలచే
    నప్రయోజనవాంఛ నధిగమించి
సృజియింతువఁట చిదచిద్రూపముగ జగ
    మపగతసదసత్త్వమైనప్రకృతిఁ
ద్రిగుణమ్ము లూని యీజగము పుట్టించి ర
    క్షించి తుదింతువు త్రిమూర్త్యంచనమున
వివిధజలప్రతిబింబితరవియట్లు
    విశ్వగతిన్ బహువిధముఁ గందు
గీ. వనియభిష్టుతు లొనరించు చా విశిష్టుఁ
డమరసద్మమ్మునం దుండువసరమున
సుచిరవిరహార్తులైనశిష్యులు నమస్క
రించిరి తదంఘ్రియుత్తంసవృత్తి మెఱయ 131.

క. కుశలానుయోగపూర్వము
వశిచంద్రుఁడు శిష్యతతిఁ గృపం దేర్చ వ్యథా
కృశుఁ డజహద్గద్గదికా
వశుఁడై కంపిలుచుఁ బద్మపాదుం డనియెన్. 132.

క. దేవా! శ్రీరంగేశ్వరు
సేవించి మిమ్ముల్ భజింపఁ జేరుచు నుండన్
ద్రోవను మాతులుఁ డగపడి
స్వావసథము సేర్చెఁ బ్రిశ్రియమ్మున నన్నున్. 133.

ఆ. అతఁడు భేదవాది యని యెఱింగియును బూ
ర్వాశ్రమీయవాసనానుబంధ
వశత యుష్మదీయభాష్యటీకఁ బఠించి
యొప్పితిని గృతానుయోగు మామ. 184.

గీ. దగ్ధముద్రాస్యముద్రమంత్రమ్ము లగుచు
ధ్వస్తగురుతర్కకపిలతంత్రమ్ము లగుచు
నిగమసారామృతముఁ జిల్కునీదుసూక్తు
లనెడు వర్మమ్ము దాల్చి మామను జయింతు. 185.

సీ. కాణాదసేనాముఖమున ఖడ్గాఖడ్గి
విహరణంబున నింత వెతను గనునె
పశ్యత్ప్రదానీకపటలిశస్త్రాశస్త్రి
రణరంగమునయందు శ్రమ మెనయునె
కాపిలబలముతోఁ గడఁగి యష్టీయష్టి
యొనరింప నాయాస మొందునొక్కొ
జైనబౌద్ధాదిపాషండులతోఁ గదా
గది యాజి నస దైనఁ గందునొక్కొ
గీ. ధీర! యాక్తికవంశమౌక్తికమయమ్ము
లైనభవదీయసూక్తిసంతానములను
వ్యూఢకంకటుఁ డైనయేఁబుధుఁడు గాని
యఖిలజగములఁ గాలత్రయంబునందు. 136.

వ. అది యట్లుండె నవధరింపుము. 137.

సీ. అతఁడు గాఢోత్కంఠుఁడై యభినందన మొనర్చి
నన్ను నావ్యాఖ్యను మున్నువోలె
నమ్మి మామకము గ్రంథమ్ము దద్గృహమందు

విన్యస్త మొనరించి వెడలినాఁడ
నర్ధరాత్రిము స్వగేహముఁ గాల్చె మామ ము
త్కృతకృతి భస్మసాత్కృతము గాఁగ
బుద్ధిహానికి శైక్షమునఁ బెట్టె గరళమ్ముఁ
గృపణుఁడై యని పుట్టెఁ గింవదంతి

గీ. యేది యెటులైన దుర్విధి నాదుమది య
సంశయ మ్మాచుఁ బూర్వప్రసాద మెనయ
దాయె భవదీయసేవాపగాయణులకు
నిట్టి విషమోగ్రదశ యుక్తమే మహాత్మ! 138.

ఆ. అట్టు లగ్ని గొనినయాటీక నెల్లను
మరలఁ గూర్పఁ బోవ మందమతిని
యుక్తిపాటవంబు సూక్తులు మున్నట్లు
కలుగ దాయె నెంత గాసిపడిన. 139

చ. పరమదయాస్పదం బగుభవత్పదముల్ శర ణొందునట్టియం
దఱు నతిదీనులైనఁ బరితప్తుల యైనను గందు రమ్మహే
శ్వరుపద మార్య! త్వచ్చరణభక్తుఁడ నా కపరాధ మున్నె? యే
దురితము మీపదార్హణముతోఁ జెడు నం డ్రిది సేయు సార్థముల్.

చ. అని వచియించు పద్మపదు నాగురుపాదులు పల్కి రుత్తమా
ర్థనిబిడతన్ దయారసకరంభితచిత్తసరోజు లౌచు సాం
త్వనవచనంబులన్ శ్రిసణతత్పరచిత్తతమోపహారకం
బు నమృతసాగరోపమితముల్ ఋత మాఘణితిన్ స్మితాస్యులై.

క. విషమము కర్మవిపాకము
విషమోహాసమం బవార్యవిక్రమ మనుసీ

విషయము సురేశ్వరునితో
మృష గా దెపు డనుచుఁ బల్కనే యానాఁడే. 142.

ఆ. ఒనర వార్తికమున కుత్సాహియై యుండు
నతని కీరు గూర్చునలపరాభ
వాగ్నిసుమి త్వదీయ మగుగ్రంథమును గాల్చెఁ
గాదు మేనమామ, గాదు వహ్ని. 143.

క. ఇతరులమన మున్సురు మను
గతి నిర్హేతుకము మసలఁ గా, దయ్యావమా
నితుచిత్తక్షోభము సం
తత మేర్చుఁ భస్మపిహితదహనోపమమై. 144.

క. ఎంతవిరాగము గల్గిన
నెంత తప మొనర్చినను మ తెంతగ శాంతిన్
దాంతి గడించిన నేని ర
వంతయసూయకును లోఁగ నఖిలము ఖిలమా. 145.

వ. అది యట్లుండ నిమ్ము మున్ను శృంగగిరిక్షేత్రంబున నామూలాగ్ర
ముగాఁ బంచపాది వినిపించితివిగదా; దాని నేను మఱువలేదు ఖేద
మ్ముడిగి వ్రిమ్మట లిఖించుకొమ్మని యూఱడిల్లఁ బలికి యప్పుడ.
కాలిపోయిన పంచపాదిగ్రంథమును శంకరులు ధారణాబలమునఁ జెప్పుట.

ఉ. చెప్పెను బద్మపాదుఁడు రచించినతొల్లిటియానుపూర్వితో
నొప్పఁగఁ బంచపాదికృతి నొయ్యన నయ్యతి-సర్వవిద్యలన్
గుప్పి జగత్త్రయంబును గకుప్పలఁ గప్పెడుజ్ఞానశక్తిచే
నొప్పెడు దేశికాఖ్యపురుషోత్తముఁ డట్టుల సెప్ప టబ్రమే? 147.

సీ. పద్మపాదుండు రభస మప్పంచపాది
వ్రాసికొని పరమానందభరితుఁ డగుచు

లేచుఁ గూర్చుండు విలపించు నాఁచికొనును
బరవశుం డయి యెలుఁగెత్తి పాడు నాడు. 148.

వ. అంత. 149.

శంకరుఁడు కేరళరాజునకు నాటకత్రియముఁ జెప్పుట.

మ. కవితాప్రౌఢుఁడు రాజశేఖరసమాఖ్యాకుండు తత్కేరళో
ర్వివిభుం డాయతిచిత్రవార్త వినుచుం విచ్చేసి కోటీరర
త్నవిఘృష్టాంఘ్రిపయోరుహుం సలుపఁదత్తార్ఘ్యంది యానందమొం
ది విభుం దత్కృతనాటకత్రియమువ్యాప్తింగూర్చిప్రశ్నించుచుం.

క. మొగ మింత సేసికొని య
జ్జగతీవరుఁ డనియెఁ బద్మచరణగచితకో
శగతిని నానాటకములు
దగులంబడె పీతిహోత్రధాటికి లోనై. 151.

క. అన విని శంకరసంయమి
మును వినుటను నాటకములు మూఁడింటిఁ బఠిం
చిన లిఖియించుకొనియెఁ ద
జ్జనపతి విస్మయతరంగితస్వాంతుండై. 152.

ఉ. స్పష్టముగా లిఖించుకొని పార్థివచంద్రుఁడు పొంగుచుం మనో
భీష్ట మొదేని యున్న వచియింపుఁ డొనర్చెద నంచుఁ బల్కని
ర్దృష్టభవానుబంధుఁడు యతీంద్రుఁడు వల్కెను వైదికక్రియా
భ్రష్టులు గాఁగఁ గాలటినివాసుల కిచ్చితి నేఁడు శాపముం. 153.

క. నాయిచ్చినశాపము భూ
నాయక పాలింపు మీ వనారతమును వై
ధేయులు వారలు నీకు వి
ధేయులు సుమి యనుచుఁ బలికె దేశికుఁ డంతం. 154.

గీ. పద్మపాదుఁడు నష్ట మౌపంచపాది
నెనసి సంతుష్టిఁ గనఁ గేరళేశ్వరుండు
నాటకత్రయ మొంది ప్రణాత యగుచు
గురుపదధ్యానరతుఁ డౌచు నరిగెఁ బురికి. 155.

శంకరుఁడు జైత్రయాత్రకు వెడలుట:—

ఉ. చెంతలఁ జేరి కొల్చుచు స్వశిష్యసహస్రములున్ సుధన్వభూ
కాంతుఁడు వచ్చుచుండ నధికం బగుసర్వదిశాజిగీష నా
దాంతుఁడు శంకరుండు దొలుతన్ జని సేతువు దాఁకఁ బోవ మా
ర్గాంతర వర్తమాన కుమతాంతరవర్తిజనార్తికంబుగన్. 156.

వ. అట్లు పద్మపాదహస్తామలకసమిత్పాణిచిద్విలాస జ్ఞానకందవిష్ణుగుప్త శుద్ధకీర్తిభానుమరీచి కృష్ణదర్శన బుద్ధివృద్ధి విరించిపాద శుద్ధానంతానందగిరి ప్రముఖసహస్రశిష్యులతోఁ గూడి శంకరుండు చనుచు మధ్యేమార్గంబు మధ్యార్జునం బనుశివావిర్భూతక్షేత్రంబు సొచ్చి.

గీ. వనజగర్భాదిపూజితాంఘ్రిని నదృష్ట
చరుని మధ్యార్జునాహ్వయపరమశివుని
బుద్ధి నుపచారములఁ గొల్చి పొడవుమీఱు
పాపముల వీడ్కొని ఫలైకపాత్రమయ్యె. 158.

వ. అట్లు కొలిచి యాభగవత్పాదులు మధ్యార్జునక్షేత్రాలంకార మగుమహాదేవు నుద్దేశించి యిట్లనిరి. 159.

క. నీవే యుపనిషదర్థము
నీవే సర్వజ్ఞుఁ డగుట నిగమాభినుతా
బై వరలున దద్వైతము
దేవా! ద్వైతమ్ము తెలిపి తీర్పుము శంకల్. 160.

మ. అన మధ్యార్జునలింగమూర్తి నొకదివ్యజ్యోతి తోఁ దెంచి బో
రన "యద్వైతము సత్య" మంచును దిరివారం బార్చి మాయంబుగాఁ
గను, దద్ద్విష్టలు నద్భుతంపడి యశంకన్ శంకరాచార్యపా
వనపాదాశ్రయులై గ్రహించి రపు డద్వైతాధ్వమున్ భక్తిమై. 161.

వ. మఱియుఁ బ్రాతఃస్నానాదివిశుద్ధులై యాదిత్యాంబికావిష్ణుగణనాథ మహేశ్వరాత్మకపంచాయతనపూజాతత్పరులుం, బంచయజ్ఞపరాయణులు శ్రుత్యాచారరతులు శుద్ధాద్వైతబద్ధబుద్ధులు నగుట యు వారల వీడ్కొని శంకరుఁడు నశిష్యంబుగ రామేశ్వరంబు సేరుటయు నప్పుడు. 162.

శంకరులకు శాక్తులతో వాదము.

క. జరిగె గిరిజార్చనాచ్ఛల
పరిపీతాసవము శాక్తపటలముతో శం
కరులకు మతవాదము పరి
సరజనదత్తానుమోదసద్యుక్తికమై. 163.

వ. అది యెట్లనః—నాశక్త్యుపాసకు లెల్ల యతిశేఖరునకు మ్రొక్కి—"స్వామీ మామతంబు పావనం బవధరింము. శంభుగుణముల కవ్వలిదియు, నశేషకార్యజననియు, నాద్యయు నగుశక్తిచే మహాదాది సకలజగం బుత్పన్న మగు. 164.

గీ అల్లపరశక్తి వాఙ్మనసానవాప్య
యగుట సేవింపరామిఁ దదంశ మగుభ
వానిపాదంబురుహము లన్వహము పూజ
సలుపుచుందుము మార్య! నిమ్ముదుపభక్తి. 165.

క. శ్రీవిద్యోపాసకులకు
జీవన్ముక్తిని ఘటించు శ్రీశక్త్యంఘ్రుల్

గావునఁ దాల్తుము బుజముల
గ్రీవాస్థలి వాని స్వర్ణకృతచిహ్నములన్. 166.

గీ. విద్యను నవిద్య నెఱుఁగు నేవేత్త; యతఁ డ
విద్యఁ గొని మృత్యువు జయించి విద్యచేత
నమృత మొనయును గాన విద్యాస్వరూప
యంబయ ముముక్షువుల కవలంబ మగును. 167.

గీ. ఈశరూపిణి ప్రకృతి యా;నీశ్వరప్ర
కృతులకు నభేదకలనము శ్రుతికథితము
కన 'సదైవ'మాదివాక్యములు తత్ప
రమ్ము లౌట నవ్వియె ప్రమాణమ్ము లిందు. 168.

సీ. ప్రణవస్థ మగునకారప్రభృతుల కట్ల
శాంభవీప్రముఖతచ్ఛక్తులకు స
ముత్పత్తి గలుగుచునుండు; సమస్తదై
వతకారణం బగుప్రభునకుఁ బర
మై చంద్రునకు జ్యోత్స్నయటుల రుద్రోద్బోధ
కస్వరూపిణి యాచుఁ గ్రాలుచుండు
స్వాధీనవల్లభ యనఁబడు రుద్రశ
క్తి భవాని యని నమ్మితిమి త్రిశుద్ధి
గీ. పూరుషోత్తమ! తచ్చిహ్నధారి వగుచు
నావిముక్తిద నాజగదంబ నీశ్వ
రిని యుపాసింపవలయు నీ వనుచుఁ బలుక
వారితో నిట్లు లాచార్యవర్యుఁ డనియె. 169.

క. పరఁగ నిది సత్య మైనను
'బురుషోత్తముబోధమునన ముక్తి' యని శ్రుతో

త్కర మనుల; నాత్మ నాత్మను
బొరసినసే కలుగు ముక్తి, పొడమ దిం కొంటన్. 170.

గీ. ఇందులం బ్రమాణ మగుం 'దమేవైన'మాది
వాక్యతతి, యజామిత్యాది వాక్య మయ్యె
జాస్వరూపమ్ము దెల్పి, మోక్షమ్ము వడయు
కొఱ కని పరేశుతత్త్వమే యెఱుక పఱిచె. 171.

క. మఱియును సాంఖ్యులు ప్రకృతిని
నెఱిఁగి, వికృతినారుం బరుని నెఱుఁగుటనే చె
ప్పిరి ముక్తిగం గాన సుఖా
కరు నీశ్వరు నెఱుఁగ ముక్తి గలుగును జూరే. 172.

క. బ్రహ్మేత్యాదికనిగమము
బ్రహ్మముతో జ్ఞాని కైక్యభావము నొడివెన్
'బ్రహ్మైవ' యనుచుం గావున
బ్రహ్మజ్ఞానమ్ము మీరు పడయుఁగవలయున్. 173.

గీ. ఏయుమ భవాని యని వచియింపఁబడియె
నామె యద్వైతబోధివిద్యాస్వరూప
విమల కమ్మహాదేవి సేవించుచుండ
శీఘ్రముగఁ గైవసం బగుఁ జిత్తశుద్ధి. 174.

వ. కావున మీరు కుంకుమపుండ్రాంకమును హైమపాదాదిచిహ్నము
లను విసర్జించి 'బ్రహ్మహ'మ్మనెడువిద్యయందు నాసక్తులరు గం
డనుటయు. 175.

ఆ. వారు చిహ్నములను వడి వీడి శంకరు
గురునిగాఁ దలంచికొనుచు స్నాన

సంధ్యలందుఁ గనిరి శ్రీద్ధ శుద్ధాద్వైతు
లగుచుఁ బంచపూజనాదిసక్తి. 176

లక్ష్మీభక్తులతో వాదము

ఆ. అంత నటకు శ్రీమహాలక్ష్మీభక్తులు
వచ్చి గురున కెఱఁగి పలికి రిట్లు
వినుము దేవ! శాస్త్రవిహితంబు యుక్తిస
హంబు నైనమామతంబురీతి. 177.

సీ. బ్రహ్మాండజనని సర్వఫలప్రదాత్రి మ
హాలక్ష్మియే యాద్య యైనప్రకృతి
యగు 'సప'దిత్యాదినిగమోక్తి; 'నీఁక సదే'
వేతివేదోక్తి విధాతృముఖ్యు
లమల మహాపురుషోత్తమాంగమునుండి యే
యింతియందు జనింత్రు, రెవ తెయంద
పరమేశునకుఁగూడఁ బరఁగు నంతర్భావ,
మాదేవి సేవ్య మోక్షార్థులకును

గీ. కుంకుమాంకితమాళు లబ్జాంకలసిత
భుజులు పద్మాక్షమాలావిభూషు లగుర
మాసమారాధనాసక్తమతులకుఁ గర
గతము యగు ముక్తి, కాన మామతము గొనుము. 178.

వ. అనుటయు శంకరుం డాశ్రీభక్తులతో దత్త్వంబు దెలిపెద వినుం
డని యిట్లను. 179.

సీ. సదసత్స్వరూపుఁడై జానొందు నద్వితీ
యుఁడు పరమాత్మ యొక్కఁడ జగంబు

సృజియించువాఁడు గా కితరుండు లేఁడు 'స
ఆత్మ' యన్ శ్రుతిచేత వ్యాహృతుఁ డగు
నానందరూపుఁడై యలరు సదా తద
ధీన యాప్రకృతి కెందేని మోచ
కత్వమ్ము చెల్లునే? కడఁక నెవ్వండు "బ్ర
హ్మైవ" మంచును ధ్యాన మాచరించు
గీ. వానికి విముక్తి కరగతం బౌ ననిత్య
దేవతోపాసకులకుఁ దద్విధజగములె
తాఁ గానఁ గుంకుమపద్మధారణంబు
విడిచి కైకొనుఁ డద్వైతవిద్య ముక్తి. 180.

క. అని శంకరు డుపదేశిం
చిన వా రద్వైత మూఁది శిష్యత్వము గాం
చిన యావృత్తాంతము విం
చును జేరఁగ వచ్చి రాశుశుక్షణికల్బుల్. 181.

శారదోపాసకులతో వాదము.

ఉ. భాసురపుస్తపుండ్రవిభాపరిచిహ్నితులౌచు శారదో
పాసకు లయ్యతీంద్రునకు వందనముల్ పచరించి, నిత్యతా
భాసిలు వేద; మట్లగుట భారతి నిత్యయు లోకహేతువున్
హ్రాసవినూరరూపయుఁ బరాత్పరమూర్తియునై విరాజిలున్. 182.

గీ. ఆమెయే బ్రహ్మ హరి హ రాద్యఖిలశబ్ద
గమ్య, యాదేవియే జగత్కర్త్రి నిత్య
యనె శ్రుతి, ముముక్షువులకు నుపాస్య యగుట
నాగుణాతీత నీకు నుపాస్య యగుత. 183.

గీ. పర మయినవాక్యరూపంబు నెఱుఁగఁ డింత
శ్రుతిగతార్థానభిజ్ఞుఁ డంచును వచించుఁ
గాదె 'నావేద'యనుసూక్తి? కని తదర్థ
మానఁ దగు వాక్యరూపసంధాన మవుర* 184.

చ. అనుటయుఁ "గంఠ తాలు రదనాదిక సంగతిఁ బుట్టువేద మే
యనువున నిత్యమౌ"ననియు నయ్యుక్తియుట్లను-వర్ణమాత్రమౌ
కన ధ్రువ మైనఁదక్షరనికాయము? యాదిని మెప్డు గాదు గ్ర
న్నన నవియుఁ జగల్లయమునఁ లయ మొందు ధ్రువంబులెట్టులౌ?

క. అమరు శ్రుతు 'లీశునిశ్వసి
తములై' యనుసూక్తి జన్యధర్మమ్మున; జ
న్యము లెల్ల ననిత్యము లను
ప్రమాణమునఁ గాదు సుఁడీ ధ్రువం బంతిమమ్ముఁ.

సీ. అంగసమన్వితం బగువేదము యుగాంత
మున లయం బొందుడు, మునులకు రవి
సెప్ప నంచును సూర్యసిద్ధాంతమున నుండెఁ
బ్రళయ మొందిన వేదరాశి కర్కు
వలనఁ బ్రవర్తనం బలవడుటను శార
దకు నెట్లు గల్గు సత్యత్వ మకట!
సుర లనిత్యుల ద్రైనఁ బరమేష్ఠి ధ్రువుఁ డౌట
నిత్యయే వాణి యండ్రేని వినుఁడి

---

*క. వేదార్థవివేకరహితుఁ
డే దెసఁబరవాక్యరూప మెఱుఁగడ యని"నా
వేదే"త్యాద్యుక్తి కలిమి
వేద మెఱిఁగి వాక్యరూపవిదుఁ డౌట తగుఁ.

గీ. యాదిమప్రాణి యాట నిత్యత్వశూన్యుఁ
డగుచతుర్ముఖముఖముల నలరుశార
దకు ననిత్యత్వ మర్థసిద్ధమ్మె కాన
శమ మ దేల వాఙ్నిత్యతాసాధనమున. 187.

వ. పరమాత్మాతిరిక్తంబునకు మృషాత్వంబు సిద్ధంబ కానఁ బరమయుఁ బ్రకృతియు నగుశారదయె మహదాదివిశ్వంబునకుఁ గారణం బగుట యసంగతము వాగాద్యతీతం బగునప్పరమభూమం బొక్కటియ సదాదిశబ్దబోధనీయము కాని ప్రకృతి కా దని యెఱింగి సదాది శబ్దంబుల బ్రహ్మజ్ఞానము సాధనీయంబు, ముక్తిపదంబు నొంద నాత్మజ్ఞానముఁదక్క నన్య మగునుపాయంబు లే దని వేదము పలుకుట లేదె? అట్లుగాన శుద్ధాద్వైతబద్ధబుద్ధులరై మీరు స్నానాదిసకలకర్మమ్ము లీశ్వరార్పణబుద్ధి సలిపి దురితములఁ దొలఁగి శుద్ధులై యానందఘన మ్మగుబ్రహ్మము నెఱిఁగిననే ముక్తు లగుదురు కాని యన్యథా కానేర రనుటయు నాశారదోపాసకు లెల్లరు శంకరార్యశిష్యు లై రి యంత వామాచారు లగుశాక్తులు కొందరు జగద్గురుఁ గాంచి యి ట్లనిరి. 188.

వామాచార శాక్తులతో వా వాదము

మ. వెడవేసమ్ము ధరింతు, వారయవు సంవిద్రూపముఁ మూఢుకై
వడి,వంధ్యాతనయోపమం బైనయద్వైతప్రబోధంబునఁ
బడె, దద్వైతమె సున్న, భేదము లయావస్థాప్తినే నుంట-మా
నుడు లాలించి గ్రహించి శక్తిమతముఁ, మోక్షమ్ము చేకోఁగ దే.

సీ. పృథగాకృతిని నెద్ది యీశునందు విమర్శ
మనుసంజ్ఞతో వెల్గు ననవరతము
నెయ్యది లేక పరేశుండు నల్పకి)

యా చరణంబునం దవముఁ డగును
సంతతం బెయ్యది సర్వస్వతంత్రమై
యెల్లలోకము సృజియించుచుండు
శివునకు బీజమై చెల్వారు నెయ్యది
విద్యాస్వరూపమై వెలయు నేది

గీ. యట్టిపరశక్తి భజియించునట్టివారి
కే లభించును ముక్తి తదితరులకు న
లభ్య మగుఁ జూవె పెక్కు లేలా వచింప
నఘచయజిఘాంస! పరమహంసావతంస. 190.

గీ. 'అవిమర్శాభిధాన మవ్యక్త' మనుచు
బ్రహ్మభృగ్వాదు లనిరి తత్త్వమ్ము నరసి
దానికంటె నన్యం బయి తనరునట్టి
సకలము చరాచరము తద్వశమ్మె సుమ్మ. 191.

ఉ. ఆపరశక్తిభక్తులయి యంచితసిద్ధులు గన్నవారి కా
క్షేపము లే దెటన్ విధినిషేధము లుండమి; నిర్గుణాఖ్యగ
శ్రీపరకోటికిన్ విధినిషేధము లంటునె? కాన మాకు న
త్తాపసు లౌ భృగుప్రభృతి ధన్యులవర్తనముల్ ప్రమాణముల్.

క. కావున నీ యితరమ్ములఁ
బో విడిచి గ్రహింపుఁ డాత్మ ముక్తికిఁ బర యా
శ్రీవిద్య నంచు నుడువం
గా విని యాచార్యుఁ డీప్రకారము నొడివెన్. 193.

సీ. అటు పల్కఁ దగునయ్య "యత్రి" యన్ శ్రుతి యనా
త్మమున కెల్లను నిషేధము వచించెఁ
గానఁ దా నెందుఁ గల్గద విమర్శమున క

నాత్మంబునకు సత్యతాప్తి లేద
యధ్రువ ప్రకృతి నుపాసింప ముక్తి రా
దాలింపుఁడయ్య 'మాయాభి రింద్ర'
యను శ్రుతిసూక్తిచే నాప్రకృతికి బహు
రూపత గల్గు టెఱుంగఁబడియెఁ

గీ. గానఁ బ్రకృతికిఁ బరము సుజ్ఞానగమ్య
మఖిలసృష్టిప్రభువు నౌ చిదాత్మ యొక్కఁడె
చెలఁగుచుండు ముముక్షువిజ్ఞేయ మగుచుఁ
దద్విజిజ్ఞాసఁ గొని యమృతంబు గనుఁడు. 194.

వ. మఱియు 'ఈశానో భూతభవ్యస్య' యను శ్రుతిం జెప్పఁబడిన పర
మాత్ము నకించిత్కరుం డనుట మౌఢ్యంబు గాదె. 195.

క. కలదే బ్రాహ్మణ్యము ని
చ్చలు కలు ద్రావుచుఁ గళంజభక్షణరతులై
మెలఁగెడుమీ, కటు గావున
సలుపుకొనుఁడు నిష్కృతిన్ వెసన్ విహితగతిన్. 196.

చ. భృగుఁ డఱగాలఁ దన్నె మును వెన్నుని, సాగరసప్తకంబు లె
స్సగఁ జుళుకించి క్రోలె ఘటజన్మమహాముని, యట్టిశక్తి మీ
కుఁ గలుగ దేల? మౌఢ్య మిఁక గొబ్బునఁ ద్రోచి ద్విజాతిధర్మముల్
డిగ విడనాడుమీరలు కడింది వినిష్కృతి సేసికొందగున్. 197.

మ. అనుడున్ వారలు మ్రొక్కి శాస్త్రవిధిఁ బ్రాయశ్చిత్తముల్ చేసికొం
చనిదంపూర్వపవిత్రవృత్తు లయి శుద్ధాద్వైతబద్ధాదరం
బునఁ బంచాయతనార్చనాది సకలంబున్ సల్పుచున్ శంకరా
ర్యుని సేవించిరి శిష్యలౌచు నపుడే యుత్సృష్టసందేహులై. 198.

చ. ఇటు పటుయుక్తిసూక్తుల యతీంద్రుఁడు దర్ వలగొంచు నీచవా
క్పటుల నెదిర్చువారి ద్విజజాతిబహిష్కృతు లౌననార్యులన్
బటుమతు లైనశాక్తుల క్షణంబునఁ దత్ప్రతివాక్యలాపనా
పటువులఁ జేసి లోకహితవాంఛ రచించెను గర్మసేతువున్. 199.

శంకరుఁడు రామేశ్వరమున కరుగుట.

మ. క్రమ మొప్పం గనుఁగొంచుఁ బూర్వరరమన్ రామేశ్వరక్షేత్రసీ
మము నెల్లన్ వలగొంచు వచ్చి కనెఁ దన్మధ్యస్థసౌవర్ణహ
ర్మ్యమునన్ రాఘవసంప్రతిష్ఠితుని సవ్యార్ధాంగమాతాగ్రహ
స్థు మహానీలలసత్కిరీటు జగదీశున్ రామనాథేశ్వరున్. 200.

సీ. సేతుపరిష్కృతసింధూర్మికల రామ
నాథార్పణముగ స్నానం బొనర్చి
నభిషేక మొనరించె నమలంగంగాంబులఁ
బొంగి తత్సైకతలింగమునకు
నారగ్వధాబ్జదుత్తూరప్రసవ బిల్వ
పత్త్రరాసులతో సపర్య నడపె
నానాఫలమ్ముల నైవేద్య మర్పించెఁ
గమ్మని కవిత స్తోత్రమ్ము సేసె
గీ. శంకరాచార్యుఁ డిటు నిజచ్ఛాత్రసమితిఁ
గూడుకొని బ్రహ్మభావన షోడశోప
చారముల రామనాథు హార్దమునఁ దేల్చె
రెండుమాసము లచటనే యుండఁ దలఁచె. 201.

వ. అంత నాక్షేత్రవాసులును, దత్పరిసరజనపదనివాసులు నగుప్రజలును శంకరాగమనంబు విని దర్శింప గుములు గట్టి నిరంతరం బరుదెంచి తద్బోధనమునఁ దనియుచుండుదు రట్టియెడ. 202.

సీ. అద్వైతమాషకు లంచితలింగాంక
బాహుయుగ్మకులు శైవవ్రజంబు
శూలాంకచిహ్నితఫాలస్థలులు లింగ
ముద్రితాఖిలతనుల్ రుద్రభక్తు
లురడమరువ్యంకబాహులు లింగధరులు మ
స్తకధృతశూలురు జంగమాలి
శూలాంకలక్షితఫాలవక్షోనాభి
బాహావిరాజితుల్ పాశుపతులు

గీ. గుములు గుములుగ వచ్చి యగ్గురులలాముఁ
గాంచి ప్రణమిల్లి యీరీతిగా వచించి
రఖిలమతముల కుత్తంస మని యొకొక్క
రాత్మమతగతవివిధసిద్ధాంతములను. 203.

వ. అందుఁ బాశుపతు లిట్లనిరి 204.

క. కారణ మీశ్వరుఁ డగుట స
దారాధ్యుఁడు చిహ్నధారు లగువారి కప
ర్గారమణుఁడె యను నిగమస
మీరితములె మానముల సుమీ మతమునకున్ 205.

గీ. ఋతము సత్యమ్ము పరమ్మునై యొసగు బ్రహ్మ
మనఁగ నూర్ధ్వరేతుఁడు విరూపాక్షుఁ డైన
కృష్ణపింగళపురుషుఁగా నెంచి యట్టి
విశ్వరూపున కర్పించువినతి యిద్ది. 206.

సీ. ఏదేవునకు దివం జెసలారు శిరసుగా
నభ మొప్పు నెవనికి నాభి గాఁగ
భాస్కరుఁ డిందు డెవ్వని కగుఁ గనులు గా

నెవని కౌ దిక్కృతి శ్రవణములుగ
మతివివృత్తంబు లామ్నాయంబు లెవనికి
వెలయు వాక్కుగ నంచు వేదశకథితుఁ
డగునట్టి వానిమోక్షార్థినై శరణంబు
వేడెద ననువాక్యవిధముఁ బట్టి

గీ. శివుని యెడ భక్తి గల్గి తచ్చిహ్నచిహ్ని
తాత్ము లగుభక్తజనముల కనవరతము
నభవ లోక నివాస రూపామృతంబు
హస్తగత మౌఁ జుమీ యనాయాసముగను. 207.

వ. ఇంతియ కాదు! జగత్కారణం బెద్ది యని యొకప్పుడు దేవతలు ధ్యానించుచుండ నంబరంబున నంబరాంబరుండు దివ్యదర్శన మొసంగి నీ వెవ్వఁడ"వని యడుగు నిర్జరుల కిట్లను. వేల్పులార! తొలుదొల్త నే నొక్కండ నుంటి నాకంటె నన్యుండు లేఁడ జగదీశ్వరుండ నగుట నద్వయుండనై నేన యుందు"నని యెఁ గావున నుపాదాన కారణం బగుటం జేసి ప్రభు వగుశివుండ సద్బ్రహ్మాత్మాదిక ము లగుసామాన్యశబ్దములకు వాచ్యుం డయి జగత్కర్త యగు.

ఆ. లేఁడు తొల్లి బ్రహ్మ లేఁడు శంకరుఁ డొక్క
వాసుదేవుఁ డున్నవాఁ" డను నెడ
నగును వాసుదేవుఁ డన మహాదేవుండె
విను తదర్థ మింత విస్తరింతు. 209.

వ. తనయందు జగము లన్నియు వసించుటను వాసు వనంబడు నట్టి దేవుండ వాసుదేవుం, డతండ జగత్కర్త యగుమహేశ్వరుండు. శర్మ్మన సుఖంబు, దానిం గలిగించువాఁడగుటం జేసి శంకరుం డనం బరఁగు, నట్టిచో విష్ణుండు పాలకుం డనుట యెట్లు పొసంగును? పాకృతప్రళయంబునందుఁ బాల్యం బగుజగం బెల్ల నభావంబుం

బొందఁ జాలకుం డగువిష్ణువును లేకుండుట ధ్రువంబు 'రుద్రులలో శంకరుఁ డను నేన' యనిన కృష్ణోక్తియే శంకరుండు పరమాత్మ యనుటకుఁ బ్రమాణము. మఱియు దుర్వాసునకు మహాదేవుండు సెప్పిన కొన్నివాక్యములు గలవు సావధానంబుగ వినఁదగినవి. 210.

సీ. అరయ నే నొకఁడ నక్షరుఁడఁ గర్తఁ బరాత్పు
రుఁడ శివుండను సదాత్ముఁడను జువ్వె
యజ విష్ణువులకు లోకావళి కాదికా
రణ మైనవాఁడఁ బురాణవస్తు
వను బూర్వగుఁడను బూర్వజ్యేష్ఠుఁడను శ్రేష్ఠుఁ
డను నద్వితీయుండ ననఁ దనర్తు
నస్మదిచ్ఛారూప యగుశక్తి లోకసం
హారమ్ము సేసి నాయం దణంగు

గీ. సృష్టిసేయుదు నేఁ బునస్సృష్టి దాని,
నది ప్రకృతియై గుణత్రితయాంకురప్ర
ధానకారణ మగు మహత్తత్త్వమును సృ
జించె మత్సాత్త్వికము స్వతంత్రించి యంత. 211.

మ కలిగించెఁ ద్రిగుణాత్మకం బగునహంకారమ్ము, దానఁ గుణాత్ములు రుద్రుల్ పదునొక్కరుఁ బొడమ, నందుఁ సృష్టికై రాజసాత్ముల, రక్షార్థము సాత్త్వికాత్ముల, లయంబుఁ జేయఁగాఁ దామసాత్ములఁ గావించె యథాప్రకారముగఁ బెంపుం గాంచు నట్లాదృతిఁ.

క. ఆవిర్భవించిరి యవ
*ర్ణోవర్ణ మవర్ణములఁ బయోజాసన ల
క్ష్మీవర శివు లనఁ గ్రమముగ
మూవురు సకలమ్మునందు ముఖ్యులయి తొలిఁ. 213.

క. 'ఆ'నుండి పొడమి ద్రుహిణుం,
*'ఉూ'నుండి జనించి విష్ణుఁ డుదితుఁడై 'మ'వ
ర్ణాన మహేశుఁడు, సకలము
లోన ప్రముఖభావమున వెలుంగుదు రెలమిఁ. పాఠాంతరము.

ఆ. వారి ననుసరించి వర్తింతు రితరు లే
కాదశేష లిట్టి క్రమమువారు
తద్విభూతు లీపృథక్పృథగాఖ్య మా
నమరతతి చరాచరము జగములు. 214.

క. నానాత్వము తత్తత్క
ర్మానుస్మృతిని జెందినట్టి యఖిలమును లయం
బా నలబ్రహ్మజ్యోతి, న
నూన ప్రళయావసర మహోగ్రావస్థన్. 215.

సీ. అఖిలంబు లోఁగొని యరుణ మహారాజస
తేజంబు మలయ వర్తించు బ్రహ్మ
శ్యామలం బైన నారాయణ తేజంబు
నందు నస్తంగతుం డైనయంత
నంతర్భవించు నారాయణుండును శుక్ల
దీధితి యగురుద్రతేజమందు
నారుద్రుఁడు స్వకీయ మగుశుక్లతేజంబు
తోఁ బ్రకృత్యంతర్గతుఁడుగ నౌను
గీ. బ్రకృతినామయు శుక్లవర్ణయు నగు మ
దిచ్ఛ నాయందె డిందుఁ జుమ్మీ య టౌట
నను ననంతు సర్వజ్ఞు లౌజనులును గన
లేరు; నామాయఁ దెలియఁగా లేఁ డెవండు. 216.

సీ. కాన శ్రీరుద్రసూక్తజపాశ్రితులు రుద్ర
భవ్యపూజాదితాత్పర్యమతులు
పంచాక్షరీమనూపాసకుల్ భసితలి
ప్తాంగులు రుద్రాక్షహారధారు

లవిరతధ్యానపరాయణులును నాచు
నవ్యక్తు వ్యక్తాత్మ నభవు రుద్రుఁ
బూజింతు రేనరపుంగవుల్ వారికి
నిశ్శ్రేయసమ్ము పాణిస్థ మగుట

గీ. భూతిరుద్రాక్షధారణంబును బొనర్చు
మమల మగు భక్తిరీతిఁ జిత్తమును గూర్చు
శ్రీమహాదేవు నర్వాణశ్రీఁ దనర్చు
ద్వంద్వముక్తుండనై భవవ్యథ విదిర్చు. 217.

క. అని యభవుఁడు దుర్వాసో
మునికిఁ దెలిపి మాయమయ్యె మునియుఁ దదాచా
రనిరతుఁ డయ్యెను గావున
జనును ముముక్షులు పరాత్మ శంభు భజింపన్. 218.

గీ. ధృతిని నారాయణుం డద్వితీయుఁ డగుచుఁ
బ్రజల సృజియింపఁ దలఁచునప్పట జనించె
భూతములు, తద్విధాన విధాతయును బ్ర
జాపతియుఁ బుట్టి రని శ్రుతిసరణి లేదె? 219.

శా. ఆనారాయణశబ్దవాచ్యుఁడు శివుం డౌ నార మన్నన్ విధీం
ద్రానంతాదినృకోటి, యద్ది యయనం బౌవాఁడ నారాయణుం
డౌ నాదిత్యతతుల్ తదంశములె సుమ్మా భూమ్యరాదిస్థులౌ
నానారుద్రులకున్ నసమస్సనెడు నామ్నాయంబు మానం బిటన్. 220

గీ. ఎవనివలనఁ ద్రిమూర్తు లుద్భవము గనిరొ
తత్పరేశుండె కారణత్వమున జ్యేష్ఠుఁ
డైనచందానఁ దాన కార్యత్వమునఁ గ
నిష్ఠుఁ డగు నని వాకొనె నిగమ మరయ. 221.

ఆ. జ్ఞానమయు ననంతు సత్యుని బ్రభు గుహా
నిహితు నెఱుఁగఁ దగు ననియెడు శ్రుతికిఁ
బరఁగ లక్ష్య మైనవాఁ డమ్మహేశ్వరుఁ
డతఁ డొకండు జగదుపాస్యుఁ డెన్న. 222.

క. నిర్గుణుఁడ వయ్యు నీశుఁ డ
నర్గళ చిరకాల చింతనాయత్తుండై
సర్గ మొనరింతు నని యం
తర్గతిఁ జింతించి పెక్కునాళులు కడకున్. 223.

సీ. ఆత్మ తేజంబు సూర్యాకారముగ, మనం
బును జంద్రునిగ, సత్త్వమును గుజునిగ
సర్వవాఙ్మయమును సౌమ్యునిగా, సుఖ
జ్ఞానపుంజమ్ము వాచస్పతినిగ
వీర్యమ్ము దానవాచార్యునిగాఁ, గ్లేశ
మును శనైశ్చరునిగా, మును సృజించె
వెలుఁగు సూర్యాదిమండలములు తత్తేజ
మునఁ గాని వెలుఁగనేర్చునె తమంత?
గీ. నిందులఁ బ్రమాణముగ గ్రహియించి పలుకఁ
జను 'న తత్ర సూర్యో భాతి చంద్రతార
క'మ్మని యుఁ "దస్య భాసా జగంతి భాంతి"
యనియుఁ జాటెడు వేదమ్ము యతిలలామ! 224.

క. ఆనారాయణపదమున
కా నీశునివలన బ్రహ్మ మయ్యెఁ జుమి ప్రజే
శానుఁడుగ, విష్ణు వయ్యెఁ బ్ర
జానీకాజస్రపాలనాధారుఁడుగన్. 225.

ఉ. పాయక తొంటినుండియును బ్రహ్మయు నీశుఁడు లేనియప్డు నా
రాయణుఁ డుండె నంచు శ్రుతియందు శ్రుతంబగుఁగా కభావమై
యీయఖిలంబు డిందినను నీశుఁడు విశ్వజగన్నిదానుఁ డే
చాయ నభావమొందఁ డని చాటవె వేదము లప్పురాత్పరుఁ. 226

క. కర్మమునఁ బుట్టు లోకము
కర్మమున నశించు నను నిగమసూక్తిని ద
త్కర్మము కారణ మను టెటు?
కర్మము జడ మిడదు శివుఁడు గాని ఫలంబుల్. 227.

గీ. ఈశ్వరు నభావునిగ గ్రహియించువాని
నిందనొనరించి, యున్నవానిగ నెఱుఁగు
బ్రహ్మవేత్తను వేదమ్ము ప్రస్తుతించెఁ
గను "మసన్నేవ స భవతి" యనువచనము. 228.

ఆ. కాన లోకకర్త యానీశరూప ప
రాత్మ సంతత మ్ముపాసనమ్ము
సేయుచును దదీయచిహ్నమ్ము లొడల న
వశ్యముగ ధరింప వలయు నియతి. 229.

శంకరులు శైవమతమును ఖండించుట.

చ. అనవుడు శంకరుం డనె నహా సృజనస్థితినాశనముల్ పొన
ర్చును ద్రుహిణాబ్జనాభ హరరూపము లొంది యొక్కండె దేవుఁ డం
చును శ్రుతి యుండె; మాకును ద్రిశుద్ధిగ నిష్టము; లింగధారణం
బున కెచటఁ గనంబడదు మూలము కావున మానఁగాఁదగుఁ.

వ. మఱియు వేదవేదాంగవేత్త నాభి కూర్ధ్వమున సోమపులును, నధర
దేశంబున నసోమపులును వసియించుట శ్రూయమాణంబ కాదె!

సీ. కైశిక శీర్షాలిక శ్రవో ఘ్రాణ క
పోల జిహ్వోష్ఠ చిబుక గళములు
నంసద్వయ ద్విబాహు పాణ్యురో నాభి
కటిదేశ లింగ ముష్కములు మఱియు
నంఘ్రి జంఘాయు గోర్వష్ఠీవ వంక్షణ
వస్తి పాయ్వాది కావయవములును
నాలంబనములుగా నస్మదాదిక సర్వ
బృందారకులు మునుల్ పితృగణంబు

గీ. స్నానపానాన్నమిశ్రితం బైననిత్య
కృత్యములఁ దృప్తు లగుదు మం చీశుఁ డయిన
బ్రహ్మ యరుణకేతువునకు వక్కణింప
లేదె శ్రోత్రియమూర్తి నిలింపు లునికి. 232.

క. సకలామరమయ మగు మే
నికిఁ దాపము గూర్పఁ గలుగనేరదు శ్రేయం
బకట! యనూచానుని మెయి
సకలామరు లుందు రనుచుఁ జాటవొకో శ్రుతుల్. 232.

క. 'చితికాష్ఠ మటుల వీఁ డికఁ
బతితుఁ డగుత' మని శపించి వడిమీఱఁ బలా
యితు లగుదురు శీర్షాది
స్థితులు సురలు తాప మింత దేహము సోఁకన్. 234.

ఆ. కర్మయోగ్య మైనతన్మదేవుతనువుఁ
వ్యాధి లేక తాల్చి నట్టి చిహ్న
మఱఁ బడిన సూర్యు నప్పుడ వీక్షింప
వలె, హ్రదమున నేని వలయు మునుఁగ. 235.

గీ. ఈదృశాగమవాక్యంబు లెన్నొ కలవు
వినుఁడు 'యోఽహ్యన్యా' మ్మనెడుశ్రుతి భేదకలిత
మగునుపాసన గర్హణీయంబ టంచు
వక్కణించెను హేతువుల్ పెక్కు చూపి. 236.

చ. అవనిసురుండు కర్మచిత మైనసమస్తజగంబు లెన్న న
ధ్రువములుగా నెఱింగి, విరతుం డయి రాగమునుండి, యాత్మవి
త్ప్రవరుఁ డ్రియోగతార్థవిదు బ్రహ్మముఁ దెల్పుమటంచు నాశ్రయిం
పవలె నటం చికొక్కశ్రుతి పల్కెను-ముక్తికి వేద్య మాత్మయే.

వ. కాన నన్యచిహ్నధారణంబు వ్యర్థంబు ముక్తికి బ్రహ్మజ్ఞాన
మొక్కండడ సాధనంబు. 238.

క. కన రా కనుప్రవిష్టుం
డును గూఢుఁడు గహ్వరేష్ఠుఁడు గుహానిహితుం
డు నపూర్వుఁ డయిన దేవుని
గని యాత్మజ్ఞాని హాయి గాసియు ముదముల్. 239.

గీ. ప్రవచనమ్మునఁ బరమాత్మ పట్టువడఁడు
చిక్కఁ డమితశ్రుతంబుల, శేముషిని ల
భింపఁ-డెవ్వఁడు వరియించుఁ బ్రీతిఁ దన్నుఁ
దన్నరుశరీరము వరించుఁ దప్పకుండ. 240.

ఆ. తనువులందు నతనువును, ననవస్థవ
స్తువులయం దవస్థితుఁడును గాఁగ
నమ్మహావిభుని బరాత్ముని ధీరుండు
మనన మొనరఁ జేసి ననట లుడుగు. 241.

గీ. ఆకసమ్మును గృష్ణాజినాదిక మటు
చుట్టఁగాఁ జుట్టఁజాలినచో నరుండు
స్వాత్మము నెఱుంగకయ భవానంతదుఃఖ
మును దరించు నటంచు వాకొనియె శ్రుతులు. 242.

క. అటు గాన గురునికరుణా
కటాక్షమున నాత్మవిద్యఁ గఱచి యభేద
స్ఫుటవాదసుధాస్వాదన
పటుతృప్తిం గనుము గురుని భక్తిఁ గొలుచుచున్. 243.

క. అని యుక్తియుక్తముగ గురుఁ
డన విని విద్వేషవీరుఁ డనులింగధరుం
డనయము ప్రీతుండై వం
దన మిడి యగ్గురులలామునకు ని ట్లనియెన్. 244.

శా. స్వామీ! నాకు శరణ్య మీవ, మును సంసారాహిదంష్ట్రావిష
వ్యాముగ్ధాత్ముఁడ నైతిఁ బ్రోవు, భవదచ్ఛామ్నాయవాగ్రీతిచే
నామూలంబు నశించె భేదము 'శివోఽహ' మ్మంచు నద్వైతవి
ద్యామాహాత్మ్య మెఱుంగఁ గంటిఁ జరితార్థం బయ్యె నాజన్మమున్.

క. నీవ మహాదేవసప
ర్యావాప్తఫలంబ వనఘ! యద్వైతసుధా
సేవధిదాతవు కావున
నీవ యనుత్తముఁడ విశ్వేశ్వరుకంటెన్. 246.

గీ. అనుచు నుతిపాత్రుఁ డగుశంకరార్యుఁ బొగడి
యొయ్యన నమస్కరించి పాదోదకములఁ
ద్రావి తత్కథితాచారతత్పరుఁ డయి
త్రిప్ప నద్వైతమునకు స్వదేశ మెల్ల. 247.

విపక్షశూలాది లింగధారులతో శంకరుఁడు వాదించి జయించుట.

వ. అంత నవ్వృత్తాంత మెఱింగి విపక్షశూలుఁడు మున్నగు లింగ
ధారులు మఱికొందఱు భూతిరుద్రాక్షధారులై లింగచిహ్నితులై
యుగ్రాకారముల వచ్చి యయ్యతీంద్రున కిట్లనిరి. 248.

ఆ. మాయవేష మూని మావాని బ్రామాణి
కమతదూరుఁ జేసి కుమతమందు
నిటు ప్రవేశపెట్టి యేఁగుచునుంటి నీ
కంటె వంచకుండు గలఁడె జగతి? 249.

సీ. "బ్రాహ్మణ్యమునకంటె వైష్ణవం బగ్ర్యము
త్తమము శైవం బెన్న దానికంటె"
నని చెప్పఁడే నారదునకజుం డటుగాన
నారూఢుఁ బలితుఁ నేలా యొనర్చి?
తౌర 'నమస్తే' యటన్న వేదోక్తి సం
స్తుతుఁడు విశ్వాత్ముఁ డీశుండ కాఁడె?
యతఁ డఖిలాస్యోత్తమాంగకంఠుఁడు జగ
ద్వ్యాపి భూతౌఘగుహాశయుండు

గీ. కాన శివుఁ డొక్కరుఁడ సర్వగతుఁ డటంచుఁ
బురుషసూక్తము శ్వేతాశ్వతరమునందుఁ
బలికి విరమించెఁ గాన విశ్వస్వరూపుఁ
డభవుఁ డంచు నిరూపితుఁ డయ్యెఁ గాదె? 250.

గీ. హ్రీయు లక్ష్మియుఁ బత్నులం చిఁక సహస్ర
రాత్రియును బార్శ్వము లటంచుఁ బ్రస్తుతించు
వాక్యయుగళంబు శివపరత్వమె నిరూప
ణంబు నిశ్శంకముగను బొనర్చెఁ గనుము. 248.

గీ. గంగయే హ్రీ యటంచుఁ దద్ధారి లక్ష్మి
యనుచు వా రిర్వురకుఁ బతి యల్లశివుఁడ
యనుచు యామళమున స్కాందమునను గొన్ని
వాక్యములు పొల్చు విను మోతపస్వి! వాని. 249.

వ. తొల్లి హిమాచలంబున శివమౌళి గంగ డిగ్గ నుఱికినం దదీయభార సంభ్రాంతుండై రుద్రుండు హ్రీమతివై యుచ్చైశ్శ్వసనశూన్యవై బ్రహ్మవిష్ణ్వాదికారణం బగుపరమపురుషశ్రేష్ఠు నన్నొంది యడంగి యుండువు గాక యని యానతిచ్చిన మందాకిని హ్రీభారపీడిత యగుచు నప్పరమేశుజటాటవి భక్తి నణంగి వర్తించుటం జేసి హ్రీ యని బుధజనాభిహిత యయ్యె. 250.

గీ. ఆసదాశివు నంకపీఠాధిరూఢ
యగుచు నేటికి వెలుఁ గొందునట్టిశ్యామ
విశ్వమోహనరూప మహేశ్వరి యన
నలరుపరశక్తియే 'లక్ష్మి' యయ్యె నయ్య! 251.

ఉ. ఆగిరిరాజనందిని మహాఃక్షణమందు జనించు నిందిరా
వాగయుతంబు; లీశ్వరునవార్యమహాస్సున నిందిరాధిభూ
వాగధిపాదికోట్లు ప్రభవం బగు, వారికి నాశమబ్బినన్
వేగ సృజించు నాశివుఁడు; నేత్రుఁడు వారికిఁ దానె కావునన్. 252.

క. అచ్చపుఁబటికమునకు సరి
వచ్చెడుకుడివైపు దివసభావము, నైల్యం
బెచ్చునెడమవైపు రాత్రిత
యచ్చుపడఁగఁ దనకు, నాపరాంబిక యొప్పున్. 253.

గీ. నేను నిత్యుండ మఱియు ననిత్యుఁడ నని
తన్ను సర్వాత్మకునిగ జగన్నిదాన

భూతునిగఁ జెప్పె సురల కిమ్మొగ శివుండె
యని యథర్వశ్రుతిని గాన నగును వింటె. 257.

వ. మఱియు శివరహస్యఖండమ్మున శివుండె ధ్యేయుం డని చెప్పంబ
డఁడె? 258.

సీ. 'శివుఁడె ధ్యేయుం డని చెప్పఁగా దివ్యవా
చంయమాగ్రేసరసమితి సాక్షి
జ్ఞానప్రదాత యీశానుఁ డొక్కఁడ' యని
ప్రకటింప మహితుఁ డౌశనుఁడె సాక్షి
'జ్ఞానసంవేద్యుఁ డీశ్వరుఁడే' యటంచుఁ ద
థ్యముగ వాక్రువ్వ వేదమ్మె సాక్షి
'స్వకభక్తవిమతశిక్షణవిచక్షణుఁ డుమా
పతి' యన శమనప్రభృతులె సాక్షి

గీ. 'నిత్యుఁ డీశ్వరుఁడే' యన నీరజోద్భ
వోత్తమాంగకమాల్యసంపత్తి సాక్షి
యాది యంతమ్ము లేనివాఁ' డనఁగ సాక్షు
లాత్తకిరిహంసరూపు లౌహరియు నజుఁడు. 259

వ. అని యిట్లు జగత్కారణ మీశ్వరుం డగురుద్రుండ యని శ్రుతులం
దెల్లెడ నుల్లసిల్లుఁ గావున నాతండె జ్ఞేయుండు. రుద్రకాండమ్మునఁ
దప్తలింగాంక, రుద్రాక్ష, విభూత్యాదిక ధారణంబును, బీఠాద్యర్చ
నంబును, రుద్రాధ్యాయజపమును, సర్వకిల్బిషహారణకారణము
లనియు, శివరూపాపాదకము లనియు నిరూపింపఁబడె. 260.

గీ. స్తేయ గురుదారగమన మైరేయపాన
విప్రహత్యాది నేది గావించెనేని
యాతఁ డఘముక్తుఁ డగు లిప్తభూతియై వి
భూతిఁ బండి రుద్రాధ్యాయమును జపింప. 261.

ఉ. ఆవలఁ గోటిజన్మసముపార్జితపుణ్యము లున్న నే మహా
దేవునిపట్ల భక్తి పొడ తెంచును, దద్దృఢభక్తి గల్గున
ద్భావుఁడు పాతకమ్ము లుపపాతకముల్ పొరిపుచ్చి, ముక్తి కిఁ
బోవు నటంచుఁ జెప్పెఁ గనవో శివగీతలయందు సత్తమా! 262.

వ. మఱియు నాశివగీతలయంద ధర్మార్థకామమోక్షములపార మొందఁ
గలవా రని మునులకై శివుండు తెల్పిన పాశుపతవ్రతక్రమంబు సె
ప్పెద వినుము. 263.

క. విరజాహ్వయదీక్షం గొని
హారాక్షములఁ దాల్చి భూతి నలఁదికొని నిరం
తరము శ్రుతిసార మనునీ
శ్వరనామసహస్రమును జపము సలుపవలెన్. 264.

క. దాన నరత్వ మ్మఱి యీ
శానతనువు గలుగ లోకశంకరుఁడు శివుం
డానతులయెడఁ బ్రసన్నుం
డౌ నని కైవల్య మొసఁగు ననియు వచించెన్. 265.

గీ. బ్రాహ్మణులకు విభూతిధారణ మవశ్య
మనుచుఁ గాలాగ్నిరుద్రవేదాంతసూక్తు
యలరుఁ గాన విభూతిమాహాత్మ్య మెల్ల
నెఱిఁగి వచియింప నెవ్వానితరము ధరణి. 266.

క. ఔదల నొసటను మెడను శ్రీ
వో దోర్యుగముల హారాక్షములఁ దాల్చు నరుం
డౌ దిగ్వాసుఁడు- వాఁడ ధ
రాదివిజుం డయ్యెనా పరాత్పరుఁడౌ యగున్. 267.

చ. అనుచు నగస్త్యసంహిత నిరాకులరీతి వచించు నంతే కా
దనఘ! యతప్తదేహుఁడుచిద్ధాత్మము నొందఁ డనన్బ్రమాణ ముం
ట నటు ముముక్షువుల్ తనువునన్ శివలింగముముద్రలన్ ధరిం
ప నగు నవశ్య మంచును విపక్షు లనన్ యతివర్యుఁ డిట్లనున్. 268.

గీ. అట వివక్షిత మరయఁ గృచ్ఛ్రాదితాప,
మనలతాపమ్ము గాదు- కృచ్ఛ్రాదికృశుఁడె
తప్తుఁ' డని పేర్కొనినబృహన్నారదీయ
మున కతివిరుద్ధ మీరు పల్కినవిధంబు. 269.

సీ. లింగాంకితాంగు రథాంగశంఖాంకితాం
గునేని కన నీట మునిఁగి కాని
నూర్యుఁ గన్గొని కాని శుద్ధుఁ డౌఁ, దప్తలిం
గాంకన తప్తచక్రాంకనమును
బాషండధర్మతత్పరు లైనవారి వా
ఙ్మాత్రినే నర్చింపఁ గాదు, మఱియు
హవ్యకవ్యమ్ములం దవ్వాఁడు త్యాజ్యంబు
త్యాజ్యంబు తద్వీక్షితాన్న మెపుడు
గీ. లింగచక్రాంకమాత్రి వేదాంగవేత్త
యగుచు వైదికాచారపరాయణుఁ డగు
నట్టిఁడేనియుఁ బతితుఁ డౌ నంచు నుండె
నలబృహన్నారదీయమం దరసికొనుఁడు. 270.

వ. అంతియకాదు. మార్కండేయపురాణమ్మున నైతిహ్య మొక్కండు
గలదు. తొల్లి గాయత్రితో విప్రులకుం బెద్దవాదు పుట్టుటయు నం
దమ్మహాదేవి కినిసి మీరెల్లరు పాషండులై వేదోక్తకర్మదూరు

లును దాంత్రికాచారపరతంత్రులును నయ్యెద రని శపింప నాబ్రాహ్మణులు గజగజ వణంకి పాదంబుల వ్రాలి ప్రార్థింప నద్దేవి కరుణించి నావాక్యమోఘంబు మీరు కలియుగమున నధమద్విజులై, వేదార్థహీనులు, లింగచక్రచిహ్నితులు, జ్ఞానకర్మపదభ్రష్టులుఁ, గామక్రోధాదిపీడితులు నై పుట్టి, యాయుగము ముప్పదివేల వత్సరంబు లరుగ, నద్వైతార్థానుచింతకులై సత్యధర్మపరాయణు లయ్యెద రని శాపమోచనంబు చెప్పెం గావున లింగాదిధారణం బనార్యం బగుట స్పష్టంబ కదా! 271.

క. మానసముతోడ వాక్కు
వ్వాని నెనయలేక వెనుకఁబడె నాసత్య
జ్ఞానాదిలక్షణున కెం
దేని నుపాస్త్యనవబోధమే యెసలారున్. 272.

గీ దానికంటెను బ్రహ్మవతారుఁ డైన
శివునుపాసన శ్రుతులందుఁ జెప్పఁబడియె
దాని నిరసింప నెవ్వానితరము? చేయఁ
దగినదియ భూతిరుద్రాక్షధారణంబు. 273.

వ. అంతియ కాని లింగాదిచిహ్నధారణమునఁ బ్రమాణం బరయ మనుటయు శివభక్తాగ్రగణ్యుం డగువిపక్షశూలుం డి ట్లను, నార్యా! ప్రమాణంబు లేక పోలేదు. వలయునేని యిదే తెల్పెద నాలింపుము. 274.

చ. మును త్రిపురాసురక్షయసముద్యములై సుర లంద, ఱాది వహ్నిని, నడుమన్ శశిన్, దుది రమేశు ఘటించి సృజించి రొక్క యమ్మును-దమలో నెవండు నది పూన సమర్థుఁడు గామి నెవ్వఁ డౌనని మది నెంచుచోఁ గలిపయామరు లి ట్లని రంతరజ్ఞులై. 275.

క. జ్వాలనాదులు రుద్రుని యు
జ్జ్వలతేజంబులె; కృశానుచంద్రులు నేత్రం
బులు, హరి తద్దేహజుఁ, డ
ట్టు లగుట గా దిద్ది యమ్మృడునకు భరంబై. 279.

ఆ. అనఁగఁ దక్కఁగల్గునమరు లా నంచుఁ బ్రా
ర్థించి రఁబికేశుఁ బృథులభక్తి
హరుఁడు గోరె సురల వరమొండు పశువుల
కేను బతిగ నుండ నిచ్చగింతు. 277.

క. అనుటయు దేవత లని రే
మును నలినజుఁ డాది పసులము సుమీ, మా కె
ల్లను బతి వీ వని తాల్పఁగ
మొనసిరి లింగాదిచిహ్నముల దేహములన్. 278.

ఉ. అంతట నల్లె వాసుకి, శరాసము మేరువు, చక్రముల్ వివ
స్వంతుఁడుఁ జంద్రుఁడున్, రథము క్ష్మాస్థలి, వాజులు వేదరాశి, త
ద్యంత విరించి, గాఁగ సకలామరసన్నుతుఁ డౌచుఁ గాళికా
కాంతుఁడు తచ్ఛరాగ్నులను గాల్చెఁ బురత్రయితో సురారులన్.

గీ. కాన లింగాదిచిహ్నముల్ పూన న్యాయ్య
మేము సేవకులము పరమేశుచిహ్న
ముల నవశ్యమ్ము దాల్పంగ వలదె? సేవ్య
సేవకుల కిట్టిధర్మంబు చెల్లు గాదె. 280.

క. నావుడు శంకరుఁ డిట్లను
దైవతతతి లింగశూలధారు లనంగా

లేవు ప్రమాణము, లగపడు
దేవతలు హరాక్షభూతిధృతినిరతు లనన్. 281.

క. అల కైవల్యోపనిషత్సూ
క్తుల 'శ్రద్ధాభక్తులను నకుంఠధ్యానా
కలన నెఱుఁగు మాత్మం' బన
నలరును, లింగాదిచిహ్న మగపడ దందున్. 282.

గీ. జ్ఞానమునకు శూలాదిచిహ్నమ్ము లంగ
ములుగ నెందును గనరాద, బోధలిప్సు
జనులు ధరియించి రనుటయు విన మొకప్డు
గాన లింగాదిధృతి పాతకమన కగును. 283.

వ. 'నాన్యః పంథా విద్యతేఽయనా' యేత్యాదివేదవాక్యములు ముము
క్షువున కపరోక్షజ్ఞానము వలయు నని తెలుపునే కాని యెందుం
దేహసంతాపాదికమ్ము వలయు నని తెలుపవే! మఱియు నయ్యది
శాస్త్రవినింద్యంబు. 284.

ఉ. తన్మదయిలేంద్రచిహ్న మగుఛత్రము భృత్యునియందుఁ గానఁగా
రాదు; మహేశచిహ్న మని రాజితభక్తిఁ దలంచి మీరు శూ
లాదులఁ దాల్ప నాగ్రహవశాత్ములరేని యయోమయంబు శూ
లాదినిమాత్రిఁ దాల్పవలె నబ్బును భారముమాత్ర దానిచేన్. 285.

మ. "హరభక్తుండు భుజాదిభూషణముగా వ్యాళాదిచిహ్నాళిఁ ద
త్పరచిత్తంబునఁ దాల్పఁగావలె" నన న్భావ్యంబె? యేరజ్జువో
యురగభ్రాంతిని గాంచుమాత్రమునఁ దాత్రాసోద్రేకసంజాత దు
ర్భర కంపావిల చిత్తుఁ డౌనరుఁడు తాల్పన్ జాలు టెట్లారయన్.

క. కావున నిష్ప్రేమరతిఁ
బోవిడిచి త్యజించి చిహ్నములు శ్రుతిహితక
ర్మావహితుఁడవై కనుమా!
జీవేశైక్యానుభూతి స్థిరచిత్తమునన్. 284.

ఆ. అట్టు లాత్మబోధ మలవడెనేని య
జ్ఞాననాశనమ్ము గలుగు దాన
ముక్తుఁ డౌదు వన్యమున నెన్నఁటికిఁ గా వ
టంచుఁ బలుక గురున కతఁడు మ్రొక్కె. 285.

వ. అట్లు మ్రొక్కి పశ్చాత్తప్తచిత్తంబుతోఁ గలంగి నలంగి. 286.

ఉ. వీతసమస్తచిహ్నుఁ డయి వేగ సపుత్రకబాంధవమ్ముగా
నాతఁడు శంకరార్యచరణాశ్రయలబ్ధవివేకభావితా
ద్వైతమతావలంబి యయి భాసిలెఁ; గొందఱు శైవు లంత న
ద్వైతమతప్రవిష్టు లయి తత్త్వ మెఱింగి చెలంగి రయ్యెడన్. 287.

ఆశ్వాసాంతము.

శా. మాద్యద్రావణవక్త్రవారిజవనీమాతంగ! సుత్రామపు
త్రోద్యద్దుర్దమ కాద్రవేయగిలనాత్యుత్సాహపిత్సత్పతీ!
ఖద్యత్తాపస తాప హృ త్యభినవాక్షీణాంబుమోతూబ్ద! బ్ర
హ్మద్యారాధ్యపదాబ్జపాంసులగనాబ్జాక్షీభవత్ప్రస్థరా!

క. సగుణభగవత్సపర్యా
నిగమనపరనైకమతగణితలతూర్యోత్కా!
యగుణభగవదగణితమహి
మగవాఙ్మనసానవాప్యమాహాసపుంజా!

మత్తకోకిలవృత్తము.

దుష్టశిక్షణశిష్టరక్షణదుష్కరవ్రతదీక్షితా!
భ్రష్టధర్మపునఃప్రతిష్ఠితిరక్షణాత్తవతారకా!
హృష్టవేంకటరాయమంత్రిహృదీడ్యమందిరవాససం
తుష్టమానస! ముష్టదుర్దమదుష్టవిద్విషదిందిరా! 293.

ఇది శ్రీగురుకరుణాసమాసాదిత కవిత్వ 'కవితాభూషణ', 'విద్వత్కవిశేఖర' వెంపరాల సూర్యనారాయణనామధేయ ప్రణీతంబైన శంకరవిజయంబున

సప్తమాశ్వాసము.

శ్రీగురుమూర్తయేనమః.

శ్రీ శంకరవిజయము.

అష్టమాశ్వాసము.

శ్రీత్ర్యంబకబింబా! గా
యత్ర్యంచితపురుషరూప! హస్తధృతలస
ద్ధాత్ర్యాత్మజ వేంకటరా
డ్ధాత్ర్యమరస్తుత్యనామ! దశరథరామా! 1.

వ. అవధరింపుము.

శంకరుఁ డనంతశయనక్షేత్రమున కేఁగుట.

ఉ. ఆనియతాత్ముఁ డట్లచట నద్వయనీతిఁ బ్రతిష్ఠ సేసి స
న్మానితుఁడై యనంతశయనం బను క్షేత్రముఁ జేరి యాహరిం
బూని భజించు చొక్కనెల పుచ్చుచు; వైష్ణవ,పాంచరాత్ర,వై
ఖానస, భక్త, భాగవత, కర్మవిహీన, సమాఖ్యులౌ ద్విజుల్. 3.

క. షడ్విధములవారు పరి
వ్రాడ్వరుదరిఁ జేరఁ బ్రాడ్వివాకుం డయి "వి
ద్విడ్వృత్తి మఱచి మీ మీ
షడ్విధమతరూపములఁ బ్రసంగింపుఁ" డనన్. 4.

భక్తమతనిరాసము.

గీ. అందు భక్తాఖ్య విష్ణుమతావలంబు
లనిరి—సర్వజ్ఞుఁడు జగన్నియంత యజుఁడు
నై నవాసుదేవుండె రామాదికావ
తారముల నెత్తె భూభారహారకముగ. 5.

క. 'మూఢుల మే మా దేవుని
గాఢముగ నుపాస్తి సేసి కాంతుము తద్వా
సాధారకన' మనుబుద్ధిని
రూఢిని వర్తింతు మని యెఱుంగుము మమ్ముర్. 6.

శా. కౌండిన్యర్షికి సుప్రసన్నుఁడయి లోకత్రాత యానియ్యనం
తుం డస్మత్సముపాస్యుఁ డైనభగవంతుం డింక నాచారమం
దుండెర్ 'గర్మము జ్ఞాన'మం చెఱుతెఱం గోస్వామి!మాలోఁగ్రియా
కాండాసక్తులు కొంద ఱుండి రరయంగా బ్రహ్మగుప్తాదికుల్. 7.

ఆ. జ్ఞానసరణి విష్ణుశర్మాదులము మేము
నడతు మనుడు యతియు జ్ఞానలక్ష
ణంబు తెల్పుఁడా యనంగ నీక్రియఁ దెల్పె
విష్ణుశర్మ సూక్ష్మవిధము దోఁప. 8.

క. శరణం బనంతభగవ
చ్ఛరణం బని మిన్న కుంటె జ్ఞానము సుమి; యే
హరియాన లేక తృణమే
నటిముటఁ జలయింప నేర దవనిం బడునో. 9.

వ. అనుడు శంకరుం డవ్విష్ణుశర్మ కిట్లనె. 10.

సీ. జనియించు శూద్రుఁడై జన్మముచేఁ గర్మ
మున జనించు ద్విజన్ముఁ డనఁగ నవుల
సంధ్య నుపాసింపఁ జను నిత్య; మన్యథా
యగునేని బ్రత్యవాయము ఘటిల్లుఁ
నహరాది వేళలం దగ్నిహోత్రాదిక
మును భక్తి మెఱయఁ బూజన మొనర్చి

సకలధర్మము లొందఁజాలెడు విద్వాంసుఁ
డగుబ్రాహ్మణుం డంచు నిగమసూక్తు

గీ. లభినుతించును నిత్య మైనట్టికర్మ
మిట్లు గావున శ్రుత్యుక్త మైనకర్మ
మెల్లవారికిఁ గర్తవ్య మెపుడు; విధిని
విడువ వేళ గల్గు నని మున్ను నుడివె మనువు. 11.

క. క్రియ మఱి కర్మపరిత్యా
గముఁ దాఁ బ్రతికియు నొనర్చుకష్టున కాక
ల్పము నరక మ్మగుఁ; గర్మం
బమరదె స్నానామరార్చనాది యతులకేఁ. 12.

క. కతిపయవత్సరములుగ వి
హితకర్మముఁ దొఱఁగువారి కెటు బ్రాహ్మణ్యం
చితగతి యలవడు నను న
య్యతిపతిఁ గని విష్ణుశర్మ యనియె నిటువలెఁ. 13.

గీ 'నాకు సప్తమపురుషుండు నాసము డఁట
వానిపిత సుంత కర్మతత్పరుఁ డఁటంచు
బాల్యమున వింటిఁ బెద్దలవలన' ననుచుఁ
'దొలఁగు దూరము ముం' దంచుఁ బలికె గురుఁడు. 14.

చ. అనవుడు విష్ణుశర్మ స్వగణావృతుఁడై వ్యథఁ గూరి దండరీ
తిని భువి వ్రాలి మ్రొక్కులిడి దేవ!మముఁ క్షమియింపు మన్న వా
నిని దగుపాచితంబున వినిర్మలుఁ జేయుఁ డటంచు శంకరుం
డనుటయు శిష్యు లెల్ల గురునానతిఁ బాలనసేసి రయ్యెడఁ. 15.

క. ప్రాయశ్చిత్తముల విమలు
లై యెల్లరు కర్మనిష్ఠు లగుచు నవుడు వా
రాయతిపతిఁ గని బ్రాహ్మణ్యం
బీయెడ నీకరుణఁ గంటి; మిఁక ముక్తి యెటుల్? 16.

క. నావుడుఁ బరమగురుం డుద
యావృతమతియై ద్విజాన్వయాచారముల్
సేవింపుఁడు నిచ్చ శివ, ర
మావిభు, రవి, విఘ్నప, త్ర్యుమా, పంచకముల్. 17.

సీ. పంచాయతనపూజ బ్రహ్మార్పణమ్మని
నిష్కామబుద్ధియై నెఱపవలయు
నటు నిత్యకర్మమ్ము లాచరింప మనంబు
విమలమై జీవేశభేద మడఁగు
నాభేద మడఁగ మూలాజ్ఞాన మెల్లఁ బ
టాపంచ లగు; నది రూపణంగ
జ్ఞానమ్ము పొడతెంచు, దాన లింగశరీర
మస్తమించును, దాన నబ్బు ముక్తి
గీ. గాని వేఱొకదారి మోక్షంబు గలుగ
దనుచు వచియించునాచార్యునంఘ్రియుగళి
సగణుఁడై వ్రాలి యవ్విష్ణుశర్మ నిత్య
కర్మములఁ దత్పరతఁ జేయఁ గడఁగె నెలమి. 18.

వ. స్మార్తాచారరతుండై భస్మంబునం జందనంబునం ద్రిపుండ్రంబు దాల్చుచు, స్నానం బొనరించి మృత్తిక నూర్ధ్వపుండ్రంబు తీర్చుచుఁ బంచాయతనపూజాపరుండై యుండు నంతఁ గర్మమార్గగాములగు బ్రహ్మగుప్తాదు లరుదెంచి వందన మిడి. 19.

శా. 'స్వామీ! స్మార్తమతావలంబనులమై బ్రహ్మార్పణం బన్నధీ
నే మెల్లప్పుడు కర్మముల్ నెఱపుకొం చీక్షేత్రముల్ బాయ కు
న్నా'మంచుల్ బలుకన్ గురుం డనె 'నిఁకన్ బంచార్చనానిష్ఠఁ జే
తోమాలిన్యము వాసి, భేదమతిక్రిందుల్ ముందు వీకం దగున్.

గీ. ఆత్మబోధాప్తి లింగదేహము నశింప
నద్వయము సచ్చిదానంద మైనబ్రహ్మ
మందును రటన్న, బ్రహ్మగుప్తాదు లెఱిఁగి
శంకరునిశిష్యు లైరి, స్వాస్థ్యమ్ము గనిరి. 21

భాగవతమతనిరాసము.

ఉ. అంత నొకండు భాగవతుఁ డొద్దిజుఁ డయ్యతిఁ గాంచి పల్కె నో
క్కీ-ఁతగ నూమతంబు వినుమీ! 'సకలశ్రుతిలబ్ధపుణ్య, మ
త్యంతము సర్వతీర్థములయందలిసత్ఫల మొందు మర్త్యుఁ డ
శ్రాంతజనార్దనస్తుతిపఠింపదుఁడై' యను సూక్తిఁ జొప్పునన్. 22.

ఆ. విష్ణుకీర్తనం బవిరతం బొనర్చుచు
శంఖచక్రచిహ్నశాలుల మయి
యతితితులసిపేరు లలికోర్ధ్వపుండ్రమ్ము
లమర నిందు నుందు మబ్బె ముక్తి. 23.

ఆ. అనుడు శంకరార్యుఁ డనియెఁ జక్రాద్యంక
నము ప్రమాణవిరహితము వినింద్య
మనుచు నెఱుఁగ కక్కటా! భాగవతుఁడ నం
చనఁగ నెంత ధైర్యమును వహింతు? 24.

క. భగవంతుని మూర్తులు నా
లుగు దెఱఁగులు; వానిలోఁ దొలుతది పరాఖ్యన్
గగనాకృతి యగు, నది వా
గగోచరం బనఁ బ్రమాణ మాలింపగదే 25.

వ. 'యతో వాచో నివర్తంతేఽప్రాప్య మనసా సహ' అను నేతాదృ
శశ్రుతివాక్యంబుల నెఱుంగవే? అట్టి నిరాలంబస్వరూపునకుఁ జి
హ్న మేడ? దానిని మీరు దాల్చు టేడ? 26.

మ. హరికిన్ రెండవమూర్తి వ్యూహసమభిఖ్యన్ సర్వలోకాత్ము డై
పరఁగన్-శక్తుఁడవేని దాల్పు మది, యాపాదోత్తమాంగంబు చె
చ్చెరఁ దప్తంబుననో, మఱొక్కటనో; నాశంబొంది యాబొంది వే
నరదుష్ప్రాపము వైష్ణవత్వమును బొందం జాలె దాసంస్కృతిన్.

గీ. అచ్యుతుతృతీయమూర్తి మత్స్యావతార
మాది యగు నవి, తప్తలోహమున వాని
చిహ్నములఁ దాల్పు; శంఖాదిచిహ్న మేల?
విష్ణువటు లోహచక్రాది వెస ధరింపు. 28.

క. అదిగాక విష్ణునాలుగ
వది యగుమూర్తియ శిలామయార్చామూర్తుల్
వదలక తనువు తదాకృతి
పదచిహ్నిత మాచరింపు బాలిశ! యిఁకనేన్. 29.

వ. అని తదీయచిహ్నధారణంబు నిందించి, దిగులొంది యున్న యా
భాగవత మతానుయాయియందుఁ గరుణ వొడమి యతిచంద్రుండు
మంజులఫణితి ని ట్లను. 30.

గీ. ఆలకింపుము విష్ణుచిహ్నము లవశ్య
ధార్యము లటన్న పాషండతను ద్యజించి
ఫలము పరమేశ్వరార్పణకలితముగ స్వ
కర్మములు సల్పి సంశుద్ధి గాంచి మఱియు. 31.

క. అద్వైతవాది యగుస
ద్విద్వాంసుని గొల్చి తదుపదేశమ్మునఁ గ
ర్మద్వైతబంధసంహతి
కుద్వాసము సెప్పి ముక్తి నొందఁ గదోయీ! 32.

క. పరియతింపవలె ముముక్షువు
లయమున బోధమున కెపుడు 'నాన్యః పంథా
అయనాయ విద్యతే' యని
నయమున శ్రుతి ఘోషణం బొనర్చుట వినవో. 33.

వ. అనుటయు నవ్విప్రదేవుండు మ్రొక్కి- దేవా! మదీయపుణ్యపరిపాకంబున భవదంఘ్రిసరోజసందర్శనం బబ్బె నన్నుఁ గృతార్థుఁ గావింపవే యని వేడుటయు జగద్గురుండు కరుణాళుండై యిట్లను.

ఆ. చిహ్నములను వేసఁ ద్యజించి కర్మముల న
కామముగ నొనర్పఁ గడఁగు 'బ్రహ్మ
మేన మైతి' ననుచు నెద భావన నొనర్ప
బోధ ముత్పతిల్లి ముక్తిఁ గనెదు.

వ. అని యుపదేశింప నావిప్రదేవుండు తదుక్తప్రకారమున వర్తించువాఁడ నని వందనం బాచరించి గురుని సేవించుచు నుండు నవసరంబున. 38.

వైష్ణవమతనిరాసము

సీ. నాలుక "నోం నమో నారాయణాయ" య
న్మంత్రమ్ము నుచ్చారణమున మరపి
తనువు తదీయముద్రలఁ బాంచజన్యసు
దర్శనమ్ములఁ జిహ్నిత మ్మొనర్చి
పటుతర సంసారబంధముక్తుండనై
వైకుంఠమున కేఁగువాఁడ నింక
నస్మాద్రృశులు వైష్ణవాగ్రిణుల్ పరమప
దం బైనయుం దుండఁ దగినవార

గీ. లని వచించుచు శార్ఙ్గపాణ్యాఖ్యవాఁడు
వైష్ణవుం డొక్కఁ డయ్యతిస్వాములకడ
కరుగుదెంచి చక్రాద్యంకనాదిఁ గూర్చి
పలికె నాడంబరంబు వాక్కుల నెసంగ. 37.

గీ. భుజములందు శంఖ రథాంగ ముద్రలమరఁ
దులసిమాలలుఁ దమ్మిపూసలు సెలఁగ
ఫాలవిధృతోర్ధ్వపుండ్రులై పరఁగువారె
వైష్ణవులు, విశ్వభువనపావనులు వారె. 38.

క. అనియెఁ బురాణవచనం
బనఘా! 'చిహ్నములఁ దాల్ప నగు' నన మానం
బను శార్ఙ్గపాణినామకుఁ
గని యనియె యతీంద్రుఁ డుక్తికౌశల మెలరన్. 39.

మ. శ్రుతి నీయర్థము గానరా దరయుచో శ్రుత్యుక్తి యొక్కం 'డత
ప్తతనుం డొందఁడు ముక్తి' నాఁ దనరుఁ "తప్తం" బన్నఁ గృచ్ఛ్రాదికో
గ్రతపస్తప్తము గాని తప్తపదముద్రాదగ్ధ మం చర్థ మె
ట్లు తగున్ ముక్తికి ధ్యానమున్ శ్రుతులు తెల్పున్ సాధనప్రక్రియన్.

వ. అంతియ కాని చిహ్నధారణవిధి శ్రుతుల శశివిషాణంబ. 41.

ఆ. 'బ్రహ్మవిదుఁడు ముక్తిఁ బడయు' నం చనుసూక్తి
నెఱుక యొకటె మోక్షహేతు వయ్యెఁ
బుణ్య మఱిన మర్త్యమును జొచ్చు ననుసూక్తి
నబ్బు సంసృతియు తదన్యగతుల. 42.

సీ. తప్తశంఖాదిముద్రల నిషేధింపవే
యలబృహన్నారదీయాదికములు

హరిసముం డైతిఁ జిహ్వాధృతి నంచనుట మ
నోరాజ్యమాత్ర మౌనుగద తలఁప
నవరపర్ణుఁడు శిఖాయజ్ఞోపవీతాది
ధారణమ్మున ద్విజత్వమ్ము గనునె?
మోక్షమ్ము బ్రహ్మాత్మ బోధమ్మునను లభ్య
మనుశ్రుతిప్రామాణ్య మరయలేదె?

గీ. కాన "బ్రహ్మాఽహ" మని సదా ధ్యానమూన,
ద్వైతభావన నశియించు దాన నపుడ
జీవుఁడే పరశివుఁ డయిపోవు, నదియ
యపునరావృత్తి ముక్తి సమాఖ్య నొప్పు. 43.

ఆ. అవిరతంబు మది 'శివోఽహం శివోఽహ' మ్మ
టంచు నెంచు నెవని కైనఁ గాని
తార్చు శివుఁడు తనదు తాదాత్మ్య మని శివ
గీత నొడివె ననుచుఁ గేల్మొగిడ్చి. 44.

ఆ. అల్లవైష్ణవుండు నద్వైతమతదీక్షఁ
గందుఁ ద్వదుపదేశకలన ధన్యుఁ
డైతి, ననుచు గురునియడుగుఁదమ్ముల వ్రాల
నరసి గురుఁడు ముక్తుఁ డగుమి యనిన. 45.

క. ముదలఁ గొని స్మార్తధర్మా
స్పదుఁడై పంచాయతనసపర్యాపరుఁడై
మది ముద మందుచు నిజజన
పదవాసులఁ దనమతంబువలనికిఁ ద్రిప్పెన్. 46.

వ. అట్లాతండు గురుకరుణామృతపానతుందిలహృదయారవిందుండై
స్వమందిరంబున నుండె నంత. 47.

పాంచరాత్ర మత నిరాసము

గీ. తివిరి పాంచరాత్రాగమదీక్షితుం డొ
కండు నను దెంచి యాచార్యుఁ గాంచి పలికె
భువిని ముక్తిప్రతిష్ఠాదిమూలభూత
మస్మదాగమమత మోక్షకుఁ దగును గాన. 48.

గీ. నిఖిలవిప్రుల కాశ్రయణీయ మస్మ
దాగమ మతంబ యన శంకరార్యుఁ డనియె
నాగమము శ్రుతి కవిరుద్ధ మైనగ్రాహ్య
మగును; గాదేని యగ్రాహ్య మఖిలమునకు. 49.

సీ. ఆయాగమము చెప్పు "నన్యమంత్రోపదే
శము నొందఁ గాదు వైష్ణవత" కనుచు
"నబ్బు బ్రాహ్మణత గాయత్ర్యుపదేశాన"
నన వైష్ణవతకుఁ జేటగును గాదె
గాయత్ర్యభావమే కలుగుచో విష్ణుమం
త్రశతాప్తినైన విప్రత లభింప
దాబ్రాహ్మణతయ రూపఱ వైష్ణవత యేల?
యటుగాక "మాకు గాయత్రి విష్ణు
గీ. శక్తి యగును శంఖాదిసంపక్తి ననిన
నిందుశేఖర, పంచాస్య, హృద్యమూర్తి
సర్వసంపూజ్య, శుభద, యీశ్వరియుఁ గాన
నల్ల గాయత్రి కాదొకో యభవుశక్తి? 50.

మ. కమలాప్తోద్గతదివ్య తేజమునకున్ గాయత్రియే హేతువై
యమరున్; విష్ణువు భానుమండలగతుం డౌఁ గాన నాదేవి త
త్కమలానాయకుశక్తి యౌనెకద, తత్పంచాననత్వం బనే
కము లౌరూపుల నెందునాపెకుఁ దగుంగా యందునేమోకదా. 51.

గీ. వ్యాహృతులనుండి గాయత్రి; ప్రణవమునను
వ్యాహృతులు, తన్మహేశ్వరువలనఁ బ్రణవ,
మవతరించుట గాయత్రి శివునిశక్తి
"హరుఁడ స్వరకర్త" యనఁడె నారాయణంబు. 52.

గీ. ఎద్ది వేదాదిసంప్రోక్త, మెది తదంత
సుప్రతిష్ఠిత, మెది ప్రకృతిప్రలీన
మట్టి స్వరమున కవ్వల నభవుఁ డలరు
ననిన నారాయణశ్రుతిఁ గనినఁ దెలియు. 53.

ఆ. అష్టమూర్తి మూర్తులం దర్కుఁ డొకటి, పం
చాననాదియుక్త వానిశక్తి
వైష్ణవునకు నీకు భవమూర్తి రవిఁ గొల్వ
రామి హాని యొదవు బ్రాహ్మణతకు. 54.

క. 'చెడుఁగాక బ్రాహ్మణత నా
కడరెను వైష్ణవత' యందువా? యుభయభ్ర
ష్టుఁడ వైతి భావనాయో
గ్యుఁడవును నడపీనుఁగైతి వోసరి చనుమా. 55.

చ. అని యతి వల్క మాధవసమాఖ్యుఁడు వైష్ణవుఁ డొక్కఁ డిట్లు ప
ల్కెను 'విను తప్తశంఖముఖకీలన వైష్ణవలోకమబ్బు నం
చు ననెడి పాంచరాత్రమతసూక్తి త్వదుక్తిని నష్ట మయ్యెనే'
యనవుడు శంకరార్యుఁ డనె నాగముల్ శ్రుతిసమ్మతిన్ మనున్.

క. ఆగమకథితాచారము
నైగమసమ్మతిని గాంచెనా? గ్రాహ్యంబా
నాగమ మగ్రాహ్య మగుఁ ద్రి
యాగమితవిరోధ మొందెనే నించుకయున్. 57.

ఉ. మానుగ వేద మొక్కటి ప్రమాణము నూవె యతీంద్రియార్థవి
జ్ఞానమునందు; నాగమము గ్రాహ్యము యా నిగమానుకూల మా
నేని; క్రియావిరుద్ధమగు నెద్దియుఁ గాదు ప్రమాణ మెన్నఁడుౝ
గాన స్వకర్మసక్తుఁడవు గ మ్మిక బ్రాహ్మణధర్మసిద్ధికై. 58.

సీ. నియతస్వకర్మాభినిష్ఠుఁడ వై తేని
తొలఁగు మోహము విశుద్ధుండ వగుదు
తనయంతఁ దాన తత్త్వజ్ఞాన మపు డబ్బు
నద్దాన ముక్తుండ వగుదు వీవు
తదితరమున ముక్తి యొదవ దియ్యర్థమం
దునఁ బ్రమాణమ్ము శ్రుతిని వినఁగదె
"తన్నును సర్వభూతములందుఁ దనయందు
సకలభూతములఁ గాంచంగఁ గనినఁ
గీ బరతరాత్మంబు నొందు, నితరముచే న
సాధ్య" మని యుండెఁ గానఁ బాషండచిహ్న
ముల విడిచి మోక్షసిద్ధ్యర్థముగ గణింప
వయ్య యద్వైతమతనిష్ఠ ననవరతము. 59.

చ. అనవుడు మాధవుం డపుడ స్వాన్వయులుౝ నిజదేశవాసు లా
జనములు దాను స్మృత్యుదితసంస్కృతులౝ గని యద్వయాధ్వని
ష్ఠను సతతాగ్నిహోత్రబలిసాంధ్యవిధిప్రవణాత్ముఁడై తన
ర్చెను గురు నాజ్ఞ నౌదల ధరించి జగద్ధితబద్ధబుద్ధియై. 60.

వైఖానసమతనిరాసము.

వ. అంత. 61.

సీ. నారాయణుం డస్మదారాధ్యుఁ డగుట మా
మతము శా దనఁగ బ్రహ్మకుఁ దరంబె

వైకుంఠపదమె భావ్యమ్ము “తద్విష్ణోః ప
ర” మ్మను శ్రుతి ప్రమాణమ్ము దాన
నజరుద్రు లుదయింత్రు హరినుండి యను శ్రుతి
నారాయణుఁడు జగత్కారణ మగు
నాతఁ డంతర్యామి యఖిలలోకారాధ్యుఁ
డజుఁ డనంతుండు విశ్వాతిశాయి
గీ. యనుచు వైఖానసమతస్థుఁ డైనవ్యాస
దాసుఁ డనువాఁడు తత్సవిధమున కేఁగు
దెంచి ప్రణమిల్లి మఱియు వచించె యతిబు
భుక్షుతో నిట్లు తద్భక్త లక్షణంబు. 62.

క. నెమ్మదిని హరి నిలిపి శం
ఖమ్ము రథాంగమ్ము భుజసఖములుగ నిఖిలాం
గ మ్మూర్ధ్వపుండ్రసంస
క్తమ్ముగ వైఖానసమతతత్పరుఁ డొప్పున్. 63.

మ. అనఁ బల్కున్ యతిమౌళి “పాలకుఁ డజుం డైనన్ ముకుందుండమై
నను మాక్షిప్తమ న్నూ, పునర్జననశూన్యం బౌపదం బొందఁ గో
రినఁ దత్త్వావగమంబె సాధనము, పేర్మిన్ విష్ణుభక్తుండవే
నొనరింపన్ వలెఁ గర్మగాండ మనహంయుఖ్యాతిఁ దత్ప్రీతిగన్. 64.

గీ. అంతియేకాని తప్తశంఖాదిచిహ్న
ధారణము మానవలె, నిరాధార, మాగ
మము శ్రుతివిరుద్ధమై యప్రమాణ మగుట
వినవో? యటుసేఁత బ్రాహ్మణ్యమునకె హాని. 65.

వ. అనుటయు వ్యాసదాసుఁడు ‘స్వామీ తొల్లి దత్తాత్రేయపరమ
యోగి పంచముద్రాముద్రితాంగుండయ్యె, నామార్గమ్ము పెక్కు

రు ముముక్షువులు గ్రహించి రని పురాణంబుల విశ్రుతంబ, కానఁ
జక్రాదిధారణమున కాపురాణంబుల ప్రమాణంబు తత్సంస్కార
మూరునకు వైష్ణవత్వహాని తప్పదు. కాన భగవచ్చిహ్నధారణ
మావశ్యకంబనుటయు నాయాచార్యసార్వభౌముఁ డిట్లనియె. 66.

శా. దత్తాత్రేయుఁడు తత్త్వవేత్త, ఋషి, తప్తక్షుద్రముద్రావిధిన్
జిత్తం బుంచునె? యేప్రయోజనము సంసిద్ధించు నవ్వాని; కీ
వృత్తం బర్భకులేని నమ్మరురె? యే దేనిన్ బురాణంబునన్
దత్తప్తాంకనవృత్తమున్ వినము నీతత్త్వజ్ఞతల్ మెచ్చ నో. 67.

వ. కాన మాధ్వమ్ము విడిచి సుఖంపుము, పురాణంబులఁ జిహ్నధార
ణం బ్రశుతచరం బగుట నగ్రాహ్య మని తెలియుము. 68.

మ. అలప్రహ్లాదునకున్, విభీషణునకున్, హా స్త్రీశ్వరాత్తానపా
దులకున్, ద్రౌపది, కాంజనేయునకు, గోధుగ్గోపికాశ్రేణి, కి
మ్ములఁ జక్రాంకన మేగురుం డొనరిచెన్ మూఢత్వపాషండము
ద్రెలఁబోనాడిచి 'బ్రహ్మమైతి' ననుచిఁతన్ మోక్షమున్ గాంచుమా.

సీ. అంకధారణ మవశ్యంభావి యంటేని
గరుడముద్రలను గంధరఁ ధరింపు
శేషాహిచిహ్నముల్ చెక్కుల దాల్పు క
ర్మేంద్రియాగ్ర్యము లైనయిరుభుజంబు
శంఖచక్రాంకనసంపన్న మొనరింపు
జ్ఞానేంద్రియాభ్యర్ణగతము లైన
చెక్కులు లారీతిఁ జిహ్నాంతరఁ బగునంతఁ
బశువట్లు కాంతు నిబంధనంబు
గీ. నిటుల స్వవిహితకర్మవిహీన వైష్ణ
వునకు నీ కగ్నిహోత్రాది పొనఁగు వడిన

మిగులునే కద బుగబుగల్ నెగడు గంధ
సారపుంబూంత లమలవస్త్రములధృతియు. 70.

మ. అనవై ఖానసుఁ డయ్యతి ప్రవరు పాదాబ్జంబులన్ వ్రాలి యో
యనఘా! నీకరుణన్ వివేకి నయి చిహ్నత్యాగమున్ జేసికొం
టిని నాకీవ గురుండ వద్వయవిధానిష్ణాతునిం జేయు మ
న్నని ప్రార్థింప స్మితాస్యుఁడై యనియె నయ్యాచార్యుఁ డవ్వానికిన్.

ఉ. భావనసేయు "మే నయితి బ్రహ్మ" మటంచును శక్తి లేదయే
నావచనంబులన్ దలఁపు మాత్మను బాయక, యట్లు సేయుచోఁ
బోవును ద్వంద్వముల్ సమసిపోవు పదూర్మ్మ లెఱుంగు దాత్మమున్
నీవు విముక్తిఁ గాంతు గననేరవు నూ పెఱతోవ మోక్షమున్.

క. అని బోధింపఁగ శిష్యుం
డను జరితార్థుండ నని మనఁబున బ్రహ్మం
బ నయితి నని భావించుచుఁ
జనె యతిపతి కెఱంగి స్వకులజనసంయుతుఁడై, 73.

కర్మహీన మతనిరాసము.

వ. ఆతం డట్లరుగునంత నామతీర్థుం డనుకర్మహీనవైష్ణవుం డేతెం
చిన శంకరుండు వానిం గాంచి నీమతంబు దెలుపు మనుటయు నా
తండు సగర్వంబుగా నిట్లను.

సీ. అప్రధృష్యమ్ము శేషాహి కేనియు మన్మ
తంబు నాలింపు సర్వంబు జగము
విష్ణుమయం బను విమలోక్తి కతన "మ
ద్భిష్యుఁ డ్వత్పదసరసీజయుగళిఁ

జేర్పుమా" యని గురుసింహుఁడె ప్రార్థింప
జగదీశ్వరుం డట్లుపలికితేఁ
గానఁ బునర్జన్మకారణాభావుండ
నగుచు జీవన్ముక్తి నందుకొందు

గీ. నీరును ముముక్షులేఁ గర్వహీను లగుచు
విశ్వమయుని సురేశుని విష్ణుఁ గొలువ
నయ్యెదరు ముక్తులుగ నిశ్చయంబు దీని
కంటె సుఖమైనమోక్షమార్గంబు లేదు. 75.

వ. అనుటయు శంకరుండు సోత్ప్రాసంబుగ నిట్లనియె. 76.

గీ. పలికితి నిజంబు కర్మవిభ్రష్టవగుట
నంది తీవు జీవన్ముక్తి నదిర! మదిని
నింద్యము ననింద్య మనుచుఁ జింతింపకయ పి
శాచవైఖరి వర్తింప సాగి తిటులు. 77.

వ. అని యుపహసించి వేదోక్తసకలకర్మంబుల బ్రహ్మంబున ఫలా
ర్పణంబుసేత జ్ఞానమార్గం బనియు ఫలార్థము కర్మము లొన
ర్చుట కర్మమార్గం బనియు నందు, రయ్యుభయ మార్గంబుల భ్రష్ట
వగుట దండ్యుండవు కాని విష్ణుభక్తుండ వెన్నటికి గానేరవువినుము.

క. తనకుల ధర్మము విడువఁడు,
గను సమత హితాహితుల నొకనివిడువఁడు హిం
సను జేయఁడు సితమనసుం
డనఘుఁ డెనఁడు వాఁడునూవె హరిభక్తుఁ డనఁ. 79.

చ. స్థిరమగు మామకాజ్ఞలు శ్రుతిస్మృతు లవ్వి, యతిక్రమించువాఁ
డరయఁగ నాకు ద్రోహియ మదాజ్ఞలు మీఱుట, వాఁడు భక్తిమై

వరలినఁ గాఁడు వైష్ణవుఁ; డవార్యమదాజ్ఞను దుంచి ద్రోహియై
నరకము సొచ్చు"నన్నవచనంబుల విష్ణుఁడె యొప్పెఁ గర్మముల్. 80.

వ. 'బ్రాహ్మణః కర్మ కుర్వీ' తేత్యాదివాక్యములం జేసి కర్మత్యాగ
మును దేవాంతరత్యాగమును విప్రుల కొప్పద "అగ్ని ర్దేవో
ద్విజాతీనా" మనువాక్యముచే బ్రహ్మచారిప్రభృతు లెల్లరు కర్మ
త్యాగ మొనర్పరాదు. 81.

క. శమియించును గృచ్ఛ్రత్రిత
యమునఁ ద్రిసంధ్యాతిపాతజాఘ మనుటఁ గ
ర్మము ద్విజుల కపరిహార్యము
సుమి, యతులకె త్యాజ్య" మనుచు శ్రుతి యానతిచ్చెన్. 82.

ఉ. నావుడు నామతీర్థుఁడు ప్రమాణములన్ గురుఁ దృప్తుఁ జేసి సం
భావితకర్మమార్గుఁ డయి వర్తిలుచున్, నిజపక్షఖండనం
భావిధి సల్పు శంకరుని యందఱు నొజ్జగఁ గోరి నిష్కృతిన్
బావను లౌచు స్మార్తమతపద్ధతితోఁ గొని రద్వయాధ్వమున్. 83.

హిరణ్యగర్భమతనిరాసము.

క. అంతఁ బరివ్రాట్త్రిలకుఁ డ
నంతశయనవాస మెడసి యయి దహనముల కం
తంతట సుబ్రహ్మణ్యా
ఖ్యాఁతక్షేత్రమ్ము చేరె నట గుహుఁ గొలువన్. 84.

సీ. స్నానం బొనర్చి శిష్యశ్రేణిఁ గూడి కు
మారధారాఖ్యనిమ్నగకు నేఁగి
యర్చించె విధివిహితాధ్వమునన్ భక్తి
షణ్ముఖదేవు శేషస్వరూపుఁ

దాల్చెఁ గాషాయవస్త్రములఁ దచ్చుగను గే
  ల్దోయి దండకమండలువులఁ బూని
మంద్రస్వరమునఁ ద్ర్యంబక ముచ్చరించుచు
  భూతి సర్వాంగీణముగ నలందెఁ
గీ. బూర్ణభక్తి సుబ్రహ్మణ్యపూజ సలుప
నటకుఁ దండోపతండమై యరుగుదెంచు
దేశదేశాంతరస్థధాత్రీసుపర్వ
సమితి కద్వైతబోధమ్ము సలుపఁ జొచ్చె. 85.

ఉ. అందు హిరణ్యగర్భసముపాసనదీక్షితవిప్రకోటి క
ర్మందిమహేంద్రసన్నిధికిఁ గ్రన్ననఁ జేరి వచించి "రార్య! మే
మందఱమున్ మనుప్రభృతు లర్థి సృజించిన కర్మమార్గ మిం
పొంద గ్రహించినారము పయోరుహగర్భకులోద్భవాప్తిచే. 86.

చ. "తొలుత హిరణ్యగర్భుఁ డుదితుండయి భూతచయైకనేతయై
యిలను దివంబుఁ దానె ధరియించెను దాదృశదేవు మాని య
న్యులకు హవిన్ విధింప" మను సూక్తి జగత్తుల కెల్లఁ గర్తయున్
దలఁపఁగ భర్త, హర్తయు నతండ యటంచు వినిశ్చితుం డగున్.

సీ. నిఖిలంబు తాన వినిర్మించు, సర్వాత్ముఁ
  డగుట నంతర్యామి యయి వెలుంగు
నవలఁ 'దదైక్షత' త్యాద్యుక్తికథితుఁడై
  తా హరిహరుల దోర్ద్వయి సృజించు
నట్టి హిరణ్యగర్భాంఘ్రిభక్తులము కూ
  ర్చకమండలువులధారణము విడక
యోగనిష్ఠను గర్మ ముడుగక పచరించు
  వారము వైధాత్రవంశజులము

గీ. యతిపతిని బూజ్యపాదు ని న్నరసి చారి
తార్థ్యమును బొందితిమి, కాని యస్మదుక్తి
వినుమి, యద్వైతమునఁ బ్రయోజన మొకింత
గానవచ్చునె యేల శుష్క శ్రమంబు?. 88.

క. తలసూపు నలువమొద జీ
వులు నిజకర్మమున భవము పొందుఁ బొరిఁ బొరిన్
నలువ కడుపునన లయ మగుఁ
బ్రళయమంతటి ముక్తి నెందుఁ బడయఁగరామిన్. 89.

ఆ. బ్రహ్మవిదుఁడు పొందు బ్రహ్మలోక మదియ
పరమపదము గానఁ గరకదండ
ధారి వైననీవు తల్లోకయోగ్యుండ
వగుదు వనుడు నిట్లు యతి వచించె. 90.

ఆ. ఎవనివలనఁ బొడమె శివుఁడు బ్రహ్మాదిభూ
తములు, వాని నెఱుఁగఁ దడయ కబ్బు
ముక్తి-యనుచు వేదములు పల్కుఁ గాన బో
ధమ్ము మోక్షకారణమ్ము సుమ్ము. 91.

ఉ. అంతియ కాని సుప్తిసమ మైన లయం బెటు ముక్తి యౌను? వే
దాంతవచస్సదాశ్రితిని నబ్బును బోధము, దాన మోక్ష మం
తంత లభించుఁ; గార్య మగునబ్జజుసేవల ముక్తి నేక్రియన్
గాంతురొ మీ రనన్, విడిచి క్రిన్ననఁ జిహ్వములెల్ల వారలున్. 92.

క. శుద్ధాత్మబోధతత్పర
బుద్ధి నయిరి శిష్యు; లదియుఁ బొడగని స్వమత
శ్రద్ధాళు లగున్యపాసకు
లద్ధీరుని కడకు వచ్చి యని రీరీతిన్. 93.

వహ్నిమతనిరాసము.

క. అనలమతరతుల మే మ
గ్ని నుపాసించెదము మంత్రనిగదితదేవుం
డనలుం డొక్కరుఁడే యని
మనమున భావింతు మిటఁ బ్రమాణము శ్రుతియే. 94.

సీ. విశ్వంబు లేకుండువేళను దొలిదొల్తఁ
బొడసూపె నగ్నిదేవుండు తాన
యయ్యగ్నివెంట నుదయ మైనదేవతా
వితతి నుత్తముఁ డయ్యె విష్ణుమూర్తి
'యజమానుకొఱకునై యగ్ని హవిర్భాగ
ములఁ బరిపాటి వేల్పులకు నొసఁగ
మను పరిగ్రహణమ్ము నొనరించుఁగా' కంచు
నిగమ ముండుట భజనీయుఁ డగ్ని
గీ. 'విస్ఫులింగాత్మ మణిఖండవిధృతి నగ్న్యు'
పాసకబ్రాహ్మణులు ముక్తిఁ బడయుదు రని
యగ్ని ద్విజులకుఁ దా దేవుఁ డనియు శ్రుతి వ
చించుటఁ ద్విజన్మలకు వేల్పు శిఖియ తలఁప. 95.

చ అదియునుగాక విప్రుల కఘాపహ మగ్నియ కాక దైవతం
బెదియును లేదు 'వహ్ని! జ్వలియింపుమి, నాయఘపూరుషుఁ హరిం
పు, దశదిశల్ ఘటింపు సుఖపూరితజీవనముఁ, బశూత్కరా
భ్యుదయము' నంచు వేదమున నుంట ద్విజాశ్రయణీయుఁ డగ్నియే.

వ. కావున మీరును నయ్యగ్ని సేవించి కృతకృత్యు లయ్యెదరు గాక యనుటయు నయ్యాచార్యేంద్రుఁ డి ట్లను. 97.

గీ. దేవతలలోన నవముఁడు పావకుం డ
నుత్తముఁడు విష్ణుమూర్తి; తదుభయమధ్య
వర్తు లవశిష్టు లైనదేవత లటందుర్
కర్మదేవత దేవభాగదుఁడు వహ్ని. 98.

ఆ. అగ్ని కారణం బటన్న వాక్యములు భూ
తాత్మవహ్నిపరము లయిన, వగ్న్య
ధీనముగను గర్మ మూని సల్పెఁడు విష్ణుఁ
గొలువుఁ డద్వయాధ్వగులరు గండు. 99.

చ. అదియ విముక్తికిన్ దెరు వటంచు యతీంద్రుఁడు బోధ సేయఁ ద
త్పదముల వ్రాలి మ్రొక్కి ప్రమదంబున నద్వయమార్గ మూని, న
మ్మదిని సుహోత్రుఁ డాది మతిమంతులు వారలు స్వాస్థ్యమొందు న
య్యదన యతీంద్రుఁ జుట్టుకొని రంచెల సౌరమతస్థు లీసునన్. 100.

సౌరమనిరాసము.

చ. అరుణసుమాంచితాంగు లరుణారుణరాంకవచేలధారు, ల
త్యరుణ కుచంద నాగ్నిశిఖ దర్పితచిత్రకు లా దివాకరా
ద్యరుణగభస్తిభక్తులు జయంబు గొనన్ యతిఁ గాంచి వీటికా
త్యరుణిమలిప్తదంతరుచు లాశలఁ గ్రమ్మఁగఁ బల్కి రీక్రియన్.

సీ. సర్వజగద్విలోచన మర్కుఁ డను శ్రుతి
బ్రహ్మాదిరూపుఁ డర్యముఁడు సూవె
యాదిత్యుఁ డితఁడు బ్రహ్మ యటన్న శ్రుతి సృష్టి
సంస్థితిహేతువు సవిత సూవె
ధృతి 'ఘృణి స్సూర్య ఆదిత్య' యన్మంత్రంబు
శిష్టజనం బుపాసింతుర్ సూవె

జపకాలమునఁ దాల్పఁ జను రక్తచందన
తిలకరక్తలతాంతములను జూవె

గీ. కారణం బగుబ్రహ్మయాకార మని భ
జింతు రొకొంద ఱుద్యత్సరసీరుహాప్తు
నన్యులు భజింతురు విశ్వసంహారకుఁ డగు
నభవుఁ డితఁ డంచు గగనమధ్యస్థు సూర్యు. 102.

క. జగదుపసంహారప్రియుఁ
డగు హరుఁడె యుపక్రమించు నఖిలము సృజియుం
పఁగ ననియు హరుఁడె యను రూ
పగు ననియుఁ దలంచి కొంద ఱర్చింతురు రవిన్. 103.

మ. అతిదీర్ఘన్ రవిమండలంబున హిరణ్యశ్మశ్రుకేశాదిసం
యుతదేవు న్గని కొల్తురు కొంద ఱటు సూర్యున్ జూచుచు న్గొల్చునా
వ్రతులం దేశతరుల్ గనుంగొని రవిన్ బాహ్యాదిఁ బూజించి కా
ని తినం జూడర యన్నమున్ జలమునేనిన్ గ్రోలఁ బో రెన్నఁడున్

చ. ఉరమున ఫాలమందు భుజయుగ్మమునన్ రవిమండలాకృతిన్
బరఁగెడు తప్తలోహకరణంబులఁ జిహ్నములన్ ధరించి సు
స్థిరహృదయాంతరమ్ముల భజింతురు సూర్యు ననుక్షణంబుఁ గొం
ద ఱిటుల యాఱురీతులఁ దనర్తురు ద్వాదశమూర్త్యుపాసకుల్. 105

చ. యమివర ! వీర లార్వుర కుపాస్యము మున్ను వచించినట్టి మం
త్రమె సుమి - భానుమండలపరంబుగ సంస్తుతిసేయు వేదవా
క్యములు పరస్సహస్రము; సహస్రశిరోక్షిపదుం డటంచు నా
ద్యుమణిని గాదొకో పురుషసూక్తము పెల్చ నుతించు నెంచుమా.

క. నిగమచయనిరూప్యుఁ డగుం
భగుఁడ "ఋత"మ్మనెడు రుద్రమంత్రంబునఁ బో.

ల్పగు పురుషశబ్ద; మది సర
విగ రవిపర మాను గృష్ణపింగళుఁ డనుటన్. 107.

వ. అరుణుండు సూర్యుండు భానుండు చంద్రుండు తపనుండుమిత్రుండు హిరణ్యారేతసుండు రవి యర్యముఁడు గభస్తి విష్ణుండు దివాకరుం డు నని యాదిత్యులు పన్నిద్దఱు. 108.

శా. అయ్యాదిత్యులయందు విష్ణు వొకరుండై యుంట నాసూర్యుఁడే
యయ్యెన్ విష్ణువు 'నేనె విష్ణుఁడను జు మ్మాదిత్యులం, దేన సు
మ్మయ్యా! జ్యోతుల నంశుమాలి రవి' నం చక్షాక్షుఁ డప్పార్థుతో
నొయ్యం బల్కెఁడె యబ్జజాదులు తదంశోత్పన్ను లే కావునన్.

క. పూని ముముక్షుజనం బీ
భానునె సేవింపఁ జనును బ్రత్యక్షముగాఁ
గాన నగు దేవుఁ డక్కఁడె
నా నయ్యోగీంద్రుఁ డనెఁ దృణము సేసి పరున్. 110.

క. వినుమా మూఢ! దివాకర!
జనియించె మనంబునుండి చంద్రముఁడు చ
క్షునుండి సూర్యుఁడు జనిం
చె ననుచు జన్యతను శ్రుతి వచించును రవికిన్. 111.

గీ. తర్కసిద్ధాంతమున 'ననిత్యమ్ము జన్య'
మని తనర్చుట, నయ్యనిత్యునియెడ నెటు
ననును బ్రహ్మత్వ మర్కనిష్ఠపరమాత్మ
బోధకశ్రుతితాత్పర్యమును గ్రహింపు. 112.

మ. జగదీశాజ్ఞ భ్రమించు సూర్యుఁడని సుస్పష్టంబు తద్భావ 'మా
జగదీశాజ్ఞకు భీతి నొందుచు నభస్స్వాంతుండు వీతెంచుఁ ద

ర్భగుఁ డాత్మోదయుఁ డౌను వహ్ని వెలుగున్ భాసిల్లునిందుఁ డింపె
ల్లుగ ధావించును మృత్యు వంచును శ్రుతుల్ ఘోషించు టాలింపవో.

చ. సమయము, రోదసుల్, జలదసంగతి, లేని యఖండబోధసా
ఖ్యమహితమూర్తి వెల్గెడు చిదభ్రపథంబున సూర్యచంద్రబిం
బములుఁ దటిత్తులున్ వెలుఁగఁజాల వనన్ జ్వలనుండు లెక్కె? వి
శ్వ మెవని వెల్గునన్ వెలుఁగు వానినె పాయక వెల్గు సర్వదా.

క. అనెడు శ్రుతిసూక్తిఁ బరమే
శుని తేజమునన వెలుంగు సూర్యాదికమం
చును స్పష్టము; జ్యోతిశ్శ్రుత
మునఁ దదనిత్యతయె స్పష్టముగఁ గన్పట్టున్. 115.

ఉ. "అంబుజగర్భవాసరమునాది గ్రహంబుల సృష్టియున్, దదం
తంబున నష్టియున్ గలుగుఁ, దత్సమయం బౌకకల్ప, మట్టిక
ల్పంబులు రెండు గూడుకొని బ్రహ్మకు నొక్క యహర్నిశం బటం
చుం బొడగట్టుఁ గాన నెటు సూర్యుఁడు బ్రహ్మకుఁ గారణం బగున్?

క. తరణిస్థితుఁగాఁ గేవలుఁ
బరమాత్మునె పొగడు వేదఫణితి యెఱిఁగి దు
ర్భరపాపండాంకములం
దొఱఁగి సదద్వైతగతిఁ గనుండీ ముక్తిన్. 117.

క. అనుటయు సౌరమతస్థులు
వినతు లయి తదీయశిష్యవృత్తి వెలయ నా
జనపదమునఁ గల భూసుర
జనులు యతీంద్రునకుఁ బూజసల్పిరి భక్తిన్. 118.

క. ఇట్టుల జగద్గురుం డ
ప్పట్టునఁ గల ద్విజుల గౌరవమునకుఁ గుఱియై

చట్టులు వెనుకొనఁ జనె న
ప్పట్టున విజిగీష వాయువం బగుదిశికున్.

మ. కరతాళంబులఁ గాంస్యతాళముల శంఖధ్మానరీతిన్ శుభం
కరవాగ్రీతి మృదంగధింధిమిరుతిన్ ఘంటాధ్వనిన్ బింఛచా
మరతాలవ్యజనానిలంబులను సంభావించి సేవింతు రెం
దఱో మధ్యేపథ మయ్యతీంద్రుఁ గని తత్తద్దేశవాసిద్విజుల్. 120.

క. సేవించిన ఫలముగ నా
యావిప్రులు కరుడు గట్టినట్టి కుశంకల్
వోవ నడఁచి తచ్ఛిష్యులు
నా వెలసిరి త్రోవపొడుగునను జిత్రముగన్. 121.

క. దారి నరుగువాఁ డటనటఁ
దాఁకిన ద్విజరాజి కమృతధారానిభవా
చారుచిరబోధమున భవ
తారకుఁ డయ్యెను శివావతారము గానన్. 122.

చ. యతిపతి యన్వహం బిటు బ్రయాణ సేయుచు శిష్యసంఘ సం
యుతుఁ డయి భిక్ష లందుకొను చొక్కాకయూరను విశ్రమించు చం
చితు లగుదైవచింతకుల శిష్యులుగాఁ గయికొంచు వారు సం
స్మృతిఁ దరియించు త్రోవ వివరించుచుఁ జేరెఁ బురంబు నొక్కటిన్.

క. ఆస్థానము గాణపతము
తాస్థాన; మ్మాటకు వచ్చు నన్యమస్థుల్
స్వస్థితిఁ బరిణతిఁ గనక ని
జస్థానము సేర రంచు జగములు పలుకన్. 124.

క. గణవర మనుపుర మటఁ యది
గణనాథాశ్రమము మోక్షకర మనియుఁ దరం

గిరి 'కౌముది' యని విని త
ద్గుణము లెఱిఁగి పొంగి నదిని దోఁగెఁ దొలుత. 125.

ఆ. అవ్యయుని గణేశు నర్చించి శంకరుఁ
డచట నాసమాత్ర మధివసించెఁ
బద్మపాదముఖులు పంచపూజాపరా
యణులు శిష్యు లర్థి ననుచరింప. 126.

క. పరవిద్యార్దనచుంచులు
పరపక్షక్షపణచణులు వాద కథావి
స్తరవిత్తోక్తులు సరసిజ
చరణాదులు దిగ్గజప్రశంసాపాత్రంబుల్. 127.

వ. అట్టి శిష్యులం గూడి శంకరుం డగ్గణవరమునందలి గాణాపత్యమత
దీక్షితులు యతులకు భిక్షావందనమ్ము సేయనివా రని యెఱింగియు
నచోటు వాయక యొక్కమఠంబున నిశిసి యుండె. 125.

ఉ. ఆతఱిఁ బద్మపాదుఁడు తదాజ్ఞ శిరంబునఁ దాల్చి షడ్రసో
పేతము వంటకమ్ము పచియించుచు శిష్యుల కెల్లఁ బెట్టుచున్
బ్రీతిని దేశికాగ్రణికి భిక్ష యొనర్చు చహర్దివంబునుం
బ్రాతిగ సేవలన్ సలుపు బ్రహ్మసమర్పణ మంచు సర్వమున్. 129.

సా. సాయంకాలము ద్వాదశాంతుల నాచార్యేంద్రు నర్చించి భ
క్త్యాయత్తాత్మకు లౌచు శిష్యులు సమిద్ధానద్ధవాద్యధ్వని
స్ఫాయత్తాలలయారవాయత మహాశస్తోత్రవాచార్భటిన్
జేయం జొచ్చిరి తాండవం బొకపు డంచెల్ గట్టి చిత్రంబుగన్. 130.

భుజంగప్రయాతము.
అజర్యం బనూహ్యం బనాద్యం బనంతం
బజయ్యంబు బుద్ధిస్థ మద్వైతసారం

బ్రహ్మాండప్రజాధార మానందకందం
బజం బుక్త్యగమ్యంబు నా బ్రహ్మ మేనే. 131.

ఉత్సాహము } జితహృషీక మానిగమ్య చిన్మయంబు, సన్మయా
కృతి సదాశివాభిధానకీర్తితం బనార్తి తా
రితభవాబ్ధి శుద్ధబుద్ధహృద్యరూపదీపితం
బితచరాచరంబు బ్రహ్మ మేన, యేనె విశ్వమున్. 132.

క. అని యిటు శివతాండవలీ
లను గురు నానందలహరులం దేలింపం
గని 'యిది యే' మని యచ్చెరు
వెనయుచుఁ జనుదెంచి రచటి యెల్లజనంబుల్. 133.

శా. తత్త్వాదృక్ఛివతాండవోత్సవము సందర్శించి వైవశ్యసం
పత్తిన్ చూపఱు గొంద ఱందోళితులై భావప్రకర్షంబుగా
నృత్తంబున్ బచరింప-గాణపతు లన్వీక్షించి యానృత్త మా
పత్తిన్ ముంచెన మామతంబు ననుచున్ వారించి యవ్వారితోన్.

శా. సన్న్యాసుల్ పొనరించు తాండవము నస్మద్గృహస్థుల్ పొన
ర్ప న్న్యాయంబౌనొకో! యింకవీరిమత మద్వైతంబు 'వ్యోమంబటుల్
శూన్యం బద్వయమైనబ్రహ్మ,మగు'మంచున్ దెల్పుహృద్యాగమ
మ్మైన్వ్యాఖ్యానార్థ మెఱుంగు టెట్లని కరంబాక్షేపముల్ పల్కఁగన్.

వ. శంకరభగవత్పాదు లప్పలుకులు విని యది యట్లుండనిచ్చి ముందు మీమతం బేదియో తత్స్వరూప మెట్టిదో దానికిం బ్రమాణమ్ము లేవియో తెల్పుం డనుటయు వారల కగ్రేసరుం డగు గిరిజాసుతుం డనువాఁ డి ట్లనె. 136.

ఆ. మాది గాణపత్యమత మాఱు విధములఁ
దనరు నెల్ల శ్రుతులు తత్పరములె
యమ్మతమ్ము నూన నత్యంతశాంతియు
ముక్తిరమయు హస్తమునన పొదలు. 137.

గీ. అనఘ! తుండైకదంతచిహ్నాంకితుని స
శక్తికు మహాగణేశ్వరు స్వాంతమందు
నిలిపి తన్మూలమంత్రంబు నిష్ఠ జప మొ
నర్చుద్విజుఁ డొందు ముక్తి సనాతనముగ. 138.

ఉ. ఫుల్లసరోజపాణి మణిభూషణభూషితగాత్రి యైన శ్రీ
వల్లభఁ గూడి విశ్వ జని వర్ధన మర్దన మూలహేతువై
యెల్లరఁ గోర్కు లిచ్చెడు గణేశుఁడె ధ్యేయుఁ డటన్నసూక్తి నీ
యెల్లజగంబు విఘ్నపతియే సృజియించును బెంచు లోఁగొనున్.

ఆ. అబ్జజాతు లెల్ల రత్యయం బొందిన
నుండు గణపతియ యొకం డటంచు
శ్రుతి వచించుఁ గాన నతఁడ బ్రహ్మాది
గణేశుఁ డఖిలమునకు హేతు వరయ. 140.

క. కావునఁ దన్మాత్రయామహీ
మావిర్భూతుల యజాదు లని గాణపతుం
డౌవాది యనఁగ; గురుఁ డనె
దేవానాం ప్రియ! వినంగదే తత్త్వమ్మున్. 141.

చ. గణపతి రుద్రపుత్త్రుఁ డనఁగాఁ బ్రథితం; బెటు తండ్రి కౌను గా
రణము సుతుండు? కాన నలబ్రహ్మము వైదికసూక్తి విశ్వకా
రణ మగు; నీవు నూపుశ్రుతి రాజిలుబ్రహ్మపదంబు బ్రహ్మ మా
గణపతిమాత్ర కా, దెటుల కారణ మా గణనాథుఁ డారయన్? 142.

క. అనిన గిరిజాసుతుం డో
యనఘ! భవత్సూక్తి సత్య, మైనను వీతాం
కనుc డిష్టదేవతాంతిక
మున కెటు చను? ననcగ భిక్షుపుంగవుc డనియెన్. 143

మ. వినుమా బాలిశ! బ్రాహ్మణాన్వయజనిన్ వేదోక్తకర్మాలిని
ష్ఠ నజస్రంబు శిఖాదిధారణమునన్ జెన్మొ దేవతాభావ మ
బ్బును దన్మాత్రcగృతార్థుc డౌనుజుమి విప్రుం;డిట్టి లోహాంకనా
దిని బాషండతమాత్రమే కలుగు ముక్తిన్ గాంచcబోcడెవ్వcడున్. 144

క. వేదవిరుద్ధంబు పురా
ణాదివినిందితము నగుట, నది మోక్షసుధా
స్వాదవిలోలవివేకిజ
నాదర్తవ్యమ్ము కాని దని తెలియcగదే. 145.

సీ. ఉండుc జతుర్దళం బుదిరిడాల్ గలుగుమూ
లాధారచక్రమం దలగణేశుc
డమరు షడ్దళము విద్రుమరుచి యైనస్వా
ధిష్ఠానచక్రానc దివుట బ్రహ్మ
యలరును దశదళంబయి నీలవర్ణంబు
నగు మణిపూరకం బందున హరి
యడరు ద్విషడ్దళం బయి పింగ మగుననా
హతచక్రమున భూతపతి శివుండు
గీ. వెలయు షోడశదళము ధూమలవిభాస
మగు విశుద్ధచక్రమున జీవాత్ముc డవులc
బొలుచును సహస్రదళము కర్పూరవర్ణ
మైనయాజ్ఞాఖ్యమునc బరమాత్ముc డెపుడు. 146.

క. కావున గణపతి తనువున
నే వెలుఁగుఁ దదీయచిహ్నధృతి వ్యర్థం బౌఁ
జూవె తదాజ్ఞాహ్వయచ
క్రావస్థితు సాక్షి నిర్గుణాత్ము నరయ నౌ. 147.

క. అఖిలోత్తముఁ బరమాత్ముని
నఖిలజగదతీతు నచ్చిదానందమయున్
నిఖిలస్థిత్యాదితుఁ దలఁపు
ము ఖలం బగు భవము;దొరకు ముక్తి తనంతన్. 148.

ఆ. అనుచు శుద్ధ మద్వయము శంకరుఁడు దెల్ప
సగణుఁ డౌచును గిరిజాసుతుండు
పంచయజ్ఞపరతఁ బంచపూజారతిఁ
జిహ్నములఁ ద్యజించి శిష్యుఁ డయ్యె. 149.

క. గిరిజాసుతుఁ డటు శంకర
చరణాశ్రితుఁ డగుటఁ గాంచి సరవి హరిద్రా
కరివదనభక్తుఁ డొకరుం
డరుదెంచి వచించె నిటు దురాగ్రహ మెసఁగన్. 150.

హరిద్రాగణపతిమతనిరాసము.

శా. యావద్దేవగణోపదేష్టృకవిబృందాదేష్ట, బ్రహ్మాదిత
ద్దేవేశానగణేశుఁ డంబురుహసూతిత్రాతయున్ జ్యేష్ఠరా
జై వెల్గొందు పరేశు నెంతు మనువేదాలాపమూలంబునన్
యావత్కార్యముఖార్చ్యుఁ డయ్యెఁగద విఘ్నాధీశ్వరుం డొక్కఁడే.

ఆ. కాన సర్వదేవగణపూజ్యుఁ డగు గణే
శ్వరుఁ డొకండె సుమ్ము, స్కాందమందు

నాగణాధినాథు ధ్యానంబు సంప్రోక్త
మయ్యె నది యతీంద్ర! యవధరింపు. 152.

ఉ. తాలిచి పాశసృణ్యభయదండముల౯ శయపంక్తిచే హరి
ద్రాలసదాననం బుదిరరంగుహారంగు లెసంగఁజందెముల౯
జేలము నుల్లసిల్లఁగఁ ద్రినేత్రచతుర్భుజశోభి యైన శుం
డాలముఖు౯ భజించిన క్షణంబున మోక్షము గల్గు నేరిక౯. 153.

ఉ. ఆతఁడు విశ్వహేతువు, తదంశజు లబ్జభవాదు లౌట వి
ఖ్యాతు జగత్పితామహు గణాధిపతి౯ భజియింపు మీవు, బా
హాతటులందు నేకరదనాకృతిఁ దుండసమాకృతి౯ సుత
ప్తాతతలోహముద్ర లనయంబు ధరింప విముక్తి చేకుఱు౯. 154

చ. అన విని విశ్వవేది కరుణాంబుధి యాగురుఁ డిట్లు పల్కె "నీ
వనిన జగన్నిదానమె పరాత్మ మగు౯ బహునాముఁడైన యా
ఘనకు గణేశనామమును జొప్పడు; రుద్రుఁడె పుత్రరూపము౯
గొనెఁ జుమి యంశి కంశమునకు౯ బొడసూపునె భేద మింతయు౯.

గీ. కాన సర్వాత్ముఁ సర్వవిఘ్నపరిహర్త
భక్తు లగువా రుపాసింపవలయు, నతఁడె
సర్వదుఁడు గాన విప్రు లర్చనము సలుప
వలె గణేశాదిపంచదేవతల నెపుడు. 156.

ఉ. మోదమున౯ ముముక్షుజనముల్ గొలువందగు నంతెకాని తుం
డాదిక చిహ్నసంధృతి నిరాకృత మయ్యెఁ బురాణసంహతి౯
వేదములందుఁ గాన నవి వీడి నిరంతరదీక్షఁ బంచపూ
జాదు లొనర్చి యస్వయమతాప్తుఁడవై భవమోక్ష మొందుమా.

ఆ. అనుడు గణకుమారుఁ డయ్యతీంద్రునకు ద్వా
దశనతుల్ పొనర్చి తత్కటాక్ష

విమలుఁడై జగద్గురు మది ధ్యానించుచుఁ
బంచపూజనాదిపరతఁ దనరె. 158.

ఉచ్ఛిష్టగణపతిమతనిరాసము

వ. అట్లు గణకుమారుం డద్వైతమతావలంబి యగుట యరసి హేరంబ
సుతుం డను నుచ్ఛిష్టగణపత్యుపాసకుం డరుదెంచి మహాగణపతి
హారిద్రాగణపత్యుచ్ఛిష్టగణపతి నవనీతగణపతి స్వర్ణగణపతి సం
తానగణపతు లను నుపాస్యవస్తువుల భేదంబున గాణపతమతంబు
షడ్విధం బని శైవాగమకథితం బయ్యె. అందు నుచ్ఛిష్టగణపతియ
మా కుపాస్యుండు వామమార్గావలంబనమున నుచ్ఛిష్టగణపతి
యనఁ బరఁగుఁ దత్స్వరూపం బించుక వివరింతు వినుము. 159.

క. వినుతింతుఁ జతుర్భుజుఁ ద్రి
యను బాశాంకుశగదాభయాంచితుఁ దుండా
గ్రనిపీతమధుకు గణనా
థుని రాత్రిందివము భక్తితో నోరారన్. 160.

క. ధ్యానింతు మహాపీఠా
సీనుని వామాంకమున వసించెడు దేవిన్
బూని కవుంగిటఁ దుండము
చే నచ్చోటిని స్పృశించి చెలఁగెడువానిన్. 161.

ఉ. దక్షిణవామమార్గముల ధ్యానము లీగతిఁ బ్రోక్తమయ్యెఁ బ్ర
త్యక్షముగాఁగ జీవపరమాత్ముల యైక్యమువోలె నైక్య, మా
పక్షయుగంబునందు: గనుపట్టు కొటింగి భజింతు భక్తిఁ దా
దృక్షపథద్వయంబు, ధరియించెదు నొసంటను గుంకుమాంకముల్.

గీ. మఱియు స్వచ్ఛందరీతిఁ గర్మము లొనర్చు
కొనుచు నుచ్ఛిష్టగణపతిం గొలుచుచుందు

దీని కెనయైన మత మెందుఁ గాన నంచుఁ
బ్రతినిమిష మందుఁ గందు హర్షమ్ము మదిని. 163.

సీ. మఱి మామతమున ధర్మ మ్మొండు గలదు య
తీంద్ర! పూరుష లెల్ల రేకజాతి
చాన లెల్లరు నేకజాతి వా రౌట స్త్రీ
ణము లెల్లఁ బురుషభోగ్యములు సుమ్మి
దురితంబు వొరయదు నరనారులకును సం
యోగంబునందు వియోగమునను
నితఁడె యీమగువకుఁ బతి యంచు నియమమ్ము
కన; మొండొరుల సంగమున లభించు
గీ. నట్టి యానందమే ముక్తి "యల గణేశుఁ
డరయ నానందమయుఁ డంచు నబ్జాదు
లతని యంశము లంచు నంశాంశులకు న
భేద మంచు వేదమె పల్కు లేదె యనఘ. 164.

వ. మఱియు 'గణేభ్యో గణపతిభ్యశ్చ వో నమ'యని శ్రుతియందు రుద్రుండ గణపతిగాఁ బేర్కొనఁబడు' న కర్మణా' యను శ్రుతియందు సహిష్ణుతాదిగుణయుతం బగు త్యాగంబె కాని, మోక్షంబునకుఁ గారణంబు కర్మంబు కా దని గలదు గాదె? మామతంబునఁ బుణ్యపాపాదులం దద్వంద్వత వెలయుఁ గావున నింతకంటె మముక్షుసేవ్యం బెద్ది గలుగు ననుటయు నాచార్యవర్యుం డిట్లను. 165.

క. కలు ద్రావఁ జనదు పరనా
రులఁ గవయఁగ రాదటంచు శ్రుతి దూఱినచేఁ
తలుగల మతము త్యజింపఁగ
వలె మోక్షార్థులు స్మశానవహ్నివిధమునన్. 166.

ఉ. అద్వైతతత్త్వవిత్తు దలితాంహుఁడు నా యతికే 'నకర్మణో'
త్యాదిసూక్తి ముక్తిరమ యబ్బుటఁ దెల్పెను గాని మద్యపా
నాదరుఁ డన్య దారరతుఁ డౌనఘవృత్తికిఁ దెల్పెనే? సురా
పాదులు ముక్తిఁ గాంతు మనియార్చుట దౌష్ట్యము దుఃఖదంబగున్.

ఉ. కానఁ ద్యజించి యీమతము, గ్రిన్నఁ బ్రసన్నధరామరోక్తిచేఁ
బూనిక నిష్కృతిన్ బడసి మోక్షపదాప్తికిఁ బంచయజ్ఞముల్
మానక, పంచదైవతసమర్చన సల్పుచుఁ, బాపదూరులై
మానసశుద్ధి జ్ఞానమహిమన్ గృతకృత్యులు కండు మీ రికన్. 168.

క. ధృతి మూలాధారాది
స్థితుల గణేశాదులను మతిన్ గను చజపాం
చితమంత్రాసక్తులరై
సతతము చరియింపఁ గాంద్రు శాశ్వతముక్తిన్. 169.

నవనీతగణపతిమతాదికనిరాసము.

వ. అనుటయు హేరంబసుతాదు లట్లయొనర్చి కృతకృత్యు లగుటయు, నవశిష్టులగు నవనీత, సువర్ణ, సంతానగణపతిమతస్థులగు వీరభద్రాదు లరుదెంచి శంకరునితో "స్వామీ! యీజగం బంతయు గణపతిస్వరూపంబుగ మోక్షార్థులమై ధ్యానింతుము. సుఖార్థులగుజనులకుఁ బూజ్యం బగు మా మతంబు మీ రెట్లు దూషించిరో వింత యయ్యె ననవుడు మీరు మూఢులరు శాస్త్రతత్త్వంబు నిదె తెలిపెద వినుం డని గురుచంద్రుఁ డిట్లనియె. 170.

సీ. మును మహత్తత్త్వమ్ము పూరుషాధిష్ఠిత
యగు ప్రకృతిని నుదయంబు నొందె
నామహత్తత్త్వమ్మునందుండి త్రిగుణాత్మ
క మ్ముప్పతిలె నహంకార మనఁగ

సద్గిరియే రుద్రవిష్ణ్వాదిరూపం బయ్యె
నారుద్రునం దుదయమ్ము గనిరి
సుతులు మువ్వురు గణపతి కుమారస్వామి
భైరవుఁ డనెడు నాహ్వాయము బొంది

గీ. వారు స్వస్వాధికార నిర్వహణ సక్తు
లగుట నాయాయిచక్రములందు వెలుఁగు
నగ్గణేశాదులే ధ్యేయు లైరి విప్ర
వితతి కింక నశక్తుల విధి వచింతు. 171.

క. ఆది త్యాంబా హరి లం
బోదర శంకరు లనఁగ మహోన్నతిఁ గను నా
యైదుగురు దేవతల ధర
ణీదేవుఁడు పూజసేయ నిత్యము వలయున్. 172.

మ. అను నాచార్యుని సూక్తిజాలవశులై యావీరభద్రాదు లా
య్యనఁ జిహ్నంబుల నూడ్చివైచి గురుపాదాబ్జంబులన్ వ్రాలి పె
ల్చనఁ దచ్ఛిష్యతఁ గాంచి పంచసురపూజాపూర్వకాద్వైతరీ
తి నితాంతామలమానసాబ్జు లయి యర్థిన్ బొంది రబ్రింబుగన్.

మ. పరపాషండ మతాళి నుక్కడఁచి యద్వైతార్థవాగ్వృష్టిఁ గ్రి
చ్చఱఁ జోళద్రవిళాదిదేశజులఁ బాదాక్రాంతులన్ సల్పి, త
త్కరిశైలేంద్రనితంబ కాంచి యగు శ్రీకాంచిన్ సురాగారమున్
బరవిద్యాచరణానుసారిగ రచింపంజేసి కర్మంది తాన్. 174.

ఆ. తాంత్రికులను బాయఁ దఱిమి కామాక్షికి
భగవతికి సపర్య నిగమసమ్మ
తమ్ముగా ఘటించి తత్పురి నొకనెల
శంకరుండు శిష్యసహిత ముండె. 175.

సీ. శంకరసంప్రతిష్ఠాపూర్వకముగ ని
ర్మించె పీఠిని శివకాంచి యనఁగ
వరదరాజస్థానవాటి యాపీఠి స్ఫు
రించె నర్మిలి విష్ణుకాంచి పేరఁ
దద్దేవతార్చనార్థ మ్మనేకులను వి
ప్రుల భక్తజనులను నెలవుకొలిపె.
వారి శుద్ధాద్వైతవర్తులఁ దత్యంత
తాత్పర్యనిష్ఠులఁ దగ నొనర్చె
గీ. నెందుఁ బార్థివమూర్తితో నిందుమౌళి
యంబరేశ్వరుఁ డన లింగమై వెలసెనో
యట్టి కాంచీపురమ్మందు యతివిభుండు
ప్రతిపదము జ్ఞానసుధ వెల్లువగ నొనర్చె. 176.

తామ్రపర్ణీతీరవిప్రులకు జ్ఞానోపదేశము.

గీ. అపుడు తామ్రపర్ణీతటమ్మందునుండి
వచ్చి రెందఱో తద్దేశవాసిజనులు
పరమగురునకు మ్రొక్కిరి భక్తిమీఱఁ
బ్రచ్ఛ సేసిరి శంకానివృత్తి కిటుల. 177.

వ. స్వామీ! యీలోకంబున దేహాదిభేదంబు ప్రత్యక్షం బగుటం జేసియు, నవ్వల నాయాకర్మంబులచేతను నాయాయుపాసనలచేతను దత్తల్లోకప్రాప్తి కలుగు నని శ్రుతం బగుటంజేసియు భేదమే వాస్తవిక మట్లు తోఁచుచుండఁగా దె యనుటయు నాచార్యుం డిట్లను; ద్విజులారా! పరమార్థతత్త్వ మెఱుంగ కిట్లంటిరి. 'ముక్తునకు సర్వమాత్మయే యగునపుడు దేనిచే దేనిని జూచు' నను నర్థము గల 'యత్ర త్వస్య సర్వ మాత్మైవాభూ త్తత్కేన కం పశ్యే' త్తను శ్రుతిచేఁ దత్త్వజ్ఞానాగ్నిదగ్ధపాపపంజరునకు ముక్తావస్థయందు భే

దాభావము ప్రతిపాదిత మగుటవలనను 'దానిని (జగత్తును) సృజించి యం దదియే ప్రవేశించును, జీవాత్మతోడి యనుప్రవేశమున నామరూపవికారములం బొందు' నను నర్థము గల 'తత్సృష్ట్వా తదే వానుప్రావిశత్, అనేన జీవే నాత్మ నానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి' యను శాస్త్రతాత్పర్యముచే జగత్కర్త యగు బ్రహ్మమునకే జీవరూపమున జగదంతఃప్రవేశము విదితం బగుటవలనను, "కతి దేవా" యని యుపక్రమించి "త్రయశ్చ త్రీచ శతా, త్రయశ్చ త్రీచ సహస్రా" మ్మని దేవతల యనేకత్వముఁ దెల్పి యంతర్భావక్రమమున "దేవుఁ డొక్కఁడే" యనియు, నతఁడే ప్రాణమనియు, బ్రహ్మ మనియు బ్రహ్మమునకే యనేకత్వము ప్రదర్శింపఁబడె. మఱియు "బహు స్యాం ప్రజాయేయ" యనుశ్రుతిచే భోక్తృభోగ్యాత్మకం బగు సకలప్రపంచకమునకును బరమాత్మరూపత్వము ప్రతిపాదింపఁబడుటంజేసి సర్వజ్ఞమును, నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావమును, సకలవివర్తాధిష్ఠానమును నగు పరబ్రహ్మము ముముక్షువుల కుపాస్యముః కావున మీ రెల్లరును. 178.

గీ. జీవపరమాత్మభేదంబు దేవతావి
భేద ముడిగి శుద్ధాద్వైతమై దనర్చు
బ్రహ్మము నెఱింగి మోక్షమ్ము వడయవలె న
టంచు యతిసింహుఁ డుపదేశ మాచరించె. 170.

మ. నిజపాదాంబుజసేవకై యడఁకువన్ వేంచేయు కాంచీపురీ
ప్రజ నద్వైతమతస్థులన్ సలుపు త్రోవన్ దామ్రపర్ణీతటీ
ద్విజులన్ సల్పియు,నాంధ్రులన్ మనిచి,భక్తిన్ వేంకటేశాంఘ్రిహా
రిజముల్ గొల్చి, విదర్భరాజపురిఁ జేరెన్ లోకు లగ్గింపఁగన్. 180.

క. ఎదురు సని భక్తియుక్తిని
విదర్భపతి పూజ సేసె, భిక్షుకశిష్యుల్

పదపడి భైరవపూజా
స్పదుల మదం బణఁచి లోకపతి ధీశక్తిన్. 181.

వ అచటనుండి కర్ణాటదేశమున కేఁగ శంకరార్యుండు దలపోయు
చుండ విదర్భరాజ ఇట్లను. 183.

శా. కర్ణాటావనిఁ బర్యటించెదఁ గడంకన్ వత్తు రీ రంచు నా
కర్ణింతుర్, వినలేదె తద్విషయ ముగ్రింపశ్యకాపాలికా
కీర్ణం, బన్యమతోపదేష్టృజనతాకీర్ణనాభం, బన
భ్యర్ణం బాస్తికకోటి కంచు, విరమింపంజూడు మాయత్నముల్.

ఆ. అన నధిజ్యధన్వుఁ డౌచు సుధన్వుఁ డి
ట్లనియె వీఁడె భక్తుఁ డండ నుండ
భయము నీ కదేల ప్రతిపక్షు లగుపాప
రాశివలన స్వామి! యనుచుఁ బలుక. 184.

ఉ. వైళమ యేఁగెఁ దీర్ఘకరవర్యుఁడు శంకరదేశికుండు కా
పాలికజాలకంబు గెలువన్ ధృతి వీడక కన్నడాన క
వ్వేళను శంకరాగమనవృత్తి మటన్ గ్రకచాభిధానకా
పాలికదేశికుండు విని పట్టఁగరాని దురాగ్రహంబునన్. 185.

క్రకచుఁ డను కాపాలికుని చరిత్రము.

చ. పితృవనభస్మలిప్తతనుభీకరుఁడై నృకరోటి శూలసం
యుతకరయుగ్మ మొప్పఁ దన కుద్దిగ వేసము దాల్చి పెక్కు రు
ద్ధతగతి వెంట నంటఁగ మహామనుఁ డౌచు నఖర్వగర్వభా
షితముల నిట్లు పల్కె యతిశేఖరుఁ జేరి యనాదరంబునన్. 189.

చ. బసుమము మైఁ నలందితివి బాగగుఁ గాసి కరోటిఁ దాల్ప క
ప్పసము గ బొంతఁ దాల్తువు కపాలియుపాసన లేద, రక్తసి

క్తసితసరోత్తమాంగముల(గల్గున(బూజ లొనర్చి కెట్లు గో
త్రిసుత కవుంగిటన్ వివశతం గను భైరవు(డొందు మోదమున్.

చ. అని యిటు భైరవాగమరహస్యములన్ వివరించువాని నీ
చుని మెడవట్టి త్రోయు(డనుచున్ గడు నల్గి సుధన్వు(డాజ్ఞ యి
చ్చినక్షణమే తదీయు లగుసేవకు లాసభనుండి పాఱనూ(
కిన భ్రుకుటీభరాస్యు(డయి కేల(బరశ్వధ మూని వా(డునున్.

గీ. వరుస మీమీశిరంబులు నఱుకనేని
నేను గ్రికచుండనే యంచు నీచు(డతండు
కెరలి పగచాటి పోయి మున్ కరకపాలి
తతి యతుల మీ(ది కనిపె వధం బొనర్ప. 189.

క. అలిగి కపాలిబలంబులు
ప్రళయాంభోధర భయంకర క్ష్వేళలతో
బిలబిల మని వచ్చి యతుల
నలమె నసంఖ్యాకముగ నుదాయుధ మగుచున్. 190.

గీ. అంత నవ్విప్రకులము భయాకుల మయి
పఱచు టరసి సుధన్వుండు పట్టరాని
యలుక సన్నద్ధుడై రథియై నిషంగి
యై కపాలివజ్రము ముంచె నంపవెల్లి. 191.

క. ఆకీతి నృపతి కుమతులు
మాఱుకొనం గ్రికచునాజ్ఞ మఱియొక కెలనన్
గూర్రకపాలు లుదాయుధు
లై రవరవ నఱుక(గవిసి రవనీసురులన్. 192.

చ. యమభటులట్లు పైఁబడెడునట్టికపాలిసహస్రములే సమీ
పమునన కాంచి గొల్లుమని పాఱులు శంకరుఁ జేరి 'దేవ! కా
వు' మనుచుఁ గూయిడన్ యతియు బూదిగఁ జేసెను హుంక్రియోత్థని
స్వమదహనార్చులన్ నిశితశస్త్రసహాయుల నాతతాయులన్. 193.

క. భూనేత కనకపుంఖశ
రానీకనికృత్తశాత్రవాస్యకమలసం
తానపరిష్కృతరణమహి
యై నిరుపమభక్తి మెఱయ యతిపతి కెఱఁగెన్, 194.

మ. క్రకచుం డంత స్వకీయు లంతమగుటన్, బ్రాహ్మణ్య మక్లేశ ము
త్సుక మాటం గని దూయమానచలచిత్తుండై యతీశానునం
తికమున్ జేరి 'దురాత్మ! నామహిమమున్ వీక్షింపుమా యింత కిం
త కనంజాలెద వంచుఁ గేలఁ బుఱియన్ గైకొంచుఁ గన్మోడ్చి లోన్.

గీ. భైరవాగమమార్గమ్ముఁ బట్టి ధ్యాన
మాచరింపఁ గరోటి మద్యంబు పొడమె
నఁదు సగ మాని, పుఱియఁ దక్కర్ధ మూని
భైరవు స్మరించు నంత నభ్రమ్ము దోఁప. 196.

క. మ్రోలను మహాకపాలి త్రి
శూలి నరకపాలమాలి శోచిష్కేశ
జ్వాలాజాలనిభజటా
పాళి పొడమె నట్టహాసభాశ్శాలియునై. 197.

చ. అటు పొడసూపు భైరవుని యంఘ్రుల వ్రాలి 'భవన్మతాశ్రిత
చ్ఛటఁ బొరిగొన్న యీఖలు వెసన్ గనుమంట దహింపు'మన్న ను
త్కట రుష 'మత్స్వరూపు యతితల్లజుఁ జంపు మటందె' యంచు న
క్కటుమతిమౌళి శూలమునఁ గ్రక్కునఁ ద్రుంచి నటించె నెంతయున్.

గీ. అంతఁ గ్రోధభయంకరుండై నటించు
నట్టి సంహారభైరవు నంఘ్రియుగళి
వ్రాలి శంకరదేశికేశ్వరుఁడు సన్ను
తించి యిట్లను భయము భక్తియును మెఱయ. 199.

సీ. స్వామి! వేదపురాణశాస్త్రసంప్రతిపాది
తమగుకర్మమ్ము కర్తవ్య మనుచుఁ
దత్కర్మమున నబ్బు ధర్మమ్ము, దాన మ
హాఘకోటులు నాశ మందు ననుచు
నాశుచివ్రతమున నంతరంగము పాప
దూరమై శుద్ధమై తోఁచు ననుచుఁ
జిత్తవైమల్యమ్ము చేకుఱ నాత్మసా
క్షాత్కార మప్పుడ గలుగు ననుచు
గీ. నపునరావృత్తిమోక్ష మయ్యెడి యనుచు
నఖిలభూసురపరిషదభ్యంతరాళ
మందు నద్వైతమతసార మర్థి నుడువు
చుంటి జగతికి భవపీడ యోసరిలఁగ. 200.

ఉ. ఆమెడ నీదు భక్తుఁడు రయంబున పీఁ డరుదెంచి రూక్ష మా
చాయ 'నిదెల్ల ద' ప్పను చసంగతమాషణయుక్తికోటులన్
గూయ, మదీయశిష్యతతి గొట్టి మొఱల్ జెయివెట్టె నట్ట, వై
ధేయత మంత్రశక్తి నినుఁ దెచ్చెను, జచ్చెను శూలకృత్తుఁడై .201.

క. దేవా!' సత్యాసత్యము
లీవ యిఁకన్ దెలిపి ప్రోవుమీ మ మ్మన నా
దేవుఁ డనిమె ద్విజశిక్షణ
కై వెలసిన శంకరుండ నౌ దీ వార్యా! 202.

ఉ. వేదపదార్థగమ్యుఁడవు విశ్వసమర్చ్యుఁడ వీ వొనర్చు నే
కేదియు నే నొనర్చినటులే యగు-బ్రాహ్మణధర్మ మూఁది యీ
యీదురితాత్ము లెల్లఁ దరియింప నొనర్చు, కలిప్రభావ మి
ట్లాదుకొనంగ సిష్ట మగునట్లు చరింతురు వీరు క్రూరులై. 203.

గీ. మంత్రబద్ధుండ నౌటు దుర్మతికి వీని
కకట! ప్రత్యక్షమైనాఁడ నంతె కాని
ధర్మమునఁ గా దటంచు నందఱును గాంచు
చుండ భైరవుఁ డాత్మస్థితుండగుటయు. 604.

క. ఆపట్టున వటుకాదులు
కాపాలికదుర్మతానుగతులు తదీయా
లాపముల కలికి శంకరు
శ్రీపదముల కాచరించిరి నతుల్ పదిరెండుగా. 205.

ఉ. వా రరు దొంది 'మే మకట! స్వామి! వినూధుల మేలుమా కృపా
సారముఁ జిల్క మ' మ్మనుచుఁ జల్లని మాటల నాదరించు చ
క్కారుణికాగ్రగామి కడగంటన శిష్యులఁ గాంచి ప్రాతులగా
వారి నొనర్చ నాజ్ఞయిడ వైశమ పద్మపదాదు లొక్కటై. 206.

గీ వారలను బ్రాత.రవగాహపరులు గాఁగ
సతతసంధ్యావిధా ద్యనుష్ఠాన పూర్వ
పంచయజ్ఞ. పంచాయతన నాంచన నియ
తులుగ బ్రాహ్మణాద్యగులుగ సలిపి రపుడ. 207.

వ. సమాహితచిత్తులై వటుకాదు లగునా కాపాలికు లద్వైతమతనివి
ష్టులై శంకరచరణంబులు శరణంబుగ నమ్మి శిష్యులై సేవించు
నెడ నొక్క కాపాలికధూర్తుం డరుదెంచి యి ట్లను. 203.

ఉన్మత్తభైరవునితో వాదము.

సీ. కాపాలికమతానఁ గలుగుచో న్యానత
పరమతంబుల నింత ఫలము గలదె?
బ్రహ్మజాతియ గొప్ప దనుదురూహా ని
వ్వటుకాదులు స్వమతభ్రష్టు లైరి
జాతిచే నే ప్రయోజనమును గనఁబోము.
సకలదేహములు భౌతికము లగుట
'నిద్ది యీజాతి' యం చెవఁడు సెప్పఁగలఁడు
కాన నేతజ్జాతి కల్పితంబ
గీ యిందులఁ బ్రమాణ మగపడ దింక నద్ది
వినుము ద్వివిధంబు, స్త్రీజాతి యనఁగఁ బురుష
జాతి యన-నందు నాద్య శ్రేష్ఠము తదీయ
సంగమ మ్మత్యయానందజనక మగుట. 209.

ఆ. గమ్య యీపె, యిది యగమ్య-యీఁ డిచ్చెడి
వాఁడు పరుని యాలిఁ గూడ రా ద
టన్ననుడిని నమ్మ మఖిలకాంతలు స్వీయ
లగుట; 'దోస మంటు' ననుట తగదు. 210.

క. ఆనందార్థము చర్మము
చే నొకచర్మమ్ము నొరయ జీవున కఘ మౌ
ట్లా 'నానందజతృప్తియె
యా నలజీవునకు మోక్ష' మనరే పెద్దల్. 211.

క. కానఁ దత్సంగ స్ఫుట
మానందమె భైరవుఁడు; నిజాంగలయమునన్
దా నా దేవుని గలియుటె
యా నిక్కపుముక్తి తెలియుమా మన్మతమున్. 212.

సీ. అనుచుఁ దెల్పుఁగ శంకరాచార్యుఁ డనియెఁ గా
పాలిక! సత్యంబు పలికి తీవు
నీతల్లి యెవ్వాని కూఁతు రం చన వాఁడు
దీక్షితసుత యంచుఁ దెల్ప యతియు
దీక్షితత్వమ్ము సిద్ధించె నాతని కెట్టు
లనుచుఁ గాపాలికుం డనియె నిట్లు
తాలహింతాలాదితరువుల కలు గీయుఁ
దద్రుచి యెఱిఁగియుఁ ద్రావఁ డొకపు
గీ. డమ్ము నితరుల కింత న్యాయమ్ముఁ దప్పు
డది గని జనంబు దీక్షితుం డనుచుఁ బిలుచు
నట్టిదీక్షితుపట్టి మాయమ్మ, యింక
నాయమచరిత్రము వచింతు నాలకింపు. 213.

క. నిచ్చలు తనుఁ జేరినవరు
లచ్చపుసుఖవార్ధి నోలలాడఁగ దేహం
బిచ్చి వ్రతము నెఱపుకొనిన
సచ్చరిత మదంబ; జనకచరితము వినుతున్. 214.

ఆ. ఎవనిమద్యగంధ మిసుమంత సోఁక స
న్నిధిని నిలువలేక నిర్జరులును
బఱవఁ జొత్తు రట్టిప్రఖ్యాతి గన్నసు
రాకరాహ్వయుండు నాకుఁ దండ్రి. 215.

క. ఉన్మత్తభైరవాఖ్యుఁడ
సన్మాన్యుఁడ నిట్టియాభిజాత్యము గలవ
న్నున్మీ రర్చించిన జీ
వన్ముక్తుల రగుదు రనిన వారనికినుకన్. 216.

ఉ. పేరిలక యాల కేఁగి పృథివిన్ విహరింపు యథేష్టరీతిఁ గా
పాలిక! దుర్మతస్థితుల బ్రాహ్మణజాతుల శిక్షసేసి స
చ్ఛీలురఁ జేయుపూనికి నరుదెంతును గా, కొరులన్ స్మరింప నా
కేల? యటం 'చవాచ్యుఁ డగునీఖలు డవ్వగ రువ్వఁడా యనన్.

ఉ మూఁకలు గట్టి శిష్యు లధముం డగుభైరవు మాళిఁ బట్టి పి
ర్వేఁకులఁ బెట్టి యొజ్జనుడివెంటన దవ్వుల నెట్టి రంతఁ జా
ర్వాకు డొకండు వచ్చి యతిరాజుఁ గనుంగొని సైఁప నోప క
ర్కాకల బెట్టుచిత్తమునయందు విచార మొనర్చె నీక్రియన్.

చార్వాకమతనిరాసము

సీ. తనరు దేహాద్వ్యతీతముగ నాత్మ మటంచు
వదరుమూర్ఖులతోడ వసుధ నిండె
మాకు సైతము నట్టిమతి గల్గు నేమొ త
త్సాంగత్యమున నను తాఁస మొదవె
వారి కందఱ కగ్రిచారి యీసన్న్యాసి
యటు యించుకంత మాటాడవలయు
నిలుతు నింత వివేకకలితుఁ డంచును దోఁచె
నేని, గాకున్నఁ దొడ్తొన చనెద.

గీ. నని విచారించి సభసొచ్చి యతిని జేరి
తత్త్వ మెఱుఁగుదువే ననంతరము మోక్ష
లక్షణము తెల్పుదువు గాని లలితఫణితి
వినుచు నన్మద్వివేకమ్ము వినుము తొలుత. 219.

క. జలనిధిజలముల విలయ
మ్మొలయునదుల కాగమనమె యున్నెడ మృతుఁ డీ
యిల మరలఁ బొడముఁ గావున
విలయమె జీవునకు ముక్తి వివరింపంగన్ 220.

ఆ. తృప్తుఁ డగు మృతుండు దీనిచే నంచు శ్రా
ద్ధాదికర్మకాండ మాచరించు
మోహకుల వివేకమునకు న వ్వాదవును
వారిచిత్రమతము గోరు నెవఁడు? 221.

గీ. కాయమే యాదిరూపమ్ముగా జనించి
యట్టికాయమ్మె తా నయి యలరుజీవు
నకు లయమె ముక్తి కాఁది కన్యంబు మూఢు
లట్టి జీవుండు మఱిమఱిఁ బుట్టు నండ్రు 222.

సీ. "పరలోకములు స్వర్గనరకముల్ గాఁ నవి
పుణ్యపాపప్రాప్యములు క్రమముగ
నాపుణ్యపాపమ్ము లయి పోవ జీవుండు
మరల మర్త్యమున జన్మంబు నెత్తు
ననువారి మత మెంతయును నప్రమాణ మ
య్యుభయానుభవ మిట నొదవదొకో
యెవ్వాఁడు సుఖభోక్త యవ్వాఁడె స్వర్గి యె
వ్వఁడు దుఃఖభోక్త యవ్వాఁడెనిరయి
గీ. యిటుల ప్రత్యక్షమనుభవం బేర్పడంగ
నెటొ పరోక్షమ్ము కల్పింప నేమిపాడి?
యింద్రియములు దేహము నశియింప నింక
నెవఁడు పరలోకమున కేఁగు! నెట్టు లేఁగు? 223.

గీ. అరయ జీవుండు దేహేంద్రియాదు లగుట
దేహము నశింప జీవుండు దీఱిపోవుఁ
గన నగును భేద మన మహాకాశమందు
నంతరించుఘటాకాశ మట్లు డిఁదు. 224,

ఆ. కాన మా మతము జగన్నుత్య మంచుఁ జా
ర్వాకుఁ డనఁగ నిట్లు పలికె యతియు
వేదబాహ్యమతము నీది నత్యం బెట్టు
లస్మదీయమతము నాలకింపు. 225.

సీ. ఆయాత్మ దేహేంద్రియాదులకు విభిన్న
మదె ముక్తమై పరమాత్మ మగును
అజ్ఞానమునఁ బరమాత్ముఁడే బద్ధుఁడౌ
జ్ఞానమ్మున విముక్తుఁడౌను జువ్వె
'దేహపాతమున ముక్తి లభించు' ననుత్వదా
లాపమ్ము భ్రాంతిమూలము నిజముగ
జ్ఞానాగ్ని నిర్దగ్ధ కర్ములై కందురు బ్ర
హ్మము నంచు జ్ఞానమాత్రిమ విముక్తి

గీ. హేతువుగఁ దెల్పు శ్రుతియ; య దెటు ప్రమాణ?
మనిన నీకుత్సితోక్తి యానా ప్రమాణ?
మగ్ని దహియింప స్థూలదేహంబు, లింగ
దేహ మూఁది జీవాత్మ యెందేని యేఁగు. 226.

వ. ఇందులకు 'స్వర్గకాముఁడు జ్యోతిష్టోమము చేయఁ దగు, నిత్యా
దివేదవాక్యములె ప్రమాణము. 227.

క. శ్రుతి జీవుఁ దృణజలూకా
ప్రతిమునిగ వచించెఁ దనువు పడ; నన్యతనూ
గతుఁడై పరలోక మొనయు
నతనికిఁ డత్సుతులు చేయునగు శ్రాద్ధాదుల్. 228.

చ. అనియును బ్రేతతారహితుఁడై యతఁ డుత్తమలోక మొందఁ జే
యున తగుఁ బిండదానము గయాదుల నంచుఁ బురాణ ధర్మశా

స్రవివహముం గడించుటను సప్తదశాంగము లింగదేహమున్
దన' దని పొంది జీవుఁడు పతంగమురీతిఁ బరత్రి దాఁ జనున్. 229.

క. కావున మాఱాడక చను
మీ వోచార్యాక! జడమతీ! యని పలుకం
గా వాఁడు వేమభావలఁ
బో విడచి యతీంద్రుపాదములకున్ మ్రొక్కెన్. 230.

వ. అట్లు మ్రొక్కి యథావిధి నాజగద్గురులకు శిష్యుండై నాఁటం గో లెఁ దత్పుస్తకభార భరణరూప శుశ్రూషాపరుం డయ్యె నట్టి యెడఁ బీనకాయుం డగుసౌగతుం డొక్కఁడే తెంచి శంకరునకు మ్రొక్కి యిట్లను.

సౌగతుని తోడ వాదము.

ఉ. ఆదృతకర్మమార్గు లయి రజ్ఞత నీజను లిట్లు; స్నానదా
నాదుల భౌతికంబునకు నబ్బునె శుద్ధి? సదా విశుద్ధి పెం
పూఁదెడుజీవుఁ డంగ మటు లూర్చి విముక్తిని బొందుచుండఁగాఁ
'నేదో ఋణానఁ జిక్కి జనియించు మఱిన్ భువి'నంద్రు దుర్మతుల్.

గీ. ఋణము మే నెత్తునప్పు డదృష్ట, మటులె
యంతమున లేదు, జ్ఞాన ద్రవ్యము గడింప
ఋణభయము వాయుచలె వినవే ఋణం బొ
నర్చి నెయి త్రావవలయు' న న్వాక్యరీతి. 233.

చ. అడ పరమప్రమాణము, నిరంతర మెల్లెడ నప్పుసేసి పెం
చఁదగు గళేబరంబు మతిశాలి, సుఖం బఖిలాన్నభోక్తకే
యొదవును, ముక్తి నాఁగ నటు లొందుసుఖంబె సుమా! విముక్తికే
కద మఱి నీప్రయత్న మనఁగా విని యయ్యతి పల్కె సౌగతున్.

ఉ నీదు వృథాప్రలాప మిఁకనేనియు మాను శ్రుతిస్మృతీతిహా
సాదులు కర్మభోగమునకై పరలోకగతిన్ వచించుటన్
బోదు ఋణాదికర్త కిలఁ బుట్టుట చచ్చుట, కానఁ బాపసం
పాదక మాకుబుద్ధి నెడఁబాసి చరింపుము సత్పథంబునన్. 234.

గీ. అనుడు సౌగతుఁ డిటు లను వినుము సుగతుఁ
డనుముని సమస్తభువిఁ గాంచి, కని జగన్ని
సర్గసత్యమ్ముఁ, బ్రాణ్యుపాసనరతుఁ డయి
కరుణ నుపదేశ మిచ్చె నిక్కరణి నాకు. 235.

ఉ. గణ్యము ప్రాణ్యహింస యనఁగా దగు ధర్మ మొకండె, నీవు త
త్ప్రాణ్యవిహింసనంబునఁ గపాలనివర్తన మూని మోక్షసా
ద్గుణ్యము గాంచు మంచు దయతో ననుతద్గురువాక్కు లెంచి యా
నృణ్యము గల్గఁ దద్వచనమే కొని ప్రాణ్యవిహింసఁ బూనితిన్. 236.

ఆ. ఆత్మగురునిపదము లాదలఁ దద్వాక్కు
లూని సకలచేతనానుకంప
వ్రతముగాఁ జరింతు క్షితి నున్నె యిట్టి ధ
ర్మమ్ము సర్వసమ్మతమ్ము నమ్ము. 237.

వ. మామతము ధర్మస్థానము కావుటం జేసి యెల్లరు మేకొనఁ దగిన
దనుటయు నాచార్యుం డిట్లను. 238.

సీ. ఏమంటి వోరి నిహీన! సౌగత! యహిం
సాన్యధర్మంబె లే దనఁ దెగింతు
యాగీయహింసన మది ధర్మ మనుచు వే
దములు పేర్కొనవె వ్యక్తమ్ముగాఁగ
నెటి స్వర్గ మిచ్చు నగ్నిష్టోమ ముఖ్యాను
ఖమ్ములు ఘనహింస కారణముగఁ

బ్రాప్య మాహింస శ్రుత్యాచారరతులకుఁ
బాషండు లగుదు రప్పథము దొఱఁగ
గీ. బ్రహ్మవీర్యజులేని నారకమునందుఁ
బడెడువార సదాచారవర్జనమున
వేదనింద నటంచు మన్వాదు లనుట
నట్టి రాకల్పనిరయులై యార్తిఁ గంద్రు. 239.

వ. కావున బ్రాహ్మణాదివర్ణజులకు వేదనిరూపితాచారంబు పరమప్రమాణంబు, దాని నంగీకరింపనివాఁ డధముఁ డనుటయు నా సౌగతుండు ప్రమాణశూన్యం బగుటఁ బ్రతి వచింపనేరక శంకరునకు మ్రొక్కి, తదుచ్ఛిష్టాదనపుష్టిమై, పద్మపాదాదులకుఁ బాదుకావాహకుండై సేవించుచుండ నొక్కనాఁడు. 240.

క్షపణకమతనిరాసము.

క. ఒకకేలఁ దురీయంత్రము
నొకకేలం గోళయంత్ర మూని కటిని గొం
డొక కౌపీనము దాలిచి
యొక క్షపణకుఁ డేఁగుదెంచి యొజ్జకు ననియెన్. 241.

క. స్వామీ! వినుమీ యరుదగు
నామత మత్యంతశోభనము 'సమయుం' డ
న్నామమ్ము వాఁడఁ బూర్ణుఁడ
నేమతమును మామకైంద్రియికమత సమమే. 242.

శా. హేళిన్ గాలనియంత యంత్రయుగళిన్ హేలాగతిన్ గట్టి త
త్త్రాజ్ఞానముచే వచించెదఁ ద్రిలోకంబందు రానుండని
క్ష్వేలం బైనశుభాశుభార్థముల భావింతున్ సదా వేల్పుగాఁ
గాలంబున్; బరమేశ్వరుఁడున్ గదలుపంగా లేఁడు నాపక్షమున్.

చ. అన విని శంకరార్యుఁడు సమంచితరీతి వచించి, తెంచితిన్
'నిను సమయజ్ఞుఁ' డం చెపుడునేనిఁ బరీక్ష ఘటిల్లకుండ, దం
డనుక మదాశ్రయంబున మనంగదె, పరీక్ష మొనర్తు నాఁడె' యం
చనవుడు వాఁడు నియ్యకొనె-నమ్మఱునాఁ డతిభీకరాకృతిన్. 244.

జైనమతనిరాసము.

శా. కౌపీనంబును మాత్రఁ దాల్చి మలదిగ్ధంబైన మే నొప్ప, నం
శాపేతుండు నపుండ్రుఁ డయ్యు ధృతదివ్యద్బిందుపుండ్రుండునై
యాపట్లన్ జనుదెంచె జైనుఁ డొకరుం "డర్హన్నమో" యంచు శి
ష్యోపేతంబుగ రేఁగి బొబ్బ లిడుకొం చొయ్యన్ బిశాచం బనన్.

క. చనుదెంచి శంకరుం గని
యనె:- జినుఁ డనుదేవుఁ డెల్ల ప్రాణుల హృదయ
మ్మున జీవుఁ డన వెలుఁగు, ము
క్తి నొసంగును ముక్తుఁ డగు నతిజ్ఞానమునన్. 216.

ఉ. ఆతఁడు శుద్ధుఁ డౌఁ దనులయం బొదవన్, మలపిండరూపమా
నీతను వెట్లు శుద్ధ మగు నెందు మునింగిన నెట్టిగందపుం
బూఁతలఁ బెట్టినన్ వలిపముల్ పయిఁ జుట్టినఁ? గాన స్నానముల్
పూఁతలు రోఁత లంచును బ్రబోధ మొనర్పఁగ శంకరుం డనున్. 247.

సీ. దేహ మొక్కటి యెట్లు త్రితయ ముండఁగ స్థూల
సూక్ష్మకారణము లంచును బ్రసిద్ధిఁ
గ్రమముగా, నవి నాశనము నొంద సచ్చిదా
నందరూపము జీవుఁ డొంది వెలుఁగు
నీశభిన్నుఁడ నను నెఱుక యవిద్య-జీ
వుఁడు తదవిద్య బద్ధుఁ డయిపోవు

నే నభిన్నుఁడ నీశునికి ననుమతి విద్య,
యద్దాన భవముక్తుఁ డగును దేహి
గీ. యిటు సుదుర్లభ మగు మోక్ష మెటుల దేహ
పాతమాత్రమునన యుట్టిపడు ననియెను
శంకరుపదంబులకు మ్రొక్కి ధాతురిఁ డయ్యె
వాఁడు సహశిష్యుఁడై వేషభాష లుడిగి. 248.

బౌద్ధునితోడి వాదము.

ఆ. అంత శబలనాముఁ డగు బౌద్ధుఁ డేఁతెంచి
యతివరేణ్యుఁ గాంచి యనియె నిటుల
త్వత్ప్రబోధ మెల్ల వ్యర్థంబు నరశ్రృంగ
మునకు సమ మభేదమును దలంప. 249.

గీ. ఈవు సర్వోత్తముఁడ విట్టు లేల యుయుక్తి
దృష్టఫల ముజ్జగించి యదృష్టఫలము
కోర దది దూర మేమి; చేకూర్చు నీకు
శూన్యముఁగదా పరోక్ష మిచ్చునె ఫలంబు? 250.

శా. నిర్జీవం బగుటన్ భవస్మృతము కంటే వ్యర్థ, మస్మన్మతం
బూర్జస్వంతము, దాన నాత్మ మొకఁడయ్యున్ బెక్కులై చేతనా
త్మ్యార్జంబై హృదయాదిఁ బ్రేరణము సేయున్ నిత్యముక్తంబునై
యార్జించున్ సుఖ మక్షయంబుగ నతం బద్వైతశూన్యం బగున్.

క. నేనే కర్తను భోక్తఁ బ
రానందాకృతి నటంచు స్వాభీష్టములన్
ధ్యానము గల యనాత్మ ల్లీ
మేనులఁ గ్రిడించి, కాంచు మే నట ముక్తిన్. 252.

వ. అనుటయు శంకరుం డి ట్లను. 253.

క. విను మిందు్రిలు పదునలువురు
చనుదాఁక వసించు బ్రహ్మజగమున సత్యం
బును శౌచమును గలిగి సురా
ర్చన యతిథిసపర్య సలుపుసజ్జనుఁ డర్థిన్. 254.

క. అమరు లలర నగ్నిష్టో
మము సేయఁగ నింద్రలోకమునందిరుఁ డగు, యా
గము పౌండరీక మొనరుప
నమరుం దత్సత్యలోకమందుం గాఁపై. 255.

వ. కాన నాయా దేవతల నుపాసించువా రాయా దేవతలఁ జేర నరుగు
దురు. మఱియు భగవద్గీతయందు "యోయో యాంయాం తనుం
భక్త్యా శ్రద్ధయార్చితు మిచ్ఛతి । తస్య తస్యాచలాం శ్రద్ధాం తా
మేవ విదధామ్యహ" మ్మనుభగవంతుని వాక్యమువలనఁ బరలోక
గమనాదికము సిద్ధ మగుచుండెఁ గాన దేహపాతమాత్రంబున ము
క్తి లభింప దని యెఱుంగుము మఱియు. 256.

శా. 'యావద్భూతములందుఁ దన్నుఁ దనయం దాభూతకోట్లం గనం
గా విన్నాణి యెవండొ వాఁ డొకఁడె తాఁ గాంచుం బరబ్రహ్మ మిం
కేవాఁడున్ గనఁజాలఁ' డంచు శ్రుతియుం దేర్పాటుగా నుండె 'జ్ఞా
నావిర్భూతినిదక్క ముక్తి గనరా' దం చాపథ మ్మా్రన నౌ. 257.

ఉ. కాన నన్నర దాయి మతికల్పిత మాటను జీవభావమున్
లేనటు పుచ్చి, శాశ్వతికనిర్వృతి గాంచుటె ముక్తి సుమ్మి యిం
కేని త్యజించి మాధ్యము, సుఖంపు- మనన్ విని వాఁడు శంకరాం
ఘ్రినతుఁడై తదద్భుతయశోఽభినుతివ్రత మూనె వందియై. 258.

మల్లపురమున మల్లారిభక్తుల నద్వైతులఁ జేయుట.

క. తదనంతర మా దేశము
వదలి జగద్గురుఁడు శిష్యపరివృతుఁడై నె
మ్మది మల్లపురికిఁ జని యి
ర్వదియొకదినములు వసించె స్వాస్థ్యము మెఱయన్. 259,

చ. మఱి యచటన్ వసించుద్విజమండలిఁ గన్గొని 'పాత్రరాదిగా
నిరతము నెల్లవేళఁ గరణీయము మీ, కెది సెప్పుఁ డన్నఁ జె
ప్పి రిటుల వారు 'మల్లుఁ డనుపేరి సురారి హరించి దేవుఁ డీ
పురి నెలకొన్నవాఁ డతనిమూర్తి భజించుచుఁ గృత్య మెప్పుడున్.

క. మల్లారి యనెడు న వ్వే
ల్పెల్లరకు నుపాస్యుఁ డతని యొకరింత మనీ
వల్లభుని వేషభాషా
దు ల్లీల ధరింతు మూనుదుము మెడ గవ్వల్. 261.

శా. మల్లారిన్ బ్రభు సుప్రసన్ను నొనరింపంగంటి మో స్వామి! యు
ద్యల్లీలార్పితనాట్యవాద్యములచేతన్ దత్కటాక్షాప్తసం
పల్లాభమ్మున వర్ధమానసుఖసంపన్మగ్నులై మేము యా
వల్లోకంబుఁ దలంతు మేతదుదరాభ్యంతస్థ్సితం బం చెదన్ 262.

సీ. మాకు సుఖేచ్ఛ యేమాత్రమ్ము లేదు న
ర్తింతు మామ్నాయవిధిప్రకార
మరయ "నమః శ్వభ్య" యని "శ్వపతిభ్యశ్చ
వో నమ" యనియు వేదానువాక
మాయీశ్వరునకు వాహన మగు శ్వానమ్ము
నకును సాత్మ్య మున్నతి వచించెఁ
దద్వేషభాషాదిధారణంబున నశ్య
ములయెడఁ గోర్కె యే పొడమకుండుఁ

గాపున స్వశిష్యకోటితో నీవు వేద
చోదితాచార మిది పూను మీదినమ్మొ
యివె వరాటకములు ధరియింపు మెకను
మోక్షలక్ష్మీస్వయంగ్రహమ్మున సుఖింతు. 263.

వ. అనుటయు నవ్వి యవ్విజ్ఞశేఖరుం డిట్లను. 264.

మ. తనమాయన్ సకలాబ్జజాండముల నుత్పాదించుచున్ బ్రహ్మవి
ష్ణునిటాలాక్షనిదాన మౌచుఁ బరమేశుండై సదేశ్యాదివే
దనిగాదాస్పద మద్వితీయము ననంతం బేక మవ్యక్తమై
చనువాఁడప్పరమాత్ముఁ డొక్కరుఁడ మోక్షప్రాప్తిమూలంబగున్.

గీ. అంశభవు లగు వీరభద్రాదుల లయ
మూఁడ రుద్రుని లయ మెంచనోపనట్లు
తత్ప్రబోధమ్ముచే రుద్రతత్త్వ మెఱుక
వడ, దటులె రుద్రుఁడును బరబ్రహ్మమునెడ. 266.

క. కన 'శ్వభ్య శ్వపతిభ్యో'
యను నిగమము పదియునొక్కరని రుద్రులఁ దె
ల్పెను, గలదె బహుత యేక
మ్మున? కింకఁ దదంశబోధమున ముక్తి యెటుల్? 267.

ఉ. దేని స్పృశించుదోషము గతింపఁగ విప్రుల కెల్ల మృత్తికా
స్నానము పాచితంబొ యల శ్వానము వేషము భాష లంకముల్
పూని కులక్రమాగతిని పో యఘ మెంచక నిత్యకర్మముల్
మాని త్రిసంధ్యనాట్యమును మానరు విప్రత మీకు నున్న దే.

క. కలుషాత్మల మిముబోంట్లం
దిలకించిన పాప ముడుగ దినకరుఁ జూడన్

వలె, మౌన మూనవలె నని
తెలుపవె శాస్త్రము లటంచు దేశికుఁ డనుడున్. 269.

ఉ. వారు నికృత్తమూలతరుభాతి, నృపాంఘ్రిల సాపరాధులౌ
వారువలెన్ జగద్గురునిపాదములన్ బడి లేవ కున్న న
క్కారుణికుండు వారిఁ గడగంటఁ గనుంగొని లేవఁ బల్కె, యా
సారసపాదుఁ డాది యగు ఛాత్రుల కానతి యీయఁ దద్బుధుల్.

ఉ. చెచ్చెర శీర్షముండనము; చెంతనదిన్ బదివేలు స్నానముల్
గ్రిచ్ఛుఱ మృత్తికన్, వపనకర్మము, మృత్తిక నూటిస్నానముల్
పొచ్చెము లేక చేసికొనఁ బుచ్చి పవిత్రులఁ జేయ, నప్డు వా
రచ్చుగ విప్రతాధ్వగతులై యతికిన్ నతులైరి శిష్యతన్. 271.

గీ. స్నానశౌచాదిపరతఁ బంచాయతనన
మస్యఘ్రితిశాస్త్రసంతతామ్నాయ మూని
శంకరదయాప్తి మోక్షభాజనము లైరి
యరిగె యతిపతియును బశ్చిమాధ్వ మూఁది. 272.

విష్వక్సేనమతనిరాసము.

క. ఆపశ్చిమదిశను మరుం
ధాపురి శంకరుఁడు సేరె నానానుత్యా
లాపులు శిష్యులు భక్త్యా
వ్యాపారానుగుణచలితపాణు లగుచు రాన్. 273.

వ. అందువిష్వక్సేన దేవు గోపురమ్మునకుం బూర్వదిశ విపుల మగుపరిపా
శాలం గాంచి యందు దర్భాసనాసీనుండై మనోన్మనీనామాంగు
ష్ఠమాత్రిలక్ష్యంబై, పరిభువును నై వెలుంగుసంపూర్ణమండలాకా
రుని బరమాత్ముని లోచూపునఁ జూచుచు, సుధాబిందుధారా స్వా

ద తృప్తాంతరంగుఁడై కుండలినీశక్తిని మూలాధార మొందించి
తదధిపతి గణపతిని నుతించుచు సుఖంబునఁ బెద్దతడ వుండె నంత.

క. ఆనెలవునఁ గలవిష్వ
క్సేనపరాయణులు తోత్రకీలితపాణుల్
మానితశంఖరథాంగాం
కానమ్రభుజుల్ వినమ్రులై యని రిట్టుల్. 275.

శా. వైకుంఠమ్మున సైన్యనాథుఁ డగువిష్వక్సేనుఁ డారాధ్యుఁ డా
మాకుం, గావున మామతంబు జగతీమాన్యంబు పుణ్యప్రదం
బే కా కంతకభీతి దూల్చుఁ; దను వ్రేల్పం గూలఁ దద్దాసులే
వైకుంఠమ్మున మమ్ముఁ జేర్తు రనుచున్ వాక్రుచ్చె భిక్షుం డిటుల్.

క. కా దటు, విష్వక్సేనుఁడె
తా దాసుఁడు విష్ణువునకుఁ దద్వ్యాసమునన్
దాదృశభక్తు లనేకులు
గాఁ దోఁతు రజస్రవిష్ణుకైంకర్యరతుల్. 277.

సీ. తద్భక్తజనములు తద్భక్తులకుఁ బూజ్యు,
లనునదాజ్ఞామాత్రమున నుపాస్యు
లగుదురే? తమయంతఁ దటు లొనర్పఁ బ్రమాణ
మగపడ, దాహరి సగుణుఁ డౌట
సేవ్యుండు తల్లోకజిగమిషువులకుఁ బా
రంపర్యమున మోక్షరమ నొసఁగుఁ
బ్రత్యగభిన్నభావనను నారాయణు
నొక్కని సేవింప నొదవు ముక్తి
గీ. కాన మీకు ముముక్షయే కలదయేని
దేశికులాము శాస్త్రోపదేశ మొనసి

యద్వయాఖండపరమాత్మ మాత్మమున వి
చింతన మొనర్చి మోక్షలక్ష్మిని గొనుండు. 278.

ఆ. అనుడు దృక్తచిహ్నులై వారు ప్రణమిల్లి
దేశికాజ్ఞ స్మృతులు దెలుపునట్టి
విద్య నొంది సాధువృత్తులై కర్మాధ్వ
నిరతులైరి జ్ఞానభరితులైరి. 279.

మన్మథమతనిరాసము.

క. అతటి మన్మథభక్త
వ్రాతమ్ము తెంచి యోగిరాట్పదములకున్
బ్రీతి నెఱఁగి స్వమతసమయ
రీతుల నీరీతిఁ బల్కిరి సగర్వముగా. 280.

సీ. సర్గాదికర్త విశ్వమనస్థుఁ డఖిలార్థ
మార్గణోపాస్యుఁడు మన్మథుండె
పరమాత్మ సుమి! యక్కుఱుపయి జెలంగెడు వటుని
వగు భూషణద్వయిన్ జగము వశము
సేసికోఁ జాలుకాంతా సంఘముల బహు
సౌఖ్యదదర్శనస్పర్శనములఁ
గామాత్మపూర్ణసుఖమ్ము లభించుటే
ముక్తి సుమ్మస్మన్మతోక్తరీతిఁ
గీ. గాన మీరు స్మరోత్సవకాలమునఁ ద
దీయచిహ్నమ్ములం దాల్చి తెంపులేని
సౌఖ్యమనుమున్గి జన్మనాశనజరాదు
లెపుడు నెఱుఁగనిముక్తు లయ్యెదరు గాక. 281.

చ. అనుటయు సప్రమాణ మిటు లాడఁగా బాడియె? యంచు శంకరుం
డను:- వినుఁ డయ్య 'విశ్వసృజనావననాశనహేతు లంబుజా
సన వనజాక్ష శర్వు' లన స్పష్టము; విష్ణుసుతుం డతండు పా
లనకృతి నోప; డాత్మజుఁ డిలన్ సవితృప్రభ గాంచలేనటుల్ 282.

క. అంగనలసంగమును ద
త్సంగిజనులసంగమును వెసన్ దవ్వుగ వీ
డంగఁ దగు ననునిషేధ మె
సంగుట యుష్మన్మతం బసాధువు సుండీ. 283.

మ. మఱి మోక్షాదిక మీ సనంగునకు సామర్థ్యం బెటుల్ కల్గు? శం
బరవిద్వేషికి సృష్టిరక్షణలయస్వామిత్వ మేశాస్త్రమం
దరయన్ రా దటులేన్ విరోధమగుఁ బ్రత్యక్షాదికం బన్న మ
స్కరికిన్ మ్రొక్కిరి క్రౌంచవిత్ప్రభృతు లంకత్యాగపూర్వంబుగన్.

వ. అట్లు మ్రొక్కి తదుపదేశమ్మునం బట్టి పంచాయతనపూజానిరతులు నద్వైతప్రబోధముదితులు నై యుండు నంత జగద్గురుం డుదగ్దిశకుం బ్రస్థానంబు వెడలి తొలుత మాగధం బనుపురంబు సేరుటయు, నందు నవనిధ్యాత్మసువర్ణపదకాలంకృతు లగుకుబేరభక్తు లరుదెంచి యమ్మస్కరికి స్వమతోత్కర్షము నిట్లు చెప్పం దొడంగిరి.

కుబేరమతమును జయించుట.

చ. నవనిధినాథుఁ డౌట యతినాథ! కుబేరుఁడు విశ్వతోఽధిక
ద్రవిణుఁడు; వానిఁ గొల్చుటను రాదు దరిద్రత మాకు నొందుఁ ద
ద్ద్రవిణమహత్త్వ మా కెపుడు బ్రహ్మసరూప మఖండ మాసుఖం
బవు, ధనమూల మెల్లపను లం చిటు సేయఁగ నౌ ముముక్షువుల్.

సీ. కమలజాదులకు సైతము రాజరాజ ద్ర
వ్యము నీఁ గనుట విశ్వపాలకుఁ డగు

నైశ్వర్యసంసిద్ధి కర్చనీయ కుబేర
సేవిక మైనయక్షిణి యొకర్తు
తదితరారాధనతత్పరు లపవర్గ
పరులును మందులు భాగ్యహీను
లర్థి మోక్షాదివాంఛాయత్తచిత్తులౌ
మీకుసైతి ముపాస్యుఁ డాకుబేరుఁ

గీ. డనుడు నాచార్యుఁ డిటు పల్కె నప్రమాణ
మీరు పల్కిన దెల్లఁ, గుబేరుఁడైన
నన్యుఁ డయిన ధనాదీశుఁడై తనిసెనె
తనియనిచ్చునె యాశ యేమనుజునైన? 287.

గీ. తనివిలేకున్న ధర్మ మింతయు లభింప
దతిదవీయము మోక్ష మన్నట్టి మాట
కాన నర్థ మనర్థమ్ముగా ముముక్షు
వెఱిఁగి యనపాయ మగు బ్రహ్మ మెఱుఁగఁదగును 288.

క. "అనుకొనుము నిత్య మర్థం
బనర్థ మని సుఖలవాంశ మం దొదవదు నం
దనులకుసైతము ధనికులు
మనమున నళికెదర యిదియ మార్గ మ్మెందున్". 289.

క. అని సూక్తి యుండె, ధర్మము
ధనసాధ్యం బేనిఁ గొలువ ధనదుం జేలా?
జనులు పురాకృతసుకృతము
నన ధన మొందుదు రటంచనరె తదభిజ్ఞుల్ 290.

చ. నలువ హిరణ్యగర్భుఁడు, జనార్దనుఁ డిందిరనన్పు కాఁడు, శ్రీ
గళుఁడు హిరణ్యవీర్యుఁడు నగద్విషుఁ డెన్న సువర్ణభూమిభృ

న్నిలయుఁడు వీరికెల్లరకు నిచ్చు ధనంబు కుబేరుఁడిచ్చునే?
వలదు మహాద్వినింద యగు బల్కఁ—లఁబల్కుట యింక నేనియుకా.

గీ. చిహ్నములఁ దీసి మఱి సముచితముగాఁగఁ
స్నానసంధ్యాదు లొనరింపఁ బూని పంచ
దేవతార్చన మద్వైతదివ్యబోధ
మొందుఁ దన శిష్యులై చేసి రంద అటులె. 292.

ఇంద్రమతనిరాసము.

ఆ. అవుల నింద్రభక్తు లచ్చటి కేంతెంచి
పరమగురునిపాదపద్మములకు
మ్రొక్కి యనిరి స్వామి ముజ్జగంబున కొక్క
యిందుఁడే యుపాస్యుఁ డెట్లు లనిన. 283.

సీ. సురసిద్ధసాధ్య రక్షో యక్ష గంధర్వ
విద్యాధరాది సేవితుఁ డతఁడు
బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రిమూర్త్యాకారుఁ
డింద్రుండ యని వేదమే వచించు
వామనాగ్రజుఁడు నిత్యామృతాహారుఁడు
సర్వరత్నస్థానసదనవాసి
త్రిజగతీరక్షణదీక్షావిరాజి స
ర్వాతీతుఁ డా పరమాత్ముఁ డనఁగ

గీ. సర్వమున కాత్మరూపుఁడు నిర్విశేషుఁ
డఖిలయతిశిక్షకుం డాట స్వార్థహీను
లగు నరున్ముఖనామకయతుల వృకము
లకు నొసంగిన మహిమగలాఁడు సూవె. 294.

క. కావున శ్రేయస్కాములు
సేవింపఁ దగుఁ మహేంద్రుఁ జేరి యనంగా
నావిశ్వగురుఁడు వల్కెను
భావింపక యిటుల పల్క వల దిటు వినుమా. 295.

వ. బ్రహ్మశబ్దాదికంబుఁ బోలె నింద్రశబ్దమును బరిపూర్ణైశ్వర్యయుతుం డగు సచ్చిదానందరూపునందుఁ బ్రయుక్తము గాని వజ్రాదియుక్తునందుఁ గాదు 'స దే' వేత్యాదివాక్యంబులందుఁ బరబ్రహ్మంబ నిరూపితం బయ్యె, నాబ్రహ్మమునుండి త్రిమూర్తు లుదయించిరి. అందు విధాతనుండి యింద్రాగ్నియమాది దేవతలు పొడసూపిరి. ఇంద్రుండు జగత్స్రష్టయేని తక్కంగల లోకపాలురు నేల కాఁజాలరు? అం డింద్రుని సర్వదాతృత్వమ్ము సకలజంతువులకట్ల సాపేక్షంబ. యమృతపానమాత్రంబునన బ్రహ్మత్వము సిద్ధించునేని యానంత్యమ్ము రాదో? 'ఏకమేవ' యను వచనమ్ము వ్యర్థమ్ము కాదో? మఱియు సహస్రయుగకాలము బ్రహ్మకొక్క దినము, తచ్చతుర్థాంశకాలము జీవించునురేశ్వరుఁడు పరమేశ్వరుఁ డెట్టులగుఁ గావున నిమ్మార్గమ్ము విడిచి నాపలు కాలకింపుము. 296.

క. శ్రుతివాక్య ప్రమాణముగా
వెతకి తెలిసికొనుము విశ్వబీజము ప్రళయా
హతము సదాదిప్రతిపా
దిత మగు బ్రహ్మమ్ము గురుల దీవ్యత్కరుణన్. 297.

క. అన గురున కెఱఁగి పంచా
ర్చన తత్స్మృత్యుక్తకర్మసంగ్రహదీక్షన్
గొని వారు శిష్యులై చనఁ,
జనియె యమప్రస్థపురికి శంకరుఁ డంతన్. 298.

యమమతనిరాసము.

చ. అట నెల యొందు పుచ్ఛ మహిషాకృతిచిహ్నపినద్ధబాహులై
పటురటనంబు లొప్ప యమభక్తులు కింకరసంజ్ఞ గాదు లో
క్కట యతిచంద్రుఁ గాంచి 'లయకారణ మంతకుఁ డౌట సృష్టి, లో
ముటకు నతండ కర్తయగు ముక్తిదుఁ డాతఁడ భక్తకోటికిన్. 299.

సీ. 'జమునకై సోమాభిషవ మొనర్చెడు హవి
స్సును వేల్చెఁ డీ కృతాంతుని గుఱించి
యజ్ఞమ్ము చనును దద్యముఁ గూర్చి- దూతీకృ
తుం డిందు నగ్నిహోత్రుండ' యంచు
యజ్ఞభోక్తృత్వ మయ్యమునకే శ్రుతి సెప్పఁ
గానఁ బరాత్ముఁ డక్కాలుఁడ యగుఁ
దచ్ఛుక్లమూర్తియ తత్పరమాత్మ మా
నానిర్గుణుం డగు యముని వలనఁ

గీ. బొడము మహదాదికము, దానఁ బుట్టు రుద్రుఁ;
డాయముని నీల మూర్తియం దవతరించె
విష్ణు వనఁగఁ; దదీయనాభీసరోజ
మునఁ బొడమె రక్తవర్ణుఁ డౌ వనజభవుఁడు. 300.

ఉ. అతని నుండియే పొడమి రష్టదిగీశులు సర్వమాదివి
ఖ్యాతబహుగ్రహంబులుఁ జరాచరరూపజగచ్చయంబుఁ ద
ద్రీతి సృజించి శిక్షణమతిన్ బెనుదండము దాల్చి దక్షిణా
శాతలనేతయై వెలయు సైరిభవాహనుఁ డంచు నెప్పుడున్. 301.

ఆ. స్వాంశభూతహరిహయాదులం దాతండు
భసితపిహిత మైనవహ్నికణము
వోలె వెలుఁగుచుండు నోలిఁ గాలుండె స
త్యాదిరూపుఁ డగుయథార్థముగను. 302.

సీ. అటుగాన శుద్ధబుద్ధాదిరూపుఁడు సర్వ
కారణుం డరయ నక్కాలుఁ డొకఁడ
యతని యంశమె గుణాఢ్యంచిత బ్రహ్మంబు
నిర్గుణు సేవింపనేర రెవరు
నని మేము నీలవర్ణుని యముఁ గొల్తు మ
ద్దాన మూలాజ్ఞానదళన మొనరు
నది వోవ 'సర్వము యముఁడ' య న్బోధము
పొడమి యయ్యముశుక్లమూర్తి దోఁచు
గీ. దాన ముక్తి కరస్థ మౌఁ గాన సకల
మోక్షులాలసు లేకాగ్రముగ మనంబు
నిలిపి యముని నుపాసింపఁ గలర యేని
ముక్తిఁ గైకొంద్రు తద్బోధమూలకముగ. 303.

క. అన యతిపతి పలుకు నిటుల
చనునె శ్రుతివిరుద్ధముగఁ బ్రసంగ మొనర్పన్?
వినరె పితృశప్తుఁడై యము
మనికికిఁ జనినట్టి విప్రమాణవకుకథన్. 304.

నాచికేతోపాఖ్యానము.

ఉ. ఆతఁడు నాచికేతుఁ డను నాఖ్య గలాఁడు తపస్వి- క్రోధనుం
డై తనుఁ దండ్రి తిట్టిన యమాలయ మప్పుడ సేరె; నేదియో
హేతువునన్ యముం డెటకొ యేఁగుటఁ దద్వసతిన్ ద్రిరాత్ర మ
ప్పూతుఁడు కూడు నీరు గొనఁ బోలమి నుండెను నిట్టుపాసముల్. 305.

క. అంతఁ జతుర్థదివస మం
దంతకుఁ డరుదెంచి కాంచ స్వాలయము తనూ

కాంతుల బంగరుపూఁతయుఁచు
వింతగ వెలుఁగొందు బాలవిప్రుఁ డగపడన్. 307.

చ. గడగడలాడిపోవు చలికంబునఁ గేల్గవ గీలుకొల్పి 'కి
న్నుడిగి మహాత్మ! నన్ గృపఁ గనుంగొనుమయ్య! త్రిరాత్రమోదనం
బుడిగి మదాలయంబునన యుండఁట తావక దేహకాంతి డి
ల్పడ దిసుమంత యెంతటి తపస్వివొ నీయనుభావ మల్పమే. 308.

గీ. ముందు నాకు క్షేమమును గల్గ దీవింపు
మూఁడు రాత్రుల లిచట కూఁడులేక
నీవు కుతిలపడిన నేరమునకు మూఁడు
వరము లిత్తుఁ గోరు వైళ మనుడు. 309.

క. వినయమున నాచికేతుం
డనె సాంజలిబంధుఁడై మహాత్మ! వినుము మ
జ్జనకుఁడు విశ్వజిదధ్వర
మున దక్షిణగాఁగ ధేనువుల నీనుడన్. 310.

ఉ. ఏ నటువంకఁ జూతుఁగద యే మన, నించుక గడ్డి యున్న నీ
ళ్లాని పొదుంగు లెండి యెపుడై నను జూలును దాల్పలేని వా
ధేనువు లెల్ల వీని మహిదేవుల కిచ్చినఁ బుణ్యలోకముల్
కానమి మాత్రకాదు బహుళం బయి తప్ప వనందలోకముల్.311.

వ. అని తండ్రికి రానున్న ముప్పు దలఁచి దుఃఖంచుచు నిట్టి వంధ్యల
నెవరి కిత్తు వని యడిగి "ఋత్విజుల కిత్తు" నను తత్ప్రతివచనంబు
నకు వగచి మానిపింప వెరవు దోఁపక. 312.

చ. జనకుని గాంచి 'వీనిని ద్విజన్ముల కిచ్చిన యట్లె నన్ను నె
వ్వనికిఁ నొసంగఁ జూ' తని త్రివారము మానక ప్రశ్న సేయ న

ల్కఁ నెసఁసి 'నిన్ను మిత్తి కొసగంగల' నంచు వచింప, నమ్మహా
త్మునిది యమోఘవాక్కగుటం దోడన నీవళ మొంద వచ్చితిన్.

సీ. కరుణించి నీవును వరము లిచ్చెద నంటి
నిజమేని వరము తొంటిదిగ నిమ్ము
'సౌమనస్యము శాంతసంకల్పత' దలిర్ప
జనకుండు నాయెడఁ గినుక వీడి
త్వత్ప్రిసృష్టుని నన్నుఁ బ్రీత్ప్రికారము మాట
లాడి దీవించి ప్రఖ్యాతుఁ డగుత'
మనుటయు 'నీయెడ మునుపోలె జనకుఁడౌ
నారుణి యుద్దాలకాత్మజుండు

గీ. కినుక నెఱుఁగక సుఖనిద్ర కనఁ గలండు
మృత్యుముఖముక్తు నిన్ను దర్శింపఁ గలఁ' డ
టంచుఁ బ్రథమవరం బీయ యముని గాంచి
నాచికేతుండు కోరె రెండవవరమ్ము. 313.

గీ. క్షుత్పిపాసాజరామృత్యుశూన్యుఁ డగుచు
స్వర్గమునఁ బూరుషుఁడు భీతివాసి తిరుగు
నందుఁ తత్స్వర్గ మొసఁగెడు నగ్ని నీ వె
ఱుఁగుదు శ్రద్ధాళు వగునాకెఱుఁగఁ జెపుమ. 314.

చ అన యముఁడున్ దదగ్ని భవదాఖ్య నిఁకన్ గను నంచు స్వర్గ్యవ
హ్నిని భజియింపఁ గీలకము లెల్లను దెల్పెడు, నాచికేతుఁడున్
మనమునఁ దత్స్వరూపమననం బొనరించి తదగ్ని స్వాహ్వాయం
బెనయుట కబ్బి కోరుకొనె నిమ్ము తృతీయవర మ్మటం చిటుల్. 315.

క. మనుజుఁడు మరణించిన వె
నుకను 'నస్తి' యటం చొకండు 'నాస్తి' యను చొకం
డును బల్కెదు రివ్విచికి
త్సను దొలఁచెడు విద్య నాకు దయసేయుఁగదే. 316.

ఉ. నావుడు ధర్మరాజు ద్విజనందనుఁ బల్కు 'ద్వదీప్సితం బసం
భావిత మొందు నెవ్వరికి వాకొన నీకొన-దాని మూని యిం
కేవియు నేని కోరుకొను మిత్తు సతీసుతులో ధనంబులో
సేవకులో చిరాయువొ విశిష్టసుఖంబులొ వేఱ తెల్పుమా' 317.

వ. అనుటయు నాచికేతుండు చిఱునవ్వు నవ్వి సమవర్తి మొగంబు గని.

శా. ఏలా నన్నిటు లోభ పెట్టెదవు నా కింతుల్ సుతుల్ విత్తముల్
మే లందిచ్చునె? భూము లేమి స్థిరముల్? చింతింప నీ వుండు న
న్నాళుల్ గాదె చిరాయు వన్నదియు? నన్నా! మున్న నాకోరు వి
ద్యాలేశం బిడి యంపు మద్దియ సమస్తార్థంబులన్ గూర్పదే. 318.

క. నా విని లోభవిదూరుం
డై విద్యాలోలుఁ డనఘుఁ డగు ద్విజసుతునిన్
భావించి తదధికారిగ
నావిద్య సుగోప్య మేని యముఁ డిటు గఱపెన్. 319.

ఉ. ఏపదమున్ దలంచు శ్రుతు లెల్లఁ దపంబులు సర్వ మన్వహం
బేపదమున్ వచించు, మును లెల్లఁ జరింతురు బ్రహ్మచర్య మం
దేపద మొందఁగోరి వినుమీ! వచియించెద సంగ్రహమ్ముగా
నాపదము న్మహాత్మ! ప్రణవాహ్వయమోంకృతియే యదెన్నఁగన్.

క. అనవస్థతనువు లందు న
తనువై వెలుఁగొందువిభు నుదాత్తుని నాత్మన్
గనుఁగొని మనమున ధీరుఁడు
గనఁ డించుక శోక మెట్టికాలమునందున్. 321.

క. ఎవనికి బ్రహ్మక్షత్రము
లవు నోదన మనఘ! మృత్యు వనఁబడు నదియే

యవు నుపసేచన, మావిభుఁ
దవిలి యెఱుఁగువానికరగతం బగు ముక్తుల్. 322.

ఆ. అనుచు నిట్టి సూక్తులను గొని ద్విజునకు
యముఁడు బ్రహ్మవిద్య సాంతముగను
దెలిపి యనిపె ననుచుఁ బలికెడు శ్రుతియందు
బ్రహ్మ మితర ముంట స్పష్టపడదె? 323.

వ. ఆకఠోపనిషత్తు బ్రహ్మమున కుపసేచనము మృత్యు వని భవదుపా
స్యుఁ డగుయముని నోటనె వెలువడినటు తెలుపుటంజేసి మృత్యు
వే యగు యముండు పరమాత్మయత్తుం డని స్ఫుటం బయ్యెఁ
గాదె! యముఁడే పరమాత్ముఁ డంటి మేనిఁ దన్నుఁ దా భక్షిం
చుకొనుట యెట్లు పొసంగు? 324.

సీ. కావున శమనునికంటెఁ బరంబును
బ్రహ్మవిష్ణ్వాదిరూపమున సర్వ
వస్తుకారణ మైనబ్రహ్మంబు సేవ్య మం
తియ కాని యుపసేచనీభవత్కృ
తాంతునిచిహ్నముల్ దాల్ప ముక్తి లభించు
నన సాహసము, బోధ మైన రాదు
సుందరుఁ గొని చను శూలికూతల, నజా
మిళునకై హరికింకరుల నెదిర్చి

గీ. పోడి తనకింకరులు రాఁగ నోట మునిఁగి
చేయునదిలేక ప్రణతులు సేసె శమనుఁ
డంచును బురాణముల నుండదా కృతాంత
నాథవత్త్వమ్ము తెలిపెడు గాథ లెన్నొ. 325.

వ. మార్కండేయపురాణమ్మున సుందరుండను మహాపాపి శివరాత్రిమ
రణమున ముక్తి నెనయుటయు భాగవతంబున నజామిళచరిత్రమును
శివకేశవులకు యముఁడు దాసుఁడైనచందంబు చాటవే? 326.

ఉ. మీఁ తెలి వేమియుఁ దు నిఁక మీఁదఁ ద్యజించి కృతాంతచిహ్నముల్
పూతులరై శ్రుతిప్రహితముల్ విధు లొప్పఁగఁ జేసికొంచు, న
ద్వైతపథానువర్తి గురువర్యు భజించి ప్రబోధ మొంది ని
ర్భీతి భవాంబురాశిని దరించి వరింపుఁడు ముక్తిసుందరిన్. 327.

వరుణ వాయు భూమి తీర్థమతముల ఖండనము.

చ. అనుటయు వారు మ్రొక్కి లిడి యయ్యతి కాశ్రితు లైరి తోడనే
చని యొఁ త్రివేణికాసలిలసంగమపావన మాప్రయాగమం
దు నిజమతంబు శంకరుఁడు నాల్కలుపం దలపోసి, మూఁగి రం
త నది యెఱింగి వారుణమతస్థులు వాయుమతస్థు లొక్కటన్.

వ. వారి వెంట నంటి భూమ్యుపాసకులుఁ దీర్థోపాసకులు నరుదెంచి క్ర
మముగ వరుణ వాయు భూమితీర్థముల సేవయే ముక్తిదాయకం
బని తమతమ మతసిద్ధాంతముల వినిపింప జగద్గురుండు వారల
కిట్లను. 328.

ఉ. అస్థిరభూతపంచకమునందలిపీని జగన్నిదాన మం
చాస్థ నుపాస్తి సేసెదు జడాత్ముల మిమ్ముల నేమి చెప్ప దే
హాస్థితు లోకహేతువుఁ బరాత్ము నిఁకేని యెఱింగి ముక్తులై
సుస్థితిఁ గాంచుఁ డంచుఁ బరిశుద్ధవివేకులఁ జేసె నందఱన్. 329.

శంకరుఁడు శూన్యవాదిని జయించుట.

ఆ. అపుడు శంకరునియుదంత మాలించి య
చ్చోటికి వచ్చి యొక్కశూన్యవాది

మొక్కి తనమతంబు వక్కాణింపఁ దొడంగ
హ్రీభయంబు లించుకేని లేక. 830.

క. మృగతృష్ణాంబుల మునుఁ గిడి
తగ శశశృంగంపుధనువు దాల్చి శిరసునన్
గగనకుసుమమ్ముఁ జెరివి య
రుగువంధ్యాసుతుని వచ్చుతో త్రోవం గంటిన్. 331.

క. దేవుఁ డని మొక్కి వానికి
దే వచ్చితి నిన్నుఁ గాంచ నెంచి యనఁగ, నో
యీవిద్వత్తర! పేరెది
నావుడు శంకరుఁడ ననె వినయమున వాఁడున్. 332.

సీ. నను నిరాలంబనుం డని యందురు తండ్రి క్ల
ప్తసమాఖ్యుఁ డస్మన్మతప్రవక్త
యనుటయు శంకరుం డనె శూన్య మగుట సిం
ద్యంబు నీమతము, శూన్యమున కున్నె
బ్రహ్మత్వము? 'తమేవ భాంత' మ్మనెడుశ్రుతి
వినవొ? యింకేనియు విడిచి మాధ్య
మద్వైతవిద్య సమాశ్రయించి సుఖింపు
మనవుడు వాఁ డిట్టు లని వసించె
గీ. నాకసమె బ్రహ్మమని వేదమందు నుంట
నన్నిభూతమ్ములను మిన్న యాకసంబె
యదె పరాయణ మఖిలభూతాళి, కందె
విలయ మని వేదమే తెల్పుఁ దెలియవొక్కొ. 333.

వ. 'ఆకాశ స్తల్లింగాత్' త్తని వేదాంతమున నయ్యాకాశమునకు బ్రహ్మ
త్వము నిశ్చయింపఁబడెఁ గాదె. కాన మామతంబు భవాదృశుల

కవళ్యస్వీకార్య మనుటయు నాచార్య 'డోరి మూఢ యాశ్రి
త్యంతమునకు నీచెప్పినది యర్థము కానేరదు విను' మని యిట్లు
చెప్పె. 334.

సీ. ఆకాశయనకు బ్రహ్మత లేదు సగుణత;
నిఁక గంధవహునకు హేతు వగుచుఁ
బర మాత్మ కగుఁ గార్య, మరయ శ్రుత్యుక్తాభ
యవిబోధకాకాశ మనఁగ నర్థ
మాత్మమే కాని భూతాభ్రిమ్మ కాదు 'జ్యా
యస్త్వమ్ము ఖాదులకంటె నాత్మ
కమరు నం' చనుశ్రుతి నరయ నానభమె య
ద్వైత మానంద మా బ్రహ్మము సుమి
గీ. పంచభూతమ్ములకు నంతవత్త్వదోష
మొదవె నంచు శాలావత్యు నుఱక దెగడి
నట్టిజైవలి 'యాకాశ' మనిన భూత
గగన మనునె? ఛాందోగ్యము, గనుము లెస్స. 335.

క. అన శూన్యవాది హర్షం
బునఁ "దమదర్శనముఁ జేసి పూతుఁడ నైనాఁ
డను, ముక్తిఁ గాంచుఁ బ్రేమం
బున వెస బహిర్మోక్షదేశమును జేయుఁ" డనక. 336.

గీ. దేశికుం డల్ల నగి యుపదేశ మపుడ
సలిపె "నీహృదయంబునఁ గలనభంబె
బ్రహ్మ మనుబుద్ధిఁ జేయు ముపాసన" మని
యయ్యె వాఁడును దచ్ఛిష్యుఁ డాక్షణంబ. 337.

వరాహ మతనిరాసము

ఉ. అంత వరాహభక్తుఁ డొకఁ డయ్యతిమౌళికి మ్రొక్కి 'మన్మతో
దంతము నాలకింపు ప్రళయాంబువిలీన ధరిత్రి దంష్ట్ర వి
క్రాంతి దలిర్ప నెత్తినవరాహముఁ గొల్వ్వము, ముక్తి గల్గు, న
శ్రాంతము దంష్ట్రికాంకముభుజంబుల నుండుట ముఖ్య మిం'దనన్

మ. గురుఁ డిట్టుల్ వచియించె నీమతము నాకున్ నచ్చదోరీ! తప
శ్చరణం బొక్కటె విప్రకృత్య మని తత్సంసిద్ధికై యత్నముల్
జరుపంగాఁదగు వేద మార్గమున; మేనన్ జిహ్నముల్ దాల్ప మ
త్సర మేనిన్ దను వెల్లఁ గాల్చికొను వైసార్యాది చిహ్నంబులన్ 341.

ఆ. లేదు బ్రాహ్మణునకు వేదోక్తకర్మంబు
కంటె నర్థ మొండు కనఁగ, సగుణ
మైనబ్రహ్మ మర్చ్య మందువా హరిహరా
కృతి భజింపు చిహ్నధృతి, ద్యజింపు. 342.

శా. 'దండార్హుం డగు భూసురుం డకృతసంధ్యావందనాద్యర్హక
ర్ముండే' నందురు, గాన వీడుకొనుమా మూఢత్వముల్, సల్పకొం
చుండం జూడు కులార్హకర్మములఁ దద్యోగాత్తసంసిద్ధి ము
క్తుండౌ దీ' వన జ్ఞానియై యతికి ఛాత్రుం డయ్యె వాఁ డయ్యెడన్.

వ. లక్ష్మణాహ్వయుం డగునవ్వాఁడు పరమతపస్వియై యద్వైతమత
ము దశదిశల వెలుఁగొందింప మొదలిడె, ననంతరంబు కామకర్ముం
డనులోకసేవకుం డరుదెంచి యతీంద్రునకు మ్రొక్కి యి ట్లను.344.

లోకసేవక మతనిరాసము.

సీ. పరమేశ్వరుఁడు లోకపాళియంద వసించు
సేవ్యుఁ డాతఁడె మోక్షచింతకులకు
నబ్బుఁ దత్సత్యలోకాత్మిక యగుముక్తి
కలుగఁబో దన్యమార్గమున నద్ది

యనుడు శంకరుఁ డనె నన్నృతభూత మ్మని
త్య మ్మగుసేవ నీ వాచరింప
సత్యరూపంబు మోక్షం బెట్లు చేకుఱు?
భవదీయమతము చెప్పంగ వింత
గీ. యనుడు వాఁడు శంకరుచరణాబ్జములకు
మ్రొక్కి యద్వైత సన్మతంబును గ్రహించి
శిష్యుఁడై తన్మతవ్యాప్తిఁ జేయఁ దొడఁగె
నంత నొకగుణసేవకుం డరుగుదెంచి. 345.

గుణోపాసనిరాసము.

ఉ. వాఁడిజగర్భుఁ డాదియగువారల కెల్లను గర్తలున్ జగ
త్కారణముల్ గుణంబులె కదా! తదుపాసనతత్పరాత్ము లా
వారము మేము స్వామి! యపవర్గఫలేప్సనభవాద్భుతోత్తముల్
కోరి భజింప నవ్వియ తగున్ జుమి నావుడు దేశికుం డనున్. 346.
క. జనకంబు విడిచి జన్యం
బును సంసేవింప మోక్షము లభించునె? నాఁ
గను వాఁడు నిరుత్తరుఁ డై
చును శుద్ధాద్వైతలాలసుం డయ్యె వడిన్. 347.

సాంఖ్యమతఖండనము.

ఉ. వానిపిఱుంద సాంఖ్యమతపాలనశీలి ప్రధానవాది యా
జ్ఞానవిబోద్ధఁ డార్యుఁగని 'జగంబుల కెల్లఁ బ్రధానమే యుపా
దానముగా స్మృతం బగుఁ' బ్రధానము నా గుణసామ్య-మద్దియే
యౌను నిదాన మార్య! మహదాదికతత్త్వము లెల్లఁ బుట్టఁగన్.
గీ. దేవ యవ్యక్తమును వ్యక్తభావ మనఁగఁ
బరముకంటె బరం బయి వరలు నా ప్ర

ధానమునె కొల్వుమా ముక్తి దాన నబ్బు
ననె స్మృతులు గాన స్వీకార్య మదియు మీకు. 349.

వ. అనుటయు శంకరుం డిట్లను. 350.

సీ. వేదవిరోధ మాపాదిల్లుకతన న
గ్రాహ్యమ్ము భవదుక్తిరచన మెల్ల
వేదానుకూలమై వెలసిననే కాక
స్మృతిప్రమాణంబు గా దితరములను
దత్ప్రధానం బశబ్దం బౌట జగదాది
కారణం బెన్నండుఁ గాదు నూవె
యెటుల వేదోక్త మాసీక్షితృత్వమ్ము త
జ్జడవస్తువునకుఁ బొసంగ నేర్చుఁ
గీ. గావున 'స ఐక్ష' తేత్యాదికశ్రుతిస్మృతి
నాప్రధానము కారణం బనఁగఁ దగదు
సచ్చిదాకృతి చైతన్యసంజ్ఞిక మగు
బ్రహ్మ మొక్కండె విశ్వకారణము ధ్రువము. 351.

వ. అనుటయు నాసాంఖ్యుండు 'వినుము ప్రధానం బశబ్దంబు గాదని శ్రుతియే గలదు. మఱియు నచింత్యము, నవ్యక్తము, నరూపము న వ్యయంబు నరసంబు నగంధంబు ననాద్యంతంబును ధ్రువంబును బరంబును మహత్పదవాచ్యంబు నగు నాప్రధానంబు నెఱింగి మృత్యుముఖమునుండి విడువఁబడుచున్నాఁడని యవ్యక్తశబ్దముచేఁ బ్రధానము ప్రతిపాదింపఁబడె' నని పలుక, యతీంద్రుం డోయీ! ప్రకరణాది యగునవ్యక్తశబ్దముచేఁ జెప్పఁబడినవాఁడు ప్రాజ్ఞుండు. అంతియకాదు గుణసామ్యసేవవలన సత్త్వోద్రేకరూపం బగుజ్ఞానంబుఁ బొడమదు కావున నీమతమ్ము విడిచి యద్వైతవిద్య నాశ్ర యించి ముక్తుఁడవు గ మ్మని వానికి విచికిత్సానివర్తకంబుగ సోప

పత్రిక మగునుపదేశముఁ సేయుటయుఁ దోడన వాఁడు శిష్యుఁడై
భృత్యుఁడై భజింపం దొడంగె. 352.

కాపిలమత నిరాకరము.

ఆ. అవుల నయ్యతీంద్రునకు గుల కెఱిఁగి కా
పిలుఁ డొకండు యోగవేత్త పలికె
యోగమునకు మోక్ష మొదవుట బోధించు
మన్మతంబు సప్రమాణ మార్య! 353.

సీ. విజనభూమి సుఖోపవిష్టుండు శుచి సమ
గ్రీవోత్తమాంగశరీరుఁ డగుచు
నంతిమాశ్రమసంస్థుఁడై జితేంద్రియుఁ డయి
ప్రణమిల్లి గురునకు భక్తియుక్తి
స్వచ్ఛుఁడై శోకవివర్జితుం డయి యచిం
త్యాత్ముఁడై యవ్యక్తుఁడై యనంతుఁ
డై శాంతుఁడై యమృతాకారుఁడై శివుఁ
డై బ్రహ్మయోనియై యద్భుతుఁ డయి
గీ. యాదిమధ్యాంతరహితుఁడై యధృతరూపుఁ
డై చిదానందుఁడై త్రినేత్రాసితగళుఁ
డై యనన్యుఁడై సోముఁడై యలరెడుపర
మేశు ధ్యానింపఁదగును మౌనీంద్రుఁ డాత్మ. 354.

గీ. ఆపగిది భూతయోనియు నఖిలసాక్షి
యైనయీశ్వరు ధ్యానించునట్టిమౌని
తమము కడచి సుఖింపఁగా క్షముఁ డగు నను
నిట్టివేదోక్తులు ప్రమాణ మెపుడు మాకు. 355.

గీ. ఆగమప్రోక్తజపవిద్య నధిగమించి
చక్రషట్క-విభేదనసరణి ప్రోక్త
మగుట నస్మన్మతంబు ప్రాగ్ర్యంబు సేవ
నీయము భవాదృశముముక్షునికరములకు. 356.

చ. అన యతి వల్కు 'నీపలు కనాదరణీయము వేదముల్ వచిం
చును దహరాఖ్యవిద్య యది సు మ్మపవర్గనిదాన, మంతె కా
కనఘ! త్వదుక్తయోగ మగునా యపవర్గద;మింక 'సోఽహ' మం
చని యజపాఖ్యమంత్రమున కర్థము నిశ్చిత మయ్యె వింటివే 357.

క. ఆగతి జీవేశులకు భి
దాగంధము లేమి నిశ్చితంబగుట నటఁ
యోగ మెటు తగును? మోక్షము
నాఁగఁ దగునె చక్రభేదనక్రమమాత్రఁ. 358.

గీ. అఖిలభూతస్థుఁగాఁ దన్ను, నఖిలభూత
ములను దనయందుఁ గనిననే పొందు బ్రహ్మ
మందలేఁ డన్యహేతుల నని నిషేధ
మును వచించె జ్ఞానేతరమునకు శ్రుతియు. 359.

ఆ. శమదమాదు లమర శ్రవణాదిసాధన
ములను జిత్తశుద్ధి గలుగుజ్ఞాని
యాత్మయందుఁ గేవలాత్మము గనుఁగొను
ననుచు శ్రుతియు గానమును బొనర్చు. 360.

సీ. నిగమాంతవిజ్ఞాననిశ్చితార్థులును స
న్న్యాసయోగమున శుద్ధాత్ములు నయి
భాసిల్లుదురు యతీశ్వరు-లాక్రియ విశిష్ట
మగుజ్ఞానమును ద్యాగ మలవడంగ

వార లెల్లరుఁ బరబ్రహ్మవలోకనం
బెనయుట నపునరావృత్తి గాఁగ
దేహత్రయాంత మొందెడునప్డ యెద్దానఁ
బొరివోనిమాయచే ముక్తు లగుదు
గీ. రనెడునీదృశనిగమవాక్యములచేఁ ద్వ
దుక్తషట్చక్రభేదనయోగపథము
పేక్షణీయమ్ము గాన ముముక్షువుల క
పేక్షణీయ మయ్యద్వైతవిద్య యొకటె. 361.

వ. అనుటయు నయ్యాచార్యునిం గాంచి యతీంద్రా! పరిజ్ఞానహీనుండ వగుట ని ట్లంటి వంతియకాని జ్ఞాని యెవ్వండు ని ట్లనండు వినుము. 362.

సీ. ఖేచరీముద్ర నీక్షింప 'కేనే బహ్మ'
మనువానిజిహ్వ కోయంగవలయు
నలత్రికూట మెఱుంగ 'కైనాఁడ బ్రహ్మంబ'
ననువానిజిహ్వ కోయంగవలయు
శృంగాటకమ్ము నెఱుంగ 'కేనే బ్రహ్మ'
మనువానిజిహ్వ కోయంగవలయుఁ
గననేరకయు మనోన్మని 'బ్రహ్మ మే నైతి'
ననువానిజిహ్వ కోయంగవలయు
గీ. నెఱుఁగ కంగుష్ఠమాత్రుఁ డౌపురుషు, 'బ్రహ్మ
మైతి' ననువానినాల్కఁ గోయంగవలయు
మూఁ డవస్థల నెఱుఁగ కెవ్వాఁడు 'బ్రహ్మ
మైతి' ననువానితలనె కోయంగ నలయు. 363.

ఆ. ప్రళయవేత్త పొందుఁ బరమాత్ము హరవేత్త
పగము ధ్రువము బ్రహ్మపదముఁ జెందు

ననెడునుడుల ముక్తి గాంచుమిముబోంట్లు
యోగమార్గ మూన నొప్పఁగాదె. 364.

క. అన గురుఁ డనె నిటు లజ్ఞత
ననియెద నష్టాంగయోగ మైకాగ్ర్యత శు
ద్ధిని గాక ముక్తి నిడ; ద్వై
తను శ్రుత్యవిరోధ గావునన్ శ్రౌతమ యా. 365.

గీ. అంతె కాని విజ్ఞాన మావంత లేక
మోక్షమును ఖేచరీముఖముద్ర యొసఁగు
నని స్వయంసాధనమ్ముగ ననుట సాహ
సమ్ము సుమి ముక్తి గల్గ దన్యమ్ముచేత. 366.

సీ. ముక్తి బ్రహ్మజ్ఞానమునఁ గల్గు వేఱొంటఁ
గలుగ దంచును శ్రుతుల్ పలుకఁగాదె
శ్రుత్యుక్తకర్మనిష్ఠుం డైనఁ జిత్తశు
ద్ధిని బొంది సువివేకియును విరాగి
యును నైనరుండు సముపశాంతిదమాది
కుఁడు ముముక్షువును నై గురుముఖాత్త
తత్త్వమస్యుక్తితాత్పర్యావగాహియై
యజము సచ్చిత్సుఖం బైనదాని
గీ. నాత్మమును భేదశూన్యమం చవధరించి
ముక్తుఁ డగు నంచు నద్వైతమోక్షపథము
దెలుప సాంఖ్యుండు యతిపదంబులకు మ్రొక్కి
శిష్యుఁ డయ్యె నయ్యెడ నతిచిత్రముగను. 367.

పరమాణువాదమతనిరాసము.

ఉ. ధీరకణాదు లంతట సుధీశ్వరుల్ పరమాణువాదు ల
ద్ధీరు యతీంద్రుఁ గాంచి నరుదెంచి యిటుల్ వచియించి 'రీశ్వరుం

డారయఁ గర్త' యన్ననుడి నాతఁ డిలాదిక శాశ్వతాణువుల్
సేరఁగఁ దెచ్చి లోకము సృజించు, లయంబునఁ బాయు వానినిన్.

క. లోకగురుఁ డతఁ డిలాదులఁ
జేకొని లోకము సృజించి జీవతతుల నా
నాకృతుల రచించి యఖం
డాకృతిమై సాక్షి యయి తనంత వెలుంగున్. 369

చ. అని స్వమతాకృతిన్ దెలియ నాడ యతీంద్రుఁ డనున్ 'విరుద్ధ మీ
రనినది వేదరీతి కిఁక నప్పరమేశుని భూతసృష్టి యొ
ప్పెను శ్రుతి. నిత్య మెట్లు లణుబృందము లౌ? నటుకాన నిత్యుఁడై
గనఁబడు నీశుఁ డొక్కఁడ, జగంబు లనిత్యము జన్య మాటచే 370.

గీ. ఈశు నెడఁ గాక కొన్నింటి కెటులొ జన్య
భావ మలవడెనేని 'సర్వమున కీశుఁ
డే జనకుఁ డౌట పొసఁగని హేతువున 'జ
గజ్జనకుఁ డీశుఁ డనుమాట కల్ల యగును. 371.

ఉ. 'గౌతమసిద్ధ్యనే చదువఁ గల్గును జంబుకజన్మ' మంచు వి
ఖ్యాతము; గాన దానియెడ నాస్థఁ ద్యజించి భజింపుఁ డిఁక న
ద్వైతముఁ, గొల్వుఁ డోజలపదంబులు, గాంచుఁడు నిత్యసత్యచి
ద్రీతు, లెఱుంగుఁ డాత్మము, తరించి భవాబ్ధి వరింపుఁ డేకతన్ 372.

క. అంచు వచించుగురున కిగు
రించిన భక్తిని నమస్కరించి యపుడు వా
రంచితగతి శిష్యు లయి ను
తించిరి తన్మహిమ మెఱిఁగి ధీరశివాదుల్. 373.

ఉ. అంత సశిష్యుఁడై గురుఁ డహర్ముఖమందుఁ ద్రివేణి నాడి యం
తంతఁ బ్రయాగవాసు లమితాదృతి మ్రొక్కఁగ వీడుకొం, చెడన్

సంతస మార నేడుదివసంబులకుఁ జని చేరెం గాశికిఁ
సంతత విశ్వనాథ కరుణార్ఘుర పాలిత జీవరాశికిఁ. 374.

కర్మవాదిమతనిరాసము.

ఉ. అత్తఱిఁ గర్మవాదు లగునట్టిబుధుల్ గనవచ్చి మ్రొక్కి భ
క్త్యుత్తముఁ బల్కి రిట్లు జగదుద్గమునాదులు కర్మరీతి కా
యత్తము, లద్ది రమ్య మగునా రుచిరంబు ననుత్తమంబు మే
నెత్తును, బాపకర్మ మగునేని, జఘన్యము మేను దాలుచుఁ. 375.

ఉ. 'అందిరి మోక్షసిద్ధి జనకాదులు కర్మముచేతనే' యటం
చుం దనరారువాక్యములఁ జూడ ముముక్షువు కర్మ మర్థి న
క్తందివ మాచరింప విహితంబుగఁ దోఁచును 'ముక్తి నా సుఖం
బందుటె' యండ్రు మాను, లన నాబుధునిఁ గని శంకరుం డనుఁ.

క. మీ తెలివి మెచ్చఁ దగు 'య
స్యైతత్కర్మ' యను నిగమ మనదె జగము వి
ఖ్యాతముగ బ్రహ్మకార్యం
బై తగుఁ, గారణమె ధ్యేయ మగు నెపు డనుచుఁ. 377.

ఆ. అని యుపక్రమించి యుభవుఁ డభ్రిస్థుడై
తగ వచించె నటె 'ఋతం చ' యనెడు
శ్రుతియుఁ దెలిపె స్థూలసూక్ష్మాదివివిధాత్మ
మైన బ్రహ్మమే నిదాన మనుచు. 378.

గీ. కాన సర్వజ్ఞుఁ డీశుఁడే కారణము జ
గంబునకుఁ, గర్మ మది గాదు కారణంబు
జడిమచే మందు లాకర్మసరణి మనెద
రనుఁడుఁ బరవిద్యఁ గొని శిష్యులైరి వారు. 379.

చంద్రిమతనిరాసము.

చ. అగుటయు శిష్యయుక్తుఁడు శివాభరణాఖ్యుఁడు శిష్యవేష్టితుం
డగు భగవత్పదుం గనుఁగొని యిటు పల్కె 'జగత్త్రికాశకుం
డగు చమరాదిపాలకుఁడు నాటను జంద్రుఁడు పూర్ణిమాదులం
దగణితభక్తిసేవ్యుఁడు నుపాస్యుఁడు నూవె ముముక్షుకోటికిన్'380.

మ. అనఁ బల్కెన్ యతి ముక్తి నిత్యమె, యనిత్యం బాపదార్థం బుపా
సన సేయన్ లభించు టెట్టు లది? యిష్టాపూర్తయాగాదికృ
జ్జనముల్ జంద్రునిలోక మొంది మరలన్ ధాత్రిస్థలిన్ జొత్తు ర
ర్జున యంచున్ బరమాత్ముఁ డచ్చముగ వాక్రువ్వండె గీతాస్మృతిన్.

వ. శ్రీకృష్ణపరమాత్ముండు "ధూమో రాత్రి స్తథా కృష్ణః షణ్మాసా
దక్షిణాయనం, తత్ర చాంద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్యనివర్తతే"
అని గాన మొనర్చినవాక్య మీయర్థంబు స్పష్టపఱచు. 382.

ఉ. 'ఈతఁడ దైవతా న్న' మనియెన్ శ్రుతి యన్న ముపాస్తి సేయుచో
నేలటి ముక్తి సేఁగలదె? యిచ్చిన నిచ్చును సజ్జగత్త్రితిన్
బూతచరిత్ర! యిం కయిన మూఢమతిన్ విడనాడి శుద్ధ మ
ద్వైతము పొంది చెందు మమృతం బన నాతఁడు శిష్యుఁడై చనెన్.

అంగారకాది గ్రహోపాసకు లద్వైతు లగుట.

శా. భౌమాదిగ్రహభక్తు లంతటఁ బరివ్రాట్చంద్రునిన్ వందన
క్షేమప్రశ్నల నర్చచేసి యని రుక్తిన్ ముక్తి సంధించి యో
స్వామీ! భౌమముఖగ్రహార్చ నగుఁ గైవల్యం బటంచున్ శ్రుతుల్
ప్రామాణ్యమ్మువహించుటెంచి గననౌఁబ్రాజ్ఞుల్ వెసన్ మోక్షమున్.

క. నా విని యతి యనె గ్రహపీ
డావృతు లగులోకులకుఁ దదర్చనరీతుల్

వేవఁగలఁ గలవు ముక్తికిఁ
గా వవి, బ్రహ్మంబు గాంచుజ్ఞానముదక్కన్. 386.

క. వేదములందు 'సదేవే
త్యాదివచనములను మోక్ష మభిహిత మయ్యెం
గాదె యన వారు భగవ
త్పాదాంతేవాసులై రతంద్రప్రీతిన్. 387.

వ. తదనంతరంబ 'యంత్రద్వయంబున గ్రహసంచార మెఱింగి కాల
స్వరూపంబు నిరూపింప నేర్తు' నని తొల్లి యేతెంచినక్షపణకుం డ
ప్పరమహంసావతంసంబునకు మ్రొక్కి యిటు పల్కె. 388.

సీ. స్వామీ! భవత్సమాశ్రయమునఁ గడపితి
క్షణము వోలెను మాసషట్కయంబు
నాలింతె యస్మన్మతాంతఃకృతాంతముల్
'కాలంబె పరమాత్మగా నెఱింగి
మోక్షార్థము భజింపఁబోలు' నం చన యతీం
ద్రుం డివ్విధమున వాక్రుచ్చె లీల
నోయి! 'సంవత్సరో జాయత కాల ఏ
ష' యటంచు శ్రుతి కాలజని వచించెఁ
గీ. గానఁ గాలమ్ము జన్యమ్ముగా నెఱింగి
వ్యర్థ మగు నూహ లెడసి యద్వైతమతస
మాశ్రయమ్మున ముక్తుండ వగు మన నతఁ
డటులె యయ్యెను మఱుమాట నాడలేక. 389.

గీ. అట్లతండు సర్వజ్ఞశిరోవతంసు
మునిలలాముని శంకరార్యుని భజించి

తత్కరుణ నద్వయబ్రహ్మతత్పరుఁ డయి
యలరఁ బితృదేవతార్చకు లటకు వచ్చి. 390.

పితృమతఖండనము

వ. మ్రొక్కి సాంజలిబంధులై, తదనుజ్ఞ నాసీనులై యుండ నం దగ్ర
గామి యగుసత్యశర్మ యనువాఁడు స్వమతప్రశంసాపూర్వంబుగ
భాష్యకారున కిట్లను. 391.

క. విను మగ్నిష్వాత్తాదు ల
యినపితృదేవతలు నివసింతురు శీతాం
శుని మండలమ్ము మీఁదం
గన నిత్యవిముక్తులై ప్రకాశిం త్రెపుడున్. 392.

గీ. మూవు రవ్వారియందు నమూర్తు లిఁక స
మూర్తులై నల్వు రుండ్రు తత్పూజనమునఁ
గలుగు ధర్మాదిఫలము, మోక్షంబుఁ గలుగుఁ
గాన సేవ్యులు వార జగంబులకును. 393.

మ. సతతంబున్ ఋతవాదియై గృహి పితృశ్రాద్ధంబులన్ బెట్టఁ ద
త్పితృకారుణ్యముచేత ముక్తుఁ డగుఁ, దత్ప్రీత్యర్థమై శ్రాద్ధముల్
ప్రతిదర్శంబు నొనర్పఁగావలయుఁ, జాంద్రిం బైనమాసంబు త
త్పితృమధ్యాహ్నము,ముఖ్యకాల మది తప్పింపన్ మహాఘంబగున్.

చ. అన గురుఁ డిట్లు పల్కె 'వినుమా! యమృతాప్తికిఁ గర్మ మౌనె సా
ధనము? 'నకర్మణా' యని శ్రుతం బగుసూక్తి నెఱుంగ వేమొ?పొం
దును బరమాత్మ నాత్మవిదనుత్తముఁ డొక్కఁడె, కాన కర్మ ము
జ్జన మొనరించి శుద్ధ మగుస్వాంతమునన్ గన నౌఁ బరేశ్వరున్.

క. కావున నటు సేయు మనం
గా విమలతరము క్తిఫక్కికను లెస్స మదిన్
భావించి బ్రహ్మవిద్యా
భావనఁ జేకొసరి సత్యవర్మయు నాప్తుల్. 396.

గురుఁడుభక్తుని, ననంతభక్తునిన ద్వైతుల జేయుట.

ఆ. గురునిఁ జేరి యంతఁ గుబ్జలీధుఁడు శంఖ
పాదుఁ డనెడు గరుడ,పన్నగేంద్ర
భక్తయుగము భక్తిఁ బ్రణతులై స్వస్వమ
తప్రశస్తిఁ దెలుపఁ దలఁచి యనిరి. 397.

క. నారాయణునకు శయ్యా
కారుఁ డనంతుండ మోక్షకారణ మనుచున్
శౌరికి వాహన మగు భుజ
గారియు కారణ మటంచు నని రిరుతోర్వన్. 398.

ఉ. ఆయెడ శంకరుండనె 'సహా శయనంబును వాహనంబు శ్ర
ద్ధాయుతులై భజించుట వృథా యగుఁ గాదె? తదాశ్రమంబు నా
రాయణుఁ డేల కాఁడొ సముపాస్యుఁడు మీకు? విచిత్రమా'నన్
బోయిరి వారు శంకరుని బోధమునన్ బరిశుద్ధచిత్తులై. 399.

సిద్ధోపాసకాదు లద్వైతు లగుట.

క. చిరకీర్తిప్రభుతు లనం
తర మగ్గురుఁ గాంచి వందనం బిడి యిటు ప
ల్కిరి కృతకృత్యుల మైతిమి
యరయఁగ సిద్ధోపదిష్ట మగుమంత్రముల్. 400.

ఉ. ఔదురు మీరు గూడఁ జరితార్థులు మావలె, వేగ శ్రీమహీ
ధాద్రుల కేఁగుఁ డందుఁ గన నౌదురు సిద్ధులు, వారొసంగు మం
త్రాదు లుపాస్తి సల్పుఁడు పుమర్థము లొందెద, రేము సత్యనా
థాదికసిద్ధులన్ గొలిచి యందితిమయ్య యభీష్టసంపదల్. 401.

వ. చిరంజీవులుఁ గృతార్థులు, సర్వజ్ఞులు నగునాసిద్ధులు విచిత్ర మగు
నంజనాదివిద్య లొసంగుదురు. కావున యత్నింపుఁ డనుడు నవ్వి
యాచార్యవర్యుం డి ట్లనియె. 402.

క. కూడి ఫలేప్సులతో మా
టాడుటయుం దగదు చిత్ర మగువేసములన్
గూడెడిలాభము లే దొడఁ
గూడుఁ బరద్రవ్యలబ్ధి ఘోరాఘంబుల్. 403.

గీ. అంతె కాదు చిరంజీవు లైన ఫలము
లేదు, సకలార్తిమయ మగుఁ గాదె మేను
గానఁ ద్యాగంబున విశుద్ధిఁ గాంచి దేహ
ముక్త్యుపాయం బుపార్జింపఁ బోలు సుధికి. 404.

వ. అను నాపలుకులకు వశులై వారు శిష్యు లైరి. తదనంతరంబు గం
ధర్వోపాసకు లరుదెంచి శంకరుం గని యి ట్లనిరి. 405.

గంధర్వోపాసకులు పరాజితు లగుట.

మ. 'వికలత్వం బెద సోకఁ గేము నెఱపన్, విశ్వావసూపాస్తి-నా
దకళాబిందువిబోధ మబ్బి కృతకృత్యత్వంబు గన్నార, మో
పిక గాంధర్వకళన్ బరిశ్రమము గావింపం దగున్ మీరు, నా
దకళాబిందువు లాత్మరూపములె కాదా' యన్న భిక్షుం డనున్,

సీ. భవదుక్తిగతి యనుపాదేయ మరయ వే
దవిరుద్ధ మైన పద్ధతి యగుటను
బరఁగ నశబ్ద మస్పర్శ మరూప మ
వ్యయ మరసంబు నిత్యం బగంధ
మాదిమధ్యాంతశూన్యము మహత్పదవాచ్య
మనితర మాపరమాత్మ మెఱిఁగి
మృత్యువిముక్తుఁడై మెఱయు నం చనుస్మృతి
సరణి శబ్దాద్యగోచరము బ్రహ్మ

గీ. మగుటఁ దన్నాదబిందుకళాత్యతీతు
నెఱుఁగు నెవ్వండు వాఁడెసుమ్మా సమస్త
వేదవేత్త శావునన నాదాదికాతి
గామి బ్రహ్మము గని ముక్తిఁ గనుఁడి యనియె. 407.

క. ఏవంవిధయత్యుపదే
శావర్జితచిత్తవృత్తులై వారపుడం
తేవాసు లయి చనుదు న
చ్చో నేతాళార్చకాళి చుట్టుకొని రొగిన్. 408.

వేతాళార్చకుల వశపఱుచుకొనుట.

క. భూతప్రేతపిశాచుల
వేతాళు స్మరించుకొనుచు బీభత్సరసో
పేతు లయి తనువిలిప్తవి
భూతికు లవ్వారు యతివిభునిఁ బల్కి రిటుల్. 409

గీ. యతిపతీ! యేము భూతాద్యుపాసకులము
సర్వలోకవశీకారశక్తియుతుల
మనుచుఁ గర్మంది వెఱఁగొంది యప్పు డెంద
మ్మల్లఁ బదలించుకొని వారి కనియె నిట్లు. 410.

ఉ. పాతకులార! మీమత మహాత్మ్యము శ్రోత్రియకోటి కెన్నఁగా
'భూతలవాసిభూతచయముల్ దొలఁగం జను గాత రూపమున్
గాత శివాజ్ఞ విఘ్నకరణప్రవణం బగుభూతజాతమున్
శ్రౌతవచోగతిన్ వినరె? బ్రాహ్మణు లీరెటు లైతిరో కదా! 411.

క. విడువుఁడు భ్రష్టాచారము
తడవుఁడు నిజవర్ణసముచితపుఁగర్మంబుల్
ముడువుం డద్వైతధనము
గడవుఁడు భవవారిరాశిఁ గాలువలీలన్. 412.

ఆ. అనుడు వారు గురుపదాబ్జంబులకు మ్రొక్కి-
నైజకర్మకరణనైష్ఠికతను
మించి శిష్యు లగుచుఁ బంచదేవార్చన
నిరతు లగుచుఁ జనిరి గురుని యాజ్ఞ. 413.

క. ఒం డెదురు లేక దండ్యా
ఖండలుఁ డటు దేశదేశగతబహువిధపా
షండద్విజమండలములు
చెండుచు నపరాంతజలధిచెంతకుఁ జేరెన్. 414.

ఉ. చేరి కనంగ–దుందుభి హసించుధ్వనిన్ జలమూర్మికాకర
పేరణ మొప్పఁగా నభినయించుచు గూఢతరార్థముల్ మహా
వారిధి చూడ నయ్యెఁ బ్రతివాది యనన్; యతిం డూర్జనెన్ జడా
కారు భ్రమిన్ బుధోన్మథితుఁ గాఁ దలంచి క్షమించియోయనన్.

క. చని యట గోకర్ణక్షే
త్రనికటజలరాశి నాఁడి తత్సన్నిధివ
ర్తి నుమాపతిఁ బొగడె జనులు
వినఁగ భుజంగప్రయాతవృత్తకవితచేన్. 416.

నీలకంఠమతమునుజయించుట

క తదుపరిఁ బ్రీణతుల కౌపని
షదవిద్యను గఱపు యతినిశాపతి గని నె
మ్మదిఁ గలఁగుచు హరదత్తుఁడు
కదలి చని వచ్చించి నీలకంఠుని స్వగురున్. 417.

శా. దేవా! శంకరనామభిక్షు విట కంతేవాసిసం వేష్టితుం
డై వచ్చెన్, మును భట్టమండనుల నొయ్యం గెల్చినట్లే మిమున్
వీవాదమ్మున గెల్చు వేడుక; భవానీనాథ దివ్యాలయం
బావాసమ్ముగ నుండె లెండిఁకఁ దదౌద్ధత్యంబుఁమాల్పం దగున్.

వ. అనుటయు నీలకంఠమతప్రవర్తకుండు సాంగోపాంగ శైవాగమర
హస్యవేత్తయు నగునానీలకంఠ బుధుండు. 419.

క. మును బహునిబంధనప్రణ
యనచతురత శివపరముగ వ్యాసరచితసూ
త్రనివహమునకున్ భాష్యము
నొనరించిననీలకంఠు నొజ్జఁ దలఁచుచున్. 420.

చ. బిట్టుగ నవ్వి పల్కె 'విను! భిక్షు వతండు పయోధు లగ్ని నా
నొట్టఁగఁజేయుఁగాక, రవి నుర్వరఁ గూలుచుఁగాక, వ్యోమమున్
జుట్టునుగాక చాపఁయుటు, సుంతయునేని ననున్ వివాదమం
దట్టిటు సేయనేర్చునె? నిరాశ నొనర్పనె యొక్కమాటలోన్. 421.

క. పరపక్షతమోర్కము లయి
పరఁగెడుమత్తర్కముల నవాక్కయి యతి చె
చ్చెర విడిచి స్వమత మప్పుడ
పఱవఁడె గుండియలు చేత బట్టుకొని వడిన్. 422.

వ. అని గర్వంబు నలుకయు నసూయయుఁ దేటపడం బలికి. 423.

చ. సితభసితాంచితాంగుఁ డయి చెన్ను దలిర్ప హరాక్షదామముల్
కుతుక ధరించి, శైవమతగూఢతరాశయపారదృశ్వశి
ష్యతతిపరీతుఁ డై యరిగి యాత్మమతం బిరవొందఁ బల్కె న
య్యతిపతిమౌళి, వ్యాసమునికంటెను మున్ గపిలర్షి వైఖరిన్. 424.

చ అనుడు సురేశ్వరుండు వినయంబున దేశికుఁ గాంచి 'యోర్మిమై
నిపుడు మదుక్తిపాటవము నీరలు సూచుచు నుండుఁడా' యనన్
నిపుణుఁడు నీలకంఠుఁ డతనిం గని తెల్లము మాకు నీమనీ
షపటిమ మంచు గేలిగొని శంకరసమ్ముఖుఁ డయ్యె నయ్యెడన్. 425

క. పరపక్ష బిసాద్మర సిత
గరుదాయిత సూక్తిదండిఖండితమై పెం
పఱు స్వమతము గావఁగ లే
కటిముటి ఖండింపఁ బూనె యతిపతిమతమున్. 426

వ. స్వపక్షస్థాపనాహీనముఁ బరపక్షవిదళనమాత్రావసానము నగువి
తండావాదమున కుద్యుక్తుం డై శంకరుం గాంచి యిట్లను. 427.

క. శమివర! 'తత్త్వమసి' యనుని
గమమున జీవేశ్వరైక్యగతి నుడువు త్వదీ
యమతము పొసఁగదు తేజ
స్తమఐక్యమువలె విరుద్ధధర్మం బగుటన్. 428.

సీ. ప్రవిరుద్ధధర్ములై పరగుచున్నను రవి
ప్రతిబింబముల కభిన్నతయ తోఁచు
మాడ్కి, విరుద్ధధర్మయుతజీవేశుల
కవిభేద మొనగూడు ననుట తగదు

వ్యోమశివాదిగురూక్తి మిథ్యాభూత
మద్దంబునం దోఁచునట్టినీడ;
తాదృశప్రతిబింబితమున కభేదయో
గ్యతయె లేదామె; నేకరణి నద్ది
గీ. యగును జీవేశ్వరాభేదమందు నిర్ణ
యమ్ము సేయంగఁబూన దృష్టాంతముగను?
గానఁ దాదృశపల్లవగ్రహణమాత్ర
కల్పనానల్పజల్పనక్రమము విడుము. 429.

గీ. అంతియేకాదు నీమతమందు లేదె
బింబముఖభిన్నముగఁ బ్రతిబింబముఖము
పార్శ్వగజనంబుచేఁ జూడఁబడుటను మృష
యగును బ్రతిబింబతాస్య మన్నట్టి నీతి. 430.

వ. మృషాభూతపదార్థమున కభేదయోగ్యతయే లేమింజేసి యేతద్దృష్టాంతము ననుసరించియు జీవేశ్వరుల కభేదంబు చెల్లదు మఱియు.

సీ. జీవనిష్ఠవిమూఢభావ మీశ్వరనిష్ఠ
సకలవిత్త్వమ్ము మాయికము లగుట
జీవేశు లిరువురుఁ జిన్మాత్రు లౌదురు
నిజ మభేదమ్మె యంటేని వినుము
బహుళప్రమాణసంపాదితార్థమునెడ
బాధితం బను టసంభావ్యమె కద!
యటుల ప్రమాణసిద్ధాశ్వత్వ గోత్వముల్
బాధితంబై హయపశువులకును
గీ. స్వస్వరూపమ్ముచే నేకభావ మొదవ
నగుఁగదా- భేదమునకు దత్తాంజలి యగుఁ
గాన మౌఢ్యసర్వజ్ఞతల్ గావు మాయి
కములు, గావు బాధితము లేక్రమముచేత. 431.

చ. అని యిటు పెక్కుయుక్తు లొలయన్ గలఁచెన్ గవి నీలకంఠుఁ డౌ
పనిషదవాక్ప్రకాశితము భవ్యము నాయతిభూమిభృన్మతం
బును వికచాంబుజాతవనమున్ గలభంబుబలెన్ దదుక్తదో
షనికర మింకి పోఁ బలికె సంయమియున్ బ్రతివాక్య మీగతిన్.

వ. కవీంద్రా! 'సోఽయం దేవదత్త' యనువాక్యంబునఁ దత్పదంబున
కుం దద్దేశకాలవృత్తిత్వవిశిష్టుం డగుదేవదత్తుం డర్థంబు. 'అయ'
మ్మనుపదంబునకు నేతద్దేశకాలవృత్తిత్వవిశిష్టుం డగుదేవదత్తుం
డర్థంబు నగుం, దాదృశవిరుద్ధవిశేషణవిశిష్టవ్యక్తుల కభేదంబు పలు
కుట యసమంజసం బనునట్లు కానిపించుం గాని 'సోఽయ' మ్మను
పదద్వయంబు సమానవిభక్తికం బగుటఁ దాదృశపదవాచ్యంబుల
కభేదంబు వచించుట శాస్త్రసమ్మతం, బట్లు పలుకుట కియ్యెడ భా
గత్యాగలక్షణ యవశ్యం బాశ్రయణీయం బయ్యెడి- నది యె
ట్లంటేని తద్దేశకాలవృత్తిత్వవైశిష్ట్యంబు నేతద్దేశకాలవృత్తిత్వవైశి
ష్ట్యంబును ద్యజియింపం గగు. దానం గేవలదేవదత్తునెడ నభేదంబ
బోధితం బగుం గాదె! ఆరీతినే 'తత్త్వమసి' యనుసూక్తియందుం
దత్పదార్థంబు సర్వజ్ఞత్వవిశిష్టుంబగుచిత్తగుఁ, ద్వంపదార్థంబు కించి
ద్జ్ఞత్వవిశిష్టుం బగుచిత్తగు నట్టిరెండింటి కభేదంబు పొసంగనేరద.
అట్లయ్యును 'తత్త్వ' మ్మనుపదద్వయంబు సమానవిభక్తికంబు లగు
టంజేసి శాస్త్రవిచారంబున నభేదం బనివార్యవచనీయంబై భాసిల్లు
టం భాగత్యాగలక్షణ నాశ్రయించి తత్పదార్థైకదేశం బగుసర్వజ్ఞ
త్వవైశిష్ట్యంబును, ద్వంపదార్థైకదేశం బగుకించిద్జ్ఞత్వవైశిష్ట్యం
బును బరిత్యజింప నాపదద్వయంబు జీవేశ్వరుల కభేదంబును స్పష్టం
బుగ బోధించుం గావున నియ్యెడ విరోధంబును లేదు. గోత్వమ్ము
నశ్వత్వమ్మునుం బరిత్యజించులక్షణ నాశ్రయించి గవాశ్వముల
యెడ నభేదంబు చెప్పందలంచుట యనుభవవిరుద్ధంబును నప్రమా
ణంబు నగుటంజేసి 'గోత్వాఽశ్వత్వపరిత్యాగపురస్సరంబుగ హ
యపశువుల కభేదంబు ప్రాప్తింపవలయు' ననునతిప్రసక్తియు రాదు.

సీ. మాధ్యసార్వజ్ఞ్యధర్మయుతజీవేశరూ
పాతిరిక్తం బైనయఖ్యురుపుర
పరినిష్ఠితస్వరూపమె లేదు 'తత్త్వమ'
సీతివాక్యంబునం దేల లక్ష
ణాశ్రియణాయాస మనఁబోకు 'శుక్తిరూ
ప్యగతి జీవేశరూపములుఁ గల్పి
తమ్మనుయుక్తి సత్యపదార్థ మొక్కఁడ
ధిష్ఠానముగ నొప్పి తీఱవలయు

గీ. నీవొ దేహాద్యహంతాంత మెల్లదృశ్య
మునకు జడిమ మొప్పకతప్ప దనఘ! జడము
నకు నధిష్ఠానముగఁ జేతన మ్మగు నొక
రూప మొప్పఁగవలె; జీవరూప మదియ. 435.

చ. "తగ ననిరూప్య మాట విమతం బది కల్పిత మాను రజ్జుజి
హ్మగగతి" నన్నయుక్తి నసదాకృతి యాజగ మెల్లఁ గల్పితం
బగుట ధ్రువంబు- కాల్పనిక మైనజగంబున కాశ్రియంబు గాఁ
దగినది యీశురూప మని తత్ప్రతి నియ్యకొనక వలెఁ జుమీ.

గీ. కాన శ్రుతిగమ్య మనుపాధిక మగునుభయ
రూపమున- నిరుపాధిక మాపటికము
నందున జపాసుమారుణ్య మలమనట్టు
లలమ వజ్ఞత్వసర్వజ్ఞతలు లవంబు. 437.

వ. జీవేశ్వరభేదజ్ఞానమే యథార్థ మగునేని * 'మృత్యోః స మృత్యు

* ఎవఁడు 'పరమాత్మ వేఱు నేను వేఱు' అను నానాత్వము గల వాఁడో, వాఁడు సంసారమునుండి సంసారము నొందును. అనఁగా జన్మపరంపరయందు మునుఁగు నని భావము.

మాప్నోతి య ఇహ నానేవ పశ్యతి' యనియు ♦ 'య ఏతస్మి
న్నుదర మంతరం కురుతే అథ తస్య భయం భవతి' యనియు శ్రుతు
లు భేదదర్శికి భయమును జెప్పకపోయెడిని. మఱియు భేదబుద్ధి
విపరీతబుద్ధియే కానిచో విపరీతద్రష్టకు (జీవేశ్వరభేదదర్శికి) భయ
ము కలుగు నని చెప్పుటచే విపరీతదర్శి కనర్థయోగము తప్పదు.
విపరీత బుద్ధియో భేదబుద్ధి యగుం జువ్వె. 438.

ఉ. వేదగతంబ యయ్యును నభేద మతాత్త్విక మేని 'తద్భిదా
వేదికిఁ బూరుషార్థము లభించు' నటంచు నెటుల్ వచించు న
వ్వేదమె? యేఁ బరేశునకు భిన్నుఁడ' నన్ భ్రమ శాస్త్రబాధితం
బౌఁ దుహినాంశునైందిృయిక మైనప్రమాణముకైవడిన్ వడిన్.

వ. చంద్రమండలంబు ప్రాదేశమాత్రప్రమాణంబై కానవచ్చుచున్న
దనుభ్రమంబు జ్యోతిశ్శాస్త్రప్రామాణ్యంబున బాధితం బగుట
లోకవిదితంబు. 440.

గీ. కానఁనే నీశ్వరుఁడను గా' ననెడి భి
దామతి కబాధ కల్పింపఁ దగదు; నిగమ
సిద్ధ జీవేశ్వ రాభేదబుద్ధి యట్టి
దియు శ్రుతిని మించుమాన మైంద్రియిక మగునె? 441.

చ. అల పరమాత్మతత్త్వముఁ బుమర్థపుఁదత్త్వముఁ దొల్లి పెక్కుదా
రులఁ గపిలాదితాపసనిరూపిత మయ్యెను; దాని వీడి నీ
పలుకుగ్రహించు టెట్లనెదవా 'ప్రబలంబు శ్రుతుల్, స్మృతుల్ సుదు
ర్బల' మనునీతి వేదపరిపంథిమునీరిత మప్రమాణ మౌ. 442.

♦ పరమాత్మునియెడ స్వల్ప మగుభేదమునేనియు నెవ్వఁడు తలంచు
వానికి(సంసార) భయము తప్పక కలుగును.

గీ. కానఁ 'దత్త్వమ'సీతి నైగమవచోవి
రుద్ధకపిలాదితాపసప్రోక్తఫక్కి
యననుసరణీయ మని నిశ్చయముగ నెఱుఁగు
మట్టిసరణు లాపాతరమ్యములు సూవె! 443.

వ. అని వచించు భాష్యకారుని వాఙ్ముఖంబున కడ్డంబు దవిలి యాకపీంద్రుఁ డిట్లను. ఆర్యా! 'సుఖదుఃఖాదివైచిత్ర్యమునం బ్రతిదేహంబున జీవుండు భిన్నుం డగు' నను యుక్తి నెసలారు మహర్షివాక్యంబును శ్రుతివాక్యంబు పగిది గ్రాహ్యంబ. అట్లు గాక 'జీవాత్మ యొక్కఁడే' యగునెడ మహాదుఃఖ యౌవరాజ్యసౌఖ్యంబు నొందవచ్చు, మఱియు వీఁడు సుఖి, వీఁడుదుఃఖి' యను ననుభవంబే గల్గకుండెడిని ఎవ్వాఁడు జ్ఞానయుక్తుం డట్టి జీవుండే కర్తయు, భోక్తయు నగుం గాని యచేతన మగునంతఃకరణంబునకుఁ గర్తృత్వభోక్తృత్వంబులు గలుగు టెట్లు? అట్లు గలుగునేని దేవదత్తకృతకర్మఫలభోక్తృత్వంబు యజ్ఞదత్తున కాపాదిల్లుటంజేసి యతిప్రసంగదుష్టం బగు మఱియు నీలోకమున దుఃఖనాశనమే పురుషార్థం బని వేదంబున నిశ్చితం బయ్యెఁ గాదె! 'సకలసుఖంబులు దుఃఖయుతంబులు కావుటం జేసి విషసంపృక్తాన్నవిధంబున హేయంబు' లను నభేద్యయుక్తివలన సుఖంబు లెన్నండు బురుషార్థంబులు గా' వనుటయుఁ జిఱునగవు మొగంబు గైసేయ భగవత్పాదుం డిట్లను.

సీ. అరయంగ మోదఖేదాదివైచిత్ర్యమ
నోధర్మ-మది యే మనోగతభిద
సాధించుఁ గాని యేసరణి జీవులభేద
మునకు సాధకముగా ననువుపడదు
'తార్చుఁ గర్తృత యచేతనతనూయుగళిఁ జి
త్సంబంధ మగువిశేషం బొకటియ

యది లేమిఁ గర్తృత్వ మలవడదు తృణాది'
కనెడుకల్పన వరియమ్మ మిపుల

గీ. నీవు పేర్కొన్నదుఃఖసహితసుఖంబు
వైషయిక; మిఁక దుఃఖలవంబు లేని
దనఘ! బ్రహ్మసుఖం బాట నట్టిబ్రహ్మ
సుఖమె పురుషార్థముగ గ్రహించునది నూవె! 445.

ఆ. అంతెకాని తుచ్ఛ మగుదుఃఖములనాశ
మర్థ్య మాపుమర్థ మనుట తగునె?
జరుగదొక్క దుఃఖశాంతి కంచూయన
మున నెవంకు దాని ముక్తి యనును? 446.

మ. అనుచున్ యుక్తిశతోపబృంహితమహార్థాప్తంబు శ్రుత్యంగనా
జనతాంతఃపురసౌవిదల్ల మగువాచాధార నాత్మీయమై
చనునద్వైతమతంబు నశ్రమమునన్ స్థాపించి, మించెన్ జయిం
చెను దచ్ఛైవమతంబు హేలఁ బరకృత్సిద్ధాంతఘోరోక్తులన్. 446.

క. యతిరాడ్జితుఁడై శైవుం
డతఁడు స్వభావ్యమ్ము దర్ప, మపుడ విడిచి 'నాం
గతి నీవే' యని తచ్చరణా
నతుఁ డయ్యె సశిష్యుఁడై ఘనం బగుభక్తిన్. 447.

వ. అట్లు యమిఋషభనిర్జితుం డగునీలకంఠపండితుని శృంగభంగంబు
నాలించి యద్వైతవిద్యావిద్వేషు లగువివిధమతంబులవారు కంపం
బు నొందిరి. జగం బెల్ల శంకరవిజయవార్తాఘోషణంబుల నిబిడం
బయ్యె నంత. 449.

ఆశ్వాసాంతము.

శా. అద్వైతప్రతిపాది తామృతపదార్థాకార! రాకారవిం
దద్విడ్దిక్కరణక్రియానిపుణనిత్యస్మేరవక్త్రాంబుజా!
విద్వద్వర్ణనదుర్లభామలయశోఽనస్వీత ప్రతాపాబ్ది! కృ
ష్ణద్వైపాయనసూత్రజాలపరిలగ్నస్థూలమీనాకృతీ! 449.

క. తత్త్వంపదార్థయుగళ్లై
కత్వాలంబద్విధాప్రకాశస్త్రీపుం
సత్వాలలితదాంపత్యై
కత్వవిరాజిత! విదేహకన్యాసహితా! 450.

వనమయూరము.

ఈదరకులామృతనదీశశశిసేవా
మోదరసికాత్మ! మునిముఖ్యహృదయావా
సాదర! యమేయవిజయప్రభవచంద్ర
క్షోద, రజతాద్రి, శతకోటినిభకీర్తి! 451.

ఇది శ్రీగురుకరుణాసమాసాదిత కవిత్వ 'కవితాభూషణ', 'విద్వ
త్కవిశేఖర' వెంపరాల సూర్యనారాయణనామధేయ
ప్రణీతం బైన శంకరవిజయంబున
అష్టమాశ్వాసము.

శ్రీశంకరవిజయము.

నవమాశ్వాసము.

శ్రీకర! వేంకటరాట్సుచి
వాకల్పితధర్మకృతిశుభైధావన దీ
క్షాక! నిగమకేళీక! ని
రాకృతజననాదివిక్రియాకా! రామా!

వ. అవధరింపు మనంతరం బప్పరివ్రాట్సార్వభౌముండు సౌరాష్ట్రాది నానాదేశంబుల నిజభాష్యంబుల వ్యాపన మొనర్చుచు నందందుఁ గలపండితబృందంబుల ప్రశంసలకు లక్ష్యంబై చనుచు ద్వారవతీ నగరంబు సేరునంత. 1.

సీ. అతితప్తశంఖచక్రాకృతిలోహాభి
హతిభవవ్రణకిణాంచితభుజులును
బృథులలలాటదీపితశరదండస
మానోర్ధ్వపుండ్రసంధానచణులు
మాధవాపచితినిర్మాల్యకోమలసుంద
రతులసీదళలసచ్ఛ్రవణతలులుఁ
దప్తకార్తస్వరద్రవవిభ్రమభ్రమా
ధాయకపీతకౌశేయధరులుఁ
* 'బంచవిధభేదవేత్తలే కాంచువార
లమృత' మని పల్కువారు నై యలమి పొంచ

---

* (1) జీవేశ్వరభేదము, (2) జీవుల పరస్పరభేదము, (3) జీవునకు, నచిత్తులకు గల భేదము, (4) ఈశ్వరునకు నచిత్తుకు గల భేదము(5) అచిత్తుల పరస్పరభేదము— పంచవిధభేదములు.

రాత్రులు ప్రగల్భతద్వతిచ్ఛాత్రవీర
సింహముల కోడి దంతులై చెదరి చనిరి.

ఉజ్జయిని యందు భాస్కరభట్టు నోడించుట.

చ అప్రతిమానశక్తి నిటు లయ్యతి వైష్ణవ సౌర శైవ శా
క్తప్రముఖుల్ వశంవదులు గాఁగ జయించి, యవేలవాక్ప్రశా
స్త్రప్రతివాది యోధుఁ జనెఁ జయ్యన నుజ్జని; కాక్షణంబ శో
త్రప్రియబంధు లయ్యె శివతాండవమర్దళధింధిమిధ్వనుల్. 3.

సీ. అభవపూజామృదంగారావ మభ్రగ
ర్జిత మంచుఁ గృహకేకితతి నటింప
సుమసుగంధ్యనిలముల్ శూలిదిదృక్షుఁ జె
చ్చెర వచ్చుతనుఁ జేరి సేదఁదేర్ప
నగురుధూపోత్థధూమ్యాకాంతహరిదంత
మయి మహాకాళునాలయము దోఁపఁ
బ్రణతిపూర్వకశివారాధనధన్యుఁ డౌ
తనకు మంటపి నిల్చుతావు నొసఁగ

గీ. జయపిశున లక్షణము లివ్విశర్వకరుణ
నరయవచ్చె నటంచు శంకరుఁ డలంత
వాసి కవి యగుభాస్కరాహ్వయునికడకుఁ
బంపెఁ బద్మపాదునిఁ దనవార్తఁ దెలుప. 4.

క. స్తవ్యుని బుధశేఖరు బహు
ధావ్యాకృతనిగమవచనతతిసులభజితా
రివ్యూహు నతనిఁ గని వ
క్తవ్య మ్మిటు పద్మపదుఁడు గలఁగక పలికె. 5.

చ. వడిఁ గడలొత్తఁ గీర్తి భగవంతుఁడు శంకరయోగిసార్వభౌ
ముఁడు పరమాద్వితీయమతమున్ బ్రకటించుచుఁ దద్విపక్షవా
దిడమరహారకుం డయి క్షితిన్ నుతి కెక్కినవాఁ; డతండు దా
నొడివెను సూరతుం డయి నిన్నున్ గుఱిసేసి య వెల్లఁ జెప్పుదున్.

మ. కుమతోత్ప్రేక్షితసూత్రవృత్తులతెఱంగుల్ గూర్చి 'వేదాంత జా
లము బ్రహ్మం బగుప్రత్యగాత్మమునె తెల్పున్ దత్పరం' బంచు వా
దము గావింతుము, దూర మారసియ యద్వైతంబు నంగీకరిం
పుము నీదుర్మతమున్ ద్యజించుకొను 'మేమో'యన్ననాలింపుమా.

క. అక్షీణాస్మత్తర్క ప
విక్షతి నీపక్ష మిపుడు విక్షతి గనన
ట్లీక్షణసహస్రమును నిడి
రక్షించుకొనన్ యతింపు రచ్చకు రమ్మా! 8.

క. అని 'యొకటి యను' మనిన నా
అనెదుసనందనుని హేళనాలాపమ్ముల్
విని లబ్ధవర్ణుఁ డాకవి
యనె యతివరుశిష్యుఁ గోప మందియు నగుచున్. 9.

ఆ. మామకోక్తిగుంభమండలి రేఁగఁ గా
ణాదజల్పితమ్ము లల్ప మగును
గాపిలప్రలాప మోపక రూపఱు
ననిన నద్యతనబుధాళి యెంత? 10.

ఉ. అంచు వచించునాకవిని యబ్జపదుం డను 'నోయవిజ్ఞ!య
భ్యంచితులం దవజ్ఞ నిటుపై నొనరింపకు, పర్వతంబు ఖం
డించినటంకి కైనఁ దగునే మగరాఁ దెగఁగోయ?నంచు భా
షించి స్వదేశికాంతికముఁ జేరి వచించె సమస్తవృత్తమున్. 11.

ఉ. వానిపిఱుందనే సపరివారము తద్బుధుఁ డేఁగుదెంచి వి
జ్ఞాననిధిన్ జగద్గురుని గాంచి జిగీష వెలార్చ- నంత న
వ్వానికి మౌని కయ్యెఁ బరపక్షవిఖండన నైజపక్షర
క్షా నిపుణార్థయుక్తి విలసద్వచనం బగువాద మున్నతిన్. 12.

క. అతిచిత్రశబ్దశయ్యా
న్వితమై దుర్నయభిదా ప్రవీణ వచోయు
క్తితతంబునై తటస్థ
స్తుతవ దవేద్యముగ వాదశూరత మెఱసెన్. 12.

ఉ అంత యతీంద్రుఁ డబ్బుధుసమర్థతఁ గాంచి స్వపక్షయామినీ
కాంతునకున్ శరత్కమలకల్పము సూరిపురోఽప్రభాతసి
ద్ధాంతము నైనభాస్కరబుధాదృతపక్షముఁ దూరుపెత్తె; నా
వంతయు నైజపక్ష మరయంగ నశక్తుఁడ యయ్యెఁ గెల్వఁగన్. 14.

క. ప్రతిబంధీ రచనాద
ృత మెఱయఁ ద్రియాశిఖాప్రకాశితమై స
న్మత మగునద్వైత మహా
కృతముగ వాగ్మిత్వ మమర నిట్లనుఁ బ్రౌఢిన్. 15.

వ. పరివ్రాడవతంసా! నీమతమునం "బ్రకృతి జీవపరమాత్మభేదిక" యనికదా చెప్పంబడును! ఆప్రకృతి జీవగతమై జీవపరమాత్మభేదిక యగునా?-ఈశ్వరగతయయియే యగునా? జీవభావమ్ము నీశ్వరభావమ్మును బ్రకృతిసంబంధము కల్గుననంతరంబ సంభవించుటంజేసి జీవగతమై కాని యీశ్వరగతమై కాని తదుభయభేదిక కాదు. 16.

శంకరవచనము:– బింబగతంబై దర్పణంబు బింబప్రతిబింబభేదక మగునా? ప్రతిబింబగతంబయియే యగునా? ఆబింబప్రతిబింబంబు లుభయంబును దర్పణోత్తరోద్భవం బగుటవలనఁ బక్షద్వయంబు సంభ

వింపదు. దర్పణంబు కేవలముఖమాత్రంబై బింబప్రతిబింబభేదకం బగుచోఁ బ్రకృతంబునను గేవలశుద్ధచిన్మాత్రగతయై బ్రకృతియు జీవపరమాత్మభేదక మగు. "అట్లగుచోఁ జిన్మాత్రమునకు(శుద్ధచైతన్యమునకు) దుఃఖిత్వాదికం బేల సంభవింప"దందు వేమొ? వినుము. దర్పణంబు ముఖగతంబై బింబప్రతిబింబభేదకం బైనను దర్పణగతం బగుమాలిన్యాదికంబు బింబభూతముఖంబునకు సంభవింపక ప్రతిబింబమ్మునకే సంభవించునట్లు బింబభూతం బగుపరమాత్మ పక్షపాతమ్మును విడిచి చితిమాత్రగతం బగుప్రకృతిరూపోపాధి ప్రతిబింబభూత జీవాత్మయెడఁ బక్షపాతంబు గలదై జీవాత్మయందే దుఃఖిత్వాదికం బాపాదించు. 17.

భట్టభాస్కర:— బ్రహ్మం బవికారి సంగరహితంబు, బోధైకరసంబును గదా! ప్రకృతి యన్ననో వికారి, యబోధరూపము(జడము)నుగాదె! ఇట్టి ప్రకృతికి విరోధంబువలన బ్రహ్మాశ్రయంబు గలుగదు. కావనే యంతఃకరణవిశిష్టం బగునాత్మాశ్రితత్వంబు ప్రకృతికిం జెప్పవలయునె కదా! 18.

శంకర:— ప్రకృతి యంతఃకరణవిశిష్టంబున నుండు ననుటకుం బ్రమాణంబు లేదు 'అహ మజ్ఞ' (నేనజ్ఞుఁడను)యనుప్రతీతియే ప్రమాణం బందువా? 'అహ మనుభవి' (నే ననుభవించుచుంటి) యనుప్రమాణంబువలన ననుభవమ్ముగూడ నంతఃకరణవిశిష్టమం దుండవలసి వచ్చు. అజడరూపం బగుననుభవంబు జడం బగునంతఃకరణంబుతోఁ గూడినదానియం దుండుట విరుద్ధ మగుట నిష్టము గాదు. 19.

భట్టభాస్కర:—దాహకంబు గానియును మగ్నిసంయోగంబువలన దాహక మ్మగుగతి ననుభూతి గలిగినయాత్మతోడి సంయోగమున నంతఃకరణమునందు "అహ మనుభవి" యనుననుభవ మాపాదింపఁ బడుచుండు. 20.

శంకర:—అట్లగునేని చిదుపాధిసంబంధంబున నంతఃకరణమున కజ్ఞానము సంభవింపక నీచెప్పినచొప్పున మాయాశ్రయ మగుచిత్సంబంధము గలయంతఃకరణమునం దజ్ఞాన మాపాదింపంబడు. 21.

భట్ట:—ఆర్యా! అయ్యనుభవం బజడం బగుట జడం బగునంతఃకరణంబున నుండు ననుట బాధితము. కావున ననుపపన్న మగుటంజేసి యనుభూతి గలయాత్మసంబంధమున 'నంతఃకరణమునందు ననుభూతికి వ్యపదేశ' మనుట యుక్తము. ప్రకృతమున నంతఃకరణంబును మాయయు జడంబులే యగుట బాధలేమింజేసి యంతఃకరణము మాయాశ్రయ మగుం, గాన మాయాశ్రయచిన్మాత్రసంబంధమ్మున నంతఃకరణంబునం దజ్ఞానంబునకు వ్యపదేశం బని పల్కుట తగదు. 22.

శంక:—ఓయీ! అవిద్యాజనితం బగుచిత్తం బవిద్య కాశ్రయంబు గాదు చిత్తం బజ్ఞానంబున కాశ్రయంబె యగుచో సుషుప్తియం దుంగూడ నజ్ఞానము చిత్తవర్తి కావలయునే! అట్లగుట సమ్మతము గాదుగదా! కానం బ్రకృతి దృశ్య మగునంతఃకరణవిశిష్టమం దుండు ననం బ్రమాణంబులేమిం బ్రకృతి చిద్గతమే యగు 23.

భట్ట:— 'సతా సౌమ్య తదా సంపన్నో భవతి స్వ మపీతో భవతి' యనుఛాందోగ్యశ్రుతి "జీవునకుం బరమాత్మైక్యము సుషుప్తియందుఁ గలుగు" ననుటవలన సుషుప్తియందుఁ బ్రతిబంధకం బగువిద్యయే లేద 'అయ్యవిద్య చిద్గత' మనుట పొసఁగదుగాదె! 'సతి సంపద్య నవిదు' అనుశ్రుతివాక్యము సుషుప్తియం దజ్ఞానసద్భావంబు తెలుపుచుండె నం దువేమో! ఆశ్రుతియందలి నఙ్శబ్ద మాభావంబు బోధించుం గాని యజ్ఞానంబును బోధింపదు, గాన 'సతా సౌమ్య' యనుశ్రుతిచే సుషుప్తియం దజ్ఞానము బోధింపంబడదు. నీచెప్పిన

యీయజ్ఞానము నిత్యమా? యనిత్యమా? యుక్తి లేమింజేసి నిత్య మనంజనదు. అనిత్య మందువా? ఆయనిత్యమునకు నివర్తక మొకటి యుండవలెం గదా; అనివర్తకము చిత్ప్రకాశమా? జడప్రకా మా? చిత్ప్రకాశము సాక్షియగుటంజేసి భవత్సమ్మతం బగుజ్ఞా నంబు భావరూపం బగుం, గాన విరోధి కానియీయజ్ఞానంబు నివ ర్తకంబు కాదుగదా? ఇంక జడప్రకాశం బందువా? జడ మగు నజ్ఞానమునకును జడప్రకాశమునకును విరోధంబు లేమింజేసి నివ ర్తక మెన్నండును గానేరదు కావున నవస్థాత్రయంబునను నజ్ఞా నంబు ప్రతిబంధకంబు కాదు. అట్లగుటంజేసి 'సంసారంబునకు బీజభూతంబును, నవస్థాత్రయంబందు ననపాయియు, మోక్షావస్థ యందు నశ్వరంబును నగునజ్ఞాన మనునొకపదార్థము గల' దను భవత్సిద్ధాంతంబు సమంజసం బెట్లు కాంగలదు? "అట్లని యవస్థా త్రయంబునం జిత్తు భాసింప కుంటకు నిమిత్త మేమి" యనిన భ్రమ ము (మిథ్యాజ్ఞానము) నగ్రహముం దత్సంస్కారము ననుభ్రమాది త్రితయంబె నిమిత్తం బగు.

శంకర:—నీ వనినట్లే యగుచో భ్రమ మనంగా నెట్టిది? 'నేను మనుజుం డ' ననెడియహంకారాది దేహపర్యంతం బగునాత్మంబునం దాత్మ బుద్ధియె భ్రమ మందువా? ఓహో! సర్వపదార్థసాంకర్యమును జెప్పు నీయతివిస్మరణశీలత్వంబు మెచ్చందగుం గాదె! నీవిస్మరణశీలత యెట్టి దందువా? వినుము భేదాభేదవిషయత్వ మనెడిశాస్త్రసిద్ధహేతువుచే 'అముకః ఖండః' (ఇది ఖండము) అను భేదాభేదప్రత్యయమునకుం బ్రమాణత్వమ్ము నాశ్రయించి యీభేదాభేదవిషయ మగు'నేనుమ నుజుండ' ననుప్రత్యయమును భేదాభేదముచే సర్వసంకరవాది యగు నీవు 'నేను మనుజుండ'ననుజ్ఞానము భ్రమ మని యంగీకరించుట నీమ తమును విస్మరించియేకదా! అట్లగుచో వివాదవిషయ మగుబుద్ధి

భేదాభేదవిషయక మగుటచే(1)యథార్థము(ప్రమ)అనువిషయమున (ఖండో౽యం) 'నిది ఖండ'మనుజ్ఞానము దృష్టాంతము. 25.

భట్టభాస్కర:—'నేను మనుజుఁడ'ననుజ్ఞానము నిషిధ్యమానవిషయ మగుటచే శుక్తియందు రజతబుద్ధివలె 'అప్రమ' యగును. కానఁ బ్రతిహేతువుచే నీచూపిన హేతువు(2)సత్ప్రతిపక్షిత మగునుగాదె!

శంకర:—'(నాయం ఖండో గౌః కింతు ముండో గౌః) ఈగోవు ముండమే కాని ఖండము కా దనెడిఖండాన్యధీస్థ ముండమునందు నిషిధ్యమాన మగుఖండమే విషయమైన'ఖండో౽యంపశు'వనుబుద్ధియందు సాధ్య మగునప్రమాత్వా౽భావం బుండుటవలనను నచటఁ బ్రతిహేతు వగునిషిధ్యమానవిషయకత్వరూప మగు హేతు వుండుటవలనను బ్రతిహేతువు వ్యభిచారి యగును 27.

భట్టభా:— అప్రమాత్వమ్మును సాధించునది నిషిధ్యమావిషయత్వము కాదు. మఱేమనినఁ బ్రతిపన్నోపాధియందు నిషిధ్యమానవిషయత్వము హేతువు. కాన వ్యభిచారము సంభవింపదు. అట్లగుచోఁ బ్రతీతివిషయ మైనయధిష్ఠాన మగు 'ఇద' మంశమ్మునసే 'నేదం రజత' మ్మని నిషిధ్యమాన మైనటుల యాత్మయందుఁ బ్రతిపన్నం బగుమనుజత్వం బాత్మయందే "ఆత్మా న మనుజ"యని ప్రతిషేధింపంబడు. కాన 'మనుజో౽హ' మ్మనెడిజ్ఞానము భ్రమయే యగు, "ఖండో౽యంగౌ"యనునది ప్రతిపన్నోపాధియందు నిషిధ్యమానవిషయకము గాని దగుటంజేసి భ్రమ కాదు. ప్రమయే యగుం గానఁ బ్రతిహేతువు వ్యభిచారి కాదు.

---

(1) విమతా ధీః ప్రమా, భేదాభేదవిషయత్వాత్. యథా ఖండోయమితిధీవత్ (2)సంహానాత్మధీః అప్రమానిషిధ్యమానవిషయత్వాత్.

శంక:— అప్రమాత్వసాధకమ్ముగా నీచేఁ బ్రయోగింపంబడిన ప్రతిప న్నోపాధియందు నిషిధ్యమానవిషయత్వం బను హేతువు 'ఖండో గా' యనునెడ వ్యభిచరించును. 29.

భట్ట:—గోత్వోపాధియందుఁ బ్రతిపన్నం బైనఖండమునకు నిషేధంబు లేదు కాని ప్రథమానముండమునందుఁ గలదు కానఁ బ్రతిపన్నో పాధియందు ఖండము నిషిధ్యమానము కాని దగుట హేతువు వ్యభి చారి యగు టెట్లు? 30.

శంక:— ఖండంబునకు నిషేధంబు కేవలముండమునందా? గోత్వవిష్ట ముండమునందా? కేవలముండమునందు ఖండమునకుఁ బ్రసక్తియే లేమింజేసి నిషేధము కలుగదు. కలుగునేని యప్రసక్తప్రతిషేధం బగు. ద్వితీయపక్షమున గోత్వవిశిష్టముండంబున ఖండమునకు నిషేధసమయంబుననే ముండవిశేషణ మగుగోత్వమునందుఁ గూడ ఖండమునకు నిషేధము ప్రతం బగుచున్నయది. కానఁ బ్రతిపన్నో పాధియందు నిషిధ్యమానఖండము విషయమ్ముగాఁ గలదియే ఖండ జ్ఞాన మగుటంజేసి యప్రమాత్వసాధకముగఁ బ్రయోగింపంబడిన ప్రతిపన్నోపాధియందు నిషిధ్యమానవిషయత్వరూప మగుహేతు వునకు వ్యభిచారము దృఢవజ్రలేపము సుమా. 31.

భట్ట:—ప్రమాత్వసాధకంబుగ నుపయుక్తం బగుభేదాభేదవిషయత్వ రూపహేతు వనుచ్ఛిన్నైతద్వ్యవహర్తృత్వరూప మగునుపాధితోఁ గూడిన దగుటచే వ్యాప్యత్వాసిద్ధం బగు. 32.

శంక:—బ్రహ్మసాక్షాత్కారానంతరమ్ము 'మనుజోఽహం' మ్మనువ్యవహా రంబు లేమి, ననుచ్ఛిన్నైతద్వ్యవహర్తృత్వంబునకు సాధనావ్యాప కత్వంబు సిద్ధింపమింజేసి యీయనుచ్ఛిన్నైతద్వ్యవహార ముపాధి గానేరదు. 33.

భట్ట:— ప్రారబ్ధకర్మము క్షయించినవెంట 'మనుజోఽహ' మ్మనువ్యవహారము లేమింజేసి యనుచ్ఛిన్నైతద్వ్యవహారం బుపాధియేయగుం గాదె. 34.

శంక:—మామతంబున- జగం బజ్ఞానోల్లసితంబు గావున నజ్ఞానలయుం బగుడు, జగంబు లయుంబొందు. నీమతమందో జగత్తు సత్యముగాన ననుచ్ఛిన్నైతద్వ్యవహారము సాధనావ్యాపకము గామింజేసి యుపాధి కానేరద" యనునిట్టియుక్తిపరంపర భట్టభాస్కరమతంబునందు 'భ్రమ' మనుపదార్థమే సిద్ధింప దని స్థిరీకరించి 'ఇక మీారయు భ్రమః కో' యనువాక్యము నూది ప్రథమోక్తభ్రమపదార్థమ్మునే ఖండించి వైచి ప్రతిపక్షిచే 'జితోఽస్మి' యనిపించె. 35.

చ. అనఘుఁ డమర్త్యకీర్తి యగునయ్యతి యీగతి యుక్తులన్ సుధీం
ద్రుని గతతంద్రినిన్ గెలిచి శ్రుత్యుదితార్థవిరుద్ధభావగుం
ఫన మగుభాష్యమున్ గుమత వజ్రితనుత్రి మగల్చివైవ, బో
రన భగవద్యశస్సుధ ధరాస్థలి ముంచెఁ, గలంగ దుర్మతుల్. 36.

క. కుమతాతిరేక మిాక్రియ
శమియింప, యతీంద్రకీర్తి సకలాశాచ
క్రముఁ గ్రమ్మె ఘనాఘనసం
ఘ మడంగ శరత్సుధాంశుకౌముది పగిదిన్. 37.

చ. ప్రౌఢిబారి బాణ దండి భవభూతి మయూర ముఖాద్యసత్కవీ
శ్వరబిరుదాంకితుల్ కవులు వాదునఁ బల్కి రెదిర్చి యోడి శం
కరగురు నాశ్రయించి కడఁకన్ గడకొత్తి స్వదుర్మతంబులన్
వరుసఁ బఠింత్రు భాష్యము లవంత్యుపవర్తన వర్తనంబునన్, 38.

బాహ్లీకదేశమున నార్హతమతస్థులం గెలుచుట.

ఆ. అచటు వాసి బాహ్లీకాఖ్య దేశము యతి
సేరి భాష్యములను శిష్యులకును
గఱపు టరసి చూడఁగా నోప నార్హత
సమయము లెదిరి పలుకసాగి రిటుల. 39.

క. వివరింప మన్మతంబున
శివప్రదము లేడు గలవు 'జీవాఽజీవాఽఽ
స్రవ సంవర నిర్జర బం
ధ విమోక్షాహ్వయము' లగుపదార్థము లార్యా. 40.

ఆ. వాని సప్తభంగిచే నీ వెఱింగి త
రింప కిటు వృథా భ్రమింపఁ దెగితి
తత్పదార్థములు యథామతి వివరింతు
వినుము సావధానవృత్తి మెఱయ. 41.

వ. బోధాత్మకుండు జీవుండు, జడవర్గం బజీవంబు; వీని యపరప్రపం చంబు వచింతు. జీవాస్తికాయము, పుద్గలాస్తికాయంబు, ధర్మాస్తి కాయం, బధర్మాస్తికాయం, బాకాశాస్తికాయంబు నని యస్తికా యంబు లైదు గలవు. 'క్రై గై శబ్దే' అనుధాతువువలన (అస్తి) గల దని చెప్పఁబడునది యస్తికాయము. ఆయస్తికాయపంచకంబున జీవాస్తికాయము బద్ధుఁడు,ముక్తుఁడు,నిత్యసిద్ధుఁడు'నని ముత్తెఱంగు. నిత్యసిద్ధుఁ డర్హదాఖ్యుఁ డొక్కరుండ. ఇతరులు కొందఱు సాధన ములచే ముక్తులగుదురు. తక్కుంగలవా రెల్ల బద్ధుల. పుద్గలాస్తికా య మాఱువిధంబులం బరఁగు. పృథివ్యప్తేజోవాయువు లనునాల్గు భూతమ్ములును, స్థావరంబును, జగమంబు నని పేర్కొనఁబడుచుండు. శాస్త్రీయం బగుబాహ్యప్రవృత్తిచేఁ బొడమునాంతరం బగునపూ

ర్యం బనుపేరుగల ధర్మ మనుమానింపఁబడుటంజేసి ప్రవృత్త్యనుమేయం బగునాధర్మంబె ధర్మాస్తికాయము నాఁ దనరు. ఊర్ధ్వగమనశీలుం డగుజీవునకుం దేహావస్థానంబున నధర్మ మనుమానింపఁబడుటంజేసి స్థిత్యనుమేయం బగుధర్మమే యధర్మాస్తికాయం బనం జెల్లు. లోకాకాశం బలోకాకాశం బని యాకాశాస్తికాయం బిరుతెఱంగు. పయిపయిం గలలోకంబుల కంతర్వర్తి యగునది లోకాకాశంబు. సర్వలోకంబులకు మీఁ దగుమోక్షస్థానం బలోకాకాశంబు. ఏతదస్తిమహాకాయంబ జీవాజీవప్రపంచంబు. మఱియుఁ బురుషు నింద్రియములద్వారంబున విషయంబులందుఁ జొప్పించుంగాన నాస్రవం బనంబడు. కొందఱు పౌరుషం బగుజ్యోతియింద్రియద్వారంబున విషయంబుల స్పృశించుచు రూపాదిజ్ఞానరూపంబునఁ బరిణమించుం గాన నాస్రవం బనిరి, ఒక్కొండ్రు కర్తననుసరించునవి కర్మంబు లగుటంజేసి యాకర్మంబులె యాస్రవం బనియు నీమిథ్యాప్రవృత్తి యనర్థహేతు వనియు నండ్రు

జీవుని, నాస్రవంబు, నాశ్రయించుకొని సంవరనిర్జరంబులు రెండుం బ్రవర్తిల్లు,నందు శమదమాదిప్రవృత్తియై యాస్రవస్రోతోద్వారంబు నావరించి యుంట సంవరం బనియు, ననాదికాలప్రవృత్తికషాయకలుష పుణ్యాపుణ్య ప్రహాణహేతువు లగు తప్తశిలాధిరోహణాదికంబు నిర్జరంబనియునండ్రు· నిశ్శేషముగాఁ బుణ్యాపుణ్యంబుల సుఖదుఃఖోపభోగంబునఁ దుంచుట నిర్జర మయ్యె నని కొందఱండ్రు. బంధం బన యష్టవిధం బగుకర్మంబు. ఆయష్టవిధంబులందు జ్ఞానావరణీయ,దర్శనావరణీయ, మోహనీ,యాంతరాయంబులనునాల్గును ఘాతికర్మంబు లనఁ బరఁగు 'జ్ఞానమువలన వస్తుసిద్ధి చెప్పుచో నతిప్రసంగ మగుం గావున మోక్షమునకు సమీచీన జ్ఞానము సాధనంబు కా' దనువిపర్యయంబ జ్ఞానావరణీయంబు

నాఁజను. ఆర్హతదర్శనమ్ముల నభ్యసింప మోక్షంబు కలుగ దను జ్ఞానంబె దర్శనావరణీయంబు. తీర్థకరోపదిష్టంబులై విప్రతిషిద్ధంబు లగు పెక్కుమార్గంబు లుండ నెందును విశేషావధారణంబులేమియ మోహనీయం బనంబడు. మోక్షమార్గప్రవృత్తులకు విఘ్నకరం బగుజ్ఞానంబ యంతరాయం బనంజను. ఇయ్యవి శ్రేయోఘాతు కంబులు గావున ఘాతికర్మంబు లనం బరఁగె. దేనిచేఁ దత్త్వవేద నము సిద్ధించునో యట్టి శుక్లశరీరాకార పరిణామ హేతువు వేదనీ యంబు. తదనుగుణంబై యొప్పునది నామికం, బయ్యది శుక్లపుద్గల మునకుఁ గలిలబుద్బుదాదిరూపం బగునాదిమావస్థ నాపాదించు. దేహాకారపరిణామశక్తిరూపంబున నొప్పుచు నవ్యాకృతం బగునది య గోత్రికం బనఁబడు. శుక్లశోణిత రూపంబై యుత్పాదనము వలన నాయువుం జెప్పునది యాయుష్కం బనంబడు. కొందఱు'నాకు వేదనీయముతత్త్వమస్మి'యనునదియే యనుకొనుట వేదనీయంబని యు,నే నీపేరివాఁడ ననునభిమానంబ నామికం బనియు, భగవం తుఁ డగుబుద్ధునిశిష్యవంశమువాఁడ ననునభిమానము గోత్రికం బనియు, శరీరస్థిత్యర్థం బగుకర్మం బాయుష్కం బనియు, నిర్వచింతు రు. తత్త్వవేదకంబు లగుశుక్లపుద్గలంబుల నాశ్రయించుకొనునవి యగుటంజేసి యీనాల్గును నఘాతికర్మంబులు నాఁబరఁగె. ఆద్య ష్టకర్మాష్టకంబు పురుషుని బంధించుం గాన బంధం బయ్యె. సకలక్లే శంబులుం దద్వాసనలుం బోవ ననావరణీయం బగుజ్ఞానంబుతో సుఖైకతానం బగునాత్మంబునకు నుపరిదేశస్థితియె మోక్షం బని కొందఱును, నూర్ధ్వగమనశీలుం డగుజీవుండు ధర్మాధర్మాస్తికా యంబుల బద్ధుండై యుండు, నాబంధమువలన విముక్తుండై యూ ర్ధ్వముగ నేఁగుటయ మోక్షం బని కొందఱును బల్కిరి. ఈసప్తప దార్థములఁ బ్రాపింపఁజేయుసప్తభంగిస్వరూపం బెట్టి దందువా? వినుము.* స్యాదస్తిస్యాన్నాస్తి, స్యాదస్తినాస్తి, స్యాదవక్తవ్యము,

---

* తిజన్తప్రతిరూపకావ్యయం బగు 'అస్తి' పదము కథంచిదర్థకము.

స్యాదస్త్యవక్తవ్యము, స్యాన్నాస్త్యవక్తవ్యము, స్యాదస్తినాస్త్యవక్తవ్యము నని సప్తభంగములు ప్రసిద్ధంబులు. వస్తువు నస్తిత్వవాంఛయందుఁ బ్రథమభంగంబు ప్రవర్తిల్లు. నాస్తిత్వవాంఛయందు ద్వితీయభంగంబు ప్రవర్తిల్లు. క్రమముగ నుభయమును వాంఛించుటయందుఁ దృతీయంబును, నాయుభయంబును క్రమము వీడి యొక్కమాఱు వాంఛించుటయందుఁ జతుర్థంబును, స్యాదస్తిస్యాదవక్తవ్యమ్ముల వాంఛించుటయందుఁ బంచమంబును, స్యాన్నాస్తిస్యాదవక్తవ్యవాంఛయందు షష్ఠంబును, దృతీయచతుర్థవాంఛయందు సప్తమంబును బ్రవర్తిల్లు. ఏతత్సప్తభంగీక్రమ మెఱిఁగి సప్తపదార్థవివేకంబు వడయువేని నీవివేకంబు వ్యర్థం బని యాడంబరంబుగ నుపన్యసింప నాలించి శంకరుం డి ట్లను. 42.

క. జీవాస్తికాయ మార్హత!
'యేవంవిధ మనుచుఁ దెల్పుమీ' యన వాఁడున్
దేవా!కర్మాష్టకవృత
మై వెలయుఁ దనూసమాన మగునూనముతో. 43.

చ. అన విని దేశికేంద్రుఁ 'డమహా, త్తనణీయము, నౌట జీవుఁ డే
యనువునఁ గాఁడు నిత్యుఁడు ఘటాదులటుల్; నరదేహ మూడ్చియొ
య్యన గజదేహ మొందునెడ నంతట నుండఁడు, పుత్తికాంగ మొం
ద నివఁ గొంతయేన్ మిగులఁ దప్ప'దటం చన నార్హతుం డనున్,

క. కలుగుఁ గతిపయావయవం
బులు పెద్దశరీర మొందఁ బో, నల్పతనూ
కలనమునఁ దొఱఁగు; జీవుఁడు
మలయు సమంకోచిఁ దనూసమానుఁ డయి యిటుల్. 45.

గీ. అనుడు శంకరుఁ డను నవయవము లిటుల
వచ్చి పోవునే నాగమాపాయు లాత్మ
మెటు లగు? ననాత్మములు పుట్టు నెటు? లనాత్మ
మం దెటు లుండు నాత్మావయవము లనఘ? 46.

ఉ. నావిని యార్హతుండు "జననక్షయహీనము లాప్రతీకముల్
పోవును వచ్చు నాత్మ కెటుపోలునొ యట్టివె; దంతిదేహమం
దే విలసిల్లుచోఁ బెరుఁగు నెల్లెడ నిండఁగ, బుత్తికాంగక
ప్రావృతి మైనఁ దత్తనుసమర్హముగా నగు" నంచు వాకొనన్. 47.

చ. యతిపతి పల్కె "నయ్యవయవాళి యచేతనమో సచేతనం
బో తెలుపుమా! సచేతనమె పో మ్మనెదేని- విరుద్ధబుద్ధి న
వ్వి తనువు గ్రుస్సివో నలఁతవెట్టు, నచేతన మన్న- నెట్టు లె
ల్లతనువు చేతనన్ బడయులా గొనరింపఁగఁజాలుఁ జెప్పుమా! 43.

వ. అనుటయు నయ్యార్హతుం డీరీతి నను. 49.

క. తురగములు పెక్కు లయ్యును
సరదము నేకమతి లాగునటు లితరే
తరమైత్రిఁ జేతనతఁ గని
పరఁగించును మేని నవయవంబులు సిచ్చల్. 50.

గీ అనవుడు యతీంద్రుఁ డనెఁ 'బెక్కు లయ్యు హయము
లైకమత్యంబు గనుట నియంతకలిమిఁ;
గలుగఁడు నియామకుఁడు ప్రతీకముల; కెటు భ
వత్కథిత మొప్పు ననఁ బ్రతిపక్షుఁ డనియె. 51.

క తఱుఁగక పెరుఁగు మహాత్ర
శరీరమున జీవునంగసమితి-జలూకా

సరణిని వ్యాకోచము గ్రి
చ్చుటఁ గను, సంకోచ మెనయు ననభీష్టమయ్యేన్. 52.

గీ. అనుటయు యతీంద్రుఁ డను 'వికి్రియాయుతంబు
లగుట నవి నశ్వరములు ఘటాదు లటుల
జీవుఁ డిటు నశ్వరుం డయి పోవునేని
కృతవినాశము నకృతసంగతియుఁ గలుగు. 53.

మ. మఱి కర్మాష్టకభారపీడఁ బృథుసంసారాబ్ధిలో ముగ్గి కా
తర మాప్రాణి కలాబువట్లు సతతోర్ధ్వప్రాప్తియే మోక్ష మ్మన్
స్థిరసిద్ధాంతము తావకీన మెటు సిద్ధిం గాంచు? మోక్షంబు చే
కుఱ నీపల్కు నసప్తభంగియును మాకున్ నచ్చ దే మందువా? 54.

క. ఆసప్తభంగి మోక్షము
హాసాధన మంటి; వెట్టు లగును? విరుద్ధం
బౌసదసత్త్వాదు లొకట
నేసమయమునను ఘటిల్ల వేలా మాటల్. ౫౫.

నానాదేశవిజయము.

ఆ. అనుచు మాధ్యమికులయెడ గెల్ల వదలించి
వరుస గెలిచి మెఱసె దరద శూర
సేన కురు కరూశ సింధు పాంచాలాది
నామకోపవర్తనముల కరిగి. 56.

చ. ఖండనకారుఁబోలెడియఖండమనీషుఁ బటిష్ఠయుక్తి వా
ఖండితసర్వశాస్త్ర గురుకల్పుని భట్టవికల్పు నొక్కనిన్
బండితమాళిఁ బట్టి యభిమానము తద్యతి ద్రుంచి నొంచి యు
చ్చండ వివాదకేళిని వశంవదుఁ జేసికొనెన్ క్షణంబునన్. 75.

వ. పదంపడి కామరూపదేశంబున కరిగి యందు నాభిచారికక్రియాని
ష్ణాతుం డనఁ బ్రసిద్ధుండును శాక్తభాష్యకారుండునగు నభినవగుప్తుం
డనునొక్క మాంత్రికుని శాస్త్రవాదంబున గెలుచుటయు; వాఁ డశ
క్తుండై చేయునది లేక యాచార్యమండలేంద్రునకు మ్రొక్కె. 58.

క. వేదాబ్జవికాసికిశో
రాదిత్యుని నిన్నుఁ బోలునభిరూపుఁ గనఁ
లే దెట; వశ మొందనిప్రతి
వాది యనుచు నున్నె నీ కవార్యప్రతిభా! 59.

గీ. అనుచు నుతియించి దర్ప ముజ్జన మొనర్చి
ధాతురలను శాక్తభాష్య మచ్చటన విడిచి
యాత్మను జనాపవాదభయంబు గలఁప
ననుసరించెను శిష్యుఁ డట్లయి యతీంద్రు. 60.

చ. తివిరి స్వశిష్యు లౌనటు లుదీచ్యులఁ జేసి, విదేహ కోసలా
దివిషయలోకపూజ్యుఁ డయి దేశికుఁ డుక్కన వంగధాత్రి గె
ల్చి విడిచె; గౌడదేశజులచే స్వయశంబును బాడఁజేసె, స
త్కవితతిఁ బేరికెక్కినబుధద్విపకోటుల గెల్చె వాదులన్. 11.

చ. మును కలి వేదనిందకకుబుద్ధి ద్విజన్ముల మోహవార్థి న
ద్దిన యసదర్థ్యు బుద్ధుని యెదిర్చిన ధీరుల భాస్కరాదులన్
గనుఁగొని కూటవాద మణఁగన్ గెలుపొందుటె కాదు, వేత్తయా
ముసపతికూటవాదపితృభూతజనోక్తమతంబె చీలిచెన్. 62.

ఉ. బాలిశశాక్త పాశుపత వైష్ణవ గాణప తార్క్ష తార్క కా
పాలికులున్ దదన్యులును వైదికమార్గము పాడొనర్పఁ దు
ర్వ్యాలన కోర్చెఁ గాని ప్రతివాదుల నయ్యతి; మానపాలనా
లోలతఁ గా, దమానితకు లోపము పుట్టదె యట్టులైనచోన్. 63.

మ. జగదాద్యద్రుహిణోపదిష్టమయి, తత్సంతాననిర్దిష్టమై,
భగవన్నారదభవాదిమౌనిజనతాప్తంబై, త్రయీసమ్మతం
బగునద్వైతస్మృతిన్ ముముక్షుపథికప్రాప్యంబు గావించె భే
దగదుర్మేధసకంటకోద్ధరణ మార్గస్థన్ సల్పి యయ్యోగి దాన్. 64.

మ. భువి షడ్వర్గనికైవడిన్ యతిలలాముం డెల్లెడన్ శాంతి దాం
తి విరాగోపరమక్ష మానితరవృత్తిత్వాఖ్య షణ్మాత్రృహా
ద్దవివృద్ధాత్మకుఁడై ప్రచండమదపూర్ణక్రూరపాషండదా
నవధిక్కార మొనర్చెఁ గాన-సుమనోంతస్తాపముల్ రూపఱెన్. 65.

మ. యతిసమ్రాట్కృత సర్వదిగ్విజయ యాత్రారంభ తారాపథో
త్ప్లుత తుత్తుంభ పటుస్వనంబు వినుచున్ లోకాయతుల్ భీతి వి
ద్రుతులై రుక్కటి, సైన్యధూళులఁ గణాదుల్ గాణులై, రింకి రు
ద్ధతులౌ సాంఖ్యులు యోగులట్ల యన నేతం డోహటింపం డిఁకన్.

మ. పండితగోష్ఠి ఘోరపణబంధ నిబంధన పూర్వకోగ్ర మా
మండనుతోడివాదున సమార్జితమై, జయసూచకమ్ము నా
డిండిమచండరావము ఘటించెను హానిఁ గువాదచుంచుపా
షండజన శ్రోవిపిన సంతతికిన్ దవపావకార్చియై. 67.

ఉ. అంజక బుద్ధుఁ డాజి నెదురై వడి విద్రుతుఁ డయ్యె, మూలలన్
ఖంజుఁ డటుల్ కణాదుఁ డోడుఁగంబడె, గౌతముఁ డిర్లఁ జిక్కెఁ, బె
ల్లుం జితుఁ డౌచుఁ బాఱెఁ గపిలర్షి, కృతాంజలులైరి యెల్లపా
తంజలు లయ్యతీంద్రపటుతన్ గని విస్మయ మంచు భీతులై. 68.

శా. హస్తగ్రాహ మనిన్ గృహీతు లగువేదాభ్యాసకుల్ కొందఱున్
ధ్వస్తప్రాణులు కాణభుక్కులుఁ జెఱం బడ్డట్టిలోకాయతుల్
శస్త్రబ్రహ్మవిహారుఁ డౌగురునిచే స్వస్వాధిరాజ్యప్రతి
న్యస్తుల్ గావుటఁ గొల్తు; రయ్యనఘుశౌర్యశ్రీకృపల్ చిత్రముల్.

సీ. శమదమాదికసరస్వద్బాడబజ్వాల,
సత్యఘనాఘనచక్రవాత్య
కరుణాలసచ్చంద్రికాదర్శయామిని,
శాంత్యబ్జినీపూర్ణచంద్రకాంతి
యాస్తిక్యభూజదవానలపటుహేతి,
సత్కథాహంసికాజస్రవర్ష
కుహనాది వివిధదుర్గుణవిత్తమంజూష,
దౌరాత్మ్యఫణివామలూరుసీమ
గీ. యగుచు సకలకకుప్చక్ర మాదుకొనిన
భండపాషండపండితాఖండలోక్తి
మండలి నిజోపనిషదుక్తిమండలాగ్ర
చండతరధార నలశంకరుండు చెండె. 70.

మ. పరితోవ్యాపనక్రమ్రమై కురియుఁ జద్వైతామృతం, బాత్మగో
చరమై, తాపహ మా గురూక్తిజలముక్చక్రంబు దుర్భిక్షబం
ధురక్లిష్టిఁ స్వపరైకతైకఫల మాదుర్భిక్ష మార్చెఁ నిరం
తరపాషండఖరాతపప్రసరణాంతం బూన్చె నత్యంతముఁ. 71.

సీ. శాంతులై తగుపతంజలియోగదర్శనా
ధ్యక్షులకును బంటులైనవారుఁ
గాపాలికులపతద్గ్రాహముల్ మోచువా
రలకణాదుల ప్రతీహారిజనులుఁ
బ్రాధతక్షపణకేంద్ర వైతాళికులు దిగం
బరనరపతుల సామంతసమితి
యభినవంబుగ నహరహమును దలనూపు
నట్టిచార్వాకవంశాంకురములుఁ

గీ. ప్రబలఝంఝాప్రభంజనోపమితశంక
రార్యభగవత్పాదప్రతిహతకృతాంత
బద్ధవాగ్ధాటి కిద్ధఱఁ బడి నలంగి
జీర్ణదశఁ గ్రుంగి నామావశేషులైరి. 72.

గీ. ఇటుల ద్వైతనివృత్తి యెల్లెడ నొనర్చి
ప్రతిదినమ్ము గురుండు ద్వాపరము లణఁచు
చాతత మొనర్చి పుచ్చె నద్వైతపథము
తమ మడఁచి యాతపముఁ జిమ్ము తరణి కరణి. 73.

శంకరునకు భగందరవ్రణము పుట్టి మానుట.

చ. అభినవగుప్తుఁ డీక్షణమునందు యతీంద్రున కోడెఁ దత్ క్షణ
ప్రభృతి యతీంద్రుపాయువివరంబున నాటును బోటుఁ బుట్టి, ని
ష్ప్రభ మయి దేహ మెల్లను, జ్వరంబునఁ గ్రాఁగఁ దొడంగె; దానఁ బీఁ
డభిచరణంబు సేయఁడు గదా యని యాతని సంశయింపఁగన్. 74.

గీ. ఏమి కారణమున జనియించెనో వచి
యింప రా దయ్యెఁ గనుచుండ నెదిగి గురుని
పాయువున నొక్క కెలన నపాయ మగుభ
గందరవ్రణ మయ్యె నక్కడిఁదిపోటు. 75.

గీ. అదిర! వైద్యాచికిత్స్యవ్రణాంతరస్ర
వద్రుధిరసిక్తశాటు లన్వహము నూడ్చి
తోటకాచార్యుఁ డొకరుఁ డెప్పాట రోయ
కేటి తెలినీట నుదికి యం దిచ్చుచుండు. 74.

క. అగదంకారాసాధ్యము
భగందరవ్రణము పుట్టి బాధింపఁ గనన్

నొగిలెడు గురునిం గని శి
ష్యగణం బెదఁ గుంది కంది యని రీపగిదిన్. 77.

ఉ. ఈవ్రణ మెంత యంచు మది నెంచితి రేమొకొ! చూచుచుండఁగాఁ
దీవ్రతరాకృతిన్ బెరిఁగె దీనిని మానుషజాల దెట్టివై
ద్యవ్రజ మేని నందు రుదయాస్తమనం బగుదీనిపీడ ని
త్యవ్రత మైనలోకహితయాత్ర యెటుల్ ఘటియిల్లు మీ కిఁకన్. 78.

ఉ. రింఖదధర్మసంహరణకృత్యము వైదికధర్మదేవతా
ప్రేక్షణముల్ ధరిత్రిఁ గనువేడ్కఁ జరింతువు దేశదేశము
చ్ఛృంఖలవృత్తి సేమమున నీతను వుంటఁగదా 'శరీర మా
ద్యం ఖలు ధర్మసాధన' మటండ్రిది వో నెటు ధర్మరక్ష యౌ?.

వ. అనుటయు వైద్యుల నుద్దేశించి యాచార్యుం డిట్లనె. 80.

సీ. వాతపిత్తశ్లేష్మవైవిధ్య మెఱుఁగరు
వైద్యకజ్ఞానలవంబు గనరు
రోగకారణము నిరూపింప నేరరు
వస్తుగుణంబు లేవంకఁ దెలియ
రనృతలేహ్యములు మిథ్యౌషధమ్ములు గూర్తు
రయథార్థతైలమ్ము లారచింతు
రకట! మృషాకషాయములు పచింతురు
దంభమ్ము గర్వమ్ము దలఁగనేర
గీ. రామయులపాలిటికి ద్రవిణాశఁ బుడమి
కవతరించిన యమభటు లనఁగ నద్య
తన భిషక్కులు పెక్కు రుక్కునఁ బిచండ
ఖాండమును నింపుకొందురు భూభార మడఁచి. 81.

క. నావుడుఁ బల్కి రిటు తదం
తేవాసులు దేవ! నీ వనినది నిజమె కా
నీ వైద్యకళాత్యంతా
భావము పలుకంగఁదగునె పరిశీలింపన్. 82.

ఉ. లే రనరాదు పాపపుఁగలిన్ సయితంబు పురందరాగదం
కారుల మీఱువా రమృతకల్పులు వైద్యకనీతిచాతురీ
వారిధు లాభిషక్కులు సభంబున రిక్కలువోలె లెక్కకున్
వారలఁ దేరఁగా వెదకువారము ధారిణి నాజ్ఞ యీఁగదే. 83.

క. దేహాభిమానదూరు ల
నీహులు మీ రౌట, నిటు లుపేక్షింతురు గా
కూహింపఁగ మాకు భవ
ద్దేహము జంగమసురక్షితిజమే కాదే? 84.

క. గురుఁడు నిజశరీరాదుల
నిరపేక్షు నుపేక్ష సేసెనేనియు శిష్యుం
డరయుచు నుపేక్ష సేసిన
నిరయుం బగు నంచు శాస్త్రనిశ్చయ ముండున్. 85.

మ. భవదీయామల పాదపంకరుహముల్ స్వస్థంబు లౌనేని, మా
కవు స్వాస్థ్యంబు, తదబ్జభృంగముల మే మాటన్ మహాత్మా!వినం
గవలెన్ మామొఱ,యంచు దీనముగఁ బల్కన్ శంకరుం డావ్రణో
ద్భవబాధన్ మఱపొంది యి ట్లను విరక్తస్వాంతుఁడై యంతటన్.

ఉ. చింతిలకుండు నా కయి వచింతు నిజంబు, గదం బనంగ జ
న్మాంతరపాపపాక; మది యంతము నొందును భోగరీతి 'నా
వంత యభుజ్యమాన మగునా! యది పాయద యెట్టివాని జ
న్మాంతరమందునైతము' నటంచును దెల్పును గాదె శాస్త్రముల్.

క. ద్వివిధము రోగము కర్మో
ద్భవ మని వాతాదిధాతుభవ మని-కర్మో
ద్భవ మాఱుఁ గర్మసంక్షయ
మవునేనిఁ జికిత్సఁ జరమ మంతం బొందున్, 88.

చ. అనుభవరూపకర్మవిలయం బయి నేఁడు జనించు వ్యాధి నా
శన మగుఁగాక! దాని కుపచార మొనర్పను; దన్నిమిత్తమై
తను విలఁ గూల నౌనెడలఁ దప్పక కూలునుగాక! దానికై
మనమున సాధ్వసంబు నణుమాత్రము గల్గదు నా కొకప్పుడున్.

వ. అని యాచార్యుం డాడినవిర్మలవాచారీతుల మనంబులు పంకిలం
బగుటయు నయ్యంఁదఅసమ్మతిని బద్మపాదుం డిటు వల్కె. 90.

క. దేవా నీతనువునెడన్
నీ వాశను విడుచుకొన్న నేము విడము-త
జ్జీవనమె మాకు జీవన
మా వాశ్చరములకు సలిలమట్లులవోలెన్. 91.

మ. వినవే 'తాము కృతార్థు లయ్యును బరప్రీత్యర్థ మాత్మీయమూ
ర్తిని నీరాగులె ప్రోచుకొం, ద్రని 'స్వయం తీర్ణః పరాం స్తారయే'
త్తనునీతిన్ జగతీహితార్థ మవనీయంబౌ నవశ్యంబు నీ
తను వంచున్ బలుకంగ నెంచఁ బునరుక్తం బౌ నటం చోడెదన్.

ఉ. ప్రాణులు ప్రాగ్గనుఃకృత శుభాశుభ కర్మఫలంబులన్ ఫల
శ్రేణి భుజించుమాడ్కిని భుజించు, విపాకము వేళ సౌఖ్యపా
రీణము లై నరీతిని దరింపఁగ జాలక దుఃఖమగ్నమై
ప్రాణ చెడన్ గృశించు, దినరాత్రులవంటివి సౌఖ్యదుఃఖముల్.

గీ మానసికదుఃఖములు మాను మానకుండుఁ
దోఁచుఁ దోఁపక యుండును వాచికములు

గాని సాధ్య మసాధ్య మట్టి గదము లనఁగఁ
బొడమి కాయికదుఃఖముల్ స్ఫుటముఁ లగును. 94.

వ. అలంతుల మగుమేము సర్వజ్ఞులకు మీకుఁ దెలుప వలంతుమే? ఐన నిదానింతన మ్మగునస్వాస్థ్యంబున నట్టింటి రేమాయనుసంది యమ్మున నొక్కవిషయంబు దేవరస్మృతికిఁ దేర సాహసింతు. భవ దుక్తవైఖరి నీవ్యాధి నుపేక్షించిన శరీరపతన మవ్యంభావి యగు, నట్టిద యకాలమృత్యు వనియు, దాని నుపచారమ్మునఁ దలఁగింప నగు ననియుఁ జరకసంహిత యనిన సూక్తులవధరింపుము. 95.

ఉ. దైవము పౌరుషం బని ద్విధాప్రవిభక్తము పుణ్యపాపరూ
పావృతకర్మ మొక్కటియ, యయ్యది ప్రాగ్జనురార్జితంబ యే
దైవ మటండ్రు, సంప్రతికృతం బది పౌరుష మం, డ్రొక్కఁడా
దైవము పౌరుషంబు త్రివిధం బగు నుత్తమమధ్యమాధమ. 96.

సీ. దైవపౌరుషము లుత్తమములు గలసి దీ
ర్ఘసుఖంబు నియతాయు వొసఁగు నెసఁగ
మఱి తద్ద్వయము మధ్యమము గూడి మధ్యమం
బగుసుఖం బాయువు దగ ఘటించుఁ
బ్రబల మాపురుషకారము దుర్బలం బైన
దైవంబు నున్మూలితం బొనర్చు
గీ. దైవము విశిష్ట మైన నధఃకరించు
నితర మైనకర్మమ్ముల నెల్లవానిఁ;
బ్రతిఘటించును దద్బలాబలవిశేష
మరయఁ బ్రారబ్ధ మనుభావ్య మనెడునుడిని. 97.

సీ. మంత్రౌషధీమణీమంగళబల్యుప
హారనిష్కృతినియమాదు లేల?
భ్రాంతప్రచండచపలగోగజోష్ట్రశా
సరఖరాశ్వాదికిఁ దొలఁగ నేల?
శైలప్రపాతవిషమదుర్గజలరయ
జ్వలదనలాదికి జంక నేల?
యతిచండచపలనృపామర్షవిషసరీ
సృపసాహసాదుల కెడయ నేల?
గీ. యేల వెఱపొందుట యదేశకాలచర్య?
కేల మదమోహలోభాదివృత్తుల విడువ?
నాయువే మేని కాధారమగున యేని?
యాయు వది కర్మనియతంబ యగున యేని? 98.

గీ. నియతకాలప్రమాణమై నెగడు నదిన
నాయువున కిట్టి భావముల్ హాని నిడవు
ప్రాణుల కకాలమరణభయంబు లేదు
తన్నిరోధకయత్న మింతయుఁ గలుగదు. 99.

సీ. రాసాయనాధికారమున మానులయత్న
కథనప్రయోగాదికము వృథ యగు
నియతాయు వగుశత్రునిం బురుహూతుండు
శతకోటిఁ బరిమార్పఁ జాలకుండు
నుపచరింపఁ దలంప రోగి నాశ్వినేయు లా
ర్తుల కిష్టభేషజముల నొసంగి
సంయమీంద్రులు తపస్సాధనంబున యథే
ష్టముగ నాయువు నొందఁజాలకుందు

గీ. రమరనాథుఁడు దేవర్షిసమితి రసర
సాయనమ్ములఁ గనిపెట్ట, నన్యుల కుప
దేశమొనరింపఁ నిర్మింపఁ దివురఁ, రాయు
వఖిలలోచనగోచరం బగున దేని. 100.

చ. ఇవి మన శక్తిగోచరములే కద! యామిక మీఱఁ జొచ్చి యా
హవ మొనరించుసైనికసహస్రము లొక్కపటిన్ వినష్ట మౌ
నవి సమమైనయాయువుఁగలట్టివొకో! యుపచార మొంద కే
యవిషభుజుల్ మెలంగరొ, విషాశను లీల్గరొ మందు లిచ్చినన్. 101.

క. ఆయువిషవిషప్రాశను
లేమెడఁ బ్రతికార మెనయ కెనసియు నాయు
ర్దాయవిపర్యమునఁ జని
పోమెద; రాయువును జూడఁ బోలును కంటన్. 102.

గీ. కావున హితోపచారమె జీవితంపు
మూల మగుఁ దద్విపర్యయమున మృతి యగుఁ
గలదు మఱి కాలమృత్యు వకాలమృత్యు
వనువిభేదమ్ము దెలియ నా నగదకర్త. 103.

సీ. యానసమాయుక్త మశ్మము ప్రకృతిమై
యానగుణోపేతమై సమస్త
గుణయుక్తమై యనుగుణ మగుకాలంబు
వాహ్యామానం బయి స్వప్రమాణ
సంక్షయంబున నవసానంబు గాంచుఁ ద
ద్విధమున నాయువు దేహ మొంది
యుక్త మాప్రకృతినియుక్తిని నుపచర్య
మాణ మానెడ స్వప్రమాణమునకు

గీ. సంశయము గల్గుతఱి నవసాన మొందు
నదియు నూ కాలమృత్యుసమాఖ్యఁ బరఁగు,
ఖ్యాతమగుఁ దద్విరుద్ధ మ్మకాల మృత్యు
వనఁగ నది దాట నగు వెజ్జు నాశ్రయించి. 104.

వ. అని యాయుర్వేదంబున ననుపచరితంబగునేని నియతమయ్యు నాయువు క్షీణింప నకాలమృత్యువు కలుగు ననియు, నాయువు దైవపౌరుషరూపద్వివిధకర్మవిశేషంబుల ద్వైవిధ్య మొందు ననియుఁ, బౌరుషప్రాబల్యమున దైవమ్మును నిర్జించి యాయు వార్జించి యకాలమృత్యువు జయించి శరీరము నిల్పుకొని, యదియ సాధనంబుగఁ జతుర్విధపురుషార్థంబులం బురుషుండు పొందవలె ననియు స్పష్టంబుగ సిద్ధాంతీకరింపంబడెఁ, బురుషార్థాపేక్ష గలయెల్లరకు రక్షణీయంబు దేహంబ కాదె! భవాదృశులదేహపీడ లోకపీడయు యగు నని శాస్త్రవిహితోపపత్తిపూర్వకంబుగా వ్రణచికిత్స యావశ్యకంబని నిర్బంధపురస్సరంబు బతిమాలుపద్మపాదున కెదురాడంజాలక, కొంతతడవు దిగ్భ్రమ నందియు స్వస్థుండై యద్దేశికుండు. 105.

శా. ఆయుర్వేదమహత్త్వ మెచ్చికొని, వేదాంతానుకూలంబుగా
నాయర్థంబుల నన్వయించుకొని, హేయం బయ్యుఁ గాయం బుపా
దేయం బంచు గ్రహించి, పద్మపదుబుద్ధిన్ బెద్ద గొండాడి, మీ
మీయిష్టం బగుచాయఁ జేయు డనికూర్మిన్ శిష్యులన్ బల్కుడున్.

ఉ. ఛాత్రులు దేశికోక్తి కరుసంబున మ్రొక్కిడి యెల్ల దిక్కులం
దాత్రమునన్ భిషగ్వరులకై వెదుకం జని రాత్మముల్ హరి
క్షేత్రములన్ బొనర్చి, పరసీమనివాసపటీయు లౌట నే
మాత్రమలంత నొవ్వరు ప్రమాదముఁ జెంద రొకందు యాత్రలో.

చ. నృపునిఁ గవుల్, భిషక్కుల శరీరులు, దాత ధనార్థులున్, సదా
నిపుణత నాశ్రయించు టది నిక్కము గాన వసుంధరేశహ

సపురములందు వారిఁ గనఁజాలుదు మంచు ననేకభూమిపా
లపురులు సొచ్చి తద్భిషజులం గని తెచ్చిరి యొజ్జచెంతకున్. 108.

క. పదఁపడి నిజసేవకభూ
త్రిదశార్చితు లగుభిషక్తతియు యతితో మీ
కేదికర్తవ్యము తెలిపిన
నది సేసెద మనిన నిటుల యతిపతి నుడివెన్. 109.

క. వాయువుననో మాయువుననో
పాయువున వ్రణమ్ము పుట్టి బాధించెడి నా
కాయువు కలిమిని వత్తురు
జాయువు తగినది యొసంగి చక్కఁబఱుపుఁడీ. 110.

వ. అనుటయు. 111.

సీ. స్వచ్ఛమైనట్టి కాలాగ్నిరుద్రరసంబు
తేనియతో నాస్వాదింప నిచ్చి
రక్తమోక్షణముకై రక్తపాపాతన
శృంగ శస్త్రక్రియల్ ధృతి నొనర్చి
సైంధవ నాగర జాతిప త్రాదిపి,
ష్టములఁ దైలముల లేపములొనర్చి
సౌవర్చలత్రిఫలావచాదిక రచి
తములైన పెక్కుక్షారములు చల్లి
గీ. స్వేదనాలేపలంఘనాసృగ్విమోక్ష
ణాది శాస్త్రోదితచికిత్స లఖిలములును
సలిపిరి భగందరవ్రణశాంతికొఱకుఁ
గంట వత్తిడుకొని భిషజ్మౌళిమణులు. 112.

ఉ. వాతికమో కఫోద్భవమొ పైత్తికమో యని నాడిఁ జూచి యె
ట్లొతెవు లుద్భవించెనో రవంత నిదాన మెఱుంగలేక ప్రి

ఖ్యాతము లైనమందులు భగందరశాంతికిఁ జెప్పఁబడ్డ వే
వో తెలివొప్పఁజేసి యిడి రొక్కటి మానక తద్భిషగ్వరుల్. 113.

గీ. ఆఁతరమ్ముగఁ గొంత బాహ్యముగఁ గొంత
క్షారముల లేపనమ్ముల శస్త్రములను
ఘృతములను భేషజములఁ జికిత్స జరిగెఁ
గాని యది యేటఁ గలిపినకతక మయ్యె. 114.

చ. అటు తమకృత్య మెల్ల వృథయై యెటు తోఁపక చిత్తవీథులన్
గటకట నొందువెజ్జులను గాంచి తదత్యమతన్ స్మరింపక
ప్పటికి యతిప్రభుం డిటుల పల్కె 'నయో బహుకాల మయ్యె ని
చ్చటి కరుదెంచి మీర లిఁకఁ జయ్యన మీగృహసీమ కేఁగుఁడీ 115.

క. ఇతరాయూరూపులు మీ
రితః పర మ్మింటి కేఁగుఁ, డేఁగక యున్నన్
వెత నొందుచు మీరాకకు
హితబంధులు సూచుచుందు రెదు రగుతెన్నుల్. 116.

ఉ. మీకు శరణ్యుఁ డౌనృపతి మీ రిటు వచ్చుట యాలకించుచో
గాఁకల రేఁగి యీయెడఁదగుకాన్కలు జీతము లీయ మాని య
ట్లాఁకలఁ బెట్టి పోఁ బనిచి యన్యునొకానొకనిం భిషక్కుగాఁ
జేకొనునేమొకో చపలచిత్తులు రాజులు వాజులుంబలెన్. 117.

క. జనపదములు తఱచు భిష
గ్జనశూన్యము లామయావిజననిబిడము లౌ
టను మీగృహములకడ మిముఁ
గన నెందఱో రోగు లుండ్రు కలఁగుచు రుజలన్. 118.

గీ. దేహి కుత్పత్తి జనయిత్రిధీన, మవిర
తావన మ్మగదంకారహస్తగతము

వె జ్జొదవఁడేని పుట్టువు విత శరీరి
కతఁడె హరి సుఁడీ' యనుయతి కనిరి వారు. 119.

ఉ. మీ రనినట్టి దంతయు నమిథ్యయ కాని మిమున్ ద్యజించి పో
నేరక యుంటి మేనరుఁడునేని దివిన్ ద్యజియించి మర్త్యమున్
గోరునె? యం చశక్తతను గుప్త మొనర్చుచుఁ బల్కెఁ యాభిష
గ్వీరులు జాటి పోయి రెటొ భేషజశబ్దము దంభ మానటుల్. 120.

క. తదనంతర మాభగవ
త్పదుఁడు తనువు మీఁదిమమతఁ ద్యజియించి, వగల్
మది సోఁక నీక శాంభవ
పదకమల ధ్యానపూర్ణభావుం డయ్యెన్. 121.

చ. అవనిఁ బ్రసిద్ధు లౌపరసహస్రము వైద్యులు చేరి చేఁతనా
వివిధచికిత్సలన్ జలిపి వేసరినట్టివ్రణంబు పీడకున్
బొవులఁ డతండు నారికెడపుంఫలమందలిసార మట్లు త్వ
గ్భవదృఢబంధముక్త మయి స్వాంతము నిర్మమ మూట నద్దిరా. 122

చ. అదిగద యోగసాధనమహత్త్వము! కర్మఫలానుభూతికిన్
వదలి కళేబరం, బచలభావము చిత్తము నత్తుకో దురా
సద మగుబ్రహ్మభూయమున సమ్మద మందుచు యోగి, దానికే
కద ఋషికోట్లయత్న, మెది కావలె యోగ మధీన మౌ నెడన్.

చ. గురుఁ డటు వెజ్జు లేఁగుడు నకుంఠితయోగసమాధి నుండఁగా
నరసి' వినేయు లొజ్జఁ గలయన్ వలగొంచు సజేష్టదేవతా
స్మరణవిచింతనాద్యనుపమక్రియలన్ దప మాచరింపఁ జొ
చ్చిరి ఫల మొజ్జ కప్పనము సేయుతలంపునఁ బాయ కెల్లరున్. 124.

సీ. తోటకాచార్యుండు మృత్యుంజయమంత్ర మ
సంఖ్యమ్ముగ జపింప సాగె విడక

హస్తామలకుఁడు గభస్తిమాలిమహాను
            నూపాసనము సేయుచుండె దీక్ష
నలసురేశ్వరుఁడు సేయఁగఁబూనె నాసత్య
            ధన్వంతరులపదధ్యాన మర్థి
నెడపక చిద్విలాసుఁడు శీతలాదేవి
            మంత్రముక్క జపియింప మానఁ డెపుడు
గీ. పద్మపాదుండు నరసింహభవ్యమంత్రి
నిరవధికసంఖ్యజప మహర్నిశము సేయ
దీక్షితుం డయ్యె నాచార్యదేవునకు న
నామయము గోరి త్రిష్ణ లతకరించి. 125.

శా. ఆరీతిన్ బరమేశ్వరాంఘ్రికమలధ్యానాప్తి నానాగదం
కారాసాధ్య భగందరవ్రణ నిరాఘాటప్రసారంబు చ
ల్లారంజొచ్చెఁ గ్రమక్రమంబున గురుం డార్జింపఁగాఁజొచ్చెఁ బూ
ర్వారోగ్యం బహహా! తపంబునకసాధ్యం బెద్దియున్ గల్గునే? 126.

చ. అభయము గల్గ నేదివస మాది శమింపఁగఁ బూనె దేశిక
ప్రభువ్రణ, మాదినంబ ప్రభవం బయి యట్టివ్రణంబ వృద్ధియై
యభినవగుప్తు మ్రింగె యతి కావ్రణ మంతయు మానునాఁడ; దు
ర్లభము పరాపకారకృతిలాలసచిత్తుల కాయురర్థముల్. 127.

గీ. కృత్య నమ్మాంత్రికుఁడు ప్రయోగించె ననియు
శంకరుం డడ్డినను పద్మచరణుఁ డాభి
చారికక్రియ నాకూర్రుఁ జంపె ననియుఁ
బొడమె నపదూఱు జగతి నద్భుతముగాఁగ. 128.

సీ. అవమానితుఁడు గాన నాభిచారిక మభి
            నవగుప్తుఁ డొనరింపఁ దివురుఁగాక

యద్దాని కట్టికృత్యము సేయువాని శం
కరునంతవాఁడు పోఁ దఱుమఁడో కొ
చేయఁడే జపము దేశికురక్షకై పది
మందితోఁ పా టరవిందపాదుఁ
డతఁడ యీశాక్తుని మృతిహేతు వను టెట్లు
వానిపాపమున నవ్వాఁడు మడియ
గీ. యతియు, శిష్యులు జపియింప నందు నొక్క
పద్మపాదునకే యపవాద మొదవు
టచ్చెరువు, దానిలోనిపుణ్యంబు పాప
మెఱుఁగ నగు దైవమునకె కా కొరుల కగునె? 129.

వ. అట్లు స్వాస్థ్యంబు గాంచి యొక్కనాఁటిసాయంతనవేళ శంకరుండు
తత్కాలకర్మానుష్ఠానార్థంబు గంగ కరుగుచుండ. 130.

గౌడపాదుండు శంకరుని భాష్యములఁ గాంచి ప్రశంసించుట.

సీ. మినువాకతరఁగచాలున నూఁగి వచ్చి లేఁ
దెమ్మెరల్ గొలువ నేఁతెంచువాని
విరిసిన తెలిదమ్మి సరివచ్చుపటికంపుఁ
గరకంబు కెంగేల మెఱయువాని
జలదంబుపోలిక సంజకెంపున జొత్తు
వాఱిన మే నొప్ప వచ్చువాని
ద్వ్యాయుమత్ర్యాయుషాభ్యధిక జీవితుఁ డౌటఁ
గురులందు నర మేనఁ దఱులవానిఁ
గీ. లీలఁ జెందమ్మిసవి తేనెఁ గ్రోలి మునరు
మధుకరము లన రుద్రాక్షమాల కేల
భాసిలెడు వాని శ్రీగౌడపాదమౌనిఁ
బరమగురుఁ గాంచె నా జగద్గురువరుండు. 131.

క. కని బిఱబిఱ నెదురుగఁ దాఁ
జని మునిపాదముల కెఱఁగి జలజసదృశముల్
పనివడి యర్చించి మనం
బున భక్తిశ్రద్ధ లొలయ మోడ్చెఁ గరంబుల్. 132.

గీ. క్షీరవారాశివీచిసాచివ్యమునకు
జతన మొనరించునిజకటాక్షముల మాని
యతిని ముంచుచు దంతచంద్రాతపమ్ము
లాశ లలముకొనంగ ని ట్లనియె నర్థి. 133.

సీ. ఎఱిఁగితే గోవిందగురుకృప సంసృదు
ద్ధారకంబై హృద్య మైనవిద్య
సచ్చిదానందంబు సత్యంబు వేద్యంబు
నిత్యమాతత్త్వంబునెఱి నెఱిఁగితె
కొలుతురే నిన్ను శిష్యులు నిరంతరభక్తి
శమదమతత్త్వజిజ్ఞాస లెనసి
నిత్యశాత్రవులు వినిర్జితులే కద
శాంత్యాదిసద్గుణార్జనము గలదె
తవిలి యష్టాంగయోగసాధకత గంటె
కనెన చిత్తంబు చిత్తత్త్వగతి యతీంద్ర!
యనవరతము జీవన్ముక్తి సార్థకము గ
జగదవనదీక్ష చరియింతె ధాత్రితిలక! 134.

మ. అనఁ గర్మంది యమందభక్తియుతుఁడై యానందబాష్పాంబువుల్
కనులం జిప్పిల నంజలిన్ శిర మలంకారించి భాషించె ని
ట్లని 'మీయాచార్యపదుల్ కృపాజలఘులై యర్థిన్ నను బ్రశ్నసే
సిన దెల్లన్ ఫలియించె, దుర్లభములున్ జేఁ జిక్కె వే మీకృపన్.

క. మూఁగయు వాగ్మి యఁగు, బుధుం
డౌఁగద జడుఁడేని, బాపి యగునరుఁడును బు
ణ్యాగణ్యసుగుణయుతుఁ డగు
రాగియుఁ గడకంట నీ వరయ— నిస్పృహుఁ డౌ. 136.

సీ. అజానసిద్ధదివ్యజ్ఞానుఁడై వెల్గె
నెవ్వాఁడు ధర జనియించునపుడ
యతిరయ మొప్ప నౌదాసీన్యసంపన్నుఁ
డై యెవం డెద్దేని నరుగఁదొడఁగెఁ
బుత్ర! పుత్ర! యటంచుఁ బొంగారుప్రేమ ద్వై
పాయనుం డెవని వెన్నాడి పిలిచె
స్వవశమై యోగసర్వస్వ మొప్పుటఁ బ్రపం
చైకభావ మెవండు హేల నొందె
గీ. నొంది వృక్షమయుం డయి 'యో' యటంచు
మాఱుపలికెను దండ్రి కేమహితచరితుఁ
డట్టిశుకుఁ గొల్చి నేర్చి తధ్యాత్మవిద్య
నీమహిమ మెన్న సామాన్యమే మహాత్మ! 137.

క. అంతటివానిని గొలిచి య
నంతజ్ఞానము గడించి నట్టిమిమ్మున్ ము
న్నెంతసుకృత మొనరించియొ
కాఁతును బూజింతుఁ జరణకమలయుగళమున్. 138.

క. దీనుం డగునీభక్తుని
గానఁగ మీరలు స్వయంబుగా వచ్చుట దే
వా! నాభాగ్య మమేయం
బౌ నను యతి గౌడపాదుఁ డనియె నిటువలెన్. 139.

ఉ. వింటిని వత్స తావకపవిత్రగుణంబులు వాస్తవంబుగాఁ
గంటిని వేఁడుకొ శమగుణప్రవణాత్మఁడ వైననిన్నుఁ గ
న్గంటను గాంచి పోవ; ననఘా! తమి మత్కృతవార్త్తికంబు ల
న్నిఁటికిభాష్యముఁ సలుపనేర్చితివంట ప్రమోద మయ్యెడుఁ. 140

వ. నీ కధ్యాత్మగురుండును నాకు శిష్యుండు నగుగోవిందయతీంద్రుని వలన వినుట గలిగె, ననుటయు శంకరార్యుండు వినీతుం డయి భాష్యం బశేషంబును వినిపించె. విశేషించి మాండూక్యోపనిషత్తునకు రచించినశ్రుతిభాష్యంబును గౌడపాదకారికాభాష్యంబును వినిపింప హర్షించి యమ్మహర్షి యి ట్లను. 141.

ఉ. మామకవార్త్తికాంతరితమంజులభావవిబోధకంబుగా
నీమెయి భాష్య మెల్ల రచియించిననీ కెదియే వరంబు నీఁ
గా మది వాంఛ పుట్టె నడుగందగు నిచ్చెద నన్న, నయ్యతి
గ్రామణి యిట్లు కోరెను శుకప్రతిమానుఁ దపోధనాగ్రణిఁ. 142.

చ. మునివర! ని న్నతిమ్యయుగపూరుషుఁ గన్నులఁ గాంచుకంటెఁ గ
ల్గునె వర మంచుఁ గోరఁగ నొకం డెదియేనియు? నైనఁ గాని నీ
యనుమతిఁ గోరుకొందు, ననయంబును చిత్తము చిత్పదార్థచిం
తనమున నంతరాయరహితం బయి యుండ వరంబు నీఁగదే. 143.

క. నావుడుఁ 'దథా' స్త్వని చిరం
జీవి యయినగౌడపదఋషిప్రభుఁడు తిరో
భావ మెనయ యతిపతి శి
ష్యావళి కావార్త విసుచు చానిసి గడపెఁ. 144.

క. తోడన తెలవాఱుటయును
నీడంబులఁ గలకలధ్వనిని విహగము లా

మ్రీడన మొనరింప వినుచుఁ
గ్రీడించుచుఁ బ్రకృతి కన్నుగీటి హసించెన్. 145.

ఉ. ఆసమయంబునన్ దివ్రిపథగాహగ కేఁగి సశిష్యుఁ డౌచు స
న్న్యాసివిభుండు స్నానము నొనర్చి యథావిధి నిత్యకర్మముల్
వేసర కాచరించి తటవీథి స్థిరాసనబంధుఁడై నిది
ధ్యాసనలాలసుం డయినయ ట్లొకవార్త యిటుల్ వినంబడెన్.146.

శంకరుని సర్వజ్ఞ పీఠాధిరోహణము.

సీ భూలోకమందు జంబూద్వీప మేపొందు
నందు భారతదేశ మలరుచుండు
నాదేశమందు ముఖ్యం బయి కాశ్మీర
మండలం బసమానమహిమఁ దనరు
నామండలమున భాషాధీశ యగు శార
దాదేవి వెలయు నామోద మెసఁగ
నాశారదాలయం బమరుఁ జతుర్ద్వార
యుతచతుర్మంటపవితత మగుచు
గీ. నందుఁ జెలువొందు సర్వజ్ఞుఁ డైనవాఁడె
యెక్కఁ దగుపీఠ; మితరు లం దెక్కు టెటుల?
యదు గటుల చాపలేరు, నల్గడల మేటి
బుధులు కాఁపుండి శాస్త్రార్థముల జయింతు. 147.

క. ప్రాచిని బౌరస్త్యులును బ్ర
తీచిని బాశ్చాత్యబుధు లుదీచి నుదీచ్యుల్
గాచికొని యుందు రారయ
వాచీద్వారంబుఁ దెలువ నర్హులు దాటన్. 148.

వ. సర్వజ్ఞుం డగుదాక్షిణాత్యుండు లేమి నాద్వారం బుద్ఘాటింప రను నావార్త యాలించి యందలిప్రామాణ్య మెఱుంగఁ దలంచి దాక్షిణాత్యుం డగుశంకరభిక్షుక్షితిపతి దక్షిణద్వారం బపావృతంబు సేయుపూన్కిఁ గతిపయప్రయాణంబులఁ గాశ్మీరంబు సొచ్చి తత్ప్రతిజ్ఞాభంజనార్థం బద్దేవీభవనంబు సేర నరుగునవసరంబున. 149.

మ. ప్రతివాదిద్విపగర్వదుర్మదము మ్రింపం జాలుశ్రీదేశికే శితృసింహం బిదె సర్వవిత్త్వమున విచ్చేసెన్ బటాపంచలై బ్రతుకుం డోప్రతివాదిదుర్గజములారా! వేదశీర్షాటవీ శ్రితమై సంన్యసనోగ్రదంష్ట్రమయిపొల్చెన్ మ్రింగు ద్వైతాటవుల్.

ఉ. గండతలస్రవన్మదసుగంధముఁ గ్రోల భ్రమించుతేంట్ల పెన్ తండము జీఱువాఱుతరుణద్విపకుంభముఁ జీల్చునమ్మృగే శుండు సృగాలపంక్తిఁబలెఁ జూడఁడు కన్గవ విచ్చి నీచవై తండికవాదితండము నదాటుగనేసి యతీంద్రుఁ డెన్నఁడున్. 151.

క. అని తనయశమును శిష్యులు
గొనియాడఁగఁ దీవ్ర గురుఁడు కోవెల కపుడే
చని దక్షిణదిగ్ద్వారం
బును జేరి కవాటబంధమును దివఁబోవన్. 152.

గీ. వాదినివహంబు సంభ్రమోద్భ్రాంత మగుచుఁ
జుట్టి యతి కడ్డముగ నిల్చి యిట్టు లనిరి
యేల యీసంభ్రమంబు? నీకేమి వలయుఁ
దెలుపు త్వరపడఁ గోర్కి సిద్ధించు నొక్కొ? 153.

క. రావచ్చుఁ బరీక్షింపం
గావచ్చు నెవండు నే సకల మెఱుఁగుదు నం

చే విను పరీక్ష నొసఁగియు
దేవీభవనంబు సౌరుము దీఱఁగ గోర్కుల్. 154.

గీ. అని పలుక వారి కుత్తరంబును నుడువఁగ
నున్న శ్రీశంకరాచార్యు నోహటించి
యడిగె షడ్భావవాది కణాదమతవి
హారి యొకఁ డిట్లు స్వమతసిద్ధాంత మూఁది. 155.

ఉ. ఆఁగి వచించి 'పొమ్ము పరమాణుయుగంబు పరస్పరంబు సం
యోగము నొందఁగా ద్వ్యణుక ముద్భవ మా'నని మామతంబు సు
మ్మా గణుతించి యట్టిద్వ్యణుకాశ్రిత మైన యణుత్వ మేక్రియన్
దాఁ గలుగంగఁజాలునొ? కనందగుఁ దావకసర్వవిత్త్వమున్. 156.

క. నా విని 'పరమాణుగతం
బై వెలసిన ద్విత్వసంఖ్య యగుఁ గారణ' మం
చావిజ్ఞుఁ డనఁ, గణాద
శ్రీ వెనుకడుగిడెఁ దదుక్తిరీతిఁ బొగడుచున్. 157.

ఉ. ఆయెడ నష్టు సొచ్చి యనె నయ్యతితో నతిగర్వితుండు నై
యాయికు డొక్కరుం డిటు 'కణాదమతంబునకంటె వేఱు ని
శ్శ్రేయస మక్షపాదమతరీతిఁ జెలంగుటఁ జెప్ప నేర్తు వే
నీయెడ సర్వవేత్తవె సుమీ; ప్రతిన విడు మట్లు కానిచోన్.158.

మ. అన యోగీంద్రుఁ డనెన్ గణాదమతమం దా మోక్ష మత్యంతనా
శనమై పోవ గుణౌఘసంగతి వియత్సామ్యంబుగా నుంటె, యిం
కను దద్గాతమ పక్ష మోక్ష మది తత్కాణాదమోక్షంబుక,
న్నను భిన్నం బగుఁ బెచ్చుగాఁ గనుట సానందోపలబ్ధిత్వమున్.159.

వ. సర్వజగ న్నిమిత్తకారణభూతుం డీశ్వరుండే యని కణాదపక్షమం
దువలెనే గౌతమపక్షమందును నైక్యము కానుపించినను 'ద్రవ్య

గుణ, కర్మ, సామాన్య, విశేష, సమవా, యాభావంబు లను సప్త పదార్థంబుల కణాదపక్షమున విఖ్యాతంబులగుచుండ, గౌతమపక్షంబునఁ 'ప్రమాణ, ప్రమేయ, సంశయ, ప్రయోజన, దృష్టాంత, సిద్ధాం, తావయవ, తర్క, నిర్ణయ, వాద, జల్ప, వితండా, హేత్వాభాస, చ్ఛల, జాతి, నిగ్రహస్థానంబు' లను షోడశపదార్థంబు లాఖ్యాతంబు లయ్యె ననుటయు నాన్నైయాయికుండు శంకరు నభినందించి మరలుడుఁ గాపిలుం డెదుర్కొని యిట్లడిగె. 160.

ఆ. మును స్వతంత్ర యగుచు మూలప్రకృతి జగ
త్కారణముగ నగునో? కాక చిత్ప్ర
విష్ట యగుచు నౌనొ? వివరించి మఱి లోని
కరుగు మఱలవిడుద లైన ననుడు. 161.

ఆ. యతివరుండు పలుకు నావిశ్వయోని స్వ
తంత్ర యౌచుఁ ద్రిగుణతను ననంత
రూప యగుట నుడువుఁ గాపిలమతము, వే
దాంతపక్ష మస్వతంత్ర యనును. 162.

ఆ. అను యతీంద్రు నాఁపి యపుడు బాహ్యార్థవి
జ్ఞానశూన్యవాదు లైన బౌద్ధు
'లేమయా పరీక్ష యీయ కంబాలయు
మందుఁ జూత్తె' యనుచు నఱిగి రిట్లు. 163.

క. ద్వివిధం బందురు వివరిం
పవలెఁ బాహ్యార్థవాదపద్ధతు; లింకన్
భవదీయమతమునకు వే
ఱవునఁట విజ్ఞానవాద మది యెట్టిదొకో? 164.

క. ఈ రెండుప్రశ్నములకు ను
దారార్థమ్ముగ నొసంగుమా యుత్తరముల్
శారదగుడిఁ జొరవచ్చు న
యారె! యనుచుఁ బలుకఁ బలికె యతి ప్రత్యుక్తిన్. 165.

మ. 'అనుమానాహ్వాయ మానగమ్య మగువేద్యం'బంచు భాషించెడిన్
గన సౌత్రాంతికుఁ; 'డక్షిగమ్య'మనుచున్ వైభాషికుం డాడు; రెం
టను గూడన్ క్షణభంగురత్వము సమానంబే యగున్, గాన వే
దనవేద్యక్రమమాత్రఁ గాన నగుభేద మ్మొక్కట్ లెక్కా నొకో? 166.

గీ. ఒప్పు విజ్ఞానములకు బహుత్వము క్షణ
భంగురత్వంబు విజ్ఞానవాది; యింక
నట్టివిజ్ఞాన మొకటియ యంచు ధ్రువ మ
దంచు నంగీకరించె వేదాంతవాది. 167.

చ. ఇదియె మహావిశేషము సుఁడీ యనుచుండ- దిగంబరాయనా
స్పదుఁ డరుదెంచి యిట్టు లను సర్వవిదుండవయేన్ రహస్య మై
న దొకటి ప్రశ్న సేసెద రయంబున జైనమతం బెఱింగి చె
ప్పఁదగుదు వస్తికాయపదపూర్వపదంబుల నేది వాచ్య మా? 168.

గీ. అనుదు గురుఁ డని నిష్టమే నాలకింపు
మన్న! తచ్ఛబ్దవాచ్య మెయ్యది యనంగ
జైను లందురు జీవాదిపంచక మటంచు
నామతిమున నిఁ కేమేని యడుగఁ దలఁతొ. 169.

చ. అని యిటు వేదబాహ్యు లగు నయ్యాయి వాదుల కుత్తరంబు లి
చ్చినతెఱఁ జైమినీయమతశిష్టుఁ డొకం డరుదెంచి పల్కెఁ బె
ల్చన నిటు 'జైమినీయమున శబ్దము ద్రవ్య మొకో? గుణంబొ? యొ
య్యన వివరించి పోఁగదె! కిమాత్మక మా' యను శంక వాయఁగన్.

క. అనుటయుఁ జిఱునగవాస్యం
బున లాస్యము సేయ యతివిభుం డాయన జై
మినివిహితమతాభినివి
ష్టునిగ నెఱిఁగి తన్మతోక్తసూక్తిని గొనుచున్. 171.

ఉ. ‘వర్ణము లెల్ల నిత్యములు వ్యాపకముల్ శ్రుతివేద్యముల్; తదా
కీర్ణమ యాట శబ్దతతి కేవలనిత్యము ద్రవ్యమున్ జగ
త్పూర్ణమునై నిరంతరము పొల్చు’ నటందురు జైమినీయు లం
చర్ణవభంభంగచణ మా భణితిన్ జతుఁ జేసె వేల్మిడిన్. 172.

గీ. ఇటుల సకలశ్రుతంబుల హేల నుత్త
రం బొసఁగు శంకరార్యు నర్చనలఁ దనిపి
రాబుధులు దక్షిణద్వార మపుడు తెఱచి
తెరువు చూపింప గుడి సొచ్చె దేశికుండు. 173.

శా. ఆసంన్యస్తసమస్తకాముఁడు సరోజాంఘ్రిన్ గరంబందు ను
ల్లాసం బొప్పఁగ నూఁది, దేవికి నతుల్ గావించి సేవించి వి
ద్యాసింహాసన మెక్క నుండ, నశరీరాలాపరూపాన భా
షాసీమంతిని శంకరుం గుఱించి యీచాయన్ వచించెన్ వెసన్.

క. మున్నె యగుదు సర్వజ్ఞుఁడ
వన్నింటఁ బరీక్ష గాఁగ యయి తిపుడును; గా
దన్న విధి కపరరూప మ
న న్నగడెదువిశ్వరూపునకు గురు వౌదే. 175.

క. ఒకసర్వజ్ఞతయే పీ
ఠిక నెక్కఁగ హేతు వనుచు డెందంబున నెం
చకుము విశుద్ధత కారణ
మకట! కలదో లేదో సందియము నీమెడలన్. 176.

ఉ. శ్యామకళారహస్యముల గాథలు తెల్వి పరాంబుజాక్షితో
నేమము విస్మరించి యవినీతిని వా దొనరించి గెల్చి యా
భామిని డింద హేతు వయి పాప మపారము మూట గట్టుకొం
టేమొఱఁ బీర మెక్కఁగలవే? సకలజ్ఞత హేతు వౌనొకో! 177.

క. త్రికరణశుద్ధుఁడౌ యీపీ
ఠిక నెక్క వలంతి నీకడిమి యుడిగి కలం
గక చను మన యతిపతి పా
యక యయ్యుశరీరవాణి కనె నీపగిదిన్. 178.

ఉ. అంబరొ! విశ్వవేత్త్రి వయి యక్కట న న్నవిశుద్ధుఁగా నిదా
నంబు దొఱంగి వాకొనుట న్యాయమె? వైదికమార్గగుప్తి పూ
ర్వంబుగ నద్వితీయమతవైభవమున్ బ్రకటంచు నాకు న
డ్డంబుగ వచ్చుమండనుఁ గడంగి జయించు టధర్మ మౌనొకో! 179.

ఆ. మధ్యవర్తిగా సమర్థ నన్యుని దేర
నతఁడు 'నాదె జయ' మటంచుఁ దీర్పఁ
బక్షపాతి యని విపక్షుఁ డెంచు నటంచుఁ
దీర్పరిగను దత్సతినె ఘటింతు. 180.

శా. ఆసాధ్వీమణి యతుదర్శకపదంబం దుండియున్ వాదమున్
దా సాగింపఁ దలంపఁ 'బ్రాంస్న మెచటన్ స్త్రైణంబుతో వాదమున్
జేసెన్ మున్నని వింటిమే' యనుచు నాక్షేపింప, గార్గ్యాదికాం
తాసామ్యంబును జూపి సిద్ధపడెఁ గాదా తాన వాదింపగన్. 181.

క. ఆనాఁటిసభ వివద్యం
బైనది పూర్వోత్తరాయనాఁచితమీమాం
సానూనార్థవినిర్ణయ
మానెఁతుక దానిఁ దివిచె నఁగజకళకున్. 182.

సీ. కనదాకో గరిత! శాఖాచంక్రమము సేయు
నిగ్రహస్థాన మొందెద నటంచు
నబలతో నేకతమం దైన సభ నైన
తగునె స్మరాగమోదంత మెత్త
జితుఁడ నైతి నటంచుఁ జెప్పి వ్యుత్క్రమమున
గృహిధర్మ మంగీకరించు టెట్లు
స్మరశాస్త్రమర్మముల్ స్మరియింప యతికి నా
కవకీర్ణితాదోష మంటదొక్కొ'
గీ. యనుచుఁ బరిపరిగతుల ధర్మానపేత
ముగ విచారించి శుకదేహమునను జొత్తు
మదనకళతోడ నావెతో మండనార్యు
నోర్చి యౌపనిషదమత మ్ముద్ధరింతు 183.

శా. ఆరామాతిలకంబు మండినబుధుం డగ్నిత్రయిం వేల్చి యా
త్మారోపం బొనరించుకొన్నటిని దివ్యజ్యోతియై శారదా
కారం బూని కృశానుఁ జొచ్చుటది కన్గంటిఁ గనుంగొంటె; నీ
వారామామణి వోట నాచరిత మేలా చెప్ప నీసన్నిధిన్? 184.

గీ. శృంగగిరియందు మఠము నిర్మించి భార
తీసమాఖ్య వహించి శ్రుతిప్రధాన
ముగ జగమునందు ధర్మమ్ము ప్రోవఁ దావ
కాంశ మందు స్థాపింతుఁ గాదా మదంబ! 185.

ఉ. కామవశంవదుండ నయి కార్య మకార్యము నెంచకుండ నా
నేమము తప్పి యున్న జననీ! యవిశుద్ధుఁడ నాదుఁ గాని ద్వై
తామయపీడఁ గుందునిగమాంతమతంబును గావ నెన్నిరో
బాముల నొంది నిర్మమత వర్తిలు నే నవిశుద్ధుఁ డౌదునే. 186.

ఉ. నాపరిశుద్ధతన్ జగమునన్ వెలయింపనె యిట్టు లంటి గా
కోపరదేవతా! తెలియ కుందువె నాహృదయంబు నిర్మమం
బై పరిపాక మొందినటు లానతి యిచ్చినఁ జాలుఁ బీఠికా
రోపణ మేల? సర్వము నెఱుంగు నెవం డొకనీవు దక్కఁగన్. 187.

మ. అని సర్వజ్ఞతయున్ విశుద్ధతయు సువ్యక్తంబులై తోఁపఁగా
వినయస్ఫూర్తి వచించి సన్నుతుల దేవిన్ హర్షవారాశిఁ దే
ల్చినయాచార్యపయిం దొరంగుసుమవృష్టిం గాంచి తత్పాదుకా
వనతిన్ సన్నుతి సల్పి రద్భుతజయప్రస్తావనన్ గోవిదుల్. 188.

మ. అణుమాత్రంబు చలింపక ప్రతిహతవ్యాహారవిస్ఫూర్తులన్
ఫణిసమ్రాట్టు నథఃకరించు యతిసమ్రాట్టున్ సుధాస్వాదు భా
షణ సంభాషితుఁ జేసి శారదయు 'భోస్సర్వజ్ఞ! పీఠాధిరో
హణ కళ్యాణ మితో௨స్తు తే' యనుచు వ్యోమాంతర్హితాకారయై.

గీ. అంత గంభీరగమనుఁడై యతియు నండ
నుండి పద్మపదుండు కైదండ యీయ
నరిగి సర్వజ్ఞభద్రసింహాసనమున
శిష్యపరివృతుఁ డగుచు నాసీనుఁ డయ్యె. 190.

సీ. వాదకథాస్తనోదాదరప్రతివాది
బాహుసంస్ఫాలనోత్పన్న యగుచు
దుర్వారదుస్తర్కదుర్గనిర్భేదక
పృథుజైత్రయాత్రాప్రవృద్ధ యగుచు
హారిదంతరాంతరభరితమాహానుభా
వ్యస్తవప్రాప్తవిద్వత్త యగుచు
'వస్తుం త్వమేవ సర్వజ్ఞో௨ర్హా' ఇత్యుక్త
వద్విద్వదామోద పాత్ర మగుచు

గీ. పూరితాపారమోదాత్మ శారదా౽స
మానబహుమానఘోఘుష్యమాణ యగుచు
జరుగుజయలక్ష్మి శంకరాచార్యచక్రి
వర్తి శ్రీశారదాపీఠవాసిఁ జేసె. 191.

ఉ. నూరెల వందిమాగధులచొప్పున వాదపరాజితుల్ సుధీ
వీరులు కేలు మోడ్చి జయవెట్టఁగ, శిష్యులు భృత్యులై పదాం
భోరుహముల్ భజింప, జగముల్ 'సకలజ్ఞుఁ' డటంచుఁ బాడఁగాఁ
బారమహంస్యరాజ్యపరిపాలనభారము దాల్చె మూపునన్. 192.

సీ. అడఁగారె నెందొ పశ్యత్పాదకథ యెల్లఁ
దలసూప దాయెఁ గాపిలమతంబు
భగ్నమై చెదరెఁ బ్రాభాకరా౽భగ్నోక్తి
భట్టపాద మతంబు పట్టు దప్పెఁ
గంటికిఁ గనరాద కాణాదమత, మెట
దాఁగెనో కాని పాతంజలమ్ము
భేదవార్త వినంగరా దెందుఁ, బాషండ
మతసంహతులు మటుమాయ మయ్యె
గీ. దుర్దమ ప్రతివాద్యక్షధూర్త సమితి
గండడఁప బ్రహ్మవిద్యాగురుండు సలుపు
ద్యూతకేళిని బొడము దుందుభిధిమింధి
మిథ్యనుల నాలకించి భ్రమించి మతులు. 193.

గీ. శారదాపీఠపూర్వాద్రి శంకరార్కుఁ
డఖలపాషండతిమిరాపహముగఁ బొడువ
ద్వైతమతఘూకవితతులు దాగెఁ నెటనో
ప్రబలనాస్తికమతతుషారమ్ము లింకె. 194.

ఆ. ఆయెడ నభ్రవీథి వినవచ్చెఁ బునర్వవిరన్నలాభజా
తాయతమోదతుందిలబలారిసమీరితదేవతాడిత
స్ఫాయదమందదుందుభిరవంబు ఘనాఘనగర్జితాప్తమి
త్రయితమై భ్రమత్సలిలరాశిఘుమంఘుమరావబంధువై. 195.

క. గురువరుపయిఁ గురిసిరి సుర
వరు లమరతరుప్రసూనభర మొకకొన్నా
ళ్లరిగెడుదాఁక శచీకచ
భర మపగర్భకము గాఁగఁ బటుమోదమునన్. 196.

వ. ఇట్లు శంకరార్యుండు కేవలస్వమతగౌరవార్థంబునకే మానావమా
నాదిద్వంద్వవిదూరుండయ్యు ననన్యసాధ్యం బైన శారదాసర్వజ్ఞభ
ద్రాసనం బెక్కి నిగమధర్మంబు నాల్గుపాదంబుల నడువఁగట్టడసేసి
కాశ్మీరంబునుండి శృంగగిరి కరిగి. 197.

ఉ. ముప్పదిరెండు వర్షములె భూస్థలి నుం దని బాదరాయణుల్
సెప్పినమాట తద్ధృదయసీమ స్ఫురింపఁగఁ దా నొనర్ప నా
నప్పను లెల్లఁ బూర్ణముగ నయ్యెఁగదా యనుకొంచు, వానికే
ముప్పును రా నటుల్ నెఱపి ముప్పదిరెండవయేఁడు సొచ్చెదున్.

వ. శంకరుం డొంటిమెయి నుండి స్వకృతకార్యసర్వస్వమును బరామ
ర్శించి చూచుకొనుచు నందు ముఖ్యముగ. 199.

సీ. "నెలకొల్పఁబడెఁ గరామలకుఁడు ద్వారకా
పురి శారదాపీఠమునను దొల్త
బదరికావని రచింపంబడ్డ జ్యోతిర్మ
ఠ మ్మేలుచుండెఁ దోటకుఁడు శ్రీద్ధ

నలినసాదుఁడు జగన్నాథపురస్థ గో
వర్ధనాఖ్య మఠాధిపత్య మూనె
శృంగగిరిస్థితశ్రీపీఠమునకు సు
రేశ్వరుం డాయె నధీశ్వరుఁడుగ

గీ. వజ్రికవచంబు లయి పరివ్రాజకాగ్రి
గణ్యు లిటు కాచుచుండ జగత్సమాద
రమున నద్వైతమతమహారాజ్యలక్ష్మి
చెక్కు చెదరక పెంపెక్కె నిక్కువముగ. 200.

చ. అని మదిలో దిటంబును, మహాముదమున్, వసుధాటనంబునన్
దనివియుఁ, గాంచి శిష్యసహితంబుగ దేశికసార్వభౌముఁ డో
య్యనఁ బయనించుచున్ బదరికాశ్రమభూమిని జేరి యన్వహం
బును దపమున్ స్వభాష్యముల బోధనమున్ బచరించుచున్నడన్.

క. పాతంజలయోగకళా
ధీతులు కొందఱు యతీంద్రురీతి రరసి కసిన్
జేతుమనస్కు లయి సమా
యాతు లయి పరాజయమ్ము నందిరి యతిచేన్. 202.

మ. జితులై త్యాజితసర్వదర్శనులునై శిష్యత్వముం గొంచు వి
శ్రుతపాతంజలయోగదర్శనదీక్షుల్ వారు కోరంగ న
య్యతిచూడామణి భాష్యముల్ గఱపెఁ దారాధీశ రోచీ రమాం
చితకీర్తి ప్రతికర్మ నిర్మల హారిత్సీమంతినీకంబుగన్. 203.

క. ఈరీతిం గలికలుష వి
దారకచరితల శివావతారుఁ డగుయతీ
భారాతికి ద్వాత్రింశం
త్సరాబ్దంబులవయస్సు జరిగె సుఖముగన్. 204,

సీ. మూల్యంబు గాఁగఁ గైవల్యలక్ష్మికి సుధీ
భాష్యంబు లగుభాష్యముల రచించె
ఖండించి వైచెను బండితాహంత దు
స్స్వాంతపరిణామ సంజాత భూత
సద్యస్సముద్య దతిద్యోతఁ జేసి వి
రక్త సజ్జనవేద్య ముక్తిపద్య
శ్రేయముల్ బుధుల కమేయముల్ ఘటియించె
స్థేయముల్ సేసి యామ్నాయరీతు
గీ. లింక నెదిసేయు జగతికి? శంకరుఁడు ద
యామృతరసాయితేందుకుందామరాశ్వ
హారనీహారనిభయశఃపూరశమిత
సుకృతిజనదైన్యపావకవికృతిభరుఁడు. 205.

ఉ. ఉత్తమ మైనకీర్తి దెస లొత్తిల ముజ్జగ మొత్తె, నద్భుతా
యత్త విహార కేళుల దిగంతరముల్ వడి ముంచె నివ్వెఱన్,
సత్తము లైనభక్తుల కొసంగె నభీప్సితభుక్తిముక్తిసం
పత్తుల శంకరార్యగురుపాదుఁ డిఁకే మొనరింపఁగావలెన్. 206

శంకరుఁడు సశిష్యుఁడై కేదారణమున కేఁగుట.

ఉ. చేరె ననంతరంబు సహశిష్యుఁడు శంకరభిక్షుమౌళి కే
దారము సేవమానజనతాసమభీప్సితసర్వసౌఖ్యవి
స్తారము పాపరూపకటుదానశిఖావదువారతాపసం
హారము దుర్దమాపదపహారము సంసరణాభిచారమున్. 207.

గీ. అచ్చసీతున నచ్చట ముచ్చముడిఁగి
పోవుచుండినశిష్యులఁ బ్రోవ నెంచి
వెచ్చ నగుతోయ మీయంగ వేఁడెఁ జంద్ర
మౌళి నతులపరిభావుఁ డమ్మౌనిమౌళి. 208.

క. కర్మందిబృందపతి యిటు
నిర్మముఁడై వేఁడ శివుఁడు నిష్టప్రకృపీ
టోర్మిబహులలహరి నొకటి
శర్మ మిడ నొసంగెఁ జరణజలజమువలనన్. 208.

ఉ. ఆదృతి శిష్యు లాశివదయార్జితకోష్ణజలప్రవాహమం
దీఁదుచుఁ దాన మాడి సుఖయించి గురున్ నుతియించి రంట! త
ప్తోదకనిర్ఝరం బదియ యున్నది· నేఁటికిఁ దద్యశంబులన్
బాడుకొనంగఁ జేయుచు దివస్పృథివీచరపావనంబునై. 209.

ఉపసంహారము

వ. అట్లు శృంగగిరి వెడలివచ్చునాఁ డయ్యతిసమ్రాట్టు మధ్యేమార్గం బు జోగులాంబను, మహాలక్ష్మిని, బగళాంబను, జ్వాలాముఖీదేవిని సందర్శించి, పాండురంగక్షేత్రము సేవించి, కాంచి దర్శించి, యవంతిని వింత లరసి, ద్వారక కేఁగి, మధురాపురిని విడిచి, కాశి సంభజించి, మాయాపురంబునఁ గొంత కాలంబు వుచ్చి, తత్రత్య దైవతంబుల శివకేశవాదినానామరాకారుల నభేదదృష్టి దర్శించి, సేవించి, యం దంద యద్వైతమతప్రతిపాదకమ్ము లగునాత్మీయ భాష్యమ్ములం గలయర్థమ్ములం దత్తద్దేశవాసులకుం దెలియం జెప్పి హిమవత్పాదవిరాజమానం బగుబదరికావనమునందలి జ్యోతిర్మఠంబునఁ దోటకాచార్యుసేవల నలరి యపునరావృత్తిమోక్షదం బగు కేదారమహాక్షేత్రంబున నపునరావృత్తికంబుగఁ బరిమితచ్ఛాత్ర పరివృతుం డయి నివసించి శంకరుండు తనముప్పదిరెండవయేఁడు గడసన నుంట యెఱింగి యంతేవాసి సంతతి నంతికమ్మునకుఁ జేరఁ బిలిచి. 210.

ఉ. మోమున లేఁతనవ్వొలయ ముద్దిడి దీవన లిచ్చి పుచ్చె హ
స్తామలకున్, సురేశ్వరు మహాదృతిఁ బల్కె, సరోజపాదునిన్

సేమము గల్గఁ జెప్పి పనిచెన్, గవ్వుఁగింటను జేర్చెఁ దోటకున్
గామితముల్ ఫలింపఁగ నొనర్చెను దీవన తక్కువారికిన్. 211.

సీ. నారాయణునకు వందన మొనర్చెను బద్మ
భవుపదమ్ములు స్వాంతమున ఘటించెఁ
దలఁచె వసిష్ఠు నిస్తులతపస్సంపన్ను
శక్తిమహర్షిఁ బ్రశంస సేసె
వినుతించెను బరాశరుని జగత్కళ్యాణు
బాదరాయణు నెరన్ బాదుకొలిపె
శుకమహర్షి స్మరించి జోత లర్పించెను
స్తుతియించె గౌడపాదుని మహాత్ము
గీ. గురుని గోవిందయతి నిల్పుకొనియె మదిని
నిటు గురుపరంపరఁ దలంచి యిష్టదైవ
తములయెడ నైక్య మెన్ని కేదారనాథ
శివుని యెదుట దర్భాసనాసీనుఁ డగుచు 212.

శా. ప్రాణాపానగతావరోధమున బాహ్యార్థాపిస్తైక్త యింద్రియ
శ్రేణిన్ బోవఁగ నీక పట్టి యెడఁదన్, స్వాంతంబు బుద్ధిన్, మఱిన్
రాణన్ జీవునితో, లయించి పరమబ్రహ్మంబె తానై విని
ద్రాణానందమయత్వ మొంది తుద కద్వైతస్థితిన్ భాసిలెన్.213.

సీ. సర్వభోగవిశేషశాలి దేవేంద్రుఁ డె
వ్వానియానందలవం బెఱుఁగఁడొ
భువననిర్మాత యంభోజాతసూతి యె
వ్వనిదృష్టిలోఁ దృణప్రాయుఁ డగునొ
లక్ష్మీసమాశ్లేషలాలితుం డగుహరి
యెవనితుష్టికి గవ్వయేని కాఁడొ
యైశ్వర్యపూర్ణుఁ డౌహరుఁడు నెవ్వనిశాంతి
యం దొక్కలేశమే నొందఁలేఁడొ

గీ. తాదృశాద్వైతశుద్ధసిద్ధాంతవస్తు
పరమతాదాత్మ్యనిర్ముక్తబంధతోడి
తామితానందరసమయుండై వెలింగె
శంకరుఁడు విశ్వలోకశుభంకరుండు. 214.

శా. తత్తాదృక్షసమాధిసుస్థితికి మోదం బాత్మ నిండార శ్రీ
దత్తాత్రేయుఁడు దోఁచి యాశ్రితుల ధాత్రిశ్రేణిఁ బో నంపి సం
విత్తాదాత్మ్యము నొందియున్న గురునిన్ విశ్వాతిశాయిప్రభా
వాత్తఖ్యాతిఁ గవుంగిలించుకొనెఁ జేతోఽబ్జాతమం దర్మిలిన్. 215.

మ. తనయందున్ జగతీతతుల్, జగములన్ దన్నున్, గనుంగొంచుఁబొ
ల్చిన శ్రీశంకరు నాంతరేక్షణస్ఫూర్తిన్ జిత్రంబుగాఁ దోఁచి యొ
య్యన నీరీతి నుతింపఁగాఁదొడఁగె దత్తాత్రేయుఁ డుద్యత్సుధా
వనధిత్వంగదభంగభంగనటనవ్యాపారపారీణతన్. 216.

చ. జయజయ మానుషాకృతిలసత్తుహినాద్రిసుతామనోహరా!
జయజయ యబ్జజాండచయజన్మవనక్షయమూలకారణా!
జయజయ దేవతాముకుటజాలమణీఘృణిదీప్రపాదుకా!
జయజయ రాజతాచలనిశాంత! ప్రశాంతపదా! సదాశివా! 217.

సీ. భూతపంచకసమతీత! భూతాకృతి!
పంచకోశాగమ్య! ప్రణవమూర్తి!
షడ్వికారవిదూర! సంవిన్మయాత్మక!
గుణసమవేత! నిర్గుణవిలాస!
సంయమీంద్రాంతరచక్షురానాయమీ
నాయిత! తత్సహస్రారవర్తి!
సంసారసాగరసాంయాత్రికాభిగ
మ్యద్వీప! యాదిమధ్యాంతశూన్య!

గీ. వేదవేదాంతనిబిడాటవీసదాని
రంకుశవిహారహారిమృగాధిరాజ!
స్వప్రభావవశీకృతావార్యమాయ!
జాగ్రదద్వైతసిద్ధాంతసారభూత! 218.

ఉ. భాండికనాస్తికోక్తులకు ద్వైతమతప్రచరిష్ణుధూర్తవై
తండికఖండనంబులకుఁ బ్రాసముఁ బొందిక దధ్వమంచుఁ బె
న్మ్రందులఁ గూలి తూలి వెత మున్గిన వైదికవాక్సవిత్రి నో
క్కండవ యెత్తి నిల్పితి సుఖప్రచురాద్వయసత్పథంబునన్. 229.

సీ. జనిమాత్రమునఁ బంచజనుఁడవే కాని సా
క్షాచ్ఛంకరుఁడవు విశ్వజ్ఞమౌళి
మనుజుఁ డట్టుల విద్యలను నేర్తువే కాక
నీవు పుంభావవాగ్దేవి కావె
మనుజమాత్రు లొనర్చుపనులె యత్యల్పకా
లమున నీచేయు కృత్యములఁ దలఁప?
నాచంద్రతారార్క మవని నిత్యజ్యోత్స్నఁ
జల్లదే నీయశశ్చంద్రబింబ?
గీ. మాహిమాహార్య సేతుపర్యంతభూమి
భవదమలపాదపద్మసంస్పర్శపావి
తంబు కానట్టి యొక యంగుళంబు మేర
గలదె? జగతీతలోద్ధారకా! మహేశ! 220.

చ. పొడమితి వేదరక్షకయి భూస్థలి ద్వైతకుతర్కధాటికిన్
సడలనియట్లు వజ్రకవచంబుల భాష్యములన్ రచించి, న
ల్గడ మఠరాజముల్ నిలిపి కట్టడ సేసితి దుష్కృతంబులన్
గెడపితి వేమి యున్న దవనిన్ గరణీయము నీ కుమాపతీ! 221.

మ. కలిమాహాత్మ్యముచేఁ నిరంతర మనేకద్వైతపాషండదు
ర్గలితానర్థమతంబు లుప్పతిలినన్ రాజిల్లు రారాజులన్
తలపూ వాడక త్వత్సముద్ధృతతతాద్వైతాత్మసిద్ధాంతని
స్తులదివ్యస్మృతి ముర్వి యెల్లఁ గరమందున్ బట్టి పాలించుచున్. 222.

క. ధరణిఁ గలట్టి నదీనద
ఝరము లుదధిఁ గలియు కరణి సకలమతములున్
బొరయఁగ నె యంతర్భావం
బరయఁగ నద్వైతమతమునం దందందున్.

చ. అతులభవత్కృతాఖిలదిగంతజయోదితపుణ్యకీర్తిసం
భృతబహుశిష్యబంధముల నెల్ల జగంబున సార్వకాలిక
స్తుతి నజరామరత్వపరిశోభితమూర్తి వియై తనర్తు శా
శ్వతముగఁ ద్వత్కృతామితనిబంధము లుర్విఁ గూర్చు భద్రముల్.

క. ద్వాత్రింశచ్ఛరదాయు
ర్మాత్రుఁడ వన మోస, మజుఁ డచ్యుతుఁడు నయిన చి
న్మాత్రుండవు మృత్యుంజయ
మాత్రుండవు గాని మనుజమాత్రుఁడవొక్కో! 225.

గీ. కనుము కైలాస మదిగో! శంకరుఁడు వాఁడె!
యంబ యదిగో! గణేశ్వరుం డల్లవాఁడె!
షణ్ముఖుఁడువీఁడె! వీరు సిద్ధాయ లగుదు
రీ రహస్యంబు ముందె నీ వెఱిఁగి యుందు. 226.

మ. అని తద్ధ్యానపథావతీర్ణుఁడయి దత్తాత్రేయుఁ డగ్గించుచుం
డనె కైలాసము శంకరుం డగజ విఘ్నస్వామి షణ్మాతురుం
డును నందీశ్వరముఖ్యపారిషదు లందున్ దోఁచి వీక్షించుచుం
డనె శీతాద్రియ రాజితాద్రియును కన్పట్టన్ యతీశానుఁడున్.

శా. తన్నుం జూచుకొనంగ నద్భుతముగాఁ దా నమ్మహాదేవుఁడై
యున్నట్టుల్ సనకాదిమౌనులు నమర్త్యుల్ సిద్ధులున్ సాధ్యులున్
గిన్నరుల్ దన్ను నుతించుచున్నటుల వీక్షాపర్వమై తోఁప న
చ్ఛిన్నానందమయుండు శంకరుఁ డు గాంచెన్ స్వస్వరూపైక్యమున్

గీ. ఆమహితము పాంచభౌతికం బైన మూర్తి
యఖిలజగదేకగురుమూర్తి యష్టమూర్తి
మూర్తి యైనట్టి దక్షిణామూర్తి యయ్యె
జ్ఞానసుధ సుస్మితకటాక్షసరణి నొలుక. 229,

వ. అట్టియెడ.

క. పురుహూతాద్యమరులు నం
బురుహాక్ష సరోజభవులు మూర్ధధృతకరాం
బురుహు లయి సల్పిరి మనో
హరవేదోక్తులను మంగళాశాసనముల్. 230.

ఆశ్వాసాంతము.

శా. విశ్వక్షోణిధురంధరాయతభుజా! వీరావతంసా! జయ
శ్రీశ్వేతేక్షణకైరవప్రసవరాజీమాలికాలంకృతా
శశ్వత్కమ్రదిగంగనాముకురితాంచత్కీర్తిభాసా!మునీం
ద్రశ్వశ్రేయసమూలకారణవతారా! భక్తకల్పద్రుమా! 231.

క. సౌభాగ్యభాగ్యశోభిత
వైభవసుబ్బాంబికాధిపతిసంతతపూ
జాభాజన! సీతారమ
ణా! భక్తాభీష్టవితరణాస్వప్నమణీ! 232

మంగళమహాశ్రీవృత్తము.

చిత్తభవకోటిశతశృంగహరణక్షమ విశిష్టకమనీయతరరూపా!
మత్తసురశాత్రవసమాజవిచలత్తిమిరమండలవిపాటనవనార్కా!
యుత్తమతపస్విహృదయోదరనటత్పదపయోజయుగ!మంగళమహాశ్రీ
వృత్తవిమలామృతపవిత్రితజగత్త్రితయ! వేదచయనిశ్వసితధామా!

ఇది శ్రీగురుకరుణాసమాసాదితకవిత్వ 'కవితాభూషణ', 'విద్వ
త్కవిశేఖర' వెంపరాల సూర్యనారాయణనామధేయ
ప్రణీతంబయిన శంకరవిజయంబున
నవమాశ్వాసము.
సర్వము సంపూర్ణము.

సీ. వేంకటరామాఖ్యవిఖ్యాతమా సంస్థ
తనరుఁగా కాచంద్రతారకముగ
శ్రీసుబ్బమాంబ భజింప వేంకటరాయుఁ
డందుఁగాపుతఁ బురుషాయుషంబు
తనయుల్లు వేయిండ్లకును మొన లయి చిర
మ్మలరు వేంకటరామయార్యుఁడెలమి
వర్ధిల్లు ధాత్రి శాశ్వతముగా వేంకట
రాయుని ధర్మకార్యమ్ము లెల్లఁ
గీ. బరఁగ నిత్యకళ్యాణమ్ము పచ్చతోర
ణమ్మగుచు సుబ్బమాంబికానామచిహ్న
తోన్నతామలసౌధ మాయుర్యశోభి
వృద్ధులఁ దావలం బయి వెలయుఁగాత.

శ్రీ రామచంద్రార్పణమస్తు.

తప్పొప్పుల పట్టిక.

అవతారిక.

పుట.	పం.	తప్పు.	ఒప్పు.	పుట.	పం.	తప్పు.	ఒప్పు.
6	19	దుష్టినిఁ	దుష్టినిం	22	22	అనృతమ్ము	అమృతమ్ము
11	18	రులలో	మారులలో.	24	8	భ్రాతవదాకృతికి	భ్రాతరదాకృతికి
13	4	పల్కు వేని	పల్కు వేని				

శంకరవిజయము.

పుట.	పం.	తప్పు.	ఒప్పు.	పుట.	పం	తప్పు.	ఒప్పు.
1	17	ల్లనఁగఁ	ల్లనంగ	126	18	మెఱుపు	మెఱపు
4	3	భూషుణు	భూషణు	128	10	పఠించుచుండిరి	పఠించుచుంటి, రీ
6	24	సాఖ్య	సాంఖ్య			మీ	
10	9	డాదరించెన్	డాచరించెన్	,,	13	సల్చి	సల్పి
13	17	మెరసె	మెఱసె	130	20	ప్రశ్నమ్ముల	ప్రశ్నముల నుత్త
20	7	టతకంటె	టంతకంటె			నుత్తరముల	రమ్ముల
,,	20	బొద	బొంద	141	10	వెవఁడు	నెవఁడు
33	5	నీతి	నీపతి	,,	13	వాఖ్యాత	వ్యాఖ్యాత
37	14	జెలకొనన్	జేలకొనన్	149	11	గ్రథము	గ్రంథము
,,	25	చెతుల	చేతుల	156	16	పోకార్చు	పోకార్చు
39	6	డిక	డీఁక	159	9	వణిఁక	వణఁక
40	12	జనత	జనక	171	13	మతిపై	మతివై
42	19	ప్రౌడి	ప్రౌఢి	189	15	పలం	పలల
59	20	డనతగ	డని తగ	202	3	మభాధ్య	మబాధ్య
66	10	సడకుండ	పడకుండ	,,	12	మభాధ్య	మబాధ్య
81	4	విడచి	విడిచి	204	14	కళంకనీయుల	కశంకనీయుల
82	17	గంమునందు	గరమునందు	207	22	లోకప్రసతి	లోకప్రతతి
88	14	తెజా	తేజా	209	20	దక్షణంబునన్	దత్ క్షణంబు
90	11	సంనృతి	సంసృతి				నన్
94	12	యాచాతిక	యాచాంతికి	212	7	డను.	డన
95	18	సేవ	సేవ్య	215	18	పీయుషా	పీయూష
97	8	వానపురీవంమైన	వాసపురీవరమైన	217	23	ఝురీ	ఝురీ
102	7	ర్ణనమునఁ	ర్ణమునం	219	18	తెలియదు	తెలియుదు
108	14	వేఁడు	వేడు	221	17	నిర్వరి	నిర్ఝరీ
114	8	గ్రమించి కా	గ్రమించి గా	228	7	సంపల్ప	సంకల్ప
117	11	నుండు	నుంచు	224	9	పురవార్థ	పురుషార్థ
122	21	చార్యాకులు	చార్వాకులు	,,	17	బామల	భామల

పుట.	పం.	తప్పు.	ఒప్పు.
”	23	నిర్మమతఁ	నిర్మమతం
”	25	యమ్మాన్మట	యమ్మూన్మఁట
225	10	దంపతీత్వోక్తి	దంపతిత్వోక్తి
228	26	నిశ్వంచె	నిశ్వసించె
231	2	పఁజరము	పంజరము
”	6	నీడి	నీడ
”	12	కఁసగోరి	కనఁగోరి
232	11	వాకృచ్చి	వాక్రుచ్చి
234	10	జెర	బెఱ
235	17	సంస్కా—ములును	సంస్కా—రములును
236	7	మగుట	మగును
244	20	వలిన	నలిన
245	16	యుధోవనత	య ోవనత
249	2	సన్నాసి	సన్న్యాసి
”	25	ఛార్త్యమ్ము	ధార్త్యమ్ము
253	14	బధు	బంధు
278	15	లాలన	లాలస
283	4	నభార్రివా	నభ్రివా
284	25	యద్వైత	యద్ద్వైత
286	11	దాల్చి	దాలి
287	2	రహిఁడై	రహితుఁడై
”	3	నాశ్రయించిన తాద్య్వ	నాశ్రిమిజన తాద్య్వ
”	5	నందునుని	నందనుని
”	21	తపస్సులన	తపస్సువలన
”	24	నాళీకధవ	నాళీకభవ
289	5	ఫదులన్	ఫలదున్
291	5	యామ్నాయ	యామ్నాయ
”	11	మున్నారు	మున్నాఱు
294	23	రొత్త	యెత్తి
308	3	అనియె	అనుటయు
312	2	స్నానమునకై	స్నానముకై
314	2	మెచ్చున్	మెచ్చున్

పుట.	పం.	తప్పు.	ఒప్పు.
316	16	ప్రత్యూహాలు	ప్రత్యూహాములు
318	8	విశ్వస్వరూ పుండు	విశ్వరూపుండు
”	13	మదియు	యదియు
”	18	యొజ్జ	యొజ్జ
319	21	గ్రథమ్ము	గ్రంథమ్ము
331	9	తదేహ	తద్దేహ
337	17	తీధంబా	తీర్థంబా,
”	24	పైశూన్యమున	పైశున్యమున
379	9	నిచ్చుంగింతు	నిచ్చగింతు
390	7	పెలఁగ	పెలంగ
397	15	కెలంగి	కెలఁగి
402	7	దాలిదొల్తు	దొలుదొల్తు
406	6	జ్వలనుఁడు	జ్వలనుండు
407	21	మసుల్	మతసుల్
408	15	షడ్రసో	షడ్రిసో
412	5	తెసంగుం	తెసంగు
415	20	మముక్షు	ముముక్షు
416	2	త్యాదిసూక్తి	త్యాదికసూక్తి
418	5	సృజించె	సృజించె
425	3	కాపాలక	కాపాలిక
437	2	గాపున	గావున
440	18	దర్శస	దర్శన
445	5	సృష్టి, లో	సృష్టి, కో
”	22	వాహనుఁనాచు	వాహనుఁ డౌ
452	19	వసించె	వచించె
453	3	కానేకదు	కానేరదు
461	10	బృందము	బృందము
465	21	కూక్తి	సూక్తి
466	4	విద్య	విద్యా
”	6	గురుడ	గరుడ
”	15	సహా	సహా!
”	16	తదాశ్రమంబు	తదాశ్రయంబు
”	20	పరిభుతు	పరిభృతు

పుట.	పం.	తప్పు.	ఒప్పు.
”	24	మంత్రముల్	మంత్రములన్
469	7	తడువుఁడు	తడవుఁడు
470	6	వచించి	వచించె
471	7	అనుడు	అపుడు
472	13	ప్రతిబింబతాస్య	ప్రతిబింబితాస్య
481	22	యబ్జషదుం	నబ్జపదుం
490	26	విప్యయంబ	విపర్యయంబ
497	16	క్జప్తి	క్లృప్తి
520	12	ప్రకటంచు	ప్రకటించు
521	14	మండినబుధుం	మండనబుధుం
522	8	యాచార్య పయిం	యాచార్యు పయిం
525	3	మరాధిపత్య	మఠాధిపత్య
526	3	భాష్యంబులగు	భూష్యంబులగు